భాగం - 4 రాజకీయ సంస్కృతి

విషయ క్రమం

4.1 లక్ష్యాలు
4.2 పరిచయం
4.3 రాజకీయ సంస్కృతి భావన
4.4 రాజకీయ సంస్కృతి అంటే ఏమిటి ?
4.5 రాజకీయ మార్పు - రాజకీయ సంస్కృతి
4.6 రాజకీయ భావజాలాలు - రాజకీయ సంస్కృతి
4.7 రాజకీయ సంస్కృతి - రాజకీయ వ్యవస్థ
4.8.0 ఆల్మండ్, వెర్బాల అధ్యయనం
4.8.1 సంకుచిత రాజకీయ సంస్కృతి
4.8.2 అధీన రాజకీయ సంస్కృతి
4.8.3 భాగస్వామ్య రాజకీయ సంస్కృతి
4.8.4 సుస్థిర ప్రజాస్వామ్యం
4.9 సైద్ధాంతిక ప్రాబల్యం
4.10 ఉప సంస్కృతి
4.11 రాజకీయ సంస్కృతి విశిష్ట లక్షణాలు
4.12 మూడో ప్రపంచంలో రాజకీయ సంస్కృతి
4.13 సారాంశం
4.14 చదువదగిన పుస్తకాలు
4.15 నమూనా పరీక్షా ప్రశ్నలు

4.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

* రాజకీయ సంస్కృతి అర్థం
* రాజకీయ భావజాలం - రాజకీయ సంస్కృతి
* రాజకీయ సంస్కృతిపై ఆల్మండ్, వెర్బాల అధ్యయనం
* ఉప సంస్కృతి అర్థం
* రాజకీయ సంస్కృతి విశిష్ట లక్షణాలను బాగా వివరించగలుగుతారు.

4.2 పరిచయం

తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో "రాజకీయ సంస్కృతి" భావన విశిష్టమైన ప్రాధాన్యం సంతరించుకొంది. ఒక సమాజం రాజకీయ విషయాల సంక్లిష్టతను అధ్యయనం చేయటంలో రాజకీయ సంస్కృతి కీలకమైన పాత్ర నిర్వహిస్తుంది. ఆది వ్యక్తి పరమైన విలువల, విశ్వాసాల, అవగాహనల సమూహంగా ప్రతిబింబిస్తుంది. ఒక్కొక్క రాజకీయ వ్యవస్థకు ఒక్కొక్క రాజకీయ సంస్కృతి ఉంటుంది. ఆ సంస్కృతి అధ్యయనాన్ని అనుసరించి ఆ రాజకీయ వ్యవస్థను అంచనా వేయటం సాధ్యమవుతుందని ఆల్మండ్ అభిప్రాయం. ప్రఖ్యాత రచయితలైన

సిడ్నీవెర్బా్ మాటల్లో చెప్పాలంటే రాజకీయ సంస్కృతి అంటే ఏ ఏ సందర్భాల్లో ఏ ఏ విధానాలు అవలంబించాలో నిర్దేశించే విలువల, అనుభవపూర్వక విశ్వాసాలు, సంకేతాల సముదాయమే.

రాజకీయ సంస్కృతి ఏ సమాజంలోను హఠాత్తుగా ఏర్పడదు. ఆ సమాజం చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, ప్రత్యేక పరిస్థితులు సృష్టించిన భావమే. ఇది ఒక సమాజంలోని రాజకీయ చర్యల విషయంలో ఏర్పడే ఒక భావన. ఇది ఒక వ్యవస్థలోని సభ్యులకు సందర్భానుసారంగా వర్తిస్తుంది.

రాజకీయ సంస్కృతి ఒక సమాజం రాజకీయ ప్రవర్తన గురించి వెలువడిన ఒక నిర్దిష్ట భావమే కాని యాదృచ్ఛికంగా ఏర్పడేది కాదు. పరస్పరం బలపరిచే రాజకీయ సమగ్ర విధానాల సముదాయమే రాజకీయ సంస్కృతి.

ప్రతి వ్యక్తీ సమకాలీన సమాజం రాజకీయ సంస్కృతికి ప్రతీక. రాజకీయ భావాలు, విశ్వాసాలు, తులనాత్మక విలువలు మనస్సుకు సంబంధమైనవి కాబట్టి రాజకీయ సంస్కృతికి మూలం మనోవిజ్ఞాన శాస్త్ర అధ్యయనం ద్వారా తెలుసుకోవచ్చు.

విస్తృత సామాజిక సంస్కృతిలోని భాగమే రాజకీయ సంస్కృతి. చారిత్రక అధ్యయనం ద్వారా సామాజీకీకరణ చెందే వ్యక్తి ప్రయత్నాలే రాజకీయ సంస్కృతిగా ఘనీభవిస్తాయి. ఒక సమాజం విలువలు, భావాలు వారసత్వం (Legacy) ద్వారా లభ్యమవుతాయి. కొత్త, పాత భావాల మధ్య జరిగే సంఘర్షణల ద్వారా సమాజంలో ఏర్పడ్డ నూతన విలువలు ఒక నూతన రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతాయి. అందరికీ ఆమోదయోగ్యమైన రాజకీయ విలువల సముదాయమే రాజకీయ సంస్కృతి.

4.3 రాజకీయ సంస్కృతి భావన

మనోవైజ్ఞానిక భావాల సమన్వయం ద్వారా రాజకీయ సంస్కృతి ఒక భావనగా రాజకీయ విశ్లేషణకు ఉపకరిస్తుంది. జన బాహుళ్య సమాజంలో ఏర్పడే గతితార్కిక మార్పులు అధ్యయనం చేయటానికి ఉపకరించే సామాజిక మనోవైజ్ఞానిక సాధనాల ద్వారా సమగ్ర పరిశీలన చేయటానికి రాజకీయ సంస్కృతి అధ్యయనం ఉపకరిస్తుంది.

పై విధంగా విశ్లేషించినప్పుడు వైఖరులు, విశ్వాసాలు, ఉద్వేగాలు, విలువలు మొదలైన వాటి సముదాయమే రాజకీయ సంస్కృతి అని చెప్పవచ్చు. ఒక సమాజానికి ఎటువంటి రాజకీయ వ్యవస్థ ఉంది, దాని స్వభావ, స్వరూపాలు ఏమిటి, ఆ సమాజం ఎదుర్కొనే రాజకీయ సమస్యలు ఏమిటి మొదలైనవి అధ్యయనం చేయటానికి 'రాజకీయ సంస్కృతి' భావన గురించి ఒక సమగ్రమైన అవగాహన ఉండటం అవసరం. ప్రవర్తనావాదం దృక్పథం పరిణామంగా రాజకీయ సంస్కృతి అధ్యయనం ఒక సమాజంలోని ప్రజల రాజకీయ విలువలు, ప్రవర్తనా నాణ్యతలు అర్థం చేసుకోవటానికి చాలా ఉపయోగపడుతుంది.

ఈ విధంగా వ్యక్తుల ప్రవర్తన రాజకీయ సంఘటనల మధ్య వారధిగా రాజకీయ సంస్కృతి విశ్లేషణ ఉపకరిస్తుంది. యుద్ధాలు, ఎన్నికలు, ఎన్నికల ప్రచారం, చట్టాలు, నాయకులు, ప్రభుత్వోద్యోగుల చర్యలు, అవి ఏ విధంగా వ్యక్తుల ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి మొదలైన వాటి విశ్లేషణకు రాజకీయ సంస్కృతి ఒక సాధనంగా వినియోగపడుతుంది. అదే విధంగా వ్యక్తుల ప్రవర్తన కూడా లేదా వారి చర్యలు పై సంఘటనలను ప్రభావితం చేస్తాయన్న అంశాన్ని మనం ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి. ఎందుకంటే మన విశ్వాసాలు, విలువలు, వైఖరులు, సంఘటనలను సందర్భాలను అన్వయించటంలో చాలా కీలకమైన పాత్ర నిర్వహిస్తాయి. వ్యక్తి కానీ, ఒక సమూహం కానీ వీటిని గురించి ప్రత్యేకంగా ఆలోచన చేయకపోవచ్చు. అయినప్పటికీ,ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యక్తి లేదా ఒక సమూహం తన ఆలోచనలు, విలువలు, విశ్వాసాలు కొన్ని అంశాలకు ముడిపెడుతాయి.

4.4 రాజకీయ సంస్కృతి అంటే ఏమిటి ?

రాజకీయ సంస్కృతిని ఒక ఖచ్చితమైన లేదా దృఢమైన పద్ధతిలో పూర్తిగా నిర్వహించలేం. అందువల్ల రాజకీయ సంస్కృతికి అనేక నిర్వచనాలు ఉన్నాయి. ఈ నిర్వచనాల వల్ల రాజకీయ సంస్కృతిని అనేక రకాలుగా వర్గీకరించటం జరిగింది. అయితే ప్రస్తుత చర్చ కోసం కొన్ని దృక్పథాలు, ఉద్వేగాల పర్యావరణంలో ఒక రాజకీయ వ్యవస్థ పని చేస్తుందని చెప్పవచ్చు. ఈ రాజకీయ విలువలు, ఉద్వేగాల పర్యావరణమే రాజకీయ సంస్కృతి అని చెప్పవచ్చు. గేబ్రియల్ అల్‌మాండ్ అన్నట్లు ఒక రాజకీయ వ్యవస్థ నిర్వహణకు నిర్దేశించే కొన్ని ప్రత్యేక భావాల దృక్పథాల పరీకృతమే రాజకీయ సంస్కృతి.

ఒక సమాజంలో కొన్ని రాజకీయ చర్యల పట్ల ప్రజల స్పందన వారి హావాభావాలు ఎలా ఉంటాయో, వారి దృక్పథాలు విలువలు, నమ్మకాల దృక్కోణ సమాహారమే రాజకీయ సంస్కృతి అని చెప్పవచ్చు. అందువల్లనే ఒక సమాజ ఆచరణాత్మక ఆశయాల సమాహారమే ఆ సమాజపు రాజకీయ సంస్కృతి అని ఆల్మండ్ భావిస్తాడు. ఒక రాజకీయ వ్యవస్థకు సంబంధించిన సభ్యులు దానికి సంబంధించిన రాజకీయ విషయాల పట్ల ఏర్పరచుకొన్న వ్యక్తిగత భావాలు, ధ్యేయాలు విలువల సముదాయాన్ని రాజకీయ సంస్కృతిగా ఆల్మండ్ నిర్వచించారు.

రాజకీయాభివృద్ధిలోని సాంఘిక విషయాల అధ్యయనం, పరిశీలన చేయడానికి రాజకీయ సంస్కృతి ఒక ముఖ్యాంశం. ఉలమ్, ఆల్మండ్, బీర్ (Ulam, Almand, Beer) మొదలైన శాస్త్రజ్ఞులు ఈ పదాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చినప్పటి నుంచి, రాజకీయ వ్యవస్థ పరివర్తన, అధ్యయనంలో ఇది ఒక ముఖ్యాంశంగా మారింది. ప్రతి రాజకీయ వ్యవస్థలో రాజకీయ సంస్కృతి ఆ వ్యవస్థను బట్టి భిన్నంగా ఉంటుంది. సులభంగా చెప్పాలంటే రాజకీయ విషయాల గురించిన అవగాహనే రాజకీయ సంస్కృతి. రాజకీయ ప్రపంచం గురించి ఒక వ్యక్తి లేదా సమూహం విలువల నమ్మకాల, అవగాహనలనే కలిపి రాజకీయ సంస్కృతి అంటారు. ఒక్కొక్క రాజకీయ వ్యవస్థ, ఒక్కొక్క రాజకీయ సంస్కృతికి కట్టుబడి ఉంటుందని ఆల్మండ్ అభిప్రాయం. ఒక సమాజం రాజకీయ ప్రవర్తన గురించి అందులోని వ్యక్తులు ప్రకటించిన నిర్దిష్ట భావనల సముదాయమే రాజకీయ సంస్కృతి.

రాజకీయ సంస్కృతిని సమాజ సంస్కృతిలోని భాగంగా పరిగణించవచ్చు. సమకాలీన విలువలను రాజకీయ సంస్కృతి ప్రతిబింబిస్తుంది. రాజకీయ భావాలు, విలువలు, అవగాహనలు మానసికమైనవి కాబట్టి, రాజకీయ సంస్కృతి మనోవిజ్ఞాన శాస్త్ర అధ్యయన సహాయంతో తెలుసుకోవచ్చు. వ్యక్తి విలువలపైన వారసత్వం ప్రభావం ఉంటుంది. మరో విధంగా చెప్పాలంటే రాజకీయ సంస్కృతి వారసత్వం ద్వారా ఏర్పడుతుంది. సమాజంలోని వ్యక్తుల విలువలు, విశ్వాసాలు అందరికీ ఆమోదయోగ్యమైనప్పుడే రాజకీయ సంస్కృతిగా మారుతుంది. ఏ. ఆర్. బాల్ (A.R. Ball) అభిప్రాయం ప్రకారం సమాజంలోని వ్యక్తుల రాజకీయ నడవడిక, విశ్వాసాలు, విలువలు రాజకీయ విషయాలపై అభిప్రాయాలు అన్నీ గూడా రాజకీయ సంస్కృతిగా ఏర్పడతాయి. ఆల్మండ్ అభిప్రాయంలో రాజకీయ వ్యవస్థలోని వ్యక్తుల రాజకీయాలను గురించిన అభిప్రాయాలు, ఉద్దేశాలు, రాజకీయాల పట్ల వారు నడుచుకునే విధానం మొదలైన వన్నీ రాజకీయ సంస్కృతిగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వం ఏ విధంగా నడుచుకుంటుందో ఏమి చేయబోతుందో మొదలైన విషయాలను గురించి సమాజం తీరు తెన్నులను, సంస్కృతిని తెలిపేదే రాజకీయ సంస్కృతి అని బీర్, ఉలమ్ మహాశయులు నిర్వహించారు. డెన్నిస్ కావంగ్ (Dennis Kavangh) రాజకీయ విషయాల్లో పౌరలందరి దృక్పథాలను, ఉద్దేశాలను రాజకీయ సంస్కృతి పేర్కొన్నారు.

సమాజంలో రాజకీయ వ్యవస్థ పట్ల ప్రజల విలువలు, నమ్మకాలు, ఆవేశాత్మక ధోరణులు మొదలైన రాజకీయ సంస్కృతి అంశాలకు ప్రాముఖ్యం ఉంటుంది. ఎన్నికలు నిర్ణీత కాలానికి జరగాలన్నది, స్వేచ్ఛగా, నిజాయితీగా జరగాలన్నదీ ప్రజలు గౌరవించే విలువ. మంత్రులు సభలో తమ విశ్వాసాన్ని కోల్పోయినపుడు రాజీనామా చేయాలన్నది వ్యక్తుల నడవడిక మీదున్న రాజకీయ విశ్వాసం. ఇటువంటి విశ్వాసమే దేశంలోని పౌరులకు రాజకీయ చర్చల్లో పాల్గొనే హక్కు ఉంటుందని అనుకోవడం. ఇహపోతే రాజకీయ ధోరణులు ఏ విధంగా ఏర్పడుతాయో తెలుసుకొందాం. బ్రిటన్‌లో రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యం కోసం జరిగిన చరిత్రాత్మక పోరాట అనుభవం, స్పీకరు నడవడిక, మాట తీరు పార్లమెంటరీ నిబంధనలకు మాత్రమే కాక రాచరికపు ఆచార, సాంప్రదాయాలకు కూడా

కట్టుబడి ఉండేట్టు చేసింది. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమే అయినా, చాలామంది సభ్యులు ప్రజాస్వామ్య ఆశయాలకు కట్టుబడి ఉన్న ఈ ధోరణి చెలామణి అవుతోంది. దీనినే మనం రాజకీయ సంస్కృతిగా చెప్పుకొంటున్నాం.

గేబ్రియల్ ఆల్మండ్, సిడ్నీవెర్బా రాజకీయ సంస్కృతిని మూడు విధాలుగా పేర్కొన్నారు. బ్రిటన్, అమెరికా, స్కాండినేవియా రాజకీయ వ్యవస్థల్లో "పాల్గొనే రాజకీయ సంస్కృతి" ఉన్నది. అక్కడి పౌరులకు రాజకీయ వ్యవస్థలతో అనుకూలమైన విషయపూరితమైన సంబంధాలు ఉన్నప్పుడు ఆ రాజకీయ సంస్కృతిని 'అధీన" (Subject) రాజకీయ సంస్కృతి అంటారు. తూర్పు యూరప్ దేశాల రాజకీయ సంస్కృతి ఈ కోవకు చెందిందే. పౌరులకు రాజకీయ వ్యవస్థలతో ఏ కొద్దిగానో సంబంధ బాంధవ్యాలు ఉండి రాజకీయ విషయాలలో ఏ మాత్రం జ్ఞానం కాని, అసక్తి గాని లేకుండా ఉన్నప్పుడు ఆ రాజకీయ సంస్కృతిని సంకుచిత సంస్కృతి (Parochial) అన్నారు. కొన్ని చోట్ల ఈ మూడు విధాల్లో ఏ రెండు విధాల్లో కలిసి ఉన్న సంస్కృతులు కూడా ఉండవచ్చు.

సమాజ సంస్కృతిలో రాజకీయ సంస్కృతి ఒక భాగం. ఒక విధంగా చెప్పాలంటే సాధారణ సంస్కృతి ప్రభావితం చేసే ఉప సంస్కృతి రాజకీయ సంస్కృతి. ఆదేశపు చరిత్రపై భూగోళం, సామాజిక, ఆర్థిక, కారకాలపై ఆధారపడి ఉంటుంది. పై చెప్పిన కారణాలకు కూడా ఆంతరంగిక సంబంధాలు ఉంటాయి. రాజకీయ సంస్కృతి స్థిరమైనది కాదు. అంటే ఎప్పుడు ఒక్కలాగానే ఉండదు. రాజకీయ వ్యవస్థలో వస్తున్న మార్పులను బట్టి, అవసరాలను బట్టి రాజకీయ సంస్కృతి మారుతూ ఉంటుంది.

ఒక రాజకీయ సంస్థ పెద్ద మార్పులకు లోను కాకుండా అంతరాయం లేకుండా పని చేసిందీ, లేనిదీ ఆ దేశ చరిత్ర తెలుపుతుంది. దీనిని బట్టి ఆ రాజకీయ వ్యవస్థ వెనక ఉన్న రాజకీయసంస్కృతి అర్థమవుతుంది. ఉదాహరణకు, బ్రిటన్‌లో రాజకీయ వ్యవస్థ దెబ్బ తీయకుండా కొనసాగటానికి కారణం ఆ దేశంలో ఆంతరంగికంగా గాని, ఇతర దాడుల వల్ల గాని ఆ వ్యవస్థకు ఎటువంటి ఆపద రాకపోవటమే. దీనికి వ్యతిరేకంగా ఫ్రాన్స్‌లో చారిత్రాత్మకాభివృద్ధి కనబడుతుంది. 1789 విప్లవం రాజకీయ వ్యవస్థను కూలగొట్టింది. తరవాత సంఘటనలు ప్రజలలో ఆవేశపూరితమైన విపరీత ధోరణులకు దారి తీసింది. ఈ విధంగా చరిత్ర ఆయా రాజకీయ వ్యవస్థల. రాజకీయ సంస్కృతిని ప్రభావితం చేస్తుంది.

భౌగోళిక కారణాలు కూడా రాజకీయ సంస్కృతిని ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు, బ్రిటన్ దేశం ఒక ద్వీపం కావడం వల్ల ఆదేశం మీద దాడులు తక్కువైనాయి. అలాగే ఇతర దేశాల జాతులవారు ఆ దేశం లోకి చొచ్చుకొని పోవడం కూడా అరుదైంది. ఈ కారణాల వల్ల ఆ దేశంలో జాతి భేదాలు, ఘర్షణలు పెద్ద సమస్యలుగా ఏర్పడలేదు. దానికి విరుద్ధంగా భారతదేశంలో ఇతర దేశస్థుల దాడులు మాత్రమే కాక, ఇతర దేశస్థులు, ఇతర జాతీయులు ఇక్కడ స్థిరపడటం కూడా జరిగింది. దానికి కారణం భారతదేశ సరిహద్దులే. జాతి వైరుధ్యం వివిధ తెగల నడుమ వైరుధ్యం, వివిధ రాజకీయ సంస్కృతులను పుట్టించింది. కొన్ని సార్లు ఈ విభిన్న రాజకీయ సంస్కృతులు వైరానికి కూడా దారి తీసే పరిస్థితి ఏర్పడి, జాతీయ సమగ్రతనే సవాలు చేసే పరిస్థితి ఏర్పడుతుంది. వివిధ రాజకీయ సంస్కృతులు రాష్ట్రాల ఏకేంద్రీకరవు కాకుండా భారతదేశం నుండి విడిపోయి స్వతంత్రదేశం ఏర్పడాలన్న వాదం కూడా బయలుదేరింది.

ఆర్థిక, సామాజిక కారణాలు కూడా రాజకీయ సంస్కృతిని ప్రభావితం చేస్తాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా చదువుకొన్నవారు వార్తా ప్రసరణలు ఎక్కువ కాబట్టి ప్రభుత్వ నిర్ణయాలు తీసుకోవడంలో ప్రజల పాత్ర కూడా ఎక్కువే. గ్రామీణ ప్రాంతాల్లోని సమాజంలో మార్పులు అంత తొందరగా మారవు కాబట్టి అది వెనుకనే ఉంటుంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధుల ప్రభావం వ్యవసాయ రంగంలోను, పారిశ్రామిక రంగంలోనూ ప్రతిబింబిస్తాయి. అలాగే వార్తా ప్రసరణాలను,రవాణాలలోనూ, వలసలను, ఎగుమతులను, దిగుమతులను, విప్లవాలను, యుద్ధాలను ప్రభావితం చేస్తాయి. పైన పేర్కొన్నవన్నీ కూడా రాజకీయ విలువలను, విశ్వాసాలను మార్చి వేస్తాయి.

ఇటీవల రాజకీయ సంస్కృతిని లౌకికం చేసే ప్రసక్తి చర్చలో ఉన్నది. ప్రజల్లో రాజకీయ అవగాహన (political awareness) ను పెంచి, రాజకీయ వ్యవస్థ గురించి పరిజ్ఞానాన్ని ఎక్కువగా అందించి, రాజకీయ వ్యవస్థలో పాల్గొనేటట్లు చేసే ప్రక్రియనే రాజకీయ సంస్కృతిని లౌకికం చేయటం అంటారు.

4.5 రాజకీయ మార్పు - రాజకీయ సంస్కృతి

పాశ్చాత్య, తూర్పుదేశాల రాజకీయ వ్యవస్థలను గమనించి అధ్యయనం చేసిన తరువాత శాస్త్రజ్ఞులు రాజకీయ సుస్థిరతలో రాజకీయ సంస్కృతి కీలక పాత్ర వహిస్తుందని అభిప్రాయపడ్డారు. ఉదాహరణకు, ఫ్రెంచి రాజకీయ సంస్కృతి వారు విశ్వసించిన సంపూర్ణ అధికార భావనలో ప్రతిబింబిస్తుంది. ఈ విధంగా సంపూర్ణాధికార సిద్ధాంతంలో నమ్మకమున్న ప్రజలపై పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని రుద్దటం కష్టం.

కొత్తగా వెలసిన రాజకీయ వ్యవస్థలో పూర్తి మార్పు లేక అనుకోని మార్పులు ఆ వ్యవస్థను పూర్తిగా దెబ్బతీస్తాయి. కారణం అక్కడి ప్రజలు సంప్రదాయవాదులై వారి రాజకీయ విలువలు పూర్తిగా తలకిందులు కావటం సహించకపోవటమే. ఇటువంటి వ్యవస్థలో మార్పులను క్రమంగా తీసికొని రావటం మంచి ఫలితాన్ని చూపింది. భారతదేశం లాంటి రాజకీయ వ్యవస్థల్లో నాయకులు వివిధ రాజకీయ సంస్కృతుల మనుగడను హర్షిస్తారు. నెహ్రూగారు దీనినే "భిన్నత్వంలో ఏకత్వం" అన్నారు. అమెరికా, బ్రిటన్ వంటి రాజకీయ వ్యవస్థల సుస్థిరత్వానికి అక్కడ ఒకే సంస్కృతి ఉండటమన్నది మూలకారణమని చాలా మంది అభిప్రాయం.

అభివృద్ధి చెందుతున్న మూడో ప్రపంచ దేశాల్లో రాజకీయ సంస్కృతి పునరుద్ధరణ జరుగుతుంది.

(1) సాంస్కృతిక పరిణామం త్వరగా జరగటానికి రాజ్యం యొక్క సాధనాలను - అంటే ప్రభుత్వ ఏజన్సీలను నియమించటం జరుగుతుంది.

(2) సాధారణంగా ఇటువంటి రాజ్యాల్లో రాజకీయాలు ఎక్కువ. అంతేగాక రాజ్యాన్ని, సమాజాన్ని ఒకే విధంగానూ, ఒకే వ్యవస్థగానూ చూడటం జరుగుతుంది. ఒక మంచిపార్టీ కార్యకర్తనే మంచి వ్యక్తిగానూ, మంచి పౌరుడుగానూ పేర్కొంటున్నారు.

(3) ఈ దేశాల చరిత్రకు విదేశీదాడుల వల్ల ప్రతిబంధకాలు ఏర్పడటం వల్ల, పాత విధానాలు, అభిప్రాయాలు, ఆలోచనలు కనుమరుగై కొత్త ధోరణులు, కొత్త విధానాలు చోటు చేసుకొంటున్నాయి. కొత్త సంస్థలను వ్యవస్థలో, కొత్త కార్యక్రమాలను సమర్థించటానికి సరికొత్త ఆలోచనా పంథాలు, సరళులు, ధోరణులు అవసరం.

(4) కొత్త ప్రభుత్వాలు, వ్యవస్థలు స్థిరపడటానికి వాటి విధానాలు,నిబంధనలను, విలువలను ప్రజలు స్వచ్ఛందంగా ఆమోదించటం, ఆజ్ఞలను శిరసావహించటం చాలా ముఖ్యం.

పై కారణాలవల్ల మూడో ప్రపంచదేశాల్లోని రాజకీయ సంస్కృతిని పునరుద్ధరించటం జరుగుతుంది.

4.6 రాజకీయ భావజాలాలు - రాజకీయ సంస్కృతి

సంస్థల పట్ల, వ్యవస్థలపట్ల, వ్యక్తుల కున్న మౌలిక అభిప్రాయాలు, విశ్వాసాలు, విలువలు కలసి ఒక మానసిక ధోరణికి రూపాన్నిస్తాయి. కాలక్రమేణ స్థిరపడిన రూపధోరణినే సిద్ధాంతం అంటున్నారు. కొన్ని సిద్ధాంతాలపట్ల ప్రజల నమ్మకాలు, విలువలు ఒకే విధంగా ఉండేట్టు ఏర్పడతాయి. ఉదాహరణకు, కమ్యూనిజం, ఫాసిజం లాంటివి. ఇటువంటి సిద్ధాంతాల్లో మార్పుకు, వైరుధ్యానికి తావులేదు. కొత్తగా వచ్చే అధికారులు బలప్రయోగం వల్ల మాత్రమే ఇటువంటి వ్యవస్థలో సైద్ధాంతిక మార్పు తీసుకురాగలరు. పాత విశ్వాసాల స్థానంలోనే కొత్త విలువలను ప్రవేశపెట్టడాన్నే "సాంస్కృతిక విప్లవం" అంటారు. కమ్యూనిజం స్థానంలో సామ్యవాద విలువలను నెలకొల్పడాన్నే దీనికి ఒక ఉదాహరణగా చెప్పకోవచ్చు. కొత్త విలువలను వ్యతిరేకించిన సమాజాన్ని బలవంతంగా అణిచి, హింసించటం లాంటివి చేసి స్టాలిన్, మావో వంటి నాయకులు ప్రజలను రాజకీయ వ్యవస్థపట్ల వారి మానసిక ధోరణిని మార్చుకొని కొత్త సాంఘిక ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను నడపటానికి సహకరించమన్నారు. ఈ విధంగా దృఢ సిద్ధాంతాలలో మార్పు తీసుకురావడం జరుగుతుంది.

అదృఢ సిద్ధాంతాల విషయం వేరు, ఫ్రాయిడ్ Freud) అభిప్రాయం ప్రకారం ఇది వివిధ రకాల ఒత్తిడులను, బెదిరింపులను, సమస్యలను,ఎదుర్కొటానికి మానవునిలో హేతువాదాన్ని వెలికితీయటం లాంటిది. ఈ కోవకు చెందిందే ఉదారవాద సిద్ధాంతం. అదృఢ సిద్ధాంతం ఎప్పుడూ ఒక్కలానే ఉండదు. వాటికి అంతరంగిక సంబంధాలు ఉంటాయి. అందుకే రాజకీయ పార్టీల అభిప్రాయాలు కూడా ఎక్కడో అక్కడ కలుస్తూనే ఉంటాయి. అందువల్ల ఉదారవాద సిద్ధాంతం ఒకే ఒక రాజకీయ సంస్కృతిని ప్రతిబింబించదు. స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయం మొదలైన భావాలపై విశ్వాసాలు సడలకున్నా, ఈ భావాల స్వభావాల విషయంలో మాత్రం రాజకీయ విలువలు వివిధ రకాలుగా ఉండవచ్చు.

సిద్ధాంతాలు ధృఢమైనవైనా, అధృఢమైనవైనా, రాజకీయ చర్చల్లో ప్రతిబింబిస్తూనే ఉంటాయి. ప్రజలు వారు నమ్మిన రాజకీయ విలువల కోసం, విశ్వాసాల కోసం ప్రాణాలర్పించడానికైనా వెనుదీయరన్నది చారిత్రక సత్యం. ఆవేశపూరితమైన రాజకీయ చర్యల వెనక సిద్ధాంతాల ఉనికి ఉన్నదని కొంత మంది అభిప్రాయం.

సిద్ధాంతాలు,రాజకీయ సంస్కృతి ఒకే దృగ్విషయంలోని (Phenomena) భాగాలు కాబట్టి ఈ రెండింటి అధ్యయనానికి పరస్పర సంబంధం ఉంది. సమాజం అందులోని వ్యక్తులకు అందచేసే సాంప్రదాయక విలువలనే పౌరసంస్కృతి (Civil Culture) అంటున్నారు. అధికారానికి, బాధ్యతకు సమన్వయం చేకూర్చే రాజకీయ సంస్కృతి ఈ పౌరసంస్కృతి ఏర్పటంలో చాలా కీలకపాత్ర వహిస్తుందని ఆల్మండ్, వెర్బాలు అన్నారు.

4.7 రాజకీయ సంస్కృతి - రాజకీయ వ్యవస్థ

న్యాయ సంస్థాపరమైన దృక్కోణానికి రాజకీయ సంస్కృతికి చాలా తేడా ఉంది. న్యాయ-సంస్థాపరమైన దృక్కోణం చట్టపరంగా ఏర్పడిన రాజకీయ సంస్థల ఆకారాలను మౌలిక శాసనానికి అనుబంధంగా తీసుకొన్న నిర్ణయాలను మాత్రమే అధ్యయనం చేస్తుంది. రాజకీయ సంస్కృతి దృక్కోణం మరో అడుగుముందుకు వేసి కుటుంబ సంబంధాలకు, జన సమూహాలకు, ఎన్నికల్లో ఓటర్లకు అధికారం యొక్క అన్ని కారకాల గురించి రాజకీయ వ్యవస్థకు సంబంధించిన అన్ని విషయాలను గురించి అధ్యయనం చేస్తుంది. రాజకీయేతర విషయాలను కూడా రాజకీయ సంస్కృతి చర్చిస్తుంది.

రాజకీయ సంస్కృతిని ఆధారంగా చేసుకొని ఆల్మండ్ అనే అమెరికన్ రాజనీతిశాస్త్రజ్ఞుడు ప్రపంచంలోని ముఖ్యమైన రాజకీయ వ్యవస్థలను, సామాజిక శాస్త్రంలోని, మానవశాస్త్రంలోని భావాలను వాడుతూ వర్గీకరించాడు.

రాజకీయ ప్రక్రియలో సమాజంలోని వ్యక్తుల పాత్రను బట్టి రాజకీయ సంస్కృతిని వర్గీకరించవచ్చు. ప్రభుత్వ చర్యలు ప్రజలకు లాభసాటిగా ఉండేటట్లు పాత్ర వహిస్తున్నది లేదా నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ పట్ల అవగాహన ఎంతవరకు ఉన్నదీ మొదలైన అంశాలను బట్టి రాజకీయ సంస్కృతిని వర్గీకరించవచ్చు. ఆల్మండ్ అభిప్రాయం ప్రకారం రాజకీయ వ్యవస్థ, రాజకీయ సంస్కృతి ఒక దానిపై మరొకటి ప్రభావం చూపుతుండటం వల్ల వాటికి అంతరంగిక సంబంధాలుంటాయి.

ఆల్మండ్ అభిప్రాయంలో రాజకీయ చర్యలపట్ల ప్రజల ధోరణులు లేదా ఉద్దేశాల పరిధిలోనే రాజకీయ వ్యవస్థ నడుస్తుంది. మరో మాటలో చెప్పాలంటే రాజకీయ చర్యల పట్ల ప్రవృత్తులు విధానం అన్న రాజకీయ వ్యవస్థ. రాజకీయ సంస్కృతిని వివిధ జ్ఞాన ప్రవృత్తుల మూల్యాంకన ప్రవృత్తుల ఆధారంగా నిర్ణయించవచ్చు.

వ్యవస్థ, చారిత్రాకాభివృద్ధి, భూగోళం, అధికారం, రాజ్యాంగలక్షణాలు, సమాజ వ్యవస్థ, ప్రజల సమస్యలు మొదలైన వాటి గురించి సంపూర్ణమైన జ్ఞానం ఉండటమే, జ్ఞాన ప్రవృత్తిగా భావించవచ్చు. విధానాల నిర్ణయాలను ప్రభావం చేసే రాజకీయ పార్టీలు, ప్రసార సా ధనాలు, ప్రభావ వర్గాలు మొదలైనవి ప్రాభావిక ప్రవృత్తులుగా పరిగణించవచ్చు. రాజకీయ ధ్యేయాల గురించి, రాజకీయ చర్చల్లో తమ పాత్ర గురించి, సభ్యులు తులనాత్మకంగా పరిశీలించటాన్నే మూల్యాంకన ప్రవృత్తులని పేర్కొన్నారు. ఆల్మండ్ అభిప్రాయంలో రాజకీయ వ్యవస్థ పట్ల సభ్యుల కన్న ఈ ప్రవృత్తులు రాజకీయ సంస్కృతిలోని అంతర్భాగాలు.

పరిచయం

తులనాత్మక రాజకీయాల అధ్యయనం ఎప్పటి నుంచి ఆరంభమైందో, ఏఏ కాలాలలో జరిగిందో వివరించటం అంత సులభతరమైన విషయం కాదు. ఆధునిక యుగారంభంతో తులనాత్మక రాజకీయాల అధ్యయనం ఆరంభమైందన్న విషయం అందరి ఆమోదం పొందింది. ఈ శతాబ్దంలో ప్రధానంగా రెండవ ప్రపంచయుద్ధం తరువాత కాలంలో తులనాత్మక రాజకీయాల అధ్యయనం ప్రముఖ స్థానాన్ని సంతరించుకొంది. యుద్ధానంతరం స్వతంత్ర రాజ్యాలుగా ఆవిర్భవించిన చాలా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికన్ దేశాలు వాటి పూర్వవలస పాలన ప్రభావంతో చాలా వరకు పాశ్చాత్య రాజకీయ నిర్మితులను అనుసరించాయి. పాశ్చాత్య దేశాల్లో విజయవంతమైన చాలా రాజకీయ భావనలు ఈ దేశాల్లో విజయవంతం కాలేకపోయాయి. పర్యవసానంలో చాలా మంది మేధావులు కారణాలు వెతకనారంభించారు. అంతర్జాతీయ రంగంలో యుద్ధానంతరం నెలకొన్న ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం, అభివృద్ధి చెందుతున్న దేశాలలోని అస్థిరత్వాలు తులనాత్మక రాజకీయాల అధ్యయనానికి మేధావులను ప్రోత్సాహపరిచాయి. యుద్ధానంతరం పాశ్చాత్యేతర రాజకీయ వ్యవస్థల అధ్యయనంపట్ల ఆసక్తి బాగా పెరిగింది. ప్రవర్తనావాద ధృక్పథం కూడా తులనాత్మక రాజకీయాల అధ్యయనవృద్ధికి తనవంతు దోహదం చేసింది. పర్యవసానంలో రాజకీయ సంస్థల అధ్యయనంలోవాటి సామాజిక, చారిత్రక, సాంస్కృతిక, పూర్వరంగం విశ్లేషణ ప్రాముఖ్యతను సంతరించుకొంది. వివిధ రాజకీయ వ్యవస్థల మధ్యగల వైవిధ్యాలను వ్యత్యాసాలను అధ్యయనం చేయటానికి తులనాత్మక రాజకీయాల అధ్యయనం బాగా దోహదం చేసింది. తులనాత్మక రాజకీయాల అధ్యయనం వివిధ దశలలో అనేకరకాలుగా వృద్ధి చెందింది. ప్రారంభంలో భావాలకు, ప్రమేయాలకు ప్రాధాన్యం లభించగా అటు తరువాత విలువలతో కూడిన సిద్ధాంతాలు అవతరించాయి. ఇటీవలి కాలంలో లాంఛనప్రాయ చట్టబద్ధ రాజకీయ సంస్థల, నిర్మితులపై తులనాత్మక రాజకీయాల అధ్యయనం తన దృష్టిని సారించింది.

రాజనీతి శాస్త్ర స్నాతకోత్తర అధ్యయనాంశాలలో తులనాత్మక రాజకీయాల అధ్యయనాన్ని ప్రవేశపెట్టాం. ఈ అధ్యయనాంశంలో అయిదు ఖండాలు ఉన్నాయి. తులనాత్మక రాజకీయాల అధ్యయన వికాసం, ధృక్పథాలను మొదటి ఖండంలో చర్చించాం. తులనాత్మక రాజకీయాల విశ్లేషణలోగల వివిధ భావనలను రెండవ ఖండంలో చర్చించాం. మూడవ ఖండంలో వివిధ రాజకీయ సంస్థలను గురించిన అధ్యయనాంశాలున్నాయి. నాలుగవ ఖండంలో అధికారం, శక్తి, శాసనబద్ధత, స్వాతంత్ర్యం, అధికారం, న్యాయవ్యవస్థలు, అధీనతా భావ సిద్ధాంతాలను చర్చించటం జరిగింది. చివరి ఖండంలో సమాఖ్య, ఏకకేంద్ర ప్రభుత్వ నిర్మితుల అధ్యయనాన్ని చేర్చాం.

ఇది తులనాత్మక రాజకీయాల సమగ్ర అధ్యయనం కాదు. విద్యార్థి అవగాహన కొరకు అవసరమైన సమాచారాన్ని చేర్చటానికి ప్రయత్నించాం. ప్రపంచ రాజకీయ వ్యవస్థలలో చాలా త్వరితగతిన మార్పుచేర్పుల స్థానం సంతరించుకొంటున్నాయి. సమకాలీన రాజకీయాలను అవగాహన పరచుకోవటం తులనాత్మక రాజకీయాల పరిశీలనకు, అధ్యయనానికి దోహదం చేస్తుంది.

డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజికశాస్త్రాల విభాగం

రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం

M.A. రెండవ సంవత్సరం

పాఠ్యాంశం —I తులనాత్మక రాజకీయాలు

విషయ సూచిక

పేజీ. సంఖ్య

ఖండం – I ప్రవేశిక 1

భాగం – 1 తులనాత్మక రాజకీయాల అధ్యయన వికాసం 3

భాగం – 2 తులనాత్మక రాజకీయాల అధ్యయన ధృక్పథాలు 16

ఖండం – II రాజకీయ విశ్లేషణ 29

భాగం – 3 రాజకీయ అభివృద్ధి 31

భాగం – 4 రాజకీయ సంస్కృతి 45

భాగం – 5 వ్యవస్థా విశ్లేషణ 60

భాగం – 6 నిర్మితులు విధుల విశ్లేషణ 69

భాగం – 7 రాజకీయ వ్యవస్థ ఆధారాలు 91

భాగం – 8 మార్క్సిస్టు విశ్లేషణ 102

భాగం – 9 భావసిద్ధాంతం పాత్ర 110

ఖండం – III రాజకీయ వ్యవస్థలు 123

భాగం – 10 రాజకీయ పార్టీలు – పార్టీ వ్యవస్థలు 125

ఖండం - I ప్రవేశిక

తులనాత్మక రాజకీయాల అధ్యయనం ఇటీవలి కాలంలో చాలా ప్రాధాన్యతను సంతరించుకొంది తులనాత్మక రాజకీయాలు అంటే ఏమిటి? ఇటీవలి పరిణామాలు, తులనాత్మక రాజకీయాల అధ్యయన వికాసం ఈ ఖండంలో చదువుతారు.

తులనాత్మక రాజకీయాలు

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
CM0138

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాదు

1996

రచయితల బృందం

సంపాదకుడు:
ఆచార్య కె. సుభాష్ చంద్రారెడ్డి

సహ సంపాదకులు:
ఆచార్య ఎం. సత్యనారాయణరావు

రచయితలు:
ఆచార్య బి. వెంకటేశ్వర్లు
ఆచార్య డి. నూరన్ నాయుడు
డా॥ పి. మాణిక్యాంబ
డా॥ వి. రవీంద్ర శాస్త్రి
డా॥ టి. ఎస్. మోహన

తెలుగుభాష పరిశీలన:
డా. కె.ఆర్.కె. మూర్తి

ముఖ చిత్రం:
రమేష్

CM-0138
31-3-97

Dr. B R.A.O.U. LIBRARY
Acc No...CM-0138.....
Date .....31.03.97.....
Call No 320 .....

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాదు
ప్రథమ ముద్రణ 1995
ద్వితీయ ముద్రణ : 1996

© డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగమైనా ఉపయోగించదలచుకొంటే విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళికలో ఒక భాగం.

పాఠ్య ప్రణాళిక వివరాలు చివరలో ఉన్నాయి.
ఇతర వివరాలకు: ఎకడమిక్ డైరెక్టర్ డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం, హైద్రాబాదు.

ముద్రణ : నవ్య ప్రింటర్స్, బాదమ్ సోహ్నా అపార్ట్‌మెంట్స్, రాజ్‌భవన్ రోడ్, సామాజిగూడ, హైదరాబాద్.

భాగం - 1 : తులనాత్మక రాజకీయాల అధ్యయన వికాసం

విషయ క్రమం

1.1 లక్ష్యాలు
1.2 పరిచయం
1.3.0 తులనాత్మక రాజకీయాల అధ్యయన ప్రారంభం
1.3.1 మాకియవెల్లీ, సాంస్కృతిక పునరుజ్జీవన యుగం
1.3.2 మాంటెస్క్యూ - విజ్ఞతాయుగం
1.3.3 చారిత్రకతవాదం
1.4 లాంఛనప్రాయ - చట్టపరమైన అధ్యయనాలు
1.5 రాజకీయ పరిణామాత్మకవాదం
1.6 రాజకీయ సామాజిక శాస్త్రం ప్రారంభం
1.7 లాంఛనేతర రాజకీయాలు
1.8 ఆధునిక ప్రజాస్వామ్యాలు
1.9 రాజ్యాంగ ప్రభుత్వం - ప్రజాస్వామ్యం
1.10 తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో ఇటీవలి పరిణామాలు
1.11 పాశ్చాత్యేతర వ్యవస్థల ఆవిర్భావం
1.12 శాస్త్రీయ దృక్పథం ప్రాచుర్యం
1.13 నిర్మితి-విధుల విశ్లేషణ
1.14 ముగింపు
1.15 చదువదగిన పుస్తకాలు
1.16 నమూనా పరీక్షా ప్రశ్నలు

1.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

* తులనాత్మక రాజకీయాల అర్థం,
* అధ్యయన దృక్పథం,
* అధ్యయనంలో వచ్చిన పరిణామాలు బాగా విశదీకరించగలుగుతారు.

1.2 పరిచయం

తులనాత్మక రాజకీయ అధ్యయనానికి చిరకాల చరిత్ర ఉంది. దీని ప్రారంభం అరిస్టాటిల్‌తో మొదలైంది. అరిస్టాటిల్ రాజనీతి శాస్త్రానికి మూలపురుషుడే కాకుండా శాస్త్రీయ దృక్పథంతో తులనాత్మక రాజకీయాల అధ్యయనానికి కూడా ప్రారంభకుడు అని ఘంటాపథంగా చెప్పవచ్చు. నేటి రాజకీయాధ్యయనాల్లో తలెత్తే అంశాలు, అధ్యయన పద్ధతులు మొదలైనవాటిని ఆయన అప్పుడే ప్రస్తావించారు. అరిస్టాటిల్ నుంచి స్ఫూర్తి పొందిన అనేక తత్వవేత్తలు-సిసిరో, పోలిబియస్, టాసిటస్, మాకియవెల్లీ, మాంటెస్క్యూ సాధారణ రాజకీయ వ్యవస్థల అధ్యయనం, వాటి వర్గీకరణ, రకాలు, వాటి అభివృద్ధి వాస్తవంలో అవి ఎలా పనిచేస్తున్నాయో పరిశీలించటం మొదలైనవాటిని వివిధ కాలాల్లో ప్రస్తావించారు; విశ్లేషించారు. సిద్ధాంతీకరించారుకూడా.

గ్రీకుల కాలం నుంచి 19వ శతాబ్దం వరకూ రకరకాల సిద్ధాంతాలు రాజనీతి అధ్యయనంలో వెలువడ్డాయి. వాటి వర్గీకరణ, సాధారణీకరణం, మార్పులు, చేర్పులు మొదలైనవెన్నో కాలానుగుణంగా ఏర్పడ్డాయి. ప్రారంభంలో అధికారాన్ని నిర్వహించేవారి సంఖ్యను బట్టి రాజరికం, కులీనపాలన, ప్రజాస్వామ్యం అని రాజకీయ వ్యవస్థలను వర్గీకరించటం జరిగింది. అయితే 19 వ శతాబ్దం నాటికి అనేక ఇతర అంశాలుకూడా చోటుచేసుకొని రాజకీయ వ్యవస్థల వర్గీకరణం విస్తృతంగా పెరిగిపోయింది.

కొంతమంది రచయితలు రాజకీయ వ్యవస్థాపనను పాశ్చాత్య, పాశ్చాత్యేతర అని రెండు రకాలుగా వర్గీకరించారు. మరికొందరు రాజ్యాంగబద్ధ, సంపూర్ణాధికార, సాంప్రదాయక, ఆధునిక లేదా పారిశ్రామిక, వ్యావసాయక వ్యవస్థలుగా వర్గీకరించారు.

కొంతమంది రచయితలు రాజకీయ వ్యవస్థలను మూడు రకాలుగా వర్గీకరించారు. మాక్స్‌వెబర్, ఉదాహరణకు అధికారం శాసనబద్ధీకరణ ప్రాతిపదికగా సాంప్రదాయిక, హేతుబద్ధ, చట్టబద్ధ, జనాకర్షణ శక్తి వ్యవస్థలుగా వర్గీకరించారు. మార్క్సిస్టులు ప్రబల ఆర్థికవర్గం ప్రాతిపదికగా భూస్వామ్య, బూర్జువా, శ్రామికవర్గ వ్యవస్థలుగా వర్గీకరించారు. కోల్‌మాన్ పాటీ, పాటీరహిత, అధికారవాద వ్యవస్థలుగా విశ్లేషించారు. ప్రజాస్వామ్య, అధికారపరంపర (HIERARCHY), బేరసార వ్యవస్థలుగ వర్గీకరించారు. డేవిడ్ ఆప్టర్ ప్రభుత్వాలను నియంతృత్వ, అల్పజన పరోక్ష ప్రాతినిధ్య, ప్రత్యక్ష ప్రాతినిధ్య పరంగా వర్గీకరించారు. ఆంగ్లో-అమెరికన్, కాంటినెంటల్ యురోపియన్, పారిశ్రామిక-పూర్వ (Pre-industrial), సంపూర్ణాధికార వ్యవస్థలుగా గాబ్రియల్ ఆల్‌మండ్ రాజకీయ వ్యవస్థలను వర్గీకరించారు.

నూతనంగా ఆవిర్భవించిన రాజ్యాలను దృష్టిలో పెట్టుకొని ఎడ్వర్డ్ షిల్స్ మూడు రకాల వ్యవస్థలను వర్గీకరించాడు. అవి :

1. రాజకీయ ప్రజాస్వామ్యం,
2. నామమాత్ర ప్రజాస్వామ్యం,
3. ఆధునికీకరణ దశలో అల్పజన పాలన.

ఇన్ని రకాల వర్గీకరణలను వివిధ రచయితలు చేయటంతో మనకు ఒక అంశం స్పష్టంగా తెలుస్తుంది. అదేమిటంటే ఆధునిక సామాజిక సిద్ధాంతం వేగంగా అభివృద్ధి చెందటమే కాకుండా సామాజిక శాస్త్రాల అధ్యయనంలో అనేక అంశాలు నూతనంగా చోటుచేసుకొంటున్నాయి.

అయితే ఇటువంటి వర్గీకరణలు కొన్ని మౌలిక ప్రశ్నలకు దారి తీస్తున్నాయి. ఏ వర్గీకరణ మిగతా వాటికంటే మన ప్రయోజనానికి ఎక్కువగా ఉపకరిస్తుంది ? అసలు వర్గీకరణల ప్రయోజనం ఏమిటి ? అటువంటి వర్గీకరణలు ఏప్రాతిపదికపై రూపొందాయి. ఒక వర్గీకరణకు మరొక వర్గీకరణకు మధ్య మౌలిక వ్యత్యాసం ఏమిటి? ఏ వర్గీకరణ ఎక్కువ ప్రయోజనకరం. ఏది కాదు.

అదేవిధంగా ఒక రాజకీయ వ్యవస్థలో ఏవి ముఖ్యమైన విభాగాలు అనే ప్రశ్నకు కూడా సమాధానం చెప్పవలసి ఉంటుంది. ప్రారంభకాలంలో ఒక వ్యవస్థలో మౌలికంగా మూడుభాగాలుంటాయని భావించేవారం. అవి శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయసంబంధిత నిర్మితులు, కర్తవ్యాలు. తరవాత కాలంలో అనేక నూతన ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించి విశ్లేషణకోసం వినియోగించటం జరిగింది. ఉదాహరణకు, డేవిడ్ ఆప్టర్ రాజకీయవ్యవస్థను ప్రభుత్వం, రాజకీయ సమూహాలు, సామాజిక వర్గాల సమాహరంగా భావించాడు. ఇందులో ప్రతి భాగాన్ని మళ్ళీ అనేక ఉపవిభాగాలుగా విభజించి ఇవన్నీ ఆయా వ్యవస్థల రాజకీయాలలో అంతర్భాగాలుగా సూచించాడు.

ప్రభుత్వానికి ఒక నిర్మితి నిర్మాణం ఉంటుందని, దాని ఉనికి అయిదు నిర్మిత పూర్వపరిస్థితులపై ఆధారపడి ఉంటుందని చెప్పడం జరిగింది అవి-

1. అధికారికంగా నిర్ణయం తీసుకోవటం
2. జవాబుదారీ, సమ్మతి
3. నిర్భంధం - శిక్ష

4. వనరుల సేకరణ - పంపిణీ
5. రాజకీయ భర్తీ, వివిధకర్తవ్యాలకు, కర్తవ్య నిర్ణయం (Role Assignment)

హెరాల్డ్ లాస్వెల్ రాజకీయ వ్యవస్థను ఏడు కర్తవ్య చలాంకాల ప్రాతిపదికపై వర్గీకరించాడు. అవి :
1. తెలివితేటలు
2. సిఫారసు
3. సూచించటం (Prescription)
4. అధికారాన్ని ఉపయోగించటం (Invocation)
5. అనువర్తన (Application)
6. సమీక్ష
7. రద్దు చేయటం (Termination)

డేవిడ్ ఈస్టన్ రాజకీయ వ్యవస్థలకు రెండు మౌలిక లక్ష్యాలు ఉంటాయని భావిస్తాడు. అవి ఉత్పాదకాలు (కోరికలు-మద్దతులు), ఉత్పాదితాలు (అధికారిక నిర్ణయాలు). ఆల్మండ్ ఉత్పాదకాలను, ఉత్పాదితాలను సంక్లిష్టమైన పద్ధతిలో కర్తవ్యపరంగా ఏడురకాలుగా వర్గీకరించాడు. వాలుగు కర్తవ్యాలను ఉత్పాదకాలుగా సూచించాడు. అవి: రాజకీయ సామాజికీకరణ, భర్తీ, ఆసక్తి వ్యక్తీకరణ, ఆసక్తి సమీకరణ, రాజకీయ ప్రసారం. ఉత్పాదితాలుగా మూడు కర్తవ్యాలను వర్గీకరించాడు. అవి : నియమాన్ని రూపొందించటం, నియమాన్ని వర్తింపచేయటం, నియమాన్ని వ్యాఖ్యానించటం.

పై చర్యను బట్టి రాజకీయ వ్యవస్థల వర్గీకరణలో అనేక అంశాలు చోటుచేసుకొన్నాయని స్పష్టంగా తెలుస్తుంది. అవి నిర్మితిపరంగాను కర్తవ్యాల పరంగాను ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని తులనాత్మక రాజకీయాలను మనం అధ్యయనం చేయవలసి ఉంటుంది. అందువల్ల తులనాత్మక రాజకీయాల అధ్యయనం అనుకున్నంత సులభంకాదు. ఈ అధ్యయనం చారిత్రకంగా ఏవిధంగా అభివృద్ధి చెందిందో ముందుగా మనం తెలుసుకోవాలి. తరవాత ప్రస్తుత స్థాయికి అది ఏవిధంగా చేరుకుందో వివరించాలి. అంతేకాకుండా సమకాలీన వ్యవస్థల్లో వివిధ ప్రజానీకాల ఆకాంక్షలు, ఆసక్తులు, నిర్మితుల మధ్య ఉన్న వ్యత్యాసాలను విశ్లేషించాలి.

1.3.0 తులనాత్మక రాజకీయాల అధ్యయన ప్రారంభం

తులనాత్మక రాజకీయాల అధ్యయనం నిజానికి ఎప్పటి నుంచి ప్రారంభమైందో ఏ ఏ కాలాలలో జరిగిందో నిర్ణయించటం కొద్దిగా కష్టతరమైనపనే. అయితే ఆధునిక కాలంలో దాని అధ్యయనం రాజకీయ వ్యవస్థలు సహజంగా ఏర్పడిన సంస్థలు కావని అవి మానవులు తమ ప్రయోజనాలకోసం రూపొందించుకొన్నారని వాటిని తమతమ అవసరాలకు అనుగుణంగా మార్పులు చేశారన్న అవగాహన ప్రారంభంతో తులనాత్మక రాజకీయాల ఆధునిక అధ్యయనం ప్రారంభమైందని చెప్పవచ్చు. ప్రాచీన ఆధారాలను పక్కన పెటితే సాంస్కృతిక పునరుజ్జీవన యుగం రాజనీతి తత్వానికి ప్రాతినిధ్యం వహించిన మాకియవెల్లి నుంచి విజ్ఞతాయుగంకాలం నాటి మాంటెస్క్యూ రచనల్లో తులనాత్మక రాజకీయాల విశ్లేషణ కొంతవరకు చోటుచేసుకొన్నదని చెప్పవచ్చు

1.3.1 మాకియవెల్లి - సాంస్కృతిక పునరుజ్జీవనయుగం

14 వ శతాబ్దం రాజనీతి తత్వ విచారణకు ఆధునికయుగంగా ప్రసిద్ధి చెందింది. సాస్కృతిక పునరుజ్జీవనం, క్రైస్తవ మత సంస్కరణోద్యమం, జాతీయవాదం, నూతన సాధనాల అన్వేషణ, ఆర్థిక శక్తుల ఆవిర్భావం, మానవుడి దృష్టిని మతం నుంచి తన పరిసరాల వైపుకు మళ్ళించింది. పరమార్థిక ప్రయోజనాల నుంచి భౌతిక ప్రయోజనాలవైపు అతని ఆసక్తి మరలింది. తన పరిసరాలను అవసరాలను అవకాశాలను శాస్త్రీయ హేతుబద్ధ అనుభవపూర్వక దృక్పథంతో అధ్యయనం చేయటం ప్రారంభించాడు.

ఈ సందర్భంలో మాకియవెల్లి రచనలు ప్రస్తావించదగ్గవి. పతనావస్థలో ఉన్న దేశాన్ని సమీకృతం చేసి ప్రబలజాతి రాజ్యంగా రూపొందించటంలో పాలకులు విలువల కంటే, ఆదర్శాలకంటే, వాస్తవాలకు ఆచరణకు ప్రాధాన్యమివ్వాలని మాకియవెల్లి "ప్రిన్స్"లో సూత్రీకరించాడు. రాజనీతి అధ్యయనం కేంద్రలక్ష్యం అధికారాన్ని ఎట్లా

సంపాదించుకోవాలి, నిలబెట్టుకోవాలి. విస్తృతంచెయ్యాలి అన్న విషయానికే మాకియవెల్లి అత్యధిక ప్రాధాన్యమిచ్చాడు. అలాగే "Discourses on Live" అనే మరో గ్రంథంలో అభివృద్ధి చెంది స్థిరపడిన రాజ్యంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడటానికి అవసరమైన పూర్వ పరిస్థితుల గురించి విస్తృతంగా చర్చించాడు. ఈవిధంగా ఆధునికయుగ ప్రారంభంలో మాకియవెల్లి తులనాత్మక రాజకీయాల అధ్యయనానికి ఒక శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించాడని చెప్పవచ్చు.

1.3.2 మాంటెస్క్యూ - విజ్ఞతాయుగం

అదే విధంగా విజ్ఞతాయుగకాలంలో ఆధునిక రాజకీయ వ్యవస్థల్లో చర్చనీయాంశాలైన అనేక అంశాలను తత్వవేత్తలు ప్రస్తావించడం జరిగింది. దీనికి ఉదాహరణగా మాంటెస్క్యూ రచనలు "స్పిరిట్ ఆఫ్ ది లాస్" ను పేర్కొనవచ్చు.

మాకియవెల్లి వలె మాంటెస్క్యూ కూడా రాజనీతి పట్ల ఆసక్తి చూపించాడు. ఆయన ప్రఖ్యాత సిద్ధాంతమైన అధికార పృథక్కరణ సిద్ధాంతం వ్యక్తి స్వేచ్ఛను ఏవిధంగా కాపాడటం సాధ్యమో వివరిస్తున్నది. రాజ్యాంగపరంగా కార్యనిర్వహణ, శాసననిర్మాణ, న్యాయసంబంధిత అధికారాలు వ్యక్తులపరంగా, సంస్థాపరంగా వేరు వేరుగా ఉండాలని; కర్తవ్య పరంగా ఈ మూడు ఒకే వ్యక్తి లేదా సంస్థలో నిక్షిప్తమై ఉండకూడదని చెబుతున్నది. ఏ ప్రాతిపదికపై మాంటెస్క్యూ సదరు సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడో ఆ ప్రాతిపదిక సార్థకతను మనం ప్రశ్నించవచ్చు. కానీ రాజకీయ విశ్లేషణలో మాంటెస్క్యూ ఆసక్తిని అనుసరించిన దృక్పథాన్ని మనం తక్కువగా అంచనా వేయలేం. అతని సిద్ధాంతం యాంత్రికంగా కనిపించినప్పటికీ ఆధునిక తులనాత్మక అధ్యయనాలకు ఒక ప్రాతిపదికను కల్పించింది.

1.3.3 చారిత్రకత వాదం

మాంటెస్క్యూ భావాలు నూతన సామాజిక తత్వం ఆవిర్భవంతో మరుగునపడ్డాయి. చారిత్రకత, సామాజిక చారిత్రకవాద, సార్వజనీన చారిత్రక ఊహాగానం రచయితల దృష్టిని సర్వత్ర ఆకర్షించింది. కారణాలు చరిత్ర తుది లక్ష్యం గురించిన ఆలోచన రచయితల దృక్పథాన్ని ప్రభావితం చేశాయి. బొసాకే, కండోర్‌సెట్ సామాజిక ధృగ్గోచరం అధ్యయనం పట్ల ఎక్కువ ఆసక్తిని చూపించారు.

రాజకీయ సంస్థల అధ్యయనంలో చారిత్రక దృక్పథం చోటుచేసుకొంది. హేతువాదం, ప్రజాస్వామ్యం ఒకసారి చారిత్రకంగా ఆవిర్భవించాయని కండోర్‌సెట్ భావించగా; హేతువు, స్వేచ్ఛలపై హెగెల్, శాస్త్రీయ భావం గురించి కామ్టే చారిత్రకంగా అధ్యయనం చేశారు. ప్రజాస్వామ్య ఆశావాదుల ఆలోచనలకు భిన్నంగా భవిష్యత్తులో బ్యాంకర్ల నియంతృత్వం ఏర్పడుతుందని కామ్టే ఊహించగా; వర్గపోరాటం ద్వారా పీడిత ప్రజానీకానికి స్వేచ్ఛ లభిస్తుందని మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థ చారిత్రక అధ్యయనం ద్వారా భావించాడు.

చారిత్రకవాదం ప్రాముఖ్యం తగ్గిచాలాకాలం అయినప్పటికీ తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో చారిత్రక దృక్పథం ప్రభావం మాత్రం తగ్గిపోలేదు. నిజానికి చారిత్రకవాదం భావనలను ఈ నాటికీ ఉపయోగించటం-విజయవంతంగా వాడటం-జరుగుతున్నది. ఉదాహరణకు "వర్గం". "వర్గం" గురించి అనేక భిన్నాభిప్రాయాలున్నాయి. అది ఎలా ఏర్పడింది, ఏర్పడుతుంది. ఏకాలంలో ఏ సమాజంలో ఏఏ వర్గాలు రాజకీయ, సామాజిక రంగాలను ప్రభావితం చేశాయి. వర్గానికి ఆర్థికాభివృద్ధికి ఉన్న సంబంధం ఏమిటి మొదలైన చర్చనీయాంశాలు చారిత్రకవాదం నుంచి జనించినవే. అలాగే రాజకీయాలు-విద్య-సమాజం-సంస్కృతి మొదలైనవి అధ్యయనం చేయటానికి చారిత్రక వాదం చాలా దోహదం చేసింది.

చారిత్రకవాదం కొంతమేరకు రాజకీయ అనుభవాలను అధ్యయనం చేయటానికి ఉపకరించింది. జర్మన్ జాతీయ వాదాన్ని భావపర గతి తార్కిక ప్రక్రియద్వారా అధ్యయనం చేసిన హెగెల్, చైనా, ఇండియా, పర్షియా, బైజాంటిన్, ముస్లిం ప్రపంచాన్ని ప్రాచీన మధ్యయుగాల పాశ్చాత్య చరిత్రను విశ్లేషించాడు.

చారిత్రకవాదులు సామాజిక గతి తార్కికతల (Social dynamics) పట్ల ఆసక్తిని పెంచారు. ఈ సందర్భంలో

పరిణామాత్మక సిద్ధాంతం పేర్కొనతగింది. మానవ సంబంధాలు ఏవిధంగా సామాజీకృతం అయ్యాయి ? ఎలా కుటుంబాలు, గ్రామాలు, పట్టణాలు, రాజ్యాల ఆవిర్భావానికి దారితీశాయి ? ఏవిధంగా ఒక సమాజంలోని వివిన్న వర్గాలు ప్రాబల్యంకోసం సంఘర్షించాయి ? అన్వేషణ, నూతన శక్తుల ఆవిర్భావం సమాజంలోని వివిన్న వర్గాల దృక్పథంలో, ఆసక్తుల్లో మార్పులు తీసుకొచ్చాయి ? మొదలైన వాటికి సమాధానం చారిత్రక అధ్యయనం ఇస్తుంది.

తులనాత్మక రాజకీయాల అధ్యయనానికి చారిత్రకవాదం ఎంతో సహాయక సమాచారం అందించినప్పటికీ తులనాత్మక అధ్యయనం చారిత్రక వాదం. ప్రభావం నుంచి కొంతమేరకు బయటపడవలసివచ్చింది. చారిత్రక వాదులు ప్రతిపాదించిన సాధారణ సూత్రీకరణలు, విశాల సాధారణీకరణలు చాలావరకూ అమూర్తమైనవి. వాటికి సంబంధించిన విషయసేకరణ చాలా వరకు ఉదాహరణలు ఇవ్వటానికే ఉపకరిస్తుందే కాని, సిద్ధాంతం సార్థకతను సమీక్షించటానికి దోహదం చేయదు. చారిత్రకవాదులు అశేష సమాచారాన్ని ఉపయోగించి అనేక అంశాలపై సిద్ధాంతాలు రూపొందించారు. కానీ అవి చాలా వరకూ నిరుపయోగం అయ్యాయి. అయితే తులనాత్మక రాజకీయాల అధ్యయనవాదులకు కొన్ని ఆసక్తికరమైన సమస్యల విశ్లేషణకు అవసరమైన జిజ్ఞాసను కలిగించారు.

రాజనీతి అధ్యయనంలో చారిత్రకవాదానికి వ్యతిరేకంగా కొన్ని విమర్శలున్నాయి. ఇవి 18వ శతాబ్దంలోనే ఏర్పడ్డాయి. ఒక ముఖ్యమైన విమర్శ ఏమిటంటే చారిత్రకవాదం అమూర్త రాజకీయ విశ్లేషణకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. అతిభౌతికవాద, మనోవైజ్ఞానిక చట్టపరమైన ప్రాతిపదికలపై ప్రజాస్వామ్యాన్ని సమర్థించటానికి ప్రయత్నించింది. సదరు విమర్శల ప్రభావం తులనాత్మక రాజకీయాల అధ్యయనంపై కూడా పరోక్షంగా పడింది. ఫలితంగా చారిత్రకవాద ఆనంతర కాలాలలో రాజకీయభావాలను, సంస్థలను సంస్థాపరంగా తాత్వికపరంగా అధ్యయనం చేయటం ప్రారంభమైంది.

చారిత్రకత తత్వం ఎటువంటి లోపాలు కలిగి ఉన్నప్పటికీ ఒక సుగుణాన్ని మాత్రం వ్యక్తం చేసింది. ఆలోచనను సమాచారాన్ని ఏదో ఒకరకంగా సమన్వయం చేయటానికి ప్రయత్నించింది. కేవలంభావానికే కాక కొంత సమాచారానికి కూడా ప్రాముఖ్యమిచ్చింది. విషయం నుంచి భావం స్వతంత్రంగా ఉంటుంది. భావ వాస్తవీకరణ నుంచి భావం స్వతంత్ర పత్రిపత్తి కలిగి ఉంటుంది అని భావించిన హెగెల్ కూడా తన సిద్ధాంతాలను ప్రతిపాదిన్నన్నప్పుడు వాస్తవాలను కూడా పరిగణనలోకి తీసుకొన్నాడు. చారిత్రక వాదాన్ని విమర్శించిన వాడు ప్రారంభంలో వాస్తవానికి, ఊహాగానానికి మధ్య అస్పష్టమైన సమన్వయాన్ని చేయటానికి ప్రయత్నించక వాటిని పూర్తిగా విడదీశారు. ఫలితంగా రాజనీతి తత్వం అధ్యయనం వస్తుపరంగా తయారై వాస్తవాలు ఆలోచనారహితమైన విషయాలుగా మిగిలిపోయాయి.

రాజనీతి సమకాలీన అధ్యయనం ఒక ప్రత్యేక శాస్త్రంగా రూపొంది తులనాత్మక రాజకీయాల అధ్యయనం అందులో ఒక ప్రత్యేక ఉపభాగం అయింది.

1.4 లాంఛనప్రాయ - చట్టపరమైన అధ్యయనాలు

భావాన్ని, సమాచారాన్ని విడదీయటంవల్ల చారిత్రకతావాదానికి వ్యతిరేకంగా మరొక విమర్శ రావడానికి దోహదం చేసింది. ఇది తులనాత్మకరాజకీయ అధ్యయనంపై ప్రత్యక్ష ప్రభావం చూపించింది. లాంఛనప్రాయ రాజకీయసంస్థలపై రాజకీయవాస్తవాలు ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయంటే రాజ్యాంగం చట్టబద్ధ నిర్మాణం ఏవిధంగా ఒకసమాజంలోని అనేక వాస్తవ సరిస్థితులద్వారా ప్రభావితమవుతాయో విశ్లేషించడానికి తులనాత్మక రాజకీయాల అధ్యయనం దోహదం చేసింది.

లాంఛనప్రాయ చట్టబద్ధమైన ఏర్పాట్ల అధ్యయనం రాజనీతి అధ్యయనంలో ఒక భాగం కావటానికి ఒక ప్రధాన కారణం చారిత్రకవాదం సార్థకతను ప్రశ్నిస్తూ భావం పాత్రను పరిమితం చేయడానికి ప్రయత్నించటమే.

లాంఛననిర్మాణాలపై ఎక్కువ ఆసక్తి, చూపడానికి మరొకకారణం రాజ్యాంగతావాదం. రాజ్యాంగానికి సంబంధించిన పత్రాలు రాజ్యంగనిర్మాణానికి సంబంధించిన విశ్లేషణలు 19వ శతాబ్దంలో రచయితలను బాగా ఆకర్షించాయి. ఉదాహరణకు, బ్రిటిష్ రాజ్యాంగాన్ని గురించి అధ్యయనంచేస్తున్నప్పుడు ఇంగ్లండ్‌లో రాజ్యాంగం ఏరకంగా అభివృద్ధిచెందింది. ఇంగ్లండ్‌లోని లాంఛనప్రాయమైన సంస్థల నిర్మాణంలో ఏఏ చట్టాలు ఏఏకాలంలో దోహదంచేశాయి

మొదలైన వాటిని విశ్లేషించడానికి ప్రయత్నాలుజరిగాయి. నిజానికి ఇంగ్లండ్‌లో బ్రిటిష్ రాజ్యాంగానికి సంబంధించిన అధికార పత్రాలంటూ ఏవీలేవు. ఉన్నవి కేవలం బ్రిటిష్‌పాలకుడికి, ప్రజలకు మధ్య జరిగిన ఒప్పందాలు. లేదా రాజకీయసంబంధాలను సూచించే ప్రకటనలు, చట్టాలు. మాగ్నకార్టా బిల్ ఆఫ్‌రైట్స్ ఈకోవకు చెందినవే.

రాజకీయవ్యవస్థ సహజమైనదని భావించేవారెవరూ రాజ్యాంగం గురించి ఆలోచనచేయరు. రాజ్యాంగం, రాజ్యాంగతావాదం ఆధునిక కాలంలో ఏర్పడినవి. ఇవి గతకాలంలోనే చారిత్రక ఆంగిక సిద్ధాంతాలను తొలగించి వాటిస్థానాన్ని ఆక్రమించుకొన్నాయి. మానవసంబంధాలను-ఆర్థిక, రాజకీయ, సామాజిక సంబంధాలను మానవులేర్పాటు చేసుకొంటారని వారి వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాలకోసం కొన్ని నియమాలను చట్టపరంగా రూపొందించి అవి అందరికీ వర్తించే విధంగా అమలుచేస్తారన్న ప్రమేయంపై లాంఛనప్రాయరాజ్యాంగ నిర్మాణాలు రూపొందాయి. వీటి సంఖ్య 19వ శతాబ్దం ఉత్తరభాగంలో విశేషంగా పెరిగింది.

రాజ్యాంగంపట్ల యాంత్రికమైన దృక్పథం, విశ్వాసం రాజనీతిశాస్త్రాన్ని విపరీతంగా ప్రభావితం చేసింది. 19వ శతాబ్దంలో రాజనీతిశాస్త్ర అధ్యయనం తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం, సామాజిక శాస్త్రాలనుంచి స్వతంత్ర ప్రతిపత్తిని సంపాదించి లాంఛనప్రాయం చట్టపర రాజకీయ నిర్మాణాల అధ్యయనంగా రూపొందింది.

అయితే ఏ అంశాలను కేవలం రాజకీయమైనవిగా పరిగణిస్తాం ? రాజకీయ ప్రవర్తన ఇప్పుడు మనం అనుకొంటున్నట్లు చాలా వరకు ఇతర అధ్యయనాల, అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, సామాజికశాస్త్రం, సామాజిక వ్యక్తిగత మనోవిజ్ఞానం, సాంస్కృతిక మానవశాస్త్రం, అర్థశాస్త్రం మొదలైనవి వ్యక్తుల రాజకీయప్రవర్తనకు సంబంధించిన అనేక అంశాలను విశ్లేషిస్తాయి. ఏదైనా ఒక అంశం కేవలం రాజనీతి అధ్యయనానికి మాత్రమే ప్రత్యేకంగా చెందుతుంది అని భావించేవారు. ఇతర సంబంధిత అధ్యయనాలతో విశ్లేషణకు ఉపయోగించే పరికరాలను వినియోగించే అవసరం లేదు. ఈ అంశం కేవలం లాంఛనప్రాయ - చట్టబద్ధ రాజకీయ నిర్మాణం - రాజ్యాంగం, శాసనసభ, ప్రభుత్వం న్యాయశాఖ మొదలైనవి.

లాంఛనప్రాయం చట్టబద్ధ రాజకీయనిర్మాణాల అధ్యయనానికి ఈకాలంలో ప్రత్యేకత ఏర్పడటానికి ఒక ముఖ్యమైన కారణం పౌరులకు రాజకీయాలను గురించి శిక్షణ ఇవ్వడం అవసరమన్న భావమే. పౌరత్వం ప్రభుత్వపాలన చట్టంపట్ల అవగాహన మొదలైనవి ప్రజలలో ఎక్కువగా ప్రాచుర్యం పొందాలన్న అభిప్రాయం లాంఛనప్రాయ రాజకీయ నిర్మాణాల వర్ణనకు, విశ్లేషణకు దోహదంచేసింది.

1.5 రాజకీయ పరిణామాత్మకవాదం

చారిత్రకవాదానంతరకాలంలో తులనాత్మక రాజకీయాల అధ్యయనానికి సంబంధించినంతవరకు ఇప్పటివరకూ ప్రస్తావించినపరిణామాలు అసంపూర్ణమే. జర్మన్, అమెరికన్ రచయితలు రాజనీతిగురించి చేసిన అధ్యయనాల్లో అనాటి సమీపకాలంధోరణులను ప్రస్తావించడంలో చాలా వెనకబడ్డారు. అయితే కొందరు - ఉదాహరణకు బ్లంట్‌షిలీ "థియరీ ఆఫ్ స్టేట్" అనే గ్రంథంలో "అమూర్త సిద్ధాంతాలు" కేవలం అనుభవపూర్వకవాదం (mere empiricism) లను తిరస్కరించి వాస్తవ ఆలోచనకు ప్రాధాన్యమివ్వడానికి కొంతవరకు ప్రయత్నం చేశాడు. వీరు కొంతమేరకు తులనాత్మక రాజకీయాల అధ్యయనంపట్ల ఆసక్తికొనసాగేటట్లు చేశారు. పరిమాణాత్మక అధ్యయనం కూడా చారిత్రక వాద దృక్పథంలో భాగమే. ఇందులోకూడా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ మొదలైన భావాలు, ధ్యేయాలుగా కొన్ని అధ్యయనాలు కొనసాగాయి. మరికొంతమంది రచయితలు ఈ కోవకు చెందినవారైనప్పటికీ తులనాత్మక వ్యతిరేక కాలంలో (anti - Comparative period) సిద్ధాంతాన్ని, సమాచారాన్ని మిళితంచేసి దాదాపు చారిత్రకవాదుల మాదిరిగానే చాలా మేరకు ఆమూల్యంగా, సమకాలీన ప్రభుత్వాలకు లోనై లాంఛనప్రాయ రాజకీయ సంస్థల నిర్మాణాలను గురించి విశ్లేషించారు.

పరిణామాత్మక సిద్ధాంతాలుకూడా చారిత్రక వాదంలో భాగమే. అయితే అది దాదాపు ఆధునికకాలంలో మాదిరి సమాచారంపై ఆధారపడింది. అనుభవపూర్వక విషయసేకరణతోపాటు అవిమిళితమై ఉన్నాయి. సమకాలీన సమస్యను దృష్టిలోపెట్టుకొని వాటి పరిష్కారానికి సదరు సిద్ధాంతాలు పరిమితమయ్యాయి. ప్రాదేశిక రాజ్యాల

అవతరణ, దాని సమస్యలపై ఎక్కువగా ఆసక్తి చూపించారు. సంక్లిష్టరాజకీయ వ్యవస్థవికాసానికి మూలమైన నిర్మాణాలు, చట్టాలు, వాటికి సంబంధించిన అంశాలపై ఎక్కువగా ఆసక్తి చూపించాయి.

ఎటువంటి సిద్ధాంతాలను పరిమాణాత్మకవాదులు రూపొందించారు? వీరి సిద్ధాంతాలు ప్రధానంగా:
1. దశలవారీగా రాజకీయాభివృద్ధికి సంబంధించినవి
2. పరిణామాత్మక దశవైపు జరిగే చలనశక్తులకు సంబంధించినవి.

వీటిలో సర్వసామాన్యమైన సిద్ధాంతం రాజ్యావతరణకు సంబంధించినది. రాజ్యం ఏవిధంగా కుటుంబ ప్రాతిపదికపై క్రమంగా, దశలవారీగా అభివృద్ధి చెందిందో సదరు సిద్ధాంతం వివరిస్తుంది. "ప్రాచీనచట్టం" (Ancient Law - 1861) "సంస్థల తొలిచరిత్ర" (Early History of Institution - 1874) గ్రంథాల్లో పితృస్వామ్య కుటుంబవ్యవస్థ ప్రాతిపదికపై రాజకీయ జీవితం ప్రారంభమై, తెగలవారిగా వికాసం చెందింది. రాజ్యవ్యవస్థ అవతరణ ఏవిధంగా జరిగిందో వివరించాడు. హీబ్రూ గ్రీక్, రోమన్, ప్రాచీన భారతదేశ చరిత్రలను అధ్యయనంచేసి, విస్తారంగా సమాచారాన్ని సేకరించి దాని ఆధారంగా మైన్ తన సిద్ధాంతాన్ని రూపొందించాడు.

పై సిద్ధాంతానికి ప్రధాన ప్రత్యామ్నాయం ఏమి చెబుతుందంటే రాజ్యావతరణకు మూలం కుటుంబ వ్యవస్థకాదు; ఆదిమ సామాజికరూపాలు విచ్ఛన్నం కావడంతో వ్యక్తిగతకుటుంబాలు ఏర్పడి, వాటిని తిరిగి సమన్వయంచేసే ప్రక్రియలో రాజకీయ సమాజం ఆవిర్భవించింది. "రాజకీయాల సంక్షిప్త చరిత్ర" (A short History of Politics) "రాజ్యము - జాతి" (The State and Nation) గ్రంథంలో ఎర్ణ్డర్, గలిక్స్ అనే రచయితలు మైన్ వాదించిన విధంగా కాకుండా రాజ్యావతరణ దశ ప్రాచీన ఆదిమ సమాజంలో వేటాడే దశ నుంచి ప్రారంభమై మందలు (Clans) ఏర్పడి, అటుతరవాత కుటుంబాలు అవతరించి, కుటుంబాలనుంచి రక్త సంబంధేతర సమూహాలుగా మారి, అక్కడనుంచి వ్యక్తులు - రాజ్యం అవతరించాయి.

పై సిద్ధాంతం ప్రకారం రాజ్యావతరణం ప్రక్రియలో అనేక విభిన్న అంశాలు కనిపిస్తాయి. మతశక్తులకారణంగా - ముఖ్యంగా పితృస్వామ్య వ్యవస్థనుంచి రాజకీయగణాలవరకు రాజ్యం అవతరించిందని కొందరు రచయితలు వాదిస్తారు. "రాజనీతి శాస్త్రానికి ఉపోద్ఘాతం" (Introduction to political Science - 1896) అనే గ్రంథంలో సర్‌జాన్‌సీల్ రాజకీయసమాజం మతగురువులు, మంత్రగాళ్ళు, పితృస్వామిక వ్యవస్థపై చూపిన ప్రభావఫలితంగా దశలవారిగా ఆవిర్భవించిందని సిద్ధాంతీకరించారు. ఫ్రీజర్ సిద్ధాంతంకూడా ఈకోవకే చెందుతుంది. మైన్ వివరాలతో సమాజాలను లోతుగా అధ్యయనంచేసి ప్రాచీన ఈజిప్ట్ ఆదిమసమాజాలను - ఫ్రీజర్ తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

అయితే మరో కోవకు చెందిన సిద్ధాంతకర్తలు - ముఖ్యంగా ఓపెన్ హేమర్ "రాజ్యం" (The State - 1914) అనే గ్రంథంలో మతప్రాబల్యంవల్ల కాకుండా సామాజిక గణాల వైవిధ్యీకరణ ఫలితంగా విస్తృతగణాలను, వాటి విభిన్న ఆసక్తులకు సమన్వయపరిచే ప్రక్రియలో రాజ్యం అవతరించిందని వాదించాడు.

మరో దృక్పథానికి చెందిన రచయితలు రాజ్యావతరణ ఆర్థిక శక్తుల కారణంగా జరిగిందని భావిస్తారు. ఆర్థిక కార్యకలాపాల్లో మార్పులు సంభవించినప్పుడు సదరు ప్రభావం ఇతర రంగాలపై పడుతుందని - ముఖ్యంగా రాజకీయ సమాజం అవతరణకు మూలకారణం అసమానత్వమని మార్క్స్ సిద్ధాంతీకరించాడు.

18,19 వ శతాబ్దాల్లో ప్రాచుర్యం పొందిన పరిణామాత్మక సిద్ధాంతం ఇరవయ్యో శతాబ్దంలో మరుగునపడింది. రాజకీయ వ్యవస్థలనిర్మాణం, ప్రక్రియలో అనూహ్యమైన మార్పులురావడంతో రాజనీతిశాస్త్రరచయితలు రాజ్యం ఏవిధంగా ఆవిర్భవించింది అన్న అంశంపై ఊహాగానాలు వదిలేసి ఉన్న రాజకీయ వ్యవస్థ ఎలా పనిచేస్తుంది ? వివిధ రాజకీయ వ్యవవస్థలమధ్య నిర్వహణపరంగా వ్యత్యాసమేమిటి ? కొన్ని ఎందుకు బాగా పనిచేస్తున్నాయి ? విఫలమవుతున్నాయి. మొదలైన అంశాల విశ్లేషణకు అధిక ప్రాధాన్యమివ్వటం 20వ శతాబ్దంలో ప్రారంభమవటంతో పరిణామాత్మక సిద్ధాంతం ఆకర్షణను కోల్పోయింది.

ఎంతప్రాముఖ్యంకోల్పోయినప్పటికీ పరిణామాత్మక సిద్ధాంతాలు తులనాత్మక రాజకీయాల అధ్యయనం అభివృద్ధి దశల్లో కీలక పాత్ర నిర్వహించాయి. పాశ్చాత్య రాజకీయ వ్యవస్థల అధ్యయనంపట్ల సిద్ధాంతకర్తలకు ఆసక్తి కలిగించాయి. తులనాత్మక రాజకీయాల అధ్యయనం అన్నివైపులనుంచి ప్రతిఘటనను ఎదుర్కొంటున్న తరుణంలో

వివిధ దేశాల్లో, నాగరకతల్లో, దశల్లో రాజకీయ సంస్థల నిర్మాణం ఏవిధంగా దశలవారీగా జరిగిందో వివరిస్తూ తులనాత్మక రాజకీయ విశ్లేషణకు జీవం పోశాయి.

1.6 రాజకీయ సామాజిక శాస్త్రం ప్రారంభం

19, 20 వ శతాబ్దం ప్రారంభంనాటి రాజనీతి తత్వశాస్త్రం రచనలు అధ్యయనం చేసినవారు అప్పటికికూడా తులనాత్మక రాజకీయాల అధ్యయనం పూర్తిగా ఊపు అందుకోలేదని చెప్పగలరు. అయితే మొస్కా, పరేటో, మెచెల్ మొదలైన వారిని తొలిరాజకీయ సామాజిక అధ్యయనకర్తలుగా పేర్కొనవచ్చు. వీళ్ళందరూ విశేష సమాచారాన్ని సేకరించి విస్తృతరచనలు చేశారు. అయితే వారు రాజ్యాంగం, సంస్థలు, అధికార పత్రాల విశ్లేషణవంటి వాస్తవ రాజకీయసంబంధాలు, అధికారం అధ్యయనం పట్ల ఎక్కువ ఆసక్తి చూపించారు. లాంఛనప్రాయసంస్థల నిర్మాణం, నిర్వహణల కంటే వాటిని ప్రభావితంచేసే విభిన్న సామాజిక శక్తుల అధ్యయనం అవసరమని భావించారు.

రాజకీయ, సామాజిక అధ్యయనకర్తలు కేవలం రాజ్య వ్యవస్థకే పరిమితం కాకుండా సంబంధిత రంగాలపై దృష్టి సారించారు. ప్రభుత్వం నుంచి రాజకీయ సమాజాలు, వివిధ సామాజిక వర్గాలు, ప్రభావ వర్గాలు సంబంధితభావనలు, ప్రమేయాలు అధ్యయన భాగాలయ్యాయి. వీటిని అధ్యయనం చేయడానికి తులనాత్మక పద్ధతులను ఉపయోగించారు. క్లుప్తంగా చెప్పాలంటే భావపరంగా, అధ్యయన దృక్పథం పరంగా సామాజిక రాజకీయ శాస్త్ర అధ్యయనకర్తలు తులనాత్మక అధ్యయనానికి అవసరమైన స్ఫూర్తిని కలిగించారు. ఫలితంగా తులనాత్మక రాజకీయవ్యవస్థలు తమ అధ్యయనం కోసం తొలి సామాజిక రాజకీయ శాస్త్రవేత్తల నుంచి అనేక అంశాలను తిరిగి కనుక్కొని, తిరిగి నేర్చుకోవలసి వచ్చింది.

1.7 లాంఛనేతర రాజకీయాలు

తులనాత్మక రాజకీయాలకే పరిమితం కాకుండా లాంఛన రహిత రాజకీయాల అధ్యయనం అమెరికాలో రాజకీయ ప్రముఖులు, ఆసక్తి వర్గాల విశ్లేషణతో ప్రారంభమైంది. ఈ ఆసక్తి ఎందుకు ప్రాముఖ్యం పొందిందంటే రాజకీయ పక్షాలు, ఆసక్తి వర్గాలు - ఖచ్చితంగా చెప్పాలంటే రాజ్యాంగ - చట్టబద్ధ నిర్మితులుకావు. అవి రాజకీయాలను ఇతర సామాజిక దృగ్గోచరంతో జోడిస్తాయి కాబట్టి వాటి అధ్యయనం ప్రాముఖ్యం సంతరించుకొంది. రాజకీయ వ్యవస్థ రాజ్యాంగ - చట్టబద్ధ నిర్మితులకంటే ప్రజానీకంపై ఇవి ఎక్కువ ప్రభావం చూపుతాయి. కింది కారణాలు 1920,30 సంవత్సరాల్లో అనియత రాజకీయ అధ్యయనం పట్ల ఆసక్తిని కలిగించాయి :

1. ఈకాలంనాటికి రాజకీయ పక్షాలు, ప్రధానవర్గాలు ఇంతకుముందుకంటే అనేక దేశాల రాజకీయాల్లో ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తున్నాయి.

2. రాజకీయ బహుతావాదం - సార్వభౌమాధికారం రాజ్యంనుంచి సంస్థలకు బదిలీచేయాలన్న వాదం వాటి ప్రభావాలను అధికంచేశాయి. ఫలితంగా సమాజంలోని వివిధవర్గాల ఆసక్తుల వ్యక్తీకరణ, సాఫల్యాల కోసం రాజకీయపక్షాలు, ఆసక్తి వర్గాలు అవతరించి రాజనీతిశాస్త్రవేత్తల ఆసక్తిని ఆకట్టుకొన్నాయి.

3. రాజ్యాంగ రూపాలకు, రాజకీయవాస్తవాలకు మధ్య నానాటికి పెరుగుతున్న అగాధం కూడా రాజనీతి విద్యార్థుల ఆసక్తిని రాజకీయ పక్షాలు, ఆసక్తివర్గాల అధ్యయనం వైపు మళ్ళించాయి.

జర్మనీలో వైమార్ రిపబ్లిక్ పతనం తరవాత రాజ్యాంగాలు, రాజకీయ నిర్మాణాలు చట్టపరంగా ఎంత పటిష్ఠంగా రూపొందినప్పటికీ వాస్తవంలో అవి పనిచేయటంలో విఫలం కావటానికి కారణం ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, రాజకీయాలపట్ల అసహనం. దీనిని విశ్లేషించినట్లయితే అనియత రాజకీయాల ప్రాముఖ్యాన్ని మనం మరింత సులభంగా అర్థం చేసుకోవచ్చు.

1.8 ఆధునిక ప్రజాస్వామ్యాలు

బ్రైస్ రచించిన "ఆధునిక ప్రజాస్వామ్యాలు" కొత్త పాతల మేలుకలయిక. ప్రాచీన గ్రీక్ దేశం మొదలుకొని లాటిన్ అమెరికా, న్యూజిలాండ్, ఫ్రాన్స్, స్విట్జర్‌లాండ్, కెనడా దేశాల ప్రజాస్వామ్యాలను విహంగ వీక్షణంగా అధ్యయనంచేశాడు. ఇందులో అధికభాగం లాంఛనప్రాయ సంస్థలకు కేటాయించడం జరిగింది. అయితే అదే సమయంలో బ్రైస్ అనియత రాజకీయాలను, రాజకీయపక్షాలను కూడా చర్చించాడు.

బ్రైస్ అందించిన అపారసమాచారం విస్తృత ప్రాతిపదికపై రాజకీయాలను విశ్లేషించడానికి ఉపయోగపడుతుంది. తులనాత్మక విశ్లేషణ ద్వారా ఒక ప్రత్యేక పరిష్కారానికి, తులనాత్మక రాజకీయాల అధ్యయన విద్యార్థులకు బ్రైస్ రచన ఉపకరిస్తుంది. అతడు అనుసరించిన పద్ధతి ప్రయోజనం, ఎంచుకొన్న సమస్య "ఆధునిక ప్రజాస్వామ్యాలు' గ్రంథం అంతర్జాతీయ ఆసక్తిని ఆకర్షించేలా చేశాయి.

అనుభవవాదం ఆధారంగా ఆకర్షించేలా చేశాయి. దోషాలను విశ్లేషించటం బ్రైస్ ప్రాథమిక లక్ష్యం. అంతేకాకుండా ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా లేదా అనుకూలంగా చేసిన అమూర్తవాదాలు వాస్తవంలో ఏమేరకు సమాజం పరిశీలించాలో కూడా అధ్యయనం చేయడమే బ్రైస్ లక్ష్యం.

బ్రైస్ ఉద్దేశ్యంలో సాధారణంగా ప్రజాస్వామ్యానికి సంబంధించిన వాదం మొదట సమాజహక్కులు మానవులకు ఉండాలంటుంది. ఆటుతరవాత తార్కికంగా మానవుడి హక్కులు, స్వేచ్ఛ ఒక్క ప్రజాస్వామ్య వ్యవస్థలోనే మనగలుగుతాయి, కాబట్టి ప్రజాస్వామ్య సంస్థలను బలపరచడం జరుగుతుంది. స్వేచ్ఛ, సమానత్వం వాంఛనీయత స్వయం నిరూపణభావాలుగా బ్రైస్ తీసుకొని వాటి ఆధారంగా ప్రజాస్వామ్యాలను విశ్లేషించడానికి ఆయన ప్రయత్నించాడు.

వాస్తవాలను, సిద్ధాంతాలను మిళితం చేయటంలో బ్రైస్ అనుసరించిన పద్ధతి పురాతనమైనది. ప్రస్తుతకాలానికి అది వర్తించదు. ఎందుకంటే వాస్తవాలు వాటంతట అవే ఏమీ చెప్పదు. వాటినుంచి భవిష్యత్పరిణామాలను మనం అంచనావేయగలగాలి. బ్రైస్ అనుకొన్నట్లు వాస్తవాలు స్వయం వివరణ ఇవ్వవు.

1.9 రాజ్యాంగ ప్రభుత్వం -ప్రజాస్వామ్యం

ఫ్రెడ్రిక్ రచించిన "రాజ్యాంగ ప్రభుత్వం ప్రజా స్వామ్యం" (Constitutional Government and Democracy) 19వ శతాబ్దం నాటి అమూర్త రాజకీయ భావాలను చర్చించింది. వీటిని స్పష్టంగా అనుభవపూర్వక భాగాలతో సమన్వయం చేయడానికి ప్రయత్నించలేదు. కనీసం బ్రైస్ అమూర భావాలను వాస్తవ సమస్యల దృక్పథంతో విశ్లేషించడానికి ప్రయత్నం చేశాడు. అయితే సదరు ప్రయత్నం ఫ్రెడ్రిక్ రచనల్లో కనబడదు. అయితే "ఆధునిక ప్రజాస్వామ్యాల"తో పోలిస్తే "రాజ్యాంగ ప్రభుత్వం - ప్రజాస్వామ్యం" కొన్ని అడుగులు ముందుకు వేసింది.

వివిధ దేశాలకు సంబంధించిన అనుభవపూర్వక సమాచారాన్ని దేశపరంగా ప్రస్తావించకుండా వాటిని అనేక కర్తవ్య - నిర్మితుల తరహాల్లో, వివిధ సైద్ధాంతిక ఉహాగానాలపరంగా వినియోగించాడు. చాలావరకు ఈసమాచారం, విశ్లేషణ పశ్చిమదేశాల రాజకీయ వ్యవస్థలకే పరిమితమయ్యాయి. దేశాలవారీగా సంపాదించిన సమాచారం క్రమబద్ధతకోసం విశిష్టతను గురించి మాత్రం కాదు. అంతేకాకుండా ఫ్రెడ్రిక్ నూత్రీకరించిన అనేక రకాల లాంఛనప్రాయచట్టబద్ధ రాజకీయ నిర్మితులకే పరిమితమయ్యాయి.

ఫ్రెడ్రిక్ ప్రధాన లక్ష్యం రాజ్యాంగ ప్రభుత్వం విజయానికి అనుకూల పరిస్థితులను చర్చించటం. అదే సమయంలో ఉన్న వివిధ వ్యవస్థలను పరిశీలించి సదరు పరిపాలన ఆధారంగా రాజ్యాంగతావాదానికి సంబంధించిన కొన్ని సూత్రాలను రూపొందించటం. దీనికి గాను అతడు మౌలికంగా "సాంస్కృతిక పరిష్కారాన్ని ఎంపిక చేసుకొన్నాడు. రాజ్యాంగ ప్రభుత్వం. ప్రజాస్వామ్యం. రాజకీయాల్లో "తీవ్రత" (intensity) వల్ల ప్రమాదాన్ని ఎదుర్కొంటాయిని - ముఖ్యంగా మౌలిక ప్రక్రియ పట్ల తీవ్ర అభిప్రాయవిభేదాలు చివరికి తుదిరాజకీయ లక్ష్యాలను దెబ్బతీస్తాయని

ఫ్రెడ్రిక్ వాదిస్తాడు. తీవ్రత ప్రజల సమ్మతికి సంబంధించి ఉంటే వ్యతిరేకత ఒక్క సమాజంలో అదుపులపై ఆధారపడి ఉంటుంది. ఈ రెండింటినీ సాధారణ పరిజ్ఞానం, మనోవైజ్ఞానిక స్థితి, సాధారణ రాజకీయ అనుభవం నిర్ధారిస్తాయి.

ఫ్రెడ్రిక్ రచన మూడు సైద్ధాంతిక భావాలను ప్రతిపాదించింది అవి :

1. ప్రజాస్వామ్యం పటిష్ఠంగా పనిచేయాలంటే కొన్ని పూర్వ పరిస్థితులు అవసరం. ఇవి మళ్ళీ రెండు రకాలుగా ఉంటాయి. కొన్ని సంస్థాగత నిర్మాణానికి సంబంధించినవి. ఉదాహరణకు, బాధ్యతాయుతమైన ఉద్యోగిస్వామ్యం. మరికొన్ని సామాజిక, ఆర్థిక సాంస్కృతిక పూర్వ పరిస్థితులు. ఉదాహరణకు సమర్థవంతమైన ఆర్థికవ్యవస్థ రాజకీయాల్లో తక్కువస్థాయి తీవ్రత, పటిష్ఠమైన రాజ్యాంగ ప్రతికలు.

2. ప్రజాస్వామ్య వ్యవస్థ సమర్థతో పనిచేయడానికి పూర్వ పరిస్థితుల రూపంలో కాకుండా మరికొన్ని అంశాలను ఫ్రెడ్రిక్ ప్రతిపాదించాడు. ప్రజాస్వామ్య సంస్థల నిర్వహణ, అనుకూల వాతావరణం, సుస్థిర రాజకీయ సంప్రదాయాలు, న్యాయసమీక్షాధికారం, బహుళత్వ ఎన్నికల పద్ధతి (Plurality of Electoral system), అనుభవం గల రెండు పార్టీల వ్యవస్థ.

3. పై వాటితోపాటు అనేక చలాంకాలను కూడా ఫ్రెడ్రిక్ ప్రస్తావించాడు. వివిధ వ్యవస్థల విశ్లేషణలో ముఖ్యమైన చలాంకాలు - ఆయన ఉద్దేశంలో - రాజకీయ దృక్పథాలు, రాజ్యాంగ నిర్మాణం, వివిధ సామాజిక వర్గాల మధ్య సమతౌల్యం, చరిత్ర, వ్యక్తిత్వం (అంటే నాయకత్వం) - ఇవన్నీ ఆయన విశ్లేషణలో కనిపించే చలాంకాలు

రాజకీయ విశ్లేషణలో "రాజ్యాంగప్రభుత్వం - ప్రజాస్వామ్యం" కర్తవ్య దృక్పథాన్ని ప్రారంభించిన మొదటి ప్రయత్నమని చెప్పవచ్చు. ఇది పూర్తిగా తులనాత్మక అధ్యయనం. ఎందుకంటే కర్తవ్యభావన నిర్మితుల నిర్వచనం కంటె తులనాత్మక అధ్యయనానికి దగ్గరగా ఉంటుంది. ఇది పూర్తిగా మధ్య తరహా సిద్ధాంతం ప్రాతిపదికపై రాజకీయ సంస్థల నిర్మాణం, ప్రవర్తనలకు ప్రాధాన్యమిచ్చింది. చారిత్రకవాదుల మాదిరి ఫ్రెడ్రిక్ పూర్తిగా వాస్తవాలు అధ్యయనంచేయలేదు. అలాగని సంకుచిత దృక్పథంతో కేవలం లాంఛనప్రాయ చట్టబద్ధ నిర్మితులకే పరిమితం కాలేదు. అతడు ప్రతిపాదించిన మధ్యస్థాయి సిద్ధాంతాలు రాజకీయ పక్షాలు, గణాలు రాజకీయ ప్రక్రియలో ఏవిధంగా స్పందిస్తాయి, పనిచేస్తాయి. మరింత విస్తృతార్థంలో చెప్పాలంటే సాంస్కృతిక, సామాజిక, చారిత్రక అంశాల ప్రభావాన్ని ఆయన విశ్లేషించాడు. అయితే ఫ్రెడ్రిక్ రచనతో మనం మాంటెస్క్యూ నుంచిన సామాజిక దృక్పథానికి తిరిగినచ్చాం.మొస్కా, పరేటో,వెబర్‌ల రాజకీయ, సామాజిక వాదాలను రాజనీతిశాస్త్రంతో సమన్వయం చేయటానికి ప్రయత్నించాడు. అయితే "స్పిరిట్‌ఆఫ్ ది ఫిలాసఫీ" లో కనిపించే తీవ్ర "రాజ్యాంగ ప్రభుత్వం" - ప్రజాస్వామ్యంలో లేదు.

1.10 తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో ఇటీవలి పరిణామాలు

యుద్ధానంతర రాజనీతి అధ్యయనంలో తులనాత్మక రాజకీయాలు ప్రముఖంగా చోటు చేసుకొన్నాయి. అయితే చాలావరకు అధ్యయనం ఇంకా సార్వభౌమాధికారం వ్యవస్థకే పరిమితమయింది. ఇంకా చెప్పాలంటే పాశ్చాత్య రాజ్యాల మధ్య తులనాత్మకత పరిమితమైంది. విశ్లేషణకు ఉపయోగించిన భావనలు చాలవరకూ సాంప్రదాయకమైనవి. సాంకేతికమైనవి. యుద్ధం మధ్యకాలంలో చాలావరకూ తాత్కాలిక, సాధారణ పరిజ్ఞానపరమైన సిద్ధాంతవివరణ ప్రాబల్యం వహించింది.

అయితే యుద్ధానంతరకాలంలో తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో కనిపించిన ధోరణులు ఎటువంటివి? అవి :

1. పాశ్చాత్యేతర వ్యవస్థల అధ్యయనం, దాని అనుభవపూర్వక క్షేత్రం మరింత విస్తృతమయింది.

2. యుద్ధపూర్వకాలంలో స్పష్టంగా కనిపించిన క్రమబద్ధ అధ్యయన తీవ్రతల స్థానంలో మరింత శాస్త్రీయ దృక్పథం, సంప్రదాయేతర పద్ధతుల వినియోగం, విశ్లేషణ పద్ధతులు అధికమయ్యాయి.

3. సామాజికవర్గం రాజకీయ పాత్ర విశ్లేషణకు ఎక్కువ ప్రాధాన్యమివ్వటం జరిగింది. రాజకీయ, సామాజీకరణకు ఉపయోగపడే అంశాల ప్రస్తావన అధికంగా చోటుచేసుకొంది.

4. రాజకీయ వ్యవస్థలు నిశిత విమర్శకు గురి అయ్యాయి. ఇతర సామాజిక శాస్త్రాలనుంచి స్వీకరించిన భావనపరమైన అంశాల దృక్పథంలో అనేక ప్రశ్నలు రేకెత్తించి - ముఖ్యంగా నిర్మితి-కర్తవ్య విశ్లేషణపరంగా-అధ్యయనాలు కొనసాగాయి. ఫలితంగా రాజనీతి శాస్త్ర అధ్యయనం మరింత వాస్తవాలపరంగా అభివృద్ధి చెందింది.

1.11 పాశ్చాత్యేతర వ్యవస్థల అధ్యయనం

రెండో ప్రపంచయుద్ధానంతరం ఆవిర్భవించిన అనేక ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, నూతన రాజ్యాలు, వలస వాద ప్రభావాలకులోనై చాలావరకూ పాశ్చాత్య రాజకీయనిర్మాణాలను అనుసరించాయి. అయితే ఆదేశాల్లో ఒకటి, రెండు మినహాయిస్తే రాజకీయ ప్రజాస్వామ్యం, పాశ్చాత్య భావనలు విజయవంతంకాలేదు. ఫలితంగా రాజకీయ రచయితల దృష్టిని అవి ఆకర్షించాయి. వాటి అధ్యయనానికి లభ్యమైన ఆర్థిక మద్దతు, అంతర్జాతీయ వాతావరణం (ప్రచ్ఛన్నయుద్ధం) అభివృద్ధిచెందుతున్న దేశాల్లో అలజడులు మొదలైనవి పాశ్చాత్య రాజనీతిశాస్త్ర రచయితల్లో నూతనంగా ఆవిర్భవించిన దేశ అధ్యయనం పట్ల ఆసక్తి కలిగించాయి.

కేవలం యుద్ధానంతర రాజకీయాలే పాశ్చాత్యేతర వ్యవస్థల అధ్యయనం పట్ల ఆసక్తిని కలిగించాయని చెప్పటం పూర్తి సత్యంకాదు. పైన ప్రస్తావించిన అనేక అంశాలతో పాటు రాజనీతి రచయితల విద్యాపరమైన ఆసక్తి, సదరు వ్యవస్థల అధ్యాయనానికి దోహదంచేసింది.

యుద్ధానంతరం పాశ్చాత్యేతర వ్యవస్థల అధ్యయనం పట్ల పెరిగిన ఆసక్తికి మరో ముఖ్యమైన కారణం యుద్ధానికి పూర్వం పాశ్చాత్యప్రపంచంలో ఉన్న రాజకీయ పరిస్థితులు. జర్మనీ, ఇటలీ దేశాల్లో కుడిపక్ష నియంత్రత్వాల పాలన, రష్యాలో వామపక్షకమ్యూనిస్టునియంతృత్వ వ్యవస్థల అవతరణ కూడా సదరు అధ్యయనం తీవ్రతకు దోహదం చేశాయి.

1.12 శాస్త్రీయ దృక్పథం ప్రాచుర్యం

బహిర్గత ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయకుండా తులనాత్మక అధ్యయనం పరిధి యుద్ధానంతరకాలంలో విస్తృతమవుతుందని, అందువల్ల ఆశించటం జరిగింది. దీనితోపాటు శాస్త్రీయ దృక్పథం పట్ల ఆపక్తిని పెంచడం కూడా ఒకటి. బహిర్గత కారణాలు యుద్ధానంతరకాలంలో శాస్త్రీయదృక్పథం తులనాత్మక అధ్యయనంలో చోటుచేసుకోవటానికి కింది కారణాలు దోహదం చేశాయి :

1. మధ్యతరహా సిద్ధాంతాలు

2. స్పష్టమైన సిద్ధాంతచట్రం.

3. వివిధ సిద్ధాంతాల సార్థకతను పరీక్షించటానికి గుణాత్మక పద్ధతుల ప్రయోజనం శాస్త్రీయదృక్పథం తీవ్రతను పెంచాయి.

పైన పేర్కొన్న కారణాలతోపాటు ప్రవర్తనావాద దృక్పథం కూడా తులనాత్మక రాజకీయాల అధ్యయనాన్ని చాలా ప్రభావితంచేసింది. సామాజిక శాస్త్రం, సాంస్కృతిక మానవశాస్త్రం ప్రభావంకూడా దీనికి దోహదంచేసింది. ప్రత్యేకంగా పాశ్చాత్యేతర రాజకీయ వ్యవస్థల అధ్యయనానికి సదరు పరిణామాలు ఆసక్తి పెంచాయి.

రాజకీయసంస్థల అధ్యయనంలో వాటి సామాజిక, చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక పూర్వరంగం విశ్లేషణ ప్రాముఖ్యం పొందింది. ఎందుకంటే రాజకీయ సంస్థలు, భావాలు, ప్రజానీకంపై వాటి ప్రభావం, రాజకీయ ప్రక్రియలో ప్రజలు పాల్గొనటం మొదలైనవన్నీ పై ప్రభావాలు నిర్దేశిస్తాయి. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా

సంస్థలు, వాటి విధులు, జయాపజయాల అధ్యయనం పేలవంగా, అర్థరహితంగా ఉంటుంది.

అంతేకాకుండా సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనంచేయటం ద్వారా వివిధ సిద్ధాంతాల సార్థకతను పరీక్షించటం సులభమవుతుంది. ఉదాహరణకు - సంపద, ఆర్థికాభివృద్ధి, జనాభా, వృత్తి పర పంపిణీలు ఒక దేశ రాజకీయ వ్యవస్థ నిర్వహణ, ప్రక్రియలను ప్రభావితంచేస్తాయి. అందువల్ల వాటి నేపథ్యంలో రాజకీయవ్యవస్థలను విశ్లేషించవలసి ఉంటుంది. ఈకారణం వల్ల వివిధ రాజకీయ వ్యవస్థల మధ్య వైవిధ్యం ఆ నేపథ్యంలో ఉన్న వ్యత్యాసం తులనాత్మక రాజకీయాల అధ్యయనం ప్రాముఖ్యానికి దోహదంచేశాయి.

1.13 నిర్మితి - విధుల విశ్లేషణ :

యుద్ధానంతరకాలంలో తులనాత్మక రాజకీయ అధ్యయనంతో నిర్మితి-విధుల దృక్పథం కూడా ఎక్కువగా చోటుచేసుకోవటం ప్రారంభమైంది. ఈ విషయంలో నిర్మితి - విధుల విశ్లేషణ దేనికి ఉపకరిస్తుంది ? ఇది మొదట 'రాజకీయాలను' నిర్వచించటానికి ప్రయత్నిస్తుంది. రాజకీయవ్యవస్థలను రెండు రకాలుగా-లాంఛనప్రాయ సంస్థల నిర్మితుల పరంగా, "ప్రభుత్వం", సార్వభౌమత్వరాజ్యాలు" లేదా సామాజిక నిర్మితుల పరంగా, అవి రాజకీయాల్లో నిర్వహించే కర్తవ్యపరంగా-నిర్వచించవచ్చు.

రెండో నిర్వచనాన్ని నిర్మితి-విధులపరమైనదిగా పరిగణించవచ్చు. ఇటువంటి నిర్వచనం ఈనాడు సాధారణమైంది. కేవలం సార్వభౌమత్వ రాజ్యంగా ఒక రాజకీయ వ్యవస్థను నిర్ణయించే పరిస్థితిలో నేడు మనంలేము.

నిర్మితి విధులు నిర్వచనం సమాజంలోని అతిపెద్ద విభాగంపై చూపించే ప్రభావపరంగా రాజకీయ వ్యవస్థను విశ్లేషించడానికి ప్రయత్నిస్తుంది. అలాగే ఒక వ్యవస్థ సార్థకత, దాని సుస్థిరత, సమర్థవంతమైన నిర్వహణలను విశ్లేషించటం నిర్మితి-కర్తవ్య దృక్పథం ప్రధాన ధ్యేయం.

నిర్మితులు-విధులు దృక్పథం ఉన్న రచయితలు వివిధ వ్యవస్థలను వర్గీకరించి కొన్ని సమస్యల పరిష్కారానికి మార్గాలు సూచిస్తారు.

తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో నిర్మితులు-విధుల పద్ధతి నానాటికీ ప్రాముఖ్యం సంతరించుకొంది. దీనికి అనేక కారణాలు దోహదం చేశాయి. వాటిలో ముఖ్యమైనవి.

1. అతివేగంగా మారుతున్న సమకాలీన పాశ్చాత్యేతర వ్యవస్థలు. అభివృద్ధి చెందుతున్న రాజ్యాల్లో తరుచు సంభవిస్తున్న మార్పులు, త్వరితగతిన ఏర్పడుతున్న పరిణామాలు, నిర్మితలు-విధుల దృక్పథం, ఆ సమాజాల అధ్యయనానికి అనువర్తింపచేయడానికి దోహదం చేసింది.

2. సామాజిక గతితార్కికాలను (Social dynamics) విశ్లేషించడానికి పై పద్ధతిని పాశ్చాత్య రచయితలు చాలావరకు ఉపయోగించడం జరుగుతున్నది.

3. త్వరితంగా మార్పులు చెందుతున్న సామాజిక, రాజకీయ వ్యవస్థలను అధ్యయనంచేయటానికి నిర్మితి-విధుల పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

4. సామాజిక అంతర్‌సంబంధాల అధ్యయనానికి ఈపద్ధతిని అత్యంత సమర్థవంతమైందిగా సర్వత్రా గుర్తించటం.

1.14 ముగింపు

ఈవిధంగా తులనాత్మక రాజకీయాల అధ్యయనం వివిధ దశల్లో - ప్రాచీన గ్రీకుల కాలంనుంచి ప్రస్తుత కాలంవరకూ - అనేక రకాలుగా అభివృద్ధిచెందింది. ప్రారంభంలో భావాలకు, ప్రమేయాలకు ప్రాధాన్యమిచ్చింది. అటుతరవాత విలువలతో కూడిన సిద్ధాంతాలు అవతరించాయి. ఆ తరవాత ఆధునిక కాలంలో - అంటే 18, 19

వ శతాబ్దాలలో లాంఛనప్రాయ చట్ట బద్ధ రాజకీయ సంస్థల నిర్మితులపై - రాజ్యాంగాలు, సంస్థలు - తులనాత్మక రాజకీయాల అధ్యయనం తన దృష్టిని సారించింది. 20వ శతాబ్దం ప్రారంభంనాటికి జాతీయ అంతర్జాతీయ రంగాల్లో ఏర్పడిన మార్పులు - ముఖ్యంగా రెండోప్రపంచ యుద్ధా నంతరం నూతనంగా ఆవిర్భవించిన పాశ్చాత్యేతర రాజ్యాలు తులనాత్మక రాజకీయాల అధ్యయనం, దృక్పథాలు విప్లవాత్మకమైన మార్పులు తీసుకొని వచ్చాయి. ఫలితంగా ఈనాడు తులనాత్మక రాజకీయాల అధ్యయనం సాంప్రదాయక వర్ణన, లాంఛనప్రాయ నిర్మితుల విశ్లేషణ శృంఖలాలనుంచి విముక్తి, పొంది శాస్త్రీయ దృక్పథంతో వ్యవస్థల అధ్యయనం చేయడం ప్రారంభమైంది.

– డా. వి. రవీంద్ర శాస్త్రి

1.15 చదువదగిన పుస్తకాలు

Jean blondel	:	*An Introduction to comparative government*
Apter	:	*Introduction to political analysis*
Johari J.C	:	*Comparative Politics*
Deol D.	:	*Comparative Government And Politics*
Sharan. P.	:	*Theory of comparative politics.*

1.16 నమూనా పరీక్షా ప్రశ్నలు

కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో జవాబులు రాయుము.

1. తులనాత్మక రాజకీయాల అధ్యయన వృద్ధిని విశ్లేషింపుము.
2. తులనాత్మక రాజకీయాలంటే ఏమిటి ? వివరింపుము
3. తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో ఇటీవలి పరిణామాలను పేర్కొనుము

కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా సమాధానాలు రాయుము.

1. శాస్త్రీయ దృక్పథం అనగానేమి
2. నిర్మితి - విధుల విశ్లేషణ
3. రాజకీయ సమాజ శాస్త్రం

...

Dr. BRAOU
LIBRARY
Acc. No: C M-0138
Class No: 320

భాగం - 2: తులనాత్మక రాజకీయాల అధ్యయన దృక్పథాలు

విషయ క్రమం

2.1 లక్ష్యాలు
2.2 పరిచయం
2.3.0 సాంప్రదాయక అధ్యయన పద్ధతి.
2.3.1 తులనాత్మకత లేని పద్ధతి
2.3.2 వర్ణనాత్మకత
2.3.3 సంకుచితస్వభావం
2.3.4 స్తబ్దతాస్వభావం
2.3.5 కల్పితరచనలు
2.3.6 సాంప్రదాయిక సాహిత్యంలో సమస్య దృక్పథం
2.3.7 ప్రాంతీయ అధ్యయనాలు
2.3.8 సాంప్రదాయిక దృక్పథంలో కేంద్రాంశం
2.4 విమర్శనాత్మక పున:పరిశీలన
2.5 ఆధునిక పద్ధతులు
2.6 ప్రవర్తనావాదం
2.7 వ్యవస్థల విశ్లేషణ పద్ధతి - ఈస్టన్
2.8 ఉత్పాదక - ఉత్పాదిత దృక్పథం
2.9 నిర్మితులు-విధుల విశ్లేషణ
2.10 మార్క్సిస్టు దృక్పథం
2.11 ముగింపు
2.12 చదువదగిన పుస్తకాలు
2.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

2.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

* తులనాత్మక రాజకీయాల అధ్యయనంకన్నా ముందున్న అధ్యయన దృక్పథాలు
* ప్రవర్తనావాదం వల్ల ఆవిర్భవించిన నూతన దృక్పథాలు,
* మార్క్సిస్టు దృక్పథాన్ని బాగా వివరించగలుగుతారు.

2.2 పరిచయం

సాంప్రదాయక పద్ధతిని గురించి క్లుప్తంగా చర్చిస్తే ప్రభుత్వాల తులనాత్మక అధ్యయనంపట్ల ప్రస్తుతం కలుగుతున్న అసంతృప్తిని అర్థంచేసుకోవచ్చు. అప్పుడు తులనాత్మకరాజకీయ అధ్యయనంలో మార్పులు తీసుకొనిరావలసిన అవసరాన్ని మనం గుర్తించవచ్చు. తులనాత్మక అధ్యయనం ఇంతవరకూ పేరుకుమాత్రమే తులనాత్మకంగా ఉంది. వివిధ దేశాల ప్రభుత్వాల లాంఛనప్రాయ నిర్మాణాలు, సంస్థలను వర్ణిస్తూ వాటి చారిత్రక అభివృద్ధిని నిర్వచించటం జరిగింది. రాజ్యాంగాలకు సంబంధించిన వివిధ చారిత్రక ఘట్టాలను, అధికారపత్రాలను ఆధారం చేసుకొని రాజకీయసంస్థలు చట్టపరమైన అధికారాలను, పరిమితులను చర్చించటం జరిగింది. అంతేగాకుండా ఇంతవరకు

తులనాత్మక రాజకీయాల అధ్యయనం పాశ్చాత్య, యూరోపియన్ ప్రజాస్వామ్యాలు ఉదాహరణలుగా గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా మొదలైన వాటికి పరిమితమైంది.

2.3.0 సాంప్రదాయక అధ్యయన పద్ధతి

ఈ సందర్భంలో సాంప్రదాయిక అధ్యయన పద్ధతి లక్షణాలను క్లుప్తంగా వివరిద్దాం.

2.3.1 తులనాత్మకత లేని పద్ధతి

ఇంతవరకూ తులనాత్మక పద్ధతిమీద వెలువడిన సాహిత్యం చాలావరకూ ఒక దేశానికి సంబంధించిన రాజ్యాంగం లేదా రాజకీయ సంస్థలను వివరించటమో లేదా వివిధ దేశాల సంస్థలను నిర్వచించటమో జరిగింది. రాజ్యాంగ పునాదులు రాజకీయ అధికారానికి సంబంధించిన నిర్మాణాలు, అధికారాన్ని ఏవిధంగా ఉపయోగించామో మొదలైన అంశాలను విద్యార్థులకు బోధించడం జరిగింది. ప్రతిసందర్భంలోను సమస్యలను ఒకదేశ సంస్థాగత నిర్మాణపరంగా చర్చించటం జరిగింది. ఫ్రాన్స్‌లో రాజకీయ అస్థిరతను శాసనసభను రద్దుచేసే అధికారపరంగా వివరించడం జరిగింది. అలాగే ఇంగ్లండ్‌లో రాజకీయ సుస్థిరతను చక్రవర్తికున్న విశేష అధికారాలు, అదే సందర్భంలో ప్రధానమంత్రికి, హౌస్ ఆఫ్ కామన్స్‌ను రద్దుచేసి తిరిగి ఎన్నికలు జరిపించమని చక్రవర్తిని కోరే అధికారం సందర్భంలో చర్చించేవారు. రాజ్యనిర్మాణాన్ని విశ్లేషించటానికే విద్యార్థి ఆసక్తి పరిమితమయ్యేది. సార్వభౌమాధికారం అనేది ఎక్కడ ఉంటుంది? భావసిద్ధాంతం ఆధారంగా రాజకీయ పక్షాలు ఎట్లా ఏర్పడతాయి? సిద్ధాంతపరంగా ఓటర్లు ఏఏ రాజకీయ పక్షాలకు మద్దతు ఇస్తున్నాయి ? మొదలైన వాటిని ప్రధానంగా సాంప్రదాయక దృక్పథంతో తులనాత్మక ప్రభుత్వాలను చర్చించటంలో మౌలికమైన అంగాలుగా ఉండేవి.

2.3.2 వర్ణనాత్మకత

రాజకీయ ప్రక్రియను అర్థంచేసుకోవాలంటే లాంఛనప్రాయ రాజకీయ సంస్థలను అధ్యయనం చేయాలని వాదించడం జరిగింది. లాంఛనప్రాయం-చట్టబద్ధ సంస్థలను వర్ణించటం ద్వారా వాటి మధ్య పోలికలను, వైవిధ్యాలను వివరించేవారు. అయితే వివిధ దేశాల రాజకీయ సంస్థలను వర్ణనాత్మకంగా పరిశీలించడం ద్వారానే వాటిమధ్య తులనాత్మక విశ్లేషణ సాధ్యమవుతుందని చెప్పలేం. ఉదాహరణకు, "కాంటినెంటల్ యూరప్ ప్రభుత్వాలు' 'అనే గ్రంథం జేమ్స్ పార్టీవెల్ సంపాదకత్వంలో వెలువడిన సుప్రసిద్ధ గ్రంథంలో ఫ్రాన్స్, ఇటలీ, స్విట్జర్‌లాండ్, జర్మనీ సోవియట్ యూనియన్ రాజకీయ సంస్థలను చర్చించడం జరిగింది. అయితే ఈదేశాలను ఏప్రాతిపదికపై ఎంపిక చేశారు, వాటి మధ్యసారూప్యతలు ఏమి ఉన్నాయి, వైవిధ్యాలు ఏమిటి మొదలైన అంశాలను విస్మరించడం జరిగింది. తులనాత్మకతలేని దేశాల రాజకీయ సంస్థలను చర్చించి ప్రయోజనంలేదు. ఇదే అంశాన్ని మనం "ఆధునిక విదేశీ ప్రభుత్వాలు" అనే గ్రంథంలో కూడా గమనించవచ్చు. దీని రచయితలైన ఫ్రెడరిక్ ఆగ్, హెరాల్డ్‌జింక్ లేదా ఫ్రిజ్‌యం. మార్క్స్ రచించిన "విదేశీ ప్రభుత్వాలు" గ్రంథంగాని పై విధంగానే ఉన్నాయి.

అయితే తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో తొలిగ్రంథంగా పేర్కొదగ్గ డేనియల్ విట్ రచన "తులనాత్మక రాజకీయసంస్థలు" ఒక్కొక్క దేశ సంస్థలను అధ్యయనం చేసే పద్ధతిని పదిలిపెట్టి తులనాత్మకంగా పరిశీలించదగ్గ రకాలను పరిగణనలోకి తీసుకొంది. అయితే "పౌరుడు-ప్రభుత్వం", "ఎన్నికల ప్రక్రియ" వాటికి సంబంధించి పై రచయిత ఏదేశానికి ఆదేశం కింద విడివిడిగా అధ్యయనం చేశారు. అందువల్ల వాటిని తులనాత్మకంగా పరిశీలించటంలో ఆయన విఫలమయ్యాడు. అయితే పైవిధంగా మనం విమర్శలు చేయటంలో వాటి గుణాత్మకతను తక్కువగా అంచనావేయడంకాదు. లేదా వర్ణనాత్మక పద్ధతిని కించపరుస్తున్నట్లుకాదు. ఇలా విమర్శించటంలో ఉద్దేశంపై గ్రంథాలు కేవలం వివిధ దేశాల రాజకీయ సంస్థలను వర్ణించటానికే పరిమితమయ్యాయని చెప్పటమే. వివిధ రాజకీయ సంస్థలను తులనాత్మకంగా పరిశీలించకుండా కేవలం వాటి లాంఛనప్రాయనిర్మాణాలను వర్ణించటానికే అవి పరిమితమయ్యాయి. అంతేగాకుండా అవి వివిధ రకాల వ్యవస్థల మధ్య వ్యత్యాసాలను గుర్తించటమే తమ మౌలిక లక్ష్యంగా పెట్టుకొన్నాయి. ఉదాహరణకు, సమాఖ్య, ఏకకేంద్ర ప్రభుత్వాలు, పార్లమెంటరీ, అధ్యక్షతరహా ప్రభుత్వాలు, ప్రజాస్వామ్య, నియంతృత్వ వ్యవస్థలు.

రాజకీయ సంస్థల వర్ణనాత్మక అధ్యయనంలో రెండు దృక్పథాలు కనిపిస్తాయి. ఇందులో మొదటిది రాజకీయసంస్థలను వికాసపరంగా పరిశీలించటం. రెండోది, కేవలం చట్టపరంగా పరిశీలించటం. అంటే కేవలం

చట్టపరంగా లేదా రాజ్యాంగపరంగా అధ్యయనంచేయటం. కొన్ని రాజకీయ సంస్థలు ఏవిధంగా ఆవిర్భవించాయి, అవి ఎలా అభివృద్ధిచెందాయి, పరిశీలించటం చారిత్రక దృక్పథం కేంద్రలక్ష్యం. బ్రిటిష్ పార్లమెంటరీ వ్యవస్థ ప్రారంభాన్ని మాగ్నకార్టాతో ముడిపెట్టి అటుతరవాత వివిధ దశలద్వారా అది ఏవిధంగా అభివృద్ధి చెందిందో చారిత్రక పద్ధతి వివరిస్తుంది. అదేవిధంగా ఫ్రెంచ్ పార్లమెంటరీ, జర్మన్ శాసనసభలు సమాంతర చారిత్రక దశలలో అభివృద్ధి చెందాయని చెబుతూ వాటి మధ్య సారూప్యతలను, వ్యత్యాసాలను వివరించటం జరిగింది. ఈ సందర్భంలో ఒక చరిత్రకారుడు ఉపయోగించే అధ్యయన పద్ధతినే వినియోగించటం సర్వసామాన్యంగా జరిగింది. సంవత్సరాలు క్రమ పద్ధతిలో ఒక ప్రత్యేక సంఘటనను వివరిస్తూ, అది జరగటానికి గల కారణాలు విశ్లేషించటానికి ప్రత్యేక ప్రయత్నం జరగలేదు.

వర్ణనాత్మక పద్ధతిలో అనుసరించిన మరో ప్రక్రియ చట్టపరమైన దృక్పథం. ప్రభుత్వంలోనే వివిధ శాఖల అధికారాలు అమలులో ఉన్న రాజ్యాంగ చట్టపర నిర్దేశకాలు మొదలైన వాటిని విద్యార్థికి బోధించటం జరిగింది. అలాగే వివిధ చట్టపరమైన సంస్థల సంబంధాలను కూడా చర్చించేవారు. మౌలికంగా రాజ్యాంగ, లేదా చట్టాల నిబంధనలను దృష్టిలో ఉంచుకొని ఏమిచేయవచ్చు, ఏమి చేయలేక పోవచ్చు మొదలైన, అంశాలపై చర్చ కొనసాగింది. చారిత్రక అధ్యయనం మాదిరిగానే ఇక్కడ కూడా పరిమిత పరిధిలో వివిధ రాజకీయ వ్యవస్థలను వర్ణించేవారు, చట్టబద్ధ రూపాలకు ఆకృతికల్పించే వివిధ శక్తులు వివిధరకాల రాజ్యాంగాలు లేదా ప్రభుత్వ వ్యవస్థలు ఏర్పడటానికి దోహదం చేసిన కారణాలను సునిశితంగా పరిశీలించటానికి లేదా విశ్లేషించటానికి ఎలాంటి ప్రయత్నం జరగలేదు. ఈ సందర్భంలో ఆర్నాల్డ్ జుర్చర్ రచించిన "రాజ్యాంగతావాదం" - రాజ్యాంగ ధోరణులు' 'గ్రంథాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు. పశ్చిమ యూరప్‌లో రెండో ప్రపంచ యుద్ధానంతర రాజ్యాంగ పరిణామాలను ఈ గ్రంథం విశ్లేషించటానికి ప్రయత్నించింది. అదేవిధంగా బ్రిటిష్ క్యాబినెట్, బ్రిటిష్ పార్లమెంట్ గురించిన ఐవర్‌జెన్నింగ్స్ రచనలు కూడా కేవలం చట్టపరదృక్పథానికే పరిమితమయ్యాయి. అనుపూర్వికాల ఆధారంగా వివిధ సంస్థలు, అధికారాలను ఏవిధంగా చెలాయించాయి పై రచయిత వివరించాడు.

తులనాత్మక అధ్యయనంకోసం వివిధ దేశాల వ్యవస్థలను పరిశీలించడానికి చారిత్రక, చట్టపర దృక్పథాలను రెండింటిని మిళితం చేసిన అధ్యయనాలే మనకు ఎక్కువగా కనిపిస్తాయి. చాలావరకు ఇవి వివిధ రాజకీయ సంస్థల మధ్య సంబంధాలను ఆ సంస్థల వికాసాన్ని ఛాయాచిత్రంగా వివరిస్తాయోగాని కొన్ని సాధారణ ప్రమేయాల ప్రాతిపదికపై ఇవి ఏవిధంగా అభివృద్ధి చెందాయి, పనిచేస్తున్నాయి అని పరిశీలించటానికి ఎటువంటి అధ్యయన చట్రాన్ని సూచించవు.

2.3.3 సంకుచిత స్వభావం

విదేశీరాజకీయ వ్యవస్థలకు సంబంధించి వెలువడిన గ్రంథాలలో అధికభాగం పశ్చిమదేశాల అధ్యయనానికే పరిమితమయ్యాయి. అందులోను పశ్చిమ యూరప్ అగ్రస్థానం పొందింది. ఈదేశాలకు రాకపోకలు సులభతరంకావటం, భాషాపరమైన ఇబ్బందులు లేకపోవటం, అధికార పత్రాల లభ్యత, పశ్చిమ యూరప్ రాజకీయ వ్యవస్థల అధ్యయనానికి ఎక్కువగా దోహదం చేశాయి. ఫ్రాన్స్, ఇంగ్లాండ్, స్విట్జర్‌లాండ్, బ్రిటిష్ అధినివేశ దేశాలు మొదలైన వాటికే పై అధ్యయనాలు పరిమితంకావటంతో వాటి సంకుచిత స్వభావం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. అయితే ఇక్కడకూడా వివిధదేశాలమధ్య సారూప్యాలనుగాని, వైరుధ్యాలనుగాని కేవలం మినహాయించడం పరిశీలిస్తే నిశితంగా పరిశీలించడం జరగలేదనిపిస్తుంది. సామాన్యచారిత్రక, సాంస్కృతిక నేపథ్యం పై దేశాలకున్నాయని రచయితలు భావించారేగాని వాటి అభివృద్ధిచెందిన పార్లమెంటరీ సంస్థలు, ప్రజాస్వామ్యం మొదలైనవాటిని లోతుగా వెళ్ళకుండా పైపైనే పరిశీలించడం జరిగింది. అభివృద్ధిచెందిన ఆర్థికవ్యవస్థ అంటే ఏమిటి ? ఇంకా స్పష్టంగా చెప్పాలంటే రాజకీయ సంస్థలకు, ఆర్థిక సంస్థలకు మధ్య సంబంధం ఏమిటి మొదలైన వాటిని విశ్లేషించటానికి ఎటువంటి ప్రయత్నం జరగలేదు. జర్మనీ ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థను రూపొందించుకోలేదన్న వాదం రచయితలు ప్రచారం చేశారేకాని జర్మనీ ఆ రంగంలో ఎందుకు విఫలమైందిలోతుగా పరిశీలించి తమ ప్రమేయం సార్థకతను పరీక్షించటానికి ప్రయత్నించలేదు. అలాగే అనేక సందర్భాలలో సాధారణ ప్రస్తావనలు మినహాయించి ప్రత్యేకంగా సదరు ప్రస్తావనలను లోతుగా అన్వయించటానికి ఏవిధంగాను పై అధ్యయనాలు ఆసక్తిచూపలేదు.

2.3.4 స్తబ్ధతా స్వభావం

సాంప్రదాయక అధ్యయన పద్ధతి చలాంక రణాలను పరిగణనలోకి తీసుకోలేదు. అభివృద్ధికి, మార్పుకు అవి ఏవిధంగా దోహదం చేస్తాయో వివరించటానికి ఎటువంటి ప్రయత్నం జరగలేదు. 19వ శతాబ్దపు పరిణామాత్మక అధ్యయనాలకు స్వస్తిచెప్పాక విశ్లేషణల్లో స్తబ్ధత ఏర్పడింది. నూతన సిద్ధాంతాల ఆవిష్కరణ మృగ్యమైంది.

సార్వభౌమాధికారం స్వభావం, దాని ఉనికి రాజనీతిశాస్త్ర విద్యార్థులను చాలావరకు ఆకట్టుకొన్నాయి. రాజ్యాంగనిర్మాణాలు, వివిధరాజ్యాంగాలు, కొన్ని రాజ్యాంగాల విజయవంతమైన అమలుకు అవసరమైన పరిస్థితుల అధ్యయనం రాజకీయ విశ్లేషణలో ఎక్కువగా చోటుచేకున్నాయి. ఈ సందర్భంలో బ్రైస్ (Bryce) రచన ప్రస్తావించదగింది. రాజకీయ పక్షాల ఆవిర్భావం గురించి అధ్యయనంచేశారు కానీ అవి రాజకీయాధికారాన్ని మార్పుచేయటంలో ఏవిధంగా రూపాంతరం పొందుతాయి? ఎంత తీవ్రస్థాయిలో సమాజంలో మార్పులు తెస్తాయి? మొదలైన అంశాలకు ఎక్కువ ప్రాధాన్యమివ్వలేదు. బ్రిటిష్ క్యాబినెట్‌పై వాల్టర్ బేజీహాట్ చేసిన విశ్లేషణ 20వ శతాబ్దం ఉత్తరభాగం వరకు ఎటువంటి మార్పులు లేకుండా కొనసాగింది. పార్లమెంటరీ సార్వభౌమాధికారానికి బ్రైస్ సూచించిన పరిమితులను చాలాకాలం వరకు సమస్యకు సంబంధించిన ఒక పటిష్టమైన విశ్లేషణగా అంగీకరించటం జరిగింది. బ్రిటిష్ ప్రజలకు "రాజకీయ సార్వభౌమాధికారం" ఉందనీ, అది పార్లమెంట్ "చట్టబద్ధ సార్వభౌమాధికారాన్ని' పరిమితంచేస్తుందని, సదరు పరిమితులు న్యాయ సంస్థీకరణ ద్వారా సాధ్యమవుతుందని బ్రైస్ (Bryce) సూత్రీకరించాడు. అలాగే లాంఛన ప్రాయ రాజ్యాంగ నిర్మితులపరంగా సమాఖ్య వ్యవస్థను విశ్లేషించడం జరిగింది. సమాఖ్యలో సార్వభౌమాధికారం ఎక్కడ ఉంటుంది? కేంద్ర ప్రభుత్వంలోనా, రాష్ట్రప్రభుత్వంల్లోనా, రాజ్యాంగానిదా లేక రాజ్యాంగాన్ని మార్పుచేసే సంస్థకా? మొదలైనవాటిపై అర్థరహితమైన వాదవివాదాలు కొనసాగాయి. లాంఛనప్రాయ సంస్థల మధ్య - కేంద్ర రాష్ట్రాలు, అధికారవిభజన ఒక ప్రముఖ చర్చనీయాంశమైంది.

2.3.5 క్లుప్త రచనలు

పాఠ్య గ్రంథంలోకాకుండా విదేశీరాజకీయ వ్యవస్థలపై కొన్ని క్లుప్త రచనలు కూడా వెలువడ్డాయి. ఒకదేశ రాజకీయ సంస్థలను గురించి లేదా వివిధ దేశాలకు సంబంధించిన ఒక రాజకీయ సంస్థ గురించి క్లుప్త రచనలు అనేకం వెలువడ్డాయి. జాన్ మారిఎంట్, ఆర్థర్ కేత్, జోసఫ్ చార, లేమీ జేమ్స్ బ్రైస్, జవర్ జెన్నింగ్స్, హెరాల్డ్ లాస్కీ, లైప్రే, ఫ్రాంక్‌గుడ్‌నే, రాచసన్, అచ్చట్, లోవెల్స్, ఉడ్రోవిల్సన్ ఇంకా అనేక సుప్రసిద్ధ రచయితలు ఒక దేశానికి సంబంధించిన సాధారణ అధ్యయనం ఒక సంస్థకు సంబంధించిన తన ఒక ప్రత్యేక విశ్లేషణ చేశారు. అమెరికా అధ్యక్షుడు, బ్రిటిష్ పార్లమెంటరీ వ్యవస్థ మొదలైన వాటిని కూలంకషంగా పరిశీలించటం జరిగింది. వాటికి సంబంధించిన సంప్రదాయాలు, రాజ్యాంగ చట్టపరమైన పరిమితులు, ఆయా సంస్థలమధ్య అంతస్సంబంధాలు చర్చనీయాంశాలయ్యాయి. కొన్ని సందర్భాలలో సదరు రచనలు చట్టపరమైన విశ్లేషణలకంటే ఒకింత ముందుకు వెళ్ళి రాజకీయేతర అంశాలను కూడా పరిశీలించాయి. ఒక ప్రత్యేక సమస్యను వెలుగులోకి తెచ్చే దృష్టితో సదరు రచనలు కొనసాగాయి. ఉదాహరణకు-కార్యనిర్వాహక వర్గం, శాసనసబల మధ్య సంబంధాలు ఏవిధంగా ఉండాలి? అనే అంశం నేపథ్యంలో అనేక అధ్యయనాలు వెలువడ్డాయి. పరిపాలనా చట్టం వికాసం, ప్రజాస్వామ్యం ఉద్యోగిస్వామ్యం మొదలైన వాటిని పరిశీలించడం జరిగింది.

అయితే రాజకీయ సంస్థలు, రాజకీయేతర కారకాలు శక్తుల మధ్య సంబంధాలను పరిగణనలోకి తీసుకోవటం జరగలేదు. లేదా ఒక సమస్యను ఒక ప్రత్యేక దృష్టితో ఎందుకు అధ్యయనం చేయటం జరిగిందో వివరించటానికి ఎటువంటి ప్రయత్నంచేయలేదు.

2.3.6 సాంప్రదాయిక సాహిత్యంలో సమస్య దృక్పథం (Problem Approach)

కొన్ని ప్రత్యేక సమస్యలను చర్చించే విషయపరంగా సాంప్రదాయక దృక్పథంతో అనేక రచనలు వెలువడ్డాయి. ప్రజాస్వామ్యానికీ, ఆర్థిక ప్రణాళికలకు మధ్య సంబంధం నూతన ఆర్థిక, సామాజిక కర్తవ్యాలనిర్వహణకు పరిపాలనాసంస్థల వికాసం, ద్విసభవ్యవస్థక్షీణత, రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలంలో ప్రాతినిధ్యసభలు సామాజిక, ఆర్థిక వర్గాల మధ్య తలెత్తిన ఉద్రిక్తతల సడలింపులు, నిర్వహించవలసిన పాత్ర మొదలైనవి, సమస్యా దృక్పథ రచనలలో ప్రముఖంగా చోటుచేసుకొన్నాయి. అయితే సదరు అధ్యయనాలు సర్వసామాన్యంగా ఒక దేశ రాజ్యాంగ చట్రం పరిధిలో ఇమిడి ఉన్నాయి. వాటికే అవి పరిమితమయ్యాయి.

ప్రభువుల సభ నిర్మాణానికి సంబంధించిన సంస్కరణలు, కర్తవ్యపరంగా శాసనసభల్లో ప్రాతినిధ్యం, ఆర్థికపరమైన సమాఖ్య ఏర్పాటు, శాసన నిర్మాణ అధికారాలను నిర్వాహణశాఖకు దత్తం చేయడం, విధాన నిర్ణయాలలో వృత్తిసంఘాల పాత్ర మొదలైన వాటిపై చర్చలు కొనసాగాయి.

అయితే సదరు అధ్యయనాలు సాంప్రదాయక వర్ణనాత్మక విశ్లేషణలకు స్వస్తిచెప్పాయి. ఎందుకంటే రాజ్యాంగ, లాంచనప్రాయ-చట్టపరిధిలో పైనమస్యలను పరిష్కరించడం సాధ్యకాదుకాబట్టి. రాజకీయాధికారం, సామాజిక, ఆర్థిక కారకాలమధ్య సంబంధాలను పరిశీలించటానికి మానవ ప్రవర్తనను విశ్లేషించటం చాలా అవసరం వీటి అధ్యయనానికి నూతన దృక్పథం చాలా అవసరం వాటిని సాంప్రదాయక దృక్పథంతో చర్చించటం సాధ్యం కాదు.

2.3.7 ప్రాంతీయ అధ్యయనాలు

ఇటీవలికాలంలోనే విదేశీవ్యవస్థల అధ్యయనంతో ప్రయత్నాల ప్రారంభమయ్యాయి. యుద్ధానంతరం కొన్ని భౌగోళిక ప్రాంతాలు ప్రాధాన్యం సంతరించుకోవటంతో వాటి అధ్యయనం పట్ల సామాజిక శాస్త్రవేత్తలు ఆసక్తిచూపటం ప్రారంభించారు. పాశ్చాత్యేతర దేశాలు అవతరించటంతో ప్రాంతీయ అధ్యయనాలు, ఒక ప్రాంతం సమస్యను ప్రత్యేకంగా అధ్యయనం చేయటం మొదలైనవి మేధావుల ఆసక్తిని ఆకట్టుకొన్నాయి. రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు భాష, చరిత్ర, సంస్కృతి, అక్కడి ప్రజల మనోభావాలు మొదలైనవాటి అధ్యయనానికి ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు ప్రోత్సాహం ఇవ్వడం ప్రారంభించాయి. గత 20, 30 సంవత్సరాలుగా అమెరికా విశ్వ విద్యాలయాల్లో సదరు అధ్యయనాలు ప్రాముఖ్యం వహిస్తున్నాయి.

అంతేకాకుండా ఒక వ్యవస్థ వివిధభాగాలను ప్రత్యేకంగా అధ్యయనంచేసి మొత్తం ఆర్థిక వ్యవస్థ సమగ్రరూపాన్ని అంచనావేసి, సదరు వ్యవస్థల మధ్య తులనాత్మక విశ్లేషణకు వివిధ దేశాల వ్యవస్థల మధ్య తులనాత్మక విశ్లేషణకు వివిధ దేశాల వ్యవస్థల అధ్యయనానికి పునాదులు వేయటం జరిగింది. ఈ అధ్యయనం క్రమంలో అంతర్ అధ్యయనాల దృక్పథం (inter - disciplinary) ప్రాముఖ్యం పొందింది. తులనాత్మక విశ్లేషణలో సదరు దృక్పథం చాలా అవసరమని నేడు సాధారణంగా భావించడం జరుగుతోంది.

తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో ప్రాంతీయ అధ్యయనాల సేవను అంచనావేయడం కష్టం. అనేక సందర్భాలలో ఒక సమగ్ర రాజకీయ వ్యవస్థ విశ్లేషణకు దోహదంచేయకుండా ప్రాంతీయ అధ్యయనాలు వివిధ భాగాలను విడగొట్టి వాటిని కేవలం విశ్లేషించటానికే పరిమితమయ్యాయి. లేదా ఒక సమస్యను చర్చించటంలో ఆదేశ చట్రానికి పరిమితమయ్యాయి, రాబర్ట్‌స్కాలపినో రచించిన యుద్ధకాలానికి ముందు జపాన్‌లో ప్రజాస్వామ్యం - వార్తా ఉద్యమం (Democracy and party Movement in Pre-War Japan) పెరోన్‌కాలంలో అర్జింటీనా రచయిత జార్జ్‌బ్లంట్ స్టేన్, మెరాకో ఫ్రెన్ సోడ్ గ్రంథం 'రష్యా ఎలా పాలించబడుతున్నది' (How russia is Ruled) మొదలైనవి ఒక ప్రత్యేక సమస్యను చక్కగా విశ్లేషించాయి. అయితే అది క్రమబద్ధమైన తులనాత్మక విశ్లేషణ అధ్యయనాలకు దోహదం చేయలేదు. సిద్ధాంతపరమైన, సాంస్కృతికపరమైన సామాజిక నేపథ్యాలు ఆయాదేశాల రాజకీయ ప్రక్రియలను పైరచనలు విశ్లేషించాయి.

తులనాత్మక అధ్యయనానికి అవసరమైన ఒక క్రమబద్ధమైన చట్రాన్ని కల్పించటంలో పై అంతర్ అధ్యయన దృక్పథం విఫలమయింది. ఎందుకంటే ఒక ప్రాంతాన్ని ఎంచుకోవడంలోనే అధ్యయనపరమైన ప్రశ్నలు అనేకం తలెత్తుతాయి. ఆప్రాంతానికి సంబంధించిన అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోటానికి నిపుణులందరికీ సాధ్యం కాదు.

2.3.8 సాంప్రదాయక దృక్పథంలో కేంద్రాంశం

పై చర్చను బట్టి సంప్రదాయ దృక్పథం కింది అంశాలను ప్రముఖంగా ప్రస్తావించింది, వాటికి పరిమితమయిందని చెప్పవచ్చు.

1. పాశ్చాత్య వ్యవస్థలకు ఆది పరిమితమయింది. ఆ అధ్యయనంలో ఒక సంస్కృతి ముఖ్యాంశం

2.ఇందులో కూడా ప్రాతినధ్య ప్రజాస్వామ్య పరిశీలన అధికంగా చోటుచేసుకొంది. ప్రజాస్వామ్యాల్లో ఏర్పడిన

వైపరీత్యాలవల్లనే ప్రజాస్వామ్యేతర వ్యవస్థలపట్ల తరవాతికాలంలో కొంతమేరకు ఆసక్తి చూపించటం జరిగింది.

3.పాశ్చాత్యేతర వ్యవస్థలకే కాకుండా, వలస ప్రాంతాల వ్యవస్థల అధ్యయనానికి సంప్రదాయ దృక్పథం రచయితలు దూరంగా ఉండిపోయారు. సాంస్కృతికంగా, చారిత్రకంగా శతాబ్దాల తరబడి మనుగడ సాగిస్తున్న వెనకబడిన దేశాలు-ఇండియా, జపాన్-వారిని ఆకర్షించలేదు.

4. కొన్ని ప్రత్యేకదేశాల ప్రభుత్వాలు-సంస్థలకు సంబంధించిన పరిశోధన మాత్రమే కొనసాగింది. అందువల్ల వాటిలో తులనాత్మక అధ్యయనం నామమాత్రంగానే ఉందని చెప్పవచ్చు.

అందువల్ల తులనాత్మక రాజకీయాల అధ్యయనం చాలావరకు లాంఛనప్రాయంగా చట్టపర సంస్థల పరిశీలనకే పరిమితమైంది. అది :

1. ప్రభుత్వ చట్టబద్ధ - లాంఛనప్రాయ నిర్మాణాల అధ్యయనానికే పరిమితమైంది.

2. లాంఛన రహితమైన ఏర్పాట్లను పరిశీలించటంలో ఎటువంటి ఆసక్తి చూపించలేదు. ఉదాహరణకు, రాజకీ ప్రవర్తన, సామాజిక, ఆర్థిక కారకాల ప్రభావం సదరు అధ్యయనాలను ఆకర్షించలేదు.

3. తులనాత్మక అధ్యయనం కేవలం చట్టబద్ధ-రాజ్యాంగ సంస్థల మధ్య సారూప్యతలను, వ్యత్యాసాలను పరిశీలించటానికే పరిమితమయ్యాయి. పార్లమెంట్, కార్యనిర్వాహక శాఖలు, పరిపాలక, సాధారణ చట్టాలు, మొదలైనవాటిని తులనాత్మకంగా అధ్యయనానికి సరైన ప్రాతిపదిక అంటూ ఏదీ ఏర్పడలేదు.

4. తులనాత్మక అధ్యయనాలు మౌలికంగా వర్ణనాత్మకంగా ఉండిపోయ్యాయి. అవి ఎటువంటి ప్రమేయాలతో ప్రారంభంకాలేదు. వాటిని పరిశీలించటానికి ఎటువంటి ప్రయత్నంచేయలేదు.

ఫలితంగా బోధన, పరిశోధనల్లో దేశపరంగ సంస్థలను అధ్యయనం చెయ్యటంలో కొంత అసంతృప్తి ఏర్పడింది. విదేశీ ప్రభుత్వాల అధ్యయనం తులనాత్మక అధ్యయనం కాదు. కేవలం సమాంతర సంస్థల వర్ణన మేధావి/అధ్యాపక వర్గాల్లో అసంతృప్తి, విసుగుదల కలిగించాయి.

పశ్చిమేతర ప్రాంతాలు/రాజ్యాల అధ్యయనం ఆవశ్యకతను సర్వత్రా గుర్తించటం జరిగింది. అందువల్ల అధ్యయనం పరిధిని విస్తృతం చెయాల్సిన అవసరమేర్పడింది.

దానితోబాటు విధాన నిర్ణయ, విధాన అధ్యయనాల పట్ల ఆధునిక కాలంలో ఆసక్తి బాగా పెరిగింది. ఫలితంగా సాంప్రదాయిక దృక్పథానికి ప్రాముఖ్యం తగ్గింది.

శాస్త్రీయ దృక్పథంలో తులనాత్మక అధ్యయనం కాలక్రమంలో ఒక భాగమైంది. కొన్ని నిర్దిష్ట ప్రాతిపదికలు, తరహాలు - విజ్ఞాన శాస్త్రం రూపొందించటానికి ప్రయత్నిస్తుంది. వాటిని రూపొందించాలంటే సాధ్యమైనన్ని రాజ్యాలు, వ్యవస్థలను అధ్యయనం చేయాలి.

2.4 విమర్శనాత్మక పున: పరిశీలన

అందువల్ల తులనాత్మక అధ్యయనానికి సంబంధించి విమర్శనాత్మక పున: పరిశీలన అవసరమైంది. అమెరికాలోని విశ్వవిద్యాలయాల్లో దీనికి సంబంధించిన అధ్యయన బృందాలు, సంస్థలు కింది అంశాలను తులనాత్మక రాజకీయాలుగా పరిగణించాయి:

1 తులనాత్మక పరిశీలన ముఖ్యాంశాలను వెలికి తీయటం సాధ్యమవుతుందిగాని, వివిధ వాస్తవ పరిస్థితులను పరిశీలించటం సాధ్యంకాదు. ఎందుకంటే ఒక్కొక్క దేశ పరిస్థితి ఒక్కో తీరులో ఉంటుంది. వాటిమధ్య తులనాత్మకత సాధ్యంకాదు. వాటి మధ్యపోలికలను అధ్యయనంచెయ్యాలంటే కొన్ని పనికొచ్చే అంశాలను మాత్రమే తీసుకొని, లేదా వాస్తవాలను వక్రీకరించాల్సి ఉంటుంది.

2. తులనాత్మక అధ్యయనానికి ముందు భావనలను నిర్దిష్టంగా రూపొందించుకోవాలి, తరహాలను నిర్ణయించుకోవాలి. అధ్యయనానికి అవసరమైన సామాజిక, ఆర్థిక భాగాలను జాగ్రత్తగా ఎంపిక చెయ్యాలి. చర్చనీయమైన సమస్య దృష్ట్యా వాటిని ఎంపికచెయ్యాలి.

3. అన్ని అంశాలను సక్రమంగా అధ్యయనంచేయటానికి ఒక నిర్దిష్టప్రాతిపదికను రూపొందించుకోవాలి లేకపోతే దేనిని పరిశీలించిన అంశాల ఆధారంగా ఒక రాజకీయ సిద్ధాంతాన్ని రూపొందించటానికి ప్రయత్నం జరగాలి.

4. కొన్ని ప్రమేయాల ప్రాతిపదికలపై చివరికి పరిశీలించిన అంశాల ఆధారంగా ఒక రాజకీయ సిద్ధాంతాన్ని రూపొందించటానికి ప్రయత్నం జరగాలి.

5. ప్రమేయాల రూపకల్పన, వాటిని పరీక్షించటం అనుభవపూర్వక వాస్తవాల ప్రాతిపదికపై జరగాలి. అలాకాకుంటే సిద్ధాంతం వాస్తవానికి దూరంగా, అమూర్తంగా ఉంటుంది.

6. తులనాత్మక అధ్యయనం సక్రమంగా సిద్ధాంతరూపకల్పనకు దోహదం చెయ్యాలి. దీనికిగాను జాగ్రత్తగా ప్రమేయాలను ఎంపికచెయ్యాలి. వాటి సార్థకతను పరిశీలించడానికి అవకాశం ఉండాలి. అవి వాటంతట అవే స్వయం వివరణలను ఇస్తాయనుకోరాదు.

పై విధమైన విమర్శనాత్మక పరిశీలన సంప్రదాయ దృక్పథం ప్రాముఖ్యాన్ని తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో బాగా తగ్గించివేసింది.

2.5 ఆధునిక పద్ధతులు :

19వ శతాబ్దంవరకు రాజకీయ అధ్యయనం వ్యవస్థల చారిత్రక అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చింది. అయితే క్రమంగా రాజకీయసంస్థల సరళిని గురించి అధ్యయనం చేయటం ప్రారంభమైంది. రాజనీతిశాస్త్రం సార్థకత అమూర్త సిద్ధాంతాలపై కాక సమాజం అభివృద్ధికి, రాజకీయ ప్రక్రియలకు సంబంధించి అంశాలను నిర్దుష్టంగా ప్రతిపాదించటంలో ఉంటుందన్న భావం క్రమంగా బలపడనారంభించింది. ఫలితంగా 1902లో అమెరికాలో రాజనీతిశాస్త్ర సంగం ఏర్పాటైంది. వివిధ రాజకీయ వ్యవస్థల తీరుతెన్నులగురించి విశేష సమాచారం సేకరించారు. ప్రభుత్వ నిర్ణయాలు, రాజకీయ నాయకత్వాల స్వభావం, వర్గీకరణ, సిద్ధాంతాలకు నాయకత్వాలకు మధ్య మారుతున్న సంబంధాలను పరిశీలించటం ప్రారంభించారు. ప్రభుత్వ వ్యవహారసరళి పట్ల అధ్యయనం ఆసక్తి చూపటం ప్రారంభమైంది. ఫలితంగా అప్పటివరకు అనుసరిస్తూ వచ్చిన సంప్రదాయ, చారిత్రక, లాంఛనప్రాయ, చట్టబద్ధసంస్థల విశ్లేషణ పద్ధతుల పట్ల అసంతృప్తి ఏర్పడింది.

అలాగే రాజనీతిశాస్త్రం ప్రస్తావిస్తున్న అంశాలను అంతర్ వర్గీయ అధ్యయనపరంగా పరిశీలించాల్సిన అవసరాన్నికూడా గుర్తించడం జరిగింది. ఉదాహరణకు, రాజకీయ అధికారం, ఆర్థిక వ్యవస్థలమధ్య సంబంధాలను కూలంకషంగా అధ్యయనంచేయాలంటే ఒక దేశ ఆర్థిక వ్యవస్థ గురించి కొంత అవగాహన అవసరం. అలాగే రాజకీయాధికారం స్వభావాన్ని విశ్లేషించాలంటే సమాజంలోని వివిధ వర్గాల స్వభావం, అసక్తులను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. దీనికిగాను సమాజశాస్త్రం, అర్థశాస్త్రం తదితర అధ్యయనాల విషయంలో కనీస అవగాహన అవసరం.

2.6 ప్రవర్తనావాదం

శాస్త్రీయ పరిశోధనా పద్ధతులు అవలంబించాలన్న కోరిక రాజనీతిశాస్త్రవేత్తలలో బాగా ఏర్పడింది. ప్రధానంగా జీవ శాస్త్రాలు, మానవశాస్త్రాల పరిశోధనా పద్ధతులు రాజనీతిశాస్త్రాన్ని బాగా ప్రభావితం చేశాయి. అన్ని సామాజిక శాస్త్రాల్లోను మానవజీవన విధానమే ప్రధానాంశమైనప్పుడు సామాజిక శాస్త్రాల అధ్యయన పద్ధతులు అనుసరించటం రాజనీతిశాస్త్రానికి ప్రయోజనకరమని భావించటంజరిగింది. ప్రధానంగా మనోవిజ్ఞాన శాస్త్రం, సామాజిక శాస్త్రం,

మానవ శాస్త్రాల్లోని శాస్త్రీయ పద్ధతులను అనుసరించటంవల్ల రాజనీతిశాస్త్ర అధ్యయనం లబ్ధి పొందుతుందని భావించారు.

ముఖ్యంగా తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో పరిశోధనకు మంచిపద్ధతులు అవసరం అన్నవాదం ప్రవర్తనావాదులను బాగా ప్రభావితం చేసింది. అప్పటిదాకా అనుసరిస్తున్న సంప్రదాయపద్ధతులు, ప్రవర్తనావాదుల రంగ ప్రవేశంతో తెరమరుగయ్యాయి. నూతన పద్ధతులు, పరికరాలు ఉపయోగించటంలో ప్రవర్తనవాద రాజకీయ అధ్యయనంలో నవ్యతకు నాంది పలికారు.

రాజకీయ సంబంధాల అధ్యయనం, వ్యక్తుల, ప్రవర్తనల పరిశీలన ప్రాముఖ్యం సంతరించుకొన్నాయి. పరిశీలన, భోగట్టాసేకరణ, వర్గీకరణ, మూల్యాంకనం, మొదలైన పద్ధతులపట్ల ఆసక్తి పెరిగింది.

తులనాత్మక రాజకీయ అధ్యయనంలో పై పద్ధతులు క్రమంగా చోటుచేసుకొన్నాయి. ప్రవర్తనవాదం ఆవిర్భావంతో నూతన దృక్పథాలు ఏర్పడ్డాయి. లాస్‌వెల్, బెంట్లీ తదితర రచయితలు రాజనీతి అధ్యయనంలో వాస్తవ రాజకీయాలకు స్థానం ఉండాలన్న వాదాన్ని బలపరిచారు. ఊహావాదులు, ఊహాత్మక సిద్ధాంతాలు, తీవ్ర విమర్శలకు గురి అయ్యాయి. పూర్తి వస్త్వాశ్రయత (objectivity) కోసం గణాంక పద్ధతులను వినియోగించాలన్నారు. లాస్‌వెల్ ప్రభుత్వ వ్యవస్థల అధ్యయనం కంటే నానాటికీ విస్తృతమవుతున్న ప్రభుత్వ విధుల అధ్యయనం అవసరమని భావించాడు. వ్యక్తుల రాజకీయ ప్రవర్తనల అవగాహనకు మరో విజ్ఞాన శాస్త్రంతో పరిచయం ఎంతగా తోడ్పడుతుందో ఆయన వివరించాడు. రాజకీయ ప్రవర్తనకు మరో శాస్త్ర విజ్ఞాన ప్రాతిపదిక ఆవశ్యకతను నొక్కి చెప్పాడు. రాజనీతి శాస్త్ర విద్యార్థులందరూ వ్యవస్థలను మాత్రమే విశ్లేషించి వాటి మూలపదార్థాలైన వ్యక్తులను, విస్మరిస్తున్నారని ఆయన విమర్శించాడు.

లాస్‌వెల్ అనంతరం బెంట్లీ, మరియమ్‌లు ప్రవర్తనా వాదం విస్తరించడానికి తులనాత్మక రాజకీయాల అధ్యయనం వికాసానికి విశిష్ట సేవచేశారు. రాజకీయ అవగాహనకు వివరణలు అర్థంకావటానికి సమూహాలను అధ్యయ నాంశాలుగా పరిగణనలోకి తీసుకోవాలని, యథార్థాలను అవగాహనచేసుకోవటానికి చర్య భావన ఒక్కటే అర్థవంతమైన దృక్పథమని పై రచయితలు భావించారు. చర్యభావనసాంప్రదాయక అధ్యయనంపై విప్లవం తీసుకొచ్చింది. సామాజిక దృగ్విషయాల్లో పరస్పర సంబంధాలను అవగాహన చేసుకోవటం ప్రధానాంశంగా భావించడం జరిగింది, ఛార్లెస్ మెరియమ్ ప్రవర్తనవాద పితామహుడుగా ప్రసిద్ధి చెందాడు. 1908లో అయన ప్రచురించిన "ప్రైమరీ ఎలెక్షన్స్" గ్రంథం అనుభవవాద ప్రధాన గ్రంథాల్లో మొదటిది. సమాజ, మనోవిజ్ఞాన, భూగోళ, నరవర్గ వర్ణన, జీవ, గణాంక శాస్త్రాల్లో అనుసరిస్తున్న పరిశోధనాపద్ధతులను యంత్రాంగాన్ని మెరుగుపరచడానికి పరిశోధన స్వభావాన్ని రాజనీతి శాస్త్రానికి వర్తింపచేయటంలో మెరియమ్ ఆద్వితీయ పాత్ర నిర్వహించాడు. "న్యూ ఎస్సే ఆఫ్ పాలిటిక్స్" గ్రంథంలో ప్రవర్తన వాదానికి సంబంధించిన పద్ధతులను అయన చర్చించాడు.

ప్రవర్తనవాదం వ్యాప్తి చెందటానికి కారణం రెండో ప్రపంచ యుద్ధానంతరం బలపడిన కమ్యూనిస్టు దేశాలు. కమ్యూనిజం అభివృద్ధి విస్తరణలను రాజనీతిశాస్త్రజ్ఞులు ప్రవర్తన వాదంతో అడ్డుకోడానికి ప్రయత్నించారు. సాంకేతిక విజ్ఞానం వృద్ధి చెందటతో మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో రాజనీతిశాస్త్రం వాస్తవాలను అవగాహన చేసుకొని ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సమస్యలను కూలంకషంగా చర్చించి లోపాలను సవరించాలని, ప్రత్యామ్నాయ వ్యవస్థలు - నియంతృత్వ, అధీనవాద-బలపడకుండా ఉండాలని ప్రవర్తన వాదులు భావిస్తారు. రాజనీతి శాస్త్రాన్ని అనుభవవాద శాస్త్రంగా మార్చటానికి వారు ప్రయత్నించారు. రాబర్ట్ థాల్ ప్రవర్తనవాదాన్ని ఒక మనోభావంగా భావించాడు. రాజనీతి అధ్యయనం అభివృద్ధికావాలంటే-ఆక్షేపణ, సందేహం, సంపూర్ణ ఆశావాదం-భావాన్ని ప్రవర్తనావాద దృక్పథంలో పేర్కొనవచ్చు.

2.7 వ్యవస్థల విశ్లేషణ పద్ధతి - ఈస్టన్.

ప్రవర్తనావాద పునాదులను డేవిడ్ ఈస్టన్ ఎనిమిది ప్రధానాంశాలుగా వర్గీకరించాడు. అవి :

1. క్రమాలు (Regulations)

2. నిరూపణలు (Verifications)

3. పద్ధతులు (Techniques)

4. పరిమాణీకరణ (Quantification)

5. విలువలు (Values)

6. శుద్ధ శాస్త్ర విజ్ఞానం (Pure Science)

7. క్రమబద్ధీకరణ (Systematisation)

8. ఏకీకరణ (Integration)

ఈస్టన్ ప్రతిపాదించిన పై అంశాలు ప్రవర్తనవాదం, శాస్త్రీయ పునాదులను పటిష్టంచేశాడు. వాటిని ఆధునిక కాలంలో తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో విస్తృతంగా వినియోగించటం జరుగుతున్నది. వ్యక్తుల ప్రవర్తన పాత్రనుబట్టి వివిధ సమాజశాస్త్రాల పరిధి నిర్ణయమవుతున్నది. పరిశీలన, వర్గీకరణ, సమాచార ప్రామాణికత, గణాంక విశ్లేషణల ఉపయోగం అధికం చేశాయి. గణితశాస్త్ర సంకేతాలు, చార్టులు, గ్రాఫ్‌లు, పట్టికలు విశేషంగా నేటి తులనాత్మక అధ్యయనాల్లో వినియోగించటం జరుగుతోంది.

2.8 ఉత్పాదక - ఉత్పాదిత దృక్పథం

ప్రవర్తనవాదంలో భాగంగా ఈస్టన్ రాజకీయ దృగ్విషయాల సాధారణ అధ్యయనంలో మొదటిసారిగా వ్యవస్థా భావనను ప్రవేశపెట్టాడు. రాజకీయ ప్రక్రియలను, శక్తులను విశ్లేషించడానికి రాజకీయ వ్యవస్థ సరియైన భావన అని ఈస్టన్ భావించాడు.

రాజకీయ వ్యవస్థ ఇతర వ్యవస్థలతో కలిసి మనుగడ కొనసాగిస్తుంది. అందువల్ల వాటితో దానికి సన్నిహిత సంబంధం ఉంటుంది. ఒక వ్యవస్థ నుంచి మరో వ్యవస్థకు ప్రసరించే విషయాలు మొదటి దానికి ఉత్పాదితాలు (outputs), రెండో దానికి అవి ఉత్పాదకాలు అవుతాయి.

ఉత్పాదకాలు రాజకీయ వ్యవస్థకు అభ్యర్థనలు, మద్దతు రూపంలో ఉంటాయి. సమాజం నుంచి రాజకీయ వ్యవస్థ అభ్యర్థనలు, మద్దత్తురూపంలో స్వీకరిస్తుంది. ఒక ప్రత్యేక విషయంలో బాధ్యత గలవారు సాధికారిక కేటాయింపులు చేయాలా లేదా అన్న విషయం అభ్యర్థనల రూపంలో వెలువడుతుంది. విధేయత ప్రకటన మద్దతు రూపంలో ఉంటుంది. ప్రత్యేక కారణాలకు మద్దతు ఒక నిర్దిష్ట రూపంలో ఉంటుంది. పన్నులు చెల్లించటం, శాసనాల పట్ల విధేయత చూపించి వాటి నిబంధనలను పాటించటం కుల, మత, తెగ, సామాజిక, రాజకీయ వర్గాల ప్రభావం కూడా అభ్యర్థనల రూపంలో ఉంటుంది.

ఉత్పాదితాలు రాజకీయ వ్యవస్థలు అందించే ఫలితాలు. ఉత్పాదకాలకు స్పందనే ఉత్పాదితాలు. అధికారుల చర్యలు, నిర్ణయాల రూపంలో అవి వ్యక్తమవుతాయి.

సాధారణ వ్యవస్థల సిద్ధాంతం, ప్రధానంగా ఈస్టన్ ప్రతిపాదించిన రాజకీయ వ్యవస్థల సిద్ధాంతం అనేక విమర్శలకు గురయ్యాయి. విశ్లేషించిన దృగ్విషయాన్ని వ్యవస్థల చట్రంలోకి కుదించాలని వ్యవస్థ సిద్ధాంతం ఉద్దేశం. వర్ణనకు, వివరణకు ఎంపికైన ఎటువంటి చలాంకాలనైనా వ్యవస్థల ప్రవర్తనలో ఇమడ్చవచ్చు.

అయితే వ్యవస్థల పరిధులను నిర్ణయించటంలో వాస్తవంలో కొన్ని ఇబ్బందులుంటాయి. ఉత్పాదికాలు ఉత్పాదితాలుగా ఎలా పరివర్తనం చెందుతాయన్న దాన్ని గురించి ఈస్టన్ ఎటువంటి వివరణ ఇవ్వలేదు. అయితే రాజకీయ విశ్లేషణలో - ప్రధానంగా తులనాత్మక విశ్లేషణలో - ఈస్టన్ సిద్ధాంతం చాల ఉపయోగపడుతుంది. రాజకీయ విశ్లేషణకు ఇది ఒక విస్తృతమైన చట్రాన్ని అందించింది. తొలిసారిగా వ్యవస్థల సిద్ధాంతాన్ని అందించిన ఘనత డేవిడ్ ఈస్టన్‌కే లభించింది.

2.9 నిర్మితులు - విధుల విశ్లేషణ :

ఆధునిక దృక్పథంలో ప్రవర్తనావాద విప్లవం ఫలితంగా ఏర్పడ్డ మరో పద్ధతి నిర్మితులు - విధుల విశ్లేషణ (Structural - Functional Analysis) సమకాలీన తులనాత్మక అధ్యయనంలో యథార్థ రాజకీయ ప్రక్రియ విశ్లేషణకు ఎక్కువగా ప్రముఖ్యముంది. రాజకీయ దృగ్విషయాలన్నీ మానవ ప్రవర్తన పైనే ఆధారపడి ఉంటాయి. ప్రవర్తనను పరిసరాలు ప్రభావితం చేస్తాయి. అందువల్ల ప్రవర్తన నిశ్చయ రూపాలైన సామాజిక, ఆర్థిక, మనోవైజ్ఞానిక సంబంధిత విషయాలను అధ్యయనం చేయాలి. నిర్మితులు - విధుల విశ్లేషణ ప్రధాన లక్ష్యం ఒక రాజకీయ వ్యవస్థ వాస్తవ నిర్మితులు, ప్రక్రియలు, యంత్రాంగాలు, విధులను వివరించటం. ఇది విధుల నిర్వహణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తుంది.

ప్రతి రాజకీయ వ్యవస్థలోను కొన్ని నిర్మితులుండి అవి నిర్దేశించిన విధులను నిర్వహిస్తాయని నిర్మితుల - విధుల దృక్పథం భావిస్తుంది. గేబ్రియల్ ఆల్మండ్ "రాజకీయాభివృద్ధి" (Political Development) అనే గ్రంథంలో ఈ దృక్పథాన్ని వివరించాడు. ఇతడు ప్రతిపాదించిన దృక్పథం ప్రకారం ప్రతి రాజకీయ వ్యవస్థలోను కొన్ని నిర్మితులు అన్ని కాలాలలో కొన్ని సాధారణ కర్తవ్యాలను నిర్వహిస్తాయి. విధుల నిర్వహణ రీతులను, చట్ట రాజకీయ వ్యవస్థలను శ్రేణీకరించటం జరుగుతుంది. అయితే రాజకీయ వ్యవస్థలెండు విధులను తప్పనిసరిగా నిర్వహిస్తుంది. అవి ఉత్పాదక లేదా రాజకీయ విధులు, ఉత్పాదిత లేదా ప్రభుత్వ విధులు. ఉత్పాదక విధులను ఆల్మండ్ (1) రాజకీయ సామాజికీకరణ (2) రాజకీయ భర్తీ (3) ప్రయోజనాల వ్యక్తీకరణ (4) ప్రయోజనాల సమీకరణ (5) ప్రసారంగా వర్గీకరించాడు. ఉత్పాదిత విధులను (1) నియమాల రూపకల్పన, (2) నియమాల అనువర్తనం (3) నియమపరమైన న్యాయనిర్ణయాలుగా గుర్తించాడు.

నిర్మితులు - విధుల మధ్య సంబంధాలను కనుక్కోవటానికి పరిసరాల వ్యవస్థలు ఏవిధంగా పరస్పరం స్పందిస్తాయో అన్వేషించాలని ఆల్మండ్ భావిస్తాడు. నిర్మితుల స్థాయిని బట్టి అవి సాంప్రదాయికమైనవా లేదా అభివృద్ధి చెందిన వ్యవస్థలా నిర్ణయించవచ్చు. నిర్మితులు తక్కువ స్థాయిలో ఉంటే అవి అభివృద్ధి చెందుతున్నవిగా, ఎక్కువగా ఉంటే అవి అభివృద్ధి చెందిన వ్యవస్థలుగా భావించవచ్చు.

"తులనాత్మక రాజకీయాలు - అభివృద్ధి పరదృక్పథం" (Comparative Politics - Developmental Approach) అనే మరో గ్రంథంలో నిర్మితులు - విధులు దృక్పథంలో కొన్ని మార్పులు ఆల్మండ్ చేశాడు. సమతౌల్య పరిరక్షణకు తాను ఇచ్చిన ప్రాధాన్యత వల్ల తన దృక్పథం అభివృద్ధి చెందుతున్న రాజకీయ వ్యవస్థల విశ్లేషణకు ఉపయోగపడదన్న ఎమర్శలోని వాస్తవాన్ని ఆయన గుర్తించాడు. అందువల్ల ఆయన రాజకీయ వ్యవస్థను సమైక్యమైనదిగా భావించాడే కాని సమైక్యమైనదిగా పరిగణించలేదు. ఒక రాజకీయ వ్యవస్థలో కార్మిక సంఘాలు వృద్ధి చెందుతున్న దాన్ని బట్టి రాజకీయ పక్షాలు, ఎన్నికల ప్రక్రియలు, శాసనసభ, ఉద్యోగిస్వామ్యం ప్రభావితమవుతాయని భావించాడు. పరస్పర చర్యల స్వభావం కలిగిన వ్యవస్థల్లో స్థిరమైన, సమైక్యమైన నైజంతో పాటు పరస్పరాధారితంగా ఉంటాయి.

మార్పులు, చేర్పులు చేసిన సమూనాలో ప్రయోజనాల వ్యక్తీకరణ, ప్రయోజనాల సమీకరణలు మాత్రమే ఉత్పాదక విధులుగా ఉన్నాయి. ఉత్పాదక, ఉత్పాదిత విధుల్లో దేనికీ చెందకుండా ప్రసార విధులకు స్వతంత్ర ప్రతిపత్తి ఉంటుంది. పైరెండు విధులను ప్రసారం చేయాల్సి ఉంటుంది కాబట్టి అవి ఉత్పాదక, ఉత్పాదిత విధుల మధ్య ప్రక్రియగా, యంత్రాంగంగా ఉంటాయి.

పై విధంగా తులనాత్మక రాజకీయాల్లో ఆల్మండ్ ప్రతిపాదించిన నిర్మితులు - విధుల దృక్పథం ఆధునిక సమకాలీన రాజకీయ వ్యవస్థల అధ్యయనంలో కీలకపాత్ర నిర్వహిస్తుంది. అయితే ఈ దృక్పథం రాజకీయ వ్యవస్థలోని స్థిర సంబంధాలను పరిగణనలోకి తీసుకొంటేగాని వాటి గతిశీల స్వభావాన్ని గుర్తించలేదు. అంతే కాకుండా రాజకీయ వ్యవస్థను సామాజిక వ్యవస్థలో ఒక ఉప వ్యవస్థగా పరిగణించింది. సామాజిక వ్యవస్థ అధ్యయనాన్ని రాజకీయ వ్యవస్థ స్థిరత్వంతో ముడిపెట్టిందే కాని మార్పులను గురించి ప్రస్తావించలేదు.

పైగా ఈ దృక్పథం అభివృద్ధి చెందిన రాజకీయ వ్యవస్థల విశ్లేషణకు ఉపకరిస్తుందే కాని అభివృద్ధి

చెందుతున్న వెనకబడిన మూడో ప్రపంచ దేశాల వ్యవస్థల అధ్యయనానికి అంతగా ఉపయోగపడదు. ఇక్కడి సమాజాల్లో జాతి, మత, భాషా, తెగ, ఉపతెగ, ఉపజాతి సమస్యలు అనేకం ఉన్నాయి. వాటి ఒత్తిడి రాజకీయ వ్యవస్థను స్థిరంగా ఉంచదు. అయితే నిర్మితి - విధుల దృక్పథం ఏమైనప్పటికీ తులనాత్మక రాజకీయ దృగ్విషయాల వివరణలో ఒక మైలు రాయి అని చెప్పవచ్చు.

2.10 మార్క్సిస్టు దృక్పథం

ఇంతవరకూ మనం చర్చించిన తులనాత్మక రాజకీయాల అధ్యయనం ఆధునిక దృక్పథాలు మౌలికంగా పాశ్చాత్య రాజకీయ వ్యవస్థలను దృష్టిలో ఉంచుకొని రూపొందినవి. వాటికి భిన్నంగా మార్క్సిస్టు దృక్పథం ఆర్థిక విశ్లేషణ ప్రాతిపదికపై రూపొందింది. తనదే సరి అయిన శాస్త్రీయ దృక్పథంగా వివరించటానికి ప్రయత్నిస్తుంది. ఆయా సమాజాల చారిత్రక పరిణామాలను, గతితార్కిక పరిణామ చట్రంలో అధ్యయనం చేయడానికి మార్క్సిస్టు దృక్పథం ప్రయత్నిస్తుంది. వాస్తవ చారిత్రక పరిస్థితులను విస్మరించే అధ్యయన దృక్పథాలను ఇది ఖండిస్తుంది.ఆర్థిక స్థితిగతులు, పౌర సమాజం, రాజ్య సిద్ధాంతం, శాస్త్రం మొదలైనవి కారకాలుగా సమాజ నిర్మితి అధ్యయనానికి మార్క్సిజం ప్రత్యేక సైద్ధాంతిక గుర్తింపును ఇవ్వలేదు. సామాజిక నిర్మితిలో ఆర్థికాంశాలకు విశేష ప్రాధాన్యమిచ్చింది. ఆర్థిక సంబంధాలు పునాదిగా సమాజంలోని అన్ని అంశాలు ఉపరితల నిర్మితుల్లో నిక్షిప్తమవుతాయి. ఆర్థిక సంబంధాల్లో మార్పులు వచ్చినపుడు ఉపరితలంలోని నిర్మితుల్లో కూడా మార్పులు వస్తాయని మార్క్సిస్టు దృక్పథం భావిస్తుంది.

అనుభవవాద పరిశీలనలో దత్తాంశాలు వివరణతో కూడిన శాస్త్రీయ పద్ధతినే మార్క్స్ కూడా ఆవలంబించాడు. వ్యవస్థల విశ్లేషణలో ఆర్థిక సంబంధాలను స్థిరమైన కారకంగా ఇతర అంశాలను అంటే రాజకీయ సామాజిక, సాంస్కృతిక మొదలైన చలాంకాలను వెలుగులోకి తెచ్చిన మొట్టమొదటి రాజకీయ, సామాజిక శాస్త్రజ్ఞుడిగా మార్క్స్‌ను పరిగణించవచ్చు.

శాస్త్రీయ పద్ధతిగా మార్క్సిస్టు దృక్పథానికి కొన్ని ప్రధాన లక్షణాలున్నాయి. వాటిలో మొదటిది - గతితార్కిక పద్ధతి. శాస్త్రానికి నిర్వచనాలు ఇవ్వటంతో ఇతర దృక్పథాల నుంచి విభేధించినప్పటికీ మార్క్సిజం అధ్యయన పద్ధతులు శాస్త్రీయమైనవే. ఎందుకంటే యథార్థ పరిస్థితులను గురించిన సమాచారం సేకరించగల పద్ధతులనే శాస్త్రీయమైనవి. చరిత్రలో మరుగుపడిన యథార్థాలను వెలికి తీయడానికి మార్క్సిజం గతితార్కిక పద్ధతిని వినియోగించింది. మనకు కనిపించే ప్రతి అంగంలోను కనిపించని యథార్థాలు ఉంటాయని, వాటిని విశ్లేషించటం అవసరమని భావిస్తుంది. గతితార్కిక సమాజ శాస్త్రమే మార్క్సిజంగా ముద్ర వేసుకొంది. చారిత్రక భౌతికవాదం ద్వారా మార్క్స్ నిశ్చయాత్మక సమాజ శాస్త్రానికి విశేషమైన సేవ చేశాడు. సామాజిక గమనం గురించి ఆయన కొత్త, పరిస్థితులను చెప్పలేదు గాని, నిగూఢంగాఉన్న అంశాలను, వాస్తవాలను బయటికి తీసి వాటి ప్రాతిపదికపై నూతన సిద్ధాంతాన్ని రూపొందించటానికి మార్క్స్ వినియోగించిన గతితార్కిక అధ్యయన పద్ధతి తులనాత్మక రాజకీయాల అధ్యయనానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది.

గతితార్కిక పద్ధతిని గమనానికి సంబంధించిన సాధారణ సూత్రాలుగాను, అభివృద్ధి స్వభావంగాను మార్క్స్ వివరించాడు. గతితార్కిక పద్ధతి వైరుధ్యాల ద్వారా మార్పులు ఏ విధంగా సంభవిస్తాయో వివరిస్తుంది. వైరుధ్యాల సంఘర్షణ ద్వారా సమాజం సమున్నత సంక్లిష్ట స్థాయికి చేరుకొంటుందని మార్క్స్ భావిస్తాడు. ఆయన దృష్టిలో వైరుధ్యాలే ప్రపంచ గమనానికి మూలసూత్రాలు. ఘర్షణలు, వైరుధ్యాల ఫలితంగా సామాజిక మార్పులు ఏర్పడతాయి. ప్రతి సమాజంలో దాని వినాశనానికి దోహదం చేసే కారకాలు ఉంటాయి. సమున్నత స్థితికి పరివర్తన చెందటానికి అవి ఉపయోగపడతాయి. ప్రపంచ చరిత్ర ప్రతి దశలో పరస్పర విరుద్ధ శక్తులు ఉంటాయి. వాటి మధ్య సంఘర్షణలే చరిత్ర గమనానికి చక్రాలు. ఒక వైరుధ్యం నశించిపోతుండగా దానిలో నుంచి మరొకటి ఉద్భవిస్తుంది. పాత కొత్తల మధ్య, మరణిస్తున్న దానికి, జనిస్తున్న దానికి మధ్య, క్షీణిస్తున్న దానికి, అభివృద్ధి చెందుతున్న దానికి మధ్య జరిగే పోరాటమే అభివృద్ధి క్రమం సారాంశం.

మార్క్సిస్టు దృక్పథం ప్రకారం మొత్తం చరిత్ర గమనం ఉత్పత్తి శక్తుల ద్వారానే జరుగుతుంది. మానవ జీవనానికి

అవసరమైన వస్తువుల ఉత్పత్తి, ఉత్పత్తి అయిన వస్తువుల మార్పిడి సమాజ నిర్మాణానికి ప్రాతిపదికలు. ప్రతి సమాజంలో ఏవి ఎలా ఉత్పత్తి అవుతున్నాయి, ఉత్పత్తుల మార్పిడి ఏవిధంగా జరుగుతున్నది. సంపద ఏ విధంగా పంపిణీ అవుతున్నది, సమాజం ఏలా వర్గీకృతమైంది మొదలైనవే ప్రధానాంశాలని మార్క్స్ భావిస్తాడు.

అంతర్గత వైరుధ్యాలప్రాతిపదికగా ఉత్పత్తి సాధనాల యాజమాన్యం పరంగా వర్గ పోరాటం ద్వారా ఉద్భవించిన ఆధునిక సమాజం వర్గ వైరుధ్యాలను నిర్మూలించలేక పోయిందని మార్క్స్ భావించాడు. పాత వర్గాల స్థానంలో కొత్త వర్గాలు పాత దోపిడీ పద్ధతులకు బదులు కొత్త దోపిడీ మార్గాలు ఏర్పడ్డాయంటాడు. వర్గ పోరాటం అంతిమ స్థాయిలో పెట్టుబడిదారులు, శ్రామిక వర్గాలు పరస్పరం ఎదుర్కొంటాయని, వీటి మధ్య పోరాటం అనివార్యమని చివరిగా జరిగే ఆఖరి పోరాటంలో శ్రామిక వర్గం పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలించి వర్గరహిత, రాజ్యరహిత సమాజాన్ని నిర్మిస్తుందని మార్క్సిజం ఉద్ఘోషిస్తుంది.

సామ్యవాదం, తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం మొదలైన వాటికే మార్క్సిజం పరిమితం కాలేదు. విజ్ఞాన శాస్త్రాలన్నింటిలోను ఇది విప్లవాత్మకమైన ప్రధాన కారణమైంది. ఒక విధంగా చెప్పాలంటే మార్క్సిస్టు దృక్పథాన్ని అధ్యయన సాధనంగా గుర్తించిన తరవాతనే విజ్ఞాన శాస్త్రాలకు శాస్త్రీయ దృక్పథం ఏర్పడింది. సామాజిక అభివృద్ధిని అవగాహన చేసుకొని సూత్రాలుగా గతితార్కిక భౌతికవాదం ద్వారా చారిత్రక, ఆర్థిక అధ్యయనం ద్వారా, మార్క్సిస్టు దృక్పథం ఆధునిక కాలంలో శాస్త్రీయ స్వభావం సంతరించుకొంది.

2.11 ముగింపు :

తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో 19వ శతాబ్దం వరకూ సాంప్రదాయిక దృక్పథం ప్రాధాన్యం వహిస్తే 20వ శతాబ్దంలో శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో సాధించిన అభివృద్ధి, అర్థికపరమైన అంశాలు పశ్చిమ దేశాలలో, నెలకొన్న ఉదారవాద రాజకీయ ప్రజాస్వామ్య సమాజాలు, రెండో ప్రపంచయుద్ధంతరవాత నూతనంగా ఆవిర్భవించిన మూడో ప్రపంచ రాజ్యాల రాజకీయ వ్యవస్థలు, రాజనీతిశాస్త్ర పరిధిని విస్తృతంచేశాయి. సాంప్రదాయిక పద్ధతులలో కేవలం చట్టాలు, చారిత్రకత రాజ్యాంగపరంగా రాజకీయ సంస్థల విశ్లేషణ, పేలవంగా, అర్థరహితంగా ఉండటమే కాకుండా రాజనీతి విశ్లేషణ అమూర్తంగా మిగిలిపోయింది. తులనాత్మక రాజకీయాల అధ్యయనానికి శాస్త్రీయదృక్పథాన్ని కల్పించటానికి, రాజనీతి అధ్యయనాన్ని వాస్తవ సమస్యల పరిష్కారాన్ని సూచించే విజ్ఞాన శాస్త్రంగా మలచటానికి 20వ శతాబ్దంలో ఆధునిక దృక్పథాలు, ప్రవర్తనావాద విప్లవం ప్రభావంతో రూపొందాయి. వీటిలో అనేక లోపాలు ఉన్నప్పటికీ అవి చేసే కొన్ని విశ్లేషణలు, అందించే అనుభవ పూర్వక సూత్రాలు, సేకరించిన సమాచారం ప్రాముఖ్యాన్ని తేలిగ్గా తీసి పారెయ్యటం సాధ్యంకాదు.

– డా॥ వి. రవీంద్ర శాస్త్రి

2.12 చదువదగిన పుస్తకాలు

1. *Gabriel Almond* : *Comparative politics: A Developmental approach*
2. *David Apter* : *Introduction to political analysis*
3. *Robert Dhal* : *Modern political analysis*
4. *Finer* : *Theory and practice of modern Government*
5. *Krishna Daya* : *Political development : a Critical perspective*

2.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

ఈ కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో జవాబులు రాయుము.

1. తులనాత్మక రాజకీయాల అధ్యయన దృక్పథాలను చర్చించండి.

2. ప్రవర్తనావాదం తులనాత్మక రాజకీయాల అధ్యయనాన్ని ఏవిధంగా ప్రభావపరిచింది ?

3. తులనాత్మక రాజకీయాల ఆధునిక అధ్యయన పద్ధతులను చర్చింపుము.

కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా జవాబులు రాయండి.

1. సాంప్రదాయ అధ్యయన పద్ధతి
2. వ్యవస్థల విశ్లేషణ
3. మార్క్సిస్టు దృక్పథం

***

ఖండం-II రాజకీయ విశ్లేషణ

తులనాత్మక రాజకీయాల అధ్యయనానికి అనుసరించిన ఆధునిక పద్ధతులు లనేకం. ప్రవర్తనావాద విప్లవ ఫలితంగా చాలా ఆధునిక అధ్యయన పద్ధతులు అవతరించాయి. తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో అనుసరించిన వివిధ పద్ధతులను ఈ ఖండంలో తెలుసుకుంటాం.

భాగం - 3: రాజకీయ అభివృద్ధి

విషయ క్రమం

3.1 లక్ష్యాలు
3.2 పరిచయం
3.3 మూడవప్రపంచదేశాలు-అధ్యయనాలు
3.4 రాజకీయఅభివృద్ధి
3.5 రాజకీయ అభివృద్ధి-అర్థం
3.6 లూసియన్‌పై వివరణ
3.7 ఆల్మండ్, పోవెల్‌ల భావాలు
3.8.0 రాజకీయ అభివృద్ధిలో సంక్షోభం
  3.8.1 వ్యక్తిత్వం సంక్షోభం
  3.8.2 శాసనబద్ధత సంక్షోభం
  3.8.3 నునిశిత దృష్టి సంబంధమైన సంక్షోభం
  3.8.4 భాగస్వామ్య సంక్షోభం
  3.8.5 సమగ్రతా సంక్షోభం
  3.8.6 పంపిణీ సంక్షోభం
3.9 అభివృద్ధి కార్యక్రమాలు
3.10 సామ్యూల్ హంటింగ్‌టన్ నిర్వచనం
3.11 జె.పి.నెట్టల్ భావాలు
3.12 రాజకీయ అభివృద్ధి సూచికలు
3.13.0 రాజకీయ అభివృద్ధి : సిద్ధాంతీకరణ
  3.13.1 నిరంతర ప్రక్రియ నమూనా
  3.13.2 దశల నమూనా
3.14 రాజకీయ అభివృద్ధి-సమీక్ష
3.15 కొన్ని విమర్శలు
3.16 చదువదగిన పుస్తకాలు
3.17 నమూనా పరీక్షా ప్రశ్నలు

3.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివిన మీరు

* రాజకీయ అభివృద్ధి అర్థం,
* ఆల్మండ్, పోవెల్‌ల అధ్యయనాలు
* రాజకీయ అభివృద్ధిలో సంక్షోభాలు,
* రాజకీయ అభివృద్ధి సిద్ధాంతీకరణ సమీక్ష విమర్శలను బాగా వివరించగలుగుతారు.

3.2 పరిచయం

రాజకీయాభివృద్ధి రాజనీతి శాస్త్ర పదకోశంలో కొత్తపదం. రాజనీతిశాస్త్రకోవిదులతోపాటు రాజనీతి శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు గూడా ఈ పదాన్ని మొదట ఉపయోగించటం గమనించదగ్గ విషయం. ఆర్థిక సామాజిక శాస్త్ర విద్వాంసులుకూడా ఉపయోగించాకనే ఈపదం విద్యారంగంలోను, రాజనీతి శాస్త్ర పరిభాషలోను విరివిగా వాడకంలోకి వచ్చింది. తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో గత మూడునాలుగు దశాబ్దాల నుండి ఈ పదం బాగా

వాడుకలోకి వచ్చింది. రాజకీయాభివృద్ధి భావన అతి కొద్దికాలంలోనే అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకొని తులనాత్మక రాజకీయాల పాఠ్యాంశాలలో అంతర్భాగమైపోయింది. ఇప్పటిదాకా ఈ పదానికి ఖచ్చితమైన అర్థాన్ని నిర్వచనాన్ని ఎవ్వరూ నిర్ణయించలేదు. లూసియన్ పై (Lucian pye) అభిప్రాయంలో "ఈపదాన్ని వాడటంలో ఇంకా గణనీయమైన అస్పష్టత సందిగ్ధత నెలకొని ఉంది".

తులనాత్మక రాజకీయాలపై తొలుత అమెరికా రాజనీతిశాస్త్రవేత్తలు విస్తృత ప్రాతిపదికలో అధ్యయనాలు చేపట్టి ఈరంగంలో కొత్త వరవడులకు శ్రీకారం చుట్టారు. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలో అనేక ప్రాంతాలు వలస పాలననుండి విమోచన చెంది స్వతంత్ర రజ్యాలుగా రూపొందాయి. ఆ దేశాలు అభివృద్ధికి ఆధునికీకరణకు చేస్తున్న ప్రయత్నాలు అమెరికా రాజనీతి శాస్త్రవేత్తలను ఆకర్షించి, వారిచేత రాజకీయాభివృద్ధి భావనను అధ్యయనం చేయ ప్రోత్సహించాయి. అభివృద్ధిచెందుతున్న దేశాల పర్యావరణస్థితులను పరిగణనలోనికి తీసుకొని వాటి రాజ్య వ్యవస్థల అధ్యయనాన్ని ఏభై అరవై దశకాలలో చేపట్టి తులనాత్మక రాజకీయాలలో విద్యాపరమైన ఒక విప్లవానికి నాందిపలకటమేకాకుండా రాజకీయ అభివృద్ధి భావనకు ఒక అవగాహన, ఆపైన ఒక సిద్ధాంతం ప్రతిపాదించటంలోను కృతకృత్యులయ్యారు. ఈమొత్తం ప్రయత్నాలను మూడు వేరు వేరు దశలుగా చేసి అధ్యయనం చేయవచ్చు. దీనికి ముందు పాశ్చాత్య రాజనీతి శాస్త్రవేత్తలు మూడవ ప్రపంచదేశాలలో జరుగుతున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ మార్పులు, ఆధునికీకరణ ప్రయత్నాలపై మొదట జరిపిన అధ్యయన స్వరూప స్వభావాలను క్లుప్తంగా తెలుసుకోవటం చాలా అవసరం.

3.3 మూడవ ప్రపంచదేశాలు-అధ్యయనాలు

1958లో డేనియల్ లెర్నర్ (Daniel learner) రచించిన "ది పాసింగ్ ఆఫ్ ట్రడిషనల్ సొసైటీస్ (The passing of Traditional Societies) మోడరనైజింగ్ ది మిడిల్ ఈస్ట్ (Modernising the middle East) ఈ దిశలో సాగిన మొదటి ప్రయత్నాలుగా పేర్కొనవచ్చు. ఇవి ప్రశ్నావళి, ముఖాముఖి భేటీల సహాయంతో గ్రీసు, ఈజిప్టు, ఇరాన్, జోర్డాన్, లెబనాన్, సిరియా, టర్కీ దేశాలలో చేసిన క్షేత్ర పరిశోధన ఆధారంగా ప్రకటితమైన గ్రంథాలు. వీటికి ముందు మూడవ ప్రపంచ దేశాలలో వస్తున్న మార్పులపై టాల్కాట్‌పార్సన్స్, రాబర్టు ఎఫ్. బోల్స్, ఎడ్వర్డు ఎ.షీల్స్ నెయిల్ జె. స్మెల్సర్ చేసిన పరిశోధనలుకూడా పేర్కొన తగినవి. ఆలాగే ఆర్.ఎన్. బెల్లా, నెయిల్ జె. స్మెల్సర్‌లు జపాను, బ్రిటనులలో పారిశ్రామీకరణ ప్రభావం సామాజిక మార్పులను ఎంతవరకు సహకరిస్తున్నది లేనిది చెబితే, ఆధునికీకరణం ఫలితంగా మారుతున్న విలువల ప్రాధాన్యతలు, ప్రజల జీవన సరళిపై మానసిక సాంస్కృతిక ఒత్తిడులు, స్పందనలను లెర్నర్ పరిశీలించారు. ఆధునికీకరణ, పారిశ్రామికీకరణలతో వ్యవస్థ వివిధాంగములలో జరిగే మార్పులను స్మెల్సర్ పరిశీలించగా మానసికంగా జరిగే మార్పులను లెర్నర్ విశ్లేషించారు.

ఇదే కాలంలో అభివృద్ధిచెందుతున్న దేశాల రాజ్యవ్యవస్థలు వాటి స్వరూప స్వభావాలు అవగాహన చేసుకొనే ప్రయత్నంలో కొందరు ప్రతిభావంతులైన రాజనీతి శాస్త్రజ్ఞులు పలురచనలు చేశారు. జేమ్స్ ఎస్. కోల్‌మాన్ (James S. Coleman) డబ్ల్యూహవార్డ్ రిగ్గిన్స్ (W. Howard Wriggins) లియొనార్డ్ బైండర్ (Leonard Binder) హార్ బర్ట్‌ఫెయిత్ (Herbert Feith) లూసియన్‌పై (Lucian pye) మైరన్‌వీనర్ (Myron weiner) డేవిడ్ ఆప్టర్ (David Apter) మొదలగు వారు నైజీరియా, శ్రీలంక, బర్మా, ఇండియా, ఘనా, మున్నగు దేశాలపై దోహదపడే విధంగా ఉండటమేకాకుండా ఆదేశాలలో జాతీయతాభావం ఏవిధంగా అభివృద్ధి చెందుతున్నదో, పరిశీలించారు. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతికంగా ఆదేశాలు ఎదుర్కొంటున్న సందిగ్ధావస్థ, రాజకీయాభివృద్ధిలో ఉద్యోగ బృందపు పెత్తందారీ వైఖరులు, సైన్యం పాత్ర, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య పాలన ఎందుకు బలహీనపడుతున్నది, జాతీయ రాజ్య నిర్మాణంలో రాజకీయ దృక్పథం, వ్యక్తుల ప్రవర్తన, ఆర్థిక వెనుకబాటుతనం ఇవి రాజకీయాలపై చూపుతున్న ప్రభావం మున్నగా విషయాలను లోతుగా పరిశీలించి, ఆ రాజ్యాల వ్యవస్థలను అవగాహనచేసుకోవటంతోపాటు, వాటి మూలంగా మిగతా దేశాలపై అధ్యయనాలు జరపటానికి కూడా ఉపకరించాయి.

రాజకీయాభివృద్ధి పదాన్ని రాజనీతిశాస్త్రజ్ఞులు అనేక రకాలుగా, వేరువేరు దృక్పథాలతో నిర్వచించటంవల్ల ఈ పదానికి కొంత అవగాహనాలోపం సిద్ధించటమేగాక కొంత గందరగోళపరిస్థితికూడా ఏర్పడింది. ఈ పరిస్థితిలో

రాజకీయాభివృద్ధికి ఒక నిర్దిష్టమైన అర్థం, నిర్వచనం అవశ్యకతను గుర్తించి, తద్వారా రాజకీయాభివృద్ధి సిద్ధాంతానికి పునాది వేయటంలో అమెరికా సాంఘిక శాస్త్ర పరిశోధనాసంస్థ ఏర్పాటు చేసిన తులనాత్మక రాజకీయాలపై సంఘం (Committee on comparative politics of the American Social Science Research Council) పాత్ర చాలా ప్రశంసనీయం.

1963లో గేబ్రియల్ ఆల్మండ్ అధ్యక్షతన ఏర్పడిన సంఘం రాజకీయాభివృద్ధి రంగంలో కృషి పలుపుతున్న చాలామంది శాస్త్రజ్ఞులను దానికి సంబంధించిన రంగంలో విశేష కృషి చేసిన రచయితలను ఒకే వేదికపై సమావేశపరచి, వారిచేత అభివృద్ధి చెందుతున్న దేశాల రాజకీయాభివృద్ధిపై ఒక బృహత్తర గ్రంథ ప్రచురణ కార్యక్రమాన్ని చేపట్టింది. 1963-66 సంవత్సరాల మధ్యలో వీరు ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం అధ్వర్యంలో రాజకీయాభివృద్ధికి సంబంధించి వేరువేరు అంశాలపై ఏడు సంపుటాలను ప్రచురించారు. అవి :

1. Lucian Pye (ed) : Communications and Political Development
2. Joseph La Palombara (ed) : Bureaucacy and Political Development
3. Roberte Warasc Dankwart A. Rustow : Political Modernisation in Japan and Turkey
4. James s. Coleman (ed): Education and Political Development
5. Lucian pye & Sydney Verba : Political culture and Political Development.
6. Joseph Lapalombra & Myron Weiner: political Partien and Political Development.
7. Leonard Binder, James S. Colman, Joseph Lapalombra, Lucian Pye and Myron weiner : Crisis and Sequences in political Development.

ఈ గ్రంథాలలో అనేక ఆసక్తిదాయకమైన అంశాలను సునిశితంగా, శాస్త్రీయంగా చర్చించారు. ఈ రచయితలుచేసిన ప్రయత్నాలు రాజకీయాభివృద్ధి సిద్ధాంత నిర్మాణంలో పూర్తిగా విజయవంతం కాకపోయినను, వీరి కృషి తద్వారా చేసిన సూచనలపల్ల రాజకీయాభివృద్ధిని సిద్ధాంతపరంగా అవగాహన చేసుకోవడంలో సహకరిస్తుంది.

3.4 రాజకీయ అభివృద్ధి

రాజకీయాభివృద్ధికి సంబంధించిన భావనను ప్రగాఢంగా విశ్లేషించిన తొలిరచయితల్లో లూసియన్‌పై అగ్రగామియని పేర్కొనవచ్చును. లూసియన్‌పై తన భావాలకు రూపకల్పన చేస్తూ, రాజకీయాభివృద్ధి సాహిత్యంపై చెరగని ముద్రవేశారు. 1963లో రాజకీయాభివృద్ధికి సాంస్కృతికపరంగా నూతన నిర్వచనాన్ని ఇవ్వటంలోనూ. నూతన అవసరాలకు పురాతన పద్ధతులను అనుసరించటం, మిశ్రమం చేయటం, సర్దుబాటు చేసుకోవాలని సూచించటంతో లూసియన్‌పై కొత్త ప్రమాణాలను రూపొందించారు. రాజకీయ అభివృద్ధి భావనను కొన్ని దేశాల్లో పరిశీలించిన తరువాత మిగతాదేశాల్లో కూడా పరిశీలించ ప్రయత్నించారు. రాజకీయ అభివృద్ధిభావన, ప్రాచీన జీవన పద్ధతులు, నూతన పద్ధతులను అనుసరించటం, సరుదుబాటు చేసుకోవటం, మొదలైన వాటికి నూతన స్వరూపాన్ని ఇవ్వటాన్ని సూచిస్తుంది. జాతీ రాజ్యాల ఆవిర్భావాన్ని (Emergencce of Nation States) రాజకీయ అభివృద్ధి మొదటి మెట్టుగా పైభావించారు. దీనికితోడు ప్రపంచ సంస్కృతిని అన్ని సమాజాల్లోనూ క్రమంగా వ్యాప్తిచెందటాన్ని (Diffusion of World Culture) సమర్థించేభావంగాకూడా పై భావించారు. తన రచనలలో లూసియన్‌పై రాజకీయ అభివృద్ధి, లక్షణాలు, రాజకీయ అభివృద్ధి సాధన, మూడవ ప్రపంచదేశాల్లో ఉత్పన్నమవుతున్న సమస్యలను క్షుణ్ణంగా చర్చించారు. రాజకీయ అభివృద్ధిపై తన అభిప్రాయం చెప్పే ముందు, ఆ భావనపై వివిధ రాజనీతి శాస్త్రజ్ఞులు వెలిబుచ్చిన అభిప్రాయాలను పరిశీలించిన తరువాత తన అభిప్రాయాలను పై ప్రకటించారు. అందువల్ల రాజకీయ అభివృద్ధి వివిధ అర్థాలను పరిశీలించటం చాల ముఖ్యమైన విషయం.

3.5 రాజకీయ అభివృద్ధి : అర్థం

చాలా మంది రాజనీతి శాస్త్రజ్ఞులు రాజకీయ అభివృద్ధి భావనను వివరించ ప్రయత్నించారు. రాజకీయ అభివృద్ధి భావనను మొదట రాజనీతి శాస్త్రజ్ఞులు, విధాన కర్తలు ప్రస్తావించారు. ఆ తరువాత ఆర్థిక, సామాజిక శాస్త్రజ్ఞులు అధ్యయనం చేయసాగారు. రాజకీయ అభివృద్ధి భావనను నిర్వచించటం చాలా కష్టం. అధ్యయనం చేసిన వారందరూ స్థూలంగా రాజకీయ సంస్థల స్వభావంలోని ఆంగిక మార్పు (Organic Change) ప్రక్రియను రాజకీయ అభివృద్ధిగా అంగీకరిస్తున్నారు.

A) **ఆర్థికాభివృద్ధికి రాజకీయాలు పూర్వాంశంగా రాజకీయ అభివృద్ధి :** పాల్ ఎస్. బారన్, బెంజిమన్ హిగ్గిన్స్, బార్బరావార్డ్ వంటి ఆర్థికశాస్త్రజ్ఞులు రాజకీయాలు ఆర్థికాభివృద్ధికి పూర్వాంశమన్న విషయాన్ని వెలిబుచ్చారు. వీరిదృష్టిలో ఆర్థికాభివృద్ధిపై రాజకీయ, సాంఘిక పరిస్థితుల ప్రభావం ఉంటుంది. రాజకీయ, సాంఘిక పరిస్థితులు ఒక రాజ్యంలో స్థిరంగా ఉన్నప్పుడే ఆ రాజ్యంలో ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నది వీరిభావన. ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాజ్యం, రాజకీయంగా కూడా అభివృద్ధి చెందినదై ఉండాలంటున్నారు. ఇందులో రాజకీయ అభివృద్ధికి తగిన పరిస్థితులు లేనప్పుడు రాజ్యం ఆర్థికంగా, పారిశ్రామికంగా వెనుకబడి ఉంటుందన్న భావం ఉంది. లూసియన్ పై అభిప్రాయంలో పై వివరణలో సానుకూల భావనకంటే వ్యతిరేకాత్మకభావం ఎక్కువగా ఉంది. వాస్తవంలో చాల దేశాలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయి. అంత మాత్రంచేత ఆ దేశాలలో రాజకీయ అభివృద్ధి కొరవడిందని చెప్పలేం. వెనుకబడిన దేశాల ప్రజలు ఆర్థిక ప్రగతితో సంబంధం లేనట్టి రాజకీయ అభివృద్ధిపట్ల ఆకర్షితులై ఉన్నారు.

B) **పారిశ్రామిక సమాజాల్లో ఉండే రాజకీయ నమూనాగా రాజకీయ అభివృద్ధి:** వాల్టు డబ్ల్యూ రోస్టోన్ అభివృద్ధిచెందిన పారిశ్రామిక సమాజాల్లో (అన్ని ప్రజాస్వామ్య సమాజాలు కాకపోయినా) కొన్ని రాజకీయచర్యలు, ప్రవర్తనలు విలక్షణంగాను ప్రముఖంగాను కనిపిస్తాయి. అదే రాజకీయ అభివృద్ధి. అవే రాజకీయాభివృద్ధికి చిహ్నాలు. ఈ భావన రాజకీయ అభివృద్ధిని సూచించే కొన్ని లక్షణాలను మాత్రమే గ్రహించి, మిగిలిన వాటిని నిర్లక్ష్యం చేస్తున్నది.

C) **రాజకీయాల ఆధునికీకరణగా రాజకీయ అభివృద్ధి :** సీమూర్ మార్టిన్ లిప్‌సెట్ (Seymore Martin Lipset) కార్ల్ డూష్ (Karl Deutch) జేమ్స్‌కోల్‌మాన్ వంటి సామాజిక సిద్ధాంతకారులు అభివృద్ధిచెందిన పాశ్చాత్య దేశాల రాజకీయ పరిస్థితులను అభివృద్ధి చెందుతున్న దేశాలు అనుకరించి ప్రయత్నించటమే రాజకీయ అభివృద్ధిగా పేర్కొన్నారు. వీరి దృష్టిలో రాజకీయ అభివృద్ధికి ఆధునిక పాశ్చాత్య రాజ్యవ్యవస్థలు మార్గదర్శకాలు. పాశ్చాత్య-ఆధునిక రెండు భావాల మధ్య విభేదాన్ని విడమర్చి చెప్పటంలో వీరి వివరణ విఫలమయిందని లూసియన్‌పై విమర్శించారు.

D) **జాతి రాజ్య నిర్వహణాపరంగా రాజకీయ అభివృద్ధి :** ఎడ్వర్డ్ షిల్స్, కె. హెచ్. సిల్వర్ట్, లిలియం మెక్కార్డ్ మొదలగు రచయితలు ఆధునిక జాతిరాజ్యం ఏర్పడి, వ్యవస్థీకృతమైన రాజకీయ జీవితం కలిగి, రాజకీయ విధులు నిర్వహించే సామర్థ్యత ఉండటమే రాజకీయ అభివృద్ధి అని అభిప్రాయ పడ్డారు. కాని రాజకీయ అభివృద్ధి జాతి రాజ్య నిర్మాణంతో ఆగిపోదు. జాతీయతా భావం వివిధ వర్గాల ప్రజల మధ్య పెంపొందించి, తద్వారా ప్రజాభీష్టమైన కార్యక్రమాలు చేపట్టి, ప్రజలను సంతృప్తి పరచటమే రాజకీయ అభివృద్ధి అవుతుందని లూసియన్‌పై అన్నారు.

E) **పరిపాలన, న్యాయ పరమైన అభివృద్ధిగా రాజకీయ అభివృద్ధి :** మాక్స్‌వెబర్, జోసెఫ్‌లా పలాంబరాలాంటి సైద్ధాంతికులు రాజ్యవ్యవస్థ పాలనాపరంగాను, శాసనపరంగాను అభివృద్ధి చెందటాన్ని రాజకీయ అభివృద్ధిగా పేర్కొన్నారు. ఈ నిర్వచనం ప్రకారం రాజకీయ అభివృద్ధికి సమర్థవంతమైన ఉద్యోగి స్వామ్యంచాలా అవసరం. కాని రాజకీయ అభివృద్ధి ముఖ్యలక్షణాలైన - పౌరసత్వ శిక్షణ, ప్రజా భాగస్వామ్యం, మొదలైన వాటిని ఈభావన నిర్లక్ష్యం చేసిందన్నారు విమర్శకులు.

F) **రాజ్య వ్యవహారాలలో ప్రజలకు విస్తృత భాగస్వామ్యం ఉండటమే రాజకీయ అభివృద్ధి :** రాజకీయ

చైతన్యం, భాగస్వామ్యం విస్తృత పరచుకొనే దిశలో ప్రజలు ప్రవర్తించటాన్ని రాజకీయ అభివృద్ధి చిహ్నాలుగా రూపర్ట్ ఎమర్సన్, బెర్ట్ హాస్‌లిట్జ్‌లు పేర్కొన్నారు. ఇటువంటి రాజకీయాలు సమాజంలో ఉద్రేకాలకి, అవినీతికి దారితీసే అవకాశం కల్పిస్తాయని లూసియన్‌పై పేర్కొన్నారు.

G) **ప్రజాస్వామ్యం నెలకొల్పటమే రాజకీయ అభివృద్ధి :** ప్రజాస్వామ్య వ్యవస్థలు, అలవాట్లు కలిగి ఉండటాన్ని రాజకీయ అభివృద్ధిగా కొందరు రాజనీతి శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. జోసెఫ్ లాపలాంబరా రెండింటి సంబంధాన్ని చక్కగా వివరించారు. లూసియన్‌పై ఈ అభిప్రాయంతో కూడా పూర్తిగా ఏకీభవించలేదు. రాజకీయ అభివృద్ధి ప్రజాస్వామ్యంతోనే ముడిపడిఉండే ప్రజాస్వామ్యేతర సమాజాల మాట ఏమిటి ? అక్కడ అభివృద్ధి ఎట్లా అని కొందరు ప్రశ్నిస్తున్నారు.

H) **స్థిరత్వం లేదా క్రమబద్ధమైన మార్పుగా రాజకీయ అభివృద్ధి :** కారల్ దూష్, ఫ్రెడ్ డబ్ల్యూ, రిగ్స్ అభిప్రాయంలో పరిసరాలలో మార్పులు తెచ్చే సామర్థ్యంతో పాటు సామాజిక, ఆర్థిక స్థిరత్వం చేకూర్చటంలో కూడా రాజకీయ అభివృద్ధి ఆధారపడి ఉంది. ఏ ఉద్దేశ్యం కోసం మార్పుకావాలి ? ఈ మార్పులకు ఎలాంటి పద్ధతి అవలంబించాల్సి ఉంటుంది? అనే ప్రశ్నలకు ఈ సిద్ధాంతం వివరాలు ఇవ్వలేదు.

I) **అధికారాన్ని సమీకరించటం రాజకీయ అభివృద్ధి :** జేమ్స్ ఎస్ కోల్‌మాన్, గేబ్రియల్ అల్మండ్‌ల అభిప్రాయంలో వివిధ రాజ్యాల వనరులు సమానంగా ఉండవు. ఆయా రాజ్యాల వనరుల స్థాయిని బట్టి ఆయా దేశాల అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. తమకు ఉన్న వనరులను ప్రజలకు అవసరమైన కోర్కెలను తీర్చడానికి సక్రమంగా సమీకరించే శక్తి కలిగి ఉన్న రాజ్యమే రాజకీయంగా అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు. ఇలాంటి అన్వయం కేవలం ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలకే సరిపోతుందని లూసియన్ పై వివరించారు.

J) **బహుముఖ ప్రక్రియలతో కూడిన సామాజిక మార్పు రాజకీయ అభివృద్ధి :** మే. ఎఫ్. మిలికిన్ (Mayf. Millikin) డేనియల్ లెర్నర్ మొదలైన సామాజిక శాస్త్రజ్ఞులు సామాజికంగా జరిగే బహుముఖమైన అభివృద్ధి నుండి రాజకీయ అభివృద్ధిని వేరుచేయటం కష్టమని భావించారు. తక్కిన వాటినుండి రాజకీయ అభివృద్ధి కొంతవరకు మాత్రమే స్వతంత్రంగా ఉంటుందన్నారు. ఈ అభిప్రాయంతో అంగీకరిస్తూ లూసియన్ పై తన స్వంత అభిప్రాయాన్ని విపులీకరించారు.

3.6 లూసియన్‌పై వివరణ

రాజకీయ అభివృద్ధి చిహ్నాలను రాజ్యవ్యవస్థలో మూడు వేర్వేరు స్థాయిలో గుర్తించవచ్చునని లూసియన్‌పై అభిప్రాయం. అవి : 1 మొత్తం జనాభాకు సంబంధించిన స్థాయి; 2. ప్రభుత్వ స్థాయి, సాధారణ పద్ధతి నిర్వహణస్థాయి; 3. పౌరపాలనావ్యవస్థకు సంబంధించినస్థాయి.

రాజ్యంలో పౌరులు ఉన్నతాధికారులనుండి ఆజ్ఞలను పొంది వాటిని ఆచరించేవారిలాగా కాకుండా; రాజకీయ నిర్ణయాలను రూపొందించటంలో భాగస్వాములుగా ఉండి కృషిచేసే వారుగా ఉంటూ మొత్తం జనాభా స్వభావం లో మార్పురావటాన్ని రాజకీయ అభివృద్ధి అనవచ్చు. రెండవస్థాయిలో రాజకీయ అభివృద్ధితోపాటు రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వ వ్యవహారాలను నిర్వహించే సామర్థ్యం పెరుగుతుంది.. అలాగే వివాదాలను అదుపుచేయగల సామర్థ్యం, ప్రజలకు సంబంధించిన కోరికలను తీర్చగల సామర్థ్యం పెరుగుతుంది. ప్రజాపరమైన సృజనాత్మక, భాగస్వామ్య సమర్థతలేని అభివృద్ధిచెందని రాజకీయ వ్యవస్థకు ప్రజలను సుముఖులను చేసుకొనే సామర్థ్యం ఉండదు. రాజకీయ వ్యవస్థ నిర్మాణంలో అభివృద్ధి చెందుతున్న రాజకీయ వ్యవస్థ, నిర్మితులలో వ్యత్యాసాలకు, నిర్వహణాపరమైన నిర్దిష్టతను, భాగస్వామ్య సంస్థల సమగ్రతను సూచిస్తుంది.

లూసియన్‌పై ఇచ్చిన వివరణలను విశ్లేషిస్తే రాజకీయ అభివృద్ధికి మూడు ప్రధాన లక్షణాలను ఆపాదింపవచ్చు. అవి సమానత్వం, సామర్థ్యం, విభిన్నతలు. జేమ్స్‌ఎస్. కాల్మన్ కూడా వీటిని రాజకీయ అభివృద్ధికి సంబంధించిన ప్రత్యేకలక్షణాలని చెప్పారు.

(A) సమానత్వం : ఆధునిక రాజకీయ జీవనానికి సంబంధించిన అన్ని అంశాలలోను సంస్కృతి; ఆధునిక రాజకీయ సిద్ధాంతాలకు సంబంధించిన అన్ని రూపాల్లోను సమానత్వం ఉండాలి. రాజకీయ అభివృద్ధికి ప్రధానంగా అంశాలతో సమానత్వం ఉండాలి.

(i) జాతీయ పౌరసత్వం: సామాజిక, ఆర్థిక, రాజకీయ తదితర హక్కులలో దేశ పౌరులకు సమానత్వం ఉండాలి. కుల, మత, జన్మ, లింగ, రంగు తదితర ప్రాతిపదికలపై ఎట్టి విచక్షణలు ఉండరాదు.

(ii) న్యాయ వ్యవస్థ : దేశంలో "న్యాయ సమత"(EQUITY) ఉండాలి. శాసనం అందరికీ ఒకే విధంగా వర్తించేటట్లు న్యాయ వ్యవస్థ ఉండాలి. దేశంలో సమన్యాయ పాలన (RULE OF LAW) ఉండాలి.

(iii) పదవుల పంపకం : పదవుల పంపకంలో నిష్పక్షపాతం ఉండాలి. రాజకీయ, పాలనా సంబంధమైన పదవులన్నీ ప్రజ్ఞ ఆధారంగానే భర్తీ చేయాలి కాని కుల, మత, లింగ, రంగు, సంపద మొదలగు వాటి ప్రాతిపదిక మీద జరుగరాదు.

("B") సామర్థ్యం : రాజకీయ వ్యవస్థ సమాజం నుండి ఎదుర్కొనే సవాళ్ళను, ఇతర రాజకీయ వ్యవస్థల నుండి ఎదుర్కొనే సవాళ్ళను పరిష్కరించగల్గే శక్తియే సామర్థ్యత. ఎదురైన సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కొనగల్గితే రాజకీయ వ్యవస్థ మనుగడకు ముప్పు ఉండదు. లేని ఎడల రాజకీయ వ్యవస్థలో సమూలమైన మార్పులు స్థానం పొందుతాయి.

("C") విభిన్నతలు : వివిధ రాజ్య సంస్థలు, అంగాలు, విభిన్నతలను, ప్రత్యేకతలను సూచిస్తాయి. ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు నిర్వహించే విధుల విషయంలో నిర్దిష్టతలు, ఖచ్చితమైన పరిమితులు ఉండాలి. వాస్తవంలో ఇది వ్యవస్థలో శ్రమ విభజనను, విభిన్న రాజకీయ విధుల నిర్థిష్టతను సూచిస్తుంది. విభిన్నతలు అంటే భిన్న భాగాలుగా విడిపోవటం, విభిన్న భాగాలను వేరు చేయటమని కాదు.

చివరగా సమగ్ర ప్రాతిపదికగా గల ప్రత్యేకతను పై లక్షణాలు సూచించాలి. వాటికి తోడు లూసియన్‌పై మరో రెండు అంశాలను వివరించారు.

1) అధికస్థాయిలో సమానత్వానికి సంబంధించిన ఒత్తిడి వ్యవస్థ సామర్థ్యానికి సవాలుగా పరిణమించవచ్చు. అలాగే విభిన్నతలు, సమానత్వానికి ప్రత్యేక పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వటం వల్ల సమానత్వపు ప్రాముఖ్యత తగ్గిపోతుంది.

2) అభివృద్ధి స్పష్టంగా ఒకే రేఖా పరమైంది కాదు. ఈ అభివృద్ధి తీవ్రమైన, ఖచ్చితమైన దశలలో నిర్వహించ బడదు. ఈ అభివృద్ధి వేర్వేరుగాను, ఒకే సమయంలోనూ, ఉత్పన్నమయ్యే సమస్యల పలన నిర్వహించ బడుతుంది.

ఈ విధంగా లూసియన్‌పై వివిధ శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన రాజకీయ అభివృద్ధి నిర్వచనాల్లో నిక్షిప్తమైన అస్తవ్యస్తతను పరిష్కరించారు. అలా చేయడంలో అందరకూ అంగీకార యోగ్యమైన కొన్ని సాధారణాంశాలను లూసియన్‌పై వెలుగులోకి తెచ్చారు. ఆయా శాస్త్రవేత్తలలో కనిపించే సాధారణాంశాల ప్రాతిపదికగా రాజకీయ అభివృద్ధికి తన స్వంత నిర్వచనాన్ని రూపొందించారు.

3.7 ఆల్మండ్, పావెల్‌ల భావాలు

గేబ్రియల్ ఎ. ఆల్మండ్, బింగ్‌హామ్ పావెల్‌లు రాజకీయ అభివృద్ధిని నిర్మితులు - విధులు (STRUCTURAL - FUNCTIONAL) గా వివరించారు. వీరు భావనలలో ఒక రాజ్య వ్యవస్థ నిర్మాణ పరంగా ప్రత్యేక అంగాలు, నితులు కలిగి ఉండి అవి స్వతంత్ర ప్రతిపత్తితో వాటి వాటి విధులు నిర్వహించటం, ఆధునిక, లౌకిక, రాజకీయ సంస్కృతి కలిగి ఉండటమే. ఈ లక్షణాలు అధికంగా ఉండే రాజకీయ వ్యవస్థను రాజకీయ అభివృద్ధికి నమూనాగా పరిగణించారు. వీరి అభిప్రాయంలో రాజకీయ అభివృద్ధికి నాలుగు ప్రమాణాలున్నాయి. అవి : 1) రాజ్యనిర్మాణం

(STATE BUILDING) 2) జాతి నిర్మాణం (NATION BUILDING) 3) రాజకీయ భాగస్వామ్యం (POLITICAL PARTICIPATION) 4) సంక్షేమం, పంపిణీ (WELFARE AND DISTRIBUTION) రాజకీయ అభివృద్ధిలో ఒక దేశం సర్వ సాధారణంగా ఎదుర్కొనే సవాళ్ళుగా వీటిని వారు ఉదహరించారు. మూడవ ప్రపంచ దేశాల్లో ఉన్న పరిస్థితిని గమనించినట్లయితే రాజ్యనిర్మాణం రాజకీయ అభివృద్ధిలో మొట్టమొదటి అంశం. అతి కీలకమైన అంశం కూడా. ఈ దశలో ప్రాదేశిక సమగ్రతను సమకూర్చుకోవటం, పాలనా పరంగా అధికార యంత్రాంగాలను నిర్మించుకొని వాటికి సమర్థవంతంగా నిర్వహించే పాత్రలను (ROLES) ను సృష్టించి తద్వారా ప్రభుత్వ అధికారం, సామర్థ్యతలను పెంచుకొనటం జరుగుతుంది. అలాగే మిగతా మూడు దశలు కూడా అత్యంత ప్రముఖమైనవి. వీటిలో జాతీయతాభావం పెరగటం, సామాన్య ప్రజానీకం రాజకీయాలలో ప్రవేశించి విధాన నిర్ణయాలలో భాగస్వాములు కావటం, ప్రభుత్వపరంగా సంక్షేమం, పంపిణీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి ప్రజల కోర్కెలను తీర్చటం జరుగుతుంది. ఈ దశలో రాజ్య వ్యవస్థ అనేక సమస్యలను ఎదుర్కొంటుంది. ఈ సమస్యలన్నింటిని సమర్థవంతంగా పరిష్కరించి రాజ్య పరిసర పరిస్థితులలో మార్పు చేయగల సామర్థ్యం కలిగి ఉండటమే రాజకీయ అభివృద్ధి. ఆల్మండ్, పావెల్‌లు రాజకీయ అభివృద్ధి సమస్యలను దాని నిర్మాణ- నిర్వహణా పరమైన దృక్పథం నుండి పరిశీలించటమే గాక రాజకీయ అభివృద్ధికి సంబంధించిన విశ్లేషణలలో పరిగణనలోనికి తీసుకోవాల్సిన ఐదు ప్రధానాంశాలను సూచించారు. అవిః

1) **రాజకీయ వ్యవస్థ ఎదుర్కొనే సమస్యల స్వభావంః** ఒక రాజకీయ వ్యవస్థ అభివృద్ధి, క్షీణత ఆది ఎదుర్కొనే సమస్యల స్వభావంపై ఆధారపడి ఉంటుంది. విభిన్న ప్రజలు, విభిన్నమైన భాగస్వామ్యాన్ని, జాతీయ సమగ్రతను, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచుకోవటానికి శాంతి భద్రతలను కోరుకుంటారు. ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ సమస్యను పరిష్కరించటం వల్ల రాజకీయ వ్యవస్థపై భారం ఎక్కువగా లేదు. వెనుకబడిన దేశాల విషయంలో ఈ సమస్యలకు సంబంధించిన పరిస్థితి భిన్నంగా ఉంది. కొత్తగా ఆవిర్భవించిన దేశాలలో ప్రస్తుతం అవి ఎదుర్కొంటున్న ప్రత్యామ్నాయ విప్లవాల ప్రధాన సమస్యలన్ని సాధారణ అంగీకారం ఉంది.

(2) **వ్యవస్థాపరమైన వనరులుః** ఆశించిన విధంగా రాజకీయ వ్యవస్థ విధులను నిర్వహించాలి. రాజకీయ వ్యవస్థ నుండి ఆశించిన విధుల భారం ఎక్కువగా ఉండటం వల్ల ఆ వ్యవస్థ అలాంటి భారాన్ని మోయలేకపోవచ్చు. లేదా ఎన్నో వ్యయ ప్రయాసలతో భారాన్ని నిర్వహించనూవచ్చు. ఉదాహరణకు 1958లో ఫ్రెంచి ప్రజలు నాల్గవ ఫ్రెంచి రిపబ్లిక్‌ను వదలుకొని చార్లెస్‌డీగాల్ నాయకత్వంలో ఐదవ ఫ్రెంచి రిపబ్లిక్‌ను ఏర్పరచుకొన్నారు. ఫ్రెంచి వలస ప్రాంతమైన అల్జీరియా ఫ్రాన్సు అధీనం నుండి పోకుండా ఉంచగల్గిన కారణంగా డీగోల్ అత్యున్నత పదవిని పొందగల్గారు.

3) **విదేశీ సామ్యవాద వ్యవస్థల ప్రభావంః** విదేశీ రాజకీయ వ్యవస్థ ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉన్నదన్న కారణంగా రాజ్య వ్యవస్థ అనుకరించవచ్చు. దానివల్ల ఎక్కువ రాజకీయ అభివృద్ధిని సాధించవచ్చు. ఇందువల్ల రాజకీయ వ్యవస్థతన ఆర్థిక వ్యవస్థపై ఇతర దేశాల వ్యవస్థలు సాధించిన ప్రమాణాన్ని చేరుకోవటానికి ఎక్కువ వత్తిడిని కలిగించవచ్చు. ఉదాహరణకు పాకిస్తాన్ అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు స్వదేశ రాజకీయ వ్యవస్థపై ఒత్తిడులను తగ్గించే నియంత్రణా సామర్థ్యాన్ని పెంపొందించుకోవటాన్ని చెప్పవచ్చు.

4) **వ్యవస్థాపరమైన నిర్వహణా పద్ధతులుః** రాజకీయ అభివృద్ధి క్షీణత సమస్య రాజకీయ వ్యవస్థ నమూనాపై ఆధారపడి ఉంటుంది. రాజకీయ వ్యవస్థ ఉత్పాదకాలకు సంబంధించిన భారాన్ని సహించగల్గ వచ్చు, సహించలేక పోవచ్చు కూడా. ఆ వ్యవస్థ భారాలకు సంబంధించిన శ్రమను తట్టుకోగల్గినంత ధృఢంగా ఉండి కొనసాగవచ్చు. వ్యవస్థ బలహీనంగా ఉండి, కోరికలకు సంబంధించిన ఒత్తిడి వల్ల విచ్ఛిన్నం కావచ్చు.

5) **రాజకీయ శ్రేష్ఠుల ప్రతిస్పందనః** కోరికలకు సంబంధించిన ఒత్తిడులకు ప్రతిస్పందనగా రాజకీయ శ్రేష్ఠులు తమ లక్ష్యాలను మార్చుకోవడం ద్వారా రాజకీయ వ్యవస్థను క్షీణత నుండి కాపాడవచ్చు. ఒక్కొక్క సందర్భంలో కోరికలకు సంబంధించిన భార తీవ్రతను సరిగా అంచాన వేయలేకపోవచ్చు. లేదా రాజకీయ వ్యవస్థ విచ్ఛిన్నమూ కావచ్చు.

3.8.0 రాజకీయ అభివృద్ధిలో సంక్షోభం

ఏ సమాజంలోనైనా విస్తృత సమానత్వం, భాగస్వామ్యం కొరకు ఆందోళన జరుగుతున్నప్పుడు ప్రభుత్వ సామర్థ్యపు అవసరం ఎంతైనా ఉంది. ఈ ప్రక్రియలో రాజకీయ అభివృద్ధి కింద సూచించిన ఆరు రకాల సంక్షోభాలకు గురౌతుందని లూసియన్‌పై భావించారు.

3.8.1 వ్యక్తిత్వ సంక్షోభం

వ్యక్తిత్వానికి సంబంధించిన సాధారణ భావన సాధించటం మొదటిది. అత్యంత ప్రధానమైన సంక్షోభం. ప్రజలు జాతీయ రాజ్యాన్ని తమ మాతృ దేశంగా భావించాలి. దేశంలో సమైక్యత సాధించగల్గిన నాడే దేశంలోని వ్యక్తిత్వాలకు కొంత నిర్వచనం ఉంటుంది. కొత్తగా ఆవిర్భవించిన చాలా దేశాల్లో సాంప్రదాయక వ్యక్తిత్వ రూపాలు విశాల జన సముదాయపు వ్యక్తిత్వ భావనలతో పోటీపడుతూ ఉంటాయి. వ్యక్తిత్వానికి సంబంధించిన సంక్షోభంలో సాంప్రదాయిక సంస్కృతి సమస్యా పరిష్కారం, ఆధునిక అలవాట్లకు సంబంధించిన సమస్యలు విశ్వనాగరికత అలవాట్లు కూడా కూడి ఉంటాయి. ప్రజలు రెండు విభిన్న ప్రాంతాల పట్ల ఆకర్షితులై, ఏ సమాజంలోనూ వారికి ఆధారం లేదని భావించినంత వరకు స్థిరమైన ఆధునిక జాతి రాజ్య నిర్మాణానికి అవసరమైన దృఢ వ్యక్తిత్వ భావం ప్రజలకు ఉండదు.

3.8.2 శాసన బద్ధత సంక్షోభం

వ్యక్తిత్వ సంక్షోభంలో నన్నిహితం కలదే శాసన బద్ధత సంక్షోభం. ఇది అధికారాన్ని గురించి అంగీకారం సాధించే సమస్య. ప్రభుత్వపరం చేయాలన్న బాధ్యతలకు సంబంధించిన సమస్యలు. కొత్తగా ఆవిర్భవించిన చాలా రాజ్యాలలో శాసన బద్ధతకు సంబంధించిన సంక్షోభం రాజ్యాంగ సమస్య. ఇది చాలా విస్తృతమైనది. ఇందులో ప్రభుత్వ స్వభావం ఎలా ఉండాలి ? జాతీయ కృషికి ప్రాథమిక లక్ష్యాలు ఏమిటి ? అన్న భావనలు ఇందులో చేరి ఉన్నాయి. రాజ్య వ్యవస్థ ఇతర లక్ష్యాలతో పోల్చినప్పుడు ప్రభుత్వ అధికారాలు ఆర్థికాభివృద్ధి సమస్యల షధకాలను ఎలా అమలు పరచాలన్న సమస్య కూడా ఇమిడి ఉంది. వీటి అన్నింటికి మించి మారుతున్న సమాజంలో, పరిపాలనకు సంబంధించిన ప్రయత్నాలన్నీ భిన్న ప్రజలచే వేర్వేరు కారణాల వల్ల సవాలు చేస్తుండటం వల్లనూ, ఏ నాయకుడు కూడా శాసనబద్ధ అధికారాన్ని పూర్తిగా సాధించలేకపోవటం వల్లనూ అధికార వినియోగానికి సంబంధించిన సమస్యలు తల ఎత్తుతున్నాయి.

3.8.3 సునిశిత దృష్టి సంబంధమైన సంక్షోభం

కొత్తగా రూపొందిన రాజ్యాలలో పాలనకు సంబంధించిన క్లిష్టమైన సమస్యలు సునిశిత దృష్టి సంక్షోభానికి సంబంధించి ఉంటాయి. సమాజపు అట్టడుగు స్థాయికి ప్రభుత్వం చేరుకొని ప్రాథమిక విధానాలను అమలు చేయటం ఇందులో చేరి ఉన్నాయి. సాంప్రదాయిక సమాజాల్లో, ప్రజలు ప్రభుత్వం నుండి చాలా తక్కువగా ఆశిస్తారు. మారుతున్న సమాజాల్లో ప్రభుత్వం సాధించాల్సిన లక్ష్యాలు ఎక్కువగా ఉంటాయి. పాలకులు ఆర్థికాభివృద్ధిని త్వరితగతిన సాధించాలని, సామాజిక మార్పు కావాలని కోరుతున్న సమాజాల్లో ఇది మరింత వాస్తవం. ఆర్థికాభివృద్ధి పనులు చేయాలంటే ప్రభుత్వ వ్యవస్థ గ్రామస్థాయికి చేరుకొని, ప్రజాజీవనంతో సంబంధాలు ఏర్పరచుకోవాలి. ఈ సునిశిత దృష్టి సమస్యలు ప్రభుత్వ సంస్థల సామర్థ్యం పెంపొందించటం, ప్రజలకు పాలకులకు మధ్య సత్సంబంధాలు ఏర్పడటం మిళితమై ఉన్నాయి.

3.8.4 భాగస్వామ్య సంక్షోభం

రాజకీయ అభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం ఉంది. కొత్తగా ప్రభుత్వంతో భాగస్వాములైన వారి వల్ల సంస్థలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలలో భాగస్వామ్య సంక్షోభం ఏర్పడుతుంది. వివిధ ప్రయోజనాల సాధనకు వర్గాలు ఏర్పడటం, పార్టీ వ్యవస్థ రూపొందటంతో భాగస్వామ్య సంక్షోభం ఏర్పడుతుంది. భాగస్వామ్యం వల్ల ఉత్పాదికత పెరిగి నిర్దిష్ట ప్రయోజనాల సాధనకు వర్గాలు రూపొందటం ప్రారంభమవుతుంది. ప్రభుత్వ నిర్భంధాలవల్ల ప్రజాందోళనలు వృద్ధి చెందుతాయి. పర్యవసానంలో వ్యక్తులలోను, సమాజంలోను అసంతృప్తి అధికం కావటం కొత్తగా రూపొందిన సమాజాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు.

3.8.5 సమగ్రతా సంక్షోభం

అభివృద్ధి చెందుతున్న సమాజాల్లో సమగ్రత సాధించటం ఒక ప్రధాన సమస్య అయింది. పాలనా వ్యవస్థ, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు ఏ విధమైన పరస్పర సంబంధాలు కలిగి ఉన్నాయన్నదిసమగ్రతా సంక్షోభానికి కారకాలవుతాయి. వ్యవస్థ నిర్వహణలో మార్పులు కోరుతున్న విభిన్న వర్గాలకు, ప్రయోజనాలకు సంబంధాలు ఉన్నాయా లేదన్నది కూడా సంక్షోభ సమస్య అవుతుంది. అధికారులు పౌరులు వారి అభిప్రాయాలను కూడా చర్చించాల్సి ఉంటుంది. ప్రజలందరి అన్ని కోరికలను పరిష్కరించటానికి ప్రభుత్వాలు కృషి చేయాల్సి ఉంటుంది. సమగ్రతా సంక్షోభం ప్రభుత్వ కార్య నిర్వహణకు, ప్రజా రాజకీయాలకు మధ్య సంబంధాల పరంగా ఉంటుంది.

3.8.6 పంపిణీ సంక్షోభం

లక్ష్యాల సాధనలో సేవలు, విలువలు సమాజమంతటా విస్తరించాలంటే ప్రభుత్వ ఉద్యోగులను వారి సేవలను ఎలా మెరుగుపరచాలన్న సమస్య ఎదురౌతుంది. అలాగే ప్రభుత్వ కార్యక్రమాల వల్ల ఎవరు లాభం పొందాలి. సమాజంలోని విభిన్న వర్గాలకు అధిక లాభాలు చేకూర్చాలంటే ప్రభుత్వం ఏం చేయాలన్నది పంపిణీ సంక్షోభపు సమస్యలు. కొత్తగా ఆవిర్భవించిన సమాజాలలో ఆర్థికాభివృద్ధిపై ఒత్తిడి, సామ్యవాద సిద్ధాంతాల పట్ల ప్రజాదరణ, సమాజంలోని బలహీన వర్గాలలో సంపద పెంపుదల అవకాశాలు మొదలైనవన్నీ వనరుల పంపిణీకి సంబంధించిన ప్రాథమిక సంక్షోభపు ప్రతిబింబాలే.

3.9 అభివృద్ధి కార్యక్రమాలు

ఏ దేశంలోనైనా అభివృద్ధి విధానం వ్యూహాలు, పైన పేర్కొన్న సంక్షోభాల ఆవిర్భావం వాటిని ఎదుర్కొని పరిష్కరించే విధానాలపై ఆధారపడి ఉంటుంది. కొత్తగా ఆవిర్భవించిన రాజ్యాలలో ఈ సంక్షోభాలన్ని ఏకకాలంలో సంభవిస్తున్నాయి. పంపిణీ సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి ప్రభుత్వాలు వ్యక్తిత్వానికి సంబంధించిన సమస్యను ఉపయోగిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యలలో సమక్షోభ పరిష్కారం చాలా ప్రధానమైంది. ఈ సంక్షోభాల వల్ల వ్యవస్థలు తీరని నష్టము కలిగించని విధంగా ప్రజల జీవన ప్రమాణాలను పెంచటానికి కృషిచేయాల్సి ఉంది.

లియోనార్డ్ బైండర్ రాజకీయాల పనితీరులో, వ్యవస్థాపరమైన మార్పులను సూచించేదే రాజకీయ అభివృద్ధి అని అభిప్రాయపడ్డారు. స్థూలంగా చెప్పాలంటే సమానత్వం, సామర్థ్యం, విభిన్నతలు గల వ్యవస్థ ఆధునీకరణల ప్రతీక. దిగువ సూచించిన ఐదు మార్పులను బైండర్ రాజకీయ అభివృద్ధి ప్రధాన లక్షణాలుగా పేర్కొన్నారు. (1) జాతి, మత, వర్గ, విభేదాలనుండి సంకుచితత్వం నుండి సామాజిక సమగ్రత వైపుకు దారితీసే మార్పు; (2) శాసన సమ్మతము, ప్రజాసమ్మతము అయిన అధికార పాలన ఏర్పాటు; (3) రాజకీయ భాగస్వామ్యంలో మార్పు అనగా ప్రజలు, వారి ప్రతినిధులు నిర్ణయాధికారాన్ని కలిగి ఉండటం; (4) సమానత్వం, ప్రతిభల ప్రాతిపదికగా వనరుల పంపిణీ; (5) న్యాయ, పాలనా వ్యవస్థలలో భారీ మార్పులు తద్వారా ప్రజల మీద అధికారము, ప్రభుత్వ సామర్థ్యపు పెంపుదల.

3.10 సామ్యుల్ హంటింగ్‌టన్ నిర్వచనం : రాజకీయ క్షీణత

రాజకీయ వ్యవస్థల నిర్వహణ తీరుతెన్నుల వ్యవస్థీకరణే రాజకీయ అభివృద్ధి అని సామ్యుల్ హంటింగ్‌టన్ నిర్వచించారు. వ్యవస్థీకృత సమాజంలో అధిక అనుసరణీయత (ADOPTABILITY) సంకీర్ణత (COMPLEXITY) స్వయంప్రతిపత్తి (AUTOMONY) సందర్భశుద్ధి (COHERENCE) కనిపిస్తాయి. మూడవ ప్రపంచదేశాలలో సాంప్రదాయిక వ్యవస్థలు క్షీణించినంత తొందరగా ఆధునిక వ్యవస్థలు రూపొందటంలేదు. అందువల్ల ఈ దేశాలలో రాజకీయ అభివృద్ధి కన్నా రాజకీయక్షీణతయే ఎక్కువ గా ఉందన్నారు. సామాజిక ఆధునిక ప్రక్రియకు, రాజకీయ వ్యవస్థకు సంభందించిన సంస్థల, అంగాల శక్తి, స్థిరత్వమునకు అవినాభావ సంబంధం ఉండి రాజకీయ అభివృద్ధి దానిపై ఆధారపడి ఉండటాన్ని హంటింగ్‌టన్ ప్రతిపాదించిన సిద్ధాంతంలో ప్రధానాంశంగా మనం భావించవచ్చు.

అభివృద్ధిని ఈ విధంగా ఆధునికీకరణ భావంనుండి విడదీయటంలో ఆయన విజయవంతమయ్యారు. రాజకీయ అభివృద్ధిని వేర్వేరుగా నిర్వచించటం వల్ల రాజనీతి శాస్త్రజ్ఞులలో ఏకాభిప్రాయం లేకపోవటం, అనిశ్చిత పరిస్థితి ఏర్పడటం గమనించదగ్గ విషయం.

3.11 జె.ఏ. నెట్టల్ భావాలు

జె.ఏ. నెట్టల్ అభిప్రాయంలో రాజకీయ అభివృద్ధి భావనలో నాలుగు ప్రధానాంశాలున్నాయి. అవి:

(1) నిర్వచన ప్రాధాన్యత : అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందని సమాజాల బేధభావం, అభివృద్ధి అనేది ఒక ప్రక్రియ. విప్లవం ఆదరించిన సమాజాల్లో సామాజిక రాజకీయ విలువలకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రజాస్వామ్య సమాజాల్లో ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఉంటున్నది. సామాజిక శాస్త్రంలో విలువలు - యదార్థతల మధ్యగల భేదంలాగా ఉన్న విషయం కాదు అని నెట్టల్ అభిప్రాయ పడ్డారు.

(2) రాజకీయ అభివృద్ధిని వివరించటంలో విలువల ప్రాధాన్యత కల పదాలు భావాలు మిక్కుటంగా ఉండటంవల్ల మూడవ ప్రపంచదేశాల్లో ఈ నిర్వచనం పట్ల కొంత నిరసన వ్యక్తమై, ఆయాదేశాలలో సామాజిక విలువలపై దృష్టి కేంద్రీకరించటం జరుగుతున్నది.

(3) అభివృద్ధి చెందిన, చెందని దేశాలు ఒకరిపై మరొకరు పరస్పరం ఆదారపడటం వల్ల ఏ రాజకీయ అభివృద్ధి సిద్ధాంతమైనా ప్రపంచదేశాలన్నింటికి వర్తించేదిగా ఉండాలి.

(4) రాజకీయ అభివృద్ధి భావన ప్రధానంగా ఆర్థిక శాస్త్రం నుండి ఉత్పన్నమయిన తరువాత సామాజిక శాస్త్రవేత్తల చేతులలో మెరుగులు దిద్దుకున్నప్పటికీ దీనిని ఏ ఒక్క విషయానికి పరిమితం చేయవీలులేదు. వ్యవస్థాపరమైన సామర్థ్యం లేదా విస్తృత పరిధిలో ఆర్థిక సామాజిక, రాజకీయ వరుస క్రమం గల సూచికల పట్టిక రాజకీయ అభివృద్ధికి కొలతబద్ద కాగలదు.

రాజకీయ అభివృద్ధికి సంబంధించిన విశ్లేషణలలో పరిగణనలోనికి తీసుకోవాల్సిన నాలుగు ప్రధానాంశాలను గూడా నెట్టల్ సూచించారు. అవి:

(1) నేటి ప్రపంచంలో దేశాలు పరస్పర సంబంధం కలిగి ఉన్నందువల్ల, రాజకీయ అభివృద్ధి బహుముఖ ప్రక్రియ కావటాన అభివృద్ధి ప్రక్రియ కేవలం రాజకీయ, సామాజిక, ఆర్థిక విషయాలకే పరిమితం కారాదు. ప్రపంచంలో పలుదేశాలు పారిశ్రామికంగా పురోభివృద్ధి చెందలేకపోతున్నాయి. రాజకీయ అభివృద్ధి జరగటానికి అస్కారం ఉందని నెట్టల్ అభిప్రాయం.

(2) రాజకీయ అభివృద్ధి కేవలం ప్రగతి, స్థిరత్వాన్ని చేకూర్చటమేగాక రాజకీయ క్షీణత, అస్థిరత్వానికి కూడా దారి తీయవచ్చు.

(3) రాజకీయ అభివృద్ధిలో జనాభాపెరుగుదల వల్ల కలిగే సామాజిక, రాజకీయ పర్యవసానాలను గూడా పరిగణనలోనికి తీసుకోవాలి. జనాభావృద్ధి వల్ల రాజ్యనిర్మాణం కష్టమౌతుంది. జనసాంద్రత రాజకీయ సంస్థలపై ప్రభావం చూపటమేగాకుండా ప్రజలకు రాజకీయ శ్రేష్ఠులకు గల సంబంధ బాంధవ్యాలను కూడా నిర్ణయిస్తుంది.

(4) జాతి, మత, కులపరమైన బేధభావాలకు కూడా రాజకీయ అభివృద్ధిలో ప్రాధాన్యత ఉంది. ఈ రకమైన సారూప్య ప్రతికూల భావాలు సమాజంలో ప్రభావం కలుగజేస్తాయి. నెట్టల్ వివరణం ప్రకారం రాజకీయ అభివృద్ధి బహుముఖమైన ప్రక్రియ. కొన్ని సాంకేతిక ఇబ్బందుల కారణంగా రాజకీయ అభివృద్ధిని నిర్వచించటం తేలికైన విషయంకాదు. ఆర్థికాభివృద్ధి విషయాలకు ప్రాధాన్యత ఇవ్వటం, అభివృద్ధికి అమెరికా సంయుక్త రాష్ట్రాలను నమూనాగా పరిగణించటాన్ని నెట్టల్ తీవ్రంగా వ్యతిరేకించారన్న విషయం అవగతమౌతుంది.

3.12 రాజకీయ అభివృద్ధి సూచికలు

కొందరు రాజనీతి శాస్త్రజ్ఞులు రాజకీయ అభివృద్ధి సూచికలు గుర్తించటానికి ప్రయత్నించారు. ఈ సూచికలవల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొన్ని లోపాలు, పరిమితులు లేకపోలేదు. ఉదాహరణకు అధిక సంఖ్యలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుటను సాధారణంగా రాజకీయాభివృద్ధికి చిహ్నంగా భావిస్తున్నారు. కాని మరి కొందరి అభిప్రాయంలో తక్కువ మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించటాన్ని ప్రజలు ప్రభుత్వ విధానాల పట్ల నిరసన వ్యక్తం అంటున్నారు. కాని ఇది కూడా రాజకీయ అభివృద్ధిని పరోక్షంగా సూచిస్తున్నట్లుగా భావిస్తున్నారు. ఈ సూచికలను ఉపయోగించటంలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ వాస్తవ పరిస్థితులను తెలియ చెప్పే నమ్మదగ్గ సూచికలుగా మనం గుర్తించలేనప్పుడు రాజకీయ అభివృద్ధి భావన అవగాహన అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. ఛార్లెస్ ఎల్. టేలర్, మైఖేల్, సి. హడ్సన్, రచించిన పుస్తకం ఆధారంగా సామాజిక శాస్త్రవేత్త శ్రీ రాం మహేశ్వరీ తయారు చేసిన సూచికలు దిగువన పొందుపరచాం :

1) జాతీయ సమైక్యత; 2) ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్ల శాతం; 3) నిర్ణయ, నిర్మాణ ప్రక్రియలో ప్రజల పాత్ర; 4) స్వయం పాలక ప్రయోజిత వర్గాలు; 5)సామూహిక ప్రసార సాధనాల వినియోగం ప్రధానంగా ప్రాంతీయ భాషల్లో; 6) రాజకీయ, పాలనా వికేంద్రీకరణ; 7) స్వయం పాలనాధికారాలుగల స్థానిక సంస్థలు; 8) ఉద్యోగి స్వామ్యం కాని రంగాలు విస్తరించుట, స్వయం ప్రతిపత్తి కలిగి ఉండటం, ఉదాహరణకు విద్యారంగం; 9) చట్ట సభల సమావేశ కాలం; 10) పటిష్టమైన నిఘా సంస్థలు; 11) స్వయం ప్రతిపత్తి గల ప్రభుత్వ రంగాలు; 12) సుస్థిర ప్రజాస్వామ్య పార్టీల వ్యవస్థ; 13) రాజకీయ సామర్థ్యత; 14) అందరికీ సమ్మతమైన రాజకీయాలు; 15) బిన్నాభిప్రాయాల పట్ల సమానం; 16) వివిధ సామాజిక వర్గాల నుండి రాజకీయ శ్రేష్టులు; 17) అరమరికలు లేని ప్రభుత్వ పాలన; 18) పౌరుల ఇబ్బందులు తొలగించ తగిన సదుపాయాలు, 19) ప్రజా ప్రతినిధుల నియోజక వర్గ సేవలు; 20) విద్య; 21) నగరీకరణ 22) పత్రికా స్వేచ్ఛ, 23) పరిమితులకు లోబడిన నిరసన; 24) పక్షపాత రహిత ఎన్నికల యంత్రాంగం; 25) సమంజసమైన న్యాయ వ్యవస్థ; 26) రాజకీయాలకు దూరంగా సైనిక బలాలు; ఇవి రాజకీయ అభివృద్ధిని సూచించే సానుకూల సూచికలు. ఇదే విధంగా రాజకీయ అభివృద్ధికి ప్రతికూల లక్షణాలను కూడా పరిగణించవచ్చు. అవిః (1) తిరుగుబాటుతో ప్రభుత్వం ఏర్పాటు చేయుట. (2) దొమ్మీలు (Riots) (3) రాజకీయ ఖైదీల సంఖ్య పెరుగుదల, (4) రాజకీయ హత్యలు, (5) దురుద్దేశపూరితమైన రాజకీయపార్టీల మార్పిడి ప్రతికూల లక్షణాలు తక్కువగా ఉండటం, రాజకీయ అభివృద్ధిని పరోక్షంగా సూచిస్తాయి.

3.13.0 రాజకీయ అభివృద్ధి : సిద్ధాంతీకరణ

రాజకీయ అభివృద్ధి సిద్ధాంతీకరణ రెండు నమూనాల ప్రాతిపదికన జరిగింది. (1) నిరంతర ప్రక్రియ నమూనా; (2) దశల నమూనా

3.13.1 నిరంతర ప్రక్రియనమూనా

రాజకీయ అభివృద్ధి నిరంతరం కొనసాగే ప్రక్రియ అనే భావం ఇందులో ఇమిడి ఉన్నది. కొన్ని దేశాలు కొన్ని సమయాలలో రాజకీయ విషయాలలో పురోగామి గా ఉంటూ మరికొన్ని విషయాల్లో వెనుకబడి ఉంటాయి. ఈ నమూనా ప్రకారం దేశపు రాజకీయ అభివృద్ధిని పరిమాణపరంగా కొలవవచ్చు. జాతీయాదాయం, తలసరి ఆదాయం, జనాభాలో వయోజనుల శాతం, రాజకీయపార్టీలు, వర్గాల పెరుగుదల, ప్రభుత్వ సిబ్బంది, వారి భర్తీ మొదలైన విషయాలను ఈ నమూనా పరిగణిస్తుంది. ఈ సిద్ధాంతం ప్రకారం వివిధ రంగాలలో ఆధునీకరణ దిశగా జరిగే విస్తృత మార్పే రాజకీయ అభివృద్ధి. (A Common movement along abroad array of fronts from less modern conditions).

3.13.2 దశల నమూనా

రాజకీయ అభివృద్ధి ఒక దశ నుండి మరొక దశకు పరిణామం చెందటాన్ని ఈ నమూనా సూచిస్తుంది. ఈ నమూనా మూడు ప్రధాన దశలను గుర్తించింది. (1) సాంప్రదాయికదశ. (2) పరిణామదశ, (3) ఆధునిక దశ, మొదటిది ప్రధానంగా వ్యవసాయం ప్రధాన ఉపాధిగా గల గ్రామీణ వ్యవస్థ, రెండవది పారిశ్రామికీకరణపు

ఆరంభదశ, మూడవది నగర సమాజమై పారిశ్రామికంగా బాగా వృద్ధి చెంది అందుకు అనువైన రాజకీయవ్యవస్థను కలిగి ఉండే దశ. ఈ దశలు అంచెలంచెలుగా ఒకటి తరువాత మరొకటి పరిణమించి ఆయా దశలకు సంబంధించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులు, లక్షణాలను కలిగి ఉంటాయి. అభివృద్ధి చెందిన కొన్ని పాశ్చాత్య దేశాలు ఈ దశలను అనుభవించాయి.

ఈ రెండు నమూనాలలో కొన్ని లోపాలు కూడా ఉన్నాయి. మొదటి నిరంతర ప్రక్రియ నమూనాలో అభివృద్ధిని ఏక మొత్తంగా అంచనా వేయలేక విభజించి పరిశీలించటమవుతుంది. దశల నమూనా అన్ని దేశాలకు ఒకే విధంగా అన్వయించ వీలులేదు. మొదటి నమూనాలో వివిధ సామాజిక శాస్త్రాల మధ్య కృత్రిమమైన అంతర్ సంబంధాలను చూడవచ్చు. రెండవ నమూనాలో అభివృద్ధిని ఒక సంక్లిష్ట పరిణామ ప్రక్రియగా గుర్తించక, ఒక సాధారణ విషయంగా పరిగణించి కొన్ని పాశ్చాత్య దేశాల అనుభవాలను మాత్రమే మార్గదర్శకం గ్రహించటం జరుగుతుంది. కాని రాజకీయ అభివృద్ధి పూర్తిగా రాజకీయాలపై ఆధారపడే, ఆధారపడని చలాంకమని అది ఆర్థిక, సామాజిక, మనోవైజ్ఞానిక రాజకీయ విషయాలతో సంబంధం గల మార్పులను తెలియజెప్పే ప్రక్రియ యన్న విషయాన్ని పై రెండు నమూనాలు అంగీకరిస్తున్నాయి. ఈ ప్రక్రియలో కొన్ని రాజకీయ వ్యవస్థలు భగ్నం కావటాన్ని రాజకీయ అభివృద్ధి ప్రతిబంధకంగా భావించ వీలులేదు. వాస్తవంలో ఆలోచిస్తే, అట్టి పరిస్థితులే అర్థవంతమైన రాజకీయ అభివృద్ధి జరిగే వాతావరణాన్ని సృష్టిస్తాయి. హంటింగ్టన్ అభిప్రాయంలో వ్యవస్థలు పతనం చెందనూ వచ్చును, లేదా పూర్తిగా అదృశ్యమవవచ్చును కూడా. అలాగే వ్యవస్థలు పెరిగి పరిపక్వత కూడా చెంద వీలుంది. (Institutions decay and dissolve as well as grow and mature).

3.14 రాజకీయ అభివృద్ధి : సమీక్ష

రాజకీయ అభివృద్ధి భావనను వివిధ రచయితలు వేరు వేరు దృక్పథాలతో నిర్వచించటం కారణంగా కొంత అస్పష్టత, అవగాహనలోపం కొనసాగుతున్నది. లూసియన్‌పై రాజకీయ అభివృద్ధి లక్షణాలను గూర్చి (Development Syndrome) చర్చిస్తే, రిగ్స్ అభివృద్ధి ఉచ్చు (Development Trap) నెట్టెల్ నిర్వచనాల ప్రాధాన్యతల సమస్యలను లేవనెత్తారు. రోస్టోల్ తన నిర్వచనంలో ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యమిస్తే, ఆల్మండ్, పావెల్‌లు నిర్మితులు, విధులకు ప్రాధాన్యమిచ్చారు. కెన్నెత్ ఆర్గానిస్కి రాజకీయ అభివృద్ధిని నాలుగు దశల ప్రక్రియగా వర్ణించారు. అవి (1) రాజకీయ వ్యవస్థ రూపొంది అధికార కేంద్రీకరణం సమైక్యతను నమకూర్చుకోవటం, (2) ఆర్థికాభివృద్ధి లక్ష్యంతో పారిశ్రామికీకరణం, (3) రాజకీయ అభివృద్ధి, ఆర్థికాభివృద్ధి ప్రాతిపదికమీద జాతీయ సంక్షేమం, (4) ప్రజల సుఖ జీవనానికి వస్తు సమృద్ధి. రాజకీయ అభివృద్ధి విశ్లేషణలో ఆర్థిక సామాజిక శాస్త్రాలపై ఆధారపడటాన్ని వ్యతిరేకిస్తూ, వాటి నుండి దృష్టి మళ్ళించటంలో ఎస్.ఎన్.ఐసెన్‌స్టాడ్, హంటింగ్ టన్, హాల్ట్, టర్నర్‌లు కొంత వరకు విజయం సాధించారని భావించవచ్చును. వీరి హోదాలలో దృఢ నిశ్చయం, సామర్థ్యం (Will and Capacity approach) సమస్యల పరిష్కారంలో సమర్థత, వ్యవస్థీకరణ పద్ధతులు పేర్కొనతగినవి. హాల్ ఫ్రెడ్ హాల్ పెర్ల్ దృష్టిలో సంస్థాగతమైన మార్పులు చేపట్టి, ప్రజల కోరికలను ప్రధాన సమస్యలను పరిష్కరించే దృఢ నిశ్చయం, సామర్థ్యం గల రాజకీయ అధికారమే రాజకీయ అభివృద్ధి, హంటింగ్టన్, ఐసన్‌స్టాడ్‌లు కూడా వ్యవస్థీకృతమై నిరంతర మార్పులను చేయగల సామర్థ్యమే రాజకీయ అబివృద్ధిగా వర్ణించారు. రాజకీయ క్షీణత కూడా ప్రత్యక్షంగా పరోక్షంగా రాజకీయ అభివృద్ధే అవుతుందని హంటింగ్టన్ ఉవాచ. ఫ్రెడరిక్ రిగ్స్ అభిప్రాయంలో రాజకీయ అభివృద్ధి విషయమై చెప్పకోదగిన సిద్ధాంత ప్రతిపాదన జరగలేదు. రాజకీయ అభివృద్ధి, ఓటింగ్, రాజకీయాలు విస్తృత పరిధి గల అంశాలని, వీటిని వేరు వేరు భాగాలుగా విభజించి విశ్లేషణ చేయటం, ప్రధానంగా నిర్వచించటం చాలా అవసరమని భావించారు. ఏది ఏమైనప్పటికీ తులనాత్మక రాజకీయాలలో నేడు రాజకీయ అభివృద్ధి ప్రముఖ స్థానాన్ని సంతరించుకొందని చెప్పటంలో సందేహం లేదు. ఈ అంశంపై రాజకీయ శాస్త్రవేత్తలలో ఏకాభిప్రాయం లేకపోయినప్పటికీ, ప్రతిపాదిత సిద్ధాంతాలలో ఏది సరియైనదన్న విషయంలో మనం ఆయోమయం చెందాల్సిన అవసరం లేదు. ప్రతిసిద్ధాంతంలోను కొంత సత్యమున్నది. స్థూలంగా చెప్పాలంటే రాజకీయ వ్యవస్థల తత్వంలో, పని తీరులో సంభవించే ప్రాథమిక మార్పులను రాజకీయ అభివృద్ధి సూచిస్తుంది.

3.15 కొన్ని విమర్శలు

రాజకీయ అభివృద్ధి భావన విషయంలో మూడు ప్రధానమైన విమర్శలున్నవి. 1. ఈ భావనను ఇంత వరకు నిర్దిష్టంగా, స్పష్టమైనదిగా ఎవ్వరూ నిర్వచించలేదు. వివిధ రచయితలు విభిన్న దృక్పథాలు, పద్ధతులు అవలంబించటం వల్ల రాజకీయ అభివృద్ధిలో ఏ విషయాలు ఇమిడి ఉన్నాయి ఏవి లేవు అన్న విషయం ఇంత వరకు స్పష్టం కాలేదు. తులనాత్మక రాజకీయాల లాగానే, రాజకీయ అభివృద్ధి పరిధి కూడా చాలా విస్తృతమైంది. ఫ్రెడరిక్ రిగ్స్ అభిప్రాయంలో రాజకీయ అభివృద్ధిపై పెక్కు ఊహా కల్పనలు (Speculations) పరికల్పనలు (Hypothesis) ఎన్ని ఉన్నప్పటికీ, ఇంత వరకు రాజకీయ అభివృద్ధి నిర్దిష్ట సిద్ధాంతంగా రూపొందలేదు. ("There is as yet no such theory, although there are a host of speculations and even Hypotheses") 2. సందర్భ శుద్ధి గల రాజకీయ నమూనా కొరవడినందున రాజకీయేతర అంశాలు రాజకీయ మార్పులను నిర్దేశిస్తున్నాయి. ఈ కారణంగా రాజకీయేతర అంశాలు రాజకీయ మార్పులను నిర్దేశిస్తున్నాయి. ఈ కారణంగా రాజకీయ అభివృద్ధి అధ్యయనంలో కొంత అనిశ్చిత, గందరగోళ పరిస్థితులు ఏర్పడి రాజనీతి శాస్త్రం, ఆర్థిక సామాజికశాస్త్రం చాటుకుపోయింది. రాజకీయ అభివృద్ధి ఒక స్వతంత్ర చలాంకం. అది తనకు తానై మార్పులు తీసుకుని రాగల ప్రక్రియ అన్న విషయాన్ని మరచి, అది ఆధునీకీకరణ మీదనో జాతీయ భావం మీదనో ప్రజాస్వామ్యం మీదనో ఆధారపడిన ఉత్పాదితమని (Output) సామాజిక శాస్త్రవేత్తలు భావించటం గర్హనీయం (3) ప్రపంచంలోని అన్ని దేశాలకు సమానంగా వర్తించే విధంగా, అందరికీ ఆమోదయోగ్యమైన రాజకీయ అభివృద్ధి నమూనా ఇంత వరకూ రూపొందలేదు. విభిన్నమైన ఒక దానితో మరొక దానికి పొంతన లేని విశ్లేషణ లిచ్చుట వలన రాజకీయ అభివృద్ధిపై ఇంతవరకు ఏకాభిప్రాయం కుదరలేదు. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటనుల వంటి ఒకటి రెండు దేశాలను రాజకీయ అభివృద్ధికి కొలబద్దలుగా పేర్కొనటం పెద్ద పొరపాటు. మూడవ ప్రపంచదేశాలపై ఇటీవలనే దృష్టి సారిస్తున్నప్పటికీ ఇక్కడి వాస్తవ విషయాలను, ఆయా దేశాల ప్రజల ఆశలు, ఆశయాలను సంపూర్ణంగా అర్థం చేసుకోవటంలో పాశ్చాత్య రాజకీయ శాస్త్రజ్ఞులు విఫలమయ్యారు. అందువల్లనే రాజకీయ అభివృద్ధి సిద్ధాంత అన్వేషణ అసంపూర్తిగా మిగిలిపోతుంది.

విమర్శలు, లోపాలు ఎన్ని ఉన్నప్పటికీ రాజకీయ అభివృద్ధి భావన ఆవిర్భవించాక తులనాత్మక రాజకీయాల పరిధి విస్తృతమగుటయే గాక అనుభవపూర్వక రాజకీయ విశ్లేషణకు విస్తృత అవకాశాలు ఏర్పాడ్డాయి. ఇతర సామాజిక శాస్త్రాలతో సహచర్యం వల్ల తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో రాజకీయ అభివృద్ధి ముఖ్యాంశంగా స్థానం సంపాదించుకున్నదనటంలో ఎలాంటి సందేహాలు ఉండనవసరం లేదు.

- డి. సూరన్ నాయుడు

3.16 చదువ దగిన పుస్తకాలు

1. *Bentley Arthur* : *The Process of Government*
2. *Daya Krishna* : *Political Development : A Critical Perspective*
3. *Merrium C* : *Political Power*
4. *Varma, S.P.* : *Modern Political Theory*
5. *Johari J.C.* : *Comparative Politics*


3.17 నమూనా పరీక్షా ప్రశ్నలు


క్రింది ప్రశ్నలకు 30 వంక్తులకు మించకుండా వ్యాస రూపంలో సమాధానాలు రాయుండి.

1. రాజకీయ అభివృద్ధి భిన్న అర్థాలను తెలిపి, దానిపై లూసియన్ పై అభిప్రాయాలను నిర్వచనాలను వివరింపుము?
2. రాజకీయ అభివృద్ధి భావనను పరిశీలించి, మూడవ ప్రపంచదేశాలలో దానికి గల ప్రాముఖ్యతను పేర్కొనండి?
3. రాజకీయ అభివృద్ధిని అంచనా వేయటానికి గేబ్రియల్ ఆల్మండ్, బింగ్‌హాం పావెల్ లు సూచించిన ప్రమాణాలను విశ్లేషింపుము?
4. రాజకీయ అభివృద్ధి సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి?

***

రాజకీయ వ్యవస్థలో సభ్యులు నిర్వహించే పాత్రలను బట్టి రాజకీయ సంస్కృతిని మూడు విధాలుగా వర్గీకరించాడు ఆల్మండ్. ఆలాగే రాజకీయ సంస్కృతిని బట్టి రాజకీయ వ్యవస్థలను వర్గీకరించాడు.





ఒక సమాజం పట్ల రాజకీయ వ్యవస్థ పట్ల ప్రజలు ఏర్పరుచుకున్న దృక్పథాల సమాహారమే రాజకీయ సంస్కృతి. రాజకీయ సంస్కృతి స్వభావం, వర్గీకరణ, ఆ సమాజం ప్రజల రాజకీయ భాగస్వామ్యం ద్వారా అంటే రాజకీయ ప్రక్రియలో ప్రజానీకం ఏ మేరకు, ఏ స్థాయిలో ఎంత మంది పాల్గొంటారో అనే అంశాలను అధ్యయనం చేయటం ద్వారా నిర్ధారించవచ్చు.

4.8.0 ఆల్మండ్, వెర్బాల అధ్యయనం

1963లో ఆల్మండ్, వెర్బాలు "పౌర సంస్కృతి" (The civic culture) అనే గ్రంథాన్ని ప్రచురించారు. 1950-60 సంవత్సరంలో అమెరికా, బ్రిటన్, పశ్చిమజర్మనీ, ఇటలీ, మెక్సికో దేశాల్లో వారు జరిపిన ఒక విస్తృత సర్వే ఆధారంగా ప్రదేశాల రాజకీయ సంస్కృతి ఉదారవాద ప్రజాస్వామ్యానికి అనుకూలంగా ఉందని భావించారు.

రాజకీయ సంస్కృతి భావన మౌలికంగా మానసికమైంది. వారి వారి విశ్వాసాలు, విలువలు, ఉద్వేగాల ననుసరించి ఒక సమాజంలోని ప్రజలు రాజకీయాల గురించి ఏ విధంగా ఆలోచిస్తారో తెలుపుతుంది. అయితే రాజకీయ ప్రవర్తనను రాజకీయ సంస్కృతి ప్రత్యేకంగా నిర్వచించదు. ఎందుకంటే ప్రవర్తన కొన్ని సందర్భాలలో అమలులో ఉన్న వైఖరులకు విరుద్ధంగా ఉండవచ్చు. ఉదాహరణకు, ప్రజాస్వామ్యాలలో ప్రజల భాగస్వామ్యం లేదా వాళ్లు ఏ మేరకు పాల్గొంటారు అనేది ప్రజాస్వామ్య సిద్ధాంతం ప్రకారం మనకు పూర్తిగా కనిపించదు. అధిక సంఖ్యాక ప్రజలు స్వేచ్ఛాయుతంగా రాజకీయ ప్రక్రియలో పాల్గొని ప్రభుత్వ వ్యవహారాలను ప్రభుత్వ సరళిని ప్రభావితం చేసే నిర్మితులలో కూడుకొన్న వ్యవస్థే ప్రజాస్వామ్యమైతే అభివృద్ధి చెందిన పశ్చిమ రాజకీయ ప్రక్రియలో ప్రోత్సాహంతో పాల్గొన్న దాఖలాలు మనకు కనిపించవు. ప్రాచీన ఏథెన్స్ ప్రజాస్వామ్యం నుంచి ప్రస్తుత పశ్చిమ ఉదారవాద ప్రజాస్వామ్యాల వరకు ప్రజల పాత్ర సంఖ్యాపరంగా చూసినపుడు తక్కువ స్థాయిలోనే మనకు కనిపిస్తుంది. అందువల్ల రాజనీతి శాస్త్రవేత్తలు రాజకీయ సంస్కృతిని మరింత లోతుగా అధ్యయనం చేయవలసి ఉంటుంది. నిజానికి ఉదారవాద ప్రజాస్వామ్యాలలో ప్రత్యక్షంగా రాజకీయ వ్యవస్థ నిర్వహణను పూర్తిగా ప్రభావితం చేయలేక పోయినప్పటికీ అక్కడి ప్రజలు మాత్రం తాము రాజకీయ నిర్ణయాలను ప్రస్ఫుటంగా ప్రభావితం చేయగలమని, భావించటం వారి రాజకీయ సంస్కృతి స్వరూపాన్ని, స్వభావాన్ని సూచిస్తుంది. రాజకీయ సంస్కృతి అధ్యయనంలో మనకు రెండు దృక్పథాలు మౌలికంగా కన్పిస్తాయి. ఇందులో మొదటిది ప్రవర్తనావాద దృక్పథం. దీని ప్రకారం అనేక ప్రజాస్వామ్యాలకు ఒక జాతీయ రాజకీయ సంస్కృతి ఉంటుంది. ఈ రాజకీయ సంస్కృతి కొన్ని శతాబ్దాల చారిత్రక పరిణామాల ఫలితంగా ఒక తరం నుంచి మరొక తరానికి బదిలి అవుతూ వస్తుంది. ఇందులో సామాజిక సంస్థలు ఉదాహరణలు. కుటుంబం ప్రధాన పాత్ర వహిస్తుంది.

రాజకీయ సంస్కృతిని అధ్యయనం చేసే మరొక దృక్పథం మార్క్సువాద దృక్పథం. మార్క్స్ వాదం ప్రవర్తనావాదం సూచించిన రాజకీయ సంస్కృతిని దాని పరిణామ క్రమాన్ని తిరస్కరిస్తుంది. ఈ దృక్పథం ప్రకారం ఒక సమాజంలోని ప్రాబల్య వర్గాలు తమ విలువలను నిమ్న వర్గాల మీద రుద్దే ప్రయత్నం ఫలితంగా రాజకీయ సంస్కృతి ఏర్పడుతుంది. లాంఛనప్రాయమైన నిర్మాణాలు, ప్రచార సాధనాలు, విద్యావ్యవస్థ, ప్రాబల్య వర్గాల ఆధిపత్యాన్ని సూచించే రాజకీయ సంస్కృతిని రూపొందిస్తాయి. అందువల్ల విలువలు సామాజికరణ ద్వారా ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అవుతాయని ప్రవర్తనా వాదాన్ని మార్క్స్ వాదం అంగీకరించదు. ఏ పెట్టుబడిదారీ సమాజంలోని జాతీయ సంస్కృతి అయినా అది శాశ్వత విస్తృత ప్రాతిపదికలపై మనజాలదని కేవలం ఆ వ్యవస్థ నుంచి ప్రయోజనం పొందే వారికి ఆ రాజకీయ సంస్కృతి లేదా జాతీయ సంస్కృతి పరిమితమవుతుందని మార్క్సిస్టులు నొక్కి చెబుతారు. పశ్చిమ సమాజాలలో విస్తృతంగా అధ్యయనం చేసిన ఆల్మండ్, వెర్బలు రాజకీయ సంస్కృతిని మూడు రకాలుగా వర్గీకరించారు. వాటిని సంకుచిత రాజకీయ సంస్కృతి, అధీన రాజకీయ సంస్కృతి, భాగస్వామ్య రాజకీయ సంస్కృతి అని వర్గీకరించారు.

4.8.1 సంకుచిత రాజకీయ సంస్కృతి :

సంకుచిత రాజకీయ సంస్కృతి ఉన్న సమాజంలో ప్రజలు చాలా వరకు ఒక కేంద్ర ప్రభుత్వం కొన్ని జాతీయ లక్షణాలు ఉన్న సంగతి మరిచిపోతారు. ఇటువంటి సంస్కృతి సాంప్రదాయిక సమాజాలలో మనకు ఎక్కువగా కనిపిస్తుంది. సాంప్రదాయిక సమాజాలలో తమ తమ సాంప్రదాయిక పద్ధతులనే ఆవలంబిస్తూ వాటి తోనే

తృప్తిపడుతూ నూతనత్వాన్ని ఆహ్వానించరు, మార్పులను అంగీకరించరు. సంకుచిత రాజకీయ సంస్కృతి ప్రబలంగా ఉన్న సమాజాలలో వ్యక్తి వ్యవస్థ గురించి ఎక్కువగా ఆలోచన చేయడు. రాజకీయ ధ్యేయాల విషయంలో కొన్ని సందర్భాలలో వ్యతిరేక వైఖరిని కూడా ప్రదర్శిస్తూ ఉంటాడు. మరో మాటలో చెప్పాలంటే వ్యవస్థలోని వివిధ నిర్మితులు ఒక వ్యక్తి లేదా సమూహాలపై ఎక్కువ ప్రభావం చూపించలేవు. ఎంతసేపూ తమ తమ సంకుచిత పరిధుల వ్యవస్థల నిర్మాణాల గురించే వారు ఆలోచన చేస్తుంటారు. అందువల్ల వ్యవస్థాపరమైన రాజకీయ చర్యల విషయంలో వ్యక్తులకు గాని, సమూహాలకు గాని సంకుచిత రాజకీయ సంస్కృతి ప్రధానంగా ఉన్న సమాజంలో ప్రత్యేకమైన అభిప్రాయాలుకానీ, అనుభూతులు కానీ ఉండవు.

ఆల్మండ్, వెర్బల పౌరసంస్కృతి

సంకుచిత రాజకీయ సంస్కృతి

భాగస్వామ్య రాజకీయ సంస్కృతి　　పౌర సంస్కృతి　　సుస్థిర ప్రజాస్వామ్యం

అధీన రాజకీయ సంస్కృతి

4.8.2 అధీన రాజకీయ సంస్కృతి

అధీన రాజకీయ సంస్కృతి ప్రబలంగా ఉన్న సమాజాలలో ప్రజలు ప్రభుత్వ అధీనంలో జీవించే పాలితులుగా తమను తాము భావించుకొంటారే కాని రాజకీయ ప్రక్రియలో తాము పాల్గొంటున్నట్లు అనుకోరు.

సంస్థాగత విషయంలో అధిక పరిజ్ఞానం పాలితులకు ఉండదు. వారెప్పుడూ రాజకీయ చర్యల కారకాలను, పరిణామాలను గురించి ఆలోచిస్తుంటారు. కానీ వాటి ప్రక్రియలో తమకు ఎటువంటి పాత్ర లేదన్న విషయాన్ని వారు గ్రహిస్తారు. మాజీ సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలలో ఇటువంటి అధీన సంస్కృతి ఇటీవలి కాలం వరకు - అంటే సోషలిస్టు వ్యవస్థ కుప్పకూలే వరకు - అమలులో ఉంటూ వచ్చింది.

అధీన రాజకీయ సంస్కృతిలో పౌరులు నిష్క్రియావాదులుగా మిగిలిపోతారు. వ్యవస్థను ప్రభావితం చేయాల్సిన అవసరం తమకు లేదని వారు భావిస్తారు. కేవలం వ్యవస్థ అందించే ప్రయోజనాల గురించి ఎప్పుడూ ఎదురు చూస్తూ ఉంటారు. వ్యవస్థలో తాము ఏ విధమైన మార్పును తమంతట తాముగా తీసుకొని రాలేమన్న భావంతో యథాతథ వ్యవస్థను అంగీకరిస్తారు.

4.8.3 భాగస్వామ్య రాజకీయ సంస్కృతి

ఆల్మండ్, వెర్బల విశ్లేషణ ప్రకారం పైన వర్ణించిన రెండు సంస్కృతుల కంటే పశ్చిమ ఉదారవాద ప్రజాస్వామ్యాలలో ప్రజాస్వామ్య సంస్కృతి పని చేస్తున్నది. ఇక్కడ ప్రజలు ప్రభుత్వాన్ని, విధానాలను ప్రభావితం చేయగలవని వాటి ద్వారా ప్రభావితం కాగలమని గాఢంగా విశ్వసిస్తారు.

ఒక సమాజంలో విస్తృత ప్రాతిపదికపై నూతన ప్రవృత్తులు ఏర్పడే అవకాశాన్ని భాగస్వామ్య సంస్కృతిలో

గమనించవచ్చు. ఇక్కడి ప్రజలు చాలా క్రియాశీలకంగా కనిపిస్తారు. వ్యవహరిస్తారు. రాజకీయ వ్యవస్థ విషయంలో ఒక వ్యక్తి వైఖరులు సమాజాన్ని ప్రభావితం చేసేవిగా గుర్తింపు పొందుతాయి. అక్కడున్న వివిధ రాజకీయ వైఖరుల పట్ల అనుకూలతను గాని, భాగస్వామ్య రాజకీయ సంస్కృతి విస్తారంగా ఉన్న సమాజాలలో ఒక పౌరుడు యథేచ్ఛగా ప్రదర్శించవచ్చు.

అయితే ఏ సమాజంలోను పైన పేర్కొన్న మూడు భిన్న రాజకీయ సంస్కృతులు పూర్తిగా మనకు కనిపించవు. అదే విధంగా అవి ఒక ఏకైక స్వరూపాన్నే చూపించవు. ఈ కారణం వల్లనే ఆల్మండ్ మిశ్రమ రాజకీయ సంస్కృతులను గురించి ప్రస్తావించాడు. వాటిని సంకుచిత పాలిత సంస్కృతి, పాలిత భాగస్వామ్య సంస్కృతి, సంకుచిత భాగస్వామ్య సంస్కృతి అని వర్గీకరించాడు.

ఈ గుణాలన్నీ ఉండే పౌర సంస్కృతి మరొకటి ఉండదు. ఇటువంటి సంస్కృతి ముఖ్యంగా బ్రిటన్, అమెరికాలలో కనిపిస్తుంది. ఎంతటి ఉదారవాద ప్రజాస్వామ్య సంస్కృతి అయినప్పటికీ బ్రిటన్‌లో వలసవాదుల పట్ల వ్యతిరేకత, అలాగే అమెరికాలో నీగ్రోల పట్ల వర్ణ వివక్షత ఈనాటికీ మనకు కనిపిస్తుంది.

4.8.4 సుస్థిర ప్రజాస్వామ్యం :

ఆల్మండ్ వెర్బాల ప్రధాన వాదం ఏమిటంటే భాగస్వామ్య రాజకీయ సంస్కృతి అధీన సంకుచిత దృక్పథాలను సంకుచితం చేసే సమాజాలలో ప్రజాస్వామ్య సుస్థిర మనుగడకు దోహదం చేస్తుంది. అంటే జాతీయ రాజకీయాల పట్ల ఒక సంకుచిత దృక్పథాన్ని పై సమాజాలలో భాగస్వామ్య సంస్కృతి ప్రభావితం చేస్తుంది. ఇటువంటి సమాజాలలో పౌరుడు రాజకీయాలలో క్రియాత్మకంగా పాల్గొంటూ రాజకీయ విషయాలను కొన్ని ప్రత్యేక సందర్భాలలో ప్రభావితం చేయటమే కాకుండా శిష్ట వర్గాల లేదా పాలక వర్గం నిర్ణయాలను గుడ్డిగా అంగీకరించడు. వాటిని చర్చనీయాంశం చేయటమే గాకుండా కొన్ని సందర్భాలలో ప్రభుత్వం లేదా విధాన కర్తలు తమ నిర్ణయాలను మార్చుకొనేటట్లు లేదా ఉపసంహరించుకొనేటట్లు చేయగలుగుతాడు.

పై విధంగా ఆల్మండ్, వెర్బాలు తమ అధ్యయనంలో పశ్చిమ దేశాలను కేంద్ర బిందువుగా తీసుకొన్నారు. వీరి విశ్లేషణ ప్రకారం బ్రిటన్ పౌర సంస్కృతిలో అగ్ర స్థానంలో ఉంది. బ్రిటన్ తరవాత రెండో స్థానాన్ని అమెరికా ఆక్రమించింది. ఈ రెండు దేశాలలో ప్రభుత్వం పట్ల ప్రజలకు విశ్వాసం, గర్వం అధికంగా ఉన్నాయి.

ప్రభుత్వ సామర్థ్యాన్ని, చిత్తశుద్ధిని కొద్ది సందర్భాలలోనే వారు సందేహిస్తారు. అంటే రాజకీయ నిర్మాతల పట్ల పౌర విశ్వసనీయత అత్యధిక స్థాయిలో ఉంటుంది. అదే విధంగా రాజకీయ ప్రక్రియలో క్రియాత్మకంగా పాల్గొనటం తమ గురుతరమైన బాధ్యత అని ప్రజలు గుర్తిస్తారు.

భాగస్వామ్య రాజకీయ సంస్కృతి ఉన్న సమాజాలకు, అధీన రాజకీయ సంస్కృతి ఉన్న సమాజాలకు మధ్య ఉన్న ప్రత్యేక వ్యత్యాసం ఏమిటంటే భాగస్వామ్య సంస్కృతిలో ప్రజలు విశేషంగా పాల్గొంటే అధీన సంస్కృతిలో అతి తక్కువ ఆసక్తి చూపుతారు.

ఆల్మండ్, వెర్బాలు పశ్చిమ ప్రజాస్వామ్యాలను గురించి చేసిన విశ్లేషణ 1959-60 సంవత్సరాల్లో అయితే రెండో ప్రపంచ యుద్ధానంతరం ఆ సమాజాల్లో అనేక మార్పులు వచ్చాయి. తరవాత 20 సం॥లలో పశ్చిమ దేశాలు అనేక ఒడిదుడుకులకు లోనయ్యాయి. వియత్నాం యుద్ధం వల్ల లోకంలో అశాంతి, ఆర్థిక మాంద్యం, పెరుగుతున్న నిరుద్యోగం, యువతలో అశాంతి మొదలైనవి సంప్రదాయేతర పద్ధతులు రాజకీయ ప్రక్రియలో చొరబడటానికి అవకాశం కల్పించాయి. ఉదాహరణకు, అణుశక్తి వ్యతిరేక ఉద్యమం 1980లో ప్రచుర్యం పొందింది. ఇవన్నీ పశ్చిమ సమాజాల్లో రాజకీయ భాగస్వామ్యంలో సాంప్రదాయేతర పద్ధతులకు చోటు కల్పించాయి. అందువల్ల ఆల్మండ్, వెర్బాలు, 1980 సంవత్సరంలో తాజా మార్పుల నేపథ్యంలో తిరిగి కొనసాగించారు. పైన పేర్కొన్న పరిణామాలు పశ్చిమ సమాజాల్లో - ముఖ్యంగా అమెరికా, ఇంగ్లండ్ దేశాల్లో - సంభవించవచ్చన్నారు. వీటి ఫలితంగా ఆయా

దేశాల పౌర సంస్కృతి కొన్ని మార్పులకు గురి అయిందని అంగీకరించారు. అక్కడి రాజకీయాలు, సంస్కృతి మరింత వాస్తవ దృక్పథం సంతరించుకొన్నాయి. ప్రభుత్వ విధానం ప్రభావితం చేయటానికి ప్రజలు కొన్ని ప్రత్యక్ష చర్యలకు దిగవలసి వచ్చిందన్నారు. అయినప్పటికీ అమెరికా, ఇంగ్లండ్ దేశాల్లో పౌర సంస్కృతి గణనీయమైన మార్పులకు - వారి అధ్యయనం ప్రకారం - లోను కాలేదు. ఇప్పటికీ ఆ దేశాల్లో రాజకీయ సంస్థల పట్ల ప్రజల విశ్వాసం స్థిరంగానే ఉంది. ప్రజల అసంతృప్తి కొన్ని ప్రత్యేక విధానాల అమలు విషయంలో - వాటి వైఫల్యం సందర్భంగా వ్యక్తమవుతున్నదే కాని మౌలిక రాజకీయ వ్యవస్థ ఎటువంటి పెను తుఫానుకు, తీవ్ర మార్పులకు గురి కాలేదు.

అలాగే పశ్చిమ జర్మనీ సాధించిన ఆర్థిక ప్రగతి ఆ దేశంలో పౌర సంస్కృతికి ప్రభుత్వాన్ని బలపరిచే విధంగా రూపొందిందే కాని రాజకీయ సంస్థల సౌలభ్యం పట్ల ప్రజలు అసంతృప్తి చెందే పరిణామాలు సంభవించలేదు. ఈ కారణం వల్లనే పశ్చిమ దేశాల్లో నెలకొన్న పౌర సంస్కృతి ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థ సుస్థిరతకు దోహదం చేసిందని ఆల్మండ్, వెర్బాలు భావించారు.

అయితే వీరి అధ్యయనం "పౌర సంస్కృతి" రాజకీయ సంస్కృతికి సంబంధించిన సిద్ధాంతానికి ప్రాధాన్యమిచ్చింది. వారి అధ్యయనానికి సంబంధించి పరిశోధకులు నాల్గు ప్రధానమైన విమర్శలు ప్రస్తావించారు.

(1) రాజకీయ సంస్కృతి రాజకీయ వ్యవస్థను ప్రతిబింబిస్తుందే కాని రాజకీయ వ్యవస్థను నిర్ణయించదని బారి (Barry) అభిప్రాయం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగలమని ప్రజలు భావిస్తారు. వాస్తవంలో వారు అంతగా ప్రభుత్వాన్నీ ప్రభావితం చేయలేకపోవచ్చు అన్నది వేరే విషయం. అయితే ప్రజాస్వామ్యమే లేకపోతే తమకు మనుగడ ఉండదన్న అభిప్రాయం పశ్చిమ సమాజంలోని ప్రజల్లో స్థిరంగా ఉండటం వల్ల అక్కడ పౌర సంస్కృతి ప్రశంసనీయ స్థానంలో స్థిరంగా కొనసాగుతున్నది.

(2) పౌర సంస్కృతి ఒక రాజకీయ వ్యవస్థ సుస్థిరతకు సాధనంగా సామాన్యంగా ఉపకరిస్తుందే కాని ప్రత్యేకంగా ప్రజాస్వామ్య మనుగడకు అది పరిమితం కాదు. నిజానికి నిన్నటి వరకు అమల్లో ఉన్న కమ్యూనిస్టు వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యం పశ్చిమ ప్రజాస్వామ్యాల్లో కంటే ఎక్కువగానే ఉండాలి. అయితే వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది.

(3) ఆల్మండ్, వెర్బాలు తమ విశ్లేషణలో ప్రజాస్వామ్య సుస్థిరతకు ఇచ్చిన ప్రాధాన్యం వాస్తవంలో ఆయా ప్రజాస్వామ్యాల్లో ప్రజల స్వామ్యం ఏ మేరకు ఉందన్నది విమర్శకులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్యాల్లో పౌర సంస్కృతి వల్ల ప్రభుత్వ నిర్ణయాల్లో సరళత్వం కనిపిస్తుందన్న వాదాన్ని విమర్శకులు అంగీకరించటం లేదు. ఎందుకంటే ఉదారవాదం ప్రజాస్వామ్యాన్ని పరిమితం చేస్తుందంటారు.

(4) జాతీయ సంస్కృతికి భిన్నంగా రూపొందుతున్న పౌర సంస్కృతులున్న సమాజాల అధ్యయనాన్ని ఆల్మండ్, వెర్బాలు విమర్శించారు. కొన్ని పాశ్చాత్య సమాజాల్లో కూడా ఉప సంస్కృతులు (Sub-cultures) జాతీయ సంస్కృతికి భిన్నంగా రూపొందుతున్నాయని విమర్శకులు భావించారు. వర్గం, వర్ణం ఎంత తీవ్రంగా ఉన్నాయంటే అవి జాతీయ సంస్కృతికి ఒక సవాలుగా నేడు పాశ్చాత్య దేశాలలో కూడా పరిణమించాయి. అందువల్ల మార్క్సిస్టుల పెట్టుబడిదారీ సమాజాలలోని రాజకీయ సంస్కృతిని వర్గ ప్రాబల్య రాజకీయ సంస్కృతి (Political Culture of the Dominant Class) గా భావిస్తున్నారు.

4.9 సైద్ధాంతిక ప్రాబల్యం : (Ideological Hegemony)

మార్క్స్ సిద్ధాంతకర్తలు పెట్టుబడిదారీ సమాజాల్లో శ్రామిక వర్గం ఎందుకు పెట్టుబడిదారులపై తిరగబడటం లేదన్న అంశాన్ని ప్రధానంగా చర్చించారు. ప్రతి యుగంలోను పాలక వర్గం భావాలు, రాజకీయ సిద్ధాంతాలు

సమాజాన్ని ప్రభావితం చేస్తాయని మార్క్స్ సూచించాడు. ఉత్పత్తి సాధనాలను ఎవరైతే నియంత్రిస్తారో వారే ఆ సమాజంలోని ప్రాబల్య వర్గంగా రూపొందుతారు. భావనలు, రాజకీయ ఆదర్శాలు వారి ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందుతాయి. అవే ఆ సమాజపు ప్రాబల్య విలువలుగా మారతాయి. వాటిని నిస్సహాయ దోపిడీకి గురయ్యే వర్గాలు సైతం అంగీకరించి వాటికి అనుగుణంగా ప్రవర్తిస్తాయని మార్క్స్‌వాదం సారాంశం.

కాలక్రమంలో పెట్టుబడిదారీ వ్యవస్థలో ఏర్పడే అంతర్గత వ్యతిరిక్తతల వల్ల సదరు సమాజంలో శ్రామికవర్గ విప్లవం సాధ్యమనీ, ఆ విప్లవానంతరం మరొక నూతన రాజకీయ సంస్కృతి ఉద్భవిస్తుందని మార్క్స్ భావించాడు.

అయితే ఇటీవలి అనేక మంది మార్క్స్‌వాదులు మార్క్స్ సిద్ధాంతం సార్థకత పట్ల సందేహాలను వెలిబుచ్చాడు. వారు ఉపరితల నిర్మాణానికి (Super Structure) అధిక స్వతంత్ర ప్రతిపత్తి ఇస్తున్నారు. ఉపరితల నిర్మాణంలో వారి అభిప్రాయంలో సంస్కృతి కూడా ఉంది. రాజకీయ కార్యకలాపాల పీఠాన్ని కూడా (పీఠం అంటే ఆర్థిక వ్యవస్థ) మార్చలేకపోయినప్పటికీ ప్రజల వైఖరులను మార్చగలరని వారు భావిస్తున్నారు. ఇటాలియన్ మార్క్సిస్టు గ్రమ్‌స్కీ అభిప్రాయంలో ప్రాబల్యవర్గం ఒక్క నిర్బంధం ద్వారా కాకుండా, ప్రోద్బలం ద్వారా కూడా తన ప్రాబల్యాన్ని (Hegemony) కాపాడుకోవటానికి ఇతర వర్గాలపై తమ భావాలను, సంస్కృతిని రుద్దుతుంది. అభిప్రాయం ఏ విధంగా ఉన్నప్పటికీ దేశ రాజకీయ సంస్కృతి తటస్థ పాత్ర నిర్వహిస్తుందన్న విషయాన్ని మార్క్సిస్టులు సైతం అంగీకరిస్తారు. కాగా వివిధ వర్గాలు ప్రయత్నపూర్వకంగా తమ తమ ఆర్థిక, సామాజిక ప్రయోజనాల పరిరక్షణ కోసం వాటికి అనుకూలమైన విలువలు, వైఖరులు ప్రదర్శించటం వల్ల దాని పరిణామంగా ఆయా సమాజాలలో రాజకీయ సంస్కృతి ఉద్భవించి, స్థిరపడుతుంది. ఈ ప్రయోజన సాధన కోసం ఉదారవాద ప్రజాస్వామ్యాలలో ప్రాబల్య వర్గం – పెట్టుబడిదారీ వర్గం – శ్రామిక వర్గాన్ని విభజించటానికి రాజకీయ హక్కులు, స్వేచ్ఛ, పోటీ, వ్యక్తిస్వేచ్ఛావాదం మొదలైన విలువలు ప్రవేశపెడుతుంది. ప్రచార, ప్రసార సాధనాలు, పత్రికలు, సాహిత్యం, కళలు సదరు ప్రాబల్య వర్గం భావాలను సమాజంలోని అన్ని రంగాలకు – అన్ని ఇతర వర్గాలకు – విస్తరింప చేయటానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తాయి. దానికి విద్యా వ్యవస్థ, మతం, వాణిజ్య వ్యాపార సంస్థలు ఇతోధికంగా తోడ్పడతాయి.

అయితే మార్క్సిస్టు దృక్పథంలో ఒక కొట్టవచ్చిన బలహీనత మనకు కనిపిస్తుంది. అదేమిటంటే మార్క్స్ సిద్ధాంతకర్తలు శ్రామిక వర్గానికిఎప్పుడూ తీవ్రవాద ధోరణి (Radical) ఉంటుందని భావిస్తారు. అయితే వారి ఉద్దేశంలో ప్రాబల్య వర్గం శ్రామికులనుమాయ విలువలతో, భావనలతో లోబరుచుకొంటుంది. పరిమిత విద్య, ఆర్థిక అభద్రత భావం మొదలైనవి శ్రామికవర్గాన్ని తీవ్రవాద ధోరణికి బదులు సంప్రదాయ వైఖరిని అనుసరించేటట్లు చేస్తాయని లిప్‌సెట్ (Lipset, 1983) ఒక అధ్యయనంలో వాదించాడు.

4.10 ఉప సంస్కృతిః (Sub - Culture)

రాజకీయ సంస్కృతి ఒక ముఖ్యమైన భావం అయినప్పటికీ రాజకీయ సంస్కరణ రాజకీయ విశ్లేషణలో అతి ముఖ్యమైన సాధనం అయినప్పటికీ రాజకీయ సంస్కరణ భావ విస్తరణ ఆచరణ అన్ని సమాజాల్లోను ఒక విధంగా లేవు. సమకాలీన సమాజాల్లో అన్ని చోట్ల ఏకత్వం గల రాజకీయ సంస్కృతి ఒక విధంగా లేదు. అలాగే ఏ సమాజంలోను రాజకీయ సంస్కృతి ఆ సమాజం మొత్తానికి ఏకోన్ముఖంగా వర్తించేలా లేదు. విద్యా స్థాయి, జాతి, ఉపజాతి వైవిధ్యాలు, ఉపసంస్కృతుల ఆవిర్భావానికి దోహదం చేశాయి. ప్రతి సమాజంలోను పాలక వర్గం రాజకీయ సంస్కృతి ఒక వైపు పాలితులకు సమాజ పరంగా ఉత్పన్నమయ్యే రాజకీయ సంస్కృతులు, ఉప సంస్కృతులుగా మనటం మనం గమనించవచ్చు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో తెల్లవారికీ, నీగ్రోలకు మధ్య రాజకీయ సంస్కృతుల్లో వ్యత్యాసాలను మనం గమనించవచ్చు. అదే విధంగా కొన్ని యూరప్ దేశాల్లో రాజకీయ కదలికలు ప్రొటెస్టాంట్‌ల మధ్య రాజకీయ సంస్కృతి పరంగా వైవిధ్యం కనిపిస్తుంది. అదే విధంగా భారత దేశంలో హిందూ, ముస్లింల మధ్య రాజకీయ

సంస్కృతుల పరంగా వ్యత్యాసాలు కనిపిస్తాయి. ఏ రాజకీయ వ్యవస్థలోనైనా అందులోని మొత్తం జనాభాకు ఒకే రకమైన సంస్కృతి ఉండదు. ప్రాంతం, భాష, మతం, సామాజిక వైవిధ్యాలు అనేక ఉపసంస్కృతులకు ఆలంబన అవుతాయి. అలాగే రాజకీయ సంస్కృతికి తగిన విధంగా రాజకీయ నిర్మితులు కానప్పుడు కూడా ఉపసంస్కృతులు అవతరిస్తాయి. నిర్మితుల్లో మార్పులు లేకుండా ప్రజల వైఖరులలో మార్పులు రావాలని ఆశించటం కూడా ఉపసంస్కృతుల అవతరణకు అవకాశం కల్పిస్తుంది. ఒక రాజకీయ వ్యవస్థలోని ప్రజల రాజకీయ భావాలలో గుర్తించదగిన విభేదాలు ఉన్నప్పుడు వాటినే రాజకీయ ఉపసంస్కృతులుగా పేర్కొంటున్నాం.

4.11 రాజకీయ సంస్కృతి విశిష్ట లక్షణాలుః

రాబర్ట్‌ధాల్ అధ్యయనం ప్రకారం రాజకీయ సంస్కృతికి కింది లక్షణాలుంటాయిః

(1) సమస్య పరిష్కారానికి సంబంధించిన దృక్పథాలు అవి వాస్తవమైనవా ? హేతుబద్ధమైనవా ? కావా ?

(2) సమిష్టి చర్యకు సంబంధించిన దృక్పథాలు - అవి సహకారంతో కూడుకొన్నవా? లేదా అనైక్యతతో ఉంటాయా?

(3) రాజకీయ వ్యవస్థకు సంబంధించిన దృక్పథాలు - అవి విధేయతతో కూడుకొన్నవా? పరాధీనమైనవా?

(4) ఇతరుల పట్ల దృక్పథాలు - అవి విశ్వసనీయమైనవా? కావా?

లూసియన్‌పై అధ్యయనాన్ని అనుసరించి జాతీయ సంస్కృతికి కింది లక్షణాలుంటాయిః

(1) రాజకీయ కార్యకలాపాల పరిధి.

(2) రాజకీయాల్లో ఏ విధంగా లక్ష్యాలు సాధనాల మధ్య సమన్వయం జరుగుతుంది.

(3) రాజకీయ చర్యల సమీక్షకు ఉపయోగించే కొలబద్దల నాణ్యత.

(4) రాజకీయ చర్యల వెనక ఉన్న విలువలు

సాధారణ లేదా జాతీయ సంస్కృతిలో ఒక భాగమే రాజకీయ సంస్కృతి. రాజకీయ విలువలు, విశ్వాసాలు, ఆదర్శాలు చర్యాపరమైన వ్యాఖ్యానాల సముదాయమే రాజకీయ సంస్కృతి. అయితే ఈ రాజకీయ సంస్కృతి సాధారణ సంస్కృతిలో ఒక భాగమే. అందువల్లనే డెన్నిస్ కవనచ్ రాజకీయ సంస్కృతిని సాధారణ సంస్కృతిలో ఒక ఉపసంస్కృతిగా భావిస్తాడు. ఫ్రాన్స్‌లో ప్రజలకు ప్రభుత్వం పట్ల సర్వసాధారణంగా అవిశ్వాసం ప్రబలంగా ఉండటానికి కారణం సామాజిక స్థాయిలో వ్యక్తుల మధ్య అతి తగ్గ స్థాయిలో విశ్వాసం ఉండటమేనని కావనచ్ విశ్లేషిస్తాడు.

4.12 మూడో ప్రపంచంలో రాజకీయ సంస్కృతి ः

పాశ్చాత్య ఉదారవాద ప్రజాస్వామ్య సమాజాలలోని రాజకీయ సంస్కృతి భాగస్వామ్య సంస్కృతిని సూచిస్తుంటే ఇటీవలి కాలం వరకు అమల్లో ఉన్న కమ్యూనిస్టు దేశాలలోని రాజకీయ సంస్కృతి అధీన సంస్కృతికి ప్రతినిధ్యం వహిస్తే మరి అభివృద్ధి చెందుతున్న మూడో ప్రపంచ దేశాలలోని రాజకీయ సంస్కృతి ఎటువంటి రూపురేఖలను దిద్దుకొంటున్నది ?

అభివృద్ధి చెందిన సమాజాలతో పోలిస్తే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో రాజ్య వ్యవస్థ నిస్సందేహంగా బలహీనమైంది. ఈ కారణం వల్లనే అనేక వైవిధ్యాలతో రాజకీయ సంస్కృతి ఇంకా స్థిరీకరణ చెందలేదు. అధీన సంస్కృతి కొంతమేరకు రాజ్య వ్యవస్థ బలహీనతకు కారణంగా హేగ్, హారప్‌లు వాదిస్తారు. (Hague and Martin Harrop - Comparative government and Politics - Introduction)

మూడో ప్రపంచ దేశాల్లో స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన తరం జాతీయ, రాజకీయ సంస్కృతిని రూపొందించటానికి ప్రయత్నం చేస్తున్నది. ప్రాథమిక విద్య, వయోజన విద్య మొదలైన పథకాలు. జాతీయ సంస్కృతిని ప్రోత్సహించటానికి ప్రయత్నిస్తున్నది. ప్రచార, ప్రసార సాధనాలు, పత్రికలు, జాతీయ సమైక్యతను వొక్కి చెబుతున్నాయి.

అయితే మరో వైపు పెరుగుతున్న జనాభా, అందుబాటులోని సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక వెనకబడిన తనం, మౌలిక వనరుల కొరత మొదలైన ప్రాంతీయ, తెగపరమైన వైవిధ్యాలను ఎగదోసే జాతీయ, రాజకీయ సంస్కృతిని బలహీనం చేస్తున్నాయి.

భారత దేశ రాజకీయాలను అధ్యయనం చేసిన మైరన్ వీనర్ భారత రాజకీయ సంస్కృతిని జన బాహుళ్య సంస్కృతి (Mass culture) గా వర్ణించారు. కుల, మత, భాషా, లింగ సామాజిక, సాంస్కృతిక వైవిధ్యాలు జనబాహుళ్య సంస్కృతి అవతరణకు ప్రాతిపదికలయ్యాయి. రాజకీయవేత్తలు సంకుచిత ప్రయోజనాల కోసం కులం, మతం, భాషా, ప్రాంతీయ వైవిధ్యాలను ఉపయోగించుకొంటున్నారు. ఇటువంటి వర్గాలు ఆర్థిక సహాయం అత్యధిక విద్యా సౌకర్యాలు, రిజర్వేషన్ వసతులు, ఇండ్ల స్థలాలు పంపిణీ మొదలైన వాటి సాఫల్యతకే భారతీయ ప్రజానీకం ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నది.

అస్సాంలో మిజో, బోడోలు, బీహార్‌లో జార్‌ఖండ్‌లు, పశ్చిమబెంగాల్‌లో గూర్ఖాలు, తమిళనాడులో ద్రవిడ వర్గాలు తెగల విధేయులు ప్రాంతీయ విధేయతలకే ప్రాధాన్యమిస్తున్నారు. (Primordial Loyalties).

జాతీయ స్థాయి రాజకీయ పక్షాలు జాతీయ శిష్ట వర్గ సంస్కృతిని అలవరుచుకొన్నప్పటికీ అవి స్థానిక విషయాల్లో ఉపసంస్కృతుల వైవిధ్యాలను తరచూ ఎదుర్కొంటున్నాయి. వివిధ వర్గాల మధ్య విభిన్న ఆసక్తుల మధ్య నిరంతరం తలెత్తే విభేదాలను పరిష్కరించటానికి సామరస్య మార్గాన్ని వెదకటానికి సర్వ సమ్మతి (Consensus) ద్వారా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

4.13 సారాంశం

ఆధునిక రాజకీయ విశ్లేషణలో రాజకీయ సంస్కృతి ఒక ముఖ్యాంశం. రాజకీయ సంస్కృతి అధ్యయనం ప్రాముఖ్యాన్ని అందరూ గుర్తించినప్పటికీ, రాజకీయ శాస్త్రజ్ఞులు రాజకీయ సంస్కృతి అధ్యయనంపై అనేక రచనలు చేసినప్పటికీ రాజనీతి శాస్త్రంలోని అనేక భావనల్లాగా రాజకీయ సంస్కృతి భావన కూడా చాలా సంక్లిష్టమైంది. దీనిపై జరిగిన అనేక అధ్యయనాలను మనం పరిశీలిస్తే ఈ విషయం బోధపడుతుంది.

రాజకీయ సంస్కృతి అధ్యయనంలో మనకు స్పష్టంగా కనిపించే ఒక ఇబ్బంది ఏమిటంటే అనేక రాజకీయ, సామాజిక చలాంకాల (Variables) ప్రాముఖ్యాన్ని తగ్గించటానికి చేసే ప్రయత్నం - ముఖ్యంగా పాశ్చాత్య ఉదారవాద ప్రజాస్వామ్యాలను దృష్టిలో ఉంచుకొని చేసిన అధ్యయనాల్లో దీన్ని మనం స్పష్టంగా గమనించవచ్చు.

రాజకీయ సంస్కృతి పూర్తి రూపాన్ని చిత్రించటం చాలా కష్టమని కొందరు భావిస్తారు. ఎందుకంటే ఒక రాజకీయ వ్యవస్థలోని సమస్త ప్రజానీకం వైఖరులు, అభిప్రాయాలు, అభిరుచులు పూర్తిగా అధ్యయనం చేసి అంచనా చేయటం సాధ్యం కాదు. అలాగే విలువలకు, ప్రభుత్వ నిర్వహణకు మధ్య లంకెను నిర్ధారించటం అన్ని సందర్భాల్లోను, అన్ని సమాజాల్లోను సాధ్యం కాదు. ప్రజాస్వామ్యాల్లో కూడా అనుభవ పూర్వక సిద్ధాంతాలకు రాజకీయ సంస్కృతికీ మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తుంది.

అలాగే రాజకీయ సంస్కృతికి సంబంధించిన సిద్ధాంతాలు, సాంప్రదాయక సిద్ధాంతాల కంటే ఏ విధంగాను మెరుగ్గా లేవని విమర్శకులు భావిస్తారు. బేజ్‌హాట్, డీటోక్విల్లి, డైసీ ఇంకా అనేక మంది సాంప్రదాయిక రచయితలు వక్కాణించిన రాజకీయ విలువలను ప్రతీకలను, ప్రస్తుత రాజకీయ సంస్కృతికి సంబంధించిన అధ్యయనాలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే సదరు రచనలన్నీ అభిప్రాయ ప్రకటనలే (Impressionistic) కాని

ప్రవేశనియంత్రణ (Gate-keeping), డిమాండ్లు, మద్దతులు సాధికారిక నిర్ణయాలు, విలువల పంపిణీ, భారం (over load), ఒత్తిడి (stress) ఇవీ వ్యవస్థా విశ్లేషణలో మనం ముఖ్యంగా అర్థం చేసుకోవలసిన భావనలు.

వ్యవస్థ నిర్వహణ కన్న దాని అస్థిత్వ నిరంతరతకే ఈస్టన్ ఎక్కువ ప్రాధన్యమిచ్చారనే విమర్శ ఉంది. దీని వల్ల వ్యవస్థ తన విధులు, ధ్యేయాలు నిర్వహించటం కన్న తన అస్థిత్వాన్ని నిలుపుకొని కొనసాగటానికే ఎక్కువ ప్రాధాన్యమివ్వటం అవుతుంది. అదీగాక రాజకీయ వ్యవస్థలో సంభవించే రాజకీయ పతనాన్ని (politics of decline) రాజకీయ విఘటనలను (Political disruptions and breakdowns) అర్థం చేసుకోవటానికి ఈస్టన్ వ్యవస్థా విశ్లేషణ ఉపయోగకారి కాదనే విమర్శ కూడా ఉంది. ఈ భావన ద్వారా ప్రజా ఉద్యమ రాజకీయాలను అర్థం చేసుకోవటం కూడా కష్టమే. రాజకీయ వ్యవస్థ అనేది జాతి రాజ్య వ్యవస్థా? లేదా కేవలం ఒక భావాత్మక చిత్రమా? తెలుసుకోవటం కష్టమే. ఆధునిక రాజకీయ వ్యవస్థలు జాతి రాజ్య వ్యవస్థలుగానే కనిపిస్తాయి. ఈ విషయాన్ని సూటిగా అంగీకరించకుండా 'రాజకీయ వ్యవస్థ' అనే భావనను ప్రవేశపెట్టటం కేవలం అనేక అసమానతలతో కూడిన సామాజిక ఆర్థిక యదార్థ పరిస్థితుల అధ్యయనం జరగకుండా మభ్య పెట్టటమే నని ఈస్టన్ విశ్లేషణను విమర్శిస్తారు.

వ్యవస్థా విశ్లేషణను జాగ్రత్తగా పరిశీలిస్తే మనకు ఒక విషయం తెలుస్తుంది. ఈస్టన్ తన సిద్ధాంతంలో వ్యక్తిని విస్మరించారు. రాజకీయ వ్యవస్థకు బాహ్యంగా ఉండి దాని విఘటనకు కారకుడుగానో, లేదా దాన అస్థిత్వ కొనసాగింపుకు తోడ్పడే వాడుగానో మిగులుతాడు వ్యక్తి. అందులో విడదీయరాని భాగంగా కనిపించడు. ఇది ఆర్కిమిడీసు భూగోళానికి బాహ్యంగా నిలబడి దాన్ని పరిశీలించడానికి ప్రయత్నించటం లాంటిదేనని హన్నా అరెంట్ విమర్శించారు. ప్రతి దాన్ని వ్యక్తికి సంబంధం లేని ప్రక్రియలుగా, భావించటాన్ని గమనిస్తే రాజకీయ వ్యవస్థలో వ్యక్తి అనేవాడు ఉన్నాడా అనే అనుమానం కలుగుతుంది అంటారామే. ఇది అసలు వస్తువును వదలి దాని ప్యాకింగ్‌కు ప్రాధాన్యత నివ్వటం లాంటిదేనని పాల్‌క్రెస్ విమర్శించారు.

సాంప్రదాయక రాజకీయ సిద్ధాంతం వలె కాక నిష్పక్షపాత వైఖరిని ప్రదర్శించే శుద్ధ శాస్త్రీయ సిద్ధాంతంగా ముందుకు వచ్చింది వ్యవస్థా విశ్లేషణ. నిష్పక్షపాత సామాజిక శాస్త్రమనే భావనను ఎజెండా మీదికి తెచ్చిన ప్రవర్తనా వాద ఉద్యమంలో భాగంగానే వ్యవస్థా విశ్లేషణ సిద్ధాంతం రాజనీతి శాస్త్రంలోకి ప్రవేశించింది. కాని వ్యవస్థా విశ్లేషణ నిజంగా రాజకీయ సైద్ధాంతిక నిష్పక్షపాత వైఖరిని ప్రదర్శించే సిద్ధాంతమేనా? ఇది మార్క్సిస్టు సామాజిక శాస్త్రానికి భిన్నమైన అమెరికన్ రాజనీతిశాస్త్రంలో భాగమని విమర్శిస్తారు. రెండో ప్రపంచయుద్ధానంతరం వలస విముక్తి చెందిన దేశాలు తమ రాజకీయ వ్యవస్థల పునర్నిర్మాణ క్రమంలో మార్క్సిస్టు ప్రలోభానికి లోబడి సోవియట్ రాజకీయ వ్యవస్థా నమూనాను అనుసరించకుండా అమెరికన్ ఉదారవాద ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థను ఈ దేశాల వారికి సరియైన నమూనాగా ప్రచారం చేయటం కోసం పుట్టిన అమెరికన్ రాజనీతిశాస్త్రంలో భాగమేనని వ్యవస్థా విశ్లేషణను కొందరు విమర్శిస్తారు. ఇది పూర్తిగా అబద్ధమని చెప్పలేం.

వ్యవస్థల విశ్లేషణా సిద్ధాంతం అరిస్టాటిల్ కాలం నుంచి రాజకీయాధ్యయనానికి తోడ్పడుతూ వస్తున్నదని పేర్కొంటూ రాబర్ట్ స్పిరో ఇలా అన్నారు.

"మానవులు వర్తమానానికి, తామూహించు కునే భవిష్యత్తుకు మధ్య ఉన్న తారతమ్యాన్ని తెలుసుకోగల శక్తిమంతులు. భవిష్యత్తును గురించిన కలలకు వాస్తవ రూపాన్ని కల్పించుకునేందుకు వారు నిరంతరమూ పాటుపడుతూ ఉంటారు. ఇందులో ఎన్నో ఇబ్బందుల్నీ ఎదుర్కొంటారు. తమ సమస్యల పరిష్కారానికి వాళ్ళు రాజకీయానాశ్రయిస్తారు. ఒక్కొక్కసారి విజయం సాధిస్తారు. ఎన్నోసార్లు ఓటమినీ చవి చూస్తారు. తమ కలల స్వరూపాన్నీ మార్చుకొంటారు. ఒక్కోసారి వాటి గురించి మర్చిపోతారు కూడా. మళ్ళీ కొత్త కలలు, కొత్త వాంఛలు పుడుతూనే ఉంటాయి. చరిత్రలో ఇలా జరుగుతూనే వస్తున్నది. తమ జీవన సమరంలో సాధ్యాసాధ్యాలను అనుభవపూర్వకంగా తెలుసుకొంటూనే ఉంటారు మానవులు. ఏది సాధ్యమని వారు భావిస్తూ వస్తున్నారో అది రాజకీయంగానే సాధ్యమని కనీసం థామస్ హాబ్స్ కాలం నుంచైనా మనం తెలుసుకొంటూ వచ్చాం. మంచి జీవనం రాజకీయంగానే సాధ్యమని చెప్పినా అతిశయోక్తి లేదు. అరిస్టాటిల్ చెప్పిందీ ఇదే. అందుకోసం రాజకీయవ్యవస్థల్ని కావాలనే ఏర్పాటు చేసుకొన్నారు మానవులు. మానవ చైతన్య రూపమే రాజకీయవ్యవస్థ దీన్ని అర్థం చేసుకోవాలంటే వ్యవస్థ సిద్ధాంతమొక్కటే శరణ్యం".

ప్రవర్తనావాద రాజకీయ శాస్త్రం, అందులో భాగం గానే జనించిన రాజకీయ విశ్లేషణ భావన రెండో ప్రపంచ యుద్ధానంతరం రాజకీయ శాస్త్రాధ్యయనాన్ని సుసంపన్నం చేసిందని భావించటానికి అభ్యంతరం ఉండకూడదు.

- ఆచార్య బి. వెంకటేశ్వర్లు

5.9 చదువదగిన పుస్తకాలు

O.R. Young	:	*Systems of Political Science*
Davind Easton	:	*A frame work for political analysis*
Easton, David	:	*The Political System*
Varma. S.P.,	:	*Modern Political Theory*

5.10 నమూనా పరీక్షా ప్రశ్నలు.

ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. సాధారణ వ్యవస్థల సిద్ధాంతాన్ని చర్చించండి.
2. డేవిడ్ ఈస్టన్ ఉత్పాదకాలు, ఉత్పాదితాల భావనను విశ్లేషించండి.
3. రాజనీతి శాస్త్ర అధ్యయనాల్లో సాధారణ వ్యవస్థల భావన పాత్రను విశ్లేషించండి.

క్రింది వానికి సంక్షిప్తంగా జవాబులు రాయండి

1. వ్యవస్థల విశ్లేషణ
2. డేవిడ్ ఈస్టన్

...

భాగం - 6 నిర్మితులు - విధుల విశ్లేషణ

విషయ క్రమం

6.1 లక్ష్యాలు
6.2 పరిచయం
6.3.0 నిర్మితులు-విధుల విశ్లేషణ - అర్థం
6.3.1 టాల్కాట్ పార్సన్స్ విశ్లేషణ
6.4 తులనాత్మక రాజకీయాలు - నిర్మితులు విధుల విశ్లేషణ
6.5 రాజకీయ సామాజీకరణ - భర్తీ
6.6 ప్రయోజనాల వ్యక్తీకరణ
6.7 ప్రయోజనాల సమీకరణ
6.8 ప్రయోజనాల వ్యక్తీకరణ - రాజకీయ నిర్మితులు
6.9 ప్రయోజనాల సమీకరణ పద్ధతులు
6.10 రాజకీయ ప్రసారం
6.11 ఉత్పాదిత విధులు
6.12 నియమావళి కల్పన
6.13 నియమావళి నిర్వహణ
6.14 నియమావళి న్యాయనిర్ణయం
6.15.0 సామర్థ్య విధులు
6.15.1 వెలికి తీయగల సామర్థ్యం
6.15.2 అదుపు చేసే సామర్థ్యం
6.15.3 పంపిణీ సామర్థ్యం
6.15.4 లాంఛనాల సామర్థ్యం
6.15.5 స్పందవా సామర్థ్యం
6.15.6 స్వసమాజ, అంతర్జాతీయ సామర్థ్యం
6.15.7 సామర్థ్య నిర్ణాయకాలు
6.16 రాజకీయ వ్యవస్థ సామర్థ్యం - రాజకీయాభివృద్ధి
6.17 పద్ధతి నిర్వహణ, అనుసరణీయతా విధులు
6.18 విమర్శ
6.19 చదువదగిన పుస్తకాలు
6.20 నమూనా పరీక్షా ప్రశ్నలు

6.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

* నిర్మితులు - విధుల విశ్లేషణ అర్థం,
* తులనాత్మక రాజకీయాలలో నిర్మితులు - విధుల విశ్లేషణ
* సామర్థ్య విధులను బాగా వివరిస్తారు.

6.2 పరిచయం

తులనాత్మక రాజకీయాల అధ్యయన దృక్పథాలలో నిర్మితులు-విధుల విశ్లేషణ ఒకటి. ఆధునిక కాలంలో ఈ

విశ్లేషణ ఒక కొత్త రూపాన్ని సంతరించుకొన్నప్పటికీ, ప్రాచీన కాలంలోనే ఇది వినియోగంలో ఉన్నట్లుగా చెప్పవచ్చు. ప్రాచీన గ్రీకు రాజనీతి తత్వవేత్తలు ప్లేటో, అరిస్టాటిల్ రాజకీయ వ్యవస్థలు కొనసాగడానికి, మనుగడకు అవి నిర్వహించాల్సిన విధులను వివరించారు. విధుల ప్రాతిపదికగానే అరిస్టాటిల్ ప్రభుత్వాల వర్గీకరణ చేశాడు.

సామాజిక శాస్త్రాల అధ్యయనంలో సాంప్రదాయక పద్ధతులు వాస్తవాలను వెలికి తీయడానికి అంతగా సహకరించక పోవడంతో అధునాతన పద్ధతుల ద్వారా విషయ పరిశీలన మొదలయింది. సంస్థలు, వాటి కర్తవ్యాల అధ్యయనంతో చాటుగా అందులోని వ్యక్తుల, వర్గాల ప్రవర్తనను కూడా పరిశీలించడం అవసరమని గుర్తించారు. ఆధునిక కాలంలో ఒకే సంస్థ వివిధ కర్తవ్యాలను నిర్వహించడం - అంతేకాకుండా రాజకీయ, ఆర్థిక, సామాజిక జీవనంలో వ్యక్తుల, వర్గాల పాత్ర అభివృద్ధి చెందడం, కొత్త సంస్థలు, ఆవిర్భవించడం మొదలైన కారణాల వల్ల ప్రవర్తనల పరిశీలన ఆవశ్యకతను మరింత గుర్తించారు. దీని ఫలితమే ప్రవర్తనావాద ఉద్యమం, నూతన పద్ధతుల అనుసరణ. ఈ పద్ధతులలో నిర్మితులు - విధిల విశ్లేషణ ఒకటి.

ఆధునిక కాలంలో నిర్మితులు - విధుల విశ్లేషణ మానవశాస్త్రం (Anthropology), సమాజ శాస్త్రం (Sociology)లతో మొదలైంది. దీనిని మానవశాస్త్రంలో మొదటగా వినియోగించారు. రాడ్క్లిఫ్ బ్రౌన్ (Radcliff Brown), మెలినవస్కీ (B. Malinowski), సమాజశాస్త్రంలో మొదటగా వినియోగించినవారు మెరియన్, లెవీ (Merion, Levy),.మెర్టన్ (Merton), టాల్కాట్ పార్సన్స్ (Talcot parsons). రాజకీయ సంబంధిత విషయాల వాస్తవాలను వెలికితీయాలనే కుతూహలం రాజనీతిశాస్త్రజ్ఞులను కూడా నిర్మితులు-విధుల విశ్లేషణ పట్ల ఆకర్షితులను చేసింది. దీని వివరాలను తెలుసుకొనే ముందు పాత్ర (role), నిర్మితి (structure) విధులు (functions), వ్యవస్థ (system) అనే భావాలను గురించి తెలుసుకోవాలి.

పాత్ర (Role): అవలోకించదగిన, లేదా ఆశించదగిన ప్రవర్తనను పాత్ర అంటారు. వివరంగా చెప్పాలంటే సమాజంలోని వ్యక్తులు, వర్గాలు, సంస్థలు మొదలైన వాటి నుంచి ఆశించే ప్రవర్తనను పాత్ర అనవచ్చు. ఆప్టర్ (Apter) అభిపాయంలో rol eis a functionally defined position in a social system, ఆల్మండ్ అభిప్రాయంలో role is the organised sector of an actor's orientation which defines his participation in an interactive process. దీనిని బట్టి సామాజిక వ్యవస్థలోని వ్యక్తులు, వర్గాలు సమాజం మనుగడలో, పరస్పర సంబంధాలలో విధి నిర్వహణ సంబంధమైన పాత్ర వహిస్తారని తెలుస్తుంది. సమాజంలో తల్లి, తండ్రి, కుమార్తె, కుమారుడు, సోదరుడు, ఉద్యోగి, యజమాని, పార్టీ సభ్యుడు, పార్టీ నాయకుడు, ప్రజాప్రతినిధి, ఆర్థిక వ్యవస్థ సభ్యుడు, విద్యార్థి, అధ్యాపకుడు మొదలైన పాత్రలుంటాయి. సమాజంలో ఒకే వ్యక్తి వివిధ పాత్రలు నిర్వహిస్తుంటాడు. ఉదాహరణకు, కుటుంబయజమాని భార్యకు భర్తగా, పిల్లలకు తండ్రిగా, తోడబుట్టిన వారికి సోదరునిగా, తాను పని చేసే సంస్థలో ఉద్యోగిగా, ఓటరుగా వివిధపాత్రలు నిర్వహిస్తాడు. ఒక రాజకీయపార్టీ నాయకుడు తన పార్టీలో క్రమశిక్షణ నిర్వాహకునిగా, మార్గదర్శిగా, ఇతర పార్టీలతో వ్యవహరించడంలో సంధానకర్తగా, ప్రజాప్రతినిధి కూడా అయితే తాను ప్రతినిధిగా ఉన్న నిర్మితిలో కర్తవ్య నిర్వాహకునిగా వివిధ పాత్రలు నిర్వహిస్తాడు.

నిర్మితి (structure) : రాజకీయ, సాంఘిక, ఆర్థిక, విద్యావిజ్ఞానం మొదలైన విధుల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను నిర్మితులు అంటారు. వివిధ పాత్రల సముదాయం నిర్మితి అని కూడా చెప్పవచ్చు. ముందు చెప్పినట్లు సాంఘిక జీవనంలో వ్యక్తులు, వర్గాలు వివిధ పాత్రలు నిర్వహిస్తారు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే ఒక కర్తవ్యం వివిధ నిర్మితుల ద్వారా జరగవచ్చు. అంతేకాకుండా వివిధ కర్తవ్యాల నిర్వహణలో ఒకటికంటే ఎక్కువ నిర్మితులు పాల్గొనవచ్చు. ఈ విషయాలను వివరంగా తెలుసుకొనే ముందు నిర్మితులు ఏ విధంగా ఏర్పడతాయో గ్రహించాలి. భర్త, భార్య, కుమారుడు, కుమార్తెల పాత్రలు కుటుంబ నిర్మితి రూపం దాలుస్తాయి. పురోహితుడు, భక్తులు, ధర్మకర్తలు, వంటి వారి పాత్రలు మతపరమైన నిర్మితి రూపం పొందుతాయి. కక్షిదారుడు, న్యాయవాదులు, సాక్షులు, నిందితుడు, న్యాయమూర్తి, మొదలైనవారి పాత్రలు న్యాయసంబంధమైన నిర్మితికి రూపం కల్పిస్తాయి. విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర ఉద్యోగుల పాత్రలు నిర్వహణ విషయంలో విద్యాసంబంధమైన నిర్మితి ఏర్పడుతుంది.

ఇక ఒకే విధి వివిధ నిర్మితుల ద్వారానూ, వివిధ విధులు ఒకే నిర్మితి ద్వారాను జరగడానికి ఉదాహరణలు చూద్దాం. కుటుంబమనే నిర్మితిలోని పాత్రధారులు కుటుంబ సంబంధమైన విధుల నిర్వహణతో బాటుగా

రాజకీయ సామాజికరణ విధిని కూడా నిర్వహించవచ్చు. శాసన నిర్మాణ శాఖ శాసన నిర్మాణంతోబాటు సభ్యుల హక్కుల పరిరక్షణ, క్రమశిక్షణ అమలు జరపడం, కార్యనిర్వాహక వర్గంపై నియంత్రణవంటి విషయాలలో సముచిత పాత్ర వహిస్తుంది. భారత దేశాధ్యక్షుడు కార్యనిర్వహణ బాధ్యత వహిస్తాడు. రాజకీయ వ్యవస్థలో భాగమైన రాజకీయ పార్టీ నియోజకుల అభిమతాన్ని ప్రభుత్వానికి తెలపడం, దేశసమస్యలను ప్రజల దృష్టికి తేవడం, రాజకీయాలలో పాల్గొనడానికి పౌరులను ప్రోత్సహించడం, సమాజంలోని వివిధ వర్గాల ప్రయోజనాలను సమీకరించడం మొదలైన విషయాలలోపాత్ర వహిస్తుంది. ఆర్థిక సంబంధమైన ఒక నిర్మితి సభ్యుల ఆర్థికావసరాలు సమకూర్చే కృషి చేయడం, ప్రభావవర్గంగా పని చేయడంలో పాత్ర వహిస్తుంది.

వివిధ పాత్రలు, నిర్మితులు నిర్వహించే చర్యలనే (functions)విధులు అంటారు. కొన్ని నిర్మితుల సముదాయం వ్యవస్థగా (System) గాని, ఉప-వ్యవస్థగా (sub-system) గాని రూపొందుతుంది. ఉదాహరణకు, సమాజాన్ని ఒక వ్యవస్థగా పరిగణిస్తే రాజకీయ వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ సాంస్కృతిక వ్యవస్థ, విద్యావిషయక వ్యవస్థ మొదలైనవి - ఉప-వ్యవస్థలవుతాయి. ఒక రాజకీయ వ్యవస్థలో పార్టీ వ్యవస్థ, ప్రభుత్వ వ్యవస్థలను ఉపవ్యవస్థలుగా పరిగణించాలి. ప్రభుత్వ వ్యవస్తలో కార్యనిర్వాహకు శాసననిర్మాణ, న్యాయపాలన వ్యవస్థలను ఉపవ్యవస్థలుగా పరిగణించాలి.

సమాజంలో వివధ పాత్రల నిర్వహణలో వ్యక్తులు, వర్గాల మధ్య సంబంద బాంధవ్యాలుంటాయి. కొన్ని విలువలు, నియమాలు వీటిని నియంత్రిస్తాయి. వీటి ఆధారంగానే పాత్రల విధులు రూపుదిద్దుకొంటాయి. సమాజంలోని విలువలను అధికార పూర్వకంగా కేటాయింపులు చేయగల నిర్మితులు (structures) పాత్రలు (roles) కూడికనే రాజకీయ వ్యవస్థ అంటారు.

ఈ సందర్భంలో పదజాల వినియోగంలో ఉన్న ప్రత్యేకతను గుర్తించడం ఎంతో అవసరం. ఆఫీసుకు బదులుగా రోల్, ఇన్‌స్టిట్యూషన్ బదులుగా స్ట్రక్చర్, పవర్‌కు మారుగా సంక్షన్, స్టేట్‌కు బదులు సిస్టమ్ అనే పదాలను మనం వినియోగించడంలో ప్రత్యేక ప్రయోజనముంది. వ్యక్తులు వర్గాలు నిర్వహించాల్సిన విధులకు కాక, నిర్వహిస్తున్న విధులకు లేదా ప్రవర్తనకు, సంస్థలు నిర్వహించాల్సి కర్తవ్యాలకు కాకుండా వాస్తవంగా నిర్వహిస్తున్న విధులకు ప్రాధాన్యముంటుంది. మరో విధంగా చెప్పాలంటే ప్రవర్తనకు ప్రాధాన్యమివ్వడం జరుగుతుంది. ఇక నిర్మితులు-విధులు విశ్లేషణ వివరాలను పరిశీలిద్దాం.

6.3.0 నిర్మితులు - విధుల విశ్లేషణ - అర్థం

నిర్మితులు, విధుల విశ్లేషణలో వ్యవస్థ నిర్వహించాల్సిన విధులకు ప్రధమ స్థానముంటుంది. ఒక వ్యవస్థ నిలిచి ఉండటానికి, కొనసాగడానికి అది నిర్వహించాల్సిన కర్తవ్యాలేమిటో కనుక్కొనే ప్రయత్నం విశ్లేషకులు చేస్తారు. ఆ తరువాత ఆకర్తవ్య నిర్వహణ జరిపే నిర్మితులను తెలుసుకొంటారు. ఉదాహరణకు, మానవుని మెదడు పని చేస్తుందా? అనే ప్రశ్నకంటే మానవశరీరానికి పోషణ ఏ విధంగా జరుగుతోంది? చూడటం, వినడం వంటి విధులు ఏ విధంగా నిర్వహించబడుతున్నాయి? అన్న ప్రశ్నలతో పరిశీలన మొదలవుతుంది. వివరంగా చెప్పాలంటే విధుల సంబందమైన ప్రశ్నల ద్వారా నిర్మితులకు సంబంధించిన సమాధానాలు సాధించడానికి నిర్మితులు - విధుల విశ్లేషకులు ప్రయత్నిస్తారు. అందువల్లనే కొందరు ఈ విశ్లేషణను విధులు-నిర్మితుల విశ్లేషణ అనడం సముచిత మంటారు.

6.3.1 టాల్కాట్ పార్సన్స్ విశ్లేషణ

(1) తరహా నిర్వహణ లేదా ఉద్రిక్తత నిర్వహణ : సామాజిక వ్యవస్థ తరహాను, లేదా రూపాన్ని నిర్వహించడం వ్యవస్థ కొనసాగడానికి ఎంతో అవసరం. అంతేకాకుండా విధుల నిర్వహణలో సమాజంలో ఏర్పడే ఉద్రిక్తతల తాకిడికి తట్టుకొనే విధంగా వ్యవస్థను రూపొందించడం ఒక భాగం. సమాజంలోని సభ్యుల, వర్గాల ప్రవర్తనారీతులు వంశానుగతంగా కొనసాగుతూ ఉంటాయి. ఈ విధమైన ప్రక్రియలో సామాజికరణ ప్రతినిధులు - కుటుంబం విద్యాసంస్థలు, మత సంస్థలు, వివిధ సాంఘిక సంస్థల పాత్ర ఉంటుంది. సమాజంలో అనుసరించబడుతూ ఉన్న విలువలు, కొనసాగే కృషి ఇతర మార్గాల ద్వారా ఉద్రిక్తతల నుంచి సభ్యులను కాపాడటానికి సాంఘిక వ్యవస్థ కృషి

చేస్తుంది.

(2) సానుకూలనం (Adaptation) : సాంఘిక వ్యవస్థలో భాగాలైన ఉప వ్యవస్థలు, వ్యక్తులు, వ్యక్తుల సముదాయాలనుంచి వచ్చే అనేక కోర్కెల వల్ల వ్యవస్థపై ఒత్తిడి ఏర్పడుతుంది. కోర్కెల సాధనకు వివిధ వర్గాలు, వ్యక్తులు, ఉపవ్యవస్థలు కృషి చేస్తాయి. కోరికలను సమకూర్చడంలో వ్యవస్థకు తగిన సామర్థ్యం ఉండాలి. సముచిత రీతిలో ఉత్పత్తి, పంపిణీ నియంత్రణ వంటి కర్తవ్యాల నిర్వహణ ద్వారా సాంఘిక వ్యవస్థ తను సాధించాల్సి ఉంటుంది.

(3) లక్ష్య సాధన (Goal Attainment) : నిర్దిత లక్ష్యాలసాధన సాంఘిక వ్యవస్థ మరో విధి. ప్రజాశ్రేయస్సు పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి, రాజకీయ, సాంఘిక భద్రత మొదలైన లక్ష్యాల సాధనకు సాంఘిక వ్యవస్థ ఉప వ్యవస్థ అయిన రాజకీయ వ్యవస్థ కృషి చేస్తుంది. ఈ లక్ష్యాల సాధనలో ఇతర ఉప వ్యవస్థల-ఉదాహరణకు, మత, విద్యాపరమైన, ఆర్థిక వ్యవస్థల సహకారం, సమిష్టికృషి అవసరమవుతాయి. భౌతిక, ఆర్థిక మానవ వనరుల సమీకరణ, వివిధ వ్యక్తులు, సంస్థలు, వర్గాలు నిర్వహించాల్సిన పాత్రలు నిర్ణయించడం మొదలైన కర్తవ్యాల నిర్వహణ ద్వారా లక్ష్యసాధనకు సాంఘిక వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ ద్వారా కృషి చేస్తుంది.

(4) సమగ్రత (Integration) : సమాజంలోని వివిధ వర్గాలు, వ్యక్తుల ప్రయోజనాల పరస్పర సంబంధాల గమనంలో సంఘర్షణలు తీవ్రమవుతాయి. దీని ఫలితంగా ఉద్రిక్తతలు ఏర్పడి సమగ్రతకు భంగం కలిగే ప్రమాదముంది. ఇట్లాంటి ప్రమాదం నుంచి వ్యవస్థను కాపాడటానికి సామరస్యపూర్వక, అనునయ పూర్వక, అధికార పూర్వక విధులను సముచిత నిర్మితుల ద్వారా వ్యవస్థ నిర్వహిస్తుంది. ఈ సందర్భంలో రాజకీయ వ్యవస్థ పాత్ర చెప్పుకోదగినదిగా ఉంటుంది. వివక్ష విధానం, ఆర్థిక ఇబ్బందులు, వర్గ వైషమ్యాలు, ప్రాంతీయతత్వాలు, భాషోన్మాదాలు మొదలైన పరిస్థితులు ఉద్రిక్తతలను పెంపొందించి సమగ్రతకు భంగకరంగా పరిణమిస్తాయి.

6.4 తులనాత్మక రాజకీయాలు - నిర్మితులు - విధుల విశ్లేషణ

రాజనీతి శాస్త్రంలో - ముఖ్యంగా తులనాత్మక రాజకీయాలలో - నిర్మితులు-విధుల విశ్లేషణను మొదటిసారిగా వినియోగించింది ఆల్మండ్ (Almond). ఇతడు కోల్మన్ (Coleman) తో కలిసి రచించిన "Politics of the Developing Areas" లోను, పావెల్ (Powell) తో కలిసి రచించిన "Comparative Politics: A Developmental Approach" అనే గ్రంథంలోను ఆల్మండ్ విశ్లేషణ విధానాన్ని వివరించాడు. రాజకీయ వ్యవస్థ అనే భావన ఆధారంగా కోల్, భావనలకు రూపకల్పన చేసి ఆల్మండ్ నిర్మితులు-విధుల విశ్లేషణను సూత్రీకరించాడు. ఆల్మండ్ విశ్లేషణలో మూడు దశలున్నాయి. అవి:

మొదటి దశ : 1956లో Journal of Politics, XVIII ప్రచురించిన "Comparative Political Systems" అనే వ్యాసంలో ఆల్మండ్ రాజకీయ వ్యవస్థను గురించి రాశాడు. రాజకీయ వ్యవస్థ అనే భావాన్ని ఆల్మండ్ ఈస్టన్ (Easton) నుంచి గ్రహించాడు. "System is an inclusive concept which covers all the patterned action relevant to the making of political dicisions" అని సిస్టమ్‌ను నిర్వచించాడు. అంటే రాజకీయ నిర్ణయాలు తీసుకోవడానికి సంబంధించి రూపుదిద్దుకొన్న చర్యలన్నింటినీ ఇముడ్చుకొనే భావనే వ్యవస్థ ఆల్మండ్. అభిప్రాయంలో వ్యవస్థలో పరస్పర సంబంధాలుంటాయి. సమాలోచనలు వ్యవస్థలోని వివిధ భాగాల మధ్య ఉంటాయి. ఈ సంబంధాలను ఒక పరిపూర్ణత ఉన్న వ్యవస్థలోని విభాగాలకు మధ్య ఉన్న సంబంధాలుగా గుర్తించాలి. ఈ సంబంధాలలో ఒక విధమైన స్థిరత్వాన్ని లేదా నిశ్చలత్వాన్ని గమనించవచ్చు. ఈ స్థిరత్వాన్నే (stability) ఆల్మండ్ మారుతుండే సమతౌల్యం (Changing Equilibrium) అంటాడు. అంటే వ్యవస్థ ఒడుదుడుకులను ఎదుర్కొవలసి వచ్చినా ఒక విధమైన సమతౌల్య సూత్రంపై ఆధారపడి ఉంటుందని ఇతడి భావం. ఇదే విధంగా ఈస్టన్ వ్యవస్థలకు దివ్యమైన అనుకూలనా శక్తి (Excellent Capacity to adapt) ఉందంటాడు. ఆల్మండ్ అభిప్రాయంలో వ్యవస్థలో జరుగుతుండే ప్రక్రియ (Process) కంటే వ్యవస్థ ఎక్కువ ప్రయోజనకరమైంది. ఒక క్రియాత్మక వ్యవస్థగా రాజకీయ వ్యవస్థను పరిగణించడంలో ఆల్మండ్‌పై మాక్స్‌వెబర్ (Max Weber), టాల్కాట్ పార్సన్స్ (Talcot Parsons) ల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. క్రియకు లేదా చర్యకు ప్రాధాన్యమివ్వడం వల్ల వ్యవస్థను కేవలం చట్టబద్ధమైన నిర్మాణంగా కాకుండా వాస్తవికతతో దాన్ని పరిశీలించడానికి వీలవుతుందని ఇతడు భావిస్తాడు. తన

విశ్లేషణలో రాజకీయ సంస్కృతి (Political Culture) అనే భావనను కూడా ఆల్మండ్ వినియోగించాడు.

రెండో దశ (Phase II) : 1960లో ప్రచురితమైన "Politics of the Developing Areas" అనే గ్రంథంలో కోల్‌మన్‌తో బాటుగా ఆల్మండ్ రాజకీయవ్యవస్థకు సంబంధించి కొన్ని అభిప్రాయాలతో నిర్మితులు - విధుల సిద్ధాంత వివరణకు ఉపక్రమించాడు. రాజకీయ వ్యవస్థలన్నింటికీ నాలుగు ప్రధాన లక్షణాలుంటాయని ఇతని అభిప్రాయం. అవి:

(1) అన్ని రాజకీయ వ్యవస్థలలోను రాజకీయ నిర్మితులుంటాయి. ఇవి మానవసంబంధాలు క్రమపద్ధతిలో కొనసాగేటందుకు తోడ్పడతాయి.

(2) అన్ని రాజకీయ వ్యవస్థలకు కొన్ని సర్వసాధారణ విధులుంటాయి.

(3) రాజకీయ నిర్మితులు బహుళార్థక విధులు నిర్వహిస్తాయి.

(4) సంస్కృతిపరంగా రాజకీయ వ్యవస్థలు మిశ్రమం అంటే ఆధునిక, సాంప్రదాయిక సంస్కృతుల మిశ్రమం. అంతేకాకుండా వీటికి, ఉపసంస్కృతులకు మిశ్రమం గోచరమవుతుంది.

పై లక్షణాల ఆధారంగా ఆల్మండ్ రాజకీయ వ్యవస్థల విధులను నిర్ణయించాడు. ఇవి స్థూలంగా (1) ఉత్పాదక లేదా రాజకీయ విధులు (input or political functions), (2) ఉత్పాదిత లేదా ప్రభుత్వ విధులు (Output governmental functions). ఈ రెండు రకాల విధుల నిర్వహణ రీతులను బట్టి రాజకీయ వ్యవస్థ శ్రేణిని నిర్ణయించవచ్చని ఆల్మండ్ అభిప్రాయం.

ఉత్పాదక విధులు (Inputs) : రాజకీయ వ్యవస్థ ఉత్పాదక విధులు నాలుగు. అవి

(1) రాజకీయ సామాజీకరణ, భర్తీ (Political Socialisation and Recruitment).

(2) ప్రయోజనాల వ్యక్తీకరణ (Interest Articulation)

(3) ప్రయోజనాల సమీకరణ (Interest Aggregation)

(4) రాజకీయ ప్రసారం (Political Communication)

రాజకీయ వ్యవస్థ ఉత్పాదిత విధులు (Output) 3. అవి :

1. నియమావళి కల్పన (Rule Making)
2. నియమావళి నిర్వహణ (Rule Application)
3. నియమావళి న్యాయనిర్ణయాలు (Rule Adjudication)

6.5 రాజకీయ సామాజీకరణ, భర్తీ

రాజకీయ వ్యవస్థలు తమ తమ సంస్కృతులు కొనసాగలని ఎప్పుడూ కాంక్షిస్తాయని ఆల్మండ్ అభిప్రాయం. అంతే కాకుండా నిర్మితులను కూడా కొనసాగించుకోవాలని కూడా తలుస్తాయి. అయితే సంస్కృతిలోనూ, నిర్మితులలోను అసలు మార్పులు రావనికాదు. సామాజీకరణ విధానంకూడా ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉంటుందనీ కాదు. ఈ రెండింటిలోను మార్పులు వస్తుంటాయి. అయితే ఈ మార్పు పరిమాణాలలో తేడాలుండవచ్చు. "Political socialisation is the process of induction into the political culture. Its end product is a set of attitudes, cognitions, value standards and feelings towards the political system, its various jobs and role incumbents. It also includes knowledge of values affection and feelings towards the inputs of demands and claims into the system and its authoritative outputs" అని ఆల్మండ్ రాజకీయసామాజీకరణను వివరిస్తాడు. రాజకీయసంస్కృతిని అలవరించే ప్రక్రియను రాజకీయ సామాజీకరణ అంటారు. అందువల్ల రాజకీయ వ్యవస్థలోని సభ్యులలో రాజకీయ వ్యవస్థ పట్ల, వ్యవస్థ వివిధ పాత్రల పట్ల, పాత్రధారులపట్ల కొన్ని అభిప్రాయాలు, గుర్తింపులు, విలువల స్థాయిలు, భావాలు ఏర్పడతాయి. వ్యవస్థ కర్తవ్యాలైన అధికార పూర్వక

ఉత్పాదితాల, ఉత్పాదకాలుగా పరగణించదగిన కోరికలు, అర్హతలను గురించిన పరిజ్ఞానం ఉత్పాదకాలను, ఉత్పాదితాలను ప్రభావితం చేసే విలువలు, భావాలు కూడా రాజకీయ సామాజికరణంలోకి వస్తాయి.

వివిధ రాజకీయ సంస్థలలోని రాజకీయ సామాజికరణ విధులను తులనాత్మకంగా పరిశీలించేటప్పుడు ఈ విధి నిర్వహించే నిర్మితులను, అవి అనుసరించే రీతులను లేదా వైఖరులను పరిగణనలోకి తీసుకోవాలి. కుటుంబం, మత సంస్థలు, విద్యా సంస్థలు, ఐచ్ఛిక సంస్థలు, ప్రసార సాధనాలు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వ సంస్థలు - ఇవన్నీ రాజకీయ సామాజికరణ విధానంలో పాత్ర వహిస్తాయి. ఈ విధిని అంతర్గతంగా (latent) గాని, స్పష్టంగా (manifest) నిర్వహిస్తూ ఉండవచ్చు. రాజకీయ వ్యవస్థకు చెందిన ఉత్పాదకాలు, ఉత్పాదితాలు రాజకీయ సంబంధమైన పాత్రల గురించిన భావాలు, విలువలు స్పష్టంగా లేదా ప్రత్యక్షంగా ప్రసారమైతే అది స్పష్ట (manifest) సామాజీకరణమవుతుంది. రాజకీయసంబంధమైన పాత్రల గురించిన భావాలు, విలువలు, మొదలైనవి పరోక్షంగా - అంటే ఇతర విషయాల పట్ల ఏర్పడిన భావాలు రాజకీయ భావాలపై ప్రభావం చూపగలవైతే అటువంటి సామాజీకరణను అంతర్గత సామాజీకరణ అంటారు. వ్యక్తి, బాల్యంలో సాధారణంగా అంతర్గత లేదా పరోక్ష సామాజీకరణ ప్రభావానికి లోనవుతాడని చెప్పవచ్చు. ఒక్కొక్క సారి సామాజీకరణ రెండు విధాలుగాను జరగవచ్చు. స్పష్ట సామాజీకరణ సాధారణంగా ఉద్యోగస్తులలోను, రాజకీయ పార్టీల ద్వారాను ఐచ్ఛిక సంస్థల ద్వారాను, ప్రభుత్వం ద్వారాను ప్రసార సాదనాల ద్వారాను జరుగుతుంది. ఇక సామాజీకరణ వైఖరులను లేదా రీతులను గమనించదలిస్తే ఇది వ్యక్తీకృతంగా (నిర్దిష్టంగా) (specific) గా కానీ, విస్తరణ విధంగా (diffuse) అయి ఉంటుంది. సాంప్రదాయక వ్యవస్థలలో విస్తరణ ధోరణిలోను, ఆధునిక వ్యవస్థలలో వ్యక్తీకృతపద్ధతిలోను సామాజీకరణ ఉంటుందని చెప్పవచ్చు. అంతేకాకుండా సామాజీకరణపై సర్వవ్యాపక (Universalistic), ప్రత్యేక (Particularistic) అంశాల (elements) ప్రభావం ఉంటుంది. ఆధునిక పాశ్చాత్య దేశాలలో ఈ రెండు అంశాలు ప్రభావం సామాజీకరణపై ఉంటుందని, సామాజీకరణ విధానంలో పాత్ర వహించే సాధకాంశాలు (instrumental elements), ప్రభావితాంశాలు (affective elements) ఏ విదంగా మిళితమయ్యాయి అన్న దానిని బట్టి కూడా విధాన స్వరూపాన్ని నిర్ణయించవచ్చని ఆల్మండ్ అంటాడు.

రాజకీయ సామాజీకరణ స్వరూపస్వభావాలను పరిశీలించడం ద్వారా రాజకీయ సంస్కృతి, ఉపసంస్కృతుల వైఖరులను తెలుసుకోవచ్చు. అంతేకాకుండా వ్యక్తి, సంస్థల, వర్గాల మనుగడలో ఏ సమయంలో ఎటువంటి అభిప్రాయాలు విలువలు, భావాలు ఏర్పడ్డాయన్నది కూడా గ్రహించవచ్చు. రాజకీయసంస్కృతి, రాజకీయసామాజీకరణల అవగాహన రాజకీయ వ్యవస్థ యొక్క ఇతర కర్తవ్యాల సమగ్ర అవగాహనకు కూడా తోడ్పడుతుంది. రాజకీయ వ్యవస్థలోని సభ్యుల, వర్గాల, సంఘాల ప్రవర్తనా రీతులపై ప్రభావాలను కూడా సులభంగా గ్రహించవచ్చు.

సాధారణ రాజకీయ సామాజీకరణ విధి ఎప్పుడైతే పూర్తి అవుతుందో రాజకీయ భర్తీ మొదలవుతుంది. అంటే రాజకీయ సంబంధమైనపాత్రలలో ప్రవేశం ప్రారంభమవుతుందన్న మాట. మత, జాతి, ఆర్థిక తదితర వర్గాల నుంచి సభ్యులను రాజకీయ పాత్రలలో ప్రవేశించటానికి దోహదం చేసే విధానాన్ని రాజకీయభర్తి అంటారు. ఈ విధానంలో రాజకీయ పాత్రల నిర్వహణకు అవసరమయ్యే శక్తియుక్తులు, నైపుణ్యం, తర్ఫీదు, విలువలు, ఆశయాలు మొదలైనవని పాత్రధారులకు అలవడుతాయి. రాజకీయ సామాజీకరణ పరిశీలనలో మాదిరిగానే రాజకీయ భర్తీ విషయంలో నిబంధిత నిర్మితులు, వాటి వైఖరులను పరిశీలించవలసి ఉంటుంది. అంటే కుటుంబం, రక్తసంబంధం, వంశం, వర్ణం, కులం, స్థానిక సంబంధాలు మొదలైనవాటి ప్రభావాన్ని గురించి, ప్రత్యేక పాత్రలో భర్తీ కావడానికి తోడ్పడే రాజకీయపార్టీలు, ఎన్నిక విధానం, పాలక వర్గం, మొదలైన వాటి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రాజకీయ భర్తీని సాధారణ సామాజీకరణ విధానంగా కాకుండా ప్రత్యేక రాజకీయ సామాజీకరణగా పరిగణించాలని ఆల్మండ్ అభిప్రాయపడ్డాడు.

6.6 ప్రయోజనాల వ్యక్తీకరణ

ప్రతి రాజకీయ వ్యవస్థలోను అందరి సభ్యుల కోర్కెలను ప్రసారం చేసేందుకు ఒక విధానం/విధానాలు ఉంటాయి. ప్రయెజనాల వ్యక్తీకరణకు రాజకీయసామాజీకరణకు తద్వారా ఏర్పడిన రాజకీయ సంస్కృతికి సన్నిహిత

సంబంధం ఉంటుంది. ఉత్పాదక విధులలో ఒకటయిన ప్రయోజనాల వ్యక్తీకరణ ఏది ప్రత్యేకత ఏమంటే ఇది సాంఘిక వ్యవస్థ నుంచి రాజకీయ వ్యవస్థను ప్రత్యేక పరిచే సరిహద్దులో ఇది ఉంటుంది. అంటే సమాజంలోని వివిధ వ్యక్తులకు, వర్గాలకు వివిధ కోర్కెలుంటాయి. విధాన నిర్ణేతలకు వీరు తమ కోర్కెలను తెలుపుతారు. సమాజంలోని వ్యక్తులు, వర్గాలు రాజకీయ నిర్ణయాలు చేసే వారికి తమ కోర్కెలను తెలిపే విధానాన్నే ప్రయోజనాల వ్యక్తీకరణ అంటారు. ప్రయోజనాల వ్యక్తీకరణ జరిపే నిర్మితులు, అవి అనుసరించే పద్ధతులు సమాజానికి, రాజకీయ వ్యవస్థకు మధ్య ఉన్న సరిహద్దు స్వభావాన్ని నిర్ణయిస్తాయి.

ప్రయోజనాల వ్యక్తీకరణ విధి స్వభావాన్ని వివరించే ముందు వివిధ రాజకీయ వ్యవస్థలలో ఈ విధి నిర్వహణ కొనసాగే రీతులను నిర్ణయించే ముందు ప్రయోజనాల వ్యక్తీకరణ జరిపే నిర్మితులను గురించి తెలుసుకోవాలి. కోపోద్రిక్తమైన ఒక జన సమూహం ప్రయోజన వ్యక్తీకరణ నిర్మితిగా వ్యవహరించవచ్చు. కనీస వేతనాలు నిర్ణయించాలని కోరుతూ ఒక కార్మిక సంఘం ప్రకటన వెలువరించవచ్చు. ఆయుధాల సమీకరణ దేశ భద్రతకు ప్రమాదం కల్పించవచ్చని ఒక సైనికాధికారి ప్రభుత్వానికి తెలుపవచ్చు.

సమాజంలోని వ్యక్తులకు, వర్గాలకు ప్రయోజనాల వ్యక్తీకరణకు సరిఅయిన అవకాశాలున్నంత కాలం కోర్కెల వ్యక్తీకరణ శాంతియుతంగా జరుగుతుంది. వ్యక్తీకరణ అవకాశాలు లేనప్పుడు ప్రజలలో అసంతృప్తి పెరిగి హింసాత్మక చర్యలు అనుసరించే అవకాశముంటుంది. దీని ఫలితంగా అణచివేత చర్యలు పొడసూపవచ్చు.

ప్రయోజనాల వ్యక్తీకరణను అధ్యయనం చేయడంలో వ్యక్తీకరణ జరిపే నిర్మితులు వ్యక్తీకరణ చేసే నిర్మితుల ప్రత్యేకీకరణ స్థాయి (degree of specialisation) వ్యక్తీకరణ రీతులను తెలుసుకోవాలి. క్రమశిక్షణ ఎంత మాత్రం లేని జనసముదాయం మొదలుకొని,సుసంఘటితమైన సమావేశాలు, లేదా సంఘాల వరకూ ఎవరైనా ప్రయోజనాల వ్యక్తీకరణలో పాల్గొనవచ్చు. ప్రయోజనాల వ్యక్తీకరణ విధి నిర్వహించే ప్రత్యేక నిర్మితులు, ప్రభావవర్గాలు ప్రయోజనవ్యక్తీకరణ జరిపే వర్గాలను లేదా గుంపులను ఆల్మండ్ నాలుగు తరగతులుగా విభజించాడు అవి:

(1) సంస్థాగతమైన ప్రయోజనవర్గాలు (Institutional interest groups)

(2) సంఘీకృతమైన ప్రయోజనవర్గాలు (Associational interest groups)

(3) అసంస్థాగతమైన ప్రయోజనవర్గాలు (Non-associational interest groups)

(4) హఠాత్తుగా ఏర్పడే ప్రయోజనాల వర్గాలు (Anomic interest groups)

సంస్థాగతమైన ప్రయోజన వర్గలకు రాజకీయపార్టీలు, శాసనసభలు, సైన్యం, ఉద్యోగిబృందం మత సంస్థలు వంటి వాటిలో చూడవచ్చు. ఇటువంటి వర్గాలను సంస్థలలో ఉండే కొన్ని ప్రయోజనాల పరిరక్షణకు, ఉద్యోగిబృందంలో ప్రభుత్వ శాఖను ఒక ప్రత్యేక గుంపుగా భావించవచ్చు. మహిళల సంక్షేమాన్ని కాపాడటానికి శాసనసభలో ఏర్పడిన మహిళా సభ్యుల సమూహం ఇటువంటి ప్రయోజనాల పరిరక్షణకు వీరిలో అసక్తి కలిగిన శాసనసభాసభ్యుల సమూహం ఇంకొక ఉదాహరణ. ఇటువంటి సమూహాలు తమ ప్రయోజనాలను గాని, ఇతరుల ప్రయోజనాలను గాని వ్యక్తీకరించడానికి పూనుకోవచ్చు. వ్యవస్థీకరణ ఉంటుంది కనక సంస్థాగతమైన ప్రయోజనవర్గాలకు సమాజంలో ప్రత్యేక స్థానం, అధికారాలు ఉంటాయి. వెనకబడిన వ్యవస్థలలో సైనికాధికారుల ముఠాలు (Chiques) ప్రభుత్వోద్యోగుల సమూహాలు రాజకీయపార్టీల నాయకులు ఈ కర్తవ్యనిర్వహణలో చెప్పుకోదగ్గ పాత్ర వహిస్తారని ఆల్మండ్ అభిప్రాయం. ఆమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశంలో కూడా ఎన్ని సంఘీకృత ప్రయోజనవర్గాలున్నప్పటికీ రక్షణ, పరిశ్రమల రంగాలలో సంస్థాగతమైన వర్గాల పాత్రను తక్కువగా అంచనా వేయరాదని కూడా ఇతడు అంటాడు.

ప్రయోజనాల వర్గీకరణకు వ్యక్తీకరణ విధిని నైపుణ్యంతో నిర్వహించే నిర్మితులు సంఘీకృత ప్రయోజనవర్గాలు, కార్మిక సంఘాలు, శ్రామికుల, వ్యాపారవేత్తల సంఘాలు, జాతిపరంగా ఏర్పడిన సంఘాలు, పౌరసంఘాలు (civic associations) ఇటువంటి వాటికి ఉదాహరణలు. ప్రయోజనాల వ్యక్తీకరణలో స్పష్టత, పూర్తికాలం పనిచేసే ఉద్యోగులు, ప్రయోజనాలను నిర్వహించడానికి క్రమబద్ధమైన విధానం వారికి ఉండటం, స్పష్టతతో కూడిన కోర్కెల వ్యక్తీకరణ ఈ సంఘాల ముఖ్య లక్షణాలు. ఇవి అనుసరించే మార్గాలు, వీటి లక్ష్యాలు సాధారణంగా చట్టబద్ధమైనవిగా గుర్తింపు పొందుతాయి.

Dr. BRAOU Acc. No: CM-0138
LIBRARY 75 Class No: 320

రక్తసంబంధవర్గాలు, వంశక్రమం ఆధారంగా ఏర్పడిన వర్గాలు, ప్రాంతీయ వర్గాలు, ఆర్థిక స్థితి ప్రాతిపదికగా ఏర్పడిన వర్గాలు, అసంఘీకృత ప్రయోజనవర్గాలకు ఉదాహరణలు. ఇవి సాధారణంగా వ్యక్తులు, కుటుంబయజమాని, మతాధిపతి వంటి వారి ద్వారా ప్రయోజనాలను వక్రీకరించటం జరుగుతుంది. విద్యాసంస్థలలో బోధన భాష విషయమై ఒక భాషాపరమైన సమూహం ఒక ప్రతినిధి వర్గం ద్వారా ఫిర్యాదు చేయడాన్ని ఈ సందర్భంలో ఉదాహరణగా తీసుకోవచ్చు. తమ ఇబ్బందులను తెలుపుతూ ఏదైన సాంఘిక సమావేశంలో భూస్వాములు ప్రభుత్వోద్యోగికి విన్నపం చేయడం మరో ఉదాహరణ. ఇటువంటి వర్గాలకు ప్రత్యేక వ్యవస్థీకరణ లేకపోవడం, అప్పుడప్పుడు ప్రయోజనాల వ్యక్తీకరణ జరపడం ముఖ్య లక్షణాలు.

ఇక హఠాత్తుగా ఆవిర్భవించే ప్రయోజనవర్గాలకు వస్తే సమాజంనుండి రాజకీయ వ్యవస్థలోకి ఆకస్మికంగా చొచ్చుకొని వచ్చిన వర్గాలుగా వీటిని పరిగణించాలి. (spontaneous penetration into the political system from the society) దొమ్మీలు, ప్రదర్శనలు, ఖూనీలు దీనికి ఉదాహరణలు. రాజకీయ వ్యవస్థలో వ్యవస్థీకృతవర్గాలు లేనప్పుడు, ఉన్నప్పటికీ కొన్ని వర్గాల ప్రయోజనాలు వ్యక్తీకరణ జరగడంలో ఇవి విఫలమయినప్పుడు, అసంతృప్తి, వ్యధపెరిగి ఆకస్మిక, ఉద్దేశపూర్వక చర్యలకు వ్యక్తులు పూనుకోవచ్చు. వీరి చర్యలు ఊహించిన రీతిలో, నియంత్రణకు కష్టసాధ్యమైనవిగా రూపొందవచ్చు. అభివృద్ధి చెందిన దేశాలలోను, వర్ధమాన దేశాలలోను కూడా ఇటువంటి సంఘటనలు జరగడం మనం చూస్తున్నాము.

ప్రయోజనాల వ్యక్తీకరణ సమర్థవంతంగా జరగడం కొన్ని ముఖ్యవిషయాలపై ఆధారపడి ఉంటుంది. తగిన పద్ధతులను సమకూర్చుకునే శక్తియుక్తులు, సంఖ్యాపరమైన బలం, ఆర్థిక స్తోమత గల వర్గాలు, వ్యవస్థీకృతం కాని, మద్దతు లభించని వర్గాలకంటే సమర్థతతో వ్యవహరించగలవు. ఈ వర్గాల కర్తవ్య నిర్వహణ అవి అనుభవించే స్వతంత్ర ప్రతిపత్తిపై ఆధారపడి ఉంటుంది.

ఇది ప్రయోజనాల వ్యక్తీకరణ మార్గాలు, సాధనాలకు వస్తే ఇవి వివిధ రకాలుగా ఉంటాయి. తమ కోర్కెలు సమంజసమైనవని, వాటికి సుముఖంగా వ్యవహరించాలని విధాన నిర్ణేతలను ఒప్పించడానికి ప్రయోజనవర్గాలు ప్రయత్నిస్తాయి. ప్రదర్శనలు నిర్వహించడం, హింసాత్మక చర్యలకు పూనుకోవడం సాధారణంగా ఆకస్మికంగా ఏర్పడిన ప్రయోజనవర్గాలు అనుసరించే మార్గాలు. వ్యక్తిగత, సంబంధాల ద్వారా అంటే కుటుంబం, విద్యాసంస్థలు, స్థానిక, సంబంధాల ద్వారా ప్రయోజనాల వ్యక్తీకరణ జరపడం చూడవచ్చు. ముఖ్యంగా అసంఘీకృతవర్గాలు ఈ మార్గాన్ని అనుసరిస్తాయి. ప్రయోజనవర్గాల తరపున మేధావులు ప్రతినిధులుగా వ్యవహరించడం మరొక పద్ధతి. అంటే ప్రయోజనవర్గం తరపున ప్రతినిధిగా వ్యవహరించే మేధావి విధాన నిర్ణయ నిర్మితిలో సభ్యత్వం కలిగి ఉండవచ్చు. సభ్యత్వం లేనప్పటికీ ప్రయోజనాల వ్యక్తీకరణ చేయవచ్చు. దీని వల్ల ప్రయోజనవర్గానికి, విధాన నిర్ణయ నిర్మితికి దగ్గర సంబంధం ఏర్పడుతుంది. ఇక ప్రసార సాధనాలుగా కూడా వ్యక్తీకరణ విధినిర్వహణ విషయంలో సముచిత పాత్ర వహిస్తాయి. అయితే నియంత్రణల వలయంలో పని చేసే ప్రసార సాధనాలు ఆశించిన లక్ష్యాలు చేరలేవు. అప్పుడు ప్రత్యేక ప్రయోజనాల పరిరక్షకులుగా మాత్రం ఇవి వ్యవహరించగలుగుతాయి. ప్రసార సాధనాలే గాకుండా రాజకీయపార్టీల పాత్ర నిర్వహణ ప్రయోజనాల వ్యక్తీకరణలో గణనీయంగా ఉంటుంది. వీటితో బాటు శాసనసభలు, పాలకవర్గం, ఉద్యోగిబృందం వ్యక్తీకరణ మార్గంలో తమ తమ పాత్రలు నిర్వహిస్తాయి.

ప్రయోజనాల వ్యక్తీకరణ వైఖరి స్పష్టంగా కానీ అంతర్గతంగా కానీ ఉండవచ్చు. వ్యక్తీకృతంగా కానీ, సాధారణంగా కానీ ఉండవచ్చు. ఉదాహరణకు, ధనికులపై పన్ను అధికంగా ఉండాలని, స్థిరాస్థులను విభజించి పంచాలన్న వ్యక్తీకరణ సాధారణ వ్యక్తీకరణ అవుతుంది. అలా కాకుండా ప్రత్యేక శాసనం రూపొందాలన్న కోరిక, కనీస వేతనాలు ఏర్పరచాలన్న కోరిక స్పష్టంగా ప్రకటితమైన కోర్కెలకు ఉదాహరణలు.

ప్రయోజనాల వ్యక్తీకరణ ఫలితాలు కూడా రాజకీయ వ్యవస్థ స్వరూపాన్ని సూచిస్తాయి. ప్రయోజనాల వ్యక్తీకరణ జరిపే నిర్మితులు ఎంతవరకూ విధాన నిర్ణేతలను ప్రభావితం చేయగలవనే విషయం కూడా ఫలితాల స్వరూపాన్ని నిర్ణయిస్తుంది. ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే వ్యక్తీకరణ జరిగినంత మాత్రాన కోర్కెల సాధన జరగనక్కరలేదు. చాలా కాలం అమెరికాలోని నల్ల జాతివారు తగిన రాజనీతి పరిజ్ఞానం, రాజకీయ చైతన్యం, సమర్థవంతమైన సాధనాలు లేకపోవడం కారణంగా తమ కోర్కెలను సాధించుకోలేక పోయారని పోవెల్, ఆల్మండ్‌లు అంటారు. రెండో ప్రపంచయుద్ధం తరువాతి కాలంలో ఈ వర్గాలు సమర్థవంతంగా ప్రయోజనాల వర్గీకరణ

చేయగలిగాయి. వీరి అవసరాలు తీర్చాల్సిన ప్రాధాన్యాన్ని విధాన నిర్ణేతలు గ్రహించారు. కొన్ని సందర్భాలలో రాజకీయ ప్రయోజనవర్గాలుగా ఏర్పడే అవకాశం కూడా ప్రయోజనాలు సాధించుకోదలిచిన ప్రజలకు లభించదు. ఉదాహరణకు, దక్షిణాఫ్రికాలో బాంటు (Bantu) అనబడే ప్రజాసముదాయానికి చాలా కాలం అమెరికాలో నీగ్రోలకు ఇటువంటి అవకాశం లభించలేదు. ప్రయోజన వర్గం మొక్క సామర్థ్యం అది అనుసరించే సరళిపై కూడా ఆధారపడి ఉంటుంది. స్పష్టంగా ప్రయోజనాల వ్యక్తీకరణ జరిగిన సందర్భాలలో ప్రయోజనవర్గానికి తగిన మద్దతు ముఖ్యంగా మేధావుల మద్దతు - లభించే అవకాశం ఎక్కువ. అలా కాకుండా సాధారణ వ్యక్తీకరణ జరిగితే ప్రయోజక వర్గం కోరికలను ప్రభుత్వ విధానంలో మిళితం చేయడానికి కష్టం కావచ్చు. ఆకస్మికంగా ఏర్పడి అస్పష్టమైన వ్యక్తీకరణ జరిపే ప్రయోజకవర్గాల కోర్కెలను ఏ విధంగా పరిష్కరించాలన్న విషయంలో విధాన నిర్ణేతకు సందిగ్ధత ఏర్పడే అవకాశముంది. దృఢమైన సిద్ధాంత దృక్కోణం (rigid idealogical perspective) విస్పష్టమైన కోర్కెలు (lightly particularistic demands) ఉద్రేకపూరితమైన కోర్కెల ప్రకటన ఉంటే విధాన నిర్ణయంలో వీటికి తగిన స్థానం సమకూర్చడానికి ప్రతిబంధకం ఏర్పడవచ్చు. అలా కాకుండా ఆచరణాత్మక దృక్పథంతో వ్యక్తీకరించిన కోర్కెలంటే వాటిని సమకూర్చడంలో ప్రతిబంధకాలు ఉంటాయి. ప్రయోజనాల వ్యక్తీకరణకు ఆయా వర్గాలు సంప్రదించాల్సిన నిర్మితిపై కూడా ప్రయోజనాల సాధన ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, ఒకే రాజకీయపార్టి ఆధిక్యం పొంది ఉండే రాజకీయ వ్యవస్థలలో అన్ని ప్రయోజన వర్గాలు సముచిత స్థాయిలో తమ కోర్కెల వ్యక్తీకరణ అవకాశం పొందలేవు. ఇట్లాంటి పరిస్థితిలో కొన్ని ప్రయోజకవర్గాలు మాత్రమే విదాన నిర్ణేతలపై ఒత్తిడి తేగలవు. అట్లా కాక ఒకటి కంటె ఎక్కువ రాజకీయ పార్టీల ప్రాబల్యం ఉన్నప్పుడు ఎక్కువ ప్రయోజకవర్గాల కోర్కెల సాధనకు అవకాశముంది. వైవిధ్యం ఉన్న రాజకీయసంస్కృతి (fragmented political culture), అసమాన వనరుల పంపిణీ ఉన్న రాజకీయ వ్యవస్థలలో ప్రయోజకవర్గాల నిరంతర వ్యక్తీకరణ, వారి మధ్య ఏర్పడే సంఘర్షణలు రాజకీయ వ్యవస్థ యొక్క స్థిరత్వానికి స్పందనా సామార్థ్యానికి (response capacity) ప్రతిబంధకాలుగా పరిణమిస్తాయి.

ప్రయోజనాల వ్యక్తీకరణ ప్రసార సాధనాల స్వరూపంపై కూడా ఆధారపడి ఉంటుంది. ఆధునిక కాలంలో రేడియో,టెలివిజన్, వార్తాపత్రికలు మొదలైన ప్రసార సాధనాలు విరివిగా ఉపయోగించబడుతున్నాయి. ఇవి కాక ప్రభావవర్గాలు (influential groups) ఉదాహరణకు, దేశనాయకులతో కూడిన వర్గాలు, రాజకీయ పలుకుబడి గలవ్యక్తుల సముదాయాలు, బలమైన ప్రయోజన సాధనాలుగా పని చేస్తాయి. వ్యవస్తలోని వ్యక్తుల రాజకీయ సంస్కృతి, విద్యాస్థాయి, రాజకీయాలలో పాల్గొనడం పట్ల వ్యవస్థ సభ్యుల వైఖరి - ఇవన్నీ ప్రయోజనాల వ్యక్తీకరణ విధిపై ప్రభావం చూపిస్తాయి. ఇవి ఎక్కువగా ఉన్న కొద్దీ వ్యక్తీకరణ విధి సామర్థ్యం పెరుగుతుందని ఆల్మండ్, పావెల్‌ల అభిప్రాయం. ఇవి కాక వ్యవస్థలో లభ్యమయ్యే వనరుల పంపిణీ కూడా ప్రయోజకవర్గాల కార్యకలాపాలపై ప్రభావం చూపిస్తుంది. ఎందుకంటే ఈ కర్తవ్యం ఒకనాటిది కాదు నిరంతరం కొనసాగుతుండే చర్య. అందువల్ల ఈకర్తవ్య నిర్వహణ కూడా ఖర్చుతో కూడినది. సమాచార సేకరణ, ఉద్యోగుల నిర్వహణ లాబీ నిర్వహణ మొదలైన కర్తవ్యాలను నిర్వహించడానికి ధనమవసరం. అందువల్ల ఆర్థిక స్తోమత లేని ప్రయోజకవర్గాలు సమర్థవంతంగా వ్యక్తీకరణ విధి నిర్వహించలేదు. ధనంతో బాటు తగినంతమంది మద్దతుదారులు కూడా ప్రయోజకవర్గాలకు అవసరం.

పై విషయాలను బట్టి ప్రసార సాధనాలు, రాజకీయ సంస్కృతి, వనరులు తదితర విషయాలు ప్రయోజనాల వ్యక్తీకరణ స్వరూపాన్ని, స్థాయిని నిర్ణయిస్తాయని తెలుస్తుంది. ఇవన్నీ పరస్పర ప్రభావితాలు వ్యవస్థలో వచ్చే ఆర్థిక, సాంఘిక మార్పులకు ప్రయోజనాల వ్యక్తీకరణ మార్పులకు కూడా సంబంధం ఉంటుంది.

6.7 ప్రయోజనాలసమీకరణ

రాజకీయ వ్యవస్థలోని వివిధ ప్రయోజనాలను సమన్వయపరిచి, జోడించి, సాధారణ విధానాలను రూపొందించే మార్గమే ప్రయోజనాల సమీకరణ. ఉదాహరణకు, ఒక రాజకీయపార్టీ, పార్టీ సమావేశంలో కార్మిక సంఘాల నుంచి, వ్యాపారస్థుల సంఘాల నుంచి తదితర వర్గాల నుంచి వివిధ కోర్కెలను సేకరిస్తుంది. వీటి విషయంలో రాజకీయ బేరసార వైఖరులతో ఒక సాధారణ విధాన ప్రకటన చేయడంతో శాసనసభా సంఘం ప్రజాసంఘాల అభ్యర్థనలను,

సంబంధిత ఉద్యోగుల అభిప్రాయాలను విని తగిన నిర్ణయాలు చేస్తుంది.

రాజకీయ వ్యవస్థలో ప్రయోజనాల సమీకరణ విధి వివిధ ప్రదేశాలలో జరగవచ్చు. ఇలా జరగడంలో సాధారణ విధాన నిర్ణయంగాని, ఒక ప్రత్యేక వైఖరితో గూడిన నిర్ణయంగాని రూపొందవచ్చు. వ్యవస్థలోని సంఘీకృత ప్రయోజకవర్గాలు (Associated interest groups) తమకు సంబంధించిన ఉపవర్గాల (sub-groups) కోర్కెలను ఎప్పటికప్పుడు సమీకృతం చేస్తూ ఉంటాయి. ఒక వ్యక్తి తన కోర్కెలను వ్యక్తీకరించేముందు ఇతరుల కోర్కెలు, పరిశీలనాంశాలు దృష్టిలో పెట్టుకోవచ్చు. ఇక్కడ గ్రహించాల్సిన విషయమేటంటే అధికారయుత నియమావళి రూపకల్పన విధానానికి (authoritative rule making) ప్రయోజనాల సమీకరణకు భేదం ఉంది. అంతేకాకుండా ప్రయోజనాల సమీకరణ ప్రధాన విధానాల వైకల్పికాలతో (major policy alternatives) కూడినది.

ప్రయోజనాల వ్యక్తీకరణవిధి అన్ని రాజకీయ వ్యవస్థలలోనూ నిర్వహించడం జరుగుతుంది. అయితే కొన్ని వ్యవస్థలలో ఈ విధి నిర్వహణ ప్రత్యేక నిర్మితుల ద్వారా జరుగుతుంది. ఆది వాసుల సమాజంలో వారి నాయకుడు అందులోని సభ్యులు తమ తమ నివాసాలలో వ్యక్తంచేసే అసంతృప్తిని లేదా కోర్కెలను తెలుసుకొని తనకు తోచిన రీతిలో విధాన నిర్ణయ ప్రత్యామ్నాయాలను ఆలోచించి ఒక విధాన నిర్ణయం చేస్తాడు. ఈ నిర్ణయం శాసనంగా అమలుజరుగుతుంది. అంటే ఈ సందర్భంలో ప్రయోజనాల సమీకరణ విధిని ఆదివాసి సమాజ నాయకుడు నిర్వహించాడన్న మాట. అలాగే ఒక సంపూర్ణాధికారయుత పార్టీ (totalitarian party) ప్రయోజనాల వ్యక్తీకరణ, ప్రయోజనాల సమీకరణ విధులను కూడా చేపట్టవచ్చు. తరవాత విధాననిర్ణయం చేయవచ్చు. ఇక ఆధునిక ప్రజాస్వామ్యాలలో సంఘీకృత ప్రయోజకవర్గాలు ప్రయోజనాల వ్యక్తీకరణ విధిలోను, రాజకీయపార్టీలు రాజకీయ భర్తీ, విధాన నిర్ణయం ద్వారా ప్రయోజనాల సమీకరణలోను, మంత్రి మండలి, శాసననిర్మాణశాఖ నియమావళి రూపకల్పనలోను ప్రత్యేకీకరణ జరపవచ్చు. రాజకీయ ప్రయోజనాల సమీకరణ ఏ విధంగా ఎవరు జరిపారన్న విషయాలలో వైవిధ్యం ఉన్న ఈ విధి అన్ని వ్యవస్థలలోను నిర్వహించడం జరుగుతుంది.

6.8 ప్రయోజనాల వ్యక్తీకరణ : రాజకీయ నిర్మితులు

ప్రయోజనాల వ్యక్తీకరణ, సమీకరణ విధులు అన్ని రాజకీయ వ్యవస్థలలోను నిర్వహించడం జరుగుతుందని తెలుసుకొన్నాం. అయితే ప్రయోజనాల సమీకరణలో ప్రధానపాత్ర వహించే నిర్మితులేమిటన్నది గ్రహించడం ఎంతైనా అవసరం. ప్రయోజనాల సమీకరణ జరిపే నిర్మితి, సమీకరణ ఫలితం ప్రయోజనాల స్వరూపంపై కొంత వరకు ఆధారపడి ఉంటుంది. ఆచారాలకు బద్ధులుగా ఉండే ప్రజలున్న సంప్రదాయ వ్యవస్థలలోను ప్రయోజనాల వ్యక్తీకరణపై కేంద్రీకృత నియంత్రణ కలిగిన అధికారయుత వ్యవస్థలోను ఈ విధి కొంత మంది మేధావుల ద్వారా మాత్రం జరపబడుతుంది. కానీ విస్తృతమైన వివృతమైన (Open) వ్యవస్థలలో ఈ విధిని ప్రత్యేకీకరణ కలిగిన నిర్మితులు నిర్వహిస్తాయి. వ్యవస్థ మనుగడకు, స్థిరత్వానికి ఈ విధంగా జరగడం అవసరం కూడా. ఇక ఈ కర్తవ్య నిర్వహణలో పాల్గొనే నిర్మితుల వివరాలను తెలుసుకొందాం.

సంప్రదాయ రాచరికంలో రాజుకు ముఖ్య అనుచరుడు, సలహాదారు అయిన మంత్రి ప్రజల సాధకబాధకాలను తెలుకొని వాటిలో కొన్నింటిని విధాన ప్రతిపాదనలుగా రూపొందించవచ్చు. ఇక్కడ ప్రయోజనాల సమీకరణ జరిగినదన్నమాట. ఆధునిక వ్యవస్థల పారిశ్రామిక సంఘాలు, కార్మిక సంఘాలు వివిధ ప్రయోజనాలను సమీకరించి విధాన ప్రత్యామ్నాయాలు రూపొందించి మంత్రి వర్గానికి, రాజకీయ పార్టీ అధినేతలకు సమర్పించవచ్చు. దీనిని మంత్రివర్గం, అధికారపార్టీ తదితర పార్టీలు పరిశీలించి తగిన నిర్ణయాలు చేస్తాయి. ఈ పరిశీలన గమనంలో విధాన నిర్ణయ విధిలో ప్రమేయమున్న నిర్మితులు కూడా కొంత సమీకరణ జరుపుతాయి. తద్వారా ఏర్పడేదే శాసనం, బాగా అభివృద్ధి చెందన రాజకీయ వ్యవస్థలలో ప్రత్యేక నిర్మితులు ఈ కర్తవ్యాన్ని నిర్వహిస్తాయి. ఇవి రాజకీయపార్టీలు, ఉద్యోగిబృందం. ఈ వ్యవస్థలో అంతర్భాగాలుగా ఉన్న ప్రయోజకవర్గాలకు, విధాన నిర్ణేతలకూ ప్రత్యేక సంధానకర్తలుగా ఈ రెండూ వ్యవహరిస్తాయి. ప్రయోజనాల వ్యక్తీకరణ వాటి విధాన నిర్ణేతలకు తెలియజేయడం. అంతేకాకుండా ప్రయోజనాల సమీకరణలో వీటికి సామర్థ్యముంటుంది. సిద్ధాంతపరంగా విధాన నిర్ణేత అధీనంలో ఉంటూ నియమాలను అమలుపరచడానికి ఉద్దేశించి నియమించిన ఉద్యోగుల సముదాయాన్ని ఉద్యోగిబృందం అంటారు.

ఆధునిక కాలంలో రాజకీయ పార్టీలు ప్రయోజన సమీకరణ యంత్రాంగాలుగా ప్రత్యేకీకరణ స్వరూపం పొందుతాయి. ఈకర్తవ్య నిర్వహణ పార్టీ వ్యవస్థ స్వరూపంపై ఆదారపడిఉంటుంది. ప్రధానంగా రెండుపార్టీలున్న వ్యవస్థలో రెండు పార్టీలు కూడా తమ పాలసీ ప్యాకేజీలో - ఇంకోవిధంగా చెప్పాలంటే తమ సమీకృత విధానంలో వివిధ వర్గాల ప్రయోజనాలను జాగ్రత్తలో సమీకృతం చేయాల్సిన అవసరాన్ని ఎక్కువగా గుర్తిస్తాయి. వ్యవస్థలో బాగా ప్రాబల్యంతో వ్యవహరించే ప్రభావవర్గాల అవసరాలను ఇవి విస్మరించలేవు. ఇక ఏకపార్టీ వ్యవస్తలలో కూడా (single party system) ప్రయోజనాల సమీకరణలో రాజకీయపార్టీ మధ్యవర్తి, ధోరణిలో వ్యవహరించాల్సి ఉంటుంది. అనేక పార్టీ వ్యవస్థలలో విధాన నిర్ణేతలు వివిధ ప్రయోజనాలు సమీకరణ ప్రత్యామ్నాయాలను పరిశీలించడంలో మరీ జాగ్రత్త వహించాలి.

ప్రయోజనాల సమీకరణ ప్రత్యేక నిర్మితుల ద్వారా జరగడం వల్ల వ్యవస్థ యొక్క సామర్థ్యం, స్పందనాశక్తి, కూడా అధికమయ్యే అవకాశముంది. సమీకరణ లేకుండా వివిధ వర్గాల నుంచి కోరికలు ఉత్పన్నమవుతూ వచ్చినప్పుడు, ఒత్తిడి అధికమయినప్పుడు విధాన నిర్ణయానికి అంతరాయమేర్పడే అవకాశం కూడా ఉంది. సమీకరణ విధి నిర్వహించే నిర్మితులుంటే విధాననిర్ణేతలపై ఒత్తిడి తగ్గడమే కాకుండా అనువైన మార్పులు చేర్పులు చేసి ప్రయోజనాత్మక నిర్ణయాలు తీసుకోవడానికి వీలు కలుగుతుంది.

6.9 ప్రయోజనాల సమీకరణ పద్ధతులు (Styles of Interest Aggression)

ఆల్మండ్ అభిప్రాయంలో ప్రయోజనాల సమీకరణ పద్ధతులు మూడు విధాలుగా ఉంటాయి. అవి :

(1) ఆచరణీయమైన బేరసారాల పద్ధతి Paragmatic Bargaining Style)

(2) నిరపేక్ష విలువ దృక్కోణ పద్ధతి (Absolue value oriented style)

(3) సంప్రదాయపద్ధతి (Traditionalistic style)

వీటిలో మొదటి పద్ధతిలో రాజీధోరణీ, మార్కెట్ స్థలం (market place) లోని వాతావరణం ఉంటాయి. అంటే ఇచ్చిపుచ్చుకొనే వైఖరి కనబడుతుంది. సిద్ధాంతం పూర్తిగా విస్మరించక పోయినా వివిధ ప్రయోజనాలను సర్దుబాటు చేయడానికి ప్రయత్నం చేయడం ఈ పద్ధతి ముఖ్య లక్షణం. అమెరికా, ఇంగ్లండ్, ఫిలీప్పన్స్ వంటి దేశాలలో ఇటువంటి వైఖరి కనబడుతుందని ఆల్మండ్ అభిప్రాయం. ఇక రెండో విధానంలో సిద్ధాంతానికి అధిక ప్రాముఖ్యం ఇవ్వడం జరుగుతుంది. ప్రయోజనాల సమీకరణలో సర్దుబాటుకంటే సిద్ధాంత విలువలకే ప్రాధాన్యముంటుంది. ఇతరులకు ప్రయోజనకరం కానప్పటికీ కొన్ని ప్రత్యేక ప్రయోజనాల, ప్రత్యేకవర్గాల ప్రయోజనాల పరిరక్షణ ప్రాతిపదికగా ఈ విధానంలో నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది. ఈ పద్ధతిననుసరించే సమీకరణ నిర్మితులు ఇతర వర్గాలను ఉదాహరణకు exploritative capitalist లేదా సామ్రాజ్యవాదులు (imperialists) లేదా Red menace అంటూ విమర్శించడం చూడవచ్చు. కమ్యూనిస్టు, ఫాసిస్టు సిద్ధాంతం అనుసరించే వారి విధానాలు ఈ విధంగా ఉంటాయని ఆల్మండ్ పేర్కొన్నాడు. ఒక సంప్రదాయ పద్ధతికి ప్రాధాన్యమిచ్చేవారు భవిష్యత్తులో అనుసరించదగిన విధానాలకు ప్రత్యామ్నాయాలను సూచించడానికి గతంలో అనుసరించిన పద్ధతులను ప్రాతిపదికగా తీసుకోవాలని భావిస్తారు. పరిమిత వనరులు, లక్ష్య సాధనలో పరిమిత స్వాతంత్ర్యం ఉన్న వ్యవస్థలలో సంప్రదాయ పద్ధతిని అనుసరించడం జరుగుతుంది.

ప్రయోజనాల సమీకరణ పద్ధతులు సమీకరణ చేసే నిర్మితులను తెలుసుకొన్న తరవాత విధాన ప్రత్యామ్నాయాలు ఏ విధంగా జరుగుతాయన్నది కూడా గ్రహించాలి. ప్రయోజనాల వ్యక్తీకరణ, సమీకరణ, విధాననిర్ణయం - ఈ మూడింటినీ స్పష్టంగా గమనించలేనప్పుడు అంటే ఈ కర్తవ్యాలను నిర్వహించే నిర్మితులు ప్రత్యేకంగా ఏర్పడి అవి పని చేయనప్పుడు సమీకరణ స్థాయిలో మార్పులు చేర్పులు ఎంత వరకూ, ఏ స్థాయిలో జరిగాయని చెప్పడం కష్టం. ప్రత్యేక నిర్మితుల ద్వారా ఈ కర్తవ్యాలను నిర్వహించినప్పుడు ప్రయోజనాల సమీకరణ, విధి నిర్వహణలో ప్రత్యామ్నాయం విధానాల రూపకల్పనలో వచ్చిన సంఘర్షణలు ప్రధాన భూమిక వహిస్తాయి. ఉదాహరణకు వివిద రకాల కోర్కెలను వక్రీకరణ జరపాల్సిన కేంద్రీకృత నిర్ణయం నిర్మితులున్న సమీకరణ విధి నిర్వహించే రాజకీయ పార్టీలతో సంబంధాలు లేని అంటే ప్రయోజనాల వ్యక్తీకరణ, విధాన నిర్ణయ నిర్మితుల మధ్య సంధాన నిర్మితులుగా

పని చేసే రాజకీయపార్టీలతో సంబంధాలు లేని విధాన నిర్ణయనిర్మితులున్న వ్యవస్థలలో విధాన నిర్ణయ నిర్మితుల పని భారం చాలా ఎక్కువ. వివిధ వర్గాల నుంచి వచ్చే కొర్కెలను పరిశీలించి తగిన విధంగా నిఖకడగా స్పందించడానికి వ్యవస్థకు శక్తి చాలదు. రాజకీయ పార్టీలు ప్రత్యామ్నాయాలు సూచించడంలో ఒకటి రెంటింటిని మాత్రమే సూచించినట్లయితే అందునా సంఘర్షణ పూర్వకమైనవైతే రాజకీయపార్టీలు సూచించిన ప్రత్యామ్నాయాలు కొన్ని వర్గాల ప్రయోజనాలను పరిరక్షించడానికి తోడ్పడే విధాన నిర్ణయ విధిలో నిర్ణీతలు ప్రతిబంధకాలెదుర్కొంటారు. ప్రత్యక్ష సంఘర్షణలు ఎదరుకొనవలసిన పరిస్థితి కూడా రావచ్చు. హెచ్చు స్థాయి ప్రత్యేకీకరణ, బేరసారాల ధోరణి ఇటువంటి ప్రతిబంధకాలను తొలగిస్తాయి. రాజకీయపార్టీలు ప్రయోజనాల సమీకరణ విధివే కాకుండా రాజకీయ భర్తి, రాజకీయ సమీకరణ, ప్రయోజనాల వ్యక్తీకరణ విధులు కూడా నిర్వహిస్తారు.

6.10 రాజకీయ ప్రసారం

ఆల్మండ్ అభిప్రాయంలో రాజకీయ ప్రసారం ప్రధాన హద్దుల నిర్ణయీకరణ విధిని నిర్వరిస్తుంది. రాజకీయ వ్యవస్థలను విశ్లేషించడంలో అతి ముఖ్యమైన, ఆసక్తికరమైన సాధనాలలో రాజకీయ ప్రసారం స్వరూపాన్ని విశ్లేషించడం ఒకటి. రాజకీయ వ్యవస్థ నిర్వహించే విధులన్నిటిలోను రాజకీయ ప్రసారముంటుంది. అంటే ప్రసారం ద్వారా విధుల నిర్వహణ జరుగుతుంది. అభిప్రాయం, సమాచార ప్రసారం వల్లనే తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రభుత్వం మొదలైన నిర్మితులు వ్యక్తులు రాజకీయ సామాజికరణ జరుపుతారు. అలాగే ఇతరకర్తవ్యాలలో కూడా ప్రసారం ముఖ్యపాత్ర వహిస్తుంది. అయితే రాజకీయ ప్రసారం గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేయడమెందుకు? అన్న ప్రశ్న ఉదయించవచ్చు. ప్రత్యేక అధ్యయన అవసరం ఏమంటే ఆధునిక కాలంలో రాజకీయ వ్యవస్థలలో తటస్థ, నైతిక, నిష్పక్షపాత ప్రసారానికి ఎంతో అవసరముంటుందన్న విషయాన్ని గుర్తించడం జరిగింది. అందువల్ల ఇతర కర్తవ్యాలలో అంతర్భాగంగా కాకుండా రాజకీయ ప్రసారం అనే దాన్ని ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అవసరాన్ని గుర్తించడమైంది. ప్రాచీనకాలంలో వార్తాహరులు, వాద్యకారులను (ముఖ్యంగా డ్రమర్స్) ప్రసార సాధకులుగా వినియోగించేవారు. అంటే ఈ కర్తవ్యం ప్రాచీనకాలంనుంచి గుర్తింపు పొందినట్లు భావించాలి. స్వతంత్రమైన ప్రసార యంత్రాంగం వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. ఉద్యోగిబృందం ప్రయోజనవర్గాలు, రాజకీయ పార్టీలు జరిపే ప్రసారాలలోని అవాస్తవాలను వెలిబుచ్చడానికి, గుప్తంగా ఉంచితే దానిని బహిరంగం చేయడానికి స్వతంత్ర రాజకీయ ప్రసారం తోడ్పడుతుంది. అంతేకాకుండా తటస్థ ప్రసారసాధనాల ద్వారా సమాజంలోని వ్యక్తుల, వర్గాల ప్రయోజనాలు అంతర్గతంగా ఉండే వాటిని బహిర్గతంచేయవచ్చు. ఇక సమాచారాన్ని స్వేచ్ఛగా నిరవధికంగా ప్రసారంచేయటానికి వీలుంటుంది. అంతేకాకుండా ఉత్పాదితులవల్ల వచ్చిన ఫలితలను ఉత్పాదకాలుగా మార్చడానికి అంటే స్పందిత సమాచారం ఇవ్వడానికి (feed-back) ప్రసారం తోడ్పడుతుంది. వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలను నిర్ణయించడానికి రాజకీయ ప్రసారం తగిన సమాచారం అందిస్తుంది.

రాజకీయ ప్రసారకర్తవ్యం రేడియో, టెలివిజన్, వార్తా పత్రికలువంటి వాటి ద్వారా నిర్వహించటం జరుగుతున్నదని తెలుసుకొన్నాం. వీటి ఉనికి (presence), ఇవి వెలువరించే సమాచారం. ఇవి పొందే స్వాతంత్ర్యం రాజకీయ వ్యవస్థ పనిచేయడంపై ఎంతో ప్రభావం ఉంటుంది. ముఖాముఖి పరిచయాలు, కుటుంబం, మతసంఘాలతో సంబంధ బాంధవ్యాలు, శాసనసభలు, ఉద్యోగిబృందం, కార్మిక సంఘాలు, తదితరప్రయోజనకవర్గాలు, రాజకీయ పార్టీలు కూడా ప్రసారసాధనాలుగా పనిచేస్తాయి.

6.11 ఉత్పాదితాల విధులు

ఆల్మండ్ వర్తమాన వ్యవస్థలలో ఉత్పాదక విధులకు ఉత్పాదిత విధులకంటే ప్రాముఖ్యం ఎక్కువ. అయినప్పటికీ ఉత్పాదిత విధులు కూడా వ్యవస్థ విధులలో అంతర్భాగాలు. వీటినే ప్రభుత్వ విధులనికూడా అంటారు. ప్రభుత్వ విధులను వర్గీకరించడం ప్రాచీనకాలం నుంచి రాజనీతిశాస్త్రజ్ఞులు చర్చించిన సమస్యలలో ఒకటి. అరిస్టాటిల్, పోలీబియస్, సిసిరో, హాబ్స్, లాక్, మాంటెస్క్యూ మొదలైనవారు దీనిని గురించి చర్చించారు. సాధారణంగా ప్రభుత్వ

విధులు మూడురకాలని అందరూ అంగీకరించారు. అవి శాసన నిర్మాణ (legislative) కార్యనిర్వహణ (executive) న్యాయ పరిపాలన (judicial) విధులు. సమాజంలో సభ్యులు సంఘర్షణలు లేకుండా నివసించాలంటే వారి ప్రవర్తనను క్రమబద్ధంచేసే నిమనిబంధనలు అవసరం. వాటిని రూపొందించడానికి, అమలుపరచడానికి, సంఘర్షణలు ఏర్పడినప్పుడు వ్యాయనిర్ణయంచేయడానికి కొన్ని నిర్మితులూ అవసరం. నిమయావళి నిర్వహణ (rule application), నియమావళి న్యాయ నిర్ణయం (rule adjudication) అని మూడు విధాలుగా విభజించాడు.

6.12 నియమావళి కల్పన (Rule Making) :

శాసన నిర్మాణం అనే పదానికి బదులు నియమావళికల్పన అన్న పదాలను ఆల్మండ్ ఎన్నుకోవడంలో ప్రత్యేకత ఉంది. శాసన నిర్మాణం అంటే ఒక ప్రత్యేక నిర్మితి ఉంటుందని, ఒక నిర్ణయించిన విధానంకూడా ఉంటుందన్న అర్థం స్ఫురిస్తుంది. అయితే అనేక రాజకీయ వ్యవస్థలలో ఈ కర్తవ్య నిర్వహణ ప్రత్యేక నిర్మితి, విధానం లేకుండా కూడా జరుగుతుంది. నిర్మితి ఏదైనా, విధానం ఎటువంటిదైనా అన్ని రాజకీయ వ్యవస్థలలోను నియమావళి కల్పన ఉంటుందన్నది సత్యం. ఆధునిక కాలంలో నియమావళికల్పనకు ప్రత్యేక నిర్మితులు రూపొందాయి. బ్రిటన్‌లో కాలక్రమంగా ఏర్పడిన పార్లమెంట్ ఇటువంటి దానికి ఒక ముఖ్య ఉదాహరణ. ఈ దేశంలో రాజు, లార్డ్స్ (ప్రభువులు), కామన్‌సలకు మధ్య సంఘర్షణ 18వ శతాబ్దం వరకూ కొనసాగి పార్లమెంట్ ఆవిర్భావానికి దారితీసింది. పార్లమెంట్ న్యాయబద్ధతనుకూడా (Legitimacy) పొందింది. 19వ శతాబ్దంలో కామన్స్ ప్రాధాన్యత పెరిగింది. క్రమంగా నియమావళి కల్పన విధి మంత్రిమండలి, కామన్స్ సభకు స్థిరపడింది. భారత పార్లమెంట్‌నియమావళి కల్పించే నిర్మితికి మరో ఉదాహరణ. అట్లాగే అమెరికాలో అధ్యక్షుడు, కాంగ్రెస్ నియమావళిని రూపొందిచటంలో పాల్గొంటారు. నియమావళి రూపకల్పనపై న్యాయకత్వలక్షణాలు, రాజకీయసంస్కృతి, రాజకీయ వాతావరణం వంటి వాటి ప్రభావం ఉంటుంది. సంప్రదాయరాజకీయ వ్యవస్థలలో నిర్ణయ ప్రక్రియకు ప్రతిబంధకాలెక్కువ. అభ్యుదయనియమావళి రూపకల్పనకు అంతరాయం ఏర్పడుతుంది. అలాకాకుండా లౌకిక లక్షణానికి (secularism) ప్రాధాన్యమిచ్చే వ్యవస్థలలో రాజకీయ సమస్యల సాధనకు, సంఖ్యావిషయంలోను, మార్గాల విషయంలోనూ అవకాశాలెక్కువ. ఇక్కడ లౌకికత్వానికి ప్రత్యేక అర్థముంది. సమాచారసేకరణ, దానిని మూల్యాంకనం చేయడం, సమస్యల పరిష్కారానికి వివిధ మార్గాలను నిర్ణయించగలగడం వంటి వాటి ద్వారా సంప్రదాయవైఖరి, అభిప్రాయాలకు బదులుగా క్రియాశీల (dynamic) విధాన నిర్ణయానికి అవకాశం కల్పించే విధానాన్ని లేదా విధానాలను లౌకికత్వం అంటారు. అయితే సంప్రదాయ సంబంధమైన ప్రతిబంధకాలను తొలగించుకొని వ్యవస్థ ఆధునికతవైపు పయనించడానికి కాలం పడుతుంది.

6.13 నియమావళి నిర్వహణ (Rule Application) :

ప్రత్యేకీకరణ కలిగిన, అభివృద్ధి చెందిన నియమావళి నిర్మితులు వ్యవస్థ సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహదం చేస్తాయి. రాజకీయ వ్యవస్థ విస్తరించినకొద్దీ, నియమాల సంఖ్య పెరిగినకొద్దీ నియమావళి నిర్వహణ ఆధిక్యత అధికమవుతుంది. నియమావళికల్పన నిర్మితి ఏదయినా-రాజు, శాసనసభ, సామాన్యుల సభ - నియమావళి నిర్మితుల సహాయంతప్పనిసరి అవుతుంది. వ్యవస్థ సాధించదలచిన నూతన గమ్యాలకు, పరిష్కరించాల్సిన సమస్యలకు కూడా నియమావలి నిర్మితుల అవసరం ఎక్కువ. సంప్రదాయ వ్యవస్థలలో నియమావళి నిర్వహణ కర్తవ్యాలలో ఆచారాల ప్రాధాన్యత ఉండేది. అంతేకాకుండా రక్తసంబంధీకుల పాత్రకూడా కనిపిస్తుంది. ఆధునిక కాలంలో కర్తవ్య నిర్వహణలో ఉద్యోగిబృందం పాత్ర అతి ప్రధానమైంది. దీనిప్రాముఖ్యం 'very imortant', 'too important' అని చెప్పడం తరుచు చూస్తున్నాం. మెర్లీ ఫెరసాడ్ (Merle Fairsord) చెప్పినట్లు ఉద్యోగి బృందాలు అయిదు రకాలు :

1. ప్రాతినిధ్య ఉద్యోగి బృందాలు (representative bureaucracies),
2. రాజకీయపార్టీ, రాజ్య నియంత్రణలో ఉండే ఉద్యోగి బృందాలు (Party - State Bureaucracies),
3. సైనికాధిపత్య ఉద్యోగి బృందాలు (Military Dominated Bureaucracies),

4. పాలనాధికారి ఆధిపత్యంలోని ఉద్యోగిబృందాలు (ruler-dominated Bureaucracries).

5. పరిపాలించే ఉద్యోగి బృందాలు (Ruling Bureaucracies) పోటీతో కూడిన రాజకీయ విధానం ద్వారా రాజకీయాధికారం నిర్ణయించబడే రాజకీయవ్యవస్థ లక్షణంగా ప్రాతినిధ్య ఉద్యోగి బృందాన్ని పేర్కొనాలి. పార్టీ వ్యవస్థ పనిచేయడానికి ఉద్యోగుల కర్తవ్యాలకు సన్నిహిత సంబందం ఉంటుంది. అంటే ఉద్యోగుల కర్తవ్యాలను పార్టీవ్యవస్థ పనిచేసే విధానం నియంత్రిస్తుంది. వ్యవస్థలో బహుజన సమ్మతి పొందిన రాజకీయనిర్ణయంపై ఉద్యోగి బృందాలు నిరంకుశ పరిపాలన (totalitariamism), ఒకే పార్టీ ఆధిపత్యం (one party domination) ఉన్న వ్యవస్థలలో ఉంటాయి. ఈ వ్యవస్థలలో నియమావళి నిర్వహణతో సంబంధమున్న ఉద్యోగి బృందంపై రాజకీయ ఉద్యోగి బృందం ఆధిపత్యం ఉంటుంది. ఈ ఆధిపత్యాన్ని పై నుంచి విధించినది (super imposed) గా భావించవచ్చు. ఉదాహరణకు, సోవియట్ యూనియన్‌లో కమ్యూనిస్టు పార్టీ నాయకులు నియంత్రణచేసే సచివాలయం ఆధిపత్యంలో ఉండే పార్టీ ఉద్యోగుల నియంత్రణలో ప్రభుత్వ శాఖలలో ఉండే ఉద్యోగి బృందం పనిచేస్తుంది. అయితే ఇటువంటి నియంత్రణ కొంతమేరకు ప్రజాస్వామ్య వ్యవస్థలలోనూ కనిపిస్తుంది. అమెరికా రాజకీయవ్యవస్థను దీనికి ఉదాహరణగా తీసుకోవచ్చు. అధ్యక్షుని అధీనంలో ఉండే ఉద్యోగులు, కాంగ్రెస్‌కు సమీకరించే ఉద్యోగులు ముఖ్యంగా కమిటీలకు సహకరించే ఉద్యోగులు సాధారణ ప్రభుత్వోద్యోగులను నియంత్రణ చేస్తారు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే పార్టీ - రాజ్యం ప్రాబల్యంలో ఉండే ఉద్యోగిబృందాల విషయంలో పార్టీ ఉద్యోగిబృందం ప్రాబల్యం హెచ్చు. సైనికాధిపత్య ఉద్యోగిబృందాలున్న రాజకీయ వ్యవస్థలలో ఉద్యోగిబృందం ఒక భాగమైన సైనికోద్యోగులు ఇతర ఉద్యోగులపై అంటే పౌరవిషయాల సంబంధిత ఉద్యోగులపై - నియంత్రణ కలిగి ఉంటారు. పాలకాధిపత్య ఉద్యోగి బృందాలున్న వ్యవస్థలలో పాలకుడు ఉద్యోగిబృందంద్వారా తన నిర్ణయాలను ప్రజలపై విధించడం లేదా రుద్దడం జరుగుతుంది. ఇక్కడ ఉద్యోగుల పాత్ర పరిమితమైంది. పరిపాలన జరిపే ఉద్యోగిబృందాలు వ్యవస్థలో వాస్తవ పాలకులుగా వ్యవహరిస్తారు. వలస రాజ్యాలలోని ఉద్యోగి బృందాలను వీటికి ఉదాహరణలుగా తీసుకోవచ్చు.

ఏవ్యవస్థలోనయినా ఉద్యోగిబృందం యొక్క ప్రాధాన్యం సంఖ్యాపరంగా చాలా ఎక్కువ. వీరి వాస్తవ పాత్రను గ్రహించడానికి ఉత్పాదితులను పరిశీలించడం అవసరం. విధానాలు, శాసనాలు, నిర్ణయాలు వీటిని అమలుపరిచేది ఉద్యోగులే. విధాన నిర్ణయాలు తీసుకోవడమన్నది కూడా లేకపోదు. ఉద్యోగులు నియమావళి నిర్వహణతోబాటు ఆధునిక కాలంలో ఉద్యోగులు నియమావళి కల్పనలో కూడా ప్రముఖ పాత్ర వహించడం కూడా చూస్తున్నాం. నిజానికి శాసనాల స్థూల స్వరూప నియమావళి కల్పన నిర్మితులు నిర్ణయిస్తే, వాటి వివరాలు - అంతేకాకుండా దత్తశాసనాలు రూపొందించే ప్రక్రియలూ ఉద్యోగి బృందం పాత్ర అధికం. దీనికితోడు నియమావళి - న్యాయనిర్ణయాలూ పరిపాలక న్యాయస్థానాల ద్వారా ఉద్యోగిబృందం న్యాయ నిర్ణయాధికారాలు చెలాయిస్తుంది. ఇవికాక వ్యవసాయ, కార్మిక, రక్షణ, విద్యా తదితర శాఖల ఉద్యోగుల ఆయా శాఖలతో ప్రమేయం ఉన్న ప్రయోజక వర్గాలకు ప్రవక్తలుగా పనిచేస్తారు. రాజకీయ ప్రసార విధిలో కూడా వీరి పాత్ర చెప్పుకోదగింది. ప్రజాసమస్యలు, రాజకీయ ప్రాధాన్యతగల సంఘటన విషయమై ముఖ్య సమాచార సరఫరాదారులుగా వీరు వ్యవహరిస్తారు. దేశ, విదేశీ వ్యవహారాల తాజా సమాచార సేకరణకు పత్రికా ప్రతినిధులు, ఇతర ప్రసార సాధనాల సంబందిత వ్యక్తులు, ఉద్యోగి బృందంపై ఆధారపడవలసి ఉంటుంది.

పై వివరాలను బట్టి ఉద్యోగిబృందం వివిద విధులను నిర్వహిస్తుందని తెలుస్తుంది. ప్రయోజనాల వ్యక్తీకరణ, సమీకరణ, ప్రసార విషయాలపై వీరి ప్రభావం ఉండే ఉత్పాదిత విధులలో వీరి ప్రాబల్యం అత్యధికమేకాకుండా వీరి ప్రమేయం తప్పనిసరి. వీరి ద్వారా తప్ప ఏ ఉత్పాదిత నిర్మితి కూడా ఆచరణ సామర్థ్యం పొందలేదు.

6.14 నియమావళిः న్యాయనిర్ణయం (Rule Adjudication):

వ్యవస్థ రూపొందించిన నియమాలు, వ్యక్తులు వర్గాల ప్రవర్తనకు సంబంధించి నియంత్రణను, క్రమబద్ధతను నిర్ణయిస్తాయి. ఈనియమాల ఉల్లంఘన సందర్భాలలో విధించాల్సిన జరిమానాలు,ఇతర శిక్షలను కూడా నిర్ణయించడం జరుగుతుంది. నియమాల అతిక్రమణ జరిగిందా లేదా? జరిగితే ఎంత వరకు ఏవిధంగా జరిగింది పరిశీలించాలి. న్యాయనిర్ణయం చేయడానికి పనిచేసే నిర్మితులు నియమావళి న్యాయనిర్మితులు.ఆధునిక కాలంలో ఈ కర్తవ్యాలను

న్యాయస్థానాలకు అప్పగించడం పరిపాటి. ఇతర నిర్మితులుకూడా న్యాయ నిర్ణయంలో పాల్గొనవచ్చు. ఉదాహరణకు, నియంతృత్వ వ్యవస్థలలోని రహస్య పోలీసు ఒక వ్యక్తి నిందితుడని ఆరోపించి, ఆతనితో నేరం ఒప్పించి, నేరస్థుడని నిర్ణయించి శిక్ష విధించవచ్చు. ఇక్కడ నియమావళి నిర్వహణ నిర్మితి న్యాయనిర్ణయ విధి నిర్వహిస్తుందన్నమాట. రాచరికంలో రాజు కాని, అతని కిందపని చేసే మంత్రి కాని నియమావళి కల్పన, న్యాయనిర్ణయ కర్తవ్యాలు నిర్వహిస్తారు. అయితే ప్రత్యేకీకరణ కలిగిన న్యాయనిర్ణయ కర్తవ్యాలు నిర్వహిస్తారు. అయితే ప్రత్యేకీకరణ కలిగిన న్యాయనిర్మితుల వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. నిర్ణయాధిపతులకు ఒత్తిడి తగ్గించడం లేదా తొలగించడం, వివాదాలు పరిష్కరించడం సులభ సాధ్యంకావడానికి న్యాయ నిర్ణయనిర్మితులు తోడ్పడతాయి. అంతేకాకుండా నిష్పక్షపాతంగా వ్యాయనిర్ణయప్రక్రియలు వ్యవహరించడానికి కూడా ప్రత్యేక నిర్మితుల అవసరం ఎంతగానో ఉంది. దీనికి న్యాయ నిర్మితులకు తగినంత స్వాతంత్ర్యం ఉండాలి. ఇటువంటి నిర్మితులు నియమావళి అనుసరణ కర్తవ్యంపై తగిన నిరోధాన్ని విధిస్తూ వ్యవహరిస్తాయి. న్యాయనిర్ణయంతో బాటుగా న్యాయస్థానాలు ప్రయోజనాల వ్యక్తీకరణ, సమీకరణ విధులు కూడా నిర్వహించవచ్చు. ప్రసార సాధనం గాను పనిచేయవచ్చు. స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించే న్యాయస్థానాలు రాజకీయ వ్యవస్థలోని సభ్యుల సామర్థ్యాన్ని కూడా పెంచుతాయి. వారి సంస్కృతిలో సముచితమైన మార్పులు తెస్తాయి.

ఇంతకు ముందు చెప్పినట్లు ఆల్మండ్ అభిప్రాయంలో ఉత్పాదిత విధులకంటే ఉత్పాదక విధులకే వర్థమాన దేశాలలో ప్రాముఖ్యమెక్కువ. ఈవిధులు రాజకీయ వ్యవస్థ వాస్తవ స్వరూపాన్ని తెలుసుకోవడానికి తోడ్పడతాయి. సమస్యలను ఎవరు గుర్తిస్తారు? ఎవరు చర్చిస్తారు? పరిష్కరిస్తారు? అన్న ప్రశ్నలు వాటిని ఏ విధంగా పరిష్కరించాలని చూస్తారు. అన్న విషయాలు తెలుసుకోవడం ఆవసరం. ఈ ఈ సంబంధిత ప్రక్రియనే "స్పీరో" "flow of Policy" అంటాడు. రాజకీయ చర్యలకు సంబందించిన కోర్కెలు (demands), ఆలంబనలు (Support) అని డేవిడ్ ఈస్టన్ (David Easton) అంటాడు. నిర్దిష్టమైన నిర్మితులద్వారా నిర్దిష్టమైన కర్తవ్యాలు నిర్వహించే అవకాశాలను తెలుసుకోవడం ద్వారా రాజకీయ వ్యవస్థలను తులనాత్మకంగా పరిశీలించే సిద్ధాంతమే నిర్మితులు-విధుల సిద్ధాంతం అని చెప్పవచ్చు. ఈ సిద్ధాంతం అనుసరించడంలో గణిత, గణాంక పద్ధతులను కూడా వినియోగించడానికి వీలవుతుందని ఆల్మండ్ అభిప్రాయం.

మూడో దశ (Phase III) : 1965లో ప్రచురించిన పరిశోధన వ్యాసంలోను, 1966లో ప్రచురించిన గ్రంథంలోను ఆల్మండ్ నిర్మితులు-విధుల సిద్ధాంతంలో మార్పులు, చేర్పులు చేశాడు. వీటిప్రకారం రాజకీయ వ్యవస్థలకు ఆరు కర్తవ్యాలుంటాయి. అవి :

1. ప్రయోజనాల వ్యక్తీకరణ (Interest Articulation)
2. ప్రయోజనాల సమీకరణ (Interest Aggregation)
3. రాజకీయ ప్రసారం (Political Communication)
4. నియమావళి కల్పన (Rule Making)
5. నియమావళి అనుసరణ (Rule Application)
6. నియమావళి న్యాయ నిర్ణయం (Rule adjudication)

ఈవిధంగా ఆల్మండ్ నిర్ణయించడానికి కొన్ని కారణాలున్నాయి. సమతౌల్య పరిరక్షణకు తాను ఇచ్చిన ప్రాధాన్యతవల్ల తన సిద్ధాంతం అభివృద్ధి చెందుతున్న రాజకీయవ్యవస్థల విశ్లేషణకు తోడ్పడదన్న విమర్శలోని సహేతుకతను ఇతడు గుర్తించాడు. విధుల వర్గీకరణ రాజకీయ వ్యవస్థ అభివృద్ధి స్థాయినిగాని, దిశను గాని తెలియజేయడం లేదన్న విమర్శను కూడా అంగీకరించాడు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాజకీయ వ్యవస్థలు ఎందుకు, ఎలా మారుతున్నాయన్న విషయాలను విపులంగా చర్చించాడు. వీటిలో ఒకటి రాజకీయ వ్యవస్థ విధులు మార్పులకు గురి అయ్యే విధానం. రెండోది-పరిసరాలలోని ఒక సభ్యునిగా రాజకీయ వ్యవస్థ ఎలా వ్యవస్థ ఎలా వ్యవహరిస్తుందన్న విషయం . రాజకీయ వ్యవస్థ నిర్వహణ, అనుసరణీయత. అంటే దీర్ఘకాలంగా మార్పులు చేయాలన్న ఒత్తిడులను వ్యవస్థ ఏవిధంగా తట్టుకొని వ్యవహరిస్తుందన్నది మూడోది. ఈ కర్తవ్యం రాజకీయ సామాజీకరణ, రాజకీయ భర్తీలకు సంబంధించింది. తన నిర్మితులు-విధుల సిద్ధాంతంలో మార్పులు సూచిస్తూ తాను రాజకీయ వ్యవస్థ స్వరూప నిర్ణయంలో పరస్పరాధీనత (interdependence) కు ప్రాధాన్యమిస్తానని,

సామరస్యానికి (harmony) కి కాదని అంటాడు. రాజకీయ వ్యవస్థలు సామర్థ్య విధులను కూడా నిర్వహిస్తాయని అంటాడు.

6.15.0 సామర్థ్య విధులు (Capability Functions)

రాజకీయ వ్యవస్థల సామర్థ్య విధుల విశ్లేషణ శాస్త్రీయమైన వివరణకు భవిష్యత్తులో జరిగేది తెలపటానికి తోడ్పడుతుందని ఆల్మండ్ భావం. వ్యవస్థలో అమలు జరిగే విధానాలను గురించి చర్చించటానికి, అభిప్రాయ వ్యక్తీకరణకు, రాబోయేకాలంలో సంభవించే రాజకీయమార్పును గమనించడానికి కూడా ఈ విశ్లేషణ సహాయపడుతుందని ఇతనంటాడు. అంతేకాకుండా లక్ష్యసాధనకు అవసరమైన నిర్మితులను, దృక్పథాలను నిర్ణయించడానికి కూడా తోడ్పడుతుంది. సాధించదలచిన అభివృద్ధి స్థాయిని నిర్ణయించి వీటిని రూపకల్పన చేసుకోవచ్చు. ఆశించిన స్థాయిని చేరుకోడానికి అనువైన సామాజికరణ భర్తీవివరాలను నిర్ణయించుకోవచ్చు. రాజకీయవ్యవస్థల సామర్థతా విధులు కింది విధంగా ఉంటాయి.

6.15.1 వెలికితీయగల సామర్థ్యం (extractive capability) :

దేశ, అంతర్జాతీయ వాతావరణం నుంచి - అంటే దేశం లోపలి, వెలుపలి పరిసరాల నుంచి, భౌతిక, మానవ వనరులను వెలికి తీయడానికి రాజకీయ వ్యవస్థకున్న సామర్థ్యాన్ని వెలికి తీసే సామర్థ్యమంటారు. వ్యవస్థలోని సభ్యులనుంచి, సంస్థలనుంచి పన్నులు వసూలుచేసే సామర్థ్యం సభ్యులసేవలను వెలికి తీసి వినియోగించే సమర్థతను వెలికితీసే సామర్థ్యం అనవచ్చు. ఈసామర్థ్యాన్ని విశ్లేషించడంలో ఎంతవరకు వ్యవస్థ వెలికితీయగలుగుతున్నది? ఎవరినుంచి? వనరులు సమకూర్చడంలో సమకూర్చేవారి ఒప్పదల ఎంతవరకు ఉంది? వెలికి తీసే పద్ధతులేమిటి ? (భయపెట్టడం సామరస్యం, బలప్రయోగం మొదలైనవి) మొదలైన ప్రశ్నలకు సమాధానాలుగా కనుక్కోవాలి. వనరులు వెలితీయడంలో వాటిని సమకూర్చినవారికి తిరిగి ఏమైన చెల్లించాల్సి ఉంటుందోని కూడా పరిశీలించాలి. వెలికి తీసే సామర్థ్యాన్ని నిర్ణయించడంలో వినియోగించిన నిర్మితులు, పద్ధతులుకూడా తెలుసుకోవాలి. ఈప్రక్రియలో సమర్థవంతమైన ఉద్యోగులున్నారా? వీరు సక్రమ విధి నిర్వహణ జరుపుతున్నారా గ్రహించి వెలికి తీయదగిన వనరు లెటువంటివో కూడా పరిశీలించడం కూడా ప్రయోజనకరమే. ఉదాహరణకు. కొన్ని వ్యవస్థలో "సూనె" ద్వారా ఆదాయం ఎక్కువ, మరికొన్ని వ్యవసాయ ప్రధానమైనది. ఇతర పరిస్థితులెంతగా సహకరించినా పంటలు సక్రమంగా లేనప్పుడు వెలికి తీయగల సామర్థ్యం బాగా తగ్గుతుంది.

6.15.2 అదుపు చేసే సామర్థ్యం (Regulation Capability):

వ్యక్తులు, సమూహాల ప్రవర్తనపై రాజకీయ వ్యవస్థకున్న నియంత్రణా సామర్థ్యమే అదుపు చేయగల సామర్థ్యం. వ్యక్తుల, సమూహాల ప్రవర్తనను నియంత్రించడానికి బల ప్రయోగం చేయడానికి రాజకీయ వ్యవస్థకు అధికారముంటుంది. ఈ అధికారమే రాజకీయ వ్యవస్థకు ఉన్న ఇతర వ్యవస్థలకు లేనిప్రత్యేక లక్షణం. ఈ రకమైన సామర్థ్యాన్ని పరిశీలించేటప్పుడు ఏ వ్యక్తులు, సంఘాలు నియంత్రణకు లోనవుతున్నాయో తెలుసుకోవాలి. వ్యక్తిగత, సమిష్టి జీవనానికి చెందిన ఏ అంశాలు నియంత్రింపబడుతున్నాయో గ్రహించాలి. అంతే కాకుండా, నియంత్రణ ఎంత తురుచుగా జరుగుతున్నది పరిశీలించాలి. అమెరికాలో ఆర్థిక జీవనంపై వ్యవస్థ నియంత్రణ చెప్పుకోదగినదిగా ఉంటుంది. వ్యాపారస్థులు అక్రమ పద్ధతులు అనుసరించకుండా నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు లభించేటట్లుగా, వివిధ సంఘాలు అణిచివేత విధానాన్ని అనుసరించకుండా, మరి ఇతర విషయాలలోను, వివాహం, ఆరోగ్యం, తల్లిదండ్రుల బాధ్యతలు మొదలైన విషయాలపై కూడా - వ్యవస్థ అదుపు ఆజ్ఞలు అమలు చేయవచ్చు. అయితే ఇట్లా చేసేటప్పుడు వ్యవస్థ అధికారానికి - వ్యక్తిగత, సామూహిక హక్కులకు మధ్య సమన్వయం సమకూర్చే విధంగా అదుపును వినియోగించాల్సి ఉంటుంది.

వెలికి తీయడం, నియంత్రణ - ఈ రెండు పరస్పరాశ్రయాలు. ఎందుకంటే అదుపు చేయడానికి వ్యవస్థకు వనరులు అవసరం. అలాగే వనరుల సాధనకు సముచిత నియంత్రణ, బలప్రయోగం కూడా అవసరం.

6.15.3 పంపిణీ సామర్థ్యం (Distributive Capability) :

రాజకీయ వ్యవస్థ నుంచి సమాజంలోని వ్యక్తులకు, సంఘాలకు వస్తువులసేవలు, గౌరవ పురస్కారాలు, హోదాలు, వివిధ తరహా అవకాశాలు సమర్చడాన్ని పంపిణీ సామర్థ్యం అంటారు. సమాజంలోని వ్యక్తులకు, సంఘాలకు మేలు లేదా ఫలం సమకూర్చడానికి సంబంధిత చర్య పంపిణీ సామర్థ్యం. ఎంత పరిమాణంలో ఏమి పంపిణీ జరిగిందన్న విషయాలు ఈ రకమైన సామర్థ్యాన్ని నిర్ణయించడానికి ప్రమాణంగా తీసుకోవాల్సి ఉంటుంది. అంతే కాకుండా పంపిణీ మానవ జీవితంలో ఏ విషయాలకు సంబంధించింది? మేలు పొందిన వర్గాలేవి? వ్యక్తుల అవసరాలకు, పంపిణీ విధానానికి సంబంధం ఏ విధంగా ఉంది? అన్న ప్రశ్నలకు సమాధానాలు సాధించడం ద్వారా పంపిణీ సామర్థ్యం పరిమాణం, స్థాయిని గ్రహించవచ్చు. ఉదాహరణకు, సాంఘిక సంక్షేమానికి చేసే ఖర్చు, ఆర్థికావసరాలు తీర్చేటందుకు ఉద్దేశించిన మొత్తం, ఆరోగ్యావసరాలకు కేటాయించ తలపెట్టిన విషయాలను తెలియజేస్తాయి. ఇక ప్రత్యేకంగా వ్యాపారస్థులకు, వ్యవసాయ దారులకు, గనులలో పని చేసే కార్మికులకు ఉద్దేశించిన పంపిణీ సమాజంలో ఏ వర్గాలు పంపిణీ వల్ల ప్రయోజనం పొందుతున్నాయో తెలుసుకోవడానికి దోహదం చేస్తాయి. ప్రాంతీయ సమూహాలకు మత సంఘాలు, జాతి పరంగా ఏర్పడిన సమూహాలు వంటి వాటికి జరిగే పంపిణీ ఏ సమూహాలు లాభం పొందుతున్నాయో తెలుసుకోవడానికి తోడ్పడతాయి. అందువల్ల పంపిణీ పరిమాణం పెరిగినంత మాత్రాన పంపిణీ సామర్థ్యం పెరిగిందనుకోవడం పొరబాటు. ప్రభుత్వ యంత్రాంగ నిర్వహణకు ఎక్కువపంపిణీ, ప్రజావసరాలకు తక్కువ పంపిణీ జరిగితే అది సమర్థతతో కూడిన పంపిణీ అనిపించుకోదు. ఏ రకమైన వారికి ఎంత పరిమాణంలో, ఎంతటి ప్రాధాన్యమైన కేటాయింపులు జరిగాయన్న విషయంపై వ్యవస్థ సామర్థ్య గుణాన్ని నిర్ధారించవచ్చు.

6.15.1 లాంఛనాల సామర్థ్యం (Symbolic Capability):

రాజకీయ వ్యవస్థ నుంచి సమాజంలోకి, అంతర్జాతీయ వాతావరణంలోకి సార్థకంగా ప్రవేశించే ప్రతీకల లేదా చిహ్నాల స్థాయినే (rate of effective flow of symbols) లాంఛనాల సామర్థ్యమంటారు. రాజకీయ విలువలకు మేధావుల మద్దతు జెండా ప్రదర్శనలు, సైనికులు, సైనిక కవాతులు, ఉన్నతోద్యోగుల సందర్శనలు, రాజకీయ విధానాల ప్రకటనలు మొదలైన వాటిని చిహ్నాలుగా పేర్కొనవచ్చు. లాంఛనాల సామర్థ్యం అంచనా వేయడం కొంచం కష్టమే అయినా రాజకీయ రంగంలో మేధావులు, పాత్రికేయులు, పండితులు రాజకీయ సమావేశాలకు హాజరైన ప్రజల సంఖ్యాబలం ఆధారంగా సామర్థ్యాన్ని అంచనా వేయడానికి, అభిప్రాయాలు తెలుసుకోడానికి సర్వేలు జరపడం ద్వారా ప్రయత్నిస్తున్నారు. అయితే ఇక్కడ గమనించాల్సి విషయం ఒకటుంది. ఉత్పాదితాల లాంఛనాలకు, లాంఛనాల సామర్థ్యానికి సంబంధం ఉన్నప్పటికీ ఈ రెండూ ఒకటికాదు.

6.15.5 స్పందనా సామర్థ్యం (Response Capability):

పైన వివరించిన సామర్థ్యాలు ఉత్పాద విధుల స్వభావమున్నటువంటివి. ఉత్పాదకాల మధ్య,ఉత్పాదితాల మధ్య సంబంధాలను పెంపొందించడానికి స్పందనా సామర్థ్యం తోడ్పడుతుంది. స్పందనా సామర్థ్యం ఆధారంగానే రాజకీయ వ్యవస్థల సామర్థ్యాన్ని తెలిపే ప్రకటనలు, నిర్ణయాలు జరగడం మనం చూస్తున్నాం.

ప్రతి రాజకీయ వ్యవస్థకు కూడా ఏదో విధంగా, ఎంతో కొంతమేరకు స్పందన స్వభావం ఉంటుంది. లోపల నుంచి, వెలుపల నుంచి వచ్చే ఒత్తిడులకు, అభ్యర్థనలకు, కోర్కెలకు వ్యవస్థ స్పందిస్తుంది. ఒక్కడ గుర్తించుకోవాల్సిన విషయం ఏమిటంటే ఎవరి పట్ల వ్యవస్థ స్పందిస్తున్నది? ఎటువంటి విధానాల విషయంలో స్పందిస్తున్నది ? స్పందనా ప్రవర్తనకు సంబంధించిన వైఖరిని కొనసాగించడానికి ఏ విధంగా ప్రయత్నిస్తున్నది? వంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవడం. ఉద్యోగి బృందం ప్రాధాన్యత వహించే సామ్రాజ్యాలలో ఉత్పాదకాలు కొద్ది మంది రాజకీయ నాయకుల నుంచి వస్తాయి. వీరే వ్యవస్థపై ఒత్తిడులు తెస్తారు. ఈ పరిస్థితులలో వ్యవస్థ కొద్ది మంది ప్రయోజనాల పరిరక్షణకు స్పందిస్తుందని చెప్పవచ్చు. ఇటువంటి వ్యవస్థ యొక్క స్పందనా సామర్థ్యం పరిమితంగా ఉంటుంది. బాగా అభివృద్ధి సాధించిన ప్రభావ వర్గాలు, రాజకీయ పార్టీలు ఉన్న రాజకీయ వ్యవస్థలలో వివిధ వర్గాల, వ్యక్తుల నుంచి వచ్చే ఒత్తిడులకు వ్యవస్థ స్పందించాల్సి ఉంటుంది. స్పందనా సామర్థ్యం కూడా ఎక్కువగా ఉండటం తప్పనిసరి అవుతుంది. వ్యవస్థపై ఒత్తిడి తెస్తున్న వర్గాలను గురించి, అవి వినియోగిస్తున్న సాధన మార్గాలను గురించి, నిర్మితులను గురించి - అంతే కాకుండా రాజకీయ సంస్కృతిని గురించిన పరిశీలన ఈ సందర్భంలో అవసరం.

6.15.6 స్వసమాజ, అంతర్జాతీయ సామర్థ్యం (Domestic and International Capability):

సాంఘిక వ్యవస్థలో ఒక భాగం రాజకీయ వ్యవస్థలలోను, ఇతర వ్యవస్థలలోను, అంతర్జాతీయ రంగంలోని ఇతర వ్యవస్థలతోను సంబంధాలుంటాయని తెలుసుకొన్నాం. అందువల్ల రాజకీయ వ్యవస్థ తాను ఏ సామాజిక వ్యవస్థలో ఉపవ్యవస్థో ఆ సామాజిక వ్యవస్థలోను, అంతర్జాతీయ రంగంలోను కలిగి ఉన్న సామర్థ్యాన్ని పరిశీలించం అవసరం. ఇటువంటి పరిశీలన ప్రయోజనాత్మక, నిష్పక్షపాత విశ్లేషణక తోడ్పడుతుంది. అంతర్జాతీయ వ్యాపారం ద్వారాను, లేదా విదేశీ సందర్శకుల వల్లను, విదేశాలలో పెట్టుబడుల వల్లను, విదేశాల నుంచి లభించిన నష్టపరిహారం, విరాళా ద్వారాను పొందిన లాభం వ్యవస్థ యొక్క అంతర్జాతీయమైన వెలికి తీసే సామర్థ్యాన్ని నిర్ణయిస్తుంది. ఇతర రాజకీయ వ్యవస్థల ప్రభుత్వ విధానాలపై ఉన్న ప్రభావం, ఇతర రాజకీయ వ్యవస్థల వ్యవహారాలలో చొచ్చుకొనిపోగల శక్తి, ఒక రాజకీయ యొక్క అదుపు చేయగల సామర్థ్యాన్ని నిర్ణయిస్తాయి. రాజకీయ వ్యవస్థలు ఇతర రాజకీయ వ్యవస్థల వ్యవహారాలలో జోక్యం చేసుకొంటాయని నిరూపించడానికి కీలు బొమ్మలుగా వ్యవహరించే వ్యవస్థలు, ఉపగ్రహాలుగా పనిచేసే వ్యవస్థలు నిదర్శనాలవుతాయి. ఇటువంటి వ్యవస్థలను "Penetrated Polity" అని వ్యవహరిస్తారు. సబ్సిడీలు, గ్రాంట్లు, రుణాలు, సాంకేతిక సహాయం అందించడం ద్వారా రాజకీయ వ్యవస్థలు పంపిణీ సామర్థ్యాన్ని పెంపొందించుకొంటాయి. ఇటువంటి సామర్థ్యమే అంతర్జాతీయ పంపిణీ సామర్థ్యం. ఒక దేశం నుంచి మరో దేశానికి ప్రసరించే విధాన ప్రకటనలు, ప్రతీకలు లేదా చిహ్నాల వంటివి అంతర్జాతీయ లాంఛనాల సామర్థ్యంపై ప్రభావం చూపగలుగుతాయి. వివిధ వ్యవస్థలు ఇతర వ్యవస్థలలో తమ గౌరవం, హోదా ఇనుమడింపజేసుకోడానికి అంతర్జాతీయ లాంఛనాల సామర్థ్యాన్ని పెంచుకొనే ప్రయత్నం చేస్తాయి. ఈ కృషిలో భాగంగా ఇతర వ్యవస్థలలో జరుగుతుండే వార్తా ప్రసారాలను ఎప్పటికప్పుడు తెలుసుకొంటాయి. ప్రజాభిప్రాయ సేకరణ సర్వేలు జరుపుతుంటాయి. అంతర్జాతీయ సంస్థ అయిన ఐక్యరాజ్యసమితిలో తమ ప్రతిపాదనలకు రాజనీతికి మద్దతు, అంతే కాక సైనిక పరమైన మద్దతు కూడా అంతర్జాతీయ లాంఛన సామర్థ్యానికి కొలమానాలని అమెరికన్‌లు భావిస్తారు.

ఇక్కడ గమనించాల్సిన ఒక ముఖ్య విషయముంది. ఒక రాజకీయ వ్యవస్థ యొక్క స్వసమాజ సామర్థ్య వైఖరులకు అదే వ్యవస్థ యొక్క అంతర్జాతీయ సామర్థ్య వైఖరులకు కొంత సంబంధం ఉంటుంది. స్వసమాజంలో హెచ్చు స్థాయిలో వెలికి తీయగల సామర్థ్యమున్న వ్యవస్థకు అంతర్జాతీయంగా కూడా ఇటువంటి శక్తి ఉండవచ్చు.

6.15.7 సామర్థ్య నిర్ణాయకాలు (Factors affecting Capability):

ఒక రాజకీయ వ్యవస్థ యొక్క సామర్థ్య వైఖరులు అందరి రాజకీయ మేధావుల లక్ష్యాలు, చర్యలపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. వ్యవస్థలో ఉత్పన్నమయ్యే కోరికలు, ఒత్తిడులకు వ్యవస్థలోని నిర్మితులు ఎప్పిగా మూర్పులు చెందవు. రాజకీయ మేధావులకు కొన్ని లక్ష్యాలు, వాటితోబాటు కొన్ని నమ్మకాలు, అభిప్రాయాలు, లక్ష్యసాధన ఎంత వరకు చేయగలమన్న భయాందోళనలు ఉంటాయి. అందువల్ల వ్యవస్థలోనుంచి, అంతర్జాతీయ వాతావరణం నుంచి వచ్చే ఒత్తిడులకు ఏ విధంగా మేధావులు స్పందిస్తారన్న దాన్ని బట్టి వ్యవస్థ సామర్థ్య స్థాయి విధానం నిర్ణయమవుతాయి. కొంత వివరంగా చెప్పాలంటే ఒత్తిడులు, కోరికలు పట్ల మేధావులు అణచివేత ధోరణి, నిర్లక్ష్యం, సర్దుబాటు ధోరణి లేదా ప్రత్యామ్నాయాలను సమూర్చుకొనే ధోరణిని అనుసరించవచ్చు. నిర్లక్ష్యం వల్ల గాని, తగిన పరిజ్ఞానం లోపించడం వల్లగాని వ్యవస్థపై ఒత్తిడి అధికమవుతుంది. ఇటువంటప్పుడు వ్యవస్థ యొక్క స్పందనా సామర్థ్యం బలహీన మవుతుంది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే రాజకీయ వ్యవస్థలోని వివిధ విధానాలను నిర్వహణ ను రూపొందించడంలో రాజకీయ వేత్తల, రాజనీతిజ్ఞుల పాత్ర తగినంతగా ఉంటుంది. ఇక సామర్థ్య నిర్ణాయక విషయంలో రెండోది నిర్వహణకు అవసరమయిన మానవ (Human) భౌతిక వనరులు (Material resources) ఉండటం. వ్యవస్థలోని సభ్యుల సేవలను వెలికి తీయడంపై సభ్యుల సంఖ్య, వారి నైపుణ్యం, ప్రేరణ (motivation) ల ప్రభావముంటుంది. అంతే కాకుండా భౌతిక వనరులు కూడా ఉండాలి. ఉదాహరణకు - విమానాలు, ఓడలు నిర్మించడం, ఇనుము, బొగ్గు లేకుండా సాధ్యపడదు. ఇట్లాంటి భౌతిక వనరుల సంపాదన కోసం రాజ్యాలు యుద్ధాలకు తలపడిన సందర్భాలు చరిత్రలో లెక్కకు మించి ఉన్నాయి. వ్యవస్థ సామర్థ్యాన్ని నిర్ణయించే మరొక విషయం సంస్థాగత ఉపకరణాలు (organisational apparatus). ఉదాహరణకు - అభివృద్ధి

చెందిన, సమర్థవంతమైన ఉద్యోగి బృందమున్న వ్యవస్థలలో సామర్థ్యం అది లేని వ్యవస్థలలో కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుంది. ప్రత్యేకీకరణ కలిగిన, నిర్దిష్టమైన రాజకీయ నిర్మితులు, లౌకిక, సాంస్కృతిక వైఖరులు వ్యవస్థ సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి. వనరుల వినియోగంలోను, వ్యవస్థ నిర్వహణలోను సామాజికరణ, భర్తీ వైఖరులు కూడా ప్రభావం చూపతాయి. చివరగా వ్యవస్థకు లభించే మద్దతు స్థాయిలు కూడా వ్యవస్థ సామర్థ్యాన్ని నిర్ణయిస్తాయి. మద్దతు విషయంలో తక్కువ స్థాయి, పన్నుల ఎగవేత, శాసనోల్లంఘన మొదలైనవి వ్యవస్థ సామర్థ్యం పెరుగుదలకు అవరోధం కల్పిస్తాయి.

6.16 రాజకీయ వ్యవస్థ సామర్థ్యం : రాజకీయాభివృద్ధి (Capabilities of Political System and Political Development):

రాజకీయ వ్యవస్థ సామర్థ్యం, దీనికి లభించే మద్దతులను గురించిన విశ్లేషణ రాజకీయాభివృద్ధిని అధ్యయనం చేయడానికి తోడ్పడుతుంది.. వృద్ధిఅనేది వివిధ దశలలో జరుగుతుందని, ప్రతి దశపై అంతకు ముందటి దశ ప్రభావం ఉండటమే కాకుండా తరవాతి దశపై ప్రభావం చూపుతుందన్నది సర్వ సామన్య విషయం. ఇక రాజకీయ వ్యవస్థ సామర్థ్యం రాజకీయాభివృద్ధి విషయాలకు వస్తేవ్యవస్థకు పంపిణీ సామర్థ్యం ఉండటానికి ముందుగా వెలికితీసే సామర్థ్యం, అదుపు సామర్థ్యం ఉండాలి. వెలికి తీసే సామర్థ్యం, అదుపు సామర్థ్యానికి నిర్దిష్ట నిర్మితులు, లౌకికతత్వం అవసరం. ఇవికాక కొర్కెల వ్యక్తీకరణ, సమీకరణ జరిపే ప్రయోజక వర్గాలు, పార్టీలు, నియమాల నిర్వహణ జరిపేఉద్యోగి బృందం కూడా రాజకీయ వ్యవస్థ అభివృద్ధి పథంలో సముచిత పాత్ర వహిస్తాయి. రాజకీయ మార్పు స్వరూప స్వభావాల నిర్ణయంలో కూడా రాజకీయ వ్యవస్థ యొక్క సామర్థ్య విశ్లేషణ తోడ్పడుతుంది. వ్యవస్థలో ఉత్పన్నమైన సమస్యలను ఎదుర్కొనే మార్గాలను సూచించడానికి కూడా ఈ విశ్లేషణ దోహదం చేస్తుంది.

6.17 పద్ధతి నిర్వహణ, అనుసరణీయతా విధులు (Pattern Maintainance and adaptation Functions):

రాజకీయ వ్యవస్థ పద్ధతిలో మార్పులు లేకుండా మారుతున్న పరిసరాలకు అనుసరణీయత ఉండాల్సిన అవసరాన్ని ఆల్మండ్ వివరించాడు. ఈ విధమైన కర్తవ్యం, రాజకీయ సామాజికరణ, భర్తీలతో సంబంధం ఉంటుంది. రాజకీయ సామాజికరణ, భర్తీలను గురించి ఇంతకు ముందే తెలుసుకున్నాం. రాజకీయ సంస్కృతుల నిర్వహణ, మార్పుల ద్వారా రాజకీయ వ్యవస్థ వ్యక్తులను రాజకీయ సంస్కృతికి లోబడి ఉండేటట్లు చేస్తుంది. రాజకీయ భర్తీ విషయంలో కూడా నిర్వహణ, అనుసరణీయతల ప్రాధాన్యముంటుంది.

6.18 విమర్శ:

తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో ఆల్మండ్ నిర్మితులు - విధుల విశ్లేషణ ఒక ప్రత్యేకతను సంతరించుకొంది. దీని ప్రాధాన్యాన్నికింది విధంగా వివరించవచ్చు. ఒక వ్యవస్థలోని భాగాలను అధ్యయనం చేయడానికి సంపూర్ణ వ్యవస్త స్వరూపం కూడా,తెలుసుకోవాల్సి ఉంటుందని, వ్యవస్థను గురించి తెలియని నాడు భాగాలను గురించి తెలుసుకోవడం సాధ్యం కాదన్నది ఈ విశ్లేషణ యొక్క మూల సూత్రం. రాజకీయ వ్యవస్థలో వివిధ నిర్మితులు తమ తమ కర్తవ్యాలను నిర్వహించాల్సి ఉంటుందని, నిర్మితుల కర్తవ్య నిర్వహణకు అర్థం చేసుకోడానికి రాజకీయ వ్యవస్థ స్వరూపాన్ని గ్రహించాల్సి ఉంటుంది. ఈ విశ్లేషణ విధానాన్ని సమర్థించే వారు తులనాత్మక రాజకీయాల పరిశీలనకు ఇది ఒక ముఖ్య సాధనంగా పని చేస్తుందని, దీనికి కారణం ఇందులోని స్పష్టమైన సూత్రీకరణ (explicit formulation) అని అంటారు.

వివిధ వ్యవస్థలలోని రాజకీయ సంస్కృతులను తులనాత్మకంగా అధ్యయనం చేయడానికి కూడా నిర్మితులు - విధుల విశ్లేషణ తోడ్పడుతుంది. అయితే పశ్చిమ రాజ్యాలలోని ప్రజాస్వామ్యాల లక్షణాలను ఆధునిక రాజకీయ వ్యవస్థల లక్షణాలుగా ఆల్మండ్ పరిగణిస్తాడు. ఇతడి అభిప్రాయంలో అభివృద్ధి చెందుతున్న వ్యవస్థల లక్షణాలకు,

పశ్చిమ ప్రజాస్వామ్య లక్షణాలకు భేదం ఉంది, కొంత సామ్యం కూడా ఉంది. ఉదాహరణకు, అభివృద్ధి చెందుతున్న వ్యవస్థలలో రాజకీయ పార్టీలు అమెరికా, బ్రిటన్‌లలోని పార్టీల కర్తవ్యాల ను పోలిన కర్తవ్యాలను నిర్వహిస్తాయి.

నిర్మితులు - విధుల విశ్లేషణ, రాజకీయ వ్యవస్థల నిర్వహణ, కొనసాగడం వంటి విషయాలలో వ్యవస్థ శక్తియుక్తులకు ప్రాధాన్యమిస్తుంది. వ్యవస్థ అనుసరించాల్సిన విలువలు, సాధించాల్సిన గమ్యాల, విబద్ధతలు (commitments) విషయాలలో బహుజన సమ్మతి ఉంటుందని ఈ విశ్లేషణను సమర్థించేవారు భావిస్తారు. అందువల్ల జనసమ్మతిపై ఆధారపడిన రాజకీయాలున్న వ్యవస్థలను గురించి అధ్యయనం చేయడానికి ఈ పద్ధతిని వినియోగిస్తుంది అని వీరంటారు.

నిర్మితులు - విధుల విశ్లేషకులు రాజనీతి శాస్త్రంలో నూతన పదజాలాన్ని ప్రవేశపెట్టారు. దీని ద్వారా రాజనీతి శాస్త్రాన్ని సుసంపన్నం చేశారని చెప్పవచ్చు.

పైన పేర్కొన్న అంశాలు ఆల్మండ్ సిద్ధాంతంలోని సుగుణాలు. ఈ సిద్ధాంతంలో అనేక లోపాలున్నాయని కొందరు శాస్త్రజ్ఞులు అభిప్రాయపడ్డారు. మానవ శాస్త్రవేత్త ఐ.సి. జార్వీ (I.C. Jarvies) అభిప్రాయంలో ఈ విశ్లేషణలూ వివరణాత్మక శక్తి లోపించింది. ఆర్థిక శాస్త్రవేత్త షెర్మన్ రాయ్‌క్రుప్ (Sherman roy Krupp) అభిప్రాయంలో వ్యవస్థ నిర్వహణలూ ఆల్మండ్ సూచించిన 'సమతౌల్యం' సమన్యలకు దారితీస్తుంది. వ్యవస్థయొక్క సంయోజనశక్తిని (Cohesiveness) మరింత పెద్దదిగా చేసి చెప్పడం జరిగిందని ఇతడు వాదిస్తాడు. వ్యవస్థలూ సంభవిస్తున్న సంఘటనలను వ్యవస్థలో ఉండాల్సిన సంఘటనలను వ్యవస్థలో ఉండాల్సిన సంఘటనలుగా పరిగణించడంతో కొంత అవ్యవస్థస్థితి కూడా కనిపిస్తుందని ఇతడంటాడు. డాన్‌మార్టిన్‌డేల్ (Don Mratindale) అనే సాంఘికశాస్త్రవేత్త ఈ విశ్లేషణలో నాలుగు ముఖ్యమైన లోపాలున్నాయంటాడు. అవి :

1. సంప్రదాయ సిద్ధాంతపరమైన సాక్షిక దృష్టి (conservative idealogical bias), యథాపూర్వస్థితికి (status quo) ప్రాధాన్యత

2. అస్పష్టమైన విశ్లేషణ పద్ధతి (lack of methodological clarity).

3. సామాజిక జీవనంలో వివృతవ్యవస్థ (closed system) యొక్క పాత్రకు ఎక్కువ ప్రాముఖ్యం

4. సాంఘికమైన మార్పును గురించి పరిశీలించకపోవడం.

హాంపీల్ (Hampel) అభిప్రాయంలో ఈ విశ్లేషణలో తార్కిక లక్షణం లేదు. ఆల్మండ్ సిద్ధాంతాన్ని స్పీరో (Spiro) జాతి కేంద్రంకు (ethno-centric) అన్నాడు. నిర్మితులు-విధుల విశ్లేణ రాజకీయవ్యవస్థలోని స్థిరసంబంధాలను గణనలోకి తీసుకొన్నాడే కాని సంబంధాల గతిశీల స్వభావాన్ని గుర్తించలేదు. అందువల్ల ఈ సిద్ధాంతం మార్పుకు వ్యతిరేకమన్న విమర్శను ఎదుర్కోవలసి వచ్చింది. అంతేకాకుండా ఈసిద్ధాంతం ప్రస్తుత విషయాలతో సరిపెట్టుకొన్నదేకాని భవిష్యత్తులో సంభవించగల విషయాలనుగురించి ఆలోచించలేదు.

కమ్యూనిస్టు దేశాలలో రాజకీయాభివృద్ధిని అధ్యయనం చేయడానికి ఆల్మండ్ సిద్ధాంతం తోడ్పడదన్న విమర్శ ఉంది. ఇతడి అభిప్రాయంలో కమ్యూనిస్టు రష్యాకు ఆధునిక వ్యవస్థగా పరిగణించటానికి వీలులేదు. ఈవ్యవస్థలో ప్రత్యేకీకరణలో పనిచేసే నియమావళి రూపకల్పన, నియమావళి అనుసరణ, నియమావళి న్యాయనిర్ణయ నిర్మితులు లేనందువల్ల దీనిని సంప్రదాయ వ్యవస్థగా పరిగణించాలి.

సంప్రదాయబద్ధ సమాజాలను ఆల్మండ్ సూచించిన విధంగా పరిశీలించడానికి వీలుపడదు. అంతేకాకుండా మార్క్స్ సిద్ధాంతానికీ ఆల్మండ్ సిద్ధాంతానికీ పొత్తు, కుదరదు. ఆల్మండ్ సిద్ధాంతాన్ని "thron in the Marxist flesh" అంటారు. వర్గపోరాటం మార్క్సిస్టు సిద్ధాంతానికి ఆధారం అయితే వర్గపోరాటానికి నిర్మితులు-విధుల సిద్ధాంతంలో స్థానం లేదు. సంఘర్షణకు బదులు బహుజన సమ్మతి ఆల్మండ్‌కు ఆలంబన.

ఆల్మండ్ సిద్ధాంతం, ముందు వివరించినట్టు, యదాతథస్థితికి ప్రాధాన్యమిస్తుంది. ఒకవేళ మార్పును అంగీకరించినప్పటికీ అది క్రమంగా సంభవించే మార్పు మాత్రమే. అందువల్ల అభివృద్ధి చెందుతున్న దేశాల

ఆల్మండ్ ప్రతిపాదించిన రాజకీయ వ్యవస్థ, విధుల స్థాయిలను సూచించే రేఖా చిత్రం

కోర్కెలు (Demands)	ప్రయోజనాల వ్యక్తీకరణ (Interest articulation)	రాజకీయ వ్యవస్థ The Plolitical System	నిర్వహణ (Maintenance)	పరిసరాలు	నిర్ణయాలు, ఉత్పాదక విధులు, చర్యలు	అదుపు సామర్థ్యం (Regulative Capability)
ఉత్పాదక విధులు (Inputs)	ప్రయోజనాల సమీకరణ (Interest aggregation)	అనుకూలనం (Adaptation)		నియమావళికల్పన (Rule Making)		వెలికితీసేసామర్థ్యం (Extractive Capability)
ఆలంబనలు (Supports)	రాజకీయ ప్రసారం (Political Communications)			నియమావళి నిర్వహణ (Rule application)		లాంఛనాల సామర్థ్యం (Symbolic Capability)
				నియమావళి - న్యాయ నిర్ణయం (Rule adjidication)		పంపిణీ సామర్థ్యం (Distributive Capability) స్పందనా సామర్థ్యం (Response Capability)
				పరిసరాలు		

Taken from theories of Comperative Politics : The Search for a Paradigm, Chilcote, Ronald H, Westview Press, Boulder, U.S.A., 1981, p. 167.

అధ్యయనానికి ఈ సిద్ధాంతం సరిపడదు. ఇటువంటి దేశాలు సమాజజీవనంలో అన్నిరంగాలలోనూ సాధ్యమైనంత త్వరితగతిన మార్పులు సాధించడం లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తాయి.

- డా॥ పి. మాణిక్యాంబ

6.19 చదువదగిన పుస్తకాలు

Verma, s.p.	:	*Modern political Theory*
Apter, David	:	*Introduction to political Analysis*
Charlesworth, james	:	*Contemporary, political analysis*
Davies and lewis	:	*Models of political systems*
Almond and powell	:	*Comparative politics : A developmental approach*

6.20 నమూనా పరీక్షాప్రశ్నలు

ఈకిందివానికి వ్యాసరూపంలో జవాబులు రాయండి.

1. నిర్మితులు-విధుల విశ్లేషణ అనగానేమి. తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో దానిపాత్రను విశ్లేషింపుము.
2. నిర్మితులు-విధుల విశ్లేషణను సవిమర్శకంగా పరిశీలింపుము
3. నిర్మితులు-విధుల విశ్లేషణలో సామర్థ్యతా పాత్రను వివరింపుము.

...

భాగం – 7 రాజకీయ వ్యవస్థ – ఆధారాలు

విషయక్రమం

7.1 లక్ష్యాలు
7.2 పరిచయం
7.3 రాజకీయవ్యవస్థ – అర్థం, స్వభావం
7.4.0 రాజకీయ వ్యవస్థ – మూలాధారాలు
  7.4.1 భూభాగసమూహం
  7.4.2 బలప్రయోగం
  7.4.3 ఉపవ్యవస్థలు
  7.4.4 మూలకాలు
  7.4.5 అంగాలు
  7.4.6 ప్రమాణాలు
  7.4.7 నిర్మితులు
  7.4.8 విధులు
7.5 రాజకీయవ్యవస్థభావన – విమర్శనాత్మక పరిశీలన
7.6 చదవదగిన పుస్తకాలు
7.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

7.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు – రాజకీయ వ్యవస్థ అర్థాన్ని, స్వభావాన్ని, దాని మూలాధారాలను, విధులను, దాన్ని గురించిన విమర్శను వివరించ గలుగుతారు.

7.2 పరిచయం

రాజనీతిశాస్త్రం ప్రభుత్వ వ్యవస్థల అధ్యయనం నుంచి రాజకీయ వ్యవస్థల అధ్యయనంగా మారటానికి కారణం లాంఛనప్రాయమైన (formal) సంస్థల అధ్యయనం కన్నా యథార్థరాజకీయ ప్రక్రియల అధ్యయనానికి ఎక్కువ ప్రాధాన్యం లభించటమే. రాజనీతి శాస్త్రాధ్యయనంలో అంతర్గతంగా సంభవించిన మార్పుల వల్ల, ప్రభుత్వేతర వ్యవస్థలు రాజకీయ వ్యవస్థలపై ప్రభావం చూపటాన్ని ఆధునిక రాజనీతి శాస్త్రవేత్తలు గమనించటంవల్ల రాజనీతి శాస్త్రంలో ఈ ఒరవడి ప్రారంభమైంది. తులనాత్మక రాజకీయ అధ్యయనం చేసేవారికి లాంఛనప్రాయమైన సంస్థల అధ్యయనం సరియైనదిగా తోచలేదు. వారి దృష్టిలో అలాంటి అధ్యయనం తులనాత్మక రాజకీయ పరిజ్ఞానాన్ని సాధించటానికి దోహదపడదు. న్యాయవ్యవస్థలు, శాసననిర్మాణ వ్యవస్థలు, మంత్రివర్గాలులాంటి నిర్మితుల్ని (structures) అధ్యయనం చేసి ఒక రాజకీయ వ్యవస్థా స్వరూపాన్ని తెలుసుకొనే వీలున్నప్పటికీ రాజకీయ వ్యవస్థా సారాన్ని తెలుసుకొనేందుకు ఈ అధ్యయనం నిరాశాజనకంగానూ, సత్యదూరంగానూ కనిపిస్తుందని డేవిడ్ ఈస్టన్, ఆల్‌మండ్, కార్ల్ డయిష్, కాప్లాన్ వంటి రాజకీయ సిద్ధాంతవేత్తలు భావిస్తున్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా రాజనీతి శాస్త్రజ్ఞులు అన్ని దేశాల్లోనూ కొన్ని సంస్థల ద్వారా నిర్వహించబడే కొన్ని భావాత్మక ప్రక్రియల్ని, విధుల్ని శోధించి, వాటిని రాజకీయ అధ్యయనానికి, పరిశోధనకు అనుకూలంగా ఉపయోగిస్తున్నారు. చాలా దేశాల్లో ఈ సంస్థలు, వాటి పేర్లూ ఒకే రకంగా ఉండవలసిన అవసరంలేదు.

7.3 రాజకీయ వ్యవస్థ – అర్థం, స్వభావం

'రాజకీయవ్యవస్థ' అనే మాట అనుభవికదృక్కోణం (empirical dimension) నుంచి అంతర శాస్త్రీయ దృక్పథం (inter disciplinary approach) ద్వారా జరిపే రాజకీయాధ్యయనాన్ని సూచిస్తుంది. ఆ విధంగా 'రాజకీయ వ్యవస్థ' 'అంతస్సంబంధాలుగల రాజకీయ, తత్సంబంధితాంశాల అమర్పు'గా గోచరిస్తుంది. ఈ తత్సంబంధితాంశాలు రాజకీయాంశాలకు భిన్నమైనవిగా కనబడతాయిగాని వీటికికూడా రాజకీయాంశాలపై-వెంటనేకాకపోయినా తప్పనిసరిగా ప్రభావం ఉంటుంది. నిజానికి ఇదొక అమూర్త భావాలసెట్టు. ఈ అమూర్తభావాల అమరిక ఏదో ఒక ప్రత్యేక రాజకీయ వ్యవస్థ పనిచేసే తీరును తెలుసుకొనేందుకు మాత్రమే కాకుండా ప్రపంచంలో ఏదేశ రాజకీయ వ్యవస్థ గురించయినా తెలుసుకొనేందుకు దోహదపడుతుంది. విభిన్నమైన రాజకీయ వ్యవస్థల అధ్యయనానికి ఉపయోగపడే అంగీకార యోగ్యమైన, విశాలమైన సైద్ధాంతిక సూత్రాలను ప్రతిపాదించటమే రాజకీయ వ్యవస్థాసిద్ధాంతం లక్ష్యం. ఒక్క మాటలో చెప్పాలంటే మానవప్రవర్తనకు సంబంధించి విశాలమైన, వివరణాత్మకమైన సైద్ధాంతిక సూత్రాలను ఎవరైనా ఏ రాజకీయ వ్యవస్థను గురించి తెలుసుకోవాలన్నా ఉపయోగపడే విధంగా విశాలమైన, వివరణాత్మకమైన మానవప్రవర్తనా సూత్రాలను సైద్ధాంతికంగా ప్రతిపాదించటమే దీని లక్ష్యం.

సామాజిక ప్రవర్తనను గురించి రాజకీయ శాస్త్రజ్ఞులు ఒక సమగ్రమైన దృక్పథాన్ని కాంక్షించే క్రమంలోనే 'రాజకీయ వ్యవస్థ' అనే భావన ఆవిర్భవించింది. సమ్యగ్దృష్టితో పరిశీలిస్తే 'రాజకీయవ్యవస్థ' అనేది సమాజంలో కొన్ని నిర్దిష్టమైన చర్యల్ని (Function) నిర్వహించేందుకు ఏర్పడ్డ ఒక నిర్మితి (Structure). మరొక విధంగా చెప్పాలంటే న్యాయబద్ధమైన విధాన నిర్ణయాలు చేయటమే రాజకీయ వ్యవస్థ నిర్వహించే నిర్దిష్టమైన చర్య.

'రాజకీయ వ్యవస్థ' అనే భావన ఎంతో ప్రాచుర్యం పొందింది. దీనికి కారణం సమాజంలో ఎక్కడ, ఏ ప్రాంతంలో సంభవించాయనే నియమం లేకుండా రాజకీయ చర్యలన్నిటిపై తన దృష్టిని సారించటమేనని ఆల్మండ్, పావెల్ భావించారు. వీరిద్దరూ రాజకీయ వ్యవస్థను నిర్వచిస్తూ ఇలా అన్నారు : 'న్యాయబద్ధమైన బలప్రయోగానికి లోబడే పరస్పర చర్యలన్నీ కూడి వుంటుంది రాజకీయ వ్యవస్థ. అది కేవలం శాసనసభలు, న్యాయస్థానాలు పాలనా సంస్థల సమ్మేళనం మాత్రమే కాదు ; అందులో (రాజకీయవ్యవస్థలో) రాజకీయగుణగణాల్ని ప్రదర్శించే అన్ని నిర్మితులూ భాగమే. అవి రక్తసంబంధాలు (Kinship), కులసమూహాలు, అనియతి చర్యలైన హత్యలు, దొమ్మీలు, సమ్మెలూ కావచ్చు; ఇంకా లాంఛనప్రాయవ్యవస్థలైన రాజకీయ పార్టీలు, ప్రచారసాధనాలు, ప్రభావవర్గాలు కావచ్చు'.

'రాజకీయ వ్యవస్థ' అనేది రాజకీయ, వ్యవస్థ అనే రెండు మాటల పదబంధం. ముందు రాజకీయం అంటే ఏమిటో తెలుసుకొందాం. మాక్స్‌వెబర్ రాజ్యాన్ని గురించి మాట్లాడుతూ 'ఒక నిర్ణీత భూభాగంపై నివసించే జనసమూహంపై న్యాయబద్ధమైన భౌతిక బలప్రయోగాన్ని నెరపేందుకు గుత్తాధిపత్యం కలిగిందే రాజ్యం" అన్నారు. దీన్నే విపులీకరిస్తూ వెబర్ బలాన్ని ప్రదర్శించే హక్కు ఇతర సంస్థలకూ, వ్యక్తులకూ కూడా ఉండవచ్చునీ అయితే అలాంటి హక్కురాజ్యం విధించే పరిమితులకు లోబడి ఉంటుందని పేర్కొన్నారు. ఇంకా కొందరు సామాజిక, రాజకీయ శాస్త్రజ్ఞులు వారి వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు. డేవిడ్ ఈస్టన్ 'తన విధానాల ద్వారా మూల్యాలను లేదా విలువలను సాధికారికంగా కేటాయింపు జరిపేదే రాజకీయ వ్యవస్థ అని కేటాయింపులు సాధికారమైనవి కాబట్టి సమాజం మొత్తంపై విధిగా అమలవుతాయని పేర్కొన్నారు. విధానాలు అవశ్యంగా సాధికారికమైనవనే భావం వస్తుంది. కాబట్టి అందరూ తప్పకుండా వాటికి బద్ధులు కావలసి ఉంటుంది.

రాజకీయాన్ని శక్తి (power) కి సంబంధించిన అంశంగా భావిస్తూ హెరాల్డ్ లాస్వెల్, కాప్లాన్‌లు ప్రభావితుల్ని చేసేందుకు ఉపయోగించే ప్రత్యేకమైన అధికారపు చెలాయింపే శక్తి అనీ, బలప్రయోగంతో గానీ, బలప్రయోగం చేయడం జరుగుతుందని బెదిరించిగానీ, ఇతరుల విధానాలను, ప్రవర్తనలను విపరీతమైన హరింపుకు లోనుచేసేందుకు అది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఈ నిర్వచనాల్లో కొన్ని లోపాలు ఉన్నాయి. ఉదాహరణకు, ప్రతిపాదించిన 'న్యాయబద్ధ బలప్రయోగం' ఆదిమ సమాజాలకు, అవిభాజ్య రాజకీయ సమూహాలకు (Un-differentiated political communities) గుత్తాధికారంలేని కారణంగా సాధ్యం కాకపోవచ్చు. లాస్వెల్, కాప్లాన్ల నిర్వచనంలోని 'విపరీతమైన హరింపు' ఒకరాజకీయ వ్యవస్థకు

మరొక రాజకీయ వ్యవస్థకు ఉన్న భేదాన్ని తెలుసుకోవటానికి దోహదపడదు. అలాగే ఈస్టన్ ప్రతిపాదించే 'మూల్యాల లేదా విలువల సాధికారిక కేటాయింపు' రాజకీయ వ్యవస్థకు, చర్చి, వ్యాపారసంస్థలు మొదలైన వ్యవస్థలకు గల బేధాన్ని తెలుసుకొనేందుకు ఉపయోగకారికాదు. వెబర్, ఈస్టన్‌ల నిర్వచనాలు పరిశీలించాక రాజకీయాన్ని గురించి పేర్కొంటూ ఆల్మండ్ 'ఆధునిక తులవాత్మక రాజకీయాధ్యయనం ఆదిమ సమాజాల్ని, సాంప్రదాయక సమాజాల్ని - అవి రాజకీయ సమూహాలే అయినప్పటికీ - వెబర్ భావించినట్లు రాజ్యాలుగా పరిగణించదనీ, అలాగే విప్లవాల్లాంటి వివరీతమైన మార్పులకు లోనవుతున్న వ్యవల్లో ఈస్టన్లు రాజకీయాన్ని న్యాయ బలప్రయోగంపై ఎవరికీ గుత్తాధిపత్యం కనిపించదనీ అన్నారు. అయినప్పటికీ వెబర్, ఈస్టన్లు రాజకీయాన్ని గురించి వెలిబుచ్చిన భావనలు సత్యదూరం కావు.

ఇప్పుడు 'రాజకీయ వ్యవస్థ' లోని వ్యవస్థను గురించి తెలుసుకొందాం. వ్యవస్థా విశ్లేషణా సిద్ధాంతం (System Analysis) సిద్ధాంతం ప్రకారం కింది ప్రమాణాలననుసరించి ఏది వ్యవస్థో తెలుసుకోవచ్చు.

1. వ్యవస్థను నిర్దిష్టమైన మూలకాల లేదా అంశాల అమరిక (set of elements) గా గమనించవచ్చు.

2. ఈ మూలకాల మధ్య - కనీసం కొన్ని మూలకాల మధ్య నైనా - గుర్తించదగిన సంబంధాలను గమనించవచ్చు

3. కొన్ని సంబంధాలు మరికొన్ని ఇతర సంబంధాలకు చోటు ఇస్తాయి. కాలాంశం దృష్ట్యా దీనిలో (వ్యవస్థలో) చలనశీలతను చూడవచ్చు.

4. ఒకానొక సమయంలో సంక్లిష్టమైన కొన్ని సంబంధాలు అటు తరువాత మరిన్ని సంక్లిష్టమైన సంబంధాలకు దారి తీయవచ్చు. అందుకే చలనశీలమైన వ్యవస్థాసిద్ధాంతం వర్తమాన స్థితికి భిన్నమైన మరెన్నో స్థితులకు భవిష్యత్తులో అవకాశం ఉంటుందని నిరూపణ చూపుతుంది.

ఆల్మండ్ ఉద్దేశంలో ఒక వ్యవస్థలో కనిపించేవి (a) పరస్పరాధారిత భాగాలు లేదా వివిధ భాగాల మధ్యగల పరస్పర ఆధారిత సంబంధం (interdependence of parts) (b) వీటికి బాహ్య పరిసర ప్రపంచానికీ మధ్య ఏదో ఒకరకమైన సరిహద్దు (boundary) (c) వ్యవస్థ సమగ్రతను ప్రదర్శిస్తుంది. ముఖ్యంగా రాజకీయ వ్యవస్థలో సమగ్రతకు నిర్ణయ ప్రమాణాలు (criteria) పరస్పర చర్యలే. వీటినే ఉత్పాదక, ఉత్పాదితలు (inputs and outputs) అంటాం. ఇవే న్యాయబద్ధ బల ప్రయోగానికి లేదా బల ప్రయోగంలో బెదిరింపుకు దారి తీస్తాయి. "పరస్పరాధారతం" (interdependence) అంటే అర్థం ఒక ఉపవ్యవస్థలో సంభవించే పరస్పర చర్యలు (interaction) ఇతర ఉప వ్యవస్థల్లో మార్పుల్ని తేవటమే.

చివరిగా రాజకీయ వ్యవస్థలో 'సరిహద్దు' అంటే అర్థం ఇతర వ్యవస్థల సరిహద్దు అంతమై రాజకీయ వ్యవస్థ ప్రారంభం అయ్యే రేఖ. కాబట్టి రాజకీయ వ్యవస్థ అనే పదబంధంలో 'రాజకీయం' అనే మాట సమాజంలో కొన్ని ప్రత్యేకమైన, నిర్దిష్టమైన చర్యల్ని, వాటికి ఇతర చర్యలతో గల సంబంధాన్ని సూచిస్తుంది. అలాగే వ్యవస్థ అనే మాటకు అర్థం కొన్ని ప్రత్యేక గుణాలున్న భౌతికాంశాల అమరికకు ఈ చర్యల్ని ఆపాదించటమే.

ఇప్పుడు తులనాత్మక రాజకీయాధ్యయనంలో రాజకీయ వ్యవస్థను ఎలా నిర్వచిస్తున్నారో చూద్దాం. బీర్, ఉలామ్ అనే వారు రాజకీయ వ్యవస్థను "సమాజంలో కొన్ని నిర్దిష్టమైన విధుల్ని నిర్వహించే ఒక నిర్మితి" అని నిర్వచించారు. విధాన నిర్ణయాల రూపకల్పనకు అవసరమైన ఏర్పాట్లు కూడా ఇందులో భాగమే. అలాంటి నిర్ణయాలకు న్యాయ సమ్మతి (legitimacy) ఉంటుంది. ఎందుకంటే ప్రజలు తమ ఉద్దేశంలో ఏ అధికారాలు, ప్రయోజనాలు న్యాయసమ్మతమని విశ్వసిస్తూ వుంటారో అని విధాన నిర్ణయాల్లో ప్రస్ఫుటిస్తూ వుంటాయి. కాబట్టి వీటిని న్యాయసమ్మతమైనవిగానే వారు భావిస్తారు, అంగీకరిస్తారు. రాజకీయ వ్యవస్థ కొన్ని నిర్దిష్టమైన ఉత్పాదితాల్ని సమాజం కోసం సృష్టిస్తుంది. ఇవే న్యాయ సమ్మతమైనవీ, క్రమబద్ధమైనవీనూ కావచ్చు; లేదా సాధారణమైనవీ, అస్పష్టమైనవీ కావచ్చు. వాటిని చాలా మంది లేదా కొద్ది మంది ఐచ్ఛికంగానో లేదా అయిష్టంగానో ఆమోదిస్తారు. వాటిని విధాన నిర్ణయాలని పిలవటంలోని ఉద్దేశం అవి సమాజాన్ని అనివార్యంగా ప్రభావితం చేస్తాయని చెప్పటమే; వాటి న్యాయ సమ్మతి లక్షణాన్ని లేదా గుణాన్ని గుర్తించటమంటే వాటి రాజకీయ గుణాన్ని గుర్తించటమే. రాజకీయ వ్యవస్థ ద్వారానే సామాజిక ధ్యేయాలన్నీ నిర్వచించబడి న్యాయసమ్మతమైన విధాన నిర్ణయాల ద్వారా సమాజాన్ని నిర్వహించడం జరుగుతుంది. ఇదే స్థూలంగా రాజకీయ వ్యవస్థ చేసే పని.

ఆల్మండ్ మాటల్లో రాజకీయ వ్యవస్థ : (criteria)

A system of interacton to be found in all independent societies which performs the functions of integration and adaptation by means of employment or threat of employment of more or less legitimate physical compulsion. The political system is the legitimate., or der - maintaining or transforming system in the society ... legitmate force is the thread that runs through the inputs and outputs of the political system, giving it its special quality and salience and its coherence as a system."

ఈ సిద్ధాంతాన్ని తులనాత్మక రాజనీతి శాస్త్ర అధ్యయనంలో ఇప్పుడు విరివిగా వాడుతున్నారు. పరిమితమైన రాజకీయ సంస్థల (ప్రభుత్వాలు, శాసనసభలు, న్యాయశాఖ మొదలైనవి) అధ్యయనం నుంచి ఒక సమగ్రమైన, సంపూర్ణమైన రాజకీయ జీవనగతిని అధ్యయనం చేసేందుకు రాజకీయ వ్యవస్థా సిద్ధాంతం మనకు దోహదపడుతుందని భావించడం జరుగుతున్నది. ఎందుకంటే 'రాజకీయ వ్యవస్థ' అనే భావన చాలా విస్తృతమైన భావన. ప్రభుత్వ మనేది అందులో కేవలం ఒక భాగం మాత్రమే. రాజకీయ వ్యవస్థలో లాంఛనప్రాయమైన ప్రభుత్వ వ్యవస్థలే కాక సాధికారిక నిర్ణయీకరణంలో ప్రభావం చూపే చారిత్రకాంశాలు, భౌగోళికాంశాలు, సామాజిక, ఆర్థిక వ్యవస్థలు, అవి పనిచేసే తీరు, భావజాలాలు (ideologies), నాయకత్వం మొదలైన లాంఛనేతర అంశాలు కూడా భాగమవుతాయి. ఒక విధంగా చెప్పాలంటే రాజకీయ ప్రక్రియలో ప్రభావం చూపే ఏ అంశాన్నైనా ఆ రాజకీయ వ్యవస్థ తనలో భాగంగానే చేసుకొంటుంది. అందుకే రాజకీయ ప్రక్రియను సమగ్రంగా అర్థంచేసుకొనే వీలుంటుంది. ఉదా: 1970లలో సోవియట్ యూనియన్‌పశ్చిమదేశాలతో సహకరించేందుకు ఎందుకు అంగీకరించిందో తెలుసుకవాలంటేకేవలం లాంఛనప్రాయమైన సోవియట్ ప్రభుత్వ వ్యవస్థలను అధ్యయనం చేస్తే సరిపోదు. దీన్ని సమగ్రంగా అర్థంచేసుకోవాలంటే ఆయుధ పరిశ్రమ వ్యతిరేకత, అంతర్జాతీయప్రాయ సరళిలాంటి ప్రభుత్వేతర అంశాలను కూడా అధ్యయనం చేయవలసి ఉంటుంది. సోవియట్ యూనియనే కాదు, ఏ దేశాల రాజకీయ ప్రక్రియనైనా ఈ పద్ధతి ద్వారా సమగ్రంగా అధ్యయనం చేయవచ్చు.

7.1 లక్ష్యాలు

రాజకీయవ్యవస్థకు కొన్ని మూలాధారాలు వున్నాయి. రాజకీయ వ్యవస్థ ఒక ప్రత్యేకమైన వ్యవస్థ. దానికి లోబడి ఉండే ప్రజానీకపు ఆశలు, ఆశయాలను, ఇంకా చాలవరకు వారి ప్రవర్తనను, అలవాట్లను రాజకీయవ్యవస్థ సమన్వయం చేస్తుంది. అందుకు అది శిక్షల, పారితోషికాల లేదా బహుమానాల వ్యవస్థను (A systems of rewards and punishments) ప్రతిపాదిస్తుంది. శిక్షలకన్నా బహుమానాలకే ప్రజలు ఎక్కువగా ఆర్పింపబడతారు. కాబట్టి తన నియమనిబంధనలను పాటించే ప్రజలకు బహుమానాలనే ఎక్కువగా ఇస్తుంది రాజకీయ వ్యవస్థ. దీన్ని ఏ మేరకు తాను నిర్వహించగలదో ఆ మేరకు అది దృఢంగా ఉంటుంది.

7.4.1 భూభాగ సమూహం

రాజకీయ వ్యవస్థకు మొదటి ఆధారం భూభాగ సమూహం (territorial community) ఇందులో భూభాగమనే అంశం, నరవర్గ సమూహం (ethnic community) అనే అంశం ఉన్నాయి. నరవర్గసమూహం అంటే సమమైన రాజకీయ ప్రవర్తనా విధానాలు, పౌరవిధేయతలు ఉన్న ప్రజా సమూహం అని అర్థం.

7.4.2 బలప్రయోగం

రాజకీయ వ్యవస్థకు రెండో ఆధారం బలప్రయోగం (Force) పూర్వపు రాజకీయ వ్యవస్థల వలె కాక ఆధునిక రాజకీయ వ్యవస్థ ఎన్నో కార్యక్రమాలను నిర్వహించవలసిన దృష్ట్యా ఎంతో బలోపేతమైన వ్యవస్థలుగా రూపొందుతున్నాయి. దీని ఫలితంగా ఆధునిక రాజకీయ వ్యవస్థ స్వయంచోదక శక్తిని పెంపొందించుకొని స్వయం ప్రతిపత్తిని (Antonomy) సాధించుకోవలసిన అవసరమున్నదని కార్ల్‌డయిష్ అభిప్రాయపడ్డారు. బలప్రయోగం ఉండటంలో రాజకీయవ్యవస్థకు గుత్తాధిపత్యం ఉంటుంది. మత, ఆర్థిక వ్యవస్థల్లాంటివి కూడా బలప్రయోగం చేసి సభ్యుల ప్రవర్తనను నియత్రించగలవు కాని రాజకీయ వ్యవస్థకు లోబడి మాత్రమే అవి అలా చేయగలవు.

7.4.3 ఉపవ్యవస్థలు

'వ్యవస్థ' అని మనం వ్యవహరిస్తున్నది, మరో బృహత్తరమైన వ్యవస్థలో ఒక భాగమై దాని ఉపవ్యవస్థగా

కనిపించవచ్చు. ఉదాహరణకు రవాణా వ్యవస్థలో రైలు అనేది ఒక భాగం మాత్రమే. అది రవాణా వ్యవవస్థలో ఉన్నరైళ్ళు, బస్సులు, ఓడలు, విమానాలు, కార్లు, సైకిళ్ళు తదితర ఉపవ్యవస్థల్లో ఒకటి మాత్రమే. అలాగే శరీర వ్యవస్థలో జీర్ణకోశమనేది ఒక ఉప వ్యవస్థ మాత్రమే. సామాజిక వ్యవస్థలో కనిపించే ఆర్థిక, సాంస్కృతిక, మత, కులవ్యవస్థల్లాగే రాజకీయ వ్యవస్థ కూడా సామాజిక వ్యవస్థ మాత్రమే. అందుకే పరస్పర సంబంధితాలైన ఎన్నో ఉపవ్యవస్థలతో కూడిన ఒక సమగ్రమైన అంగాంగి సమాహారం (a composite and organic whole).

7.4.4 మూలకాలు

ఇలా చూసినప్పుడు రాజకీయ వ్యవస్థ నాలుగు ముఖ్యమైన మూలకాల (elements) అమరిక (composition) గా మనకు గోచరిస్తుంది. అవి : (a) పర్యావరణం (b) ప్రసరణ సంబంధం (c) విధాన నిర్ణయీకరణ (d) విధాన ఉత్పాదితాలు (policy outputs), మళ్లీ వీటిలో ప్రతిఒక్కటీ అంతస్సంబంధాలు కలిగిన సంక్లిష్టమైన వ్యవస్థే. కార్యనిర్వహణ దృష్ట్యా ఈ మూలకాలు అంతస్సంబంధం (interrelationship) తో పనిచేసి ఉత్పాదకాలను (inputs), ఉత్పాదితాలు (outputs) గా మారుస్తాయి.

'పర్యావరణం' అంటే రాజకీయవ్యవస్థను ఆవరించి ఉండే పరిసరాలని అర్థం. అది జాతీయ, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, భౌగోళికాంశాలలో అనేక శక్తుల కూడికగా (power configuration) ఉంటుంది.

అనుసంధానప్రసరణ (linkage communication) ఎన్నో సంస్థలు, నిర్మితులు, ప్రక్రియలతో కూడిన అనుసంధాన వ్యవస్థగా సమాజాన్ని ప్రభుత్వంతో అనుసంధానం చేసి ఇరువైపులకు ప్రసరణ జరిగేట్లు మార్గాన్ని ఏర్పరుస్తుంది. ఇది రాజకీయ పార్టీలు, ప్రభావ, ప్రయోజనసంఘాలు (interest groups) తో కూడి ఉండి పర్యావరణంలో ఏర్పడే డిమాండ్లను, మద్దతుల్ని (supports) ఉత్పాదకాలుగా మార్చి విధాన నిర్ణయ వ్యవస్థకు అందిస్తుంది.

విధాన నిర్ణయ వ్యవస్థ ఎన్నో నిర్మితులు, ప్రక్రియలతోకూడిన క్షేత్రంగా పనిచేస్తుంది. ఇది అనుసంధానప్రసరణ ద్వారా ఏర్పడే డిమాండ్లను, మద్దతుల్ని విధాన ఉత్పాదితాలుగా మారుస్తుంది. ఈ విధానాలు రాజకీయవ్యవస్థలోని అన్ని భాగాలకోసం ఇంకా వ్యవస్థ మొత్తానికి విలువలను సృష్టించి, పెంపుచేసి, కేటాయింపు జరుపుతుంది. విధాన నిర్ణయ వ్యవస్థలోని నిర్మితులు ప్రక్రియలు పరస్పరచర్యలు జరుపుకొంటూ ఒకదాన్నొకటి ప్రభావితం చేసుకొంటాయి. విధాన నిర్ణయ వ్యవస్థ మొత్తంగా రాజకీయవ్యవస్థలోని ఇతర ఉపవ్యవస్థలతో పరస్పర చర్యలకు లోనవుతుంది. ఉత్పాదిక విధానాలు ఆర్థిక విధానాలు కావచ్చు సాంఘిక విధానాలో లేక సాంస్కృతిక విధానాలో కావచ్చు.

మనం పైన పేర్కొన్న నాలుగుభాగాలలోని మొదటి మూడు భాగాల్లో జరిగే పరస్పర చర్యల స్వరూపం వ్యవస్థ ఉత్పాదిత విధానాలు ఏ రకమైనవో తేల్చిచెబుతుంది. ఒకరకంగా ఉండే విధాన ఉత్పాదితాలు (Policy outputs) ఇతర విధానాలపై ప్రభావం చూపవచ్చు. విలువల్ని సృష్టించి, పెంపుచేసి, కేటాయింపులు జరిపే విధానాల ప్రభావం రాజకీయ వ్యవస్థ యొక్క పర్యావరణం మీద, అనుసంధానప్రసరణ మీదా, ప్రభుత్వ సంస్థలమీదా, నిర్మితులు, ప్రక్రియల మీదా పడవచ్చు.

7.4.5 అంగాలు

మోటారు వాహనం పనిచేయటానికి ఒక ఇంజను, చక్రాలు, స్టీరింగ్ మొదలైనవి అవసరమనే విషయం మనందరికీ తెలిసిందే. అలాగే రాజకీయ వ్యవస్థ పనిచేయాలంటే కాస్త హెచ్చు తగ్గుల్లోనైనా ఒకేరకమైన రాజకీయ సంస్కృతి, దేశ చరిత్రా సంప్రదాయాలు తెలిసిన ప్రజాసముదాయం అవసరం. వీరందరూ పౌరులుగానూ, పన్ను చెల్లింపుదారులు (taxpayers) గానూ, సైనికులుగానూ, ప్రభుత్వోద్యోగులుగానూ ఉండవచ్చు. అందరూ ఓటర్లుగానూ, ఉంటారు. రాజకీయచిహ్నాల ద్వారానో, సిద్ధాంతాలద్వారానో రాజకీయవ్యవస్థను గురించి వీరందరికీ తెలిసి ఉంటుంది. రాజ్యవ్యవస్థ పనిచేసే తీరు, అది ఎలా పన్నేస్తే (లేదా చేయకపోతే) బాగుంటుందనే అంశాలకు సంబంధించికూడా ప్రజాసమూహానికి చెప్పుకోదగ్గ పరిజ్ఞానముంటుంది. రాజకీయ వ్యవస్థకు ఇది మొదటి అంగం (component) లేదా భాగం.

రాజకీయ వ్యవస్థకు అనివార్యమైన రెండో అంగం కార్యనిర్వాహకుల వర్గం (A set of officials) రాజకీయ ప్రజా సమూహంలోని ప్రతి ఒక్కడూ వీరి నిర్ణయాలను నిర్వ్యంద్యంగా అంగీకరిస్తాడు. వీరే రాజకీయాధికారులు కూడా. వీరు లేకుండా రాజకీయ వ్యవస్థ లేదు.

రాజకీయవ్యవస్థకు తప్పనిసరియైన మూడో అంగం పరిపాలనా వ్యవస్థ (regime) పరిపాలనా వ్యవస్థ అంటే రాజ్యాంగ శాసన నియమాల చట్రమూ, రాజకీయ ప్రక్రియలూ, సంస్థాగత ప్రమాణాలు లేదా కట్టుబాట్లు మొదలైన మౌలికమైన విలువలతో కూడిన ఒక వ్యవస్థ. ఇవి ఒక విధంగానో లేక మరో విధంగానో రాజకీయ వ్యవస్థ నిర్వహణను నియంత్రణ చేస్తాయి.

రాజకీయ వ్యవస్థలో ఎల్లప్పుడూ కనిపించే నాలుగవ అంగం భూభాగం (ఐతే రాజకీయ వ్యవస్థను రాజ్యం (State) గా పొరపడరాదు). ఇది సంలగ్నత (cohesion) కలిగి నిర్వచించటానికి అనువైనదై ఉంటుంది. ఈ దృష్టితో చూస్తే U.S.A, ఫ్రాన్స్, ఇంగ్లండ్, ఇండియా ఇలా ఇంకా ఎన్నో ప్రపంచదేశాలు రాజకీయ వ్యవస్థలుగా కనబడతాయి. ఇవి రాజకీయ వ్యవస్థలే. ఐతే మనం నివసించే నగరాలు కూడా పట్టణ జనసముదాయం, స్థానిక ప్రభుత్వం, నగరశాసనాలు, పాలనా వ్యవస్థ, నిర్ణీత నగర భూభాగంతో కలిపి - రాజకీయ వ్యవస్థగా భావించవచ్చునా? తప్పకుండా భావించవచ్చు.

7.4.6 ప్రమాణాలు

ప్రతి రాజకీయ వ్యవస్థా అన విధాన ఉత్పాదితాలద్వారా కొన్ని నిర్దిష్టమైన ధ్యేయాలను నెరవేరుస్తుంది. ఈ ధ్యేయాలకు కొన్ని ప్రమాణాలు ఉంటాయి. నిజానికి ఈ రెండూ పరస్పర సంబంధితాలు. ప్రమాణాలంటే కొన్ని సాధారణ విలువలు, వీటి ఆధారంగానే రాజకీయ వ్యవస్థ ఎల్లప్పుడూ సంభవించే సంఘటనలకు ప్రతిస్పందిస్తూ ఉంటుంది. మంచి జీవితం అంటే ఏమిటి? మంచి ఆర్థిక జీవనం అంటే ఏమిటి? మనిషి పరమావధి ఏమిటి? ఇలాంటి తాత్విక భావజాలంతో కూడిన ప్రశ్నలకు సాధారణ విలువలు లేదా ప్రమాణాలు సమాధానాలను సమకూరుస్తాయి. వీటికి అనుగుణంగానే విధాన నిర్ణయాలుంటాయి. ఒక రాజకీయ వ్యవస్థలో ఎలాంటి ప్రమాణాలు లేదా విలువలు ఉన్నాయో తెలుసుకోవాలంటే మూడు కోణాలను దర్శించాలి. అవిః (a) రాజకీయ భాగస్వామ్యం విధాన నిర్ణయంలో ఏ మేరకు రాజకీయ భాగస్వామ్యం ఉన్నదో తెలిస్తే విలువల సమాహారాన్ని తెలుసుకోవచ్చు. ఉదాహరణకు పౌరులందరూ పాల్గొంటే అలాంటి రాజకీయ వ్యవస్థ ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ అవుతుంది. ఒక్కడే పాల్గొంటే రాజరిక వ్యవస్థ అవుతుంది. (b) రాజకీయ మార్గం (Means of government) రాజకీయ మార్గం ఉదారవాద మార్గం కావచ్చు; లేదా అధికారయుత మార్గం (authoritarianism) కావచ్చు. (c) భావజాలం (Ideology) ఇది సమాజాన్ని గురించి, దాని భవిష్యత్తును గురించి రాజకీయ వ్యవస్థకు ఉండే విశాలమైన భావజాలం. ప్రమాణాలు లేదా విలువలు రాజకీయ వ్యవస్థలో భాగమే.

7.4.7 నిర్మితులు

ప్రతి వ్యవస్థకూ నిర్మితులు (Structures) ఉన్నట్లే రాజకీయ వ్యవస్థకు కూడా నిర్మితి ఉంటుంది. పరిమాణం (size) స్థాయి (level) అనేవి రాజకీయ వ్యవస్థ నిర్మితిని సూచిస్తాయి. ఇవి త్వరితగతిని మార్పు చెందవు. ఒక భూభాగంలో పర్వతాలు, మైదానాలు ఎలాంటివో, మానవ శరీరంలో అస్థి పంజరం ఎలాంటిదో ఇవి అలాంటివి. రాజకీయ వ్యవస్థలో పరిస్థితులకు (situations) కూడా నిర్మితులుంటాయి. ఇవి మాత్రం త్వరితగతిన మార్పులు చెందుతాయి. వీటినే ప్రక్రియలు (processes) అంటాం. వీటిని పర్వతాలు, మైదానాలపై వీచే గాలీ, మానవ శరీరం శ్వాస పీల్చటంతో పోల్చవచ్చు.

నిర్మితులు చలన రహితంగా కనిపించినప్పటికీ ప్రక్రియల ద్వారా అంతస్సంబంధం కలిగి చలిస్తూనే ఉంటాయి. రాజకీయ నిర్మితులు (political structures) స్థానిక ప్రభుత్వ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు మనకు కనిపించే ప్రభుత్వ వ్యవస్థలే. రాజకీయ పక్షాలు కూడా రాజకీయ నిర్మితులే. మౌలికంగా రాజకీయ లక్షణాలను ప్రస్ఫుటించక పోయినప్పటికీ ట్రేడ్ యూనియన్లూ, ఇతర ప్రభావ వర్గాలు కూడా రాజకీయ నిర్మితులేనని కార్ల్ డయిష్ అంటారు. వ్యతిరేకత, సమగ్రత మధ్య గల ద్వైధీభావం వల్ల మానవ సమాజాలన్నింటిలోనూ (జాతులు, ప్రాంతాలు, నగరాలు, అంతర్జాతీయ వ్యవస్థలు, ట్రేడ్ యూనియన్లు మొదలైనవి) రాజకీయం గోచరిస్తుంది. వీటన్నింటిలోనూ జగడాలు (conflicts) పరిష్కార చర్యలు సంభవిస్తూనే ఉంటాయి.

రాజకీయ నిర్మితిలో రెండు భాగాలుంటాయి. అవిః (a) భౌతిక నిర్మితులు (b) సామాజిక నిర్మితులు. ఇందులో మొదటిది ప్రాకృతిక అంశాలతో కూడి ఉంటుంది; ఇది భౌగోళిక (geographical) ప్రజాసమూహ (demographic)

అంశాలు. ఇక రెండోది కృత్రిమాంశాల (artificial) తోను మానవాంశాల (human factors) తోనూ కూడి ఉంటుంది; ఇవి: సాంకేతిక పరిజ్ఞానం, సంస్కృతులు, విశ్వాసాలు, సంస్థలు మొదలైనవి. నిజానికి రాజకీయ వ్యవస్థలో ఈ రెండు అంశాల మధ్య నిర్దిష్టమైన విభజన సాధ్యం కాదు. వ్యవస్థా విశ్లేషణలో 'నిర్మితి' 'సంస్కృతి' అనేవి చాలా ముఖ్యమైన అంశాలని ఆల్మండ్ భావించారు. ఆయన ఉద్దేశంలో 'నిర్మితి' అంటే పరిశీలించడానికి వీలున్న కార్యకలాపాలతో కూడిన రాజకీయ వ్యవస్థే. వ్యక్తుల కార్యకలాపాలతో కూడిన రాజకీయ ప్రక్రియలనే ఆయన 'పాత్ర' (role) అన్నారు. రాజకీయ వ్యవస్థతో సహా అన్ని సామాజిక వ్యవస్థలూ పాత్రలతోనే నిర్మితమవుతాయి. రాజకీయ వ్యవస్థలో మౌలికాంశం రాజకీయ పాత్రే. ఈ పాత్రల నిర్మితినే ఆల్మండ్ 'నిర్మితి' అన్నారు. ఆ విధంగా న్యాయమూర్తి అనేది ఒక పాత్ర అతే న్యాయస్థానం పాత్రల అమరికతో కూడిన నిర్మితి అవుతుంది. శాసన సభ్యులు - శాసనసభ. మంత్రులు - మంత్రిమండలి రాజకీయ నిర్మితులే. రాజకీయ నిర్మితులన్నిటికీ అంతస్సంబంధాలు ఉంటాయి.

7.4.8 విధులు

ప్రభుత్వ యంత్రాంగాన్ని అధ్యయనం చేయటం కన్న రాజకీయ వ్యవస్థను అధ్యయనం చేయటం పరిపూర్ణమైందని భావిస్తూ రాజకీయ వ్యవస్థా సిద్ధాంతాన్ని 'నిర్మితులు - విధులు' విశ్లేషణగా (structural - functional Analysis) ఆల్మండ్ తమ గ్రంథం "పాలిటిక్స్ ఆఫ్ డెవలపింగ్ ఏరియాస్"లో ప్రతిపాదించారు. ఆయన రాజకీయ వ్యవస్థ విధులను ఉత్పాదక (input), ఉత్పాదిత (output) విధులుగా విభజించారు. ఉత్పాదక, ఉత్పాదిత విధులను కింది విధంగా పేర్కొన్నారు.

	ఉత్పాదక విధులు (input function)		ఉత్పాదిత విధులు (output function)
1.	రాజకీయ సామాజీకరణ, భర్తీ (political socialisation and recruitment)	1.	నియమాల తయారీ (Rule-making)
2.	ప్రయోజనాల స్పష్టీకరణ (Interest articulation)	2.	నియమాల అమలు (Rule-application)
3.	ప్రయోజనాల సమాహారింపు (Interest aggregation)	3.	నియమాల న్యాయాన్యాయ పరిశీలన (Rule adjudication)
4.	రాజకీయ ప్రసరణ (political communication)		

ఉత్పాదక, ఉత్పాదిత విధులను పరిశీలిస్తే ఒక విషయం విశదమవుతుంది. ఇందులో రెండు రకాల పద్ధతులుంటాయి. అవి: (a) నియంత్రణా పద్ధతి (monitoring mechanism) (b) మార్చే పద్ధతి (conversion mechanism). ఇందులో మొదటిది డిమాండ్లను, మద్దతులను ఒక సంక్లిష్టమైన రీతిలో పొందుపరచి యంత్రాంగానికి అందించి దాన్ని సక్రియం (activise) చేస్తుంది. డిమాండ్లను ఒక పద్ధతిని ఎంపిక చేసి, మదింపు చేసి పునర్వవస్థీకరించిన ఉత్పాదకాలుగా గ్రహించి ఉత్పాదితాలైన నిర్ణయాలు, చర్యలుగా మారేటట్లు చేస్తుంది. ఇదే మార్చే పద్ధతి. ఇది నెమ్మదిగా నిరంతరమూ జరిగేది కాబట్టి ఈ ప్రక్రియ ఎల్లప్పుడూ చలనశీలంగా ఉంటుంది.

రాజకీయ వ్యవస్థ విధులు లేదా చర్యలను సంక్షిప్తంగా ఇలా పేర్కొనవచ్చు. (a) ఉత్పాదక ప్రక్రియలో ప్రజాసమూహ లక్షణాలను, ఒత్తిడులను ప్రస్ఫుటించే ఉత్పాదకాలను వ్యవస్థ ఎంపిక చేయవలసి ఉంటుంది. (b) అటు తరవాత వాటిని వ్యవస్థా ప్రమాణాలతో సంధానం చేసే ప్రక్రియ ఉంటుంది. ఈ ప్రక్రియ వల్ల ఉత్పాదిత గుణంలో మాంద్యం ఏర్పడటమో విస్తృత జరగటమో సంభవిస్తుంది. (c) ఉత్పాదకాలను ఉత్పాదితాలుగా మార్చటానికి రాజకీయ వ్యవస్థ వరుసగా రెండు దశలను అధిగమిస్తుంది. వ్యవస్థ ప్రమాణాలు మొదటిగా సాధారణ ప్రకటనలుగా వెలువడతాయి. (d) తరవాత వీటిని ప్రత్యేక పరిస్థితులకు అన్వయించడం జరుగుతుంది. (e) చివరగా ప్రతి ఉత్పాదితాన్నీ ప్రమాణాల అనుగుణత ఆధారంగా క్రుణ్ణంగా పరిశీలించటం జరుగుతుంది. "తత్ఫలన సమాచారం" మానవ సమూహాలు చేసే డిమాండ్లలోని ప్రమాణాలు వ్యతిరేకత చూపే అవకాశం ఉండటమే క్రుణ్ణంగా పరిశీలించటానికి కారణం.

వ్యవస్థ పనిచేసే తీరును రెండు భినమైన స్థాయిల్లో పరిశీలించవచ్చు. మొదటి స్థాయి: సామర్థ్యాలు (capabilities). దీని అర్థం వ్యవస్థ ఒక యూనిట్‌గా తనచుట్టూ ఉన్న పర్యావరణంలో ఎంత సమర్థతతో పనిచేస్తుందో తెలుసుకోవటమే. రెండోస్థాయి విధులు లేదా చర్యలు రాజకీయ వ్యవస్థకు అంతర్గతమైన మార్పు ప్రక్రియకు సంబంధించినవి. ఈ మార్పు ప్రక్రియ ద్వారానే ఉత్పాదకాలను ఉత్పాదితాలుగా మారుస్తుంది వ్యవస్థ. రాజకీయ వ్యవస్థలో ఈ ప్రక్రియ ద్వారానే డిమాండ్లు మద్ధతులు సాధికారిక నిర్ణయాలుగా మారి అమలుచేయబడతాయి.

కొన్ని రాజకీయ వ్యవస్థలు నిబంధనాత్మక (regulative), సంగ్రహితాత్మక (extractive) లక్షణాలను ప్రదర్శిస్తాయి. పరిపూర్ణ రాజకీయ వ్యవస్థలు (Totalitarian political systems) డిమాండ్లను అణిచివేస్తాయి; తమ నిబంధనల ద్వారా, పీడన ద్వారా తమ మానవసమూహాల ప్రవర్తనను నియంత్రిస్తూ ప్రజల నుంచి సాధ్యమైనంత ఎక్కువ పరిమాణంలో వనరులను సమకూర్చుకొంటాయి.

ఒక రాజకీయ వ్యవస్థలో జరిగే మార్పు ప్రక్రియను విశ్లేషించి మరో రాజకీయ వ్యవస్థలో దాన్ని పోల్చి చూడవచ్చు. దీనికి దోహదపడేది ఇంతకు ముందు మనం పేర్కొన్న ఉత్పాదక, ఉత్పాదిత విధులూ, చర్యలే, స్పష్టంగా చెప్పాలంటే రాజకీయ వ్యవస్థలను తులనాత్మకంగా అధ్యయనం చేయటంలో మనం గమనించాల్సింది:

1. డిమాండ్లు ఎలా నిర్మితమౌతున్నాయి?
   (ప్రయోజనాల స్పష్టీకరణ)

2. డిమాండ్లు ఎలా సమాహారం చేయబడుతున్నాయి?
   (ప్రయోజనాల సమాహారింపు)

3. సాధికారిక నియమాలు ఎలా తయారవుతున్నాయి?
   (నియమాల తయారీ)

4. నియమాలెలా అమలు చేయబడుతున్నాయి?
   (నియమాల అమలు)

5. నియమాల తయారీ గురించి, అమలు గురించిన అంశాలలో న్యాయాన్యాయాలెలా తేల్చబడుతున్నాయి?
   (నియమాల న్యాయాన్యాయ విచారణ)

6. ఈ కార్యకలాపాలన్నీ వివిధ రాజకీయ వ్యవస్థలకు (అంటే రాజకీయ వ్యవస్థ పర్యావరణంలోకి) ఎలా ప్రసారం చేయబడుతున్నాయి?
   (రాజకీయ ప్రసరణ)

డేవిడ్ ఈస్టన్ ఉత్పాదకాలను రెండురకాలుగా పేర్కొన్నారు. అవి (1) డిమాండ్లు (2) మద్ధతులు. డిమాండ్లు వివిధరకాలుగా ఉండవచ్చు. అవి వేతనాల పెంపు, పనిగంటల తగ్గింపు, విద్యావకాశాల పెంపు, వస్తు-సేవల పంపిణీ మొదలైన వాటికి సంబంధించినవి కావచ్చు. ప్రవర్తనా నియమావళికి సంబంధించినవి ప్రజారక్షణ (Public safety), మార్కెటు కంట్రోళ్ళు, వివాహ నియమావళి, ఆరోగ్యం, పారిశుధ్యం వంటివీ కావచ్చు. ఓటుహక్కు. ఉద్యోగాలు, ప్రభుత్వానికి విన్నపాలు, రాజకీయ సంఘాలను ఏర్పాటు చేసుకోవటానికి సంబంధించిన రాజకీయ భాగస్వామ్య డిమాండ్లూ కావచ్చు. ప్రమాణాలకు సంబంధించిన విషయ ప్రసరణా కావచ్చు.

రాజకీయ వ్యవస్థ పనిచేయాలంటే డిమాండ్లు మాత్రమే సరిపోవు. ఇందుకు మద్ధతులు కూడా అవసరం. మద్ధతులు కూడా రకరకాలుగా ఉండవచ్చు. అవి పన్నుల చెల్లింపు, సైనిక సేవలు, ప్రభుత్వ సేవలవంటి భౌతికపరమైన మద్ధతులు కావచ్చు. రాజకీయ వ్యవస్థ నియమనిబంధనలకు విధేయత చూపటమూ కావచ్చు. ఎన్నికల్లో పాల్గొనటం, చర్చల్లో పాల్గొనటం, ఇంకా ఇతరమైన రాజకీయ కార్యకలాపాలు కావచ్చు. రాజకీయ చిహ్నాలను గౌరవించటం, ఉత్సవాల్లో పాల్గొనటం వంటివీ కావచ్చు.


అలాగే ఉత్పాదితాలు (outputs) లేదా ప్రభుత్వ విధాన నిర్ణయాలు కూడా ఎన్నో రకాలుగా ఉంటాయి. అన్ని సామాజిక వ్యవస్థలకు నెరవేర్చవలసిన విధులెన్నో ఉంటాయంటారు టాల్‌కాట్‌పార్సన్. ఈ విధులను నెరవేర్చటానికి

సమాజంలో ఎన్నో ఉపవ్యవస్థలుంటాయి. రాజకీయ వ్యవస్థ సమాజం నిర్ణయించుకొన్న ధ్యేయాలను నెరవేర్చేందుకు ఏర్పడిన ఒక విభిన్నమైన సామాజిక ఉపవ్యవస్థ. సమాజం తన ధ్యేయాలను, గమ్యాలను చేరేందుకు రాజకీయ వ్యవస్థ సమాజాన్ని నిర్దిష్టంగా వ్యవస్థీకరిస్తుంది. ఈ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో డేవిడ్ ఈస్టన్ ఈ కింది సాధారణ చిత్రం ద్వారా సూచించారు.

రాజకీయవ్యవస్థ మూడు ముఖ్యమైన విధులు నిర్వర్తిస్తుంది. అవిః (a) నియమాల తయారీ (b) నియమాల అమలు ()నియమాల న్యాయాన్యాయ విచారణ. వీటిని గురించి కొంచెం విపులంగా పరిశీలిద్దాం.

(a) నియమాల తయారీ విధానం అంటే సాధికారిక నియమాలను తయారుచేసే ప్రక్రియ. ఈ ప్రక్రియలో సమాజ ప్రవర్తనను ప్రభావితం చేసే న్యాయ శాసనాలు, నియమ నిబంధనలు తయారవుతాయి.

(b) నియమాల అమలు అంటే తయారైన శాసనాలు, నియమ నిబంధనల అమలు, పాలన చాలా రాజకీయ వ్యవస్థల్లో ఇది కేవలం కార్యనిర్వాహకవర్గం (executive) ఉద్యోగి స్వామ్యానికి సంబంధించిన పనేకాదు. ఇందులో శాసన నిర్మాణ, న్యాయశాఖలు కూడా పాలు పంచుకొంటాయి. నియమ నిబంధనలు అమలు చేసే క్రమంలో కూడా వాటి తయారీ జరగవచ్చు.



(c) నియమాల న్యాయాన్యాయ విచారణలో నియమనిబంధనలు తయారైన తీరు వాటిని అమలు జరిపిన తీరు సరియైనదో కాదో విచారించడం జరుగుతుంది. నియమాల తయారీలోనూ, అమలు జరిగే తీరులోనూ, ముఖ్యంగా ప్రభుత్వసంస్థలకు వ్యక్తులకు మధ్య ఏర్పడే వివాదాలు, వ్యక్తుల మధ్య ఏర్పడే వివాదాలను పరిష్కరించి న్యాయాన్యాయాలు విచారించే పనే ఇది. ఐతే ఇప్పటి వరకూ ఇది న్యాయశాఖ విధిగానే భావిస్తూ వచ్చాం. కాని ఇందులో శాసననిర్మాణ, కార్యనిర్వహక వర్గాల పాత్ర కూడా ఉంటుంది. న్యాయశాఖ కూడా విధాన నిర్ణయాలు చేసే అవకాశం ఉంది. అమెరికన్ సుప్రీంకోర్టు ఇందుకు ఒక మంచి ఉదాహరణ.

విధాన నిర్ణయాలన్నీ రాజకీయవ్యవస్థా ఉత్పాదితాలే. అంగీకరించిన ప్రమాణాలను, ధ్యేయాలను చేరుకోవటానికి ప్రతి సమాజంలోనూ రాజకీయ వ్యవస్థ తన విధాన నిర్ణయాలను ఉత్పాదితాలుగా వ్యక్తీకరించటం ద్వారా తన కార్యక్రమాలనే కాక సమాజాన్ని కూడా నడిపిస్తుంది. ఒక సామాజిక వ్యవస్థ ధ్యేయాలను, గమ్యాలను, మార్గాలను దాని విధాన నిర్ణయాల ద్వారానే తెలుసుకొంటాం. కాబట్టి విధాన నిర్ణయ విశ్లేషణకు రాజకీయ వ్యవస్థకు ఉన్న సంబంధం స్పష్టమే.

7.5 రాజకీయ వ్యవస్థ భావన - విమర్శనాత్మక పరిశీలనః

రాజకీయ వ్యవస్థ భావన ఒక సమగ్రమైన అధ్యయనానికి ఉపయోగపడే భావన. జీవశాస్త్రం నుంచీ, ఇంజనీరింగ్ శాస్త్రాలనుంచి గ్రహించిన సామాజిక, రాజకీయ జీవనాధ్యయనాన్ని శాస్త్రీయంగా సమగ్రంగా అధ్యయనం చేయటానికి దోహదపడే సిద్ధాంతంగా భావించడం జరుగుతోంది. ఇది రాజకీయ వ్యవస్థను ఒక ఇంజనీరింగ్ సిస్టమ్‌లాంటి ఎన్నో మూలకాలతో కూడిన ఒక సంక్లిష్టమైన ఉత్పాదక, ఉత్పాదిత వ్యవస్థగా భావిస్తుంది. ఈ వ్యవస్థ ప్రజాసమూహపు వాంఛలను, ప్రయోజనాలను ఉత్పాదకాలుగా గ్రహించి విధాన నిర్ణయాలను ఉత్పాదితాలుగా ప్రసాదిస్తుందని, ఇందులో ఎన్నో సంక్లిష్టమైన ప్రక్రియల అధ్యయనంవల్ల వ్యవస్థ స్థాయిని ప్రమాణాల గుణగణాలను స్పష్టంగా తెలుసుకునే వీలుంటుందని వ్యవస్థా సిద్ధాంతవేత్తలు భావిస్తున్నారు. సంస్థాగత అధ్యయనం కన్నా ఇది సమగ్రమైంది.

తులనాత్మక రాజకీయాధ్యయనానికి ఈ సిద్ధాంతం ఉపయోగపడుతుంది. ఈ సిద్ధాంతం ఆధారంగా ప్రపంచదేశాల (రాజకీయ వ్యవస్థల) అభివృద్ధి స్థాయిని, ప్రమాణాల స్థాయిని తులనాత్మకంగా పరిశీలించవచ్చు, వర్గీకరణ చేయవచ్చు. ఆల్మండ్ అలాంటి వర్గీకరణ చేశారు కూడా. అంతేకాకుండా, వ్యవస్థలోని లోపాలను స్పష్టంగానూ, శాస్త్రీయంగానూ గుర్తించవచ్చు, తొలగించుకోవచ్చు. ఈకారణాల వల్ల రెండో ప్రపంచ యుద్ధానంతరం రాజకీయ వ్యవస్థ దాని అనుయాయి సిద్ధాంతాలైన రాజకీయాభివృద్ధి, శక్తి సిద్ధాంతం ప్రాముఖ్యం సంతరించుకొన్నాయి.

రాజకీయ వ్యవస్థ సిద్ధాంతం కూడా విమర్శకు గురైంది. ఇది ప్రపంచ సమాజాలను అభివృద్ధి చెందిన సమాజాలనీ (Developed Societies), అభివృద్ధి చెందని సమాజాలనీ (back ward and traditional Socities), మారుతున్న సమాజాలనీ (transitional Socies) విభజించి అభివృద్ధి చెందిన సమాజాలకు నమూనాగా పాశ్చాత్య రాజకీయ సమాజాలైన ఆంగ్లో - అమెరికన్, ఖండాతర ఐరోపా రాజకీయ వ్యవస్థలను - ముఖ్యంగా ఇంగ్లండ్‌ను - చూపించి, అభివృద్ధి చెందని, అభివృద్ధి చెందుతున్న దేశాల భవితవ్యం ఈ నమూనాను అనుసరించటంపై ఆధారపడి ఉంటుందని ప్రకటిస్తుంది. దీన్ని అంగీకరించటంలో చాలా ఇబ్బందులున్నాయి.

రాజకీయ వ్యవస్థా సిద్ధాంతం ఉదారవాద - ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని ఆదర్శవంతమైన రాజకీయ భావనగా గుర్తిస్తుంది. అంటే సమసమాజభావనను తీసివేస్తుంది. ఉదారవాద ప్రజాస్వామ్యాలైన పశ్చిమ దేశాలు ఎన్నో వ్యవస్థాపరమైన ఇబ్బందులను అధిగమించి ప్రస్తుతం అభివృద్ధి చెందిన వ్యవస్థలుగా మారాయని, అభివృద్ధి ఉదారవాద ప్రజాస్వామ్య భావనను వ్యవస్థీకరించటంపై ఉంటుందని ఈ సిద్ధాంతం భావిస్తుంది. ఇదికూడా అంగీకరించటం కష్టమే. అభివృద్ధిచెందిన దేశాలుగా పేర్కొంటున్న ఎన్నో సమాజాలు సాధారణంగా అధిగమించడానికి సాధ్యంకాని ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్న విషయం మనకు తెలిసిందే.

కాబట్టి రాజకీయ వ్యవస్థా సిద్ధాంతం కూడా ఎంతో సమగ్రమైన, శాస్త్రీయమైన సిద్ధాంతమే అయినప్పటికి కొన్ని అసంగతాలకు అతీతం కాలేకపోయింది.

- ఆచార్య బి. వెంకటేశ్వర్లు.

7.6 చదువదగిన పుస్తకాలు

Apter, David	:	*The politics of modernisation*
Blondel jean	:	*Comparative Government*
Johari J.C	:	*Comparative politics*
Deol	:	*Comparative government and politics*
Dahl robert	:	*Who Governs ?*
Huntington, samuel p	:	*Political order in changinga societies*

7.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1 రాజకీయ వ్యవస్థ అనగానేమి? దాని స్వభావాన్ని చర్చించండి.

2. రాజకీయ వ్యవస్థ మూలాధారాలను విశ్లేషించండి.

3. రాజకీయ వ్యవస్థ భావనను విమర్శింపుము

ఈ కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా జవాబులు రాయండి.

1. ఉపవ్యవస్థలు

2. రాజకీయ వ్యవస్థ - నిర్మితులు

3. రాజకీయవ్యవస్థ - విధులు

...

భాగం - 8: మార్క్సిస్టు విశ్లేషణ

విషయ క్రమం

8.1 లక్ష్యాలు
8.2 పరిచయం
8.3 మార్క్సిస్టు రాజకీయార్థిక తాత్విక దృక్పథం : గతి తార్కిక చారిత్రక భౌతికవాదం
8.4 మార్క్సిస్టు దృక్పథంలో అభివృద్ధికి అర్థం
8.5 మార్క్సిస్టు భావనలో రాజ్యం, దాని స్వభావం
8.6 తులనాత్మక రాజకీయాధ్యయనం - మార్క్సిజం
8.7 మార్క్సిస్టు విశ్లేషణ - ఒక విమర్శనాత్మక పరిశీలన
8.8 చదువదగిన పుస్తకాలు
8.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

8.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

* మార్క్సిస్టు రాజకీయార్థిక, తాత్విక దృక్పథాన్ని,
* మార్క్సిస్టుల దృష్టిలో అభివృద్ధికి అర్థాన్ని,
* రాజకీయ వ్యవస్థ, దానిలో సంభవించే పరిణామాలను గురించిన మార్క్సిస్టు భావాలను,
* తులనాత్మక రాజకీయాధ్యయనంలో మార్క్సిస్టు విశ్లేషణ ఉపయోగాన్ని,
* మార్క్సిస్టు విశ్లేషణలోని గుణదోషాలను గురించి వివరించగలుగుతారు.

8.2 పరిచయం

సామాజిక రాజకీయార్థికాభివృద్ధి క్రమాన్ని తెలుసుకోవాలన్నా, అలాంటి అభివృద్ధి క్రమంలో ఏదో ఒక దశలో స్పష్టంగా కనిపించే సామాజిక రాజకీయార్థిక వ్యవస్థలను గురించి తెలుసుకోవలన్నా మార్క్సిస్టు విశ్లేషణ, దృక్పథం ఒక సమగ్రమైన అధ్యయనానికి దారి చూపుతుంది. అభివృద్ధి చెందిన సామాజికార్థిక రాజకీయ వ్యవస్థలేవి? అభివృద్ధికి దోహదం చేసే అంశాలేవి? అసలు అభివృద్ధి అంటే అర్థమేమిటి? అనే ప్రశ్నలకు మార్క్సిజం సూత్రీకరించిన సమాధానాలను ప్రతిపాదిస్తుంది.

తులనాత్మక రాజకీయాధ్యయనంలోని ముఖ్యాంశాలు కూడా ఇవే. వివిధ రాజకీయ వ్యవస్థల నిర్మితిలోని తారతమ్యాలను, అవి పనిచేసే తీరును వాటి అభివృద్ధి క్రమాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి రాజకీయ వ్యవస్థాభివృద్ధిని సిద్ధాంతీకరించడమే స్థూలంగా తులనాత్మక రాజకీయాధ్యయనం ధ్యేయం. ఈ కారణం వల్లనే మార్క్సిస్టు విశ్లేషణ తులనాత్మక రాజకీయాధ్యయనానికి విశేషంగా తోడ్పడే అవకాశముంది.

ఈ పాఠ్యాంశంలో తులనాత్మక రాజకీయాధ్యయనానికి మార్క్సిస్టు విశ్లేషణ ఎలా దోహదపడుతుందో చర్చిస్తాం. ఇందులో స్పృశించబోయే అంశాలు వరుసగా ఇవి : (a) మార్క్సిస్టు రాజకీయార్థిక తాత్విక వైఖరిని ప్రదర్శించే మార్క్స్ గతి తార్కిక భౌతిక వాదం, ఉత్పత్తి విధాన భావన (Concept of Mode of Production); (b) మార్క్సిస్టుల భావనలో రాజ్యం - దాని స్వభావం (c) రాజ్యవ్యవస్థలో సంభవించే పరిణామాలు తులనాత్మక రాజకీయాధ్యయనంలో మార్క్సిస్టు విశ్లేషణ ఉపయోగం (d) తులనాత్మక రాజకీయాధ్యయనంలో మార్క్సిస్టు విశ్లేషణ ఉపయోగం (e) మార్క్సిస్టు విశ్లేషణలోని గుణదోషాలు.

8.2 మార్క్సిస్టు రాజకీయార్థిక తాత్విక దృక్పథం: గతి తార్కిక చారిత్రక భౌతికవాదం

మార్క్సిజం అంటే గతి తార్కిక చారిత్రక భౌతికవాదమని నిర్వచిస్తాం. దీన్ని గురించి మీరు రాజనీతి సిద్ధాంతం అనే పాఠ్యగ్రంథంలో (మొదటి సంవత్సరం మొదటి కోర్సు రెండవ పుస్తకం పేజీలు 31 నుంచి 35 వరకు) విపులంగానే చదివారు. కనక మనం దాన్ని గురించి వివరంగా చర్చించబోవటంలేదు. దానిలోని ముఖ్యాంశాలను మాత్రం తెలుసుకొందాం.

సమాజము, రాజ్యమూ ఆదిభౌతికమైన చిదాత్మ అభివ్యక్తీకరణలేననే హెగెల్ వాదనను తోసిపుచ్చి వీటిని భౌతిక యదార్థాలుగా మార్క్స్ పేర్కొన్నారు. ఒక భౌతిక యదార్థతగా తన భౌతిక జీవనానికి, అస్థిత్వానికి అవసరమైన భౌతిక పరిస్థితులను ఉత్పత్తి చేసుకొంటూ తన మనుగడను ప్రదర్శిస్తుంది సమాజం. మానవ భౌతిక జీవనావసర వస్తువుల ఉత్పత్తి, వాటిని ఉత్పత్తి చేసే పద్ధతిని (Mode of Production) తద్వారా ఏర్పడే మానవ ఉత్పత్తి సంబంధాల సమాహారమే సమాజం. దీన్నే హెగెల్ 'పౌర సమాజం (Civil Socity) అన్నాడని పేర్కొంటూ, ఇది భౌతికమైన చిదాత్మ అభివ్యక్తి కాదనీ, భౌతిక జీవనాధారమైన వస్తూత్పత్తి. ఉత్పత్తి చేసే విధానం, తద్వారా ఏర్పడే ఉత్పత్తి సంబంధాల ఫలమేనని మార్క్స్ తన "ఎ కన్‌ట్రిబ్యూషన్ టు క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" అనే గ్రంథంలో ప్రతిపాదించారు. మానవజాతి చరిత్రలోని ఏ సమాజపు రాజకీయ, న్యాయ, కళ, నైతిక, ధార్మిక తదితర పార్శ్వాల స్వరూప స్వభావాలను గురించి తెలుసుకోవాలన్నా ఆ సమాజపు అస్థిత్వానికీ, మనుగడకు పునాదిగా ఉన్న ఉత్పత్తి విధానాన్ని తద్వారా ఏర్పడిన సామాజికోత్పత్తి సంబంధాలను అధ్యయనం చేయటంవల్ల మాత్రమే సాధ్యపడుతుందని మార్క్సిజం ప్రతిపాదిస్తుంది. ఎందుకంటే ఏ సమాజానికైనా ఇది పునాది కావటమే. రాజకీయ, న్యాయ, కళ, నైతిక, దార్శనిక తదితర అంశాలన్నీ దీనిలోంచే పుట్టిన ఉపరితలాంశాలు. వీటి మూలాలు ఉత్పత్తి విధానంలో ఉంటాయి. దాన్ని క్షుణ్ణంగా తెలుసుకోకుండా ఉపరితలాంశాలను గురించి తెలుసుకోవటం సాధ్యం కాదు.

సమాజ అధ్యయనాన్ని గురించి తను ఏర్పరచుకొన్ని ఈ దృక్పథమే తన అధ్యయనమంతటికీ మార్గదర్శి అయిందని పేర్కొన్నారు మార్క్స్. ఆయన మాటల్లోనేः My inquiry led me to the conclusion that neither legal relations nor political forms could be comprehended whether by themselves or on the basis of a so called general development of the human mind, but that on the contrary they originate in the material conditions of life. The general conclusion at which I arrived ..... because the guiding principle of my studies.

సమాజ ఆవిర్భావాన్ని గురించి, అది ప్రస్ఫుటించే రాజకీయ, న్యాయ, కళాత్మక, నైతిక, దార్శనిక, మతపరమైన అంశాలతో కూడిన దాని అభివ్యక్తీకరణ గురించి, దానిలో సంభవించే బృహత్తరమైన పరిణామాల గురించి, వ్యవస్థల పతనాన్ని, నూతన వ్యవస్థల ఆవిర్భావాన్ని గురించి తెలుసుకుందుకు ఆయన ఏర్పరచుకొన్న నిశ్చయాత్మకమైన దృక్పథం ఎలాంటిదో ఆయన మాటల్లోనే చూద్దాంः

In the social production of their existence men inevitably enter into definite relations which are independent of their will, namely, relations of production appropriate to a given stage in the development of their material forces of production. The totality of these relations of production constitutes the economic structure of society, the real foundation, on which arises a legal and political structure and to which correspond definite forms of social consciousness. The mode of production of material life conditions the general process of social, political and intellectual life. It is not the consciousness of men that determines their existence that determines their consciousness. At a certain stage of development the material productive forces of society come into conflict with the existing relations of production or this merely expresses the same being in legal terms – with the property relations within the frame work of which they have operated hitherto. From forms of development of the productive forces these relations turn into their fetters. Then begines an era of social revolution. The changes in the economic foundation lead sooner or later to the transformation of the whole immense super structure. In studying such transformation it is always necessary to distinguish between the material transformation of the economic conditions of production, which can be determined with the precision of natural science and the legal, political, religious, artistic or philosophic – in short, ideological forms in which men became conscious of this conflict and fight it out. (Marx: A Contribution to the critique of political Economy)

జీవపరిణామ సూత్రాలను డార్విన్, చలన సూత్రాలను న్యూటన్ ప్రతిపాదించనట్లే అంతే శాస్త్రీయమైన సామాజిక చలన సూత్రంగా మార్క్స్ పైన పేర్కొన్న సామాజిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. మార్క్సిస్టులు సామాజిక యదార్థతను అధ్యయనం చేసేది ఈ సిద్ధాంతం ఆధారంగానే.

8.4 మార్క్సిస్టుల దృక్పథంలో అభివృద్ధికి అర్థం

మానవ భౌతిక జీవనాధారమైన వస్తువుల ఉత్పత్తి అవసరంగా ఏర్పడ్డ సమాజం గతితార్కికంగా మార్పులకు లోనయి, అభివృద్ధిచెందుతూ, కొన్ని నిర్ణయాత్మకమైన దశలను అధిగమించి ప్రస్తుత స్థితిని చేరింది. సమాజంలో భాగమైన రాజకీయ జీవనాన్ని లేదా రాజ్యస్వభావాన్ని గాని లేదా ఇంకా మరేదైనా ఇతర సామాజిక జీవన పార్శ్వాల స్వభావాన్ని గాని అర్థం చేసుకోవాలంటే ఆ సమాజపు భౌతిక జీవనావసర వస్తూత్పత్తి స్వభావాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఈ దృక్పథం ఆధారంగా చారిత్రక పరిణామంలో సమాజాభివృద్ధికి సంబంధించిన ఏ దశనైనా అధ్యయనం చేసి వాటి స్వరూప, స్వభావాలను, అభివృద్ధి క్రమాన్ని అర్థం చేసుకోవచ్చు.

మార్క్సిస్టు విశ్లేషణలోని ముఖ్యాంశమేమంటే గతి తార్కిక భౌతిక వాద తాత్విక దృక్పథాన్ననుసరించి సామాజికాభివృద్ధి క్రమానుగతాన్ని వివరించటమే. ఇది చారిత్రక భౌతికవాదానికి లేదా భౌతిక చరిత్ర వివరణకు దారి తీస్తుంది. చరిత్ర-అంటే సామాజికాభివృద్ధి కథాకథనం-హెగెల్ ప్రతిపాదించినట్లు చిదాత్మ చిద్విలాసం కాక మానవ భౌతిక జీవన సమరంగా ద్యోతకమౌతుంది. ఈ దృక్పథంతో పరిశిలిస్తే సామాజికాభివృద్ధి క్రమమంతా (లేదా చరిత్రంతా) సమర రంగంగా గోచరిస్తుంది. అందుకే మార్క్స్ తన "మానిఫెస్టో ఆఫ్ ది కమ్యూనిస్ట్ పార్టీ" లో గడిచిన చరిత్రంతా వర్గపోరాటాల చరిత్రేనన్నాడు. ఇప్పటి వరకు రచించిన మానవజాతి చరిత్ర (అంటే సామాజికాభివృద్ధి క్రమం) నాలుగు ముఖ్యమైన, నిర్ణయాత్మకమైన దశలను అధిగమించిందని మార్క్సిజం ప్రతిపాదిస్తుంది. అవి (1) ఆదిమ సమాజం (2) బానిస సమాజం (3) భూస్వామ్య సమాజం (4) పెట్టుబడిదారీ సమాజం. ఈ సమాజాలకు పునాది నాలుగు భిన్నమైన ఉత్పత్తి విధానాలే. వీటినే మార్క్సిజం (1) ఆసియాటిక్ ఉత్పత్తి విధానం (Asiatic Mode of Production) (2) పురాతన పాశ్చాత్య ఉత్పత్తి విధానం (Western Ancient Mode of Production) (3) భూస్వామ్య ఉత్పత్తి విధానం (Fendal Mode of Producton) (4) పెట్టుబడిదారీ ఉత్పత్తివిధానం (Capitalist Mode of Production) ని ప్రతిపాదిస్తుంది. ఈ నాలుగు దశలలోనూ భౌతిక జీవనావసర వస్తూత్పత్తి ద్వారా అనివార్యంగా సంభవించే గతితార్కిక సామాజిక వర్గ వైరుధ్యాలు నిరాఘాటంగా కొనసాగేందుకు వీలుగా ఆయా సమాజాలు (లేదా భౌతిక జీవనోత్పత్తి సాధనాలు) అనువైన రాజకీయ, న్యాయ, తాత్విక, మత సంబంధమైన ఎన్నో వ్యవస్థలను సృష్టించుకొన్నాయి. ఇవన్నీ ఆయా కాలాల నాటి వర్గవైరుధ్యాలతో కూడిన సామాజిక వ్యవస్థను పరిరక్షించేందుకే సృష్టించబడినాయి.

ఆదిమ సమాజంలో ఉత్పత్తి సాధనాలన్నీ మొత్తంగా సమాజం ఆధీనంలో ఉండి సమాజంలో ఉన్నవారు, లేనివారు అనే భేదం లేకుండా సమ సమాజంగా ఉండేది. ఇందులో అనివార్యంగా జరిగే ఉత్పతిసాధనాల అభివృద్ధి తద్వారా సామాజికోత్పత్తి సాధనాల అభివృద్ధి తద్వారా సామాజికోత్పత్తి సంబంధాలలో పెనుమార్పులకు దారితీసి ఈ సమాజాల పతనానికి దారి తీసి సమాజం రెండో నిశ్చయాత్మకమైన దశకు చేరటానికి కారణమౌతాయి. పురాతన-పాశ్యాత్య సమాజాలు ఇలా ఏర్పడినవే. ఈ సమాజాలు బానిసలు-యజమానులు అనే రెండు వర్గాలుగా చీలి ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి పై అజమాయిషీ, అదుపాజ్ఞలు యజమాని వర్గం చేతుల్లోకి పోయి అశేష ప్రజానీకం బానిసవర్గంగా దోపిడీకి, పీడనకు గురైనారు. ఇలాంటి సమాజాలను ప్రాచీన గ్రీకు, రోములలో గమనించవచ్చు. సామాజికాభివృద్ధి క్రమంలో లేదా చరిత్రలో ఇది రెండో దశ.

ఈ సమాజాలలోనూ ఉత్పత్తి శక్తులలోనూ, సామాజిక ఉత్పత్తి సంబంధాలలోనూ సంభవించిన విప్లవాత్మకమైన మార్పుల కారణంగా ఈ సమాజాలు పతనమై, వాటి స్థానే భూస్వామ్య సమాజాలు (లేదా భూస్వామ్య సామాజిక భౌతిక జీవనోత్పత్తి విధానం) ఆవిర్భవించాయి. ఇదే సూత్రంపై భూస్వామ్య సమాజాలు నశించి ప్రస్తుతం మనం జీవిస్తున్న పెట్టుబడిదారీ సమాజాలు ఏర్పడ్డాయి.

సమాజాలు ఒక దశ నుంచి మరో అభివృద్ధికరమైన దశను చేరటానికి - అంటే పాత సమాజం నశించి దాని స్థానంలో ఒక నూతన సామాజికవ్యవస్థ ఆవిష్కరణ జరగటానికి - దోహదం చేసే చోదక శక్తులు పాత సామాజిక

భౌతిక జీవన సంబంధాలలో ఉండే గతి తార్కిక వర్గవైరుధ్యాలేనని మార్క్సిజం ప్రతిపాదిస్తుంది. గడిచిపోయిన బానిస, భూస్వామ్య సమాజాలు వరసగా బానిసలు - యజమానులు, భూస్వాములు - అర్ధ బానిస రైతాంగం అనే రెండు వర్గాలుగా చీలి దోపిడీ, పీడనలను భరించలేని స్థితిలో ఇక కలిసి ఉండే అశలేని దశకు చేరి సంఘర్షించుకొని, రెండు వర్గాలూ పతనమై కొత్త సమాజాలకు లేదా కొత్త భౌతిక సామాజిక జీవనావసర వస్తూత్పత్తి విధానాల ఆవిర్భావానికి కారణమైనాయి.

ఆయా సమాజాలలో పరిష్కృతమైన రాజకీయ వ్యవస్థలు, న్యాయశాసనాలు, కళలు, మతాలు, తాత్విక నైతిక భావాలు ఆయా సామాజిక వ్యవస్థలు ఏ ఒడిదుడుకులు లేకుండా మనుగడ సాగించటానికే ఏర్పడ్డాయి, ఉత్పత్తి శక్తులపై, సామాజికోత్పత్తి విధానమూ, సామాజిక సంబంధాలపై అధిపత్యంగల వర్గం, అధిపత్యంలేని వర్గపు శ్రమశక్తిని దోచుకొంటూ అణచి ఉంచటానికే ఏర్పడిన వ్యవస్థలివి. వర్గపోరాటాలు జరిగి వర్గాలు నశించి పోవటంతో ఇవి పతనమైపోతాయి. నూతన సమాజం ఏర్పడినప్పుడు తిరిగి నూతన రూపాలలో ఈ వ్యవస్థలు ఏర్పడతాయి.

మార్క్సిస్టు భావనలో అభివృద్ధి అంటే వర్గ సమాజం వర్గరహిత సమాజంగా మారటమే. ఆదిమ సమాజాలు అంతరించిన తరవాత ఏర్పడిన బానిస సమాజాలు వర్గ సమాజాలేర్పడినప్పటినుంచి సామాజికాభివృద్ధి క్రమాన్ని నిర్దేశించే భౌతిక సూత్రాలు వర్గ సమాజాన్ని వర్గరహిత సమాజం దిశగా పయనించటానికి దోహదపడుతూ వస్తున్నాయి. ఆదిమ సమాజంకన్నా భూస్వామ్య సమాజం, దాని కన్నా పెట్టుబడిదారీ సమాజం ఒక దానికన్నా ఒకటి వరసగా ఎంతో అభివృద్ధి చెందిన సమాజాలు. పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోగల అంతర్గత వైరుధ్యాలవల్ల పతనమై సామ్యవాద వ్యవస్థ ఏర్పడుతుందని మార్క్సిస్టులు విశ్వసిస్తారు. పాత సమాజం పతనాన్ని గురించి నూతన సమాజ ఆవిష్కరణ గురించి మాటాడుతూ మార్క్స్ ఇలా అన్నారు:

No social order is ever destroyed before all the productive forces for which it is sufficient have been developed and new superior relations of production never replace older ones before the material conditions for their existance have matured within the frame work of the old society.

ఒక సామాజిక వ్యవస్థ పతనం కావటమంటే మార్క్స్ ఉద్దేశం ఆ సమాజంలోని ఇతర వ్యవస్థలు - రాజ్యం, న్యాయం, కళలు, నైతిక విలువలు, తాత్విక భావనలు - కూడా పతనమై పోవటమే.

8.5 మార్క్సిజం - రాజ్యం

రాజ్యం ఆనాదిగా లేదని అది వర్గ సమాజ జనితమని మార్క్సిజం భావిస్తుంది. వర్గవైరుధ్యాలను యథాతథంగా ఉంచి, దోపిడీ నిరాఘాటంగా క్రమబద్ధంగా జరగటానికే రాజ్యవ్యవస్థ ఏర్పడింది. అది దోపిడి చేసే వర్గపు సృష్టి. పెట్టుబడిదారీ సమాజంలో రాజ్యవ్యవస్థ స్వభావం గురించి చెబుతూ మార్క్స్ "The executive of the modern state is but a Committe for managing the common affairs of the bourgeoise as a whole" అన్నారు. వర్గసమాజంలోని వైరుధ్యాలు శక్తి, అధికారాలకు సంబంధించినంతవరకు - రాజ్యరూపంలో వ్యక్తమై వర్గసమాజపు అస్థిత్వం కాపాడబడుతుంది. ఉత్పత్తిశక్తులపై, ఉత్పత్తి పరిస్థితులపై ఆధిపత్యం కలిగిన వర్గం చేతుల్లో ఒక సాధనంగా పనిచేస్తే దోపిడీ సజావుగా సాగేందుకు దోహదం చేస్తుంది. ఇదే రాజ్యం సారం. పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారులు శ్రామిక వర్గంపై నెరపే దోపిడికే రాజ్యం అవసరమైంది. శ్రామికులు దీన్ని సాగనీయరు. తత్ఫలితంగా శ్రామికవర్గ విప్లవం చెలరేగుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ అనివార్యంగా పతనమౌతుంది. దీన్నే ఎంగెల్స్ The expropriation of the expropriators అని వర్ణించారు. విప్లవం తరవాత శ్రామికులు శ్రామికవర్గ నియంత్రృత్వాన్ని (The Dictatorship of the Proletariat) ఏర్పరచి దోపిడీకి, పీడనలకు మూలమైన వర్గసమాజాన్ని రూపుమాపుతారు. దాంతో వర్గసారమైన రాజ్యం వడలి, వాడి, కృశించి, నశించిపోతుంది. ఇది మానవసమాజ చరిత్రగతి. ఇదే మార్క్సిజం ప్రతిపాదించే రాజ్యం సిద్ధాంతం. ఇందులో మనం ఒక విషయం గమనించాలి. సమాజపు చారిత్రకాభివృద్ధి క్రమంలో ఆదిమ, బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ, సమసమాజ దశలు ఒక దానికన్నా మరొకటి వరసగా అనివార్యంగా అభివృద్ధికరమైనవి. ఈ వ్యవస్థలు భిన్నమైనవి కావటం వల్ల అవి వర్ధిల్లే ఆయాకాలాలలో మనం భిన్నమైన రాజ్యవ్యవస్థలను గమనించవచ్చు. వివిధ ఉత్పత్తి విధాన దశల్లో ఉండే వర్గాలు, సమాజ స్వరూపం, రాజకీయ వ్యవస్థ స్వరూపం, జీవన స్వభావం స్థూలంగా ఈ పట్టికలో చూపించడమైంది.

గతి తార్కిక భౌతిక చారిత్రకపరిణామం

వరససంఖ్య	ఉత్పత్తి విధానం	వర్గాలు	సమాజస్వరూపం	రాజకీయవ్యవస్థల స్వరూపం	సామాజికజీవన స్థితి, స్థాయి
1. గ్రీకు, రోమన్ నాగరికతలకు పూర్వపు దశ	ప్రకృతిలో లభించే ఆహారసేకరణ - ఉత్పత్తి చేయటం ఇంకా మొదలు కాలేదు.	లేవు	ఆదిమ సమాజం	రాజ్య వ్యవస్థ లేదు.	సమానత్వం, ఖచ్చితమైన స్వేచ్ఛను మనుషులు అనుభవించారు. వర్గాలు లేవు. వైరుధ్యాలులేవు.
2. ప్రాచీన గ్రీకు, రోమన్ సమాజాలు	వ్యవసాయం - నగరాలనిర్మాణం - కృత్రిమ భౌతిక జీవనోత్పత్తి, - వస్తువుల ఉత్పత్తి	యజమాని VS బానిస	బానిస సమాజాలు	కులీనవర్గ పాలన	సమాజం యజమానులు-బానిసలనే రెండు వర్గాలుగా చీలిపోయింది. యజమానులు కులీనవర్గంగా ఏర్పడ్డారు. బానిస చేసే శ్రమే కాక బానిసే మొత్తంగా యజమాని ఆస్తి,బానిసలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలులేవు. బానిసల తిరుగుబాట్లు ఈవ్యవస్థల పతనానికి అంతిమకారణం.
3. ఐరోపాలో మధ్య యుగం	వ్యవసాయం-మెరట్టైన ఉత్పత్తి, సాధనాలు-జీవించడంకోసమే ఉత్పత్తి చేసేవారు-సామాన్యమైన సాదాసీదా శ్రమవిభజన	భూస్వాములు VS అర్ధబానిసరైతాంగం	భూస్వామ్య వ్యవస్థ	రాచరికాలు	సమాజంలో భూస్వాములు, అర్ధబానిస రైతాంగం అనే రెండు వర్గాలుగా చీలి ఉంటుంది. బానిస వ్యవస్థలో వలెగాక అర్ధబానిస రైతాంగానికి తమ భూస్వామిని ఎంచుకొనేందుకు సాపేక్షమైన స్వేచ్ఛ ఉత్పత్తికి ఉపయోగించే మోటు పనిముట్లపై హక్కు ఉంటాయి. ఇంతకు మించి హక్కులు లేవు. భూస్వామి రైతాంగపు తిరుగుబాట్లు ఈవ్యవస్థ పతనానికి అంతి మంగా కారణ మవుతాయి.
4. ఆధునిక పశ్చిమ సమాజాలు	యంత్ర సాధనాలతో ఉత్పత్తి, మార్కెట్లకోసం విపరీతమైన లాభాల నార్జించేందుకు ఉత్పత్తి జరుగుతుంది - వస్తూత్పత్తి కుప్పలు తెప్పలుగా జరుగు తుంది. ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులు - కమ్యూనికేషన్లు, రవాణా	పెట్టుబడిదారీ వర్గం VS శ్రామికవర్గం	పెట్టుబడిదారీ సమాజం	ఉదారవాద ప్రజా స్వామ్యాలు	సమాజం పెట్టుబడిదారులు, శ్రామికులనే రెండు వర్గా లుగా చీలి ఉంటుంది. స్వేచ్ఛ సమానత్వ భావనలు ప్రబలంగా ఉంటాయి. వ్యక్తికి రాజ్యాంగబద్ధంగా హక్కులుంటాయి. అయినా ఉత్పత్తి, సాధనాలు ఉత్పత్తిపై అజమాయిషీ అనేవి

విప్లవాత్మకంగా అభివృద్ధి చెంది దేశాల ఎల్లలను చెరిపివేస్తాయి. మార్కెట్లకోసం పోటీ, యుద్ధాలు.

పెట్టుబడిదారులకు ఆస్తి హక్కు రూపంలో సంక్రమించి ఉంటా యి. శ్రామికుడికి కేవలం తన శ్రమే అతని ఆస్తి. దానిని కేవలం తన ఇష్టం వచ్చినట్లు మార్కెట్‌లో సరుకుగా అమ్ముకోవచ్చు. రాజకీయ వ్యవస్థ స్వేచ్ఛ సమానత్వాలను అందరికీ విశ్వజనీనమైన హక్కులుగా ప్రసాదిస్తుంది. కానీ ఆస్తి హక్కులలోని అసమానతలు నిజమైన స్వేచ్ఛ, సమానత్వాలను అందరికీ అందుబాటు లోకి రానియ్యవు. శ్రామికుడు విపరీతమైన దోపిడీ, పీడనలకు లోనై పరాయీకరణ చెందుతాడు .శ్రామిక వర్గం ఏకమై తమ హక్కుల కోసం పెట్టుబడిదారీ వర్గంపై పోరాటం చేస్తుంది. దానితో పెట్టుబడిదారీ వ్యవస్థ విప్లవాత్మకంగా అని వార్యంగా రూపుమాపి సామ్య వాద వ్యవస్థకు మార్గాలేర్పడతాయి.

పైపట్టికలో ఉత్పత్తి విధానానికి సమాజస్వరూపానికి, రాజకీయ వ్యవస్థకు, మానవ జీవనసరళికి మధ్యగల అవినాభావ గతితార్కిక సంబంధాన్ని గమనించవచ్చు. అలాగే సమాజం, రాజకీయ వ్యవస్థలు మొదటి దశనుంచి నాలుగో దశవరకు ఎలా పరిణామం చెందుతూ వచ్చాయో కూడా గమనించవచ్చు; వాటి అభివృద్ధి పథాన్ని గుర్తించవచ్చు.

ఐరోపా సమాజాల ప్రాతిపదికగా మార్క్సిజం ఈ భౌతిక సామాజిక రాజకీయార్థిక చారిత్రకాభివృద్ధి క్రమాన్ని ప్రతిపాదించింది. దీని ప్రాతిపదికగా ఏవి అభివృద్ధి చెందిన సమాజాలో, అభివృద్ధి చెందుతున్న సమాజాలేవో, అభివృద్ధి చెందని సమాజాలేవో తేల్చి చెప్పవచ్చు. అభివృద్ధి పథ నిర్దేశాన్ని కూడా మార్క్సిజం పేర్కొంది. అభివృద్ధి అంటే ఉత్పత్తి వ్యక్తుల అభివృద్ధీ, ఉత్పత్తి సంబంధాల అభివృద్ధీను, వీటితోపాటు రాజ్యవ్యవస్థలో అభివృద్ధి అనివార్యంగా జరుగుతుంది.

8.6 తులనాత్మక రాజకీయాధ్యయనం - మార్క్సిజం

తులనాత్మక రాజనీతి అధ్యయనంలో రాజ్య వ్యవస్థలను, వాటి స్వరూప స్వభావాలను పోల్చి చూసి ఏవి అభివృద్ధికరమైన రాజకీయ వ్యవస్థలో, ఏవికావో తేల్చి సిద్ధాంతీకరించటమనేది ఒక ముఖ్యమైన అంశమని ముందే చెప్పుకొన్నాం. మార్క్సిస్టు విశ్లేషణ ఇందుకు దోహదపడగలదని మన చర్చ నిరూపిస్తున్నది. ఐనా మార్క్సిస్టు విశ్లేషణా దృక్పథం కూడా పరిపూర్ణాలు లేని దృక్పథమేమీకాదు. మార్క్సిజం కూడా తీవ్ర విమర్శలకు గురైంది.

8.7 మార్క్సిస్టు విశ్లేషణ - ఒక పరిశీలన

కార్ల్ పాపర్ తన గ్రంథం "ఓపెన్ సొసైటీ అండ్ ఇట్స్ ఎనిమీస్" లో మార్క్సిజాన్ని తాత్విక విశ్లేషణాపూర్వకమైన తీవ్రమైన విమర్శకు గురిచేశాడు.

డార్విన్ జీవశాస్త్రంలోనూ, న్యూటన్ భౌతిక శాస్త్రంలోనూ ప్రతిపాదించిన సూత్రాల లాగా సామాజిక, రాజకీయార్థిక జీవనాన్ని గురించి తాను ప్రతిపాదించిన సూత్రాలు కూడా అంతే శాస్త్రీయమైనవని మార్క్స్ పేర్కొన్నారు. తన 'కాపిటల్' గ్రంథాన్ని డార్విన్‌కు అంకితమిస్తానన్నాడు కూడా. కాని డార్విన్ సమాజ జీవనాన్ని గురించి తనకేమీ తెలియదని, ఐనప్పటికీ తమ ఇద్దరి ధ్యేయమూ జ్ఞానాభివృద్ధే కాబట్టి అభినందిస్తున్నానని చెప్పి మర్యాద పూర్వకంగా తిరస్కరించాడు. తాను ప్రతిపాదించిన శాస్త్రీయ సూత్రాల (Scientific Principles) ప్రకారమే సమాజాలు మారతాయని మార్క్స్ పేర్కొన్నారు. ఆయన మాటల్లోనే

".....even when a society has got upon the right track for the discovery of the Natural laws of its movement ... it can neither clear by bold leaps, nor remove by legal enactments, the obstacles offered by the successive phases of its normal development ..... It is a question of these laws themselves, of these tendencies working with iron necessity towards inevitable results. The country that is more developed industrially only shows to the less developed, the image of its own future.

ఇది ఖగోళ శాస్త్రజ్ఞుడు విశ్వాంతరాళాన్ని వర్ణించినట్లే ఉంది. విశ్వాంతరాళాన్ని, దానిలో జరిగే మార్పులను వర్ణిస్తూ పోగలమేగాని మార్చలేంగదా! సమాజం ఎలా మారుతూ పోతుందో వర్ణించగలమేగాని మన చిత్తానుసారం దాన్ని మార్చలేంగదా! అలా మారుస్తామన్న వాళ్ళనే మార్క్స్ కలలో విహరించే సామ్యవాదులని (Utopians) వర్ణించారు. మార్క్సిజం పేరుతో ఎవరైనా సమాజాన్ని తమ చిత్తానుసారం మార్చడానికి ప్రయత్నిస్తున్నారూ అంటే వాళ్ళు వికారులైన మార్క్సిస్టులే (Vulgar Marxists) నని పాపర్ అంటారు.

మార్క్సిజం మార్క్స్ తరచుగా పేర్కొన్నట్లు డార్విన్, న్యూటన్ జీవ, భౌతిక శాస్త్రాల వంటిది కాదు. శాస్త్రం ప్రయోగపూరితం. సామాజిక విషయాలను ప్రయోగపూరితంగా నిరూపించలేము.

మార్క్సిస్టు ప్రతిపాదనల్లో కొన్నిటిని తేలిగ్గానే కొట్టివేయవచ్చు. పూర్తిగా అభివృద్ధి చెందిన ఇంగ్లండ్ వంటి

పెట్టుబడిదారీ దేశాల్లోనే సమసమాజ ఆవిర్భావానికి అవసరమైన భౌతిక పరిస్థితులుంటాయిని, పెట్టుబడిదారీ వ్యవస్థ పతనంలోనే సమసమాజం ఏర్పడే అవకాశం ఉందని మార్క్స్ ప్రతిపాదించారు. కాని సమసమాజాలు ఆవిష్కరించడింది, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థల్లో కాదు, పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణాలు ఏమాత్రమూ లేని రష్యా, చైనా దేశాలలో.

శ్రామిక వర్గాన్నే నిజమైన విప్లవకారిగా పేర్కొన్నారాయన. ఈ వర్గాన్ని Pal bearers of capitalism అని పేర్కొన్నారు. మార్క్స్ రైతాంగాన్ని విప్లవశక్తిగా గుర్తించకపోగా Sack of Potatos అంటూ హేళన చేశారు. కాని చైనాలో మావో నాయకత్వంలో రైతాంగమే విప్లవశక్తిగా మారింది. నిజానికి పెట్టుబడిదారీ సమాజాలలో శ్రామిక వర్గం విప్లవశక్తిగా మారింది. నిజానికి పెట్టుబడిదారీ సమాజాలలో శ్రామికవర్గం విప్లవశక్తిగా మారకపోగా, వర్గచైతన్యాన్ని కోల్పోయి, విప్లవభావాలకు తిలోదకాలిచ్చి భౌతిక సుఖాల వేటలో పడింది.

సమసమాజాన్ని ఆవిష్కరించేది అశేష ప్రజానికమే (massess) నంటారు మార్క్స్. కాని ఏదో ఒకటి అరా దేశాల్లో తప్ప కమ్యూనిస్టు పార్టీలు అశేష ప్రజానికం మద్దతును చూరగొనలేకపోయాయి. ఒకవేళ కమ్యూనిస్టులు అధికారానికి వస్తే అవి ప్రజాస్వామ్యాలుగా కాక మిలిటరీ అనరాతోనే నడిచాయి. వర్గసమాజంలో మనుషులు రెండు వర్గాలుగా చీలిపోయి ఉంటారని మార్క్స్ ప్రతిపాదించారు. కాని ఆధునిక సమాజాలలో ఈ రెండు వర్గాలకు చెందని ప్రజలు ఎందరో ఉన్నారు.

ఇంతేకాకుండా కార్ల్ పాపర్ మార్క్సిజాన్ని, దాని చారిత్రక అభినివేశవాదాన్ని (historicism) శాస్త్రీయతను మరెన్నో విధాలుగా విమర్శించారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో కూడిన మానవ జీవన వ్యవస్థలకు శత్రువులైన ముగ్గురిలో - పాపర్ ఉద్దేశంలో మార్క్స్ ఒకరు; మిగిలిన ఇద్దరు ప్లేటో, హెగెల్.

ఐనప్పటికీ మార్క్సిజం సామాజిక, ఆర్థిక రాజకీయాభివృద్ధి విశ్లేషణకు ఒక బలవత్తరమైన సిద్ధాంతంగా ఎంతోమంది సామాజికవేత్తలను ఆకర్షించింది. మారిస్ డాబ్, సమీర్ అమీన్, గందర్‌ఫ్రాంక్, మాగడాఫ్, పాల్ చారన్, పాల్‌స్వీజీ, మాల్కం కాడ్‌వెల్ లాంటి ఆధునిక సామాజిక శాస్త్రజ్ఞులు మార్క్సిస్టు విశ్లేషణతో ఆధునిక సమాజాలను అధ్యయనం చేశారు. అందుకే మార్క్సిజం ఇతర దృక్పథాల లాగా ఎన్నో విమర్శలకు గురైనప్పటికీ రాజకీయవ్యవస్థల తులనాత్మక అధ్యయనానికి ఎంతో తోడ్పడుతూనే ఉంది.

- ఆచార్య బి. వెంకటేశ్వర్లు.

8.8 చదువదగిన పుస్తకాలు

Verma S.P:	:	*Modern political ysis*
Johari J.C	:	*Comparative politics.*

8.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. మార్క్సిస్టు రాజకీయ ఆర్థిక, తాత్విక దృక్పథాన్ని చర్చించండి?
2. తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో మార్క్సిస్టు విశ్లేషణ ప్రాధాన్యతను పరిశీలింపుము.
3. మార్క్సిస్టు రాజ్యభావన తులనాత్మక రాజకీయాలను ఎలా ప్రభావపరచింది.

***

భాగం - 9: భావ సిద్ధాంతం పాత్ర

విషయ క్రమం

9.1 లక్ష్యాలు
9.2 పరిచయం
9.3 భావసిద్ధాంతం-అర్థవివరణ
9.4 లక్షణాలు
9.5 ఆధునిక భావసిద్ధాంతం విశిష్ట గుణాలు.
9.6.0 భావవాద సిద్ధాంతాలు
9.6.1 ఉదారవాదం
9.6.2 సంప్రదాయ వాదం
9.6.3 మార్క్స్ సిద్ధాంతం
9.6.4 సంపూర్ణాధికార సిద్ధాంతం
9.7 ముగిసిన భావవాదసిద్ధాంతం
9.8.0 రాజకీయాల్లో విలువల ప్రాముఖ్యం
9.8.1 విలువాత్మక దృక్పథం
9.9 భావసిద్ధాంతం - అధికారం
9.10 వివిధ భావ సిద్ధాంతాలు
9.11.0 భావసిద్ధాంతం కర్తవ్యాలు
9.11.1 సిద్ధాంతాలు
9.11.2 ఆసక్తుల వర్గీకరణ
9.11.3 భావసిద్ధాంతం మార్పులు
9.12 చదువదగిన పుస్తకాలు
9.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

1.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

* తులనాత్మక రాజకీయాల అర్థం,
* అధ్యయన దృక్పథం
* అధ్యయనంలో వచ్చిన పరిణామాలు

బాగా విశదీకరించగలుగుతారు.

9.2 పరిచయం

"భావసిద్ధాంతం" భావన చాలా ప్రాచుర్యం పొందింది. సమకాలీన రాజనీతి శాస్త్ర చర్చల్లో భావ సిద్ధాంతం ప్రముఖ పాత్ర వహిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాల్లో భావసిద్ధాంతం కీలకమైంది. 1930, 40 దశకంలో యూరప్‌లో నాజిజం, ఫాసిజం సిద్ధాంతాలు ఆవిర్భవించి నాటి సామాజిక, రాజకీయ రంగాల్లో వినాశకర పరిణామాలను సృష్టించాయి. రష్యాలో బోల్షివిక్ విప్లవం, కమ్యూనిస్టు పార్టీ నియంతృత్వ స్థాపన, తూర్పు యూరప్ మొత్తం తన ప్రాబల్యం కిందకు తీసుకోవటమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో అగ్రరాజ్యాల మధ్య 1950, 60 దశకాల్లో ప్రచ్ఛన్న యుద్ధ స్థితి ఏర్పడటానికి కమ్యూనిజం దోహదం చేసింది.

భావసిద్ధాంతం కొన్ని భావాల కలయిక ద్వారా ఏర్పడుతుంది. జాతీయవాదం, ఫాసిజమ్, సామ్యవాదం,

ప్రాముఖ్యం ఇవ్వలేదు. క్రైస్తవ మతం ప్రాబల్యం యూరప్ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలను శాసించింది. అయితే ఆధునిక యుగం ప్రారంభం నుంచి యూరప్‌లో ఏర్పడిన పరిణామాలు సాంస్కృతిక పునరుజ్జీవనం క్రైస్తవ మత సంస్కరణోద్యమం మొదలైనవి – మానవుణ్ణి మత ప్రాబల్యం నుంచి క్రమంగా విముక్తుడిని చేసి ప్రాపంచిక, లౌకిక, ఆసక్తుల గురించి తీవ్రంగా ఆలోచించేటట్లు చేశాయి. మానవ మనుగడకు అవసరమైన సంవిధానం, వ్యవస్థలు – ఆర్థిక, రాజకీయ, సామాజిక - నిర్మించుకోవటంలో ఏ భావాలు క్రమంగా తత్వవేత్తలు రూపొందించి వ్యాప్తి చేశారో అవే భావసిద్ధాంతాలుగా ఆవిర్భవించాయి. మానవజీవనం సౌఖ్యవంతంగానూ, అర్థవంతంగానూ, సంపూర్ణంగానూ ఉండటానికి అవసరమైన పరిస్థితులను కల్పించే లౌకిక వ్యవస్థల నిర్మాణం, ఆచరణల గురించి వివిధ భావసిద్ధాంతాలు ఇంగ్లండ్ (1689), అమెరికా (1776), ఫ్రాన్స్ (1789), రష్యా (1917) దేశాల్లో ఏర్పడిన విప్లవాలు మానవజీవనం లౌకికపరంగా సుఖమయం చేయటానికి కొన్ని సిద్ధాంతాలను వ్యాప్తిలోకి తెచ్చాయి. ఆ సిద్ధాంతాలు, భా వాల ప్రోదితో 'భావసిద్ధాంతం' లేదా "ఐడియాలజీ" ఆవిర్భవించింది. ఈ భావ సిద్ధాంతాలు గత 20 సంవత్సరాల నుంచి వివిధ దేశ రాజకీయ, ప్రజా సంస్థలను ప్రభావితం చేస్తున్నాయి.

9.3 భావ సిద్ధాంతం అర్థ వివరణ:

'ఐడియాలజీ' అనే పదాన్ని మొదటిసారిగా 1797లో ఫ్రెంచ్ తత్వవేత్త డిస్ట్యుట్ డిట్రేసీ (Destutt detracy) ఉపయోగించాడు. ఆయన ఐడియాలజీని "భావనల శాస్త్రంగా" (Science of Ideas) వివరించాడు. ఒక నూతన రాజకీయ, సామాజిక వ్యవస్థ నిర్మాణానికి ఈ భావశాస్త్రం కొత్త అధ్యయన దృక్పథాన్ని ప్రవేశ పెట్టింది. అశాస్త్రీయ గతానికి ఇది ఆధునిక ప్రత్యామ్నాయం అయింది. ఫలితంగా భావసిద్ధాంతం రాజనీతి శాస్త్రంలో ఒక కీలక భావన అయింది. "భావ సిద్ధాంతాన్ని" మార్క్స్ "తప్పుడు చైతన్యం" (False Consciousness) గా ఖండించగా కార్ల్ మాన్‌హైమ్ కాల్పనిక వాదం (utopia) గా భావిస్తాడు. కాగా డేనియల్ బెల్ "ఐడియాలజీ పరిసమాప్తం" (End of Ideology) అయిందని భావిస్తాడు.

భావసిద్ధాంతం కొన్ని రాజకీయ వ్యవస్థలను, విలువలను సమన్వయ పరిచే ఒక రాజకీయ సిద్ధాంతంగా, మనం సాధారణంగా అర్థం చేసుకోవడం జరుగుతోంది. ఒక దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక జీవనాన్ని మెరుగుపరిచే విధానం భావనల కలయికగా"ఐడియాలజీ" రూపొందింది. కొన్ని విలువలు, భావాలు ప్రాతిపదికలుగా విధానాలను, నిర్మితులను రూపొందించి వాటిని అమలు చేయటానికి భావసిద్ధాంతం స్ఫూర్తినిస్తుంది.

విశాల దృక్పథంతో పరిశీలిస్తే కొన్ని భావాలతో రూపొందిన సిద్ధాంతంగా "ఐడియాలజీ"ని మనం అర్థం చేసుకోవచ్చు. భావ సిద్ధాంతాలు సాధారణంగా ఉన్న వ్యవస్థను బలపరిచి యథాతథ స్థితిని కొనసాగించేవిగా లేదా ఉన్న వ్యవస్థను పూర్తిగా తొలగించి దాని స్థానంలో ఒక నూతన వ్యవస్థ నిర్మాణాన్ని నిలిపేవిగా రూపొందాయి. కొన్ని వ్యవస్థలను పూర్తిగా తిరస్కరించేవిగా లేదా కొన్ని విలువలను సమర్థించేవిగా అవి ఆవిర్భవించాయి. కాల్పనిక వాదులుగా భావసిద్ధాంతాలను విమర్శకులు విమర్శించినప్పటికీ ప్రతి భావసిద్ధాంతం కొన్ని ప్రగాఢ విశ్వాసాలపై ఆధారపడి ఉంటుంది. దీనిని బట్టి భావసిద్ధాంతం ఒక క్రమబద్ధమైన భావనలను రూపొందించే సిద్ధాంతంగా చెప్పవచ్చు. ప్రకృతి, సమాజం, చరిత్ర – వీటిలో మానవుని ఉనికి, వాటి పరస్పర సంబంధాలు, రాజకీయ మార్పుల ఆవశ్యకత, వ్యవస్థల మధ్య వైరుధ్యాలు మొదలైన వాటిని పరిశీలించటంలో, నిర్దేశించటంలో భావసిద్ధాంతం ఒక దృక్పథాన్ని (perception) సూచిస్తుంది.

భావసిద్ధాంతానికి ఒక జాతి లేదా వర్గ దృక్పథం కూడా ఉంటుంది. నాజిజం జర్మన్ జాతీయ వాదాన్ని ప్రతిబింబిస్తే, కమ్యూనిజం వర్గ దృక్పథాన్నిప్రాతిపదిక చేసుకొంది. ఉదారవాదం, సంప్రదాయ వాదం (Conservatism) ప్రజాస్వామ్యం, మార్క్సిజం, సామ్యవాదం, పాన్-ఆఫ్రికనిజం మొదలైనవి భావసిద్ధాంతాలే. వాస్తవానికి చరిత్రను వివరించటంలో, విశ్లేషించటంలో ఒక్కొక్క భావసిద్ధాంతం ఒక్కొక్క దృక్పథాన్ని అనుసరిస్తుంది.

ఏ రాజకీయ ఉద్యమమయినా ప్రజా సముదాయంలో విజయవంతం కావాలంటే దానికి ఒక భావసిద్ధాంతం అవసరం. ప్రజల ఆశయాలను, ఆకాంక్షలను అభివ్యక్తం చేస్తూ అవసరమైన మార్పులను చేసే విప్లవాలు భావసిద్ధాంతం ప్రాతిపదికపై ఏర్పరిచినవే. భావసిద్ధాంతం సార్థకత ద్వారా క్రియాశీలత గుణంపై ఆధారపడి

ఉంటుంది. కేవలం విలువలను ప్రతిపాదించి వాటి ఆచరణకు మార్గాలు సూచించని భావసిద్ధాంతాలకు ఎక్కువ స్పందన ఉండదు. రాజకీయ సిద్ధాంతం సార్థకతను పరీక్షించడానికి దాని అనువర్తనాన్ని పరిశీలించాలి. అనువర్తనం లేని సిద్ధాంతం కేవలం చర్చావేదికకే పరిమితం అవుతుందే కాని సమాజాన్ని ఆకట్టుకోలేదు.

పై విధంగా చూసినప్పుడు భావసిద్ధాంతం క్రియాశీలక కార్యక్రమపరంగా ఒక క్రమబద్ధమైన, భావాలు, ప్రతిపదికల ఆధారంగా ఏర్పడుతుందని చెప్పవచ్చు. అనువర్తనం భావసిద్ధాంతం సార్థకతకు మూలము, ముఖ్యము.

9.4 లక్షణాలు

పై చర్చను అనుసరించి భావసిద్ధాంతం లక్షణాలను కింది విధంగా క్లుప్తంగా వివరించవచ్చు:

(1) విలువలు, దృక్పథాలతో ఉన్న రాజకీయ సంస్కృతి, భావసిద్ధాంతం ఒకటి తీవ్ర భావసిద్ధాంతం ఆచరణ పద్ధతులను సూచించడమేకాకుండా వ్యవస్థల, విధానాల మూల్యాంకనకు కూడా ఉపకరిస్తుంది. ఉన్న వ్యవస్థను సమర్థించటం, లేదా విమర్శించి, మార్చటానికి ఒక సాధనంగా భావసిద్ధాంతం ఉపయోపడుతుంది.

(2) భావసిద్ధాంతాల్లో వ్యత్యాసం వాటి విషయ సూచికలో కాదు. అవి విభిన్న రాజకీయ వ్యవస్థల్లో ఏ విధంగా పని చేశాయి. వాటిని ఎలా ప్రభావితం చేసాయి అనే అంశాలపైనే భావ సిద్ధాంతాల వ్యత్యాసాలు కనిపిస్తాయి. పంపూర్ణాధికార రాజ్యంలో భావ సిద్ధాంతం ప్రాముఖ్యం ఎక్కువగా ఉంటుంది. ఉదారవాద ప్రజాస్వామ్యాల్లో అంత తీవ్రంగా ఉండదు.

(3) భావ సిద్ధాంతాలు మారుతూ ఉంటాయి. అయితే దీనికి కారణం వాటిలో రుగ్మత ఏర్పడిందని కాదు; లేదా వాటి ప్రాముఖ్యం తగ్గిందని కాదు. రాజకీయ ప్రక్రియలో అవి నిరంతరం ఏదో ఒక రూపంలో కనిపిస్తాయి, ప్రభావితం చేస్తాయి. ఏ భావసిద్ధాంతాన్ని ప్రత్యక్షంగా చరణలోకి తీసుకొనిరావటం అసాధ్యం. రాజకీయ వాస్తవాలను ఆది పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఆచరణ విషయంలో వచ్చిన విభేదాలు ఫలితంగా భావసిద్ధాంతవాదుల మధ్య చీలికలు ఏర్పడవచ్చు. అలాగే దానిని వ్యాఖ్యానించటంలో, అన్వయించటంలో కూడా అభిప్రాయభేదాలు ఏర్పడవచ్చు. నిజానికి ఒక భావసిద్ధాంతాన్ని ఎంతమంది విమర్శించేవారుంటే అది అంత విశ్వసనీయతను పొందగలుగుతుంది.

(4) అవి ఒకరాజకీయ వ్యవస్థలో నిర్వహించే పాత్రనుబట్టి భావసిద్ధాంతాలను కుడి, ఎడమ, అభివృద్ధిదాయక, అభివృద్ధి నిరోధక, సాంప్రదాయక, యథాతథవాద, సంస్కరణవాద, విప్లవాత్మక, తీవ్రవాద మొదలైనవిగా గుర్తించవచ్చు. ఏరాజకీయ వ్యవస్థ భావసిద్ధాంతం ప్రాబల్యం నుంచి పూర్తిగా దూరంగా ఉండదు. ఉదారవాద మద్దతుదారులు "భావసిద్ధాంతం 'ముగిసింది.' అనటం వేరే విషయంకాని సిద్ధాంత ప్రభావం ప్రతిరాజకీయవ్యవస్థపైన, రాజకీయ ప్రక్రియలపైనకూడా ఏదోరూపంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఉంటుంది.

(5) ఒకరాజకీయ సమాజానికి, వర్గానికి భావసిద్ధాంతం మూలస్తంభం వంటిది. భావసిద్ధాంతపరంగా ఒకరాజకీయ పక్షంలో నాయకులు లేదా ముఖ్యులు - రష్యాలో స్టాలిన్, ట్రాట్స్కీలు-తరచు తమ విభేదాలనుబట్టి బట్టబయలుచేస్తారు. వారి వ్యక్తిగత ఆశయాలు, ఆశలు వ్యక్తంచేయటానికి, పోటీదారులను అణగదొక్కటానికి తరచు సిద్ధాంతం స్వచ్ఛత (Purity of idealogy) ముసుగులో గుద్దుకొంటారు.

(6) ఏభావసిద్ధాంతమూ - అదికొన్ని భావాల ప్రాతిపదికపై రూపొందుతుందికాబట్టి - కేవలం విశ్వాసంపై తన మనుగడను కొనసాగించలేదు. అమూర్తభావాలు, అశాస్త్రీయమైన నమ్మకాలపై కాకుండా రాజకీయ చర్యకు ఆచరణకు అనుగుణంగా రూపొంది శాస్త్రీయ విశ్లేషణకు అనుగుణంగా ఉండాలి. సమాజ వాస్తవాలను విశ్లేషించి రాజకీయచర్య విభిన్న సాంఘికవర్గాల ఆసక్తులకు అనుగుణంగా ఉండాలి లేదా శిష్టవర్గాల, గణాల, వ్యక్తుల అభిప్రాయాలపై ఏభావసిద్ధాంతమూ ఆధారపడరాదు.

(7) రాజకీయ చర్యల్లో ప్రజలు పాల్గొనేటట్లు చేయటానికి వారిని ఉత్సాహపరచడానికి భావసిద్ధాంతం ఒక

అభిప్రాయాలపై ఏభావసిద్ధాంతమూ ఆధారపడరాదు.

(7) రాజకీయ చర్యల్లో ప్రజలు పాల్గొనేటట్లు చేయటానికి వారిని ఉత్సాహపరచడానికి భావసిద్ధాంతం ఒక సాధనం. రాజకీయ వ్యవస్థకు భావసిద్ధాంతం చట్టబద్ధతను కలిగిస్తుంది. అసమ్మతివాదులు తమ వ్యతిరేకులను వారిభావ సిద్ధాంత సహాయంతో ఎదుర్కొంటారు.

దాదాపు అన్ని సమకాలీన శక్తివంతమైన రాజకీయభావాలు ఏదో ఒక భావసిద్ధాంతం పరంగా ఏర్పడినవేనని చెప్పవచ్చు. అందువల్లనే ఆధునికయుగాన్ని "భావసిద్ధాంతయుగం" (Age of Ideology) గా వర్ణించడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. ఫలితంగా భావసిద్ధాంతం విభిన్న వ్యక్తులకు, సమూహాలకు విభిన్న అర్థాలను, స్ఫూర్తిని ఇస్తుంది. ఉదాహరణకు, ఉదారవాదులు స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, మానవతావాదులకు ప్రాధాన్యమిస్తే మార్క్సిస్టులు భావసిద్ధాంతాన్ని తక్కువగా అంచనా వేసి దానిని సమాజం నుంచి తొలగించటానికి ప్రయత్నిస్తారు. సంప్రదాయవాదులు మార్పులను తీవ్రంగా వ్యతిరేకిస్తారు. యథాతథంగా ఎటువంటి మార్పులులేకుండా ఉన్న వ్యవస్థను కొనసాగించాలనుకొంటారు. జాతీయతను సదరు హిట్లర్ విధానాలను నాజీజం సమర్పిస్తే, మానవతావాదం, ప్రజాస్వామ్యం విలువలతో ఉదారవాదులు వాటిని తీవ్రంగా ఖండించారు, వ్యతిరేకించారు.

9.5 ఆధునిక భావ సిద్ధాంతం విశిష్టగుణాలు

పైన జరిపిన చర్చను పరిగణనలోకి తీసుకొన్నప్పుడు ఆధునిక భావ సిద్ధాంతానికి ఉన్న మూడు ప్రధాన విశిష్ట లక్షణాలను మనం కిందివిధంగా గుర్తించవచ్చు.

(1) ఆధునిక భావ సిద్ధాంతాలు ధ్యేయం మౌలికంగా కాల్పనికమైంది. అవాస్తవిక ఆశావాదంతో అవి తమ లక్ష్యాలను నిర్వచించటానికి ప్రయత్నిస్తాయి. స్వేచ్ఛా మార్కెట్ విధానం లేదా మార్క్స్ భావన అయిన వర్గరహిత సమాజం ఈ సందర్భంలో ఉదారవాదాలుగా మనం ప్రస్తావించవచ్చు. ఇవి పూర్తిగా కాల్పనికమైనవి, ఆచరణ సాధ్యంకానివి. ఈ రెండు ధ్యేయాలను సమర్థించేవారు ఒక్కసారి సదరు ధ్యేయం అమలులోకి రాగానే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తారు.

(2) ఆధునిక భావసిద్ధాంతాలు అన్నింటినీ సులభతరంగా విభజిస్తాయి. వీరు దేశం, స్నేహితుడు, శత్రువు, స్వేచ్ఛ, నియంతృత్వం, శ్రామిక వర్గం పెట్టుబడిదారులు, దేశభక్తులు-సామ్రాజ్యవాదులు, ఇలా అన్నింటినీ స్పష్టంగా, పరస్పర సంబంధం లేనివిగా రూపొందిస్తాయి. రాజకీయ వాస్తవాలను విశ్లేషించడంలో సదరు భావనలు ప్రతిభావ సిద్ధాంతకర, ఉపయోగించటం. అప్రత్యేకకోణం నుంచి చూడటం సర్వసామాన్యమైంది.

(3) ఆధునిక సిద్ధాంతాలు మానవ అభివృద్ధి పట్ల విపరీతమైన ఆశావాదాన్ని చూపిస్తాయి. వివిధ సిద్ధాంతాల మధ్య జరుగుతున్న పోటీలో ఏ సిద్ధాంతం మన జీవనాన్ని మెరుగుపరచగలదని భావిస్తుందో దానిపట్లే ప్రజలు ఎక్కువ మక్కువ చూపుతారు. ఉదాహరణకు, తూర్పు యూరప్, సోవియట్ యూనియన్‌లో కమ్యూనిస్టు వ్యవస్థలు పతనమయ్యేంతవరకు పెట్టుబడిదారీ, సామ్యవాదవ్యవస్థలమధ్య జరిగిన పోటీలో అనేక మూడో ప్రపంచ దేశాలు ఆర్థిక సమానత్వం, పనిహక్కు మొదలైన నినాదాలవల్ల సామ్యవాద వ్యవస్థపట్ల ఎక్కువ ఆసక్తి చూపించాయి.

9.6.0 భావవాద సిద్ధాంతాలు

భావ వాదానికి సంబంధించిన వివిధ అంశాలు దాని విశిష్ట లక్షణాలను ఇంతవరకు మనం చర్చించాం. ఇప్పుడు భావవాద సిద్ధాంతాలను పరిశీలిద్దాం. వీటిలో ముఖ్యమైనవి :

1. ఉదారవాదం
2. సంప్రదాయవాదం
3. మార్క్సిజం
4. సంపూర్ణాధికార సిద్ధాంతం.

9.6 ఉదారవాదం

ఉదార వాదం సంప్రదాయ, ఆధునిక వాదంగా రెండు భాగాలుగా రూపొందింది.

జాన్‌లాక్ చరనల్లో సాంప్రదాయిక ఉదారవాదం కనిపిస్తుంది. వ్యక్తి స్వేచ్ఛను అధికం చేయాలంటే "పరిమిత ప్రభుత్వం" వాంఛనీయమని లాక్ వాదించాడు. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రభుత్వం అధికారాలు, కర్తవ్యాలు చాలా పరిమితంగా ఉండి వ్యక్తి స్వేచ్ఛకు, కార్యకలాపాలకు ఎక్కువ అవకాశం ఉంటుంది. హాబ్స్, లాస్కీ, లాస్‌వెల్ రచనల్లో ఆధునిక ఉదారవాదం వ్యక్తమయింది. ఒకదేశ రాజకీయ ప్రక్రియలో వివిధ సమూహాలు, సంస్థలు స్వేచ్ఛగా పాల్గొనాలని, అదేసమయంలో ఆధునిక రాజ్యం ఒక సామాజిక సంక్షేమ వ్యవస్థగాను, రూపొందాలని వాదిస్తారు. సాంప్రదాయిక ఉదారవాదం కేవలం వ్యక్తికి అధిక స్వేచ్ఛ కల్పించాలని, ప్రభుత్వాధికారాలు పరిమితంగా ఉండాలని భావిస్తే ఆధునిక ఉదారవాదం ఒకవైపు వ్యక్తి స్వేచ్ఛను కోరుతూ మరోవైపు రాజ్యాధికారంతో దానిని సమన్వయం చేయడానికి ప్రయత్నిస్తుంది. వ్యక్తిస్వేచ్ఛను పరిమితం చేయకుండా ప్రభుత్వం ఆస్వేచ్ఛకు ప్రధాన శత్రువులైన అజ్ఞానం, పేదరికం, వ్యాధులు, నిరుద్యోగం మొదలైన వాటిని తొలగించాలని వాదిస్తుంది. మరోమాటలో చెప్పాలంటే ఆధునిక ఉదారవాదం సంవర్ధక స్వేచ్ఛను కోరుతుంది.

ఉదారవాద సిద్ధాంతం సమాజానికి అత్యధిక ప్రాముఖ్యాన్ని ఇస్తుంది. సమాజంలో ప్రజలందరికీ సుఖమయ జీవన పరిస్థితులు కల్పించాలని, ప్రతివర్గం, ప్రతివ్యక్తి, తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయటానికి అధికార వ్యవస్థలో వాటా పొందటానికి అవకాశం ఉండాలని కోరుతుంది. అందే ఉదారవాదం రాజకీయ బహుళవాదాన్ని సమర్థిస్తుంది. సమాజంలోని విభిన్న వ్యక్తుల సమూహాల, వర్గాల మధ్య ఆసక్తుల ఘర్షణలను తొలగించి వాటిని సాధ్యమైనంతవరకు సమన్వయంచేయాలని కోరుతుంది. మెజారిటీ నియమాన్ని అనుసరించి సమిష్టి విజ్ఞతపట్ల విశ్వాసాన్ని చూపుతూ అన్ని నిర్ణయాలు చేయాలని వాదిస్తుంది. సాంప్రదాయిక ఉదారవాదం ఆర్థిక రంగానికి సంబంధించినంతవరకు అనే విమర్శలకు గురి అయింది. స్వేచ్ఛా వ్యాపార ఉద్యమం పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడటానికి దోహదంచేసింది. ఫలితంగా ఆర్థిక అసమానతలు, శ్రామిక వర్గం దయనీయ పరిస్థితి అనివార్యమయ్యాయి. అంతువల్ల సంవర్ధక ఉదారవాదం ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సామాజిక వ్యాయంతో సమన్వయంచేయటానికి ప్రయత్నిస్తుంది. ఈదృక్కోణం నుంచి ఆర్థికవేత్తలైన కీన్స్, గాల్‌బ్రైత్ మొదలైనవారు తమ భావాలను పునఃపరిశీలించుకోవడం జరిగింది.

9.6.2 సంప్రదాయవాదం

ఒక రకంగా చూస్తే సంప్రదాయవాదం ఉదారవాదానికి ప్రతివాదంగా కనిపిస్తుంది. ఉదారవాదం మార్పును కోరితే సంప్రదాయవాదం యథాతథస్థితిని అంటే ఉన్న వ్యవస్థను ఎటువంటి మార్పులు చేయకుండా కొనసాగించాలని కోరుతుంది. సంప్రదాయవాదం కొన్ని ఉదారవాద భావవాదాలతో ఏకీభవించటం వేరే విషయం. ఫ్రెంచ్ విప్లవాన్ని ఉదాహరణకు ఎడ్‌మండ్ బర్క్ తీవ్రంగా విమర్శించాడు. సామాజిక, రాజకీయ సంస్థలను హింసాకాండతో కూలదోయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించాడు. సంప్రదాయం వాదానికి సంబంధించినంతవరకు అభావ సిద్ధాంతాన్ని బాగా సమర్థించిన తత్వవేత్తలలో ఎడ్‌మండ్‌బర్క్, హెగల్‌లు ముఖ్యులు. భూస్వామ్య వ్యవస్థ, సామాజిక హోదా వ్యవస్థాపిత సంస్థలు, క్షుణీన వర్గం, మధ్యయుగాల తత్వం మొదలైనవన్నీ పై తత్వవేత్తల రచనల్లో ప్రముఖంగా చోటుచేసుకొన్నాయి. వీరు పారిశ్రామికీకరణ, ప్రజాస్వామ్యం, ఉదారవాదం, వ్యక్తి స్వేచ్ఛావాదం, మధ్యతరగతివర్గం మొదలైన వాటిని వ్యతిరేకిస్తున్నట్లు కనిపిస్తుంది. శామ్యూల్‌హంటింగ్‌టన్ ఉద్దేశంలో సంప్రదాయవాదం ఉన్న సంస్థల విలువలను సమర్థించటానికి ప్రయత్నిస్తుంది. మార్పును అంతసులభంగా అంగీకరించరు.

సాంప్రదాయవాద సారాంశం అది మార్పును వ్యతిరేకించడంలో కనిపిస్తుంది. ముఖ్యంగా విప్లవంద్వారా, హింసాకాండ ద్వారా తీసుకొని రావాలనే తీవ్రమార్పులను సంప్రదాయవేత్తలు పూర్తిగా వ్యతిరేకిస్తారు. ఏవ్యవస్థ అయినా తరతరాలుగా అమలులో ఉంటే అధిక సంఖ్యాకుల ఆసక్తులు కాపాడటంవల్ల అది విశ్వసనీయతను పొందుతుంది. అందువల్ల సదరు సంస్థలను, భావాలను పూర్తిగా పనికిరావని, వాటిస్థానంలో నూతన వ్యవస్థలను విప్లవ పద్ధతుల్లో ఏర్పాటుచేయటం వాంఛనీయం కాదని వాదిస్తుంది.

సంప్రదాయవాదంలోని మౌలిక లోపం ఏమంటే అది విప్లవాత్మకమైన మార్పును వ్యతిరేకించడం. ప్రజలను, సమూహాలను ఎటువంటి మార్పులు లేకుండా అన్యాయాన్ని, అసమానతలను అనుభవించమంటుంది. సాంఘిక వ్యవస్థ, అది ఎంతలోప భూయిష్టమైనప్పటికీ, దానికి ఎంత కాలదోషం పట్టినప్పటికీ దానిని మార్చుచేయటానికి, పూర్తిగా తొలగించటానికి సంప్రదాయ వాదులు ఇష్టపడరు. అందువల్ల ఈసిద్ధాంతాన్ని యథాతథవాదంగా వర్ణించడం జరుగుతున్నది.

9.6.3మార్క్స్ సిద్ధాంతం

ఇంతవరకూ ఉన్న భావసిద్ధాంతాలన్నీ తప్పుడువని, అవిసామాజిక వాస్తవాలను వివరించటంలో విఫలమయ్యాయని మార్క్సియన్ సిద్ధాంతం భావిస్తుంది. ఈసిద్ధాంతంవర్గ ప్రాతిపదికపై ఏర్పడింది. క్రైస్తవమతంపై ఫ్యూబర్‌చాక్ చేసిన రచనలను విమర్శిస్తూ అన్ని విలువల సార్థకతకు, మానవుని మనుగడే ప్రధాన గీటురాయి అని మార్క్స్ వాదించాడు. భౌతికపరిస్థితుల అభివృద్ధి ద్వారా మానవుని చైతన్యం వ్యక్తమవుతుంది. "చైతన్యం మానవుడిని ప్రభావితం చేయదు; పరిసరాలు అతని చైతన్యాన్ని ప్రభావితంచేస్తాయి" అంటాడు మార్క్స్.

బూర్జువాసిద్ధాంతాన్ని మార్క్స్ తప్పుడు చైతన్యంగా ఖండించాడు. ఈ తప్పుడు చైతన్యం వర్గ ప్రభావం వల్ల ఏర్పడుతుందని భావిస్తాడు. మార్క్స్ సిద్ధాంతం ప్రకారం చరిత్రలో ప్రతి సమయంలోను ప్రజలు రెండువర్గాలుగా విభజింపబడ్డారు-దోచుకొనేవారు, దోచుకోబడ్డవారు. ప్రాచీన గ్రీక్ కాలంలో కులీన వంశాలు బానిసలను పీడించేవారు. రోమన్‌ల కాలంలో కూడా ఇదే జరిగింది. మధ్యయుగాల్లో భూస్వాములు జీతగాళ్ళు, ఆధునిక కాలంలో పెట్టుబడిదారులు, శ్రమ జీవులు అని ఈవిధంగా చరిత్రపుటలను తిరగవేసినప్పుడు ప్రతిసమాజంలో, ప్రతిసమయంలో ప్రజలు రెండు పరస్పరవైరుధ్య వర్గాలుగా చీలిఉంటారని మార్క్స్ సిద్ధాంతీకరించాడు.

శ్రామికవర్గం, పారిశ్రామిక బూర్జువా వర్గం తీవ్ర దోపిడీకి గురిఅవుతుంది. దీన్ని తొలగించుకోడానికి శ్రామికవర్గం పెట్టుబడిదారీ వర్గాన్ని కూలదోసి అధికారాన్ని చేపడుతుంది. శ్రామికవర్గం అంతిమ ధ్యేయం వర్గరహిత, రాజ్యరహిత సమాజస్థాపన. ఈ కమ్యూనిస్టు సమాజస్థాపనతో వర్గాల మధ్య వైరుధ్యాలు అంతమవుతాయి. ఎందుకంటే మార్క్స్ ఊహించిన కమ్యూనిస్టు సమాజంలో వర్గాలు ఉండవు కాబట్టి.

మొత్తంమీద అన్నిభావాలు వ్యవస్థలోని పాలక వర్గం ఆధిపత్యాన్ని సమర్థించటానికి ఆయుగంలో ఉద్భవించినవే. పాలకవర్గం ఉత్పత్తి సాధనాలను నియంత్రించటంవల్ల ఇది సాధ్యమవుతుంది. భావసిద్ధాంతాలు తప్పుడు చైతన్యాన్ని కలిగిస్తాయి. ఎందుకంటే ఏదో ఒకరోజు సదరు భావాలు తప్పని తెలిసి సత్యం బయటప్పుడు దానిని పాలక వర్గం తన ఆసక్తులను కాపాడుకోడానికి తీవ్రంగా అణిచివేయటానికి ప్రయత్నిస్తుంది. ఈవిధంగా మార్క్సియన్ దృక్పథంతో పరిశీలిస్తే భావసిద్ధాంతం ప్రధాన వర్తక వ్యాపార వర్గం ఆసక్తులను సమర్థించటమే. అందువల్ల భావసిద్ధాంతం పాలకవర్గం ఆసక్తులను ప్రతిబింబిస్తుంది. తనరాజకీయ, ఆర్థిక ప్రాబల్యాన్ని సుస్థిరంచేసుకొని కొనసాగటం పాలకవర్గం ప్రధానలక్ష్యం.

వర్గపోరాట సిద్ధాంతం పరంగా సామాజిక, రాజకీయ వాస్తవాన్ని అర్థంచేసుకోవడం భావసిద్ధాంతంకర్తవ్యం. వర్గ దృక్పథం ప్రాతిపదికగా శ్రామిక వర్గాన్ని చైతన్యం చేసి బూర్జువా వర్గాన్ని కూలదోసి వర్గరహిత సమాజం ఏర్పాటు చేయడానికి అవసరమైన స్ఫూర్తిని భావసిద్ధాంతం ఇవ్వాలి.

అయితే మానవ స్వేచ్ఛ అన్నిటికంటే ముఖ్యమైందని వాదించేవారు మార్క్సియన్ విశ్లేషణను అంగీకరించరు. ఉదారవాదులు మార్క్స్ సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తారు. భావాలు భావ సిద్ధాంతాలు తప్పుడువన్న మార్క్స్ అభిప్రాయంతో వారు ఏకీభవించరు.

మార్క్స్ సిద్ధాంతంలో ఒక ముఖ్యమైన లోపమేమిటంటే అదివర్గ దృక్పథానికి అధిక ప్రాధాన్యమిచ్చి మానవ వ్యక్తిత్వాన్ని విస్మరిస్తుంది. సర్వప్రాబల్యం ఉన్న శ్రామిక నియంతృత్వానికి మానవుడిని బానిసను చేస్తుంది.

9.6.4సంపూర్ణాధికార సిద్ధాంతం

మార్క్స్ వాదాన్ని పరిశీలించిన తరవాత మనం ఇప్పుడు సంపూర్ణాధికార సిద్ధాంతాన్ని చర్చిద్దాం. సంపూర్ణాధికారవాదం ఒకభావ సిద్ధాంతంగా రెండు భిన్నదృక్కోణాలను చూపిస్తుంది. ఒకవైపు వామ పక్షభావంగా మార్క్స్ సిద్ధాంతంనుంచి స్ఫూర్తిని పొంది కమ్యూనిస్టు వ్యవస్థను స్థాపించటానికి ప్రయత్నిస్తుంది. మరోవైపు ఫాసిజం నుంచి ఉద్భవించి కుడి పక్షభావంగా యథాతథస్థితిని, పెట్టుబడిదారీ బూర్జువా వ్యవస్థను కాపాడటానికి ప్రయత్నిస్తుంది.

కమ్యూనిస్టు భావంగా సంపూర్ణాధికార సిద్ధాంతం పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి సమసమాజాన్ని స్థాపించాలని ఆశిస్తుంది. మరో సంపూర్ణాధికార వ్యవస్థ వ్యక్తి స్వేచ్ఛను నియంత్రించి ఉన్న వ్యవస్థను యథాతథంగా సాగించటానికి ప్రయత్నిస్తుంది. సిద్ధాంతరీత్యా రెండు విభిన్న దృక్పథాలున్న ఈ సంపూర్ణాధికార వ్యవస్థలో సారూప్యం ఒకటుంది. అది రెండూ వ్యక్తి స్వేచ్ఛను అణగదొక్కి నియంతృత్వ వ్యవస్థను ఏర్పాటుచేయడం. ఇటలీ, జర్మనీలలో రెండు ప్రపంచయుద్ధాలమధ్య కాలంలో ఫాసిజం, నాజిజం సిద్ధాంతంలో సంపూర్ణాధికార వ్యవస్థలు ముస్సోలినీ, హిట్లర్‌ల నాయకత్వంలో ఏర్పడ్డాయి. సోవియట్ యూనియన్, చైనా, తూర్పు యూరప్ దేశాలు, క్యూబా మొదలైన దేశాలలో కమ్యూనిస్టు నియంతృత్వప్రభుత్వాలు ఇటీవలి వరకూ కొనసాగాయి.

కుడిపక్ష సంపూర్ణాధికార వ్యవస్థ - నాజీ, ఫాసిస్ట్ జాతిని శ్లాఘించటం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కటం, వ్యక్తిస్వేచ్ఛను, సమూహాల బహువాదకార్యకలాపాలను తీవ్ర అణచివేతకు గురిచేయడం, విపథీత ప్రచారాన్ని సాధనాలుగా ఉపయోగించి అనమ్మతివాదాన్ని అణిచివేయడంద్వారా అధికారంలో కొనసాగటానికి ప్రయత్నించింది.

9.7 ముగిసిన భావవాద సిద్ధాంతం

ఇటీవలికాలంలో అమెరికన్ రచయితలు భావవాద సిద్ధాంతం అంతరించిందన్న వాదాన్ని లేవనెత్తారు. డేనియల్ బాల్, రాబర్ట్ లేన్ లు ఈ రచయితల్లో ముఖ్యులు. వాళ్ళ ఉద్దేశంలో భావసిద్ధాంతం తన సార్థకతను కోల్పోయింది. వారి వాదం ప్రకారం పశ్చిమసమాజాలు నేడు ఎంత అభివృద్ధి చెందాయంటే ఏ భావసిద్ధాంతంకాని మరే ఇతరసిద్ధాంతంకాని సార్థకమైనవి కాలేవు. శాస్త్రీయ విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి అన్ని సిద్ధాంతాలను విమర్శనాత్మకంగా పరిశీలించేటట్లు చేశాయి. భావసిద్ధాంతం కార్యక్రమాలు, కర్తవ్యం నేడు శాస్త్రీయ సామాజిక సాంకేతికతలు చేపట్టాయి.

వీరి సిద్ధాంతాలలో ముఖ్యమైన అంశం ఏమిటంటే మార్క్స్ అనంతరం, మార్క్స్, అతని అనుయులు ఊహించని అనేక పరిణామాలు సంభవించాయి. చివరికి శ్రామిక వర్గం జీవన స్థితులు, వేతనాలు మెరుగయ్యాయి. అందువల్ల మార్క్స్‌కాలం నాటి వర్గ దోపిడీ, శ్రామికుల దయనీయ జీవన పరిస్థితులు నేడు లేవు. శ్రామికులు సంఘటితమయి సంఘాలు స్థాపించుకొని తమ స్థితిగతులను మెరుగు పరుచుకోటానికి పెట్టుబడి, పారిశ్రామిక వర్గాలపై ఒత్తిడి తెస్తున్నారు. ఇరుపక్షాల మధ్య సయోధ్యకుదర్చటానికి నేడు రాజ్య యంత్రాంగం పనిచేస్తున్నది. అందువల్ల రాజ్యం ఒకవర్గం మరోవర్గాన్ని దోచుకోడానికి ఉపయోగపడే సాధనం" అన్న మార్క్స్ ప్రవచనానికి నేడు కాలదోషం పట్టింది. అంతేకాకుండా 1990 ప్రారంభ సంవత్సరంలో సోవియట్ యూనియన్ పతనం, తూర్పు యూరప్‌దేశాల్లో కమ్యూనిస్టు వ్యవస్థల కూల్చివేత, జర్మనీ ఏకీకరణ, మాజికమ్యూనిస్టు దేశాల్లో బహుతావాద రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థల అవతరణ అక్కడ మార్కెట్ ఎవరిదీ' అనే ప్రాతిపదికపై ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం మొదలైన పరిణామాలు భావసిద్ధాంతం సార్థకతను వమ్ముచేశాయి.

9.5 రాజకీయాల్లో విలువల ప్రాముఖ్యం

రాజకీయ ప్రక్రియకు సంబంధించిన అనేక అంశాలను చర్చిస్తున్నప్పుడు మనం భావాల ప్రాముఖ్యాన్ని గుర్తించాము. నిజానికి రాజనీతి శాస్త్రం ప్రారంభంనుంచి - అంటే గ్రీకుల కాలంనుంచి తత్వవేత్తల ఆసక్తి ఉత్తమ వ్యవస్థ నిర్మాణం, లేదా ప్రభుత్వాన్ని ఏవిధంగా రూపొందించాలి. అన్న విషయానికే పరిమితమైంది. దీనిని గురించే వారు తీవ్రంగా ఆలోచనచేసి వివిధ వ్యవస్థలను చర్చించారు. నిరంతర మూల్యాంకనం. శాస్త్రీయనిష్పాక్షిక దృష్టి అలవరుచుకోవటం రాజకీయాల అధ్యయనంలో చాలా కష్టమైనపని. రాజకీయ భావాలకు, రాజకీయ ప్రక్రియకు

మధ్య సంబంధం అనేక స్థాయిల్లో మనం గమనించవచ్చు. రాజకీయ ప్రక్రియను క్రమబద్ధంచేసే నియమాల స్వభావంలో దీనిని మనం గుర్తించవచ్చు. అదే విధంగా ప్రభుత్వ విధానాలపై కూడా మనకు నిరంతరంకనిపిస్తుంది. రాజకీయాలపట్ల ఏఏప్రయోజనాలతో వ్యక్తులు ఆసక్తి చూపిస్తారు, ఒకరాజకీయ వ్యవస్థ రాజకీయాలను, విలువలను ఏఏ పద్ధతులద్వారా అధ్యయనం చేస్తారు. మొదలైనవన్నీ రాజకీయ ప్రక్రియను, విలువలకు ఉన్న సంబంధాన్ని వొక్కి చెబుతారు.

ఒకరాజ్యానికి సంబంధించిన రాజ్యాంగం, చట్టాలు, నిబంధనలు అక్కడి రాజకీయ విలువలను ప్రతిబింబిస్తాయి. 1689లో ఇంగ్లండ్‌లో రూపొందిన హక్కుల చట్టం (Bill of Rights) రాజు నిరంకుశాధికారాన్ని పరిమితంచేయడానికి నిర్దేశించబడింది. మంచిప్రభుత్వం భూస్వాములకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటుకు అధికారాలను దశలుచేసినప్పుడే సాధ్యం అన్న నమ్మకం సదరు హక్కులచట్టం ప్రతిబింబించింది. అలాగే అమెరికా రాజ్యాంగం ప్రజాస్వామ్యాధికారం అన్న భావనను విపరీత ప్రజాస్వామ్య భావనకు ప్రాతినిధ్యం వహించింది. అందువల్ల వివిధ ప్రాతినిధ్య సంస్థల మధ్య అధికారం పంపిణీచేయటం జరిగింది. 1936 సోవియట్ రాజ్యాంగం కమ్యూనిస్టు లక్షణాలైన ఆర్థిక, రాజకీయ సమానత్వాలను సాధించటానికి రూపొందింది. దక్షిణాఫ్రికా రాజ్యాంగం ప్రజాస్వామ్యధ్యేయాలను ప్రవహించినప్పటికీ ఇటీవలికాలంవరకు వర్ణ వివక్ష, మైనారిటీ అధికారం, భాగస్వామ్యం కలిగి ఉండి అధిక సంఖ్యాకులైన నల్లవారిని రాజకీయ ప్రక్రియకు దూరంగా ఉంచింది.

ఇలా చూసినప్పుడు అన్ని రాజకీయ వ్యవస్థల నిర్ణయప్రక్రియ ఆయావ్యవస్థలు అనుసరిస్తున్న విలువల ద్వారా ప్రభావితమవుతుంది. అరబ్ దేశాలు ఇజ్రాయిల్‌ను వ్యతిరేకించటం వాటి ఆర్థిక ఆసక్తులకు అనుకూలంగా లేకపోయినప్పటికీ వాటిపై ఉన్న ఒత్తిడివల్ల అవి ఇజ్రాయిల్‌ను సమైక్యంగా ఎదిరిస్తున్నాయి. అలాగే 1950 దశకంలో భారతప్రధాని నెహ్రూ నాటి ఉభయ అగ్రరాజ్యాలకు సమానదూరంగా ఉంటూ ఏసైనిక కూటమిలో చేరకుండా అనుసరించిన అలీన విధానాన్ని నైతిక కారణాలపై సమర్థించుకొన్నారు. అమెరికా తదితర పశ్చిమ దేశాలు అలీన విధానాన్ని విమర్శించారు. అది వేరేవిషయం. 1958-68 మధ్యకాలంలో ఫ్రెంచి అధ్యక్షుడు చార్లెస్ డీగాల్‌తను అనుసరించిన విదేశీ విధానాన్ని ఫ్రెంచ్ వైభవాన్ని పునరుద్ధరించటంకోసమే అని సమర్థించుకొన్నాడు. అమెరికా జోక్యం నుంచి యూరప్ దూరంగా ఉండాలని అయన వాదించాడు. ఆకాలంనాటి ఫ్రెంచ్ విదేశాంగ విధానాన్ని మనం అర్థం చేసుకోవాలంటే. అందువల్ల నాటిఫ్రెంచ్ అధ్యక్షుడి భావాలను అధ్యయనం చేయకతప్పదు.

ప్రతివ్యక్తి రాజకీయ చర్యలు ఆ రాజకీయ వ్యవస్థలో ఉన్న విలువలను బట్టి ఉంటాయి. కొన్ని రాజకీయ విలువలపట్ల ఉన్న ప్రగాఢ విశ్వాసం వల్ల కొన్ని సందర్భాలలో ఆచరణ సాధ్యంకాని విలువలకంటే ఉన్నతమైనవి వారు భావించటం వల్ల కొన్ని సందర్భాలలో రాజకీయ విలువల సాఫల్యం అంతగా లేక పోయినట్లు కనిపించినప్పటికీ- ప్రత్యేకంగా శాస్త్రీయ దృక్పథంతో మనం పరిశీలించినప్పుడు- అవి అనేక వ్యక్తులను కార్యోన్ముఖులను చేయటంలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తాయన్న విషయాన్ని మనం మరచిపోరాదు.

9.8.1 విలువాత్మక దృక్పథం

వ్యక్తులు రాజకీయ ప్రక్రియలో పాల్గొనటానికి వారిని ప్రేరేపించటమే కాకుండా రాజకీయ, నైతిక రాజకీయ శాస్త్రజ్ఞుల దృక్పథాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. ఉదారవాద ప్రజాస్వామ్యాలలో బహుతావాదులు అధికారం రాజ్యానికి మాత్రమే పూర్తిగా ఉండకుండా సమాజంలోని విభిన్న వర్గాల మధ్య పంపిణీ కావాలని వాదిస్తారు. బహుశా వారి ఉద్దేశ్యంలో సమూహాలుగా, సంఘాలుగా, వర్గాలుగా ప్రజలు అనేక స్థాయుల్లో రాజకీయ ప్రక్రియలో పాల్గొంటారు. వీరందరి మధ్య ఏదో ఒక స్థాయిలో సర్వసమ్మతిని కొన్ని కీలకాంశాలపై సాధించినప్పుడే రాజకీయ సుస్థిరత సాధ్యమవుతుంది. వివిధ రాజకీయ విశిష్టవర్గాలు పనిచేస్తాయి.. వాటి మధ్య అవగాహన అవసరం. అలానే లాంఛన నిర్మాణాలున్న ప్రజాస్వామ్య వ్యవస్థలలో స్వేచ్ఛాయుత ఎన్నికలు, సార్వజనీన ఓటుహక్కు, ప్రాతినిధ్యసంస్థలు, పౌరస్వేచ్ఛలు, బహురాజకీయ పక్ష వ్యవస్థలు, రాజకీయ నిర్ణయ ప్రక్రియలో వాటి ఆసక్తి, ప్రభావితం చేస్తాయి.. ప్రజాస్వామ్యం సారాంశం ఏమిటంటే లాంఛన సంస్థల ద్వారా శిష్ట వర్గాలపై నియంత్రణను కొనసాగించటం. పై లాంఛన సంస్థలు పరస్పర పోటీతో బహుమత సమాజంలో పనిచేస్తాయి.

రాజకీయ స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, బడుగువర్గాల అభివృద్ధి మొదలైన విలువలు రాజకీయ

ప్రక్రియను పరోక్షంగా ప్రభావితంచేస్తాయి. కాబట్టి రాజకీయ విలువలకు, రాజకీయ ప్రక్రియకు సన్నిహిత సంబంధం ఉంటుంది. ఈ విలువలు ఒక క్రమపద్ధతిలో వ్యక్తీకరణ పొందినప్పుడు రాజకీయ భావసిద్ధాంతాలుగా రూపాంతరం చెందుతాయి.

9.9 భావసిద్ధాంతం - అధికారం

అన్ని భావసిద్ధాంతాలూ రాజకీయాధికారం పంపిణీ స్వభావంతో ముడిపడి ఉంటాయి. అవి కేవలం తాత్విక భావ సిద్ధాంతాలుగా మిగిలిపోక ఒక నిర్దిష్ట కార్యక్రమం విధానంతో అధికారం ఎవరి మధ్య, ఏ ప్రాతిపదికపై ఎలా పంపిణీ కావాలో చెబుతాయి, వాటికి సంబంధించిన వాదోపవాదాలు చేస్తాయి. ఈ ప్రాతిపదికపై చర్యలు తీసుకోవాలని పట్టుపడతాయి.

రాజకీయభావసిద్ధాంతాలు సమాజంలో ఏదో ఒక వర్గంతో సంబంధాలు పెట్టుకొంటాయి. అంటే ఆ వర్గానికి చెందినవారు, అధికారంలో వాటా కోసం లేదా రాజ్యయంత్రాంగం ద్వారా ఆయా ప్రయోజనాల విస్తరణ, పరిరక్షణకు తగిన చర్యలకోసం ఎదోఒక భావసిద్ధాంతం ద్వారా ఒత్తిడి తెస్తాయి. ఉద్యమిస్తాయి, ప్రభుత్వ జోక్యం కోసం పట్టుపడతాయి.

అనేక భావసిద్ధాంతాలు అయా కాలాల్లో రాజకీయ వ్యవస్థ, ప్రక్రియలపై ప్రభావం చూపించాయి. వీటిలో కొన్ని స్పష్టంగా, క్రమబద్ధంగా రూపొందితే మరికొన్ని అస్పష్టభావాలను అస్తవ్యస్తంగా వ్యక్తీకరించాయి. ఉదాహరణకు, ఫాసిజాన్ని తీసుకొందాం. దీనికి ఒక స్పష్టమైన నిర్వచనం, తాత్విక పునాది, ఆచరణ కార్యక్రమం అంటూ ఏదీలేదు. రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలంలో ఆయాపరిస్థితులు-ముఖ్యంగా ఇటలీ ఎదుర్కొంటున్న ఆంతరంగిక, విదేశీ సమస్యల నేపథ్యంలో ఫాసిస్టు పార్టీ ఇటలీలో ఆవిర్భవించింది. అలాగే జర్మనీలో ఏర్పడిన నాజిజమ్.

9.10 వివిధ భావ సిద్ధాంతాలు

ఫాసిజం, నాజిజం మొదలైన మొదలైన భావసిద్ధాంతాలు ఉదారవాదం, కమ్యూనిజంలతో పోలిస్తే హిట్లర్ "మైన్‌కాంఫ్" తాత్విక భావవివరణ పరంగా నాసిరకం స్థాయిలో ఉంది.

ఫాసిజం, నాజిజంతో పోల్చినప్పుడు కమ్యూనిజం స్పష్టమైన తాత్విక పునాదులతో శాస్త్రీయ వ్యక్తీకరణతో ఒక భావసిద్ధాంతంగా అత్యంత ప్రభావితస్థాయిలో ఉంది. చారిత్రక, సామాజిక, ఆర్థిక విశ్లేషణలు మార్క్సిజంలో మనకు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. హెగెల్ గతి తార్కిక భావవాదం నుంచి మార్క్సియన్ గతితార్కిక భౌతిక వాదం ఉద్భవించింది. ఇది మానవ సమాజ ప్రగతి ఏవిధంగా ఆర్థిక-ఉత్పత్తి, సంబంధాలు, ప్రక్రియలు -వాపరంగా వివరిస్తుంది. ఆర్థిక సంబంధాలను రాజకీయ, సాంస్కృతిక సాహిత్యం అన్నిరంగాలను ఎట్లా ప్రభావితంచేస్తాయో విశ్లేషిస్తుంది. నూతన పరికరాల నిర్మాణం, శ్రమ విభజన ఏవిధంగా వర్గాల ఆవిర్భావానికి పునాదులు అయ్యాయి. వర్గాల మధ్య పరస్పర వ్యతిరిక్త ఆసక్తులు ఎలా ఏర్పడతాయి, శ్రమ దోపిడీ చివరికి శ్రామిక వర్గం పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి దోపిడీ రహిత సమాజస్థాపనకు ప్రయత్నిస్తుంది మార్క్సిజం వివరిస్తుంది.

చారిత్రకంగా పెట్టుబడి దారీ వ్యవస్థ ఆవిర్భావం, వికాసాలను వివరించటమేకాకుండా ఆధునిక పెట్టుబడిదారీ, శ్రామిక వర్గాల అవతరణకు విశ్లేషించడమే కాకుండా శ్రామికులు ఏవిధంగా దోపిడీకి గురిఅవుతున్నారు, పెట్టుబడిదారీ వర్గాన్ని ఏవిధంగా వారు సంఘటితమయి కూలదొయ్యాలి, సదరు దోపిడీ రహిత సమాజాన్ని మరో ప్రత్యామ్నాయంగా, ఏప్రాతిపదికలపై నిర్మించాలి ప్రతివ్యక్తి నుంచి సామర్థ్యాన్ని బట్టీ పనీ, ప్రతివ్యక్తికి అవసరానికి తగిన ప్రతిఫలం - మొదలైనవన్నీ ఒక శాస్త్రీయ దృక్పథంతో కమ్యూనిజం వివరిస్తుంది. విశ్లేషిస్తుంది. మిగతా భావసిద్ధాంతాలకు ఇంత స్పష్టతలేదు.

9.11.0 భావ సిద్ధాంతం కర్తవ్యాలు

భావసిద్ధాంతాల తాత్విక పునాదులు, వ్యక్తీకరణ, స్పష్టంగా లేదా అస్పష్టంగా ఉండటంవల్ల వాటిలో ఉన్న వ్యత్యా సాలున్నప్పటికీ అవికొన్ని విధులను తప్పనిసరిగా నిర్వహిస్తాయి అయితే ఈవిధులను వర్గీకరించటం అంతసులభంకాదు. భావసిద్ధాంతాలు ఏఏ కర్తవ్యాలను నిర్వహిస్తాయి అనే విశ్లేషణ అవి వాటి కుడి, వామ పక్ష దృక్పథాలపై ఆధారపడి ఉంటుంది.

అలాగే మరో సమస్య ఏమిటంటే కొన్ని రాజకీయ వ్యవస్థలు భావ సిద్ధాంత ప్రాతిపదిక బహిరంగంగా కనబడదు. సిద్ధాంత ప్రాతిపదిక (Idealogical base) అనే పదం నిషిద్ధమైంది. అందువల్లనే ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థలో "సిద్ధాంతం అంతరించింది" అనటం నేడు సర్వసామాన్యమైంది. ఆధునిక సమస్యను అర్థంచేసుకోవటంలో భావసిద్ధాంతాలు విఫలమయ్యాయనీ, ప్రజలకు వాటిపట్ల ఆసక్తి లేదని అందువల్ల వాటిని పట్టుకొని వేళ్ళాడకూడదని వాదించడం జరుగుతున్నది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ తదితర పశ్చిమ సమాజాల్లో వ్యత్యాసం వాటి సిద్ధాంతాలు రాజకీయ వ్యవస్థలకు అవి ఏవిధంగా అభివృద్ధిని సాధించటానికి అనుసరించే పద్ధతుల్లో విభేదిస్తున్నాయి.

పై దృక్పథాన్ని సమర్థించేవారు ఈవిధంగా వాదిస్తారు. వివిధ భావసిద్ధాంత కర్తల మధ్య భిన్నాభిప్రాయాలు తగ్గిపోతున్నాయి. అధికారం పొందాలనుకొనేవారు లేదా పాలక పక్షం అనుసరించే విధానాల్లో కూడ చెప్పుకోదగిన వ్యత్యాసాలు లేవు. అమెరికాలోని రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీలు, పశ్చిమ యూరప్‌లో కన్సర్వేటివ్, డెమోక్రటిక్ పార్టీ విధానాల్లో అవ్యత్యాసాలు మనకు ఎక్కువగా కనిపించవు.

అయితే ఈవాదానికి రెండు అభ్యంతరాలు ఉన్నాయి. (1) ఒక నిబద్ధ సిద్ధాంతం నుంచి మరొక సిద్ధాంతానికి మారినంత మాత్రానభావసిద్ధాంతం ప్రాధాన్యత తగ్గదు. దానివల్ల నిబద్ధత తొలగిపోదు. అందువల్ల భావసిద్ధాంతం అంతరించింది అని వాదించేవారు భావసిద్ధాంతాన్ని విప్లవకాల్పనిక వాదంతో జోడించటంవల్ల ఇటువంటిదురభిప్రాయం ఏర్పడుతుంది. (2) రాజకీయ, సామాజిక విలువలపట్ల సర్వసమ్మతి ఉన్నప్పటికి ప్రతి రాజకీయ వ్యవస్థలో కొన్ని మూలభావాలతో ఏదో ఒక సిద్ధాంత ప్రాతిపదిక పనిచేస్తూనే ఉంటుంది. ఉదారవాద ప్రజాస్వామ్యాల్లో భావసిద్ధాంత సంఘర్షణలు లేనంత మాత్రాన సిద్ధాంతం సార్థకతలేదని చెప్పలేం.. ఎందుకంటే ఉదారవాద ప్రజాస్వామ్యం కొన్ని నిర్దిష్ట రాజకీయ విలువలతో రూపొందింది. ఇలా చూసినప్పుడు అన్ని రాజకీయవ్యవస్థలు భావసిద్ధాంతపునాదులపై ఏర్పడినవే అనిపిస్తుంది. అయితే కొన్నింటిలో సిద్ధాంతప్రాబల్యం కొట్టొచ్చినట్లుకనిపిస్తుంది. కొన్నింటిలో సిద్ధాంతపరమైన విభేదాలు ఎక్కువగా కనిపిస్తాయి. సమాజాలు అధిక సంఖ్యాక ప్రజలు మౌలికాంశాల పై విభేదించకుండా ఉన్నప్పుడు సిద్ధాంతపరమైన విభేదాలు ఎక్కువగా కనిపించవు. ఉదారవాద ప్రజాస్వామ్య దానికి ఉదాహరణ, ప్రజాజీవనంలో అవసరమైన వసతులు అధిక సంఖ్యాకులకు అందుబాటులో ఉన్నప్పుడు అక్కడ వివిధ సమూహాల సిద్ధాంతపరమైన వాదాలతో అధికారంలో మార్పుకోసం ప్రయత్నిస్తాయి. భారతదేశంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, నక్సలైట్లు, సామ్యవాదం, సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం మొదలైన నినాదాలపాత్ర ఇటీవలి కాలంలో రాజకీయ ప్రక్రియలో చోటుచేసుకొన్నాయి.

9.11.1 సిద్ధాంతాలు

రాజకీయ భావసిద్ధాంతం నిర్వహించే అత్యంత ముఖ్యమైన కర్తవ్యం ఏమిటంటే అదిరాజకీయ నిర్ణాణాలకు చట్టబద్ధతను ఇస్తుంది. రాజకీయ వ్యవస్థలోని వివిధ సంస్థల మధ్య అధికారాన్ని పంపిణీ చేస్తుంది. అందువల్ల ఉదారవాద ప్రజాస్వామ్యం ప్రజాసమ్మతి ప్రాతిపదికతో ప్రజా ప్రతినిధులతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుంది. ఎన్నికలద్వారా ప్రజా ప్రతినిధులు అధికారం నిర్వహిస్తారు. సార్వభౌమాధికారం అంతిమంగా ప్రజల్లో ఉంటుంది. ఎన్నికలు ప్రభుత్వానికి అనుకూలంగానో లేదో వ్యతిరేకంగానో తీర్పు ఇస్తాయి. ప్రభుత్వ విధాన సార్థకతను అవి నిర్ణయిస్తాయి. వివిధ శిష్టవర్గాలు ప్రజాసమ్మతికోసం, మద్దతుకోసం పరస్పరం పోటీ పడతాయి.

సామ్యవాద వ్యవస్థలోకూడా భావసిద్ధాంతం ఏవిధంగా అధికారాన్ని చట్టబద్ధంచేస్తుందో మనం గమనించవచ్చు. మాజీ సోవియట్ యూనియన్‌లో సామ్యవాదం అధికారికంగా గుర్తింపు పొందిన సిద్ధాంతం. 1917 బోల్షవిక్

విప్లవానంతరం అధికారంలోకి వచ్చినకమ్యూనిస్టులు కమ్యూనిస్టుపార్టీని ఏకైక రాజకీయపక్షంగా కార్మిక కర్షక పీడిత ప్రజానీకానికి అగ్రగామిగా రాజ్యాంగంలో వర్ణించారు, ఇతర పక్షాలను నిషేధించారు. సామ్యవాదాన్నివ్యతిరేకించేవారు, శిక్షార్హులన్నారు. సిద్ధాంత పవిత్రతను నిరంతరం కాపాడుతూ దానిని నిరాకరించేవాదాలను పలుచన చేశారు. "రివిజనిజం" లేదా తిరోగమన వాదులను విప్లవ విద్రోహులు అని నిందించి బహిష్కరించటం లేదా మరణ శిక్ష విధించటం జరిగింది. స్టాలిన్ హయాంలో ఇటువంటివి విపరీత స్థాయిలో జరిగాయి. సామ్యవాదాన్ని పరిరక్షించటానికి జకోస్లోవేకీయాపై దండయాత్రచేసానని సోవియట్ యూనియన్ సమర్థించుకొంది. ఆవిధంగా హంగరీలో రష్యన్ టాంకులు తిరుగుబాటును అణిచివేశాయి.

9.11.2 ఆసక్తుల వర్గీకరణ

భావసిద్ధాంతాలు ప్రజలకోర్కెలను, ఆకాంక్షలను, ఆసక్తులను క్రమబద్ధంగా వ్యక్తీకరిస్తాయి. సమూహాల, జాతుల ఆసక్తులను కూడా కొన్ని సందర్భాలలో కాపాడుకోవడానికి భావసిద్ధాంతం ఉపయోగ పడుతుంది. యూరప్ ఆర్థిక, సమాజంలో చేరటానికిముందు తన ఆసక్తులను పూర్తిగా కాపాడుకోవటానికి బ్రిటన్ పార్లమెంటరీ సార్వభౌమాధికారం పరిమితమవుతుందని వాదించింది. అలాగే ఈనాడు "గాట్" ఒప్పందంపై సంతకం చేయటంవల్ల భారతదేశం తన ఆర్థిక సార్వభౌమాధికారాన్ని కోల్పోతుందన్న విమర్శ వామపక్షాలతోపాటు ఇతర రాజకీయ పక్షాలు సైతం గురిపిస్తున్నాయి. అందువల్ల హక్కుల వ్యక్తీకరణ కారణంగా వాటి సమర్థించటానికి కూడా భావసిద్ధాంతం ఉపయోగపడుతుంది.

భావసిద్ధాంతంకూడా వ్యక్తులు, రాజకీయ ప్రక్రియల ప్రాతిపదికలపై పాల్గొంటారా, పోటీ పడతారా సంఘర్షించుకొంటాయా విశ్లేషించడం కష్టం. ఆర్థిక ప్రయోజనాలు, అధికారం, సామాజిక హోదాల కోసం పోటీ జరుగుతున్నది. దీనిని మనం కాదనలేం. అయితే సదరు పోటీకి స్ఫూర్తిని సిద్ధాంతం కల్పిస్తుంది. వివిధ రాజకీయ పక్షాలు సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, దోపిడీ నిర్మూలన మొదలైన నినాదాలు ప్రజలను ఆకట్టుకోవడానికి ఉపయోగిస్తాయి. భావసిద్ధాంతం ఒకరాజకీయపక్షానికి ప్రాతిపదికగా కనిపిస్తుంది. దాని ఆధారంగా అవి కార్యక్రమాలు నిర్ణయించుకొంటాయి, వాదానాలను రూపొందించుకొంటాయి.

9.11.3 భావసిద్ధాంతం-మార్పులు

భావసిద్ధాంతం రాజకీయ వ్యవస్థకు చట్టబద్ధతనివ్వటమే కాకుండా కాలక్రమంగా వస్తున్న మార్పులను సైతం ఆకళింపు చేసుకొంటుంది. రాజకీయ మార్పులను వివరించటానికి వాటిని ఉపయోగించటం జరుగుతుంది. మార్పు త్వరితంగా జరిగినప్పుడు, వాటిని వ్యతిరేకించేవారు ఉన్నప్పుడు సదరు వ్యతిరేకులను తొలగించటానికి భావసిద్ధాంతం దోహదం చేస్తుంది. ఆర్థిక,సామాజికరంగాల్లో నూతన వర్గాలు అవతరించినప్పుడు వాటి ఆసక్తులు, వ్యక్తీకరణ, అధికారంలో భాగస్వామ్యంకోసం చేసే ప్రయత్నాలు రాజకీయ రంగంలో మార్పులు తీసుకొని వస్తాయి. ఈమార్పులను భావసిద్ధాంతం వివరించటానికి, విశ్లేషించటానికి ఉపయోగపడుతుంది.

రాజకీయ పరిణామాలన్నీ హఠాత్తుగా ఏర్పడవు. కొన్ని మార్పులు క్రమక్రమంగానే వస్తాయి. మరికొన్ని తక్షణమే జరుగుతున్నట్లు కనిపిస్తాయి అయితే అవి రాజకీయ వ్యవస్థ సామర్థ్యంపై ఆధారపడిఉంటాయి. రాజకీయవ్యవస్థ సార్థకత, ప్రజల ఆసక్తుల వ్యక్తీకరణ వివిధ వర్గాలు రాజకీయాధికారం కోసం పాటుపడ్డట్లు మొదలైన వన్ని అంతిమంగా భావసిద్ధాంత ప్రాతిపదికపై రూపొందినవే.

- డా॥ వి. రవీంద్ర శాస్త్రి

9.12 చదువదగిన పుస్తకాలు

K. Seshadri : *Studies in Marxism and political science*

Verma S.P. : *Modern political analysis*

Coker : *Recent political thought*

A.R. Bal : *Modern politics and Government*
Johari J.C : *Comparative Politics*

9.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో జవాబులు రాయండి

1. ఆధునిక భావ సిద్ధాంతపు విశిష్ట గుణాలను విశ్లేషించండి.

2. భావ సిద్ధాంతపు అర్థాన్ని వివరించండి.

...

ఖండం-III రాజకీయ వ్యవస్థలు

తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో రాజకీయ వ్యవస్థలు చాలా ప్రధానమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. రాజకీయ పార్టీలు, ప్రభావవర్గాలు, రాజకయ భాగస్వామ్య పద్ధతులను ఈ ఖండంలో చర్చించాం.

భాగం - 10: రాజకీయపార్టీలు - పార్టీవ్యవస్థలు

విషయ క్రమం

10.1 లక్ష్యాలు
10.2 పరిచయం
1.0.3 రాజకీయ పార్టీలు-నిర్వచనం
10.4.0 రాజకీయపార్టీల విధులు
10.4.1 ప్రాతినిధ్యం
10.4.2 మార్పిడి, సమీకరణం
10.4.3 సంఘటితం
10.4.4 అనునయం
10.4.5 రాజకీయ భర్తీ
10.4.6 విధానరూపకల్పన
10.4.7 ప్రభుత్వంపై నియంత్రణ
10.5 రాజకీయ పార్టీ - వ్యవస్థీకరణ
10.6 రాజకీయపార్టీ వ్యవస్థ - రకాలు
10.7 రాజకీయపార్టీలు - నాయకత్వం
10.8 రాజకీయ పార్టీల అధ్యయన పద్ధతులు
10.9 భారతదేశంలో రాజకీయ పార్టీలు.
10.10 అమెరికాలో పార్టీ వ్యవస్థ
10.11 బ్రిటన్‌లో పార్టీ వ్యవస్థ
10.12 ఫ్రాన్సులో పార్టీ వ్యవస్థ
10.13 వర్థమాన దేశాల్లో రాజకీయ పార్టీలు
10.14 చదువదగిన పుస్తకాలు
10.15 నమూనా పరీక్షా ప్రశ్నలు

10.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

* రాజకీయ పార్టీలు అంటే ఏమిటి
* రాజకీయ పార్టీల విధులు
* వాటి వ్యవస్థీకరణలు
* వివిధ దేశాలలో పార్టీల వ్యవస్థల

గురించి బాగా వివరించగలుగుతారు.

1.2 పరిచయం

ఆధునిక కాలంలో రాజకీయ పార్టీలు 19వ శతాబ్దంలో ఆవిర్భవించాయి. ప్రాతినిధ్య సంస్థల ఏర్పాటు, ఓటు హక్కు విస్తరణ ఫలితంగా, అమెరికా, ఐరోపా ఖండాలలో రాజకీయ పార్టీలు రూపుదిద్దుకోవడం మొదలుపెట్టాయి. 1850 సంవత్సరం వాటికి ఒక్క అమెరికాలో తప్ప మరెక్కడా రాజకీయ పార్టీలు లేవు. అంతకు ముందు కాలంలో ప్రపంచ దేశాలలో 'ట్రెండ్స్ ఆఫ్ ఒపీనియన్' (trends of opinion) 'పాపులర్ క్లబ్స్' (popular clubs), "ఫిలసాఫికల్ సొసైటీస్" (Philosophical societies), "పార్లమెంటరీ గ్రూప్స్"లు ఉండేవి. అంటే వివిధ దృక్కోణాల నుంచి

దృక్పథాలు ప్రస్ఫుటం అయ్యేవి కాని రాజకీయ పార్టీలనే ప్రత్యేక నిర్మితులు లేవు.

10.3 రాజకీయ పార్టీలు – నిర్వచనం

రాజకీయ పార్టీలను ప్రభుత్వానికి, సమాజానికి మధ్య "ఆవశ్యక లింకులు" (essentials links) గాను, "ప్రధాన చోదక శక్తి" (main moving force) గాను పరిగణించవచ్చు. 20 వ శతాబ్దంలో రాజకీయ మనుగడలో ఇవి ముఖ్య భూమిక వహిస్తున్నాయి. పార్టీ అనే పదం పార్టిర్ (Partir) అనే ఫ్రెంచ్ పదం నుంచి వచ్చింది. పార్టిర్ అంటే విభజించడం (divide) అని అర్థం. రాజకీయ పార్టీల పాత్ర, స్వభావం, విధుల ఆధారంగా రాజనీతి శాస్త్రజ్ఞులు వీటిని నిర్వచించారు. కొన్ని నిర్వచనాలను ఇప్పుడు పరిశీలిద్దాం.

మెకైవర్ (Mac Iver) అభిప్రాయంలో "political party is an association organised in support of some principles or policy which by constitutional means it endeavours to make the determinant of Government" (Mac Iver, The Modern State, p. 396).

కొన్ని సూత్రాలను లేదా విధానాన్ని సమర్థిస్తూ రాజ్యాంగబద్ధమైన పద్ధతుల ద్వారా ప్రభుత్వాధికారం పొందడానికి కృషి చేసే వ్యవస్థీకృతమైన కొందరు వ్యక్తుల సంఘాన్ని రాజకీయ పార్టీ అంటారని మైకైవర్ తెలిపాడు.

ఒక నిర్దిష్టమైన కార్యక్రమం (Programme) ఆధారంగా ప్రత్యేకమైన సంస్థలో భాగస్వామ్యం, ఇతర సంస్థల నుంచి వేర్పాటు (Separation) రాజకీయ పార్టీ సూచిస్తుందని సిగ్మండ్ న్యూమన్ (Sigmand Newman) అంటాడు. ఇతడి అభిప్రాయంలో "Political Party is "the articulate organisation of society's active political agents, those who are concerned with the control of governmental power andwho compete for popular support with another group and groups holding diverse views. As such, it is the great intermediary which links social forces and ideologies to official governmental institutions and relates them to political action within the large political community".

విభిన్న అభిప్రాయాలున్న ఇతర సమూహాలతో ప్రజా మద్దతు కోసం పోటీ పడుతూ, ప్రభుత్వాధికారాన్ని పొందడానికి ప్రయత్నం చేస్తుండే సమాజంలోని చురుకైన రాజకీయ ప్రతినిధులుగా వ్యవహరించే సంఘమే రాజకీయ పార్టీ.

అధికారం పొందడానికి వినియోగించే ఒక సాధనంగా భావిస్తూ రాజకీయ పార్టీని షుంపీటర్ (Shumpeter) ఈ విధంగా వివరిస్తాడు. రాజకీయాధికారం కోసం జరిగే పోటీతో కూడిన సంఘర్షణతో కలిసికట్టుగా వ్యవహరించడానికి పూనుకొనే వ్యక్తుల సమూహమే రాజకీయ పార్టీ. (Party is a group whose members propose to act in concert in the competitive struggle for power)

సార్టోరీ (Sartori) రాజకీయ పార్టీని ఈ విధంగా నిర్వచించాడు. "A political party is a political group that contests election, and is capable of placing through election (free or unfree) candidates for public office. ఎన్నికలలో పోటీ చేస్తు, పోటీ ద్వారా (స్వేచ్ఛాయుతమైనదికానీ, లేనిది కాని) రాజకీయ పదవులకు అభ్యర్థులను పంపే రాజకీయ సమూహాన్ని రాజకీయ పార్టీ అంటారు.

డువర్జెర్ (Duverger) అభిప్రాయంలో "A political party is not a community but a collection of communities, a union of small groups dispersed throughout the country". రాజకీయ పార్టీ అంటే దేశం నలుమూలలా విస్తరించి ఉండే ప్రజా సమూహాల సముదాయం, ప్రజా సంఘాల కూర్పు.

ఎల్డర్ స్వెల్డ్ (Eldersveld) రాజకీయ పార్టీని ఒక సాంఘిక సమూహమని, ఈ సమూహం సమాజంలో అర్థవంతమైన, నిర్ణిత వైఖరితోను, కార్యకలాపాలు నిర్వహిస్తుందని అంటాడు. ఇతడి మాటలలో "A Political party is a social group, a system meaningful and patterned activity within the larger society. It consists

of a set of individuals, popularising specific roles and behaving as members - actors of a boundarised and identified social unit".

మైరవ్ వైనర్ (Mayon Weiner) జోసఫ్ లాపాలంబారా (Joseph La Palambara) లు రాజకీయ పార్టీలను ఈ విధంగా వివరించారు. "A political party is an identifiable group of persons, in a given society, who organise themselves on a stable basis with a purpose of exercising political power, in order to achieve what they perceive to be the goals of that society".

ఒక సమాజంలో రాజకీయాధికారాన్ని వినియోగించడం ద్వారా, తాము నమ్మిన లక్ష్యాలను సాధించడం కోసం స్థిరమైన ప్రాతిపదికపై వ్యవస్థీకృతమైన, గుర్తించడానికి వీలైన ప్రజా సమూహాన్ని రాజకీయ పార్టీ అంటారు.

జీన్ బ్లోండెల్ (Jean Blondel) అభిప్రాయంలో "Political parties are groupings, but groupings of a particular kind. Clearly it is not sufficient to say that they are political, while other groups are not. Politics being a procedure, body is political only to the extent that it participates in the procedure of solution of conflicts.

బ్లోండెల్ అభిప్రాయంలో రాజకీయ పార్టీల ప్రత్యేక తరహాకు చెందిన సమూహాలు. రాజకీయాలు క్రియాశీలమైనవి. అందువల్ల వివాదాలు పరిష్కరించే విధానంలో పాల్గొనే సమూహాలను రాజకీయ సమూహాలనడం సముచితం. అధికారం పొందగోరుతాయి కనుక రాజకీయ పార్టీలు బాగా రాజకీయాకరణ చెందినవని గమనించాలి. అంతే కాకుండా అవి పరిష్కరించ గోరే సమస్యలు పరిమితంగా ఉండవు. సమస్యల పరిష్కారానికి, పరిపాలన నిర్వహణకు, తదితర విషయాలకు సంబంధించిన అన్ని రకాల నిర్ణయాల పట్ల ఇవి శ్రద్ధ చూపుతాయి అని కూడా బ్లోండెల్ అంటాడు.

మార్క్సిస్టు దృక్పథంలో రాజకీయ పార్టీ నిర్మాణంలో వర్గానికి (class) ప్రాముఖ్యముంది. రాజకీయాధికారం పొందడానికి కార్మికవర్గం సమీకృతమై వ్యవస్థీకృతమవుతుందని లెనిన్ అంటాడు. లెనిన్ మాటల్లో కమ్యూనిస్టు పార్టీ (Vanguard of Revolution) అంటే విప్లవానికి నాయకత్వం వహిస్తుందన్న మాట. రాజకీయ పార్టీ సాధనంగా కార్మికవర్గం ఒక విధమైన వర్గ చైతన్యాన్ని, స్ఫూర్తిని పొంది బూర్జువా ఆధిక్యతను తొలగించడానికి కృషి చేస్తుంది. మార్క్సిస్టుల దృక్పథంలోని బుర్జువా, కార్మిక వర్గాలు రెండూ రెండు తరహాల అభిప్రాయాలకు, భావాలకు ప్రతీకలని, రెండు రకాల జీవన విధానాలకు ఉదాహరణలని కొందరంటారు.

లక్షణాలు: పై నిర్వచనాలను పరిశీలిస్తే రాజకీయ పార్టీలకు కింది లక్షణాలుంటాయని విశదమవుతుంది.

(1) రాజకీయ పార్టీ ఒక దృఢమైన సంఘమని, పదులుగా ఏర్పడిన ప్రజా సంఘం కాదని తెలుస్తుంది. ఇందులోని సభ్యుల సంఖ్య మరీ పరిమితంగా ఉండదు.

(2) రాజకీయ పార్టీలకు కొన్ని ఆశయాలు, లక్ష్యాలు, నమ్మిన సిద్ధాంతాలు ఉంటాయి. ఈ విషయాన్ని రాజకీయ పార్టీలను గురించి అధ్యయనం చేసిన వారందరూ ఈ విషయాన్ని వివరించారు. ఆశయాలతో బాటు పార్టీలకు నిర్దిష్టమైన కార్యక్రమాలుంటాయి.

(3) ఇవి రాజ్యాంగబద్ధమైన పద్ధతుల ద్వారా ప్రభుత్వాధికారాన్ని పొందడానికి ప్రయత్నిస్తాయి. అధికార సముపార్జనకు, విధానాల అమలుకు, కార్యక్రమ నిర్వహణకు, వివిధ వర్గాల ప్రయోజనాల పరిరక్షణకు ఇవి అవసరం.

(4) సమిష్టి కృషి రాజకీయ పార్టీల ఏర్పాటులో అంతర్భూతమై ఉన్న లక్షణం. అందువల్ల సభ్యుల మధ్య సమన్వయభావం, సహకార ధోరణి రాజకీయ పార్టీల ఆశయ సిద్ధికి ఎంతో అవసరం.

(5) అధికారం పొందగోరే ప్రయత్నంలో పోటీ తప్పని సరి. దీని నిర్వహణకు, పార్టీ కార్యక్రమాల నిర్వహణకు, మార్గ దర్శకత్వానికి నాయకత్వం కూడా అవసరం. నాయకత్వ లక్షణాలపై కూడా పార్టీ కార్యక్రమం, నిర్వహణ నియమావళి, ఆశయ సాధన ఆధారపడి ఉంటాయి.

10.4.0 రాజకీయ పార్టీల విధులు

రాజకీయ పార్టీల విధులు రాజకీయ వ్యవస్థల స్వరూప స్వభావాలపై ఆధారపడిఉంటాయి. ఒకే రాజకీయ వ్యవస్థలో అన్ని పార్టీల ఒకే విధమైన కర్తవ్యాలు నిర్వహించవు. ఉదాహరణకు, జాతీయ పార్టీల విధులు విస్తృతంగా ఉంటాయి. వీటితో పోలిస్తే ప్రాంతీయ పార్టీలు నిర్వహించే కర్తవ్యాలు తక్కువ. సాధారణంగా రాజకీయ పార్టీల కింది విధులు నిర్వహిస్తాయి.

10.40.1 ప్రాతినిధ్యం (Representation)

ప్రజా సమస్యలను సంబంధిత నిర్మితులకు నివేదించడంలో రాజకీయ పార్టీలు పాత్ర వహిస్తాయి. అంటే తాము ముఖ్యమని భావించిన ప్రజా సమస్యలను ప్రయోజనాలను వ్యక్తీకరించే కృషి చేస్తాయి. ఈ వ్యక్తీకరణ చే యడంలో నాయకులు, సభ్యుల పాత్ర కూడా ఉంటుంది. ఈ కర్తవ్య నిర్వహణలో ముఖ్యంగా విస్తరించి ఉన్న పార్టీల విషయంలో, వివిధ ప్రయోజనాలను పరిశీలించి ఒక సాముదాయిక నిర్ణయం తీసుకొని, ప్రయోజనాల వ్యక్తీకరణ జరుపుతాయి. మరో విధంగా చెప్పాలంటే ప్రయోజనాల విషయంలో సంబంధిత వర్గాలకు, విధాన నిర్ణేతలకు మధ్య, మధ్య వర్తులుగా వ్యవహరిస్తాయి.

10.4.2 మార్పిడి, సమీకరణ (Conversion, Aggregation)

రాజకీయ పార్టీలు వ్యవస్థలోని వివిధ ప్రయోజనాలను సాధారణ విధాన ప్రత్యామ్నాయాలుగా మార్పు చేస్తాయి (general policy alternatives). అంటే వివిధ ప్రయోజనాలను, కోర్కెలను సమగ్ర పరిశీలన జరిపి అవి సాధించడానికి తోడ్పడే విధాన ప్రతిపాదనలు చూస్తాయి.

10.4.3 సంఘటితం (Integration)

రాజకీయ పార్టీలు సంఘటన సంబంధమైన కర్తవ్యాలు నిర్వహిస్తాయి. ఉదాహరణకు, రాజకీయ వ్యవస్థలోని సభ్యులను రాజకీయంలో భాగస్వాములుగా చేసి వ్యవస్థలో వారిని విలీనం చేస్తాయి. ఇలా జరగడం వల్ల విలీనంతో బాటు సామాజికరణ, సమీకరణ కూడా సాధ్యమవుతాయి. వర్గ ప్రయోజనాలను, విభిన్న భాషా, సాంస్కృతిక సముదాయాలను, ఇతర ప్రజాసమూహాలను ఒక సాధారణ నమూనాలో జొప్పిస్తాయి. ఈ సాధారణ నమూనాయే రాజకీయ వ్యవస్థ. విలీనం చేసే సాధనమే రాజకీయ పార్టీ. ఎన్నికలలో అభ్యర్థులను ఎంపిక చేసి పోటీ చేయించడం ద్వారా అభ్యర్థుల పాత్రలో వ్యక్తులను విలీనం చేస్తాయి. భారత స్వాతంత్ర్య సమర కాలంలో పౌరులను ఉద్యమంలో విలీనం చేయడంలో భారత జాతీయ కాంగ్రెస్ గణనీయమైన కృషి చేసింది. దేశ సమగ్రతను కాపాడటానికి రాజకీయ నాయకత్వం నిరంతరం కృషి చేస్తుంది.

10.4.4 అనునయం (Persuasion)

రాజకీయాధికారం పొందడం సాధారణంగా రాజకీయ పార్టీ లక్ష్యంగా పెట్టుకొంటుందని తెలుసుకొన్నాం. ఈ లక్ష్యసాధనకు పార్టీలకు ప్రజల అండదండలు అవసరం. దీనిని పొందడం కోసం పార్టీలు తమ విధానాలను ప్రజా ప్రయోజనాలు సాధించడానికి అనువైనవిగా రూపొందిస్తాయి. విధానాలను ప్రజల ముందుంచుతాయి. పార్టీలు కొన్ని విలువలను, సూత్రాలను నమ్ముతాయి. నిర్ణీతమైన సిద్ధాంతం వాటికి ఉంటుంది. వీటికి అనుగుణంగా ఉండే విధానాలు నిర్ణయించి ప్రజల మద్దతు పొందడానికి ఇవి నిరంతరం కృషి చేస్తాయి.

10.4.5 రాజకీయ భర్తీ (Political Recruitment)

రాజకీయాల నిర్వహణ రాజకీయ పార్టీలులేకుండా ఊహించడానికి వీలులేనిది. ఈ నిర్వహణ గమనంలో నాయకులు, ఉపనాయకులు, సాధారణ సభ్యులు మొదలైన పాత్రధారులు రాజకీయ పార్టీలో ఉంటారు. ఒక విధంగాచెప్పాలంటే రాజకీయ పార్టీల ద్వారానే నాయకత్వం ఆవిర్భవిస్తుంది. అలాగని నాయకత్వ లక్షణాలున్న వ్యక్తులు పార్టీ ఆవిర్భావానికి దోహదం చేయరని కాదు. ఎన్నికలలో, పోటీలో తగిన అండదండలు అభ్యర్థులకు అందిస్తాయి. పార్టీకి చెందని వ్యక్తులు, ఉన్నత రాజకీయ పదవులు పొందడం చాలా అరుదైన విషయమని చెప్పవచ్చు. ఒక వేళ పార్టీకి చెందకపోయినా ఏదైనా పార్టీ మద్దతు లేనిదే పదవి పొందడం చాలా కష్టం.

10.4.6 విధాన రూపకల్పన (Policy Formulation):

విధాన నిర్ణయంలో వివిధ వర్గాల ప్రయోజనాలను పార్టీలు చర్చిస్తాయి. అటు మీదట అమలు చేయాల్సిన విధానాలను, కార్యక్రమాలను నిర్ణయిస్తాయి. ఈ విధంగా పొందికైన, సందర్భోచితమైన విధాన నిర్ణయంలో భాగస్వాములుగా పార్టీలు వ్యవహరిస్తాయని చెప్పవచ్చు.

10.4.7 ప్రభుత్వంపై నియంత్రణ (Control of Government):

ప్రభుత్వంపై నియంత్రణ కార్యక్రమాన్ని రాజకీయ పార్టీలు అనేక విధాలుగా అమలు పరుస్తాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాలలో అధికార పార్టీ కార్యక్రమాలను విధానాలను విమర్శించడంలో ప్రతిపక్షాలు నియంత్రణ విధిని నిర్వహిస్తాయి. ఈ విధమైన నియంత్రణ వల్ల ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించడానికి వీలుంటుంది. రాజకీయ పార్టీల విధులను వివరిస్తూ ఇవి 6 రకాలుగా ఉంటాయని పీటర్ మెర్కిల్ అంటాడు. అవి:

(1) ప్రభుత్వ పదవులకు రాజకీయ భర్తీ, నాయకత్వం ఎంపిక (Recruitment and selection of leadership personnel for govt. offices).

(2) ప్రభుత్వానికి విధానాలు, కార్యక్రమాలు తయారు చేయడం (generation of programmes and policies for government)

(3) ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, ప్రభుత్వంపై నియంత్రణ (co-ordination and control of governmental organs).

(4) ఒక సామాన్య సిద్ధాంతం, నమ్మకాల వ్యవస్థను రూపొందించడం లేదా ప్రజా సమూహాల కొర్కెలను తీర్చడం ద్వారాను, అనుకూల చర్యల ద్వారాను సాంఘిక సమగ్రత సాధించడం. (social integration through satisfaction and reconciliation of group demands or the provision of a common belief system or idealogy).

(5) రాజకీయ సామాజికరణ ద్వారా సమాజంలోని వ్యక్తులను కూడగట్టడం లేదా సంఘటితం చేయడం.

(6) వ్యతిరేక సంఘం ఏర్పాటు లేదా కూలదోయడం (counter-organisation or subversion). క్లుప్తంగా, రాజకీయ పార్టీలు ఆశయ రూపకల్పన (goal formulation), ప్రయోజనాల వ్యక్తీకరణ (interest articulation), సామాజికరణ, సమీకరణ (socialisation and mobilisation), మేధావులను తయారు చేయడం (elite formation), భర్తీలకు సంబంధించిన కర్తవ్యాలు నిర్వహిస్తాయని కె. వాన్ బైర్మీ (K. von Beyrne) అంటాడు. ఇక్కడ గమనించదగిన విషయమేమంటే రాజకీయ పార్టీలు ఇంతకు ముందుకంటే ఇటీవల ఎక్కువ కర్తవ్యాలు నిర్వహిస్తున్నాయి. ఆధునిక రాజకీయ పార్టీలు వ్యవస్థలో ప్రతి ముఖ్య సమస్యను పట్టించుకోవడమే కాకుండా దానిపై తమ వైఖరిని స్పష్టం చేయడం జరుగుతోంది.

10.5 రాజకీయ పార్టీ: వ్యవస్థీకరణ

పార్టీ వ్యవస్థీకరణ అంటే స్థూలంగా అంతర్గత నిర్మాణం అని అర్థం. అయితే ఈ నిర్మాణాన్ని నిర్ణయించేటప్పుడు అనేక విషయాలను పరిశీలించాలి. ఉదాహరణకు, సభ్యుల సంఖ్య, పార్టీ విధాన నిర్ణయ నిర్మితులు, అధికారాలు, వివిధ నిర్మితుల మధ్య సంబంధాలు అధికార కేంద్రీకరణ లేదా వికేంద్రీకరణ, పార్టీకి సహాయం చేసే ఉద్యోగి బృందం యొక్క స్వరూప స్వభావాలు, వాటి అధికారాలు, పార్టీకున్న స్థానిక స్థాయి, సంస్థల నిర్మాణం మొదలైన వాటిని జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. వీటన్నిటిలో మునిశితమైనవి పార్టీ సభ్యత్వం, నాయకత్వం పార్టీ పని చేసే తీరు తెన్నులపై సిద్ధాంతపరమైన, సంఘటనపరమైన ప్రభావాలుంటాయి. వివిధ పార్టీలకు వేరువేరు గమ్యాలు, ప్రాధాన్యతలు ఉండటంవల్ల స్థూలస్వరూపం ఒక్కటైనా ఆచరణలో బేధాలు కనిపించవచ్చు. అందువల్లనే అమెరికా, ఐరోపా ఖండాలలోని పార్టీ వ్యవస్థల స్థూలనమూనా పోటీయుత పార్టీ వ్యవస్థ అయినప్పటికీ నిర్వహణలో బేదాలుంటాయి. ఇక ఒకే పార్టీ వ్యవస్థ ఉన్నప్పుడు పోటీకి అవకాశం తక్కువ. ఏదిఏమైనా అన్ని రాజకీయపార్టీలకు వ్యవస్థీకరణ తప్పనిసరి. ఇదిలేనిదే కర్తవ్యనిర్వహణ సాధ్యం కాదు. డిస్‌రైలీ

(Disraeli) అభిప్రాయంలో పార్టీలు ప్రత్యేక వ్యవస్థీకరణ స్వరూపాలు వీటిని, సువ్యస్థిత భావం (organised opinion) అని ఇతడు వర్ణిస్తాడు. పోటీయుత పార్టీ వ్యవస్థలున్న దేశాలలో వ్యవస్థీకరణ స్థాయి సముచితంగా ఉండాలి. ఎన్నికలలో పోటీ చేయడం, వివిధ ఎన్నికలలో తమబలం నిలబెట్టుకొనే ప్రయత్నం చేయడం మొదలైన కర్తవ్యాల నిర్వహణకు స్థిరత్వంతో కూడిన వ్యవస్థీకరణ పార్టీలకు అవసరం. నిరంతరం పార్టీ కార్యక్రమాలనిర్వహణకు, కాలానుగుణంగా నిర్ణయాలు తీసుకోవడానికి పార్టీ సభ్యులు ఎంతో కొంత మేరకు అధికార దత్తతచేయాల్సి ఉంటుంది. ఈ కారణం వల్లనే రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య సూత్రాల ప్రాతిపదికగా ఏర్పడినప్పటికీ వాస్తవానికి పార్టీ అభిజ్ఞవర్గాల చేతులలో అధికారం ఉండటం తప్పనిసరి అవుతుంది. ఈ భావన ఆధారంగానే మైచల్స్ (Michels) "Iron Law of Oligarchy" ప్రతిపాదించాడు. అంటే పార్టీ ఎంతటి ప్రజాస్వామిక విధానాలను అనుసరించదలిచినా వాస్తవానికి అధికారం కొద్ది మంది వినియోగించడం తప్పనిసరి అని ఇతడి అభిప్రాయం. వ్యవస్థలోని వ్యక్తుల ప్రయోజనాలను నివేదించడానికి పార్టీలో అంతర్గత ముఠాలు (Caincuses) అంతర్గత వర్గాల ఆవిర్భావం ప్రతిబంధకాలవుతాయని ఆస్ట్రో గోరస్కీ (Astrogorski) అంటాడు.

రాజకీయపార్టీల వ్యవస్థీకరణ స్వరూపాన్ని పరిశీలించడంలో అందులోని సభ్యులకిచ్చిన ప్రాముఖ్యం తెలుసుకోవడం అవసరం. ఎన్నికలలో పోటీకి అభ్యర్థులను నిర్ణయించి, పోటీ నిర్వహించడానికి మాత్రమే ప్రధాన్యం ఇచ్చే రాజకీయపార్టీలలో సభ్యుల ప్రాముఖ్యం తక్కువగా ఉంటుంది. ఇటువంటి పార్టీల వ్యవస్థీకథణ కొద్దిమంది వ్యక్తుల ప్రాబల్యానికి లొంగి ఉంటుంది. అమెరికాలో రాజకీయ పార్టీలు కొద్దిమంది పార్టీ కార్యకర్తలకు ప్రాధన్యమివ్వడం, అధిక సంఖ్యలో సభ్యులను సమీకరించడానికి ప్రాధాన్యత తక్కువ ఇవ్వడం ఉంటుందని పరిశీలకులంటారు. ఐరోపా ఖండంలోని దేశాలలో పరిస్థితి దీనికి కొంత భిన్నంగా ఉంటుంది. అధిక సంఖ్యలో సభ్యత్వం వ్యవస్థీకరణలో ఒక భాగం. అందువల్ల ఈ దేశాలలోని పార్టీలను మాస్‌మెంబర్‌షిప్ పార్టీలు అనవచ్చని కొందరి అభిప్రాయం. ఈ వ్యవస్థలలో కూడా నాయకత్వానికి ప్రధాన్యతుంటుంది. ఇక్కడ గమనించాల్సినదేమంటే సాపేక్షంగా పరిశీలించి హెచ్చుతగ్గులను, సభ్యులకు ప్రాధాన్యత, నాయకత్వ ప్రాధాన్యతల విషయంలో నిర్ణయించాలి. సంపూర్ణాధికారయుత (totalitarian) వ్యవస్థలలో అధికారం చాలా మటుకు పార్టీ వ్యవస్థీకరణ నాయకత్వం యొక్క ఇష్టానిష్టాలపై ఆధారపడి ఉంటుంది. సభ్యులు నాయకుల నిర్ణయాలకు అనుగుణంగా వ్యవహరిస్తారు. ఇటువంటి విధాన గమనాన్నే కమ్యూనిస్టు సిద్ధాంతంలో "డెమొక్రటిక్ సంట్రలిజం" (democratic centralism) అంటారు. సిద్ధాంతపరంగా చూస్తే పోటీయుత రాజకీయ పార్టీవ్యవస్థలున్న దేశాలలో సభ్యుల ప్రాముఖ్యం మిగిలిన వ్యవస్థలలోకంటే కొంచం ఎక్కువని గ్రహించాలి. నాయకత్వ ప్రాముఖ్యం ఏ వ్యవస్థలోనైనా ఉంటుంది. ఈ విషయంలో కూడా సాపేక్షత గోచరిస్తుంది.

10.6 రాజకీయ పార్టీ వ్యవస్థ : రకాలు

రాజకీయ పార్టీలను వర్గీకరించడానికి రాజనీతి శాస్త్రజ్ఞులు వివిధ ప్రయత్నాలు చేశారు. సంఖ్య, సిద్ధాంతం, నాయకత్వం, విధానగమనం మొదలైన విషయాల ఆధారంగా ఈ వర్గీకరణ జరిగింది.

1. సంఖ్య ఆధారంగా రాజకీయపార్టీ వ్యవస్థలను ఏక పక్ష పార్టీ వ్యవస్థలు, ద్విపక్షపార్టీ వ్యవస్థలు, బహుళపక్ష పార్టీ వ్యవస్థలు అని మూడు తరగతులుగా పేర్కొనవచ్చు (Single party System, Bi-party System and Multiparty System). ఏకపక్ష వ్యవస్థలు కమ్యూనిస్టు దేశాలలోనూ, కొన్ని ఆఫ్రికా దేశాలలోను కనిపిస్తాయి. ఒకే రాజకీయ పార్టీ ఉన్నందువల్ల ఏకీకృత లక్ష్యం, సమర్థవంతమైన సమీకరణ, పటిష్ఠమైన విలీనీకరణకు అవకాశమున్నదని ఈ రకమైన వ్యవస్థను బలపరిచే వారు వాదిస్తారు. విధాన నిర్ణయంలో సామర్థ్యం, వ్యవస్థీ కరణలో పటిష్ఠత, సిద్ధాంతపరమైన స్పష్టత మొదలైన ఇతర ప్రయోజనాలు సమకూరుతాయని కూడా అంటారు. సోవియట్ యూనియన్, పోలెండ్, టర్కీ, చైనా వంటి దేశాలలో ఒకే పార్టీ వ్యవస్థలు పనిచేశాయి. ఒకే రాజకీయ పార్టీ ఉండటం వల్ల అనవసరపు సంప్రదాయవైఖరి, జటిలత్వం, జాప్యాలకు అవకాశముందని కొందరు విమర్శకులు అంటారు. రెండు పార్టీల వ్యవస్థలలో ప్రభుత్వాధికారానికి ఇంచుమించు ఒకే పరిమాణం ఉన్న పార్టీలు పోటీ చేస్తాయి.

ఎన్నికలలో గెలుపొందడానికి, ప్రజామద్దతు పొందడానికి రమారమి ఒకే విధమైన శక్తియుక్తులు పార్టీలకుంటాయి. అమెరికా, బ్రిటన్ దేశాలు ఇటువంటి పార్టీ వ్యవస్థగల దేశాలకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. అయితే ఈ దేశాలలో కూడా రాజకీయ పార్టీల బలాబలాలలో వచ్చి మూడో పార్టీ కొంతవరకు బలం పుంజుకొంటున్నది. ఉదాహరణకు, బ్రిటన్‌లో కన్సర్వేటివ్, లేబర్‌పార్టీలతోబాటు లిబరల్‌పార్టీ ప్రజామద్దతును పొందుతోంది. అంతేకాకుండా మార్పులు సోషల్ డెమొక్రాటిక్ అలయన్స్ అనే ఒక కూటమికి కూడా ప్రజల అండదండలు లభించాయి.

పార్టీ వ్యవస్థలలో రెండుకంటే ఎక్కువ పార్టీలమధ్య ప్రధానమైన పోటీ ఉంటుంది. ఇటలీలో బహుళ పార్టీ వ్యవస్థ ఫలితంగా సంకీర్ణ ప్రభుత్వాలేర్పడ్డాయి. భారతదేశంలో ఒకే పార్టీ ఆధిక్యత కలిగిన బహుపార్టీ వ్యవస్థ పని చేసింది. ప్రాంతీయ పార్టీ ఆవిర్భావం, అధికార పార్టీలో వచ్చిన చీలిక ఫలితంగా ఒకే పార్టీ ఆధిక్యత బలహీనమైంది. శ్రీలంకలో రెండు ప్రధాన పార్టీలున్న బహుళపార్టీ వ్యవస్థ పనిచేయగా ఇటీవలికాలంలో యునైటెడ్ నేషనల్ పార్టీ తన ప్రాబల్యాన్ని నిలబెట్టుకొంది. అయితే దీనికి ప్రధాన ప్రతిపక్షంగా శ్రీలంక ఫ్రీడంపార్టీ పనిచేస్తుండగా మిగిలిన పార్టీలు కూడా ప్రతిపక్షపార్టీలుగా వ్యవహరిస్తున్నాయి.

సాధారణంగా రెండు పార్టీల వ్యవస్థ ప్రయోజనకరమైనదన్న అభిప్రాయం సర్వత్రా ఉంది. ఈ వ్యవస్థలలో ఓటర్లు ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో నిర్ణయించడం సులభం. ఎందుకంటే రెండుపార్టీలు తమ ముందుంచిన ప్రతిపాదనలు, ప్రణాళికలు, కార్యక్రమాల ఆధారంగా త్వరగా నిర్ణయాలు తీసుకోవచ్చు. వివిధ ప్రతిపాదనలున్నప్పుడు నిర్ణయాలు తీసకోవడం కష్టతరమవుతుంది. ఈ విధానంలో ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించడానికి అవకాశం ఎక్కువ. అంతేకాకుండా ప్రధానంగా రెండు పార్టీల మధ్య పోటీ ఉంటుంది కనక రాజకీయాలలో సంయమనం లేదా మధ్యే మార్గం (politics of moderation) సాధించడానికి అవకాశముంటుంది.

బహుళ పార్టీ వ్యవస్థలలో ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఏ పార్టీకి ఉంటుందో ముందుగా ఊహించడం కూడంతో ఓటరుకు ఏ పార్టీకి ఓటు వేయాలన్న విషయంలో ఖచ్చితమైన నిర్ణయం చేసే వీలుండదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కూడా కష్టమే. ఉదాహరణకు, 1972 ఎన్నికల తరువాత నెదర్లండ్స్‌లో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి పార్టీల మధ్య అంగీకారం, ఒప్పందం కుదరడానికి 164 రోజులు పట్టింది. ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయదలిచినా మరికొన్ని ముఖ్యమైన పార్టీల సహాయం, సహకారం తప్పని సరి అవుతుంది. ఎన్నికలలో లభించిన ఓట్ల సంఖ్య తక్కువయినప్పటికీ కొన్ని పార్టీలకు ప్రాబల్యంలో అధిక్యత ఉంటుంది. ఉదాహరణకు, పశ్చిమజర్మనీలో 1969 తరవాతి కాలంలో ఏర్పడిన ప్రతి సంకీర్ణ ప్రభుత్వంలోను ఫ్రీ డెమొక్రాట్‌లకు (free democrates) స్థానం లభించింది. అయితే ఎన్నికలలో వీరికి లభించిన ఓట్లు సరాసరి 10%కి ఎప్పుడూ మించలేదు. బహుళ పార్టీ వ్యవస్థలలో సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటుకు అవకాశాలు ఎక్కువ కావడంతో రాజకీయ అస్థిరత ఏర్పడే ప్రమాదముంది. పార్టీల మధ్య, పార్టీల లోపల అంతర్గత విభేదాలు, తత్ఫలితంగా ఏర్పడే పరిణామాలు ప్రభుత్వ వైఫల్యానికి దారి తీస్తాయి. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఇటలీలో ఏర్పడిన అస్తవ్యస్థతకు వైమర్ జర్మనీలో (Weimar Germany) అసంతృప్తికర ప్రభుత్వాలకు, వాటి పరిపాలనకు, ఫ్రాన్స్‌లో IV రిపబ్లిక్ కాలం నాటి అస్థిర రాజకీయాలను బహుళ పార్టీ వ్యవస్థలు కారణమయ్యాయని పరిశీలకులంటారు. అయితే ఈ వాదన పూర్తిగా సరి అయింది కాదు. స్విట్జర్‌లాండ్, స్కాండినేవియా దేశాలలో బహుపార్టీ వ్యవస్థలు, తరుచుగా ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ రాజకీయస్థిరత్వానికి గాని, ఆధునికీకరణకు గాని అంతరాయం ఏర్పడలేదు. అందువల్ల పార్టీల సంఖ్య ఆధారంగా వాటి సామర్థ్యాలను నిర్ణయించడం సరి అయిన పద్ధతి కాదు.

2. పార్టీ బలానికి ఆధారాలు : అంతర్గత వ్యవస్థీకరణ, కర్తవ్యనిర్వహణ రీతులు (modes of operation) ఆధారంగా రాయ్ సి. మాక్రడిస్ (Roy C Macridis) రాజకీయపార్టీలను కింది విధంగా విభజిస్తాడు:

(a) పార్టీ బలానికి ఆధారాలప్రాతిపదికగా రాజకీయ పార్టీలను

(i) విస్తృత పార్టీలు (Comprehensive Parties)

(ii) విభాగ పార్టీలు (Sectarian Parties) అని రెండు విధాలుగా ఉంటాయి. వీటిలో మొదటిరకానికి ప్రజల మద్దతు ఆధారమయితే రెండో రకం పార్టీలకు వర్గం, ప్రాంతం, సిద్ధాంతం ప్రాతిపదికలుగా ఏర్పడివారి మద్దతు పొందుతాయి.

(b) అంతర్గత వ్యవస్థీకరణ అధికంగా

(i) పరిమిత పరిధి, రహస్యాలకు ప్రాధాన్యమిచ్చే పార్టీలు.

(ii) విస్తృత పరిధి, వివృతత్వంగల పార్టీలు (Open) అని రెండు రకాలు.

(c) కర్తవ్యనిర్వహణ రీతుల ఆధారంగా పార్టీలు.

(i) విస్తరణ పార్టీలు (Diffused)

(ii) ప్రత్యేకీకరణగల పార్టీలు (Specialised)

వీటిలో విస్తృత పార్టీలలో విశాలదృక్పథం, ఆచరణ దృక్పథం అధికంగా ఉండగా విభాగ పార్టీలలో ప్రత్యేక వర్గాలకు, ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. పరిమిత పరిధి గలపార్టీలు అణిచివేత ధోరణిని అనుసరించవచ్చు. విస్తృత పరిధి, వివృతత్వంగలవి అధికసంఖ్యాకుల ప్రయోజనాలకు మద్దతు ఇచ్చేవిగా ఉంటాయి. విస్తరణ పార్టీలు జాతీయ సమగ్రతకు, సమాజాభివృద్ధికి, సమీకరణకు ప్రాధాన్యమిస్తే విశేషంగల పార్టీలు ప్రత్యేక ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తాయని మకార్డిస్ (Macardis) అంటాడు.

3. నైల్ ఎమాక్ డోనాల్డ్ (Nail A MC Donald) రాజకీయ పార్టీలను

(b) సిద్ధాంతప్రాతిపదికగల పార్టీలు (Doctorine-based parties)

(b) ప్రత్యేక సిద్ధాంతంలేని పార్టీలు (Non-doctrinal parties) అని రెండుగా విభజించాడు. వీటిలో మొదటిరకం పార్టీలలో నాయకులు కొన్ని సూత్రాలు, నమ్మకాల ఆధారంగా పనిచేస్తారు. సోషలిస్టు పార్టీలు ఈ కోవకు చెందుతాయని ఇతడంటాడు. వర్గవైరుధ్యాలు, సమ్మోహనాశక్తిగల నాయకత్వం (Charismatic leadership) మతసంస్థలు మొదలైది సిద్ధాంతంలేని పార్టీలకు ప్రాతిపదికలవుతాయి. రెండో ప్రపంచ యుద్ధానంతరం పశ్చిమ ఐరోపాలో రాజకీయ పార్టీలు సిద్ధాంతరమైన సునిశితత్వాన్ని (shapeness) పోగొట్టుకొన్నాయని క్రమంగా సమాజంలో వివిధవర్గాల ప్రయోజనాలు ప్రకటితంచేసి, సాధించగోరే మధ్యవర్తులుగా రూపొందాయని పరిశీలకులంటారు.

4. ఆల్మండ్ (Gabriel a Almand) పార్టీవ్యవస్థలను 4 విధాలుగా విభజించాడు.

(a) అధికారవాదపార్టీ వ్యవస్థలు (Authoritarian party systems)

(b) ప్రాబల్య, అనధికార పార్టీ వ్యవస్థలు (Dominant non-authoritarian party Systems)

(c) పోటీయుత ద్విపార్టీ వ్యవస్థలు (Competitive two-party Systems)

(d) పోటీయుత బహు పార్టీ వ్యవస్థలు (Competitive multi-party systems)

అధికార పార్టీ వ్యవస్థలలో సభ్యుల కొర్కెలు, అభ్యర్థనలు పార్టీ నిర్మితుల ద్వారా మాత్రమే ప్రసారమవుతాయి. ప్రాబల్య అనధికార వ్యవస్థలలో పార్టీ అధికారవాదాన్ననుసరించకపోయినప్పటికీ హెచ్చు స్థాయి ప్రాబల్యముంటుంది. ఇటువంటి పార్టీ వ్యవవస్థలు మూడో ప్రపంబదేశాలలో ఎక్కువగా ఉన్నాయి. (ప్రస్తుతం వర్ధమాన దేశాలు). ఈ దేశాలలో బలమైన పార్టీలు జాతియోద్యమాలు నడిపిన సంఘటనలుకూడా వున్నాయి. భారతదేశంలో కాంగ్రెస్ స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్రవహించడమే కాకుండ స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత కూడా ప్రభుత్వాన్ని ఏర్పరిచి పరిపాలన కొనసాగిస్తున్నది. పోటీయుత ద్విపార్టీ వ్యవస్థలలో పజాతీయ (homogeneous), లౌకిక, ఇచ్చిపుచ్చుకొనే ధోరణిగల రాజకీయ సంస్కృతి ఉంటుంది. అంతేకాకుండా స్వేచ్ఛాయుత న్యయం ప్రతిపత్తిగల ప్రయోజకవర్గాలుంటాయి. (autonomous associational interest groups). ఇక పోటీయుత బహుళ పార్టీ వ్యవస్థలలో విఘటన (fragmentation), వైవిధ్యం కనిపిస్తాయి.

రాజకీయ పార్టీలు నిర్వహించాల్సిన ప్రధాన కర్తవ్యం ప్రయోవాల సమీకరణమని తెలుసుకొన్నాం. ఈ సమీకరణ ఏ విధంగా జరుగుతుందన్న దానిని బట్టి ఆల్మండ్ వీటిని మూడు రకాలుగా వివరించాడు.

(a) లౌకిక, ఆచరణాత్మక, బేరసారవైఖరిగలవి (secular, pragmatic and Bargaining)

(b) నిరపేక్ష విలువ దృక్కోణం (Absolute value-oriented) సిద్ధాంత ప్రాధాన్యం గలవి.

(c) ప్రత్యేకత, సంప్రదాయ బద్ధత గలవి (Particularistic and Traditional)

వీటిని గురించి మరో అధ్యాయంలో తెలుసుకొంటారు.

5. పార్టీలు (a) పోటీయుత పార్టీవ్యవస్థలు (Competitive Party systems)

(b) పోటీరహిత పార్టీ వ్యవస్థలు (non-competitive party systems), అని రెండు రకాలుగా ఉంటాయన్న మరొక సరళమైన విభజన కూడా వుంది.

ప్రపంచంలో అనేక దేశాలలో ద్విపార్టీవ్యవస్థగాని, బహుళ పార్టీవ్యవస్థగాని వుంది. అందువల్ల ఇంచుమించుగా అన్ని దేశాలలోను పోటీయుత పార్టీ వ్యవస్థలున్నాయని స్థూలంగా చెప్పవచ్చు. ఈ వాదం ఆధారంగా ద్విపార్టీవ్యవస్థలూ, బహుళపార్టీవ్యవస్థలూ కూడా పోటీయుత వ్యవస్థలుగానే పరిగణించబడతాయి. యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, స్కాండినేవియా, పశ్చిమ ఐరోపా రాజ్యాలూ - ఇవన్నీ ఈ కోవకే చెందుతాయి. ఇక వివరాలుపోతే అంతర్గత లక్షణాలు, అధికారం నిలయమై ఉండటం ఆధారంగా పోటీయుత వ్యవస్థలను రెండు రకాలుగా పేర్కొనవచ్చు. ఇటువంటి ప్రయత్నాన్ని లా పాలమ్ బ్రా, మైరన్ వేనర్ (La Palambra and Myron Weiner) లు చేశారు. ఈ రెండు రకాల వ్యవస్థలు

(i) మార్పు చెందే లేదా ప్రాబల్యంగల వ్యవస్థలు (Turnover or Hegemonistic)

(ii) సిద్ధాంత ప్రాధాన్యంగల లేదా ఆచరణ ప్రాధాన్యంగల వ్యవస్థలు (Idealogical and Pragmatic) ప్రాబల్యపార్టీ వ్యవస్థలలో ఒకే ఆర్టీ చాలాకాలం అధికారంలో ఉంటుంది. సార్టోరీ (Sartori) మాటలలో ఇది "Predominent Party System". కాంగ్రెస్ పరిపాలనలో భారతదేశం, డెమొక్రాటిక్ సోషలిస్టు అధీనంలో ఉన్న నార్వే, న్యూజీలాకాలం నాటి అమెరికాలో ఇట్లాంటి వ్యవస్థలు పనిచేశాయి. ఇక దీనికి వ్యతిరేకంగా ఉండే మార్పు చెందే వ్యవస్థల విషయంలో అధికార పార్టీ ఏదనే విషయంలో మార్పులు సంభవిస్తాయి. బ్రిటన్‌లో ఇటువంటి పరిస్థితి ఉంది.

సిద్ధాంత ప్రాధాన్య పార్టీ వ్యవస్థలలో సిద్ధాంతానికి, దానికి సంబంధించిన విలువలకు, సూత్రాలకు ప్రాధాన్యముంటుంది. సిద్ధాంత ప్రాధాన్యంగల పార్టీకి కమ్యూనిస్టు పార్టీ ప్రబలమైన ఉదాహరణ. ఇక వీటిలో రెండో రకం పార్టీ వ్యవస్థలో ఆచరణకు ప్రాధాన్యం ఇవ్వడమైంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏ ఒక్క పార్టీని సిద్ధాంత ప్రాధాన్యమిచ్చేదిగా కాని, ఆచరణకు ప్రధాన్యమిచ్చేదని గాని నిర్ణయించలేము. రెండు లక్షణాలూ కనిపిస్తాయి. అయితే ఏ లక్షణానికి హెచ్చువిలువ ఉందని దానిని బట్టి నిర్ణయం చేయాల్సి ఉంటుంది.

(b) పార్టీరహిత వ్యవస్థలు ఏకపక్షవ్యవస్థలున్న దేశాలలో ఉంటాయి. ఏకపక్షవ్యవస్థలు సాధారణంగా ప్రాబల్య పూరితమైనవి. వీటిలో మార్పులు, చేర్పులకు ఎక్కువ అవకాశముండదు. ఒకే ఒక పార్టీ ఎప్పుడూ ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుంది.

పోటీరహిత పార్టీ వ్యవస్థలు మూడు విధాలు :

(i) ఏకపక్ష అధికారవాద వ్యవస్థలు (One party authoritarian systems)

(ii) ఏకపక్ష బహుత్వవాద వ్యవస్థలు (One Party Pluralistic systems)

(iii) ఏకపక్షనిరంకుశవాద వ్యవస్థలు (One Party totalitarian systems)

ఏకపక్ష అధికారవాద వ్యవస్థలలో పార్టీ ఏకశిలానిర్మితివలె ఉంటుంది. దానికి సిద్ధాంత ప్రాముఖ్యముంటుంది. కాని నిరంకుశత్వం చెలాయించదు. ఫ్రాంకో ఆధిపత్యంలో స్పెయిన్‌ను ఇటువంటి వ్యవస్థకు ఉదాహరణగా పేర్కొంటారు. ఏకపక్షబహుత్వవాద వ్యవస్థలలో ఇచ్చిపుచ్చుకొనే వైఖరి, బేరసారాలాడే ధోరణి ఉంటుంది. సమాజంలోని వివిధవర్గాల పట్ల విధ్వంసపూరిత వైఖరి కాకుండా నిర్మాణాత్మక వైఖరి ఈ వ్యవస్థలో కనిపిస్తుంది. మెక్సికో దేశంలోని రిపబ్లికన్ పార్టీ ఇటువంటి వ్యవస్థకు ఉదాహరణ. ఇక ఏకపక్ష నిరంకుశవాద వ్యవస్థలలో వ్యవస్థ ఏకశిలా నిర్మితమై ఉంటుంది. అంతే కాకుండా సిద్ధాంతానికి అధిక ప్రాధాన్యముంటుంది. సాంఘిక, ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి రాజ్యాన్ని ఒక సాధనంగా ఈ రకమైన వ్యవస్థ వినియోగిస్తుంది. సోవియట్ యూనియన్, చైనా, తూర్పు ఐరోపా దేశాలు, ఉత్తర కొరియా, వియత్నాంలు ఈ రకమైన వ్యవస్థలున్న దేశాలకు ఉదాహరణలు.

6. రాజకీయ పార్టీలను సార్టొరీ మొదలు ఏకపక్ష, ద్విపక్ష, బహుళపక్ష వ్యవస్థలుగా విభజించి ఈ మూడింటిని ఉపవిభజన చేశాడు. దీనిని కింది విధంగా తెలపవచ్చు:

సార్టొరీ ద్విపక్ష వ్యవస్థలలోను, బహుళపక్ష వ్యవస్థలలోను ధృవీకృత బహుళత్వ (Polarised Pluralims) ఉంటుందంటాడు. అంటే ఇటువంటి వ్యవస్థలలో వివిధపార్టీలు రూపుదిద్దుకొంటాయి. ప్రభుత్వం యొక్క చట్టబద్ధతను సవాలు చేసే మార్పులు కూడా ఇటువంటి వ్యవస్థలలో ఏర్పడే అవకాశముంది. వ్యవస్థ నిర్వహణ సక్రమంగా లేనప్పుడు వ్యవస్థను సవాలు చేసే మానవ సమూహాలు రాజకీయ పార్టీలుగా రూపొందడం సమంజసమూ, ప్రయోజనకరమూ అని అనేకుల అభిప్రాయం. బహుళపార్టీ వ్యవస్థలలో బహుజన సమ్మతి పొందిన నిర్ణయాలు తీసుకోవడం కష్టమని, వర్గాలు, ముఠాలు ఏర్పడే అవకాశముందని, అయితే ఇవి ఏర్పడటం అర్థరహితమనుకోవడంసమంజసంకాదని, అవి వ్యవస్థ అభివృద్ధికి కృషిచేసినంత కాలం చట్ట వ్యతిరేక వ్యవస్థలు కావని గ్రహించాలి. బహుళ పార్టీ వ్యవస్థలలో అసంతృప్తి, నిస్పృహ చెందిన పార్టీలు విధ్వంసక చర్యలకు పూనుకొని వ్యవస్థ స్థిరత్వానికి ప్రతిబంధకాలు కావచ్చు. మితిమీరిన బహుళత్వంగాని, ఏకత్వంగాని సమర్థనీయంగాదు.

7. సభ్యత్వం ఆధారంగా రాజకీయపార్టీలను కేడర్‌పార్టీలు (Cadre parties), బహుసభ్యపార్టీలు (Mass parties) అని విభజించడమైంది. కేడర్ పార్టీలలో పరిమిత సభ్యత్వం ఉంటుంది. ఎంపిక సూత్రం ఆధారంగా సభ్యత్వ నిర్ణయం జరుగుతుంది. ఎక్కడ సంఖ్యకంటే విలువకు ఎక్కువ ప్రాధాన్యముంటుంది. వ్యక్తుల హోదాశక్తియుక్తులు, పాటీచేయడానికి తగిన స్తామత, వనరుల సేకరణ శక్తి మొదలైనవి సభ్యత్వనిర్ణయానికి ప్రాతిపదికలుగా ఉంటాయి. కమ్యూనిస్టు పార్టీలను కేడర్ పార్టీలకు ఉదాహరణగా తీసుకోవచ్చు. ఇక బహుసభ్య పార్టీలలో అధిక సంఖ్యలో సభ్యులను చేర్చుకోవడానికి ప్రాధాన్యమివ్వడం జరుగుతుంది. పరిమిత సభ్యత్వరుసుం చెల్లించిన వారందరూ ఈ రకమైనపార్టీలలో సభ్యులవుతారు. ప్రపంచ దేశాలలో ఓటు హక్కు విస్తరణ కావడంతో అనేక పార్టీలు బహుసభ్య పార్టీలుగా రూపొందాయి.


8. ఆవిర్భావ స్థలం ఆధారంగా రాజకీయ పార్టీలను ఇంట్రాపార్లమెంటరీ ఆరిజన్స్ ఉన్నవి, ఎక్స్‌ట్రా పార్లమెంటరీ ఆరిజన్స్ ఉన్నవి అని రెండు విధాలుగా ఉంటాయని డువర్జర్ అభిప్రాయం. ఓటింగ్ హక్కు విస్తరణ ఫలితంగాను, పార్లమెంటరీ వ్యవస్థలు రూపొందడం కారణంగాను ఉత్సాహకులైన పౌరులు మొదటగా రాజకీయ సంఘాలుగా ఏర్పడటం మొదలుపెట్టారు. అంటే దీనికి పార్లమెంట్ వెలుపల ఏర్పడిందన్నమాట. ఫ్రాన్స్‌లో ఏర్పడిన బ్రెట్‌న్ క్లబ్ (Bretten Club) దీనికి ఉదాహరణ. పార్లమెంటులోని సభ్యులు వివిధ ప్రయోజనాల పరిరక్షణకు ప్రత్యేక సమూహాలుగా ఏర్పడిన సంఘటనలున్నాయి. అమెరికాలో మాడిసోనియన్స్ (Madisomians), జెఫర్ సనోనియన్స్ అని రెండు వర్గాలుగా కాంగ్రెస్ సభ్యులుచీలడం, తరవాత రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీల అవతరణ శాసన నిర్మాణ శాఖలోపలినుంచి పార్టీలు ఆవిర్భవించాయని తెలపడానికి నిదర్శన.

10.7 రాజకీయ పార్టీలు : నాయకత్వం

రాజకీయ పార్టీల మనుగడలో నాయకత్వానికి చెప్పుకోదగిన ప్రాధాన్యముంది. పార్టీల నిర్మాణాలను, వ్యవస్థీకరణను అధ్యయనం చేయాలంటే నాయకత్వాన్ని గురించి తెలుసుకోవడం తప్పనిసరి. సభ్యులను ప్రభావితంచేయగల వారికి మార్గదర్శకత్వం ఇవ్వగల ఉత్సాహవంతులను చేయగల నాయకత్వం ఉంటే రాజకీయ పార్టీల మనుగడ సక్రమంగాను, నిర్వహణ సమర్థవంతంగాను ఉంటుందని చెప్పవచ్చు. ఆచరణాత్మక రాజకీయాలలోని అధికార సముపార్జనకు జరిగే పోరాటంలో నాయకత్వానికున్న విలువను తక్కువగా అంచనా వేయడానికి వీలుండదు. నిజానికి అధికారం, నాయకత్వం – ఈ రెండింటికి నియంతృత్వాలలో లెఫ్టినెంట్లకు ఎటువంటి స్థానం ఉంటుందో రాజకీయ పార్టీలకు కూడా వ్యవస్థనిర్వహణలో ముఖ్య భూమిక ఉంటుంది.

నాయకత్వం నిరంకుశత్వ ధోరణి అనుసరించినా ప్రజాస్వామ్య పద్ధతుల అనుసరణకు ప్రాధాన్యమిచ్చినా దానికి స్వల్పజన పరిమిత లక్షణం (oligarchic Chateristic) ఉంటుందని అంటే నాయకత్వం కొద్దిమంది వ్యక్తుల చేతులలో మాత్రమే ఉంటుందని రాబర్ట్ మైకెల్ (Robert Michels) వాదిస్తాడు. ఈ వాదన ఫలితమే Iron Law of Oligarchy". సామాజిక జీవనంలో అన్నిరంగాలలోను నాయకత్వం ఉంటుందని, అందువల్ల నాయకత్వం

పార్టీ వ్యవస్థలు – సార్టరీ విభజన
(Party Systems - Sartori's Classification)



ఉండటం మేలు కలిగిస్తుందా లేదా అన్న ప్రశ్నకు తావులేదని ఇతడంటాడు. ప్రధమంలో నాయకులు ఆకస్మికంగా ఆదరించవచ్చు. వారి కర్తవ్యాలు మూలరహితమైనవి. అంతేకాకుండా అవి ప్రజోపకరణాలు. క్రమంగా వారు నాయకవృత్తి చేపడతారు. ఈ స్థాయిలో వీరిని తొలగించడం కష్టం. నాయకత్వం బహు సంఖ్యాకులలో ఉండదు. ఉండలేదు. కనక ఇది కొద్దిమందికి మాత్రం పరిమితమవుతుందని మైకెల్ అభిప్రాయం మైకెల్ మాదిరిగానే డువెర్జర్ కూడా నాయకత్వం గురించి వివరిస్తూ బహిర్గతంగా కాని. అంతర్గతంగా కాని నాయకత్వానికి, నిరంకుశత్వానికి సంబంధం ఉందని, ఏది ఏమైనా నాయకుడు శ్రేష్టమైన వ్యక్తి అని వివరించడం జరిగింది. ప్రజాస్వామ్యాలలో గాని ఇతర విధానాలలో గాని నాయకులు ప్రత్యేకతగల వ్యక్తులుగా పరిగణించబడతారు. ప్రజల మద్దతు, ఆకర్షణ శక్తి, చాకచక్యం, సామర్థ్యం మొదలైన లక్షణాలు నాయకులకు ఒక ప్రత్యేక స్థానాన్ని సమకూరుస్తాయి.

10.8 రాజకీయ పార్టీల అధ్యయన పద్ధతులు

సమకాలీన రాజకీయ జీవనంలో రాజకీయపార్టీలకు చెప్పుకోదగిన ప్రాముఖ్యముందని తెలుసుకొన్నాం. రాజకీయపార్టీలను గురించి అధ్యయనం, విశ్లేషణ నిజానికి సాంఘిక శాస్త్రాలలో ఒక ప్రత్యేకత కలిగి నూతన భాగంగా పరిగణించాలని మైకెల్ అంటాడు. రాజకీయ పార్టీ ఆవిర్భావం 19వ శతాబ్దంలో జరిగింది కనక ఇవి ఏ విధంగా రూపొందాయో తెలుసుకోవాలనే ఉత్సాహం రాజనీతి శాస్త్రజ్ఞులలో తలెత్తింది. పశ్చిమ రాజ్యాలలోని రాజకీయ పార్టీల చరిత్ర గురించి గణనీయమైన పరిశోధన జరిగింది. అయితే పార్టీల స్వరూపస్వభావాలు, అవి వ్యవస్థలో నిర్వహించే పాత్రలను గురించిన అధ్యయనం కొంతవరకూ జరిగినా మరెంతో – ముఖ్యంగా వర్ధమాన దేశాలలోని పార్టీ వ్యవస్థల స్వరూపాన్ని మరింత విశ్లేషణ చేయాల్సి ఉంది. ఈ రకమైన విశ్లేషణ ఏవిధంగా చేయవచ్చు అన్న విషయాన్ని తెలుసుకొందాం.

రాజకీయ పార్టీల అధ్యయనానికి ప్రధానంగా రెండు పద్ధతులున్నాయి. వాటిలో మొదటిది పార్టీల విధులను అధ్యయనం చేసే పద్ధతి. అంటే పార్టీలు నిర్వహించవలసిన కర్తవ్యాలను స్థూలంగా నిర్ణయించి వాటిని నిర్వహించడం జరుగుతోందా లేదా అనే విషయం పరిశీలించడం. పార్టీల విధులను గురించి మనం ముందే తెలుసుకొన్నాం.

రెండవ పద్ధతిలో రాజకీయ పార్టీలను రాజకీయ వ్యవస్థలో భాగంగా పరిగణిస్తూ వాటిని ఒక వ్యవస్థ రూపంలో పరిశీలన చేయడం. ఈ రకమైన విశ్లేషణలో రాజకీయ పార్టీలు ఏ విధంగా ప్రజల కోర్కెలను విధానాలు, నిర్ణయాలుగా మార్చిది చేస్తాయో తెలుసుకోవడం జరుగుతుంది.

పై రెండు పద్ధతులను ప్రత్యేకంగా వేరుపరచడం సాధ్యంకాదు. ఉదాహరణకు, ఏ విధంగా రాజకీయపార్టీలు మార్చిడి విధులను నిర్వహిస్తున్నాయో గ్రహించేటప్పుడు రాజకీయ ప్రసారం, భర్తీ మొదలైన విషయాలను తెలుసుకోవలసిన అవసరం ఉంటుంది. పార్టీ వ్యవస్థ నిజస్వరూపాన్ని అవగాహన చేసుకొనే ప్రయత్నంలో దానికి సంబంధించిన నిర్మితులు, వర్గాలు, రాజకీయ సంస్కృతి, రాజకీయ సామాజికీకరణ, భర్తీ మొదలైన వాటిని గురించి అధ్యయనం చేయాలి. అంతేకాక రాజకీయ పార్టీలకు, రాజకీయేతర సంఘాలకుగల సంబంధాలను కూడా అంచనా వేయాలి.

రాజకీయ పార్టీల అధ్యయనానికి ఇటీవలి కాలంలో బహుళ ప్రాముఖ్యం ఏర్పడింది. ఇవి మానవుడు చేసిన నూతన ఆవిష్కరణలు (Inventions) రాజకీయ జీవనంలో ఇవి గణనీయమైన పాత్ర వహిస్తాయి. అమెరికా దేశపు ప్రముఖ నాయకులలో ఒకరైన జఫర్‌సన్ పార్టీల ఏర్పాటుకు, పార్టీ రాజకీయాలకు వ్యతిరేకత తెలుపుతూ రాజకీయ పార్టీలతో తప్ప స్వర్గాన్ని చేరుకోవడం సాధ్యంకాకపోతే స్వర్గం చేరడాన్నే నిరాకరిస్తానన్నాడు. అయినప్పటికీ అమెరికాలో రాజకీయపార్టీల అవతరణ, వాటి మనుగడ తప్పలేదు. వీటి ప్రాధాన్యం గుర్తించబడింది. పార్టీ వ్యవస్థలను అధికారులు రద్దు చేసినప్పటికి తిరిగి గుర్తించవలసిన అగత్యం ఏర్పడింది. నేపాల్ ఇటువంటి పరిస్థితి ఎదుర్కొన్న దేశాలకు ఉదాహరణ. ఈజిప్ట్, ఇండోనేషియా, బంగ్లాదేశ్, బర్మా మొదలైన దేశాలలో పార్టీ అణిచివేత చర్యలు తిరిగి అవి ఆవిర్భవించిన సంఘటనలు ఉన్నాయి.

రాజకీయ పార్టీల అధ్యయనంలో అనుభవపూర్వక పరిశోధన (empirical research) కు ప్రాధాన్యత పెరిగింది. ఒక విధంగా చెప్పాలంటే రాజకీయ జీవన సంబంధమైన పరిశోధనలో ఎంతో కొంతమేరకు రాజకీయ పార్టీల అధ్యయనం జరుగుతుంది. రాజకీయ పార్టీ వ్యవస్థల ప్రత్యేక అధ్యయనమేగా రూపొందింది.

రాజకీయ పార్టీలు రాజకీయాభివృద్ధికి తోడ్పడతాయి. రాజకీయాభివృద్ధి, రాజకీయ క్షీణత (political Development and political Decay) పార్టీల నిర్వహణకు అవినాభావసంబంధం ఉంది. బలైన పార్టీ వ్యవస్థ రాజకీయాభివృద్ధికి సహకరిస్తుంది.

10.9 భారతదేశంలో రాజకీయ పార్టీలు : Political Parties in India

పశ్చిమ దేశాలలోని ప్రజాస్వామ్య పద్ధతులను చాలావరకు అనుకరిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థలను విజయవంతం చేయడానికి ప్రయత్నిస్తున్న వర్ధమాన దేశాలలో భారతదేశం ఒకటి. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఎన్నికలు నియమితకాలంలో నిర్వహిస్తూ ప్రజాస్వామ్య పద్ధతుల ప్రయోగాలను భారతదేశం చేస్తోంది. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశం. స్థూలంగా చెప్పాలంటే భారతదేశంలో భౌగోళికంగా విస్తృత ప్రాతిపదిక గల పార్టీలు, పరిమిత ప్రాతిపదికగల పార్టీలు ఉన్నాయి. పార్టీల ఆవిర్భావం ఈ దేశంలో క్రమానుగతంగా జరిగింది. అంటే మొదట వర్గాలు లేదా చీలికలు ఏర్పడి క్రమంగా అవి రాజకీయ పార్టీల స్వరూపం సంతరించుకోవడం చాలా పార్టీల విషయంలో జరిగింది. చీలికలు, ఉపచీలికలు కలిగిన పార్టీలకు ముఖ్య ఉదాహరణ కాంగ్రెస్ పార్టీ. ఇక కమ్యూనిస్ట్ పార్టీల విషయానికి వస్తూ వీటిలో CPI, CPI (M), CPI (ML) ఇవిగాక నక్సలైట్ల చీలికలు ఉన్నాయి. జనతా పార్టీ ప్రభుత్వం కూలగిన తరవాత నాయకత్వ ప్రాతిపదికపై భారత రాజకీయాలలో అనేక పార్టీలు ఏర్పడ్డాయి.

పై విషయాలను బట్టి భారతదేశంలో బహుళ పార్టీ వ్యవస్థ ఉందని విస్పష్టం అవుతుంది. కాంగ్రెస్ ఆధిపత్యం వైఖరి దీనికి ఒక కారణమని కొందరు విమర్శకులు భావిస్తారు.

భారత రాజకీయపార్టీలను అధ్యయనం చేసిన మేధావుల అభిప్రాయంలో కేంద్రీకృత ధోరణి, అధికారయుత నిర్మితి ఏర్పాటు పార్టీవ్యవస్థలో కనిపిస్తుంది. అంతేకాక కాంగ్రెస్, ఇతర పార్టీలలో చీలికల ఏర్పాటు ధోరణి ఉంది. దీని ఫలితంగా రాజకీయ వివాదాలు విస్తృతం అవుతాయి. భవిష్యత్తులో వ్యవస్థ తీవ్ర పరీక్షను ఎదుర్కోవలసి వస్తుంది.

అధికార పక్షమైన కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తోడ్పడే ప్రణాళికా విధానం రూపొందించింది. ఇది ఒక Umbrella Party గా వ్యవహరిస్తుంది.

1967-69 మధ్యకాలంలో రాజకీయ పార్టీల అనుభవాలు తమవైఖరిలో తగిన మార్పులు చేసుకోవలసిన అవసరాన్ని సూచించాయి. 1967 నుంచి కాంగ్రెస్‌లో అసంతృప్తి వర్గీయులు పార్టీ నుంచి వైదొలగడం మొదలుపెట్టారు. తరవాత కాలంలో పార్టీలో సంయోజన ప్రయత్నాలు (attempts for cohesion) జరిగాయి. కాంగ్రెస్‌కి లభిస్తున్న ఓటర్ల మద్దతు తగినంతగా లేదని, ఈ కారణం చేత స్థిరమైన రాజకీయ శక్తిగా వ్యవహరించడానికి మరింత కృషి చేయవలసి ఉంటుందని కాంగ్రెస్ నాయకులు గ్రహించారు.

అనేక పార్టీలు, చాలా కాలం ఒకే పార్టీ ప్రాబల్యం, బలహీనమైన ప్రతిపక్షాలు, కమ్యూనల్ ప్రాతిపదికపై కొన్ని పార్టీల ఆవిర్భావం, పార్టీ మార్పిడి ధోరణి, భారత రాజకీయ పార్టీ వ్యవస్థ ముఖ్యలక్షణాలు. ఇవికాక ప్రాంతీయ ప్రయోజనాల పరిరక్షణకు ప్రాంతీయ పార్టీలు ఏర్పడడం, అవి ప్రభుత్వాలు ఏర్పరచడం కూడా చూడవచ్చు. పార్టీలలో కులం ప్రభావం కూడా గణనీయంగా ఉండడం మరొక లక్షణం.

10.10 అమెరికాలో పార్టీల వ్యవస్థ

రాజకీయ పార్టీలు వ్యవస్థ మనుగడకు ప్రతిబంధకమవుతాయని, సమైక్యతకు అంతరాయం కలిగిస్తాయని మొదట్లో అమెరికా రాజకీయనాయకులు నమ్మారు. 1796 సెప్టెంబర్ నెలలో దేశప్రజలనుద్దేశించి చేసిన ప్రకటనలో అమెరికన్ రిపబ్లిక్ "beneful effects, of the spirit of the party" వల్ల నష్టాన్ని ఎదుర్కోవలసి వస్తుందని అంటాడు. ఇదే విధమైన అభిప్రాయాన్ని జఫర్‌సన్, మాడిసన్ వంటి నాయకులు వ్యక్తం చేశారు. అయినప్పటికీ అమెరికా రాజకీయ జీవనంలో రాజకీయ పార్టీలు చోటుచేసుకోవడం తప్పనిసరైంది. 1790లో అమెరికా కాంగ్రెస్‌లో హామిల్టన్ ప్రవేశపెట్టిన ఆర్థిక కార్యక్రమం (Economic Programme) విషయంలో సభ్యుల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి. దీనిలో జఫర్‌సన్ వర్గీయులు, మాడిసన్ వర్గీయులు అని కాంగ్రెస్ సభ్యులు రెండు భాగాలుగా చీలిపోయారు. తరువాత కాలంలో దేశ, విదేశ విషయాలపై సభ్యుల మధ్య భేధాభిప్రాయాలు కొనసాగాయి. ఈ భేదాలు రిపబ్లికన్ పార్టీ, డెమోక్రటిక్ పార్టీల అవతరణకు దారి తీశాయి. పెట్టుబడిదారీ విధానం సమర్థించడం, సమస్య ప్రాతిపదికపై రాజకీయాలు, వెనులుబాటుతో కూడిన క్రమశిక్షణ ఈ వ్యవస్థ ముఖ్యలక్షణాలు.

అమెరికా పార్టీ వ్యవస్థను ద్విపార్టీ వ్యవస్థగా పరిగణించవచ్చు. ఇవికాక మిగిలిన పార్టీలున్నప్పటికి రాజకీయ పదవులు సాధించడంలో వీటికి తగినంత బలం లేదు. అధిక జనసమ్మతితో (Consensus) తమ పార్టీ వ్యవస్థ పనిచేస్తుందని అమెరికన్లు భావిస్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు విజయవంతగా పనిచేయడానికి తమ పార్టీ వ్యవస్థ సహకరిస్తోందని వీరి భావన.

10.11 బ్రిటన్‌లో పార్టీ వ్యవస్థ

బ్రిటన్‌లోని పార్టీ వ్యవస్థను కూడా ద్విపార్టీ వ్యవస్థగా పరిగణించవచ్చు. ప్రపంచంలో అత్యంత స్థిరత్వం కలిగిన, బాధ్యతాయుతమైన పార్టీ వ్యవస్థ బ్రిటన్‌లోని ద్విపార్టీ వ్యవస్థ అని చెప్పడమైంది. ఈ దేశంలోని ముఖ్యమైన రెండు పార్టీలు కన్సర్వేటివ్ పార్టీ (Conservative Party), లేబర్ పార్టీ (Labour Party). ఇవి కాక లిబరల్ పార్టీ, స్కాటిష్ వెల్ష్ నేషనల్ పార్టీ (Scottish Welsh National Party), The Marxist left, The National Front, మొదలైన పార్టీలు ఈ దేశంలో ఉన్నాయి. బ్రిటన్‌లో వ్యాపారస్థులు, వ్యవసాయదారులకు, కన్సర్వేటివ్ పార్టీకి దగ్గర సంబంధాలున్నాయి. ఈ సంబంధాలు ఈ సంబంధిత వృత్తులకు చెందిన పార్లమెంటు సభ్యుల ద్వారా ఏర్పడతాయి. లేబర్ పార్టీ ట్రేడ్ యూనియన్ ఉద్యమ ఫలితంగా ఆవిర్భవించింది. ఈ కారణంవల్ల ట్రేడ్ యూనియన్లతో ఈ పార్టీ సన్నిహిత సంబంధాలు కలిగి ఉంటుంది.

బ్రిటన్‌లోని రెండు ప్రధాన పార్టీలు ఎన్నికలలో మెజారిటీ ఓట్లను చాలాకాలం పొందాయి. అయితే ఇటీవల ఈ రెండూ కాక మిగిలిన పార్టీల ఓట్లశాతం, ఎన్నికైన ప్రతినిధుల సంఖ్య కూడా పెరిగాయి. తరవాత ఎన్నికలలో కన్సర్వేటివ్ పార్టీ తిరిగి ప్రాబల్యాన్ని సంపాదించింది. విధానాల విషయంలో కన్సర్వేటివ్, లేబర్ పార్టీల మధ్య భేదం అంతగా ఉండదు.

ఈ దేశంలోని పార్టీ వ్యవస్థను గురించి రాస్తూ George Breckenridge 1988లో అంటాడు. "The British Party systems is in a state of flux" పునర్నిర్మితమైన Liberal Party, Social Democratic Alliance కూడా కన్సర్వేటివ్ లేబర్ పార్టీల ఆధిక్యతను సవాలు చేశాయి. ఈ పరిస్థితి 70లలోనూ, 80లలోనూ కూడా కనిపిస్తుంది. ఈ కారణంవల్ల ద్విపార్టీ వ్యవస్థ కొంత ఒత్తిడిని ఎదుర్కొంది. 1980లో చివరకు కన్సర్వేటివ్‌పార్టీకి సంఖ్యాబలం ఉన్నప్పటికి ఇతర పార్టీలనుంచి ప్రతిఘటనను ఎదుర్కోవలసి వచ్చింది. 1987లో Social Democratic Alliance విఫలం కావడంతో ద్విపార్టీ వ్యవస్థ తిరిగి కొంత బలం పొందిందని చెప్పవచ్చు.

స్థూలంగా చెప్పాలంటే మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు పార్టీ వ్యవస్థ ఈ దేశంలో మతపరమైన విధేయత ప్రాతిపదికగా ఉండేది. అయితే లేబర్ పార్టీ అవతరణ తరవాత కాలంలో (1920) వర్గం ప్రాతిపదికగా విధేయతల

నిర్ణయానికి అవకాశమేర్పడింది. ఈ విధమైన వ్యవస్థ కూడా ఒడుదుడుకులను ఎదుర్కోవడంతో మూడో పార్టీ పాటీలో సముచిత స్థానం పొందడం మొదలైంది.

10.12 ఫ్రాన్సులో పార్టీ వ్యవస్థ

ఇటీవలి కాలం వరకూ ఫ్రాన్సు దేశపు రాజకీయ పార్టీలు స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పరచడంలో విఫలమయ్యాయనే విమర్శ ప్రచారంలో ఉంది. ఈ దేశంలో పార్టీలు పారిశ్రామికాభివృద్ధికి, పట్టణాభివృద్ధి - జరిగిన కాలానికి ముందు ఏర్పడ్డాయి. ముందుగా ఇవి మధ్యతరగతి ప్రయోజనాల పట్ల శ్రద్ధ వహించాయి. ఇక్కడి రాజకీయ పార్టీలు శాసనసభలో నుంచి, బయటినుంచి ఆవిర్భవించాయి. వీటిలో మొదటివి పార్టీలుగాను, రెండో రకపు పార్టీలు జనసామాన్యంపై ఆధారపడిన (Mass- based) పార్టీలుగానూ అభివృద్ధి చెందాయి.

ప్రధానంగా ఫ్రాన్సులోని రాజకీయ పార్టీలను, సిద్ధాంతం ప్రాతిపదికగా Right parties, Left Parties, Centrists అని మూడు రకాలుగా పేర్కొనవచ్చు. 1789 మొదలు 5వ ఫ్రెంచి రిపబ్లిక్ ఏర్పడేవరకు సెంట్రిస్ట్ సంకీర్ణ ప్రభుత్వాలు సుమారు 30 సంవత్సరాలు పనిచేశాయి. విజాతీయత ముఖ్య లక్షణం (heterogeneity) గా గల ఫ్రెంచి సమాజంలో బహుళ పార్టీ వ్యవస్థ చోటు చేసుకొంది.

సమకాలీన ఫ్రెంచి రాజకీయాలలో సోషలిస్ట్ పార్టీ (Socialist Party) కమ్యూనిస్ట్‌పార్టీ, గాలిస్ట్‌లు, (Gaullists), యూనియన్ ఫర్ ఫ్రెంచ్ డెమోక్రసీ, (The Union for French Democracy) నేషనల్ ఫ్రంట్ (The National Front) ముఖ్యమైన పార్టీలు. వాటిలో మొదటి రెండు Left పార్టీలు, తరవాతవి .. పార్టీలు. సోషలిస్ట్ పార్టీ మొదట్లో ప్రతిపక్షమైనప్పటికి 1981 నాటికి అధికార పార్టీ స్థాయికి చేరుకొంది. 1981, 1988లలో గణనీయమైన విజయాన్ని సాధించింది. 1991లో ఈ పార్టీ తరపున ఎడిత్ గ్రెసన్ (Edith Gresson) ప్రధాన మంత్రి అయింది. ఫ్రెంచి చరిత్రలో ఈమె ప్రధాన మంత్రి పదవి చేపట్టిన మొదటి మహిళ.

1970 వరకూ ఫ్రెంచి రాజకీయాలలో కమ్యూనిస్ట్ పార్టీ ప్రాబల్యం ఉండేది. సోషలిస్ట్‌లు అధికారంలోని వచ్చిన తరవాత వామపక్ష ప్రభుత్వంలో ఒక చిన్న భాగస్వామిగా చేరడమా లేక ప్రతిపక్షంతో చేరడమా అనే సందిగ్ధతతో కమ్యూనిస్ట్‌లు వామపక్షప్రభుత్వంపైపే మొగ్గు చూపారు. అయితే 1986 ఎన్నికలకు ముందు ప్రభుత్వం నుంచి వైదొలగారు. సభ్యుల సంఖ్య తగ్గడం, ఎన్నికలలో లభించిన స్థానాలు కూడా తగ్గడం మొదలైన సమస్యలను ఈ పార్టీ ఎదుర్కొంటోంది.

ఇక right పార్టీలలో, గాలిస్టుల విషయానికి వస్తే, 1980లో నేషనల్ ఫ్రంట్ ఏర్పడేవరకూ వీరికి బాగా ప్రాముఖ్యం ఉండేది. జనరల్ డీగాల్ నాయకత్వంలో ఈ పార్టీ 1973 వరకూ బలమైన పార్టీగా వ్యవహరించింది. అయితే ఈసంవత్సరంలో జరిగిన ఎన్నికలలో లెఫ్టిస్టుల, సెంట్రిస్టుల పోటీ ఎదుర్కోవలసి వచ్చింది. యూనియన్ ఫర్ ఫ్రెంచ్ డెమోక్రసీ కొన్ని పార్టీల మధ్య ఐక్యత సాధించాలన్నది ఈ పార్టీఏర్పాటుకు దారితీసింది.

ఫ్రాన్స్‌లో రాజకీయ పార్టీలు రాజకీయ జీవనాన్ని నడిపించే ప్రధాన వ్యవస్థలుగా పరిగణిస్తారు. 1988-90 మధ్యకాలంలో పార్టీలకు నిధులు సమకూర్చే చట్టాలు రూపొందించి, అమలు చేయడం, వీటి అవసరం ఎంతగా గుర్తించబడిందన్న విషయాన్ని తెలుపుతుంది. 1988లో రూపొందిన ఒకచట్టం ప్రకారం ఎన్నికలలో పోటీచేసే సభ్యులకు ఎన్నికల వ్యయం భర్తీ చేసే ఏర్పాటుకు అవకాశం కల్పించడమైంది. అయితే ఎన్నికల వ్యయం ఇంతకు మించి ఉండరాదనే నిబంధనలు కూడా రూపొందాయి.

ఫ్రెంచి పార్టీ వ్యవస్థలో పార్టీ మార్పిడి, తక్కువస్థాయిలో క్రమశిక్షణ కనిపిస్తాయి. పార్టీలతో బాటు వివిధ పార్లమెంటరీ సముదాయాలు (Parliamentary groups) సిద్ధాంతపరమైన సారూప్యం అమెరికా, బ్రిటన్ దేశాలలో కనిపిస్తే, ఫ్రాన్సులో వైవిధ్యం ఉంటుంది. ముందుగా వివరించినట్లు left Ideology, Right Ideologies ప్రస్ఫుటంగా ఉన్నాయి. రాజకీయాలపై మతం ప్రభావం ఉంది. రాజకీయ బ్రిటన్, అమెరికా దేశాలలో ఒక ఆటవంటిదైతే (game) ఫ్రాన్సులో ఒక యుద్ధం. (battle) వైవిధ్యంగల ప్రజాసమూహాలు, అనేక కార్మిక సంఘాలు, రాజకీయ అస్థిరత మొదలైన కారణాలు ఫ్రాన్సులో బహుళ పార్టీ వ్యవస్థ ఆవిర్భావానికి దారితీసాయి.

10.13 వర్ధమాన దేశాలలో రాజకీయ పార్టీలు

వర్ధమాన దేశాలలో రాజకీయ పార్టీలు వివిధ దశలలో అభివృద్ధి చెందాయి. ఈ దేశాలనే మూడోప్రపంచదేశాలుగా కూడా పేర్కొంటారు. ఈ దేశాల్లోని రాజకీయ పార్టీలను అధ్యయనం చేసిన రాజనీతి శాస్త్రజ్ఞులు, పశ్చిమ రాజ్యాలలో ఉన్న పార్టీలను ఇవి పోలి ఉంటాయని (స్వరూపంలోను, విధులలోను) పోటీయుత బహుళ పార్టీ వ్యవస్థలు ఈ దేశాలలో ఉంటాయని భావించారు. కాని Trophical Africa లో బహుళపార్టీ వ్యవస్థలకు బదులుగా ఏకపక్ష వ్యవస్థలు చోటు చేసుకొన్నాయి. ఇవి జాతీయ సమైక్యతకు, సమగ్రతకు సాధనాలుగా పరిగణించడమైంది. అందువల్ల రాజకీయాభివృద్ధికి బదులుగా రాజకీయ క్షీణత ఈ రాజ్యాలలో ఏర్పడిందని Samuel P. Huntington వ్యాఖ్యానించారు. అధికారం ఏర్పాటుకు సహాయకారిగా ఉండే ఒకే ఒక ఆధునిక సంఘం (Modern Organization) పార్టీ అని ఇతని భావం. అయితే ఏకపక్ష వ్యవస్థలు స్థిరత్వానికి దోహదం చేయలేకపోయాయి. ఉదాహరణకు 1966లో ఘనాలో పీపుల్స్ పార్టీ (People's Party) అధికారాన్ని ఒక సైనిక తిరుగుబాటు కూలదోసింది. బ్రెజిల్‌లో 1964లోను, చిలీలో 1973లోను, ఉరుగ్వేలో 1973లోను ఇటువంటి సంఘటనలు జరిగాయి. ఆసియా ఖండంలో కూడా పాకిస్తాన్‌లో 1958, 1977లోను, బర్మాలో 1962లోను, ఇండోనేషియాలో 1965లోను, ఫిలిప్పీన్స్‌లో 1972లోను సైనిక తిరుగుబాట్లు జరగడంవల్ల అధికారపార్టీ పరిపాలన తొలగింది. వర్ధమాన రాజ్యాలలో పార్టీల సిద్ధాంతాలు ఆధునికమైనవైనా ఆచరణపద్ధతులు, సంస్థాగత విషయాలు సంప్రదాయబద్ధమైనవని విమర్శకులంటారు. అయితే పరిస్థితులను బట్టి ఆధునిక, సంప్రదాయాల మిశ్రమ లక్షణాలను కలిగి ఉండడం అసమంజసం కాదని చెప్పవచ్చు.

ఆలీన దేశాలలో చాలాకాలం కొనసాగిన పార్టీలు కూడా ఉన్నాయి. లైబీరియాలో True whigs అనే పార్టీ 1878 నుంచి 1980 వరకు అధికారంలో కొనసాగింది. 1885లో స్థాపించబడిన భారత జాతీయ కాంగ్రెస్ వేటివరకు ఒక బలమైన పార్టీగా భారతదేశంతో వ్యవహరిస్తోంది. మలేసియాలోని యునైటెడ్ పార్టీల ప్రాముఖ్యం పెరిగింది. తిరుగుబాటుని సంస్థాగతం చేసే విధంగా క్యూబాలోని కమ్యూనిస్ట్ పార్టీ మార్పు చెందింది. బ్రెజిల్‌లో Movimento Democratico Brasileiro i.e Brazilian Democratic Movement ఒక బలహీనమైన ప్రతిపక్షంగా ఉండేది. ఇది నేడు ప్రజాస్వామ్య పరిరక్షణ ఆశయంగా ప్రాధాన్యతను పెంచుకొంది. ఇరాక్‌లోని Bath పార్టీ 1968 నుంచి నాటకీయ ఫక్కీలో అభివృద్ధి సాధించడం మొదలుపెట్టింది. నియంత్రణా సాధనంగాను, పఠస్థాగతంగాను, ఒకే నాయకుని ఆధీనంలో ఈ పార్టీ అభివృద్ధి చెందింది. జమైకాలో 1970 నుంచి Peoples National Party, Jamaica Labour Party స్థానిక వ్యవస్థీకరణ విషయంలోను, అంతర్గత ప్రజాస్వామ్యంలోను బలం పుంజుకొన్నాయి.

వర్ధమాన దేశాలలో రాజకీయ పార్టీలు ప్రాముఖ్యం తక్కువ అన్న వాదన నిరాధారమైన వాదన అని నేడు ఋజువైంది. పార్టీలు ఆవిర్భవించడం, గతించడం జరుగుతున్నా, ఈ దేశాలలో ఒక విధమైన కొనసాగే లక్షణం (Continuity) కూడా కొన్ని పార్టీల విషయంలో గోచరిస్తుంది. ఈ దేశాలలోని పార్టీలు సంస్థాగత కేంద్రీకరణ విషయంలో భేదాలు కలిగి ఉన్నాయి. అధికార నాయకత్వంలో కేంద్రీకృతమైనప్పటికీ పోషకత్వ ధోరణి (Patronage) ఉంటోంది కనుక వికేంద్రీకరణ కూడా కొంతమేరకు కనిపిస్తుంది.

ఈ దేశాలలో రాజకీయ పార్టీలు సిద్ధాంతపరమైన, భౌతిక సంబంధమైన ప్రేరేపణలు లేదా ప్రోత్సాహాలు (Inducements) ఇవ్వలేక పోతున్నాయన్న తీవ్ర విమర్శ ఉంది. అంతే కాకుండా పార్టీల కార్యక్రమాల నిర్వహణకు తగిన వనరులు లేకపోవడం ఈ దేశాల నాయకులు ఎదుర్కొంటున్న నిరంతర సమస్య (Perennial Problem). ఇక అధికార పార్టీకి, ప్రభుత్వోద్యోగులకు మధ్య సరిహద్దు చాలా అస్పష్టం (extremely hazy) అని Vicky Randall అభిప్రాయం. సాధారణంగా ఈ దేశాలలోని పార్టీలు కేంద్రీకృత నాయకత్వం కలిగినవి (Centralized Leadership). ఎన్నికల ప్రచారానికి తమ సంస్థ సభ్యులకు మారుగా సాధారణంగా ఈ దేశాలలోని పార్టీలు ప్రత్యేక సంఘాల సభ్యులను పంపడం గమనించవచ్చు. ఉదాహరణకు స్త్రీలు, యువకులు Malays Naional Organization, శ్రీలంకలోని United National Party, కెన్యాలో Kenya Africa National Union, టాంజానియాలో Chama Cha Mapinduzi, సెనెగల్‌లో Union Progressiste Senegalaise, జాంబియాలో United National Independence Party మరికొన్ని ఉదాహరణలు.

సైనిక తిరుగుబాట్లద్వారా పదవీచ్యుతి పొందిన పార్టీలు తిరిగి అధికారంలోకి వచ్చిన సంఘటనలు కనిపిస్తాయి. 1979లో ఘనా, నైజీరియాలోను, లిబియాలో 1984లోను, టర్కీలో 1983లోను, సూడాన్‌లో 1986లోను, బంగ్లాదేశ్‌లో 1985లోను ఈ విధంగా జరిగింది. ఈ విషయాలను బట్టి రాజకీయ పార్టీలు వర్ధమాన దేశాలలో సముచిత పాత్ర వహిస్తున్నాయని తెలుస్తోంది.

ప్రైవేటు ఆస్తి రద్దు చేయడం ప్రాతిపదికగా సరికొత్త సమాజనిర్మాణానికి క్యూబా (Cuba). వియత్నాం (Vietnam) లలో కమ్యూనిస్ట్ పార్టీల కృషి గణనీయమైనది. మొజాంబిక్, అంగోలా, నికరాగువాలలో సోషలిస్ట్‌ల ప్రభుత్వం ఏర్పాటుకు రాజకీయ పార్టీలు ప్రయత్నించాయి.

మూడో ప్రపంచ దేశాలలోని రాజకీయ పార్టీలను గురించి Vicky Randall సంపాదకత్వంలో ప్రచురించిన పరిశోధన వ్యాసాల సంపుటిలో కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. ఈ రాజ్యాలలోని పార్టీ వ్యవస్థలు విభిన్న వైఖరులతో కూడినవి. ఉదాహరణకు క్యూబాలోని కమ్యూనిస్ట్ పార్టీ (Communist Party of Cuba) అత్యంత క్రమశిక్షణతో కూడినది. అంతేకాకుండా వ్యవస్థీకరణలో స్థిరత్వం, సమీకరణశక్తి కలిగి ఉంది. దీనికి భిన్నంగా రాజకీయాలలో ప్రముఖపాత్ర వహించే,కొంత తక్కువ కేంద్రీకృత లక్షణాలున్న, పోషకత్వం ఆధారంగా ఏర్పడిన (Patronage based) భారతదేశంలోని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ విషయంలో కొంత వెసులుబాటు కల్పిస్తుంది. ఘనాలో పార్టీ వ్యవస్థ పతనావస్థలో ఉన్నదని (decline) చెప్పవచ్చు. క్యూబా, బ్రెజిల్,ఇరాక్‌లలో ఈ దశాబ్దిలో రాజకీయ విద్యార్థులు, రైతులు, కార్మిక సంఘాల సభ్యులు మొదలైన వారిని ప్రచారంలో వినియోగించుకోవడం జరుగుతుంది.

-డా ॥ పి. మాణిక్యాంబ

10.14 చదువదగిన పుస్తకాలు

1. *Verinder Grover (Ed) Vol 5; Party systems and political parties*
2. *M. Duverger : Political parties : their organisations and activity in the Modern state*
3. *Sartori. G: Parties and Party systems*
4. *Almond and Powell : Camparative politics : A Developmental approach*

10.15 నమూనా పరీక్షా ప్రశ్నలు

కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. రాజకీయ పార్టీలు అంటే ఏమిటో నిర్వచించి వాటి విధులను వివరింపుము.
2. రాజకీయ పార్టీల వ్యవస్థలలోని భేదాలను పరిశీలింపుము.
3. భారతదేశంలో రాజకీయ పార్టీల వ్యవస్థను వివరింపుము.

...

డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజికశాస్త్రాల విభాగం

రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం

M.A. రెండవ సంవత్సరం

పాఠ్యాంశం- **I** తులనాత్మక రాజకీయాలు

పాఠ్యప్రణాళిక

ఖండం – I ప్రవేశిక

భాగం - 1 తులనాత్మక రాజకీయాల అధ్యయన వికాసం

భాగం - 2 తులనాత్మక రాజకీయాల అధ్యయన ధృక్పథాలు

ఖండం – II రాజకీయ విశ్లేషణ

భాగం - 3 రాజకీయ అభివృద్ధి

భాగం - 4 రాజకీయ సంస్కృతి

భాగం - 5 వ్యవస్థల విశ్లేషణ

భాగం - 6 నిర్మితులు, విధుల విశ్లేషణ

భాగం - 7 రాజకీయ వ్యవస్థ ఆధారాలు

భాగం - 8 మార్క్సిస్టు విశ్లేషణ

భాగం - 9 భావసిద్ధాంతం పాత్ర

ఖండం – III రాజకీయ వ్యవస్థలు

భాగం - 10 రాజకీయ పార్టీలు - పార్టీ వ్యవస్థలు

భాగం - 11 ప్రభావ వర్గాలు

భాగం - 12 రాజకీయ భాగస్వామ్యం

ఖండం – IV అధికారం

భాగం - 13 రాజ్య స్వభావం, శక్తి, శాసనసబద్ధత

భాగం - 14 స్వాతంత్ర్యం - అధికారం

భాగం - 15 రాజ్యాంగ బద్ధతావాదం

భాగం - 16 న్యాయ వ్యవస్థలు

భాగం - 17 విప్లవాలు

భాగం - 18 అధీనత భావ సిద్ధాంతాలు

భాగం - 19 సైన్యం పాత్ర

భాగం - 20 శాసనవర్గాలు

ఖండం – V నిర్మితులు

భాగం - 21 సమాఖ్య ఏక కేంద్ర ప్రభుత్వాలు

డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజికశాస్త్రాల విభాగం

రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం

M.A. రెండవ సంవత్సరం

పాఠ్యాంశం - I తులనాత్మక రాజకీయాలు

నమూనా ప్రశ్నాపత్రం

సమయం: 3 గంటలు మార్కులు: 100

భాగం "A"

కింది ప్రశ్నలకు జవాబులు రాయుము. 4 X 15 = 60

1. తులనాత్మక రాజకీయాల అధ్యయన వృద్ధి క్రమాన్ని వివరింపుము?

   లేదా

   తులనాత్మక రాజకీయాలంటే ఏమిటి వివరింపుము?

2. ప్రవర్తనావాదం తులనాత్మక రాజకీయాల అధ్యయనాన్ని ఏ విధంగా ప్రభావపరిచింది?

   లేదా

   తులనాత్మక రాజకీయాల అధ్యయన దృక్పథాలను చర్చించండి.

3. రాజకీయ అభివృద్ధి సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి.

   లేదా

   రాజకీయ సంస్కృతి భావనను వివరిస్తూ దాని లక్షణాలను రాయండి

4. రాజనీతి శాస్త్ర అధ్యయనాల్లో సాధారణ వ్యవస్థల భావన పాత్రను పరిశీలించండి

   లేదా

   నిర్మితులు- విధుల విశ్లేషణను సవివరంగా పరిశీలింపుము.

భాగం "B"

కింది ప్రశ్నలకు జవాబులు రాయుము. 5 X 8 = 40

5. భారతదేశంలో రాజకీయ పార్టీల వ్యవస్థ

   లేదా

   భావసిద్ధాంతపు అర్థాన్ని వివరించండి.

6. మార్క్సిస్టు రాజ్య భావన తులనాత్మక రాజకీయాలను ఎలా ప్రభావపరిచింది.

   లేదా

   రాజకీయ వ్యవస్థ మూలాధారాలను విశ్లేషించండి.

7. వ్యవస్థల విశ్లేషణ

   లేదా

   డేవిడ్ ఈస్టన్

8. మూడవ ప్రపంచ దేశాలలో రాజకీయ సంస్కృతి

   లేదా

   సాంప్రదాయ అధ్యయన పద్ధతి

9. శాస్త్రీయ దృక్పథం అనగా ఏమిటి

   లేదా

   రాజకీయ సమాజ శాస్త్రం

తులనాత్మక రాజకీయాలు

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

1995

రచయితల బృందం

సంపాదకుడు

ఆచార్య కె. సుభాష్ చంద్రారెడ్డి

సహసంపాదకులు

ఆచార్య ఎం. సత్యనారాయణరావు

రచయితలు

ఆచార్య బి. వెంకటేశ్వర్లు

ఆచార్య డి. సూరన్ నాయుడు

డా. పి. మాణిక్యాంబ

డా. వి. రవీంద్ర శాస్త్రి

డా. టి. ఎస్. మోహన

తెలుగుబాష పరిశీలన:

డా. కె. ఆర్. కె. మూర్తి

ముఖచిత్రం

యం. రమేష్

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,
ప్రథమ ప్రచురణ : 1995

కాపీరైటు C 1995 డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

అన్ని హక్కులూ విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగమైనా ఉపయోగించ దలచుకుంటే విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం.

పాఠ్య ప్రణాళిక మొత్తం వివరాలు ఈ పుస్తకం చివరలో ఉన్నాయి.

ఇతర వివరాలకు : ఎకడమిక్ డైరెక్టర్, డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైద్రాబాద్.

ముద్రణ : సిద్ధేశ్వర్ ప్రింటర్స్, మార్కెట్‌వీధి, సికింద్రాబాద్.

పరిచయం

తులనాత్మక రాజకీయాల అధ్యయనం ఎప్పటి నుంచి ఆరంభమైందో, ఏఏ కాలంలో జరిగిందో వివరించటం అంత సులభతరమైన విషయం కాదు. ఆధునిక యుగారంభంతో తులనాత్మక రాజకీయాల అధ్యయనం ఆరంభమైందన్న విషయం అందరి ఆమోదం పొందింది. ఈ శతాబ్దంలో ప్రధానంగా రెండవ ప్రపంచయుద్ధం తరువాత కాలంలో తులనాత్మక రాజకీయాల అధ్యయనం ప్రముఖ స్థానాన్ని సంతరించుకొంది. యుద్ధానంతరం స్వతంత్ర రాజ్యాలుగా ఆవిర్భవించిన చాలా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికన్ దేశాలు వాటి పూర్వవలస పాలన ప్రభావంతో చాలా వరకు పాశ్చాత్య రాజకీయ నిర్మితులను అనుసరించాయి. పాశ్చాత్య దేశాల్లో విజయవంతమైన చాలా రాజకీయ భావనలు ఈ దేశాల్లో విజయవంతం కాలేకపోయాయి. పర్యవసానంలో చాలా మంది మేధావులు కారణాలు వెతకనారంభించారు. అంతర్జాతీయ రంగంలో యుద్ధానంతరం నెలకొన ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం, అభివృద్ధి చెందుతున్న దేశాలలోని అస్థిరత్వాలు తులనాత్మక రాజకీయాల అధ్యయనానికి మేధావులను ప్రోత్సాహపరిచాయి. యుద్ధానంతరం పాశ్చాత్యేతర రాజకీయ వ్యవస్థల అధ్యయనంపట్ల ఆసక్తి బాగా పెరిగింది. ప్రవర్తనావాద దృక్పథం కూడా తులనాత్మక రాజకీయాల అధ్యయనవృద్ధికి తనవంతు దోహదం చేసింది. పర్యవసానంలో రాజకీయ సంస్థల అధ్యయనంలోవాటి సామాజిక, చారిత్రక, సాంస్కృతిక, పూర్వరంగం విశ్లేషణ ప్రాముఖ్యతను సంతరించుకొంది. వివిధ రాజకీయ వ్యవస్థల మధ్యగల వైవిధ్యాలను వ్యత్యాసాలను అధ్యయనం చేయటానికి తులనాత్మక రాజకీయాల అధ్యయనం బాగా దోహదం చేసింది. తులనాత్మక రాజకీయాల అధ్యయనం వివిధ దశలలో అనేకరకాలుగా వృద్ధి చెందింది. ప్రారంభంలో భావాలకు, ప్రమేయాలకు ప్రాధాన్యం లభించగా అటు తరువాత విలువలతో కూడిన సిద్ధాంతాలు అవతరించాయి. ఇటీవలి కాలంలో లాంఛనప్రాయ చట్టబద్ధ రాజకీయ సంస్థల, నిర్మితులపై తులనాత్మక రాజకీయాల అధ్యయనం తన దృష్టిని సారించింది.

రాజనీతి శాస్త్ర స్నాతకోత్తర అధ్యయనాంశాలలో తులనాత్మక రాజకీయాల అధ్యయనాన్ని ప్రవేశపెట్టాం. ఈ అధ్యయనాంశంలో అయిదు ఖండాలు ఉన్నాయి. తులనాత్మక రాజకీయాల అధ్యయన వికాసం, దృక్పథాలను మొదటి ఖండంలో చర్చించాం. తులనాత్మక రాజకీయాల విశ్లేషణలోగల వివిధ భావనలను రెండవ ఖండంలో చర్చించాం. మూడవ ఖండంలో వివిధ రాజకీయ సంస్థలను గురించిన అధ్యయనాంశాలున్నాయి. నాలుగవ ఖండంలో అధికారం శక్తి, శాసనబద్ధత, స్వాతంత్ర్యం, అధికారం, న్యాయవ్యవస్థలు, అధీనతా భావ సిద్ధాంతాలను చర్చించటం జరిగింది. చివరి ఖండంలో సమాఖ్య, ఏకకేంద్ర ప్రభుత్వ నిర్మితుల అధ్యయనాన్ని చేర్చాం.

ఇది తులనాత్మక రాజకీయాల సమగ్ర అధ్యయనం కాదు. విద్యార్థి అవగాహన కొరకు అవసరమైన సమాచారాన్ని చేర్చటానికి ప్రయత్నించాం. ప్రపంచ రాజకీయ వ్యవస్థలలో చాలా త్వరితగతిన మార్పుచేర్పులు స్థానం సంతరించుకొంటున్నాయి. సమకాలీన రాజకీయాలను అవగాహన పరచుకోవటం తులనాత్మక రాజకీయాల పరిశీలనకు, అధ్యయనానికి దోహదం చేస్తుంది.

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం

ఎం. ఎ. రెండవ సంవత్సరం

పాఠ్యాంశం - 1 తులనాత్మక రాజకీయాలు

విషయ సూచిక

భాగం - 11 :	ప్రభావ వర్గాలు	...	1
భాగం - 12 :	రాజకీయ భాగస్వామ్యం	...	19
ఖండం - IV :	అధికారం		
భాగం - 13 :	రాజ్యస్వభావం, శక్తి, శాసనబద్ధత	...	43
భాగం - 14 :	స్వాతంత్ర్యం - అధికారం	...	62
భాగం - 15 :	రాజ్యాంగ బద్ధతావాదం	...	73
భాగం - 16 :	న్యాయవ్యవస్థలు	...	91
భాగం - 17 :	విప్లవాలు	...	105
భాగం - 18 :	అధీనతాభావ సిద్ధాంతాలు	...	128
భాగం - 19 :	సైన్యం పాత్రం	...	140
భాగం - 20 :	శాసన వర్గాలు	...	147
ఖండం - V :	నిర్మితులు		
భాగం - 21 :	సమాఖ్య ఏకకేంద్రప్రభుత్వం	...	173

భాగం-11 : ప్రభావ వర్గాలు

విషయక్రమం

11.1 లక్ష్యాలు

11.2 పరిచయం

11.3 ప్రభావ వర్గాల అధ్యయన ప్రయోజనం

11.4 ప్రభావర్గాలు - నిర్వచనాలు

11.5 ప్రభావవర్గాల లక్షణాలు

11.6 ప్రభావవర్గాలు - కర్తవ్యాలు

11.7.0 ప్రభావర్గాల కార్యాచరణ పద్ధతులు

- 11.7.1 లాబీయింగ్
- 11.7.2 సమ్మె
- 11.7.3 బంద్
- 11.7.4 ఘెరావో

11.8 ప్రభావ వర్గాల సామర్థ్య కారకాలు

11.9.0 ప్రభావ వర్గాలు : రాజకీయాలు

- 11.9.1 బ్రిటన్
- 11.9.2 అమెరికా సంయుక్త రాష్ట్రాలు
- 11.9.3 ఫ్రాన్స్
- 11.9.4 కెనడా

11.10 ముగింపు

11.11 చదువదగిన పుస్తకాలు

11.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

11.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- ప్రభావ వర్గాలు అంటే ఏమిటి
- వాటి అధ్యయన ప్రయోజనాలు
- కార్యాచరణ పద్ధతులు

బాగా వివరించగలుగుతారు.

11.2 పరిచయం

ఆధునిక రాజకీయ వ్యవస్థలలో ప్రభావ వర్గాలు చాలా ప్రాముఖ్యతను సంతరించుకొన్నాయి. తులనాత్మక రాజకీయాల అధ్యయనంలో ప్రభావవర్గాల అధ్యయనం చాలా ఆసక్తి దాయకమైనది, ప్రయోజనకరమైనది కూడా. చరిత్రలో అన్ని కాలాలోను ప్రభావవర్గాల ప్రభావం రాజకీయాలపై ఏదో విధంగా ఉంటూనే వచ్చింది. ఆధునిక యుగంలో, ప్రధానంగా రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కాలంలో వీటిని గురించిన పరిశోధన, అధ్యయనం బాగా వృద్ధి చెందింది. ఒకప్పుడు ప్రభావవర్గాలను ప్రజాస్వామ్య విధ్వంసకాలుగా పరిగణించేవారు. అయితే బహుత్వ ప్రజాస్వామ్యంలో ఇవి తప్పనిసరి అని, వ్యక్తికి రాజ్యానికి మధ్య ఇవి కీలకమైన పాత్రను నిర్వహిస్తున్నాయని నేడు భావిస్తున్నారు. ప్రభావవర్గాలను, ప్రయోజన వర్గాలు, రాజకీయ వర్గాలు, లాబీలు, సిండికేట్లు, కనిపించని ప్రభుత్వం అని కూడా వ్యవహరిస్తున్నారు.

11.3 ప్రభావవర్గాల అధ్యయన ప్రయోజనం

వాస్తవ రాజకీయాలను అవగాహన చేసుకోటానికి ప్రభావవర్గాల అధ్యయనం ఎంతగానో తోడ్పడుతుంది. రాజ్యాంగ పరంగా ఏర్పడిన సంస్థలు పనిచేయాల్సిన తీరుకు, ఆచరణాత్మకవద్ధతులకు మధ్య తేడాలు గమనించటానికి అవకాశం కూడా కలుగుతుంది. సమాజంలో వ్యక్తిని ప్రత్యేకంగా ఒక వ్యక్తిగా గాకుండా, ఒక వర్గం లేదా వర్గాలలో సభ్యునిగా పరిగణిస్తూ రాజకీయ వ్యవస్థ పనిచేసే తీరు తెన్నులను పరిశీలించటం ద్వారా వ్యవస్థ స్వరూపాన్ని, కార్యకలాపాలను జాగ్రత్తగా అంచనా వేయవచ్చు. రాజకీయ వ్యవస్థలో సభ్యులైన, వ్యక్తుల వర్గాల రాజకీయ ప్రవర్తనను నిర్ణయించే విలువలు, విశ్వాసాలను ప్రభావ వర్గాల అధ్యయనం ద్వారా తెలుసుకోవచ్చు. ఉద్యోగి బృందం, ప్రభుత్వ వర్గాల మధ్య ఉండే లాంఛనేతర సంబంధాలను విశ్లేషించటానికి ప్రభావవర్గాల అధ్యయనం బాగా తోడ్పడుతుంది. అధికారికంగా రాజకీయాధికారం నిర్వహించాల్సిన సంస్థలు ఏమిటి? అనధికారికంగా నిర్వహిస్తున్న సంస్థలేమిటి? ఇలాంటి ప్రక్రియలో ప్రధానపాత్ర వహించే వర్గాల నిర్మాణం, స్వరూప స్వభావాలు, కర్తవ్యాలు, నియమావళి సిద్ధాంతాలు, ఆచరణ పద్ధతులు మొదలైన వాటిని అవగాహన చేసుకోవచ్చు.

11.4 ప్రభావవర్గాలు : నిర్వచనాలు

ప్రభావవర్గాలను నిర్వచించే ముందు వర్గం అంటే ఏమిటో తెలుసుకోవటం చాలా అవసరం. సర్వసాధారణ పరిభాషలో వర్గం అంటే కొంతమంది వ్యక్తుల సముదాయం. అయితే వర్గ సిద్ధాంతం ప్రకారం, వర్గం అనేమాటకు అర్థం చెప్పేటప్పుడు వ్యక్తుల కంటే క్రియకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నది. వర్గ సిద్ధాంతం ప్రవచించిన ముఖ్యులలో ఒకరైన ఆర్థర్ బెంట్లీ అభిప్రాయంలో వర్గాన్ని భౌతిక సమూహంగా (Physical Mass) కాకుండా క్రియా సమూహంగా (Mass of Activity) పరిగణించాలి. క్రియా సమూహంగా వ్యవహరించే ప్రతి వర్గానికి కొన్ని ప్రయోజనాలుంటాయి. సామాన్య ప్రయోజనాలుగల వ్యక్తులు ఒకవర్గంగా ఏర్పడి తమ ప్రయోజనాల సాధనకు కృషి చేస్తారు. ఒకే వ్యక్తి వివిధ వర్గాలలో సభ్యుడు కావచ్చు. సమాజంలో అనేక వర్గాలుంటాయి. వీటి మధ్య పరస్పర సంబంధాలుంటాయి. సామాన్య ప్రయోజనాలు వ్యక్తులను ఒకటిగా చేసి వర్గ వ్యవస్థీకరణకు తోడ్పడుతాయి. ప్రతివర్గం, సాధ్యమైనంత వరకు తన ప్రయోజనాలను ఎక్కువగా సాధించుకోవడానికి ప్రయత్నిస్తుంది. వివిధ వర్గాలు ఈ విధంగా కృషి చేయటంతో వర్గాల మధ్య సంఘర్షణ, చీలిక, సమీకరణం వంటివి సంభవిస్తుంటాయి. వర్గాల ప్రాముఖ్యం, సామర్థ్యం, వాని సభ్యులు, వ్యవస్థీకరణ, ఆశయాలు, ఆచరణ పద్ధతులు, వనరులపై ఆధారపడి ఉంటాయి. వర్గాల కార్యక్రమాలు రాజకీయం, రాజకీయేతరమైనవికావచ్చు. ప్రభుత్వ సంస్థల ద్వారా తమ కోర్కెలసాధనకు కృషిచేసి నప్పుడు వర్గాల కార్యక్రమాలను రాజకీయ సంబంధమైనవిగా పరిగణించవచ్చు. ప్రభుత్వం వర్గాల ప్రయోజనాలను సమకూర్చడానికే కాకుండా, వర్గాల మధ్య సంఘర్షణలు నివారించటానికి, వాటి పనితీరును క్రమ బద్ధీకరించటానికి కృషి చేస్తుంది.

సామాన్య ప్రయోజనాలు వర్గాల ఆవిర్భావానికి దోహదం చేస్తాయని, వర్గాలు తమ ప్రయోజనాల గుర్తింపుకు, సాధనకు కృషి చేస్తాయని పైన తెలుసుకొన్నాం. ఇప్పుడు ప్రభావవర్గాలను నిర్వచించే ప్రయత్నం చేద్దాం. ప్రభుత్వం ద్వారా గాని, ప్రభుత్వేతర చర్య ద్వారాగాని రాజకీయ మార్పుతేవడానికి ప్రయత్నించే ఏవర్గమైనా ప్రభావవర్గ మవుతుందని కాసిల్స్ అభిప్రాయం. అంతేకాక ప్రభావర్గాలు రాజకీయ పార్టీలు ఒకటికాదని కూడా విశదం చేసారు. (Any group attempting to bring about political change, whether through government activity or not; and which is not a political party in the sense of being represented at that particular time in the legislative body is a pressure group — G. Castles)

ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నించే వ్యవస్థీకృతమైన ప్రభుత్వేతర సముదాయం ప్రభావవర్గం. (A pressure group is a privately organised aggregation which attempts to influence public policy.) ప్రభుత్వ సంస్థలు, పార్టీల వర్గాలు ప్రభావ వర్గాలుకావని, అయితే ప్రభావవర్గాలు ఎక్కువగా రాజకీయ ప్రయోజనాలకు వ్యవస్థీ కృతమవుతాయని పాటర్ భావించారు. (Pressure groups are groups organised largely for political purposes, except government bodies and party groups in the politics of the state.) డేవిడ్ ట్రూమన్ ప్రభావ వర్గాలకు బదులుగా ప్రయోజ వర్గాలు అనుమాటను ఉపయోగించారు. ప్రభావం అంటే బెదరింపు అనే అర్థం వస్తుం

దని, అందువల్ల ప్రయోజనాల సాధనకు కృషిచేసే వ్యవస్థీకృత వర్గాలను ప్రయోజనవర్గాలు అనడం సముచితమని ట్రూమన్ మరి కొందమంది అభిప్రాయం. (An interest group is a shared attitude group that marks certain claims upon othe groups in society. If and when it makes claims through or upon any of the institutions of Government, it becomes a political interest group.) సమాజంలోని ఇతర వర్గాల నుండి కొన్ని హక్కులను కోరే ఒకే వైఖరిగల వ్యక్తుల సముదాయాన్ని ప్రయోజనవర్గం అంటారు. ప్రభుత్వ సంస్థ ద్వారాగాని, ప్రభుత్వ సంస్థలపైగాని తన హక్కులను కోరినప్పుడు ప్రయోజన వర్గం రాజకీయ ప్రయోజన వర్గ మవుతుంది. ఒక ప్రయోజన వర్గానికి, రాజకీయ ప్రయోజనవర్గానికి తేడాను ట్రూమన్ వివరించటం మనం ఇచట గమనించదగిన విషయం. ప్రభుత్వ పదవులలో తమ సభ్యులను నియమించకుండా, ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నించే వ్యవస్థీకృత సముదాయం ప్రభావవర్గమని జిగ్లర్ అన్నారు. పైనవివరించిన నిర్వచనాలను బట్టి రాజకీయ వ్యవస్థలలో ప్రభావవర్గాలు చెప్పుకోతగిన పాత్రను నిర్వహిస్తాయని, ప్రభుత్వ విధాన ప్రక్రియలో వీటి ప్రభావం కనిపిస్తుందని, తమంతతాముగా ప్రభుత్వ పదవులకు అభ్యర్థులను ప్రతిపాదించకపోయినా, రాజకీయ పార్టీల ప్రణాళికలను నిర్ణయించకపోయినా, పరోక్షంగా ఈ కర్తవ్యాలలో ముఖ్యపాత్ర నిర్వహిస్తాయని విశదమవుతున్నది. ఇక వీటి లక్షణాలను పరిశీలిద్దాం.

11.5 ప్రభావవర్గాల లక్షణాలు

(1) ఒక నిర్దిష్టమైన ప్రయోజనం లేదా ప్రయోజనాలు ప్రభావవర్గాల ఏర్పాటుకు ప్రధాన కారణాలు. తమ సామాన్య ప్రయోజనాలు సమర్థించుకోవడానికి, పరిరక్షించుకోవడానికి, అభివృద్ధి పరచుకోవడానికి వ్యక్తులు ఒకటిగా చేరి సంఘటితమవుతారు. ప్రయోజనాల వ్యక్తీకరణ, ప్రయోజనాల పరిరక్షణకు అవసరం. రాజకీయ మార్పిడి ప్రక్రియలో (Political Conversion Process) ప్రయోజనాల వ్యక్తీకరణ తాలిమెట్టు.

(2) సైద్ధాంతికంగా చూస్తే ప్రభావ వర్గాలు ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొనవు. ఇంతకు ముందే వివరించినట్లు ఎన్నికలలో సభ్యులను ప్రతిపాదించటంగాని, పార్టీ ప్రణాళికలు రూపొందించటం కాని చేయవు. కాని రాజకీయ నేపథ్యంలో మాత్రం వీటి పాత్ర ఉంటుంది. ఈ కారణం చేతనే ఒక్కొక్కసారి వీటి పాత్ర రాజకీయ పరమైనదాకాదా చెప్పటం కష్టతరమవుతుంది. ఒక విధంగా చెప్పాలంటే రాజకీయ సంబంధిత కర్తవ్యాలులేని ఆర్థిక, సాంస్కృతిక సంస్థల; రాజకీయ సంబంధిత కర్తవ్యాలు ఉన్న రాజకీయ పార్టీలు, ప్రభుత్వ సంస్థల పాత్రలకు మధ్యేమార్గంగా ప్రభావవర్గాల పాత్ర ఉంటుందని చెప్పవచ్చు. వీటి కర్తవ్యాలు రాజకీయ (Political) అరాజకీయ (Apolitical) తలకు మధ్యస్థంగా ఉంటాయి.

(3) ప్రభావ వర్గాలకు రాజకీయ పార్టీలకు గల తేడాల విషయంలో ప్రభావ వర్గాలు తమ ప్రయోజనాల సాధనకు ప్రభుత్వాన్ని ప్రభావితం చేయడానికి కృషి చేస్తాయి. రాజకీయ పార్టీలు ప్రభుత్వాధికారం చేపట్టటానికి పోటీ పడుతాయి. సాధారణంగా రాజకీయ పార్టీలు సంఖ్యాబలంలోనూ, నిర్వహణ పద్ధతులకు తగిన స్థానం లేని ఏదేశంలోనా ప్రజాస్వామ్య విధానం వర్ధిల్లదు. ఒక్కొక్కసారి

రాజకీయ పార్టీలు సామాన్య ప్రజానీకపు ప్రయోజనాలు విస్మరించి శిష్టవర్గాల అవసరాల పరిరక్షణకు కృషిచేయవచ్చని, అలాంటప్పుడు రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య విధాన నిర్వహణను గ్యారంటీ చేయలేవన్న విమర్శ ఉంది. సాధారణంగా రాజకీయ వ్యవస్థలో వ్యక్తులు రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనక పోయినా వర్గ సంబంధమైన కార్యక్రమాలలో పాల్గొంటారు. విధాన రూపకల్పన, అమలు పరచటం ఒక ప్రక్క, మరొక పక్క సామాన్య ప్రజానీకం మధ్య సంధాన కర్తలుగా ప్రభావవర్గాలు వ్యవహరిస్తాయి. అందు వల్ల వర్గాల ప్రాముఖ్యాన్ని తక్కువగా అంచనా వేయవీలులేదు.

(4) రాజకీయ వర్గాలుకానప్పటికీ ప్రభావవర్గాలు ఒక్కొక్కసారి రాజకీయ స్వరూపాన్ని సంతరించుకొంటాయి. ప్రధానంగా తమ ఆశయాల సాధనకు ప్రభుత్వం ద్వారా కృషిచేసేటప్పుడు. అందువల్ల వీటిని అర్ధరాజకీయవర్గాలు (Semi-Political Groups) అని వ్యవహరించవచ్చు. వాస్తవానికి అమెరికా, బ్రిటన్ వంటి దేశాలలో ప్రభావవర్గాలు కీలక అధికార కేంద్రాలుగా (Crucial Power Centres) పని చేస్తాయి. ప్రభుత్వ విధానాలు సాఫీగా అమలు జరగాలంటే సంబంధితవర్గాల సహకారం చాలా ఉండాలి. అది సాధ్యంకానప్పుడు ప్రభుత్వవిధానాలు సంబంధిత వర్గాలకు ప్రయోజనకరంగా లేనప్పుడు ప్రతి ఘటన ఎదురవుతుంది. అట్టి పరిస్థితులలో విధాన పునఃపరిశీలన తప్పనిసరి అవుతుంది.

11.6 ప్రభావ వర్గాలు : కర్తవ్యాలు

సమాజంలో వివిధ వర్గాల ప్రయోజనాలకు ప్రభావవర్గాలు ప్రాతినిధ్యం వహిస్తాయని తెలుసుకొన్నాం. వివిధ వర్గాల అవసరాలు పెరిగిన కొద్ది, ప్రత్యేకీకరణ (Specialisation) వర్గాల సంఖ్య కూడా పెరుగుతుంది. ఆధునిక కాలంలో ప్రభుత్వ కర్తవ్యాలు చాలా విస్తృతమయ్యాయి. ప్రభావ వర్గాల లక్ష్యాలు కూడా పెరిగాయి. దేశ రాజధానులు కేంద్రాలుగా ప్రభావవర్గాలు తమ లక్ష్య సాధనకు చురుకుగా పని చేయటం మొదలుపెట్టాయి. వీటి కర్తవ్యాలను కింది విధంగా వివరించవచ్చు.

1. సభ్యుల ప్రయోజనాలను ప్రభావ వర్గాలు వ్యక్తీకరిస్తాయి. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో ప్రయోజనాల వ్యక్తీకరణ మొదటిమెట్టు. తరువాత ప్రయోజనాల సమీకరణ, విధాన నిర్ణయాలు జరుగుతాయి. విధాన రూపకల్పనతో సంబంధం ఉన్న రాజకీయ పార్టీలు, శాసనసభలు, పరిపాలనా యంత్రాంగాలకు ప్రభావ వర్గాలు తమ తమ ప్రయోజనాలను తెలుపుతాయి. రాజకీయ పార్టీలు, వాటి నాయకులు వర్గాల ప్రయోజనాలను సమీకరించి విధాన రూపకల్పనకు ప్రత్యామ్నాయాలను నిర్ణయిస్తారు.

2. పాలకులకు, పాలితులకు మధ్య ప్రభావవర్గాలు సంధాన కర్తలుగా వ్యవహరిస్తాయి. ఇలా వ్యవహరించటంలో తమ ప్రభావాన్ని ప్రసారితం చేస్తాయి. అంటే ఇవి ప్రాబల్య ప్రసారిత ప్రతినిధులుగా (Influence Flow Agents) వ్యవహరిస్తాయన్నమాట. ప్రాబల్య ప్రసారంలో విడిగా వ్యక్తులకంటే వర్గాలకు సాధారణంగా సామర్థ్యం ఎక్కువ ఉంటుంది. అందునా వ్యవస్థీకృత వర్గాలకు సామర్థ్యం

ఇంకా ఎక్కువ. ఉదాహరణకు కార్మిక వర్గాలు, పారిశ్రామిక వేత్తలు తమ తమ కోర్కెలను తెలుపడమే కాకుండా వానిలో ఏవి ప్రధానమో తెలుపుతూ, అంటే కోర్కెల ప్రధమగణ్యతలను వివరిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాయి.

3. ప్రభావ వర్గాలు ప్రభుత్వ నిర్వహణ భాద్యతను ప్రత్యక్షంగా స్వీకరించవు. రాజకీయ పదవుల భర్తీల విషయంలోనూ, విధాన నిర్ణేతల ఎంపిక విషయంలోనూ ఈ వర్గాలపాత్ర సుస్పష్టంగా కన్పించనప్పటికీ, పరోక్షంగా వీటిపాత్ర చెప్పకోదగినది. ఒక్కొక్క సారి ఈ వర్గాల సభ్యులు రాజకీయ పదవులకు పోటీ చేసి గెలుపొందితే ప్రభుత్వ నిర్వహణలో వారి ప్రభావం తప్ప కుండా ఉంటుంది.

4. శాసన నిర్మాణ శాఖకు, అందలి సభ్యులకు, పాలక బృందానికి సాంకేతిక సమాచారం సమకూర్చటంలో ప్రభావవర్గాలు చెప్పకోదగ్గ పాత్రను నిర్వహిస్తుంటాయి. ఆధునిక కాలంలో శాసన నిర్మాణంలోనూ, విధాన రూపకల్పనలోనూ శాస్త్రీయ, సాంకేతి పరిజ్ఞానం, సమచారం చాలా అసరం. ఉదాహరణకు మోటారు వాహనాల పరిశ్రమకు చెందిన శాసనాలు రూపొందించాల్సి వచ్చినప్పుడు సాంకేతిక విషయాలనెన్నింటినో పరిశీలించాల్సి ఉంటుంది. అలాగే సాంకేతిక విషయాలు విద్యుత్కణ సంబంధిత (Electronics) శాసనాలకు కూడా చాలా అవసరం. ఇలాంటప్పుడు ప్రభావవర్గాలు తగిన వివరాలను సత్వరం అందించగలుగుతాయి. ఇలా అందించటం ద్వారా ప్రభావవర్గాలు శాసన ప్రక్రియను, పరిపాలనను సులభతరం చేస్తాయి.

5. ప్రభావ వర్గాలు తమ తమ సమస్యలను ప్రజల, ప్రభుత్వ దృష్టికితేవటం ద్వారా ప్రజా సమస్యలపై చర్చల ప్రేరణకు దోహదం చేస్తాయి. వివిధ సమస్యలపై ప్రజాభిప్రాయం స్పష్టీకరణ చెందటానికి అవకాశం లభిస్తుంది. విధాన నిర్ణయంలో ప్రభుత్వం తగు శ్రద్ధ వహించ వీలు కలుగుతుంది. అంటే ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రజోపయోగ నిర్ణయాలు తీసుకొనే అవకాశాలు కలుగుతాయి. ప్రజాభిప్రాయాన్ని మన్నించని ఏ ప్రభుత్వమూ ఎక్కువ కాలం మనజాలదు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే ప్రభుత్వ నిర్ణయాలు జరగటం చాలా ఆవశ్యకమైన విషయం.

6. సామాజికీకరణ పెంపొందటానికి ప్రభావ వర్గాలు సహకరిస్తాయి. ఈ విషయంలో రాజకీయ పార్టీలకంటే ప్రభావవర్గాల పాత్రయే ఎక్కువ అని చెప్పాలి. ఆయా వర్గాల సభ్యుల అవసరాలు ఎప్పటికప్పుడు పరిశీలనచేసి, అవి సమకూరడానికి అవసరమైన కార్యాచరణ పధకాలను రూపొందిస్తాయి. సంబంధిత వర్గాల సభ్యులకే కాకుండా ఇతర పౌరులకు కూడా సమాజంలో వ్యక్తుల అవసరాలు తెలుస్తాయి.

7. ప్రభావ వర్గాలు వ్యవస్థీకృతమై పనిచేస్తాయి. వాటి నాయకులు, రాజకీయ సంస్థలతోనూ, నాయకులతోనూ వ్యవహరించటానికి తగిన చతురత సంపాదించుకొనే అవకాశం కలుగుతుంది. రాజకీయ నైపుణ్యాన్ని సంపాదించుకోవటంతోపాటు, తరచుగా రాజకీయాలతో సంబంధం ఉన్న వారితో ప్రభావ వర్గాల నాయకులు చర్చలు జరపటం పరిష్కారాలు సూచించటం వంటివి చేస్తారు గనుక తగిన అనుభవం పెరుగుతూ వస్తుంది. ప్రయోజనాల పరిరక్షణ కృషిలో ఈ నాయకులు రాజకీయాలను గురించి అంచనా వేయవలసివచ్చినప్పుడు వివేకంతో వ్యవహరించాల్సి

వస్తుంది. మరో విధంగా చెప్పాలంటే అంచనాలు వేయటంలో ప్రభావ వర్గాల నాయకులు యుక్తితో వ్యవహరించాలి. అనుభవం పెరిగినకొద్దీ యుక్తి పూర్వకంగా అంచనాలువేస్తే శక్తి కూడా పెరుగుతుంది. ఈ విషయంలో ప్రభావ వర్గాలు రాజకీయ పార్టీలతో పాటుగా కృషి చేస్తాయని చెప్పాలి.

8. శాసన నిర్మాణంలోనూ, విధాన రూపకల్పనలోనూ ప్రభుత్వానికి తోడ్పడటమేగాక ఒక్కొక్కసారి ప్రభావవర్గాలు కొత్త విధానాలు ప్రారంభించ వలసిన అవసరాన్ని తెలుపుతూ విధాన ప్రారంభకులుగానూ, సృష్టి కర్తలుగానూ వ్యవహిస్తాయి. అంతేకాకుండా శాసనాలకు అవసరమైన సవరణలు, నియమనిబంధనలలో చేయవలసిన మార్పులను కూడా సూచిస్తాయి. ప్రభుత్వ విధానాలను విమర్శించటం, సవాలు చేయడం వంటి కర్తవ్యాలను కూడా ప్రభావవర్గాలు చేపడుతాయి. అట్టి సందర్భాలలో వివిధ వర్గాల అవసరాలు తెలుసుకొని ప్రభుత్వం నూతన ప్రణాళికలు, శాసనాలు రూపొందించటానికి పూనుకోవచ్చు. శాసనాల నిర్మాణం విషయంలో "లాబీ" చేయటం ప్రభావ వర్గాల ముఖ్య కర్తవ్యమని అమెరికన్లు భావిస్తారు. కార్మిక సంఘాలు, వ్యవసాయదారుల సంఘాలు, ఉద్యోగుల సంఘాలు, వాణిజ్య సంఘాలు మొదలైనవి "లాబీ" చేయటంలో ప్రముఖ పాత్రను నిర్వహిస్తున్నాయి. అమెరికాలో అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ కాంగ్రెసు ఆఫ్ ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్స్, ఛేంబర్స్ ఆఫ్ కామర్స్ ఆఫ్ ది యునైటెడ్ స్టేట్స్, నేషనల్ అస్సోసియేషన్ ఆఫ్ మాన్యు ఫాక్చరర్స్ మొదలైన వ్యాపార సంబంధ ప్రభావ వర్గాలున్నాయి. నేష్నల్ ఫార్మర్స్ యూనియన్, అమెరికన్ ఫార్మ్ బ్యూరో ఫెడరేషన్ వంటి వ్యవసాయక సంబంధ ప్రభావ వర్గాలున్నాయి. అమెరికన్ మెడికల్ అస్సోసియేషన్ వృత్తి సంబంధమైన ప్రభావ వర్గానికి ఉదాహరణ.

9. రాజకీయ వ్యవస్థలో చట్టబద్ధమైన సంస్థలు పటిష్టంగా వ్యవహరించనప్పుడు సమాజ విలువలను, అవసరాలను వాస్తవంగా ప్రస్ఫుటం చేస్తూ, అలా చేయటంలో పార్టీలకంటే, ప్రభుత్వ సంస్థల కంటె సమర్థవంతమైన ప్రతినిధులుగా ప్రభావవర్గాలు వ్యవహరిస్తాయి. అయితే వీటి సామర్థ్యం, రాజకీయ వాతావరణం, నాయకత్వం, వనరులు, సంఖ్యాబలం, సభ్యుల మధ్య సమన్వయం వంటి వాటిపై ఆధారపడి ఉంటుందని గ్రహించాలి. అత్యంత స్థిరత్వానికి, అత్యంత మార్పులకు, మధ్యగా అవసరమైన సమతౌల్యం సమకూర్చటానికి ప్రభావవర్గాలు ఎంతగానో తోడ్పడుతాయి.

ప్రపంచ దేశాలతో ప్రభుత్వ కర్తవ్యాలు పెరగటం, ప్రభుత్వాధికారం ఒకే చోట కాకుండా వివిధ స్థాయిలలో నెలకొల్పి వలసిరావటం, దత్త శాసనాల ఆవశ్యకత పెరగటం, ప్రభుత్వం రూపొందించిన నియమనిబంధనలు అమలు పరచటంలో సాంకేతిక ప్రతిబంధకాలు ఏర్పడటం మొదలైన వన్నీ పరిపాలనా యంత్రాంగానికి ప్రభావ వర్గాలకి మధ్య సహకారం లేదా కలిసి పనిచేయవలసిన అవసరాన్ని పెంచాయి. అయితే ప్రభావవర్గాలన్నింటికి ఈ సహకారంలో భాగస్వామ్యం ఉంటుందని చెప్పలేం. ప్రభుత్వం సాంకేతిక విషయాలపై సలహాలను తరచుగా ఏ ప్రభావ వర్గాలపై ఆధారపడుతుందో ఆ వర్గాల ప్రాముఖ్యం, రాజకీయ వ్యవస్థలో పెరుగుతుంది. పాలనా కర్తవ్యాల సక్రమ నిర్వహణకు ఈ పరస్పర ఆధారం తప్పనిసరి అవుతుంది. చట్టరీత్యా ప్రభావవర్గాల సలహాలకు ప్రభుత్వానికి ప్రభావ వర్గాలకు మధ్య సహకారం ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ ఉంటుంది. ఒక్కొక్కసారి ప్రభుత్వం ప్రభావవర్గాలకు

చెందిన వారిని సభ్యులుగా నామినేటు చేస్తుంది. అటు వంటి సందర్భాలలో చట్టబద్ధమైన సంప్రదింపులకు అవకాశం ఏర్పడుతుంది. అలాకాకుండా కూడా ప్రభావవర్గాల సభ్యులతో ప్రభుత్వ యంత్రాంగం సంప్రదింపులు జరిపి సలహాలను స్వీకరించవచ్చు.

11.7.0 ప్రభావవర్గాల కార్యాచరణ పద్ధతులు

ప్రభావ వర్గాలు అనుసరించే కార్యాచరణ పద్ధతులు, వాటి సంఖ్యాబలం, ప్రాదేశిక ప్రభావం, సభ్యుల మధ్య సమన్వయం, ఆర్థిక బలం, నాయకత్వం, రాజకీయ పార్టీలతో సంబంధం, ఇతర వర్గాలతో సంబంధం మొదలగు విషయాలపై ఆధారపడి ఉంటాయి. ఏవర్గమైనా సాధ్యమైనంత తక్కువ కాలం, తక్కువ వ్యయంతో తన ప్రయోజనాలను ఎక్కువగా సాధించుకో ప్రయత్నిస్తుంది. ఆదిలో అనునయ (Persuation) చర్చల ద్వారా ప్రభావవర్గాలు ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేస్తాయి. బలం, వత్తిడి, వంటి పద్ధతులు చివరగా ఉపయోగిస్తాయి. ప్రభావవర్గాలు అనుసరించే పద్ధతులు సాధారణంగా లాబీయింగ్, సమ్మె, బంద్, ఘెరావోలు.

11.7.1 లాబీయింగ్

ఏ రాజకీయ వ్యవస్థలోనైనా ప్రభావ వర్గాలు సాధారణంగా అనుసరించే పద్ధతి లాబీయింగ్. "లాబీ" పదం అమెరికా రాజకీయాలనుండి గ్రహించటమైంది. అమెరికాలో కాంగ్రెసులో శాసననిర్మాణం జరిగే సమయంలో, కాంగ్రెసు సభ్యులను ప్రభావితం చేయడానికి వినియోగించే ప్రయత్నాలను లాబీయింగ్ అని వ్యవహరిస్తున్నారు. 19 శతాబ్దం మధ్యలో ఇంగ్లండ్ ఈ పదానికి బహుళ ప్రచారం లభించింది. సమకాలీన రాజకీయాలలో ఈ పదానికి విస్తృతమైన అర్థం ఉంది. సామాన్య ప్రజానీకం, ప్రభుత్వ సంస్థలు, ఉద్యోగి స్వామ్యం, రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధుల మద్దతుకోసం, ప్రభావవర్గాలు అనుసరించే పద్ధతులను లాబీయింగ్ అని నేడు వ్యవహరిస్తున్నారు. ఆధునిక కాలంలో ప్రభుత్వ నిర్ణయాలు, శాసనాలు ఎంతో కొంతమేరకు ప్రజల అన్ని రకాలైన కార్యక్రమాలపై ప్రభావం కలిగి ఉంటాయి. అధికార నియంతృత్వ ప్రభుత్వాలలోను, ఉదార ప్రజాస్వామ్య ప్రభుత్వాలలోను ఈ ప్రభావం ఉంటుంది. ఉదార ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలో ఈ పద్ధతి వినియోగం సుస్పష్టంగా కనిపిస్తుంది. ఇలాంటి వ్యవస్థలలో ప్రజలను ప్రభుత్వం సంప్రదించాల్సిన అవసరం ఉన్నదన్న విషయానికి గుర్తింపు ఉంది. అంతేగాక పౌరులవాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం, సంఘాలుగా ఏర్పడే స్వాతంత్ర్యం, రాజ్యాంగ పరమైన గుర్తింపును పొందాయి. అంతేకాక బాధా నివారణకు ప్రభుత్వానికి విజ్ఞప్తిని చేసుకొనే స్వాతంత్ర్యం ప్రజలకు ఉంటుంది. స్వయం పరిపాలన ప్రాతిపదికగా ఏర్పడిన రాజ్యాంగ వ్యవస్థలో లాబీయింగ్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంది. నియంతలు నిరంకుశులు కూడా ప్రజావసరాలను విస్మరిస్తే అధికారంలో ఎక్కువకాలం కొనసాగలేరు. హంగేరీ, చెకోస్లోవేకియా, బంగ్లాదేశ్, ఈజిప్టులలో నిరంకుశ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలు ఆకస్మికంగా ప్రజల ప్రభావ వర్గాలుగా రూపొంది లక్ష్యసాధనకు కృషిచేసిన సందర్భాలున్నాయి.

శాసన సభ సభ్యులను ప్రభావితం చేయడానికి ప్రభావవర్గాలు వినియోగించే పటిష్టమైన పద్ధతి లాబీయింగ్ అని తెలుసుకొన్నాం. దీని ప్రాముఖ్యాన్ని గుర్తిస్తూ అమెరికా సుప్రీంకోర్టు, కాంగ్రెసులోని

సభ్యులకు, కమిటీల సభ్యులకు ప్రత్యక్షంగా సంబంధిత ప్రజలు చేసికొన్న అభ్యర్థనగా లాబీయింగ్‌ను గుర్తించాలని తెలిపింది. శాసనసభల సభ్యులను ప్రభావితం చేయడానికి లాబీయింగ్‌లో భాగంగా ప్రభావ వర్గాలు వ్యక్తిగత సమావేశాలు జరుపుతాయి. ప్రతినిధుల ద్వారా నివేదికలను అభ్యర్థనలను పంపుతాయి. అంతేగాకుండా లేఖలు రాయటం, టెలిఫోను ద్వారా మాట్లాడటం, టెలిగ్రాములు పంపడాన్ని సాధనాలుగా ఉపయోగిస్తాయి. ప్రదర్శనలను కూడా నిర్వహిస్తాయి. సంఖ్యాపరంగానూ, ధనరూపంలోనూ, ఎన్నికల సమయంలో అభ్యర్థుల కందించిన మద్దతు, ముద్దతు ఉపసంహరణ బెద రింపులను కూడా లాబీయింగ్‌లో అంతర్భాగాలుగా పరిగణిస్తారు. ఒక నిర్దిష్ట వర్గంలో ప్రజలు తమ ప్రతి నిధులను ఎన్నుకొనేటప్పుడు, ప్రతినిధులనుండి తమ ప్రయోజనా పరిరక్షణను ప్రతిఫలంగా ఆశిస్తారు. ప్రజాప్రతి నిధులు తమ నియోజక వర్గాల ప్రయోజనాలను సమకూర్చవలసిన బాధ్యతను కలిగి ఉంటారు. అయితే వివిధ వర్గాల ప్రయోజనాలను తీర్చటంలో సంఘర్షణలు రావచ్చు. అట్టి పరిస్థితులలో ప్రజాప్రతినిధి కొన్ని వర్గాలను సంతృప్తిపరచలేక పోవచ్చు.

శాసన సభ సభ్యులకు మానవ, ఆర్థిక వనరులను సమకూర్చటం ద్వారా ప్రభావవర్గాలు వారిపై చెప్పకోదగిన పలుకుబడి, అదుపు, నియంత్రణను కలిగి ఉంటాయి. యూరోపియన్ పార్లమెంటులలో వ్యవస్థీకృతమైన ప్రభావవర్గాలు పార్టీలకంటే అధికమైన ఆధిక్యతను సంతరించుకొన్నాయి. శాసనవర్గపు నిర్ణయాలలో అవికీలకపాత్రను పోషిస్తున్నాయి. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాలలో ప్రభావవర్గాలకు, పార్టీల వ్యవస్థలకు మధ్యసంబంధం చాలా ఎక్కువగానే ఉంటున్నది. పార్టీ ఏర్పాటు దశలో ప్రభావవర్గాల మద్దతు చాలా అవసరం. పార్టీలు కొనసాగటానికి, ఓటర్లకు తమ విధానాలను, వైఖరిని లాభకరంగా నివేదించటానికి ప్రభావవర్గాల సహాయ సహకారాలు చాలా అవసరం. పార్టీలు స్థిరత్వం సంతరించుకొన్నాక కూడా రాజకీయ వ్యవస్థలో వాటి పరస్పరాధీనత కొనసాగుతునే ఉంటుంది. అమెరికాలో దాదాపు ప్రతి ప్రభావ సంఘానికి రాజకీయ చర్యా సంఘాలు విధాన, శాసన నిర్ణయాలలో తీసుకోవలసిన చర్యలను నిర్ణయిస్తాయి. అమలు పరచాల్సిన విధానాలను కూడా నిర్ణయిస్తాయి. అమెరికా సంయుక్తరాష్ట్రాల రాజధాని నగరంలో వ్యాపార సంబంధాలు వృత్తి సంఘాల కేంద్ర కార్యాలయాలు దాదాపు 3000 కు పైగా నెలకొని ఉన్నాయి. ఈ సంబంధాలు ఎన్నికలకు నిధులను సేకరించి తమ ప్రయోజనాలకు కృషిచేసే అభ్యర్థులకు విజయ సాధనలో సహాయం అందిస్తాయి. లాబీ యింగ్ ప్రభావం, పాత్ర అన్ని దేశాలలోను ఒకే విధంగా ఉందన్న విషయాన్ని మనం గ్రహించాలి.

పార్టీ క్రమశిక్షణ అంతగాలేని అధ్యక్ష తరహా ప్రభుత్వం ఉన్న సంపన్న అమెరికాదేశంలో ప్రభావవ ర్గాల వ్యవస్థకు చాలా ప్రాముఖ్యం ఉంటే, పార్టీ క్రమశిక్షణ అధికంగా ఉన్నకేబినెట్ పద్ధతిగల దేశాలలో లాబీయింగ్‌కు పెద్దగా ప్రాముఖ్యత లేదు. అలాంటి వ్యవస్థలు గల దేశాలలో ప్రభావవర్గాల ప్రాధాన్యత పరిమితంగా ఉంటుంది. ఇలాంటి ప్రజాస్వామిక దేశాలలో వీటికి గుర్తింపులేదు. బహుశపార్టీల వ్యవస్థ కలిగిఉండి, అధ్యక్ష, కాబినెట్ పద్ధతుల మిశ్రమవ్యవస్థ కలిగించటంలో లాబీయింగ్ ప్రభావం ఎక్కువే. వర్తమాన దేశాలలో ప్రజావసరాల పెరుగుదల, అవి తీర్చడానికి కావలసిన వనరుల కొరత, కొత్త ప్రభుత్వాల ఏర్పాటు, వాటికి పాలనా అనుభవం తక్కువగా ఉండటం, ఫ్యూడల్ వ్యవస్థల ప్రభావం, మొదలగు కారణాలవల్ల సమ్మెలు, బంద్‌లు, ఘెరావోలు వంటి పద్ధతులు అనుసరణ ఎక్కువగా ఉంటున్నది.

ప్రభుత్వ శాఖలలో కార్యనిర్వాహక శాఖకు వివిధ కారణాలవల్ల ఆధిక్యత ఏర్పడింది. అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందని దేశాలలోను ఈ పరిస్థితులు మనకు గోచరిస్తున్నవి. అందువల్ల లాబీలు జరిపేవారు తమ కోర్కెల సాధనకు వాస్తవ కార్యనిర్వాహక వర్గంపై దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. ప్రయోజనాలు ఒప్పందాలు జరుగుతుంటాయని రాజనీతి శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. లాబీలు జరిపేవారు అనధికారికంగా ఉద్యోగ నియమాకాల్లోనూ, శాసన, విధాన నిర్ణయాలలోనూ గణనీయమైన పాత్రను పోషిస్తున్నారు. ఇందుకు కార్యదక్షత, చతురత, యుక్తి, సునిశితత్వం చాలా అవసరం. ఈ లాబీవర్గాల ప్రభావం పాశ్చాత్య రాజ్యాలలో బాగా వ్యాప్తి చెందటంవల్ల వీటి దుష్పలితాలపై నియంత్రణ ఏర్పరచాల్సిన అవసరం ఏర్పడింది. ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలుగనంతవరకు లాబీయింగ్‌కు ప్రయోజనకరమైన గుర్తింపు లభించింది.

11.7.2 సమ్మె

తమ కోర్కెల సాధనకు ప్రభావ వర్గాలు చేపట్టే ఒక సర్వసాధారణ పద్ధతి సమ్మె. సమ్మె అనగా పనిని తాత్కాలికంగా నిలిపివేయటం. కోర్కెల సాధన తరువాత పని తిరిగి ప్రారంభం అవుతుందన్నది అంతరార్థ భావం. వ్యక్తిగతంగా కంటే సామూహికంగా జరిపే సమ్మె ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సమ్మెకారణంగా సమ్మె సాత్వీక నిరోధక పద్ధతి (passive resistane). ఉమ్మడి చర్య, పని నిలుపుదల లక్ష్యం సమ్మె అంతరార్థాలు. సమ్మె వివిధ రకాలుగా ఉంటుంది. తోటి పనివారలకు మద్దతుగా సాముభూతితో జరిపె సమ్మెను సానుభూతి సమ్మె అని అంటారు. Stay-in-strike, pen-down strike, tool down strike వంటి వాటి విషయంలో వ్యక్తులు విధి నిర్వహణ ప్రదేశంలోనే ఉంటారు. కాని విధులను నిర్వహించరు. ఈ రకమైన సమ్మెకూడా శాంతియుత, అహింసాయుతమైనదే. వీటికి భిన్నంగా ఉండే Sit-Down Srike లో విధి నిర్వహణ ప్రదేశాన్ని తమ అధీనంలో ఉంచుకొని ఇతరులు విధి నిర్వహణకు హాజరు కాకుండా సమ్మెజరిపే వారు ప్రయత్నిస్తారు. ఇలా సమ్మెచేసేవారు తాము పనిచేయరు. పనిచేద్దామనేవారిని చేయ నివ్వరు. ఒక విధంగా ఈ సమ్మెను దిగ్బంధం (Blockade) అనవచ్చు. ఇలాంటి సమ్మె ఒక దశలో హింసకు దారితీయవచ్చు. ఫలితంగా ఆస్తి ప్రాణనష్టం సంభవించవచ్చు. ఇలాంటి సమ్మెల సందర్భంలో బలప్రయోగం ద్వారా విధినిర్వహణ ప్రదేశాన్ని సాధారణంగా అదుపులోకి తీసుకొంటారు. సమ్మె స్వరూపాలన్నింటిలోను తీవ్రమైనది నిరాహారదీక్ష. ఆకలిబాధకు మృత్యువుకు దారితీసే నిరాహారదీక్ష చట్టరీత్యానేరం, శిక్షార్హంకూడా. అత్యంత శాంతి యుతంగా ప్రారంభమయ్యే నిరాహారదీక్ష ఒక దశలో తీవ్రమైన హింసకు దారితీయవచ్చు. కోర్కెల సాధనకు సమర్థవంతమైన సాధనాలలో ఒకటిగా ఇది పరిగణన పొందింది. ప్రధానంగా వామపక్షాలు సమ్మె పద్ధతికి ప్రాధాన్యం ఇస్తాయి. సమ్మెలవల్ల వర్గచైతన్యం, వర్గ సహకారం, వర్గ సమన్వయం సాధించవచ్చు.

11.7.3 బంద్

సాధారణ పరిభాషలో బంద్ అనగా మూసివేత. ఇది పాక్షికమైనది కావచ్చు. లేదా సంపూర్ణమైనది కావచ్చు. ప్రభుత్వాలను పడగొట్టటం, రాజకీయ నాయకులను అగౌరవపరచటం, ప్రభుత్వ చర్యలను సత్వరం ప్రజల దృష్టికి తేవటం వంటి లక్ష్యాలతో బంద్‌లు నిర్వహించటం సాధారణంగా జరుగుతుంది.

దీని ఫలితంగా మూకుమ్మడి హింస, పెద్ద ఎత్తున మొహరింపులు జరుగుతాయి. సిద్ధాంతపరంగా చూస్తే బంద్ కూడా సమ్మెవలె ఒక ప్రజాస్వామ్యసాధనం అయినప్పటికీ, పర్యవసానంగా ఏర్పడే అనర్థాల ప్రాతిపదికగా బంద్ నిర్వహణ అంతగా ఆమోద యోగ్యం కాదని కొందరు విశ్లేషణ కారుల భావన. బంద్ నిర్వహణలో అమాయకులను రాజకీయ ప్రయోజనాలకు, హింసాత్మక చర్యలకు బలిచేయవచ్చునన్న అభిప్రాయం కూడా ఉంది.

11.7.4 ఘెరావో

ఘెరావో అంటే చుట్టు ముట్టడం, లేదా నిర్బంధించటం, లేదా చక్రబంధం చేయటం. ఇది సాధారణంగా పనిచేసేవారు యజమానులపై వినియోగించే అస్త్రం. ఇలా చేయటం ద్వారా యజమాని తమ కోర్కెలను అంగీకరింప చేసేటట్లు వత్తిడి తెస్తారు. ఈ రకమైన పద్ధతిని ప్రభుత్వాధికారులు, మంత్రులు, ఫాక్టరీ యజమానులు, విద్యాసంస్థల అధిపతులు విషయంలో వినియోగించటం తరచుగా చూస్తున్నాం. కొన్ని సందర్భాలలో ఇటువంటి సంఘటనలపై న్యాయస్థానాలకు ఫిర్యాదులు చేయటం, న్యాయస్థానాలు విచారణ జరపటంకూడా గమనించదగిన విషయాలు.. నిందించటం కొట్టటం, అవహేళన చేయటం, వంటి దుర్ఘటనలు కూడా ఘెరావో సందర్భంలో జరగటాన్ని గమనించవచ్చు. బలవంతం, హింసామార్గాలుగా ఘెరావో నిర్వహించటం జరుగుతున్నది. ఆందోళిత రాజకీయాలలో (Agitational Politics) ఘెరావో వంటి పద్ధతులు తప్పవని, కోర్కెల సత్వర సాధనకు, ఇవి ఎంతో ప్రయోజనకరమైనవి ఈ పద్ధతిని సమర్థించేవారు వాదిస్తారు. నైతిక దృక్పథంతో చూస్తే ఇది అనుసరణీయంకాదని ఘెరావో వ్యతిరేకులు వాదిస్తారు. శాంతియుత, అహింసాత్మక ఘెరావో జరపటం సాధ్యం కాని విషయమని ఘెరావో వ్యతిరేకులు భావిస్తారు.

11.8 ప్రభావ వర్గాల సామర్థ్య కారకాలు

ప్రభావ వర్గాల సామర్థ్యం, వాటి లక్ష్యాలు, నాయకత్వం, వనరులు మొదలగు వాటిపై ఆధారపడి ఉంటుందని తెలుసుకొన్నాం. ఇప్పుడు వీటిని వివరణాత్మకంగా చర్చిద్దాం. ఏప్రభావ వర్గానికైనా లక్ష్యసిద్ధి ప్రధాన గమ్యం. అందువల్ల ప్రభావవర్గాలు దేశంలో నెలకొని ఉన్న రాజ్యాంగ స్వరూపానికి అనుగుణంగా తమ కార్య కలాపాలను రూపొందించుకొంటాయి. ఏకకేంద్ర ప్రభుత్వం గల దేశాలలో ప్రభావ వర్గాల కార్యక్రమాలు దేశ రాజధానిలోనే బాగా కేంద్రీకృతమై ఉంటాయి. సమాఖ్య వ్యవస్థలలో వీటిలో వికేంద్రీకరణ కనిపిస్తుంది. ప్రభుత్వ నిర్ణయ కేంద్రాలైన శాసన, కార్యనిర్వాహక వర్గాలపై ప్రభావవర్గాలు వత్తిడి తెస్తుంటాయి. ఉద్యోగి బృంద ప్రాధాన్యత ఎక్కువగా ఉన్న వ్యవస్థలలో ప్రభావవర్గాల వత్తిడి ఉద్యోగి బృందంపై కేంద్రీకృతమవుతుంది. కాలానుగుణంగాను, రాజకీయ వ్యవస్థ స్వరూపాన్ని బట్టి ప్రభావవర్గాలు తమ కార్యక్రమాలను తగిన విధంగా మలచుకొనటంపై వీటి సామర్థ్యం కొంతవరకు ఆధారపడి ఉంటుంది.

2. ప్రభావ ప్రసరణ మార్గంలో శాసనసభల సభ్యుల పాత్ర కూడా ఉంటుంది. తమ లక్ష్యాల సాధన కృషిలో సంప్రదింపులు జరిపే శక్తియుక్తులు ఉన్న శాసనసభ్యుల, మద్దతును ప్రభావ వర్గాలు పొందుతాయి. ఇలాంటి మద్దతు వాటి సామర్థ్యానికి దోహదం చేస్తుంది.

3. సంఖ్యాబలంలోనూ, ఇతర విషయాలలోనూ బలహీనమైన ప్రభావవర్గాలు ప్రభుత్వ శాఖలు, విధానాలపై పెద్దగా వత్తిడి తేలేవు. అట్టి ప్రభావవర్గాలు తమ కోర్కెలను పటిష్టంగా వ్యక్తీకరించటానికి, ఇతర వర్గాలనుండి సహకారం పొందాల్సి ఉంటుంది. వివిధ ప్రభావవర్గాల మధ్య సహకారం, సమిష్టి కృషి ప్రయోజనాత్మక విధానాలు రూపొందటానికి కృషిచేస్తాయి. ఈ పరిస్థితులు వర్గాల బలాన్ని పెంచి అవి చురుకుగా పనిచేసేటందుకు తోడ్పడుతాయి.

4. ప్రభావవర్గాలలోని సభ్యుల దృక్పథం వాటి సామర్థ్యంపై ప్రభావాన్ని కలిగి ఉంటుంది. ప్రతి ప్రభావవర్గానికి తన అస్తిత్వం విషయమై చట్టబద్ధమైన గుర్తింపు పొందాలనే కోర్కె ఉంటుంది. సభ్యుల దృక్పథం ఆధారంగా ప్రభావ వర్గాల కర్తవ్య నిర్వహణ విషయమై ప్రవర్తనా నియమావళి నిర్ణయిస్తారు. ఒక ప్రభావ వర్గం రాజకీయాలలో చురుకుగా పాల్గొనాలా లేదా? కాత్యాచరణలో శాంతియుత మార్గాలు అనుసరించాలా? విప్లవ ధోరణి కనబరచాలా? వంటి ప్రశ్నలకు సమాధానాలు సభ్యుల వైఖరినిబట్టి నిర్ణయమవుతాయి. విప్లవాత్మక చర్యలకు పూనుకున్నప్పుడు ప్రభావ వర్గాల గుర్తింపు రద్దు కావచ్చు.

5. రాజకీయ వ్యవస్థలోని పార్టీ వ్యవస్థ స్వరూపం కొంతవరకు ప్రభావవర్గాల సామర్థ్యాన్ని నిర్ణయిస్తుంది. ఏకపక్ష రాజకీయపార్టీ వ్యవస్థలో వీటి ప్రాబల్యం చాలా పరిమితంగా ఉంటుంది. అందువల్ల అధికారి పార్టీకి మద్దతు ఇచ్చే వర్గాలు మాత్రం ఇచటబాగా మనగలుగుతాయి. బహుళ పార్టీల వ్యవస్థలో ప్రభావవర్గాల పాత్ర తగినంతగా ఉంటుంది. ఈ వ్యవస్థలలో కొన్ని పార్టీలు మినహా మిగిలిన పార్టీలు రాజకీయ వర్గాలుగా పని చేస్తాయి. బహుళ పార్టీల వ్యవస్థలో ప్రభావవర్గాలు చిన్నపాటి పార్టీగా వ్యవహరించే స్వతంత్రం కలిగి ఉంటాయి.

7. ప్రభావ వర్గాల పటిష్టతను నిర్ణయించే ముఖ్య కారకాలలో ఆర్థిక వనరులను పేర్కొనవచ్చు. ఆర్థిక శక్తి ఉన్న కొలది సమర్థులైన వారిని ఉద్యోగులుగా నియమించుకోవడానికి, నిష్ణాతులను లాబీయింగ్ చేయటానికి, పార్టీ విరాళాలు ఇవ్వటానికి వీలవుతుంది. అర్థబలం ప్రభావవర్గం హోదాను కూడా పెంచుతుంది. తమలక్ష్యాల కనువుగా ప్రజాభిప్రాయం తిప్పకోవడానికి అవకాశం కలుగుతుంది.

8. ప్రభావ వర్గాల ప్రాబల్యం వాని నాయకులశక్తియుక్తులపై ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి.

11.9.0 ప్రభావవర్గాలు : రాజకీయాలు

రాజకీయ వ్యవస్థలో ప్రభావవర్గాలకు సముచిత స్థానం ఉందని తెలుసుకొన్నాం. ఇప్పుడు అవి ఏవిధంగా లక్ష్యాలు సాధిస్తాయో తెలుసుకోవడానికి కొన్ని ఉదాహరణలు పరిశీలిద్దాం.

11.9.1 బ్రిటన్

పశ్చిమ ప్రజాస్వామ్యాలలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ప్రభావవర్గాలుగల దేశం బ్రిటన్. ఈ దేశంలో లిఖిత రాజ్యాంగంలేదు. అయినప్పటికీ కొన్ని నిర్దిష్ట పద్ధతులు ఉన్నాయి. వీటి ప్రకారం విధాన నిర్ణయ

ప్రక్రియలో ప్రభావవర్గాలకు కీలకమైన స్థానం ఉంది. సంబంధిత వర్గాలను సంప్రదించిన తరువాత మాత్రమే ప్రభుత్వ విధానాలు రూపొందించటమన్న పద్ధతి అమలులో ఉంది. ఈ కారణంచేతనే ప్రతి ప్రభుత్వ శాఖకు సంప్రదింపులు జరపాల్సిన వారి జాబితా ఉంటుంది. ఈ జాబితాలో విధానం అమలు పరచటంలో తోడ్పడగలవన్న ప్రభావవర్గాల పేర్లు ఉంటాయి. సంప్రదింపులు జరపటం అవసరం అన్న భావనను, సంప్రదించబడటం తమ హక్కు అన్న ప్రభావవర్గాల అభిప్రాయాలకు బ్రిటన్‌లో గుర్తింపు ఉంది. యూరోపియన్ కమ్యూనిటీలో బ్రిటన్‌కు గల సభ్యత్వం కూడా ప్రయోజనవర్గాల ప్రాధాన్యతను ఇనుమడింప జేసింది.

బ్రిటన్‌లోని ప్రభావవర్గాలను గురించి తెలుసుకోబోయే ముందు కొన్ని విషయాలను గ్రహించటం అవసరం. బ్రిటన్‌లో ఏక కేంద్ర ప్రభుత్వ వ్యవస్థ ఉంది. స్థానిక ప్రభుత్వాల పరిస్థితి కేంద్ర ప్రభుత్వ పరిస్థితితో పోల్చినప్పుడు బలహీనమైనదనే చెప్పాలి. అధికారం అంతాకేంద్ర ప్రభుత్వం వద్దనే ఉంది. అంతేగాకుండా బ్రిటన్‌లో పాలక వర్గానికి, శాసన నిర్మాణ శాఖకు మధ్య అధికారాల విషయంలో వేర్పాటుకు బదులు కలయిక ఉంది. రాజకీయ పార్టీకి ఎక్కువ సంఖ్యలో మెజారిటీ లభించటానికి అవకాశం కలిగించేదిగా ఉంది. ప్రభుత్వం ప్రతిపాదించిన తీర్మానాలుగాని, శాసన ప్రతిపాదనలుగాని వీగిపోవటం చాలా అరుదైన విషయం. ఇక కార్య నిర్వాహక వర్గంపై మంత్రులు ఆధారపడటం కూడా ఎక్కువగా ఉంది. కార్యనిర్వాహక వర్గంగా వ్యవహరించే సివిల్ సర్వీసు ఉద్యోగులు సలహాలకు, సమాచారానికి ప్రభావవర్గాలపై ఆధారపడుతుంటాయి. బ్రిటన్‌లో సాధారణ ప్రసార సాధనాల విషయంలో కూడా కేంద్రీకరణం ఎక్కువగా ఉంది. జాతీయ వార్తా పత్రికలు కేంద్రీకరణ ధోరణిని బలపరచే విధంగా కృషిచేస్తాయి. ఈ కారణాలవలన బ్రిటన్‌లో ప్రభావవర్గాలు పాలక వర్గాన్ని ప్రభావితం చేయటానికి కృషి చేస్తాయి. ఈ వర్గాలు లాబీ ప్రయత్నాలలో ప్రభుత్వశాఖలు, పార్లమెంట్, ప్రజాభిప్రాయాలను ప్రభావితం చేయటానికి పూనుకుంటాయి.

బ్రిటన్‌లో వ్యాపార వర్గాల సంఘాలు ప్రభావవర్గాలుగా పనిచేయటంలో సుదీర్ఘ చరిత్రను కలిగి ఉన్నాయి. పారిశ్రామిక వేత్తలు, భూస్వాముల వంటి వారిమధ్య ఏర్పడిన సమైక్యత పర్యవసానమే బ్రిటన్‌లోని కన్సర్వేటివ్ పార్టీ అని చెబుతుంటారు. లేబరు పార్టీలో 90 శాతం సభ్యులు ట్రేడ్ యూనియన్లకు చెందిన వారున్నారు. సాధారణంగా ఈ వర్గాలు పార్టీల వివాదగ్రస్త విషయాలతో సంబంధం పెట్టుకోకుండా వ్యవహరిస్తాయి. ఉద్యోగస్థుల సంఘాలు బ్రిటన్‌లో బలమైన ప్రభావవర్గాలుగా పనిచేస్తున్నాయి. ఉదాహరణకు Engineering Employee's Federation అనే సంఘం ప్రభుత్వంలోపల, బయట ఒక శతాబ్దం నుండి ట్రేడ్ యూనియన్లకు సంబంధించిన శాసనాలు, పని సంబంధమైనవి నియమనిబంధనలు, ఆర్థిక విధాన సమస్యలు పైదృష్టికేంద్రీకరించి సముచిత సేవలు అందించింది. Retail Consortium, British Roads Federation, Confederation of British Industry వంటి సంఘాలు కూడా బ్రిటన్‌లో ఉన్నాయి. వ్యాపార సంబంధమైన సంఘాలలో Confederation of British Industry చెప్పుకోదగింది. వివిధ ప్రభుత్వ శాఖలలో ఈ సంఘాలు ఎప్పటికప్పుడు సంబంధాలు పెట్టుకొని, సముచిత ప్రయోజనాలను పొందుతున్నాయి. Retail Consortium పేరుకు తగ్గట్టుగానే రిటైల్ వ్యాపార సంబంధ విషయాలపై దృష్టిని కేంద్రీకరిస్తున్నది. ఈ దేశంలో మరొక ముఖ్య ప్రభావవర్గమైన Trade Union Congress కొన్ని సందర్భాలలో ప్రభుత్వంతో ప్రత్యక్షంగా వ్యవ

హరిస్తున్నది. సంఘటిత కార్మికుల ప్రతినిధిగా ఈ యూనియన్ పని చేస్తున్నది. బ్రిటన్‌లో జాతీయ స్థాయిలో 1962 లో ఏర్పడిన National Economic Development Council లో దీనికి ప్రాతినిధ్యం ఉంది. అంతేగాక ప్రభుతవ సంస్థలైన Health and Safety Executiue లోను, Advisory Conciliation and Arbitration Service లోను, Trade Union Congress తన ప్రతినిధులను నియమిస్తుంది. ఇక ఉద్యోగుల సంఘాల విషయానికివస్తే National Health Service British Medical Association వంటివి చెప్పకోదగినవి. నిపుణుల అభిప్రాయాల వ్యక్తీకరణంలోను తద్వారా విధాన నిర్ణయాలలోను ఇవి గణనీయమైన పాత్రను నిర్వహిస్తున్నాయి.

11.9.2 అమెరికా సంయుక్త రాష్ట్రాలు

అమెరికా సంయుక్తరాష్ట్రాలలోని ప్రభావవర్గాలను కీలక అధికార కేంద్రాలు (Crucial Power Centres) గా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల రాజకీయాలలో ప్రభావవర్గాలు చాలా కీలకమైన పాత్రను నిర్వహిస్తాయి. ఈ రంగంలో ప్రధానంగా వ్యాపార సంఘాల పాత్ర అధికం. ఆర్థిక పరంగాను, సేవలు అందించటం ద్వారాను కూడా ఈ సంఘాలు ఎన్నికలను ప్రభావితం చేస్తాయి. సాంకేతిక వస్తువులను సరఫరాచేయటం, ప్రచారం నిర్వహించటం, కూడా ఈ సంఘాలు చేస్తాయి. ఉదాహరణకు American Federation of labour - congress of,Industrial Organisations ఒక బలవత్తరమైన వర్గంగా పనిచేస్తున్నది. ఈ శతాబ్దపు ఐదవ దశాబ్దంలో ఈ సంఘం Committee on Political Feducation ను స్థాపించింది. ఇది ప్రచారానికి అవసరమైన నిధులను సమకూర్చటమేగాకుండా తగిన పోటీదారులకు నిధులను పంచటం లాంటి కర్తవ్యాలను నిర్వహిస్తున్నది. 1974 లో అమెరికా కాంగ్రెస్ రూపొందించిన Campaign Finance Act ప్రకారం ప్రభావవర్గాలు రాజకీయ చర్యాసంఘాలను నెలకొల్పుకోవడానికి అవకాశాన్ని కలిగించింది. ఈ సంఘాలు కార్యాచరణ సంబంధమైన నిర్ణయాలు తీసుకొంటాయి. ఎన్నికలలో నిలబడే అభ్యర్థులకు, వారు సమకూర్చ గలిగిన ప్రయోజనాల ఆధారంగాను, ఇతర ప్రాతిపదికల మీదను నిధులు సమకూరుస్తాయి.

అమెరికా మాజీ అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ జాతికి తానిచ్చిన వీడ్కోలు సందేశంలో అమెరిగా రాజకీయ జీవితంలో ప్రత్యేక ప్రయోజనవర్గాలను (Special Interest Groups) విఘ్నకారకులుగా పేర్కొనడాన్ని బట్టి ప్రయోజనవర్గాలు ఎంత పతాకస్థాయికి చేరుకొన్నాయో గ్రహించవచ్చు. ఈ వర్గాలపై యుద్ధాన్ని ప్రకటించాలని 1984 లో అమెరికా అధ్యక్ష పదవికి పోటీచేసిన మాండలి తన ప్రచారంలో వ్యక్తం చేశారు. అంతేగాక తాను ఈ వర్గాల నుండి విరాళాలు స్వీకరించనన్నారు. అమెరికాలో ఒక్క నూనె పరిశ్రమలోనే 94 రాజకీయ చర్యా సంఘాలున్నాయి. ప్రత్యేక ప్రయోజనవర్గాల ప్రాబల్యం పరిమితంచేసే ప్రయత్నాలలో భాగంగా 1970 లలో అమెరికాలో ప్రజాప్రయోజనవర్గాలు (Public interest groups) పెరగనారంభించాయి. పెద్ద కార్పొరేషన్ల చర్యలను క్రమబద్ధం చేయాలనే ఉద్దేశ్యంతో Public Citizen Common Cause అవతరించాయి. ఎన్నికల ప్రచార వ్యయానికి సంబంధించి బహిరంగ ప్రభుత్వానికి (Open Government) సంబంధించి శాసన నిర్మాణం రూపొందటంతో ఈ రెండు వర్గాలు గణనీయమైన పాత్ర వహించాయి. ప్రత్యేక ప్రయోజన వర్గాల ప్రాబల్యం తగ్గించి, ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కృషి వృద్ధి చెందేటట్లు చూచి, మధ్యస్థంగా ఒక పౌర సమతౌల్యం

(Civil Balance) తేవటం గమ్యంగా ఈ రెండు వర్గాలు పనిచేశాయి. వీటి కృషి ఫలితంగా రాజకీయ సంస్థల విషయమై సంస్కరణలు తేవాలన్న ఆసక్తి ప్రభావం ఎంతో కాలం నిలువలేదు.

ఆధునిక కాలంలో ప్రభుత్వం నిర్వహించాల్సిన కర్తవ్యాలు వృద్ధి చెందటంతో పాలక వర్గ బాధ్యతలు కూడా పెరిగాయి. శాసనాల స్థూల స్వరూపాన్ని నిర్ణయించి, వివరాలను నిర్ణయించే బాధ్యత కార్యనిర్వాహక వర్గానికి అప్పగించాల్సిన అగత్యం అమెరికా కాంగ్రెసుకు ఏర్పడింది. ఈ పరిస్థితులలో ఉద్యోగి బృందాన్ని ప్రభావితం చేయాల్సిన అవసరం ప్రభావవర్గాలకు తప్పనిసరి అయింది. సాంకేతిక పరమైన సమాచారాన్ని పాలకబృందం ప్రభావవర్గాలనుండి సేకరిస్తుంది. ప్రభుత్వ విధానాలు అమలు పరచటంలో పాలకబృందం ప్రభావ వర్గాల సహాయం, మార్గదర్శకత్వాన్ని కోరుతున్నది.

ప్రయోజన వర్గాలు, న్యాయస్థానాల మధ్య సంబంధాల విషయంలో ప్రభావవర్గాలు సంబంధిత వ్యక్తుల చేత, సంఘాలచేత న్యాయస్థానాలలో కేసులు దాఖలు చేయిస్తాయి. ఉదాహరణకు ఏదైనా సంస్థ అందులో పనిచేసే వారి ఆరోగ్య సంరక్షణకు, ఉద్యోగ భద్రతకు ఏర్పాట్లు చేయకపోతే అలాంటి ఏర్పాట్లు చేయమని ఆదేశించాల్సిందిగా కోరుతాయి. న్యాయస్థానాలనుండి రక్షణకోరడంలో సంబంధింత వర్గాలకు వ్యక్తులకు ఆర్థిక సహాయం చేయటం, అవసరాన్ని బట్టి అపీలు చేయడానికి సహకరించటం వంటి కర్తవ్యాలను కూడా నిర్వహిస్తాయి. చట్టబద్ధమైన చర్చను కోరుతూ ప్రభావ వర్గాలు అనేక ప్రయోజనాలు పొందిన సందర్భాలున్నాయి. ఉదాహరణకు National Association of the Advancement of Coloured people న్యాయస్థానాల ద్వారా ప్రభుత్వ విధాన నిర్ణయాలపై తగిన ప్రభావాన్ని కనపరచింది.

ప్రభావ వర్గాలలో సభ్యత్వం లేని వ్యక్తులు కొందరు ఈ వర్గాల ప్రయోజనాల కొరకు కృషి చేయడం అమెరికా రాజకీయాలలో గమించదగిన ముఖ్యమైన విషయం. ఆదేశ రాజధాని వాషింగ్టన్ లో Arnold And Porter వంటి న్యాయవాదుల సంస్థలు, ఒప్పందం ద్వారా లాబీయింగ్ జరిపే ఇతర సంస్థలను మనం ఇచ్చటపేర్కొనవచ్చు. ఈ శతాబ్దపు ఏడవదశాబ్దిలో న్యాయవాదుల సంఖ్య బాగా పెరగటానికి కారణం వివాదాలు కావని, ప్రత్యేక ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆయా సంస్థలు న్యాయవాదులను నియమించుకోవటమేనని కొందరు పరిశీలకుల అభిప్రాయం. అమెరికాలో National Association of Manufacturers, Chamber of Commerce Business Roundtable, American farm Bureau Feduration, National Farmers Union, American Agricultural Movement మొదలగునవి పేరుపొందిన ప్రభావవర్గాలు. అసంఖ్యాకత్వం, పోటీ, భిన్నత్వం అమెరికాలోని ప్రయోజన వర్గాల ప్రధాన లక్షణాలు. ఇతర దేశాలలోని ప్రయోజన వర్గాల కంటే అమెరికాలోని ప్రయోజన వర్గాల పాత్ర రాజకీయాలను ప్రభావితం చేయడంలోనే ఎక్కువ అని చెప్పాలి. వీటి ధాటికి తట్టుకొనేందుకు అమెరికా దేశపు కాంగ్రెసు క్రమేణా సంస్కరణలను రూపొందిస్తూ వచ్చింది. ఎన్నో ప్రయోజనాల వర్గాలు ప్రతిఘటించినప్పటికీ 1981లో బడ్జెట్ కోతను విధించింది. 1986 లో సంస్కరణలను రూపొందించింది. అయితే వీటి ప్రభావం తొలగిపోయిందని అనుకోవటం సరియైన అభిప్రాయంకాదు. అమెరికా రాజకీయాలలో చెప్పుకోదగిన ఒక పరిణామం స్త్రీల శక్తి పెరిగి బలమైన ప్రభావవర్గంగా ఏర్పడటం. National Organisation for Women, League of women voters ఇందుకు ఉదాహరణలు.

11.9.3 ఫ్రాన్స్

ఫ్రాన్స్‌లో చాల మంది ప్రభుత్వోద్యోగులు తమను తాము ప్రజాప్రయోజనాల పరిరక్షకులుగా భావించుకొంటారు. ఆదేశంలో వివిధ లేబర్ కాన్‌ఫెడరేషన్లు ఉన్నాయి. వ్యవసాయిక, విద్యార్థుల, మాజీ సైనికోద్యోగుల, పన్నులు చెల్లించేవారి సంఘాలున్నాయి. ఇవిగాక 1970 లలో భాషాపరమైన జాతిపరమైన మైనారిటీవర్గాలు ఉదాహరణకు Corsicans, Bretons, Basques స్వయం ప్రతి పత్తికి ప్రయత్నించాయి. కాని ఫ్రాన్స్‌లో ఇలాంటి సంఘాలలో సభ్యత్వానికి ప్రజలు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. 1977 నాటికి ఫ్రెంచి పౌరులలో నగం మంది ఏదో ఒక బచ్చిక సంస్థలో సభ్యత్వం కలిగి ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే తరువాతికాలంలో ట్రేడ్‌యూనియన్లలో సభ్యత్వం తగ్గనారంభించింది. కాని విద్య, ఆరోగ్య రక్షణ, చిన్న తరహా వ్యాపారం వంటి విషయాలకు చెందిన సంఘాలు మాత్రం ఇతరదేశాలలోని ఇటువంటి సంఘాల కంటే బాగా వ్యవస్థీకృతమయ్యాయి. ఇందువల్ల ఇతర యూరోపియన్ దేశాల పౌరుల కంటే ఫ్రెంచి పౌరులు తక్కువ వ్యవస్థీకృతమై ఉన్నారన్న అభిప్రాయం సరికాదు. అధికారికమైన గుర్తింపుకు, ఆర్థిక సహాయానికి ఫ్రాన్స్‌లోని ప్రయోజన వర్గాలు ప్రభుత్వంపై ఆధారపడి ఉంటాయి. అనేక వర్గాల ప్రారంభ బడ్జెట్‌లో చాలా భాగం ప్రభుత్వ సబ్సిడీలవల్ల వచ్చిందే. ఇటువంటి సౌకర్యం అమెరికా, బ్రిటన్ దేశాలలో చాలా తక్కువ.

ఫ్రాన్స్‌లో ప్రభుత్వం ఎంతో కొంతమేరకు వివిధ సంఘాలపై నియంత్రణ కలిగి ఉంటుంది. వీటి కార్యకలాపాలను పర్యవేక్షించటంతోబాటు ప్రయోజనాలకు మద్దతు కూడా ఇస్తుంది. ప్రభుత్వం, సంఘాల మధ్య ఇచ్చిపుచ్చుకోనే వైఖరి కన్పిస్తుంది. అయితే ఈ సంఘాలలోగల చీలికలు, యూరోపియన్ కమ్యూనిటీ విధానం వంటివి ప్రతిబంధకాలుగా నిలిచాయి.

11.9.4 కెనడా

కెనడాలో ఫెడరల్ స్థాయిలోను, రాష్ట్రాలస్థాయిలోను గూడా పనిచేసే ప్రభావవర్గాలు ఉన్నాయి. ఈ దేశంలోని శాసనసభకు అమెరికా సంయుక్త రాష్ట్రాల శాసనసభకు ఉన్నంతటి ప్రాముఖ్యం లేదు. అందువల్ల కెనడాలో ప్రభావవర్గాలు కార్యనిర్వాహక వర్గంపై ఒత్తిడి తేవలసిన అవసరం చాలా ఎక్కువ. విధాన నిర్ణయ ప్రక్రియను ప్రభావితం చేయడం పై ప్రభావ వర్గాల వ్యవస్థీకరణ ప్రభావం ఉంటున్నది. ఒక ప్రత్యేక సమస్య పరిష్కారానికి ఏర్పడిన ప్రభావవర్గంలో సభ్యులసంఖ్య పరిమితంగా ఉంటుంది. ఇటువంటి వర్గాలకు ఉద్యోగి స్వామ్య సహాయం, వనరులు చాలా తక్కువగా ఉంటాయి. ఇవిగాక పరిపాలనా సంబంధమైన విషయాలు రహస్యంగా ఉంచటం మరొక ప్రతిబంధకమైంది. ఇటీవలికాలం వరకు ప్రభుత్వ వ్యవహారాలను గోప్యంగా ఉంచటంవల్ల ప్రభుత్వశాఖల ఆధిక్యత కొనసాగింది. కెనడాలో ప్రభావవర్గాల ప్రతినిధులు శాసనసభ సభ్యులనేగాక, కాబినెట్ మంత్రులను, సివిల్ సర్వీసు ఉద్యోగులను అనునయించటానికే ఎక్కువగా ప్రయత్నిస్తుంటారు.

11.10 ముగింపు

ప్రభావ వర్గాల ఉనికి రాజకీయ వ్యవస్థలలో తప్పనిసరియన్న విషయాన్ని గ్రహించాం. వీటివల్ల ఒక్కొక్క మారు చెడు ఫలితాలుకూడా సంభవించవచ్చు. ప్రభావవర్గాలు స్వార్థపరత్వంతో వ్యవహ

రిస్తాయని, తమ ప్రయోజనాల సాధనకు చేసే కృషిలో దేశ సమిష్టి ప్రయోజనాలకు అంతరాయం కలిగిస్తాయన్న విమర్శ ఒకటి ఉంది. ప్రభావ వర్గాలు అనుసరించే పద్ధతులు ఒక్కొక్క సారి అవినీతికరమైనవి, అనంగీకారయోగ్యమైనవిగా ఉంటాయి. లక్ష్యసాధన కృషిలో వీటి నాయకులు ప్రభుత్వాధికారులతో అయుక్తమైన ఉద్రేకభరితమైన వాదనలకు తలపడతారు. అంతేగాకుండా లంచాలివ్వటం, ఇతర అవినీతి కరమైన చర్యలకు పాల్పడతారు. ప్రభావవర్గాలు కొన్ని సందర్భాలలో అవాస్తవికమైన ప్రచారానికి పూనుకొంటాయి. తాము ప్రజలందరి కొరకు ప్రతినిధులుగా వ్యవహరిస్తామని, తమ కృషి నూటికి నూరుశాతం ప్రజల సామాన్య ప్రయోజనాలకేనని తెలుపుతూ అవాస్తవికతను వాస్తవికతగా నమ్మించ ప్రయత్నిస్తాయి.

– డా. పి. మాణిక్యాంబ

11.11 చదువదగిన పుస్తకాలు

1. Richardson J and Jordan A.G. : Governing under pressure Oxford, Martin Robertson, 1979.
2. Truman, : The Governmental Process, New York, Knopf, 1971
3. Vernon Bogdanor, Ed : The Blackwell Encyclopaedia of Political Institutions, Basil Blackwell Inc, New York, 1987
4. Alan R Ball & Finances Millard, : Pressure Politics in Industrial Societies, A Comparative Introduction, Macmillan, London, 1986
5. Somarajan C N, : Pressure Groups and Democratic Politics, Deep and Deep Publications, New Delhi, 1988
6. Andrew S Mc Fairland, : Common Cause Lobbying in the Public Interest, Asia Books, New Delhi, 1984
7. Miller Stephen, : Special Interest Groups in American Politics, Hindustan Publishing Corporation (India) Delhi, 1985
8. David F Roth and Frank L Wibon : The Comparative study of Politics, prentice Hall Inc, Engle Wood Cliffs, New Jerry, 1980
9. David L Sills Ed : International Encyclopaedia of the Social Sciences, The Macmillan Company and the Free Press, New York, 1968, Vol 7.
10. Jermy J Richardson, : Pressure Groups, Oxford University Press, Oxford, 1993.

11.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. ప్రభావ వర్గాలనగా ఏమిటి? వివిధ నిర్వచనాలను విశ్లేషించుము?
2. ప్రభావవర్గాల లక్షణాలను, కర్తవ్యాలను వేర్కొనుము?

1. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సులలో ప్రభావ వర్గాలు స్థాయిని పరిశీలింపుము.

II. కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా సమాధానాలు రాయండి.

1. లాబీయింగ్
2. ఘెరావో
3. రాస్తారోకో
4. సాధారణ సమ్మె

*****

భాగం-12 : రాజకీయ భాగస్వామ్యం

విషయక్రమం

12.1 లక్ష్యాలు

12.2 పరిచయం

12.3 నిర్వచనం

12.4 రాజకీయ భాగస్వామ్య స్థాయిలు

12.5.0 భాగస్వామ్యాన్ని ప్రభావితం చేసే కారకాలు

12.5.1 రాజకీయ సామాజికీకరణం

12.5.2 సమీప వాతావరణం

12.5.3 విస్తృత వాతావరణం

12.6 రాజకీయ భాగస్వామ్యం : స్త్రీలు

12.7 రాజకీయాలలో భాగస్వామ్యం : సామాజిక మార్పు

12.8.0 రాజకీయాలలో భాగస్వామ్యం : రాజకీయ అభివృద్ధి

12.8.1 ఫ్రాన్సులో రాజకీయ భాగస్వామ్యం

12.8.2 అమెరికాలో రాజకీయ భాగస్వామ్యం

12.9 భవిష్యత్తులో రాజకీయ భాగస్వామ్యం : వర్థమాన దేశాలు

12.10 రాజకీయ భాగస్వామ్యం నిర్ణాయకాలు

12.11 చదువదగిన పుస్తకాలు

12.12 నమూనా పరీక్ష ప్రశ్నలు

11.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- రాజకీయ భాగస్వామ్యం అంటే ఏమిటి

- వాటి వివిధ నిర్వచనాలు
- ప్రభావితం చేసే కారకాలు, నిర్ణాయకాలను

బాగా వివరించగలుగుతారు

12.2 పరిచయం

రాజనీతి శాస్త్రంలో ముఖ్యంగా తులనాత్మక అధ్యయనంలో - 'రాజకీయాలలో పౌరుల భాగ స్వామ్యం' అనే అంశం గురించిన అధ్యయనం అత్యంత ప్రధానమైన అంశాలలో ఒకటి. మానవాళి నాగరక పౌరులుగా వ్యవహరించడం మొదలుపెట్టినప్పటి నుంచి రాజకీయాలలో పౌరులు పాల్గొనడం ఏదో ఒక రూపంలో జరుగుతునే ఉంది. అర్థవంతమైన రాజకీయవ్యవస్థ రూపొందడానికి, కొనసాగడానికి రాజకీయాలలో పౌరులు పాల్గొనడం తప్పనిసరి అవుతుంది. రాజకీయ ఆధునికీకరణ, రాజకీయ అభివృద్ధి, సామాజిక మార్పు మొదలైన విషయాలను వాస్తవంగా తెలుసుకోవడం చాలా అవసరం. ఎందుకంటే ఇవన్నీ పరస్పరాధీనాలు.

వ్యక్తి స్వేచ్ఛకు అత్యంత విలువ ఇచ్చిన రాజనీతి శాస్త్రజ్ఞులలో ఒకరైన బార్కర్ (Barker) ప్రభుత్వం వయోజన ఓటింగ్ ప్రాతిపదికగా ఎన్నుకోబడాలని, ప్రభుత్వ వ్యవహారాలను గురించిన చర్చలలో పాల్గొనే అవకాశం పౌరులకు తప్పనిసరిగా ఉండాలని, ప్రభుత్వాన్ని నియంత్రించే అధికారం పౌరులకుండాలని అంటాడు. ప్రభుత్వం ప్రజలనుంచి ఉద్భవిస్తుంది కనక ఇటువంటి రాజకీయ నిర్ణయ కల్పనలో (Political Decision making) పౌరులకు భాగస్వామ్యం ఉండాలని నమ్మిన రూసో (Rousseau) రాజకీయ వ్యవస్థలో పౌరులు పాల్గొనడం వల్ల రాజకీయ సమానత్వం సమకూరడమేకాకుండా బాధ్యతా యుతంగా వ్యవహరించే అవకాశం కలుగుతుందని వారిలో స్వేచ్ఛాభావం అధికమవుతుందని భావించాడు. J.S. Mill కూడా రాజకీయ నిర్ణయాలలో పౌరులకు భాగస్వామ్యం ఉండాలని భావించాడు. లాస్కీ మానవ హక్కులకు ఎంతో ప్రాధాన్యమిస్తూ రాజకీయాలలో పౌరులు పాల్గొనడానికి విద్య ఆవశ్యకతను వివరించాడు. పౌరులు చురుకుగా పాల్గొనడానికి అవకాశమిచ్చే ప్రజాస్వామ్యంలో రాజకీయ హక్కులు పౌరులకు ఎక్కువగా లభ్యమవుతాయని వాటికి గుర్తింపు ఉంటుందని లాస్కీ (Laski) భావం.

రాజకీయాలలో పౌరుల భాగస్వామ్యం గురించి ప్రత్యేక అధ్యయనాలు 20 వ శతాబ్దంలో ప్రారం భమయ్యాయి. మొదట్లో ఈ అధ్యయనాలు ఎన్నికలలో పౌరుల ప్రవర్తన (Electral behaviour) కు పరిమితమయ్యాయి. ఇటువంటి అధ్యయనాన్ని (Psephology) అంటారు. అయితే రెండో ప్రపంచ యుద్ధం తరవాతి కాలంలో - ముఖ్యంగా ఆరో దశాబ్దం మొదలుకొని రాజకీయ సామాజిక శాస్త్రం Political Sociology ప్రాముఖ్యం పెరగడంతో రాజకీయాలలో పాల్గొనడం గురించిన అధ్యయనాలలో సాంప్రదాయక, సంప్రదాయేతర (Conventional and Unconventional) విషయాలు కూడా చోటుచే సుకొన్నాయి. అంటే ఎన్నికలలో ఓటు చేయడం, ప్రచారంలో పాల్గొనడం, ఎన్నికలలో పోటీ చేయడం వంటి సాంప్రదాయక విషయాలేకాకుండా ఉద్యమాలు, ప్రదర్శనలు, ధిక్కార చర్యలు మొదలైన సంప్ర దాయేతర విషయాల పఠనానికి కూడా ప్రాధాన్యత లభించింది. అంటే రాజకీయాలలో పాల్గొనడం విస్తృతమైన రాజకీయ కార్యకలాపాలతో కూడినదన్నమాట. రాజనీతిశాస్త్రమంటే రాజకీయాలలో పాల్గొనడం గురించి క్రమాను గుణంగా జరిపే అధ్యయనమేనని కొందరి అభిప్రాయం.

12.3 నిర్వచనం

రాజకీయాలలో పౌరులు పాల్గొనడం ప్రతి రాజకీయ వ్యవస్థలోనూ ఉంటుంది. రాజకీయ వ్యవస్థ పెద్దదైనా చిన్నదయినా, అక్కడి ప్రభుత్వ రూపం ఏదయినా (ప్రజాస్వామ్యం, నియంతృత్వం, కులీనపాలన, దుష్టపాలన, ఏకకేంద్ర, సమాఖ్య) ఏదో విధంగా, ఎంతోకొంత మేరకు పౌరుల పాత్ర ఉంటుంది. సిద్ధాంత పరంగా చెప్పాలంటే ఎటువంటి విచక్షణలేకుండా రాజకీయ విధానాన్ని ప్రభావితంచేసే హక్కు పౌరులందరికీ ఉంటుంది. అయితే వాస్తవానికి అందరూ ఇలా చేయలేరు. 1975 లో Annual Review of Sociology లో ప్రచురించిన (Political Participation and Public Policy) అనే పరిశోధక వ్యాసంలో Alford Fried Land రాజకీయాలలో పౌరులు పాల్గొనడం గురించి చక్కని అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఎటువంటి అధికారం లేకుండా రాజకీయాలలో పాల్గొనడం కార్మికవర్గం, పేదవారి లక్షణమని, రాజకీయాలలో పాల్గొన్నా పాల్గొనకపోయినా అధికారం చెలాయించడం ధనికుల, ఉన్నత వర్గాల లక్షణమని వీరి అభిప్రాయం. అంటే సంపన్నులు మాత్రమే రాజకీయాధికారం చెలాయించ గలుగుతారని విశదమవుతోంది. ఇక రాజకీయాలలో భాగస్వామ్యం గురించి కొన్ని నిర్వచనాలను పరిశీలిద్దాం. వివరాలకు వెళ్ళే ముందు దీనిని సంకుచితార్థంలోను, విస్తృతార్థంలోను కూడా నిర్వచించారని గ్రహించాలి. జోన్ ఎం. నెల్సన్ (Joan M. Nelson) చెప్పినట్లు పూర్వపు రూపం (Older image) ప్రకారం రాజకీయాలలో పాల్గొనడం ప్రజాస్వామ్యంతో ముడివడి ఉంటుంది. కానీ ప్రస్తుతం దీనికిస్తున్న అర్థం ప్రకారం పరిపాలితులను ప్రభావితంచేసే పౌరుల ప్రాథమికమైన చర్య అయినా ప్రజాస్వామ్యాలలో గాని, ప్రజాస్వామ్యేతర విధానాలలోగాని రాజకీయాలలో పాల్గొనడమే అవుతుంది.

రాజకీయాలలో పాల్గొనడానికి పరిమితమైన అవకాశం పౌరులకుండాలని షుంపీటర్ (Schumpetar) అభిప్రాయం. రాజకీయ సంబంధమైన విషయాల నిర్వహణలో ప్రజాప్రతినిధులు, సామాన్య పౌరులకు మధ్య కర్తవ్యాల విభజన ఉండాలని ఇతడి అభిప్రాయం. నిర్ణీత సమయాలలో జరిగే ఎన్నికలలో ప్రతినిధులను నిర్ణయించుకోవడానికి గాని, లేదా తిరస్కరించడానికిగాని మాత్రమే పౌరుల రాజకీయ పాత్ర పరిమితం కావాలని, ఎన్నికైన ప్రజాప్రతినిధులు విధాన నిర్ణయాలు తీసుకోవాలని ఇతడి అభిప్రాయం. నిర్ణీత ఎన్నికలలో ప్రజాప్రతినిధులను ఎంపిక చేసేందుకు అవకాశమిచ్చే ప్రజాస్వామ్య విధానానికి షుంపీటర్ అనుకూలుడని ఇందువల్ల తెలుస్తోంది. విధాన నిర్ణయంలో ప్రత్యేకీకరణ, కుశలత అవసరమవుతాయని, సామాన్య పౌరులందరికీ ఈ శక్తి యుక్తులుండవని, వృత్తి రీత్యా రాజకీయ నాయకులుగా వ్యవహరించేవారికి మాత్రమే విధాన నిర్ణయ బాధ్యతలు అప్పగించాలని ఇతడి భావం.

రాజకీయాలలో పౌరులు పాల్గొనడం గురించి విశేషంగా అధ్యయనంచేసిన వారిలో హంటింగ్‌టన్ ఒకడు. ఇతడి అభిప్రాయంలో (Political Participation is Simply an activity by Private Citizens designed to influence governmental decision making.) రాజకీయాలలో పౌరుల పాత్ర గురించి ఆలోచించేటప్పుడు హంటింగ్‌టన్ కూడా ప్రజాస్వామ్యాన్ని దృష్టిలో పెట్టుకొన్నాడు. ప్రభుత్వంచేసే విధాన నిర్ణయాన్ని ప్రభావితం చేయడానికి రూపుదిద్దుకొన్న పౌరుల చర్యలను రాజకీయాలలో పౌరుల పాత్ర అనవచ్చని హంటింగ్‌టన్ అభిప్రాయం. ఇక వివరాలకు వస్తే రాజకీయాలలో పౌరులు (a) వ్యక్తిగతంగాగానీ, సమిష్టిగాకానీ పాల్గొంటారు. (b) వీరి చర్యలు వ్యవస్థీకృతమైనవి (Organised) కాని,

ఆయాచితమైనవి. (Sponteneous) గాని కావచ్చు. (C) రాజకీయాలలో పాల్గొనడం అప్పుడప్పుడుగావి, ఎల్లప్పుడూ (Sustained) కాని అయి ఉండవచ్చు. (d) అంతేకాకుండా శాంతియుతంగా కాని, హింసాత్మకంగా కాని పౌరులు పాల్గొనడం జరగవచ్చు. (e) వీరి చర్యలు చట్టబద్ధమైనవి (Legal) కాని, చట్టవ్యతిరేకమైనవికాని (illegal) అయిఉండవచ్చు. (f) చివరిగా ఫలప్రదంగాకానీ (effective), నిష్ఫలంగా (ineffective) కాని ఉండవచ్చు.

హంటింగ్‌టన్ ఉద్దేశంలో రాజకీయాలలో భాగస్వామ్యం అభిప్రాయాలకు, వైఖరులకు (attitudes) కాకుండా చర్యలకు (activities) సంబంధించి ఉంటుంది. ఇక్కడ సునిశితమైన భేదం ఏమిటంటే వైఖరుల ప్రభావం రాజకీయాలలో పాల్గొనడం పై ఉంటుందికాని, రాజకీయాలలో వైఖరులను భాగంగా పరిగణించడానికి వీలుండదు. హంటింగ్‌టన్ రాజకీయాలలో పాల్గొనే వ్యక్తులకు, వృత్తి మాదిరిగా రాజకీయాలను స్వీకరించడానికి భేదాన్ని గమనించాల్సిందని భావిస్తాడు. ప్రభుత్వోద్యోగుల చర్యలను, పార్టీ ఉద్యోగుల చర్యలను అంతేకాకుండా రాజకీయ పదవులకు పోటీచేసే అభ్యర్థుల చర్యలను కాకుండా రాజకీయ పదవులకు పోటీచేసే అభ్యర్థుల చర్యలను, వృత్తిపరమైన లాబీయిస్టు చర్యలను రాజకీయాలలో పాల్గొనడంలో భాగంగా పరిగణించవచ్చా, లేదా అన్నది పై నిర్వచనంలో స్పష్టంగా లేదు.

రాజకీయాలలో భాగస్వామ్యం అంటే ఏమిటో వివరిస్తూ హంటింగ్‌టన్ పాల్గొనడంతో సంబంధమున్న స్థాయిలు (levels) రీతులు (forms) ఆధారాలను Bases) కూడా వివరిస్తాడు. నిజానికి వీటిని జాగ్రత్తగా అధ్యయనం చేయడం రాజకీయాలలో పాల్గొనడం స్వరూప స్వభావాలను నిర్ణయించడానికి ఎంతో అవసరమంటాడు. ఓటుచేయడం, పోటీచేయడం తదితర చర్యలను స్థాయిలుగా పరిగణించాలి. ఎన్నికలకు సంబంధించిన చర్యలు, కార్య నిర్వహణ, లాబీయింగ్, వ్యవస్థకు సంబంధించిన కార్యక్రమాలు (Organisational activity) పరిచయాలు, సంబంధాలు మొదలైన వాటికి సంబంధించిన చర్యలు, హింసాత్మక చర్యలు మొదలైనవి రీతులకు ఉదాహరణలు. ఇక ఆధారాలకు వస్తే రాజకీయ పార్టీలు, రాజకీయ ముఠాలు (factions), ఇరుగు పొరుగు వాతావరణం, తెగలు మొదలైన వాటిని వీటిలో భాగాలుగా పరిగణించాల్సి ఉంటుంది. ఒక వ్యవస్థలో పైన వివరించిన స్థాయిలు, రీతులు, ఆధారాలకు - సాంఘిక, ఆర్థిక పరిస్థితులకు, వాటి అభివృద్ధికి ఎంతో సంబంధం ఉంటుంది. దీన్ని బట్టి రాజకీయాలలో పాల్గొనడానికి అర్థం చేప్పే ముందు దీన్ని ఒక జటిలమైన లేదా క్లిష్టమైన భావన (Complex Concept) అని మనం గ్రహించాలి. అందువల్లనే వివిధరకాలైన రాజకీయ చర్యలకు ఆశ్రయమిచ్చేభావన (umbrella Concept) గా రాజకీయాలలో పాల్గొనడాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుందని రాజనీతి శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

షుంపీటర్ (Schumpeter) అభిప్రాయంతో పోల్చినట్లయితే హంటింగ్‌టన్ అభిప్రాయం రాజకీయాలలో పాల్గొనడం అన్న దానికి విస్తృతమైన అర్థం ఇస్తున్నట్లుగా తెలుస్తుంది. అయితే హంటింగ్‌టన్ కూడా రాజకీయాలలో పాల్గొనడం కొంతవరకు పరిమితార్థంలో వివరిస్తాడు. ఎందుకంటే ప్రభుత్వోద్యోగుల, పార్టీ ఉద్యోగుల, లాబీయిస్టుల, అభ్యర్థుల కార్య కలాపాలను ఇతడు రాజకీయాలలో పాల్గొనడం పరిధిలో చేర్చడు.

గోయల్, మిల్ బ్రాత్‌లు (Goal and Millbrath) Political Participation may be defined as those actions of private Citizens by which they seek to influence or support Government and Politics. It includes active roles that people pursue in order to influence outcomes and Ceremonials and support activities.) రాజకీయాలకు, ప్రభుత్వానికి మద్దతుగాని, వాటిని ప్రభావితం చేసేందుకుగాని ప్రయత్నించే పౌరుల చర్యలను రాజకీయాలలో పాల్గొనడమంటారని గోయల్, మిల్ బ్రాత్‌ల అభిప్రాయం. రాజకీయ వ్యవస్థలో తీసుకొన్న నిర్ణయాలను ప్రభావితం చేయడానికి పౌరులు నిర్వహించే చురుకైన పాత్రలు, ఆచారంగా జరుగుతుండే సంఘటనలు, మద్దతు చర్యలలో పాల్గొనడం కూడా రాజకీయాలలో పాల్గొనడంగా పరిగణించాలి.

గోయల్, మిల్ బ్రాత్‌లు రాజకీయాలలో పాల్గొనడానికి దోహంచేసే కారణాలను కూడా చర్చించారు. పాల్గొనవలెనని గాని, పాల్గొనరాదనిగాని తీసుకొనే నిర్ణయం ప్రభావ కారకాలలో ఒకటి. ఏరకంగా, లేదా ఏమార్గంలో పాల్గొనాలో నిర్ణయించు కోవడం రెండోది. ఈ రెండింటికి మరొక కారకంతో తప్పనిసరి సంబంధం ఉంది. అది ఎంతవరకూ అంటే ఎంత ఎక్కువగా లేదా లోతుగా పాల్గొనాలో నిర్ణయించుకోవడం, ఎంతకాలం వరకో నిర్ణయించుకోవడం. ఇక పాల్గొనే వ్యక్తుల స్వభావాన్ని బట్టి వారిని రెండురకాల వ్యక్తులుగా నిర్ణయించవచ్చు. వీరు మార్పును కోరేవారు లేదా ఉదారవాదులు (liberals), ఎటువంటి మార్పు కోరకుండా పరిస్థితి యథాతథంగా ఉండాలని భావించే వారు. వీరిని సాంప్రదాయవాదులు (Conservatives) అవవచ్చు. ఇటువంటి ధోరణులపై వాతావరణం అంటే సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, తదితర వాతావరణం ప్రభావ ముంటుంది. ఈ వాతావరణ ప్రభావం ఆధారంగా అమెరికా పౌరులను మిల్ బ్రాత్ మూడు రకాలుగా విభజించాడు. (1) ఉదాసీనులు (Apathetics), (2) ప్రేక్షకులు (Spectators), (3) చురుకైన వారు (Gladiators), ఉదాసీనులకు రాజకీయ విధానంలో పాల్గొనే ఉత్సాహం ఉండదు. ప్రేక్షకులు రాజకీయ విధానంలో తక్కువగా పాల్గొంటారు. ఇక చురుకైన వారు లేదా రాజకీయాలలో పాల్గొనడం వల్ల ఉత్సాహం, ఆనందం పొందేవాడు. రాజకీయ పోరాటానికి లేదా పోటీకి కూడా ఇష్టపడతారు. అంటే ప్రజాస్వామ్యంలో ఎన్నికలలో అభ్యర్థులుగా పోటీచేయడం, రాజకీయ పదవులకు పోటీచేయడం వంటి చర్యలకు ఉద్యుక్తులై వాటిలో ఉత్సాహంచూపిస్తారు.

మిల్ బ్రాత్‌కు ముందే రాజనీతి శాస్త్రజ్ఞులు రాజకీయాలలో పౌరులు పాల్గొనడం పౌరులను మూడు రకాలుగా వర్గీకరించాడు. డబ్ల్యూ. ఎన్. రాబిన్సన్ (1952) పౌరులను మూడు రకాలుగా విభజించారు. వీరు (1) ప్రేక్షకులు (Spectators) ఎన్నికలను వీరు ఒక సామూహిక చర్యగా లేదా దృశ్యంగా పరిగణిస్తారు. (2) పౌరులు (Citizens). ఎన్నికలలో ఓటు చేయడమే పౌరుల ప్రధాన విధి లేదా పని అని వీరు భావిస్తారు. (3) పక్షవాదులు (Partisams). ఎన్నికలలో తమపార్టీ, అభ్యర్థుల విజయానికి కృషిచేస్తారు.

రాబర్ట్ ఎగెర్ (Robert Agger) విన్‌సెంట్ ఆస్ట్రోమ్ (Wincent Ostrom) రాజకీయ కార్యక్రమాలలో పౌరులు నిర్వహించే పాత్రలను గురించి కొంత వివరంగా తెలిపారు. (1956) రాజకీయ చర్చలలోగాని, సమావేశాలలోగాని పాల్గొనక పోయినా, ప్రజాసంబంధమైన సమస్యల విషయంలో శ్రద్ధవహించే సమావేశాలకు హాజరై ప్రజల సమస్యలను తెలుసుకొనే పౌరులు ప్రజాసమస్యలను గురించి తరుచుగా తమలోతాము మాట్లాడుకొనే పౌరులు రాజకీయవ్యవస్థలో ఉంటారని వీరంటారు.

రాజకీయ రంగంలో చురుకుగా పాల్గొనే పౌరులను నాయకులు (Leaders), ఉపనాయకులు (Sub-leaders) అని రెండు రకాలుగా ఉంటారని రాబర్ట్ దాల్ (Robert Dahl) అభిప్రాయం. ఈ నాయకులు నమ్మే విలువలు, వారు సాధించగోరే ప్రయోజనాలు వేరుగా ఉంటాయి. దాల్ చేసిన విభజన నాయకత్వానికి మాత్రం పరిమితమైంది. సామాన్య పౌరులు దీనిలోకి రారు. దాల్ విభజన ఆధారంగా ప్రాంతాన్ని అంటే భౌగోళిక ప్రాంతాన్ని ఆధారంగా చేసుకొని జాతీయ నాయకులు, ప్రాంతీయ నాయకులు అని మనం రెండు విధాలుగా నాయకత్వముంటుందని అనవచ్చు.

రాబిన్‌సన్, రాబర్ట్ ఎగెర్, విన్‌సెంట్ ఆస్ట్రోన్, రాబర్ట్‌దాల్‌ల అభిప్రాయాలను పరిశీలిస్తే, రాజకీయాలలో పాల్గొనే పౌరులను గురించి వివరించేటప్పుడు కొందరు నాయకులను మాత్రమే ప్రస్తావించారని, మరికొందరు నాయకులనే కాకుండా సామాన్య పౌరులను కూడా పరిగణించారని విశదమవుతుంది. వీరి వివరణలు మిల్‌బ్రాత్ విశ్లేషణకు ఆధారమయ్యాయని మాత్రం నిజం. జోన్ ఎం. నెల్‌సన్ అభిప్రాయంలో True participation is the upward flow of influence that shapes Govt. agenda and determines Policies. అంటే ప్రభుత్వ విధానాలను, ప్రభుత్వ అజెండాను ప్రభావితంచేయడానికి సాధారణ పౌరులు చేసే ప్రయత్నాలు రాజకీయాలలో పాల్గొనడం కిందికి వస్తాయి. ఒక్కొక్కసారి పౌరుల ప్రయత్నాలు పరిపాలకులను మార్చడానికి ఉద్దేశించినవి కావచ్చు. ప్రభుత్వ విధానాల అమలు పరచడాన్ని ప్రభావితం చేయడానికి ఉద్దేశించినవి కావచ్చు. రాజకీయాలలో పాల్గొనడానికి సంబంధించిన వివరాలను ప్రస్తావిస్తూ ప్రాచీన దృక్పథం ప్రకారం రాజకీయాలలో పాల్గొనడానికి, ప్రజాస్వామ్య విధానానికి దగ్గర సంబంధం ఉందని పరిగణింపబడేదని, అయితే ఇటీవలి కాలంలో ఈ దృక్పథంలో మార్పు కనిపిస్తుందని నెల్సన్ అభిప్రాయం. రాజకీయాలలో పాల్గొనాలంటే ప్రజాస్వామ్యవ్యవస్థ తప్పనిసరిగా ఉండాలన్న భావన సరి అయిందికాదు. రాజకీయ విషయాలను గురించి పౌరులు సంభాషణలు జరపడం, ఓటు చేయడం, ఎన్నికల్లో పోటీచేయడం వంటి చర్యలేకాకుండా పరిపాలకులు ప్రతిపాదించిన కవాతులు, ప్రదర్శనలలో పాల్గొనడం కమ్యూనిస్టు లేదా నాజీ వ్యవస్థలలో జరిగే నామమాత్రపు ఎన్నికలలో పాల్గొనడం, ప్రభుత్వ వ్యతిరేక లేదా చట్టవ్యతిరేక తిరుగుబాట్లలో పాల్గొనడం కూడా రాజకీయాలలో పాల్గొనడమే అవుతుంది.

జెరెయింట్ పారి (Greraint Parry) దృష్టిలో రాజకీయాలలో పాల్గొనడమంటే (The Act of taking part in formulation, passage or implementation of Public Policies.) అంటే ప్రభుత్వ విధాన రూపకల్పనలోను, ఆమోదించడంలోను, అమలు పరచడంలోను పాల్గొనడం రాజకీయాలలో పాల్గొనడమవుతుంది. దీన్ని మనం ఒక విస్తృతమైన నిర్వచనంగా అంటే- ఏరాజకీయ వ్యవస్థలోనైనా సామాన్య పౌరుడుగాని, ప్రభుత్వ ప్రతినిధిగాని ప్రభుత్వ విధానాన్ని ప్రభావితం చేయడానికి చేసిన ప్రయత్నాలన్నీ రాజకీయాలలో పాల్గొనడానికి సంబంధించిన చర్యలేనని తెలిపే నిర్వచనంగా పరిగణించవచ్చు.

నెల్సన్, పారిలు రాజకీయాలలో పౌరులు పాల్గొనడానికి విస్తృతమైన పరిధిని నిర్ణయించారు. విధాన నిర్ణయం, దాన్ని అమలు పరచడం - ఈ రెండింటి గమ్యాలు ప్రజాసంక్షేమం సాధించడమే, దీనికి అవసరమైన కార్యక్రమాలు రూపొందించి అమలు పరచడమే. అందువల్ల విధాన నిర్ణయం, అమలు పరచడం విషయంలో పౌరుల ప్రభావం ఉండటం ఆమోద యోగ్యమైనదనే చెప్పాలి.

రష్, ఆల్త్రాఫ్ (Rush, Althroff) ల అభిప్రాయంలో రాజకీయాలలో పాల్గొనడమంటే ఓటు చేయడం, రాజకీయ వర్గాలలో (Political Groups) వాటికి సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొనడం (ఉద్యమాలు, ప్రభావ వర్గాల కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాలు మొదలైనవి). ప్రభుత్వ పదవులు నిర్వహించడం, అధికారులను అనునయించడానికి లేదా ఒప్పించడానికి సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొనడం, రాజకీయ సమావేశాలకు హాజరుకావడం, రాజకీయ విషయాల చర్యలలో పాల్గొనడం.

రాజకీయాలలో పాల్గొనడాన్ని వివిధ చర్యలతో కూడుకొన్నవిగా పరిగణిస్తూ నై (Nie), వెర్బా (Verba) లు దీనిలో ఓటు చేయుడం, ప్రచారం చేయడం, పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడం, నిధులు సమకూర్చడం మొదలైనవి దీనిలో భాగాలని అంటారు. వీరి అభిప్రాయాల వివరాలను తరవాతి పేజీలలో చూద్దాం.

రాజకీయ విధానంలో పౌరులు పాల్గొనవలసిన అవసరాన్ని అరిస్టాటిల్ మొదలు ఇప్పటివరకు అనేక మంది రాజనీతి శాస్త్రజ్ఞులు తెలుపుతూవచ్చారు. ఇంతకుముందు తెలిపినట్లు వీరిలో చాలామంది రాజకీయాలలో పాల్గొనడానికి ప్రజాస్వామ్యానికి సన్నిహిత సంబంధం ఉందని భావించారు.

12.4 రాజకీయ భాగస్వామ్య స్థాయిలు

ఏ రాజకీయ వ్యవస్థలోనైనా అక్కడి పౌరులందరూ చురుకుగా రాజకీయాలలో పాల్గొనరు. పాల్గొనడానికి అవకాశమున్న స్థాయిలలో వారు వివిధ పరిస్థితుల ప్రభావం ఆధారంగా - అంటే మనస్తత్వం, ఆర్థిక స్తోమత, ఉత్సాహం, అవకాశాలు, పరిసరాల ప్రభావం మొదలైన వాటినిబట్టి పాల్గొంటారు. స్థాయిలను గురించి వివరిస్తూ, ఓటింగ్ మొదలుగా ఉన్న స్థాయిలలో పౌరులు పాల్గొంటారని హంటింగ్‌టన్ అన్నట్లు తెలుసుకొన్నాం. స్థాయిలకు చెందిన మరికొన్ని వివరాలను ఇప్పుడు పరిశీలిద్దాం. పరస్పర ప్రభావితాలైన ఎన్నో విషయాల ఫలితంగా రాజకీయాలలో వివిధ స్థాయిలలో పాల్గొంటారు. వీరి పాత్ర ఫలితంగా రాజకీయ వ్యవస్థ నుంచి వెలువడే విధానాలు, ప్రజలకు లభించే సేవలు, న్యాయం, ఆర్థిక అవకాశాలు మొదలైన వాటి స్వరూపం నిర్ణయించడ మవుతుంది. అంటే జాగరూకతతో, సమర్థతతో పాల్గొనే పౌరులున్న వ్యవస్థలో ప్రజా ప్రయోజనాలకు అనుకూలంగా ఉండే, విధాన నిర్ణయాలు తీసుకొని అమలు పరిచే అవకాశాలు ఎక్కువ. అజ్ఞానులు, ఉదాసీనులు ఎక్కువగా ఉన్న వ్యవస్థలో పరిమిత వర్గాలకు ప్రయోజనాలు సమకూర్చే విధానాలు నిర్ణయించడం, అమలు పరచడం జరగవచ్చు. ఓటింగ్, ప్రచారం, ప్రతిఘటన, సాన్నిహిత్యం నెలకొల్పడం మొదలైన పౌరుల చర్యలను రాజకీయ వ్యవస్థలో ఇన్‌పుట్స్‌గా పరిగణిస్తే ప్రజా సర్వీసులు, భద్రత, న్యాయం, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలలలో అభివృద్ధి అవకాశాలు మొదలైనవి వారు పొందే ప్రయోజనాలుగా పరిగణించవచ్చు.

వెర్బా, నైలు పౌరులు రాజకీయాలలో పాల్గొనే స్థాయులు, రీతులను గురించి వివరంగా అధ్యయనం చేశారు. వీరు 1972 ప్రచురించిన Pasrticipation in America అనే గ్రంథంలో అమెరికన్‌లలో అసలు రాజకీయాలలో ఏ విధంగాను చురుకుగా లేనివారు (Inactivies) 22%, కార్యక్రమాలలో క్రియాశీలురు (Community activists) 20% ప్రచారం నిర్వహించేవారు (Ampaigeners) 15%,

వ్యక్తిగత సంబంధాలు నెలకొల్పుకొనేవారు (Individual Contacts) 4% ఉంటారని తెలిపారు. ఓటింగ్ నిష్పాతులు ఓటుచేయడంలో శ్రద్ధ, ఉత్సాహం కనబరుస్తారు. పార్టీ కార్యకర్తలు, ప్రచారకులు అభ్యర్థులకు మద్దతుగాకృషిచేయడం, రాజకీయ పార్టీల సమావేశాలకు హాజరు కావడం, ఓటర్లను తమ అభ్యర్థికి ఓటుచేసేందుకు ఒప్పించే ప్రయత్నాలు చేయడం, పార్టీ అభ్యర్థులకు విరాళాలివ్వడం, నిధులు సమకూర్చే ప్రయత్నాలు చేయడం, రాజకీయ పార్టీలలో సభ్యులుగా పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడం వంటివి జరుపుతారు. ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనేవారి సంఖ్య ఇంకా తక్కువ. సామాజిక కార్యక్రమాలలో క్రియాశీలురు తమ సంఘం ద్వారా ప్రభుత్వోద్యోగులతో తగిన సంప్రదింపులు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. రాజకీయాలలో పాల్గొనే కొందరు ప్రతిఘటన ద్వారా తమ లక్ష్యసాధనకు కృషి చేస్తారు. వీరిని ప్రతిఘటన పరులు (Protestors) అనవచ్చు. ప్రభుత్వోద్యోగులు తమ తప్పిదాలను సరిచేసుకోడానికి, ప్రజోపయోగ నిర్ణయాలు చేయడానికి వత్తిడి తేవడంలో ప్రతిఘటన పరులు ప్రజాప్రదర్శనలు, అవసరమైతే దొమ్మీలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతిఘటన యాత్రలు (Protest Marches) అన్యాయమైన చట్టాలను వ్యతిరేకించడం వంటి కార్యక్రమాలు జరుపుతారు. ఇక కమ్యూనికేటర్స్ (Communicators) రాజకీయ పరిజ్ఞానాన్ని ప్రజలకు సమకూర్చడం, రాజకీయ నాయకులు విధులను సమర్థతతో జరిపినప్పుడు తమ మద్దతు తెలుపుతూ సమాచారం పంపడం, అట్లాకానప్పుడు ప్రతిఘటన సూచన సమాచారం పంపడం, పత్రికల సంపాదకులకు లేఖలు రాయడం మొదలైన విషయాల్లో పాల్గొంటారు.

వివిధ స్థాయిలలో పౌరులు రాజకీయాలలో పాల్గొనడాన్ని రష్, ఆల్ట్రాఫ్ (Rush, Althropt) లు క్రమానుగత శ్రేణిలో వివరించారు. దీనిలో అన్నిటికంటే పై స్థాయిలో రాజకీయ, పరిపాలక పదవులుంటాయి. తరవాత రాజకీయ, పరిపాలక పదవులు పొందడానికి ప్రయత్నించేసే స్థాయి ఉంటుంది. మూడోది, రాజకీయ సంస్థలలో చురుకైన సభ్యత్వం, రాజకీయాలలో నిష్క్రియాపూర్వక సభ్యత్వం (Passive membership) తరవాత స్థాయి అవుతుంది. అర్ధ రాజకీయ వ్యవస్థలో (Quasi-Political Organisation) చురుకైన సభ్యత్వం, నిష్క్రియాపూర్వక సభ్యత్వం తరవాతిస్థాయులు. ప్రజా సమావేశాలలో పాల్గొనడం, అంతేకాకుండా ప్రదర్శనలలో పాల్గొనడం ఏడోస్థాయి. ఎనిమిదో స్థాయిలో పాల్గొనేవారు రాజకీయ విషయాలపై లాంఛనప్రాయంకాని చర్చలలో భాగస్వాములుగా ఉంటారు. రాజకీయాలపట్ల సాధారణ శ్రద్ధ చూపడం తొమ్మిదోస్థాయి అయితే, ఆఖరుది ఓటు చేయడం. దీనిని బట్టి ఓటింగ్ అట్టడుగు స్థాయి పాత్ర అని రాజకీయ, పరిపాలక పదవుల నిర్వహణ అత్యున్నతస్థాయి అని తెలుస్తుంది.

డేవిడ్ ఎన్. రాత్ (David F. Roth), ఫ్రాంక్ ఎల్, విల్సన్ (Frank L. Wilson) లు రాజకీయ జీవనంలో పౌరుల పాత్రను గురించి వివరిస్తూ వార్తాపత్రికలలో రాజకీయ విషయాలను, అభివృద్ధిని చదవడం మొదలు అత్యున్న రాజకీయ పదవుల నిర్వహణ వరకూ అనేక విషయాలు రాజకీయాలలో పౌరులు పాల్గొనడానికి సంబంధించి ఉంటాయని అంటారు. ఓటు చేయడం, విజ్ఞప్తులు చేయడం, ప్రాతినిధ్య సంస్థలకు పోటీ చేయడం, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించడం, ప్రభుత్వోద్యోగాల నిర్వహణ, ప్రచారకులుగా వ్యవహరించడం మొదలైన చర్యలన్నీ రాజకీయాలలో పాల్గొనడం కిందికే వస్తాయి. ఎక్కువ డిగ్రీలో అంటే మరీ ఎక్కువగా పాల్గొనడం వల్ల రాజకీయ స్థిరత్వానికి ప్రమాదం కలిగే

అవకాశముందని, మరీ తక్కువగా పాల్గొనడం కూడా ప్రమాదకరమైనదేనని వీరి అభిప్రాయం. రాజకీయ కార్యక్రమాలలో పాత్రధారులుగా పౌరులను వీరు ముఖ్యంగా 4 తరగతులుగా విభజించారు. (1) అనాసక్తులు (Apoliticals), (2) వీక్షకులు (On-lookers), (3) పాల్గొనేవారు (Participants) 4) క్రియాశీలురు (activists) వీక్షకులు రాజకీయ పరమైన ర్యాలీలలోను, ఊరేగింపులలోను పాల్గొనడం, రాజకీయ సంస్థలలో సభ్యులుగా ఉండటం, అనునయకర్తలుగా వ్యవహరించడం, ఓటు చేయడం, రాజకీయ విషయాలు చర్చించడం, రాజకీయ ప్రగతి అంచనా చేయడం వంటి వాటిలో నిమగ్నులవుతారు. అనాసక్తులకు రాజకీయాలపట్ల ఉత్సాహంగానీ, శ్రద్ధగాని ఉండదు. ఇక పాల్గొనేవారు ప్రచారకులుగా, పార్టీలో చురుకైన సభ్యులుగా, ప్రభావ వర్గాలలో రాజకీయమైన కార్యక్రమాలలో చురుకైన వారుగా, సమాజాభివృద్ధి కార్యక్రమాలలో సభ్యులుగా వ్యవహరిస్తారు. క్రియా శీలురు కొందరు విచలన పోకడ (Deviation) తో వ్యవహరిస్తారు. వీరు ఉగ్రవాదులుగాను, హైజాకర్లుగాను, ఖూనీచేసే వారుగాను ప్రవర్తిస్తారు. వీరికి భిన్నంగా కొందరు ప్రభావవర్గాల నాయకులుగా, పార్టీ నాయకులుగా ప్రభుత్వ పదవులలో పనిచేస్తారు. రాత్, విల్సన్‌ల అభిప్రాయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయాలలో పాల్గొనడం ఆడంబరమే (luxury) అవుతుంది. శాంతియుత ప్రజాస్వామిక పద్ధతులకు నిర్ణీత సమయాలలో ప్రజాప్రతినిధుల ఎన్నికకు ప్రజాసమ్మతి పొందిన నాయకులు ప్రభుత్వ పదవులు నిర్వహించడానికి అనుకూలతను రాత్, విల్సన్‌లు వ్యక్తంచేసినట్లు పైవివరాలను బట్టి తెలుస్తుంది.

12.5.0 భాగస్వామ్యాన్ని ప్రభావితం చేసే కారకాలు

పైన వివరించిన దానిని బట్టి రాజకీయాలలో కొందరు పౌరులు అత్యున్నతస్థాయి పదవులు నిర్వహిస్తే చాలా మంది ఓటర్లుగా మాత్రమే వ్యవహరిస్తారని తెలుస్తుంది. ఈ సందర్భంలో ఈ పరిస్థితికి కారణాలేమిటి? అనే ప్రశ్న ఎదురవుతుంది. పౌరులు రాజకీయాలలో పాల్గొనడంలో, వారు పాల్గొనే స్థాయుల నిర్ణయంలో అనేక పరిస్థితుల ప్రభావం కనిపిస్తుంది. వీటిని కింది విధంగా వివరించవచ్చు.

12.5.1 రాజకీయ సామాజికీకరణం

రాజకీయాలలో పౌరుల ప్రవృత్తి, పై సామాజీకరణ ప్రభావం ఉంటుంది. ఈ విధానం వ్యక్తి బాల్యంలో మొదలై జీవితాంతం నడుస్తూ ఉంటుంది. సామాజీకరణ ఫలితంగా వ్యక్తులలో రాజకీయాలపట్ల అభిప్రాయాలు, భావాలు ఏర్పడతాయి. రాజకీయ విలువలు, విశ్వాసాలు నిర్ణయమవుతాయి. మరో విధంగా చెప్పాలంటే రాజకీయ సంస్కృతి (Political Culture) అలవడుతుందన్నమాట. ఈ సంస్కృతి ప్రవర్తనారీతులను నిర్ణయిస్తుంది. ఇంగ్లండ్‌లో రాజకీయ సంబంధమైన అభిప్రాయాలు, నమ్మకాలు ఒక తరం నుంచి మరో తరానికి సంక్రమిస్తాయని రాజనీతిజ్ఞులు పరిశోధనల ఫలితంగా నిర్ణయించారు. దీనివల్లనే రాచరికం పట్ల గౌరవం, నమ్మకం కొనసాగుతోంది. బ్రిటీష్ పౌరులు శాంతియుత పద్ధతుల ద్వారా సమస్యల పరిష్కారాన్ని వాంఛిస్తారు. అలాగని అన్యాయపు శాసనాలను అంగీకరించరు. అందువల్లనే బ్రిటీష్ పౌరులు తమ రాజకీయ నడవడిలో మధ్యేమార్గం వ్యవహరిస్తారని చెప్పవచ్చు. అమెరికా పౌరులు ప్రజాస్వామ్య విలువలకు, సమసమాజానికి ప్రాధాన్య మిస్తారు.

తామేర్పరుచుకొన్న రాజకీయ సంస్థలకు వ్యతిరేకులుకారు. అయితే సంస్థలను సమర్థతతో నిర్వహించని నాయకులకు వ్యతిరేకులు. భారతదేశంలో రాజకీయ భావాలలోను, నమ్మకాలలోనూ సంప్రదాయం ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రజాస్వామ్య సంస్థలు సమర్థవంతంగా నిర్వహించుకోవాలనే భావాలున్నాయి.

క్లుప్తంగా చెప్పాలంటే రాజకీయాలలో పాల్గొనడంపై రాజకీయ సామాజీకరణ ప్రభావం చెప్పుకోదగినదిగా ఉంటుంది. బాల్యంలో అనుభవాలు, విద్య, వయస్సు మొదలైన వాటి ప్రభావం వ్యక్తుల అభిప్రాయాలపై ఉంటుంది. వ్యక్తిగత వ్యవస్థ (Personal System) సామాజీకరణ ఫలితంగా పౌరులలో రాజకీయాలపట్ల అభిప్రాయాలు, వైఖరులు, నమ్మకాలు - అంతేకాకుండా రాజకీయ విలువలు ఏర్పడి మార్పు చెందుతూ ఉంటాయి వీటితో బాటుగా ఆర్థిక, సాంఘిక, తదితర పరిస్థితుల ప్రభావం రాజకీయాలలో పాల్గొనడంపై ఉంటుంది. ఉదాహరణకు, రాజకీయాలలో పాల్గొనడం ద్వారా కంటే ఇతర సాధనాల ద్వారా ప్రజా సమస్యలు మరింత సులభంగా పరిష్కారమవుతాయనే నమ్మే వ్యక్తులు రాజకీయాలపట్ల శ్రద్ధ కనబరచరు. రాజ్య వ్యవస్థలో సభ్యులుగా నష్టమేతప్ప ఎటువంటి ప్రయోజనం పొందని వ్యక్తులు రాజకీయాలలో ప్రతిఘటన పద్ధతులకు ప్రాధాన్యమివ్వవచ్చు. ప్రజాస్వామ్యంపట్ల ప్రగాఢ విశ్వాసం ఉన్న వ్యక్తులు సామరస్య ధోరణితో, ఇచ్చి పుచ్చుకొనే వైఖరితో, చర్చ ప్రాతిపదికగా ఏకాభిప్రాయసాధనకు రాజకీయ సంస్థలను వినియోగించడానికి ఉత్సాహంచూపవచ్చు. నాయకత్వ లక్షణాలున్న వ్యక్తులు రాజకీయాలలో నాయకత్వ పదవులు పొందే కృషి చేసి వాటిని పొందినట్లయితే ఆ పదవులలో రాణించవచ్చు.

12.5.2 సమీప వాతావరణం

రాజకీయాలలో పాల్గొనడానికి పౌరులు తీసుకొనే నిర్ణయంపై సమీప వాతావరణ ప్రభావం ఉంటుంది. సమీప వాతావరణం ఎంత ఉత్తేజకరంగా, ఉల్లాసకరంగా, ప్రేరేపకంగా ఉంటే అంత ఎక్కువగాను, గంభీరంగాను పాల్గొనడం ఉంటుందని చెప్పవచ్చు. ఉదాహరణకు - రాజకీయాలపట్ల అనుకూల వైఖరిగల పౌరులు పాల్గొనడం విషయంలో ఉత్సాహ పూరితులు కావడానికి అవకాశాలెక్కువ. రాజకీయ విషయాలను గురించి తరుచుగా చర్చించేవారు, చర్చించని వారికంటే ఓటింగ్‌లోనూ, ఇతర రాజకీయ కార్యక్రమాలలోను ఎక్కువగా పాల్గొంటారు. అభ్యర్థులు స్వయంగా కలుసుకొన్న పౌరులు కలుసుకోని పౌరులు కంటే ఎక్కువగా ప్రచార కార్యక్రమంలోను, ఓటింగ్‌లోను పాల్గొంటారు. రాజకీయాలలో చురుకుగా ఉండే కుటుంబాలకు చెందిన పిల్లలు రాజకీయాలపట్ల శ్రద్ధ ఎక్కువగా కనబరచవచ్చు. రాజకీయాలపట్ల శ్రద్ధ ఉన్నవారు క్రియాశీలురుగా (activists) వ్యవహరించే అవకాశాలెక్కువ. పోటీ చేసే అభ్యర్థుల సన్నిహితులు, ఇతరులకంటే చురుకుగా పాల్గొంటారు.

12.5.3 విస్తృత వాతావరణం

సమీప వాతావరణంతో బాటుగా విశాల వాతావరణ ప్రభావం రాజకీయ ప్రవర్తన, పాల్గొనడాలపై ఉంటుంది. అంటే రాజకీయ వాతావరణంతోబాటు సాంఘిక వాతావరణం పౌరులు పాల్గొనడం స్వరూప స్వభావాలను నిర్ణయిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఎక్కువ మంది పాల్గొనే అవకాశం

ప్రజాస్వామ్యేతర ప్రభుత్వంలో కంటె అధికంగా ఉంటుంది. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ఎక్కువగా రాజకీయాలలో పౌరులు పాల్గొనే అవకాశాలనే కాకుండా రాజకీయ నాయక పదవులు పొంది నిర్వహించే అవకాశాలనిస్తుంది. ఇక రాజకీయ వాతావరణం శాంతియుతంగా ఉన్నప్పుడు అధిక సంఖ్యలో పౌరులు పాల్గొనవచ్చు. అల్లాకాక హింస, బెదరింపు వంటివి తలెత్తినప్పుడు పౌరులు వెనకంజవేస్తారు. ఎన్నిక సమయాలలో హింసాత్మక సంఘటనలు ఏర్పడినప్పుడు పరిమిత సంఖ్యలో పౌరులు ఓటు చేయడం జరుగుతుంది. రాజకీయ ముఠాతగాదాలు తీవ్రంగా ఉన్నప్పుడు పోటీ చేయడానికి పౌరులు ముందుకు రారు. రాజకీయరంగం కలుషితమైనప్పుడు నిజాయితీ పరులు, సేవా తత్పరులు రాజకీయాలలో అడుగు పెట్టడానికి అయిష్టత చూపుతారు. పితృస్వామిక సమాజం, పురుషాధిక్యతలు స్త్రీలు రాజకీయాలలో చురుకుగా పాల్గొనడానికి అవకాశాలు తగ్గిస్తాయి. ఆర్థిక అసమానతలు సమాజంలో కొద్ది మంది మాత్రమే ఉన్నత పదవులు పొందే పరిస్థితులు కల్పిస్తాయి. ఉన్నత పదవులు ధనికుల సొంతమై సామాన్యులపాత్ర కొద్దిపాటి రాజకీయ కార్యకలాపాలకు మాత్రమే పరిమితమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో అధిక సంఖ్యలో చురుకైన రాజకీయ కలాపాలలో పౌరులు పాల్గొడం ఒక మిథ్యగా మిగిలిపోతుంది. రాజకీయ విషయాలను గురించిన చైతన్యం చురుకైన రాజకీయ పాత్రలు నిర్వహించడానికి ఎంతో అవసరం. రాజకీయ చైతన్యం (Political Awareness), రాజకీయ స్పృహ (Political Consciousness) లోపించిన పౌరుల పాత్ర చిన్న పాటి కార్యకలాపాలకు మాత్రమే విస్తరిస్తుంది. వర్తమాన దేశాలలో, తగినంత రాజకీయ చైతన్యం అధిక సంఖ్యాకులలో లేకపోవడం సర్వ సామాన్యమనవచ్చు.

12.6 రాజకీయాలలో భాగస్వామ్యం : స్త్రీలు

అభివృద్ధి చెందిన దేశాలలోను, చెందుతున్న దేశాలలోను కూడా తగిన స్థాయిలో స్త్రీలు పాల్గొనక పోవడం కనిపిస్తుంది. స్త్రీలు ఓటుఇచ్చేవారిగానే కాని (Vote givers) ఓటు పొందేవారుగా (votegetters) సమాజంలో స్థానం పొందలేదు. దేశ ప్రజలలో సగ భాగమైన స్త్రీలు రాజకీయ రంగంలో వెనకంజవేయడం దేశప్రగతికి ప్రతిబంధకమని, రాజ్యాంగ పరంగాను, చట్ట పరంగాను కూడా పురుషులతోబాటు సమానంగా రాజకీయ రంగంలో పాల్గొనేహక్కు ఉన్నప్పటికీ ఇది ఆచరణలో అమలుకావడంలేదని ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన విషయమే. ఈ కారణంగానే స్త్రీల ఉద్యమంలో హక్కులను అనుభవించే అధికారం పొందే పరిస్థితులు సాధించాలనే అంశం ప్రధానాంశంగా మారింది. సమాజంలోని సమస్యలన్నీ ఏదో విధంగా రాజకీయాలతో ముడిపడి ఉంటాయి కనక విధాన నిర్ణాయక విభాగాలలో స్త్రీలకు సంఖ్యాపరంగా 50% కి తక్కువకాకుండా ప్రాతినిధ్యం లభించేలా ప్రయత్నించడానికి ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ సంఘాలు నిర్ణయించాయి. అంతేకాకుండా రాజకీయాలలో గ్రామ స్థాయి మొదలు జాతీయ స్థాయివరకు రాజకీయ నాయకత్వ పదవులలో స్త్రీలుండాల్సిన అవసరాన్ని గుర్తించాయి. రాజకీయ పదవులకు జరిగే పోటీలో పాల్గొని విజయం సాధించినట్లయితే సంఖ్యాపరంగా స్త్రీల అభివృద్ధి సాధ్యమవుతుందని, క్రమంగా సామర్థ్య పరంగా కూడా ఉన్నతి సాధించవచ్చుననే బలమైన వాదన ఉంది. సంఖ్యాపరంగాను, సామర్థ్య పరంగాను అభివృద్ధి సాధించినప్పుడు స్త్రీల ప్రతినిధులు, పురుషుల ప్రతినిధులు విధాన నిర్ణయ విభాగాలలో సభ్యత్వం కలిగి ఉండటంలో సమతౌల్యం సాధించవచ్చని, అప్పుడే వ్యవస్థ పాలకవర్గం అస్థిత్వానికి నైతికంగా గుర్తింపు లభిస్తుందని చెప్పవచ్చు. విచక్షణా రహిత సమాజస్థాపనకు కృషిచేయవచ్చు. 1992 లో అమెరికాలో స్థాపించిన Wish

(Women in Senate and House) 1993 లో తైవాన్‌లో స్థాపించిన ప్రజాస్వామ్య పురోగమన పార్టీ (Domocratic Progressive party) స్త్రీల అభివృద్ధి, కార్యాచరణ సంఘం (Women Development and Action Committee), 1980లో ఇంగ్లండ్‌లో ఏర్పడిన 300 Group, ఇటీవల భారతదేశంలో ఏర్పడిన Women's Political Watch నాయకత్వ పాత్రలలో స్త్రీల పాతినిధ్యం పెరగడం లక్ష్యంగా స్త్రీ సభ్యులకు ఎన్నికల ప్రచార వ్యయాన్ని సమకూర్చడానికి, ఇతర లక్ష్యాల సాధనకు ఏర్పడిన సంస్థలకు ఉదాహరణలు. నార్వే, స్వీడన్, డెన్మార్క్ వంటిస్కాండినేవియన్ దేశాలలోను, ఇటలీ, రష్యాలలోను ఏర్పడిన స్త్రీల రాజకీయ పార్టీలు స్త్రీ సభ్యులకు నైతికంగాను, భౌతికంగాను ఎన్నికల నిర్వహణకు నిధులు సమకూర్చడంలోను మద్దతు ప్రకటిస్తున్నాయి. అధికారంలో భాగస్వామ్యంకోసం స్త్రీలు, పురుషులు కలిసి సాంఘిక, రాజకీయ అర్థిక తదితర అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడం కోసం నేటి మహిళా ఉద్యమం కృషిచేస్తోంది. తమ ఉద్యమం పురుష వ్యతిరేక ఉద్యమంకాదని, అభివృద్ధి పథంలో పురుషులతోకలిసి పనిచేయడానికి అభివృద్ధికారకులుగా తాము వ్యవహరించడానికి అవకాశాలు కల్పించడానికేనని మహిళా నాయకులు వాదిస్తున్నారు. సంప్రదాయం విధించిన ఆంక్షలు, ఆర్థికంగా అధీనత, పురుషాధిక్యం, విధినిర్వహణలో సంఘర్షణ (Role Conflict) మొదలైన ప్రతిబంధకాలు అధికగమించలేనివి కావని నమ్ముతూ భవిష్యత్తులో వెలుగుచూడటానికి మహిళా ఉద్యమం ముందుకు సాగుతోంది.

12.7 రాజకీయాలలో భాగస్వామ్యం సామాజిక మార్పు

రాజకీయాలలో పౌరులు పాల్గొనడం విషయం స్వరూప స్వభావాలు పై చర్చనుబట్టి విశదమవుతున్నాయి. రాజకీయ విషయాలను చర్చించడం, ఓటుచేయడం, ప్రచారం సాగించడం, ఎన్నికలలో పోటీ చేయడం, లాబీయింగ్, విధాన నిర్ణయ సంస్థలలోను, విధాన నిర్ణయంలోను పాల్గొనడం, విధానం అమలు జరుగుతున్న తీరు తెన్నులను పరిశీలించడం, రాజకీయాలలో పాల్గొనడంగా పరిగణించాలి. అంతేకాకుండా ప్రతిఘటన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రదర్శనలు, ఊరేగింపులలో పాల్గొనడం, సమాజంలో అప్పటికప్పుడు తలెత్తే రాజకీయ కార్యక్రమాలు, సంఘటనలలో భాగస్వామ్యంకూడా రాజకీయాలలో పాల్గొనడమే అవుతుంది. ఏదేశ రాజకీయాలైనా, విధాన నిర్ణయ సంస్థల నిర్మాణం అందులోని సభ్యుల నిబద్ధత (Commitment), శక్తి సామర్థ్యాలు, పరిసరాల ప్రభావంకూడా ఎంతో ప్రాముఖ్యం కలిగి ఉంటాయి. అంటే లక్ష్యసాధనకు ఇవి ఎంతో ముఖ్యం. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాలలో శాసనసభలు విధాన నిర్ణయాలలో సముచిత పాత్ర వహిస్తాయి. ఈ సంస్థలు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబింప చేసేవిగా పనిచేయాలి. సమాజంలో వివిధ వర్గాల అవసరాలు చర్చించి నిర్ణయాలు తీసుకోవడంలో ఈ సంస్థలు కీలకమైన పాత్ర నిర్వహిస్తాయి. సముచిత విధాన నిర్ణయం, దాని సక్రమమైన అమలు సామాజిక మార్పుకు దోహదం చేస్తాయి. రాజకీయ కార్యక్రమ నిర్వహణలో నిమగ్నమైన నాయకులు తమ కార్యదీక్ష, చిత్తశుద్ధి, సేవా తత్పరతతో వ్యవహరిస్తే ప్రజలను అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు సమీకృతం చేయడంలోను, సమాజంలో అవసరమైన మార్పు తీసుకొని రావడంలోను కృతకృత్యులవుతారు. రాజకీయాలలో పాల్గొనడం ద్వారా ఇతరులకు మార్గదర్శకులవుతూ పౌరుల నిష్ప్రయోజనమైన వైఖరులు, ఆచరణ పద్ధతులను విడనాడి ముందుకు సాగడం ద్వారా పరివర్తన కారకులవుతారు.

12.8.0 రాజకీయాలలో భాగస్వామ్యం : రాజకీయ అభివృద్ధి

రాజకీయాలలో పౌరులు తగినంతగా పాల్గొనడంవల్ల రాజకీయ ప్రగతి సాధ్యపడుతుంది. పౌరులు రాజకీయ అభివృద్ధికి కారకులుగాను, లబ్దిదారులుగాను కూడా వ్యవహరించాలంటే భాగస్వామ్యులు కావడం తప్పనిసరి. రాజకీయ వ్యవస్థలలో-ముఖ్యంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో అధిక సంఖ్యలో పౌరులు పాల్గొనే అవకాశాలెక్కువ. అలాగని భాగస్వామ్య వ్యతిరేక ధోరణులు లేవని కాదు. ఇటువంటి పరిస్థితులు Sub-saharan ఆఫ్రికాలో కనిపిస్తున్నాయని " Understanding Political Development" అనే గ్రంధంలో జాన్ ఎం. నెల్సన్ (Joan M. Nelson) వివరించాడు. సంస్థాగతమైన కార్యక్రమాలు రాజకీయాలలో చురుకైన పాత్రకు, తద్వారా రాజకీయ ప్రగతికి దోహదమవుతాయి. సంక్షేమ రాజ్య లక్ష్యసాధనకు పౌరుల రాజకీయ భాగస్వామ్యం ఎంతో దోహదపడుతుంది. పౌరుల రాజకీయ విలువలు, సమిష్టి కృషి, ప్రతిమార్గం పై ప్రభావం చూపుతాయి.

12.8.1 ఫ్రాన్సులో రాజకీయ భాగస్వామ్యం

ఫ్రాన్సులో ఏకకేంద్ర రాజ్యం (Unitary State). ఈ దేశంలో వివిధ స్థాయిలలో పయోజన ఓటింగ్ ప్రాతిపదికపై ప్రతినిధులు ఎన్నికవుతారు. నగర, పట్టణ పాలక సంస్థలకు, ప్రాంతాలకు (regions), ప్రాదేశిక పరిపాలన విభాగాలైన డిపార్ట్‌మెంట్‌లకు (Departments) కౌన్సిలర్లు (Councillors) కేంద్ర శాసన నిర్మాణ సంస్థలో భాగమైన సెనేట్ (Senate) నేషనల్ అసెంబ్లీ (National Assembly) లకు డెప్యూటీలు ఎన్నికవుతారు. వీరు కాకుండా దేశాధ్యక్షుడ్ని కూడా పౌరులు ఎన్నుకొంటారు. అంతేకాకుండా స్థానిక పరిపాలన సంస్థలైన కమ్యూనల్ కౌన్సిల్స్‌కు (Communal Councils) కౌన్సిలర్ల ఎన్నిక 6 సంవత్సరాలకొకసారి జరుగుతుంది. ఈ దేశంలో 3600 కమ్యూనల్ కౌన్సిల్స్, 100 డిపార్ట్‌మెంటల్ కౌన్సిల్స్, 22 ప్రాంతీయ కౌన్సిల్స్, ఇవికాక 4 ఓవర్‌సీస్ ప్రాంతాల కౌన్సిల్స్ (Overseas regions councils) ఉన్నాయి.

ప్రజానీకానికి పెద్ద ఎత్తున ఓటు హక్కు సమకూర్చిన మొదటి ఐరోపా దేశం ఫ్రాన్స్. 1848 సంవత్సరంలోనే ఈ దేశంలో 21 సంవత్సరాలు నిండిన పురుషులందరూ ఓటు హక్కు పొందారు. 1944 సంవత్సరంలో స్త్రీలకు ఓటు హక్కు లభించింది. 1974 సంవత్సరంలో ఓటరు కనీసవయసు 18 సంవత్సరాలకు తగ్గించబడింది. దీనితో 1974 లో 2.5 మిలియన్ల ఓటర్లు ఈ దేశంలో ఉండగా 1988 నాటికి ఓటర్ల సంఖ్య దాదాపు 40 మిలియన్లకు చేరుకొంది.

ఫ్రాన్స్‌లో మూడవ, నాలుగవ రిపబ్లిక్‌లు పనిచేసిన కాలంలో ఎన్నికలలో పోలైన ఓట్లశాతం అధికంగా ఉండేది. అయితే ఐదవ రిపబ్లిక్ కాలంలో (1958 నుండి) ఓటర్ల దృక్పథంలో మార్పు వచ్చింది. ఓటింగ్‌లో భాగస్వామ్య వ్యతిరేక వైఖరి (abstention) తల ఎత్తింది. ఈ ధోరణి రెఫరెండంలోను ఐరోపాపార్లమెంటు ఎన్నికలలో ఎక్కువగాను, అధ్యక్షుని ఎన్నికలో తక్కువగాను కనబడుతోంది. ఇతర ఎన్నికలలో మధ్యస్థ పరిస్థితి కనిపిస్తుంది. ఎన్నికలు వరుస క్రమంలో వచ్చినపుడు ఈ ధోరణి మరీ ఎక్కువవుతోంది. 1980 లో ఓటింగ్ వ్యతిరేక వైఖరి బాగా పెరిగింది. 1988లో జరిగిన శాసనసభ

ఎన్నికలలో 34.3% ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. 1988 లో New Caledonia లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు విషయంలో జరిగిన రెఫరెండంలో 63% పౌరులు ఓటు చేయలేదు.ఇక ఎవరు ఓటు చేయడం లేదనే విషయానికి వస్తే, వామపక్షాలకు మద్దతు ఇచ్చేవారిలో ఇతరులకంటే ఈ ధోరణి ఎక్కువగా ఉంది. కార్మిక వర్గాలకు చెందిన ఓటర్లలో కూడా ఈ వైఖరి బాగా ఉంది. ఈ శతాబ్దం ఏడోదశకం మొదలు ఓటర్లకు రాజకీయ పక్షాలలో నమ్మకం తగ్గింది. పౌరులు తమను తాము ఓటర్లుగా నమోదు చేసుకోవడంలో కూడా కొత్త పోకడలు పొడసూపాయి. 1986 లో 20 సం. రాల వయసున్న వారిలో 74% మంది మాత్రం ఓటర్లుగా నమోదయ్యారు. 24 సంవత్సరాల వయసున్న వారిలో 89% మంది తమను ఓటర్లుగా నమోదుచేసుకొన్నారు. అయితే 20 నుంచి 24 సంవత్సరాల వయస్సున్న వారిలో 68% మాత్రం 1986 లో ఓటుచేశారు. 35 సం. రాలుపైబడిన వారిశాతం, ఓటు హక్కు వినియోగించిన వారి శాతంకూడా ఎక్కువగా కనిపించింది. ఇటువంటివారు 90% ఉన్నారు. ఇక పట్టణప్రాంతాలలో ఓటుచేసిన వారిసంఖ్య తక్కువగాను, చిన్న పట్టణాలలోను, పల్లె ప్రాంతాలలోను వారి సంఖ్య ఎక్కువగా కనిపించింది.

ఫ్రెంచి పార్లమెంట్‌లో దిగువసభ అయిన నేషనల్ అసెంబ్లీ (National Assembly) ఎన్నికలలో 1978 లో ఒక్కొక్కస్థానానికి సరాసరి 9 మంది సభ్యులు పోటీచేయగా 1988 ఎన్నికల సంబంధిత సమావేశాలకు హాజరయిన పౌరుల సంఖ్య కూడా తగ్గింది. దీనితో పోటీచేసే అభ్యర్థులు స్థానిక పెద్దల (Local Motables) పై ఆధారపడటం ఎక్కువైంది. అంతేకాకుండా ప్రభావ వర్గాల ప్రతినిధుల ద్వారా కూడా తమ అభిప్రాయాలను ప్రచారంచేసుకొనే పద్ధతులకు అభ్యర్థులు ప్రాధాన్యమివ్వడం మొదలుపెట్టారు.

1958 లో అమలులోకి వచ్చిన, ప్రస్తుతం అమలులో ఉన్న ఐదో రిపబ్లిక్ రాజ్యాంగం రెఫరెండమ్ నిర్వహించడానికి అవకాశం కల్పించింది . 1979 నుంచి ఇప్పటి వరకు 18 సార్లు ఈ దేశంలో రెఫరెండమ్ జరిగింది. 5వ రిపబ్లిక్ అవతరణకు ముఖ్యకారకుడైన జనరల్ డీగాల్ (General De Gaulle) అయిదు పర్యాయాలు రెఫరెండమ్ ప్రతిపాదించాడు. ఈ దేశంలో జరిగిన రెఫరెండమ్‌లలో పాల్గొనని పౌరులశాతం 1958 లో 15.1% కాగా ఇది 1988 నాటికి 63.0% కి చేరుకొంది. మొదట్లో ప్రత్యక్ష ప్రజాస్వామ్య సాధనంగా రెఫరెండమ్ అధిక ప్రాముఖ్యం సంతరించుకొంది. కానీ క్రమంగా దీనిలో ఓటుచేయడం పట్ల ఫ్రెంచ్ ప్రజలలో వ్యతిరేకవైఖరి పెరిగింది.

ఫ్రాన్స్‌లో మూడో, నాలుగో రిపబ్లిక్‌లు పనిచేసిన కాలంలో అధ్యక్షుని ఎన్నిక పరోక్షంగా జరిగేది. 5 వ రిపబ్లిక్ అమలులోకి వచ్చిన కొద్ది సంవత్సరాలకు - అంటే 1965 నుంచి - అధ్యక్షుణ్ణి ప్రత్యక్షంగా ఎన్నుకోవడమనే పద్ధతిని అనుసరించడం మొదలైంది. ఫ్రాన్స్ ప్రజల రాజకీయ జీవితంలో అధ్యక్షుని ఎన్నిక అతిముఖ్య సంఘటనగా పరిగణించడం మొదలైంది. ప్రత్యక్ష ఎన్నిక ద్వారా అధ్యక్షుని ఎన్నుకోవడానికి పౌరులు సుముఖత వ్యక్తం చేశారు. ఈ కారణంగానే అధ్యక్షుని ఎన్నికలో ఓటింగ్ శాతం సాధారణంగా ఎక్కువ. రాజకీయ పార్టీలతో సాన్నిహిత్యం లేకుండా ప్రచార నిర్వహణ, ప్రచార స్వరూపం, నిర్వహణవైఖరిలో ఉన్నత స్థాయి. ప్రచార సాధనాలను విరివిగా వినియోగించుకోవడం, అనే ఔపచారిక ప్రచారం (informal Campaign) అధ్యక్షుని ఎన్నిక ప్రచార కార్యక్రమ ప్రధాన లక్షణాలు.

ఏ రాజకీయ వ్యవస్థలోనైనా కొందరు పౌరులు రాజకీయాలపట్ల ఎక్కువ ఆసక్తి చూపడం, కొందరు రాజకీయాలకు దూరంగా ఉండటం జరుగుతూనే ఉంటుంది. రాజకీయాలలో శ్రద్ధ చూపేవారెవరన్నా దాన్ని బట్టి రాజకీయ పదవులు పొంది, నిర్వహించేవారెవరో తెలుస్తుంది. రాజకీయ వ్యవస్థలలో రాజకీయ వర్గం (Political Class) ఒకటి ఉంటుందని, వీరిని అధికారం నిర్వహించే కులీనులుగా పరిగణించాలని (Power elite), వీరు అధికార నిర్వహణలో గుత్తాధిపత్యం వహిస్తారని మోస్కా (Mosca) పరేటో (Pareto), మిచ్చెల్ (Michels) వంటి శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు. ఫ్రెంచ్ రాజకీయాలలో స్థానిక పెద్దల (Local notables) పాత్ర గణనీయంగా ఉంటుంది. ఇక వయోపరిమితిచూస్తే మూడో రిపబ్లిక్‌లో 50 సంవత్సరాలకు పైబడిన వారి సంఖ్య ఎక్కువ. అయితే డీగాల్ రిపబ్లిక్‌లో యువకుల సంఖ్య (40 సం. లోపువారు) ఎక్కువ. 1981 లో పార్లమెంట్ సభ్యుల సగటు వయసు 43.9 సం. రాలయితే 1988 నాటికి ఇది 51 సంవత్సరాలుగా ఉంది. రాజకీయానుభవం ఫ్రెంచ్ రాజకీయాలలో ప్రాబల్యం పొందడానికి దోహదంచేసింది. శాసనసభ్యులకు, ఇతర ప్రజాప్రతినిధి సంస్థలకు ఎన్నికైన స్త్రీల సంఖ్య చాలా తక్కువ. పార్లమెంట్‌లో స్త్రీ సభ్యులశాతం 6 కు మించలేదు. 1879 నుంచి న్యాయవాదులు, డాక్టర్లు, పాత్రికేయులు, వ్యాపారస్థుల సంఖ్య శాసనసభలలో పెరిగింది. సివిల్ సర్వీసు ఉద్యోగులు కూడా పార్లమెంట్ సభ్యత్వానికి పోటీ చేయడం అధికమయింది.

12.8.2 అమెరికాలో రాజకీయ భాగస్వామ్యం

పరిపాలితులకు పరిపాలన సంబంధమైన నిర్ణయ ప్రక్రియలో పాల్గొనే హక్కుఉన్నదనే బలమైన నమ్మకం అమెరికా పౌరులలో కనిపిస్తుంది. ఈ సూత్రమే అమెరికాలో 1776 జరిగిన విప్లవానికి నాంది అయింది. అయితే ఈ దేశంలో నమోదయిన ఓటర్ల శాతం ఎన్నికలలో ఓటు చేసే వారి శాతం క్రమంగా తగ్గుతూ ఉండటం గమనించదగ్గ విషయం. ఓటు చేసే వారి సంఖ్యలో పెరుగుదలధోరణి 1 984-88 సంవత్సరాల మధ్య కొంత కనబడింది. 1968 లో వయోజనులలో నమోదయిన ఓటర్ల శాతం 70.3 కాగా 1978 నాటికి ఇది 62.6% మాత్రమే. కానీ 1988 నాటికి ఈ శాతం 66.6% కి చేరుకొంది. ఇక అధ్యక్షుని ఎన్నికలో ఓటు చేసిన వారిశాతం 1966 లో 55.4% అయితే 1978 కి ఇది 45.9% తగ్గింది. తరవాతి కాలంలో కొంతవరకు పెరిగింది. 1988 లో ఓటు హక్కు వినియోగించిన వారి శాతం 57.4%.

ఎన్నికలలో అభ్యర్థుల విజయాలను ప్రజల నుంచి వచ్చిన ఆదేశాలుగా, సమ్మతిగా రాజనీతివేత్తలు పరిగణిస్తారు. అయితే ఎన్నికైన అభ్యర్థులకు సాధారణంగా 50% కంటే తక్కువ ఓట్లే లభిస్తాయి. అధ్యక్ష ఎన్నికలలో అత్యధిక శాతం ఓట్లు పొందిన లిండన్ జాన్‌సన్ Lyndon Hohnson) కి ఓటర్లలో 37.8% మద్దతుమాత్రం పొందగలిగాడు. ఓటింగ్ మినహాయించి ఇతర రకాల భాగస్వామ్య కార్యక్రమాలలో పౌరులు పాల్గొనడం ఇంకా తక్కువగా ఈ దేశంలో కనిపిస్తుంది. ఇతరులను ఓటుచేయడానికి ఒప్పించడం, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం, ఎన్నికలలో పోటీచేయడం వంటి కార్యకలాపాలలో పౌరులు ఓటింగ్‌లో కంటే తక్కువ శ్రద్ధ చూపడం ఈ దేశంలో కనిపిస్తుంది. అయితే రాజకీయ సంబంధమైన విషయాలు తెలుసుకోవడం పట్ల తగినంత శ్రద్ధ, ఆసక్తి పౌరులలో ఉండటం గమనించాల్సిన విషయం. ఈ వైఖరి 1965-75 సంవత్సరాల మధ్యకాలంలో ఎక్కువగా కనిపించింది.

రాజకీయ జీవనంలో పౌరులు ఎంతవరకూ పాల్గొంటారు, ఏవిధంగా పాల్గొంటారు అన్న విషయాలు వ్యవస్థ సామాజిక పరిస్థితులపై కొంతవరకూ ఆధారపడి ఉంటాయి. అంతేకాకుండా పౌరుల జీవితానుభవ ప్రభావం కూడా రాజకీయ భాగస్వామ్యంపై ఉంటుంది. ఈ దేశంలో ఇతర దేశాలలో వలెనే వయసు ప్రభావం ఓటింగ్ పైఖరిపై కనిపిస్తుంది. సాధారణంగా 30 సంవత్సరాలకు పైబడి వారిలోను 60 సం. రాలలోపు వయసు వారిలోను ఎక్కువస్థాయిలో ఓటింగ్ చేయడం ఉంది. 30 సంవత్స రాలలోపువారు, 65 సంవత్సరాలు దాటినవారు ఓటింగ్‌పట్ల తక్కువ శ్రద్ధ కనబరిచారని పరిశోధనలు వెల్లడిచేశాయి. అయితే ఇతర పరిస్థితుల ప్రభావం ఓటింగ్ పై లేదని చెప్పలేము. పంటరిగా నివసించేవారి ఓటింగ్ శాతం తక్కువగాను, ఒక కుటుంబంలో నివసించే వారిలో ఈ శాతం ఎక్కువగాను ఉన్నట్లుగా గమనించడం జరిగింది. విద్యాధికులు ఎక్కువగా ఓటుచేయడం, తక్కువస్థాయి విద్య పొందిన వారిలో ఓటింగ్ శాతం తక్కువగాను కనబడింది. ఉదాహరణకు, గ్రేడ్ స్కూల్ విద్య పొందిన వారిలో ఓటింగ్ శాతం 1952 లో 62.1% కాగా ఉన్నత స్కూల్ (High School) స్థాయివరకు చదివిన వారిలో ఈ శాతం 80% కళాశాల స్థాయివరకు చదివిన వారిలో ఈ శాతం 89.5%, 1988 లో గ్రేడ్ స్కూల్ వరకు చదివినవారిలో 41.7% మంది ఓటు చేశారు. ఉన్నత స్కూల్ స్థాయి వరకు చదివిన వారు 58.2% ఓటు చేశారు. కళాశాలస్థాయి వరకు చదివినవారు 82.4% ఓటు చేశారు. ఇక మధ్యంతర ఎన్నికలలో ఇతర ఎన్నికలలో కంటే ఓటు చేయడంలో పౌరులు తక్కువ ఉత్సాహం కనబరిచారు. అమెరికాలో ఆర్థిక పరిస్థితులు ఓటర్ల ప్రవర్తనపై ప్రభావం చూపినట్లుగా చెప్పవచ్చు. సంపన్నులు రాజకీయ కార్యకలాపాలలో ఎక్కువ శ్రద్ధ కనబరచగా, సంపన్నులు కానివారు తక్కువ శ్రద్ధ కనబరిచింది. ఈ దేశంలో ప్రభుత్వోద్యోగులు ఎక్కువ సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. రాజకీయ విషయ పరిజ్ఞానం, పత్రికలు, ఇతర సాధనాల ద్వారా రాజకీయాలను గురించి అవగాహన, పౌర బాధ్యతల నిర్వహణపట్ల ఆసక్తి మొదలైనది. ఈ ధోరణికి కారణాలుగా చెప్పబడుతున్నాయి. నిరుద్యోగం రాజకీయాలలో భాగస్వామ్యంపై వ్యతిరేక ప్రభావం కనబరిచింది. రాజకీయ జీవనం నుంచి వైదొలగడం, వ్యక్తిగత అవసరాలు, విషయాలపట్ల కేంద్రీకరణ వీరిలో కనబడింది. ఓటర్లుగా నమోదు చేసుకోవడంలోను, ఓటు హక్కు వినియోగించడంలోను శ్వేత జాతీయులలో కంటే నల్లజాతీయులలో (Blacks) తక్కువ ఆసక్తి ఉంది. ఓటు హక్కు వినియోగించడంలో పురుషులకంటే స్త్రీలు వెనకబడి ఉన్నారు. అంతేకాకుండా ఎన్నికలలో ఓటుచేసే మహిళల సంఖ్య కూడా తక్కువ.

పై విషయాలనుబట్టి సమాజంలో పౌరుల హోదా (Social Status) ముఖ్యంగా విద్యావిషయక హోదా ప్రభావం రాజకీయాలలో పౌరుల భాగస్వామ్య స్వరూప స్వభావాలను నిర్ణయిస్తుంది. వృత్తి ప్రాతిపదికగా తేడాలు, జాతి, వర్ణం, (Race) ల వైవిధ్యాలు రాజకీయాలలో భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అంతేకాకుండా మానసిక పరిస్థితుల ప్రభావం కూడా రాజకీయాలలో భాగస్వామ్యం పై తగినంతగా ఉంటుంది. అమెరికా పౌరులు కొందరు తమను తాము స్ట్రాంగ్ డెమోక్రాట్స్ (Strong Democrats) లేదా స్ట్రాంగ్ రిపబ్లికన్స్ (Strong Republicans) గా పరిగణించుకోవడానికి, మరికొందరు సాధారణ మద్దతుదారులుగా ఉండటానికి మానసిక స్థితి కొంతవరకు కారణమని చెప్పాలి. ఇటీవలికాలంలో అమెరికా పౌరులలో రాజకీయ నాయకులపట్ల నమ్మకం తగ్గడం, రాజకీయాలపట్ల నిర్లిప్తత పెరగడం గమనించవచ్చు.

రాజకీయ వాతావరణ ప్రభావం రాజకీయాలలో భాగస్వామ్యంపై ఉంటుందని గ్రహించాం. ఎన్నిక వ్యవస్థ, ఎన్నికలలో పాల్గొనడంలో ఓటర్ల అర్హత, ఎన్నికల నియమనిబంధనలు, ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల స్థితిగతులు, ప్రజాసమస్యలు వంటివి రాజకీయ వాతావరణంలో అంతర్భాగాలవుతాయి. అంతే కాకుండా రాజకీయ ప్రచారం, విధాన సంబంధమైన అజెండాలు, ప్రసార సాధనాలు, రాజకీయాలలో భాగస్వామ్యంపై ప్రభావం చూపుతాయి. క్లుప్తంగా చెప్పాలంటే రాజకీయాలలో భాగస్వామ్యంపట్ల ఉత్సాహం చూపితే కొన్ని నిరుత్సాహాన్ని పెంచుతాయి. ఎన్నికల వ్యవస్థ ఏర్పడిన ప్రారంభ దశలో సాంప్రదాయక రీతులలో పాల్గొనడం ఉండి ఉండవచ్చు. పెరగడం కూడా, జరిగి ఉండవచ్చు. ప్రజాసమస్యల పరిష్కారం, సమాజంలో ఉద్రిక్తతల సడలింపు జరిగినప్పుడు భాగస్వామ్యం తగ్గవచ్చు. టెలివిజన్, ఇతర ప్రసార సాధనాల కృషి ప్రభుత్వం, రాజకీయ వేత్తలు, రాజకీయ ప్రక్రియ (Political Process)లపై చెప్పదగిన ప్రభావం చూపింది.

ప్రభుత్వ నిర్మాణం, చట్టాలు, నియమనిబంధనలు అమెరికా పౌరుల రాజకీయ జీవనంపై ప్రభావం చూపాయి. ఈ దేశంలో ఫెడరల్ వ్యవస్థ ఉండటంతో పౌరులు ప్రభుత్వోద్యోగులకు తమ అభిప్రాయాలు తెలియజేసే అవకాశాలు ఎక్కువగా ఏర్పడ్డాయి. ఫెడరల్ వ్యవస్థ ఏర్పాటు ఫలితంగా వివిధ స్థాయిలలో ఎన్నికలు జరిగే అవసరం కలగడంతో పౌరులు ఎన్నికలలో పాల్గొనే అవకాశం ఏర్పడింది. ప్రభుత్వ నిర్మాణ స్వరూపం ప్రజలకు ప్రవేశస్థానాలను (access points) ఎక్కువ చేసింది. దీనితో ప్రభుత్వ విధాన ప్రక్రియను ప్రభావితంచేసే ప్రయత్నాలు పెరిగాయి. వ్యవస్థాగతమైన ప్రయోజనాలు (Organisational interests) చురుకుగా పనిచేయడంతో ప్రభావ వర్గాల ప్రాముఖ్యం పెరిగింది.

రాజకీయాలలో భాగస్వామ్యం పౌరుల అభిప్రాయాలపైన, నమ్మకాలపైన, తమపట్ల, వ్యవస్థపట్ల దృక్పథంపైన ప్రభావం చూపాయని అమెరికాలో జరిగిన పరిశోధనలు వెల్లడి చేశాయి. భాగస్వామ్య సామర్థ్యం సంఖ్యాపరంగా మాత్రమే నిర్ణయించడం సమంజసం కాదని, స్వభావ పరంగా లేదా గుణ పరంగా కూడా పరిగణించాలని అమెరికన్‌లు నమ్ముతారు. తమశక్తి యుక్తులపై అత్యంత విశ్వాసం ప్రకటిస్తారు.

12.9 భవిష్యత్తులో రాజకీయ భాగస్వామ్యం : వర్ధమాన దేశాలు

ప్రపంచంలోని వర్ధమాన దేశాలలో రాజకీయాలలో పౌరుల భాగస్వామ్యం పెరుగుతుందని రాజనీతి శాస్త్రజ్ఞులు అంచనా వేశారు. అభివృద్ధి చెందిన దేశాలలో కూడా ఆర్థికంగా తక్కువ స్థాయిలో ఉన్నవారు, తక్కువ స్థాయిలో సమీకృతమైన వారు కూడా ఎక్కువగా పాల్గొంటారన్న భావన ఉంది. అంతేకాకుండా వర్గం, గ్రూపు ప్రయోజనాల ప్రాతిపదికపై భాగస్వామ్యం పెరుగుతుందని, కుటుంబము, తెగ, ప్రాంతం, జాతి, మతం వంటి వాటి ప్రాముఖ్యం తగ్గుతుందని కూడా భావించడం జరుగుతోంది. వర్ధమాన దేశాలలో మధ్యతరగతి ప్రాముఖ్యం, వారి భాగస్వామ్యం కూడా పెరిగే సూచనలను గుర్తించారు. ఆసియా, ఆఫ్రికా ఖండాలలో వలస వాద వ్యతిరేక పోరాటాలవల్ల సమీకృతమైన ప్రజానీకం లాటిన్ అమెరికాలో రాజకీయ, ఆర్థిక మార్పులవల్ల సమీకృతమైన ప్రజలు ద్విగుణీకృత ఉత్సాహంతో రాజకీయాలలో భాగస్వామ్యం కోరతారని, కార్మిక వర్గాలు ఒక బలమైనన

రాజకీయ శక్తిగా అవతరిస్తాయని అంచనా వేయడం జరిగింది. రాజకీయ ఆధునికీకరణతోబాటుగా రాజకీయాలలో భాగస్వామ్యం కూడా పెరుగుతుందని భావించడం జరిగింది.

ఆచరణలో రాజకీయాలలో భాగస్వామ్యం విషయంలో వివిధ ధోరణులు తల ఎత్తాయి, కాని ఆసియా, ఆఫ్రికా ఖండాలలో గత 2 దశాబ్దాలుగా రాజకీయాలలో భాగస్వామ్యం తగ్గింది. సబ్ సహారన్ ఆఫ్రికా (Sub-Saharan Africa) లో భాగస్వామ్య వ్యతిరేక వైఖరి కనిపిస్తున్నదని తెలుసుకొన్నాం. అధికార కేంద్రీకరణ, కో ఆప్షన్ పద్ధతి (Co-option Method) అణిచివేత వైఖరి, సైనిక పాలనలు భాగస్వామ్య వ్యతిరేక ధోరణులకు ఉదాహరణలు. ఇటువంటి ధోరణులు బర్మా, బంగ్లాదేశ్, ఇండోనేషియా, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్, సింగపూర్‌లలో కనిపించాయి. లాటిన్ అమెరికాలోని ప్రజాస్వామ్య సంప్రదాయాలకు ప్రాధాన్య మిచ్చే చిలీ (Chile), ఉరుగ్వే (Uruguay), బ్రెజిల్ (Brazil), అర్జెంటీనా (Argentina), పెరూ (Paru) వంటి దేశాలలో పౌరులకు ఎన్నికలలో పాల్గొనే అవకాశాలు పోవడం ఇతర రకాల భాగస్వామ్య రూపాలలో పాల్గొనే అవకాశం తగ్గడం గమనార్హం. అయితే లాటిన్ అమెరికాలోని డొమినికన్ రిపబ్లిక్ (Dominican Republic), వెనుజులా (Venuzuela), కొలంబియా (Columbia) లలో ప్రజాస్వామ్య వ్యవస్థలు పనిచేస్తున్నాయి. జమైకా (Jamica) కోస్టరీకా (Costa Rica) లలో ఉన్నత స్థాయి భాగస్వామ్య వ్యవస్థలున్నాయి. ఆసియాలో ఇండియా, శ్రీలంక, ప్రజాస్వామ్య వ్యవస్థలు నిర్వహిస్తున్నాయి. థాయిలాండ్ (Thailand), మలేషియా, (Malysia) లలో అర్ధ ప్రజాస్వామ్య వ్యవస్థల ఏర్పాటు కొనసాగుతోంది. ఇక స్పెయిన్ (Spain), పోర్చుగల్ (Portugal), గ్రీన్, (Greece)లు ప్రజాస్వామ్య వ్యవస్థలు నెలకొల్పుకొన్నాయి.

వర్ధమాన దేశాలలో ప్రజాస్వామ్య వ్యవస్థల పునర్నిర్మాణ ప్రయత్నాలు భవిష్యత్తులో ఆశాజనకమైన పరిణామాలు ఏర్పడటాన్ని సూచిస్తాయి. ఈ దేశాలలోని రైతాంగ పోరాటాలు (ఉదాహరణకు వియత్నాంలో జాతీయ తిరుగుబాటుకు రైతాంగం మద్దతు, భారతదేశంలో రైతాంగ పోరాటాలు) వీరిని అంటే రైతాంగాన్ని నిర్లిప్తత వహించే పౌరులుగా పరిగణించరాదన్న విషయాన్ని వెల్లడిచేశాయి. వీరుకాక పట్టణ ప్రాంతాలలోని వ్యాపారులు లాటిన్ అమెరికా, ఆసియా దేశాలలో ముఖ్యమైన రాజకీయ వర్గంగా పరిగణించబడుతున్నారు. రాజకీయాలలో వీరి భాగస్వామ్యం లాంఛన ప్రాయమైన క్రమంలో (formal process) లోగాక వివిధ లాంఛనేతర నిర్మాణాల ద్వారా ప్రాముఖ్యం సంతరించుకొంది. వీరుగాక గ్రామం, వృత్తి, నివాసం ప్రాతిపదికగా ఏర్పడిన ప్రయోజన వర్గాలు రాజకీయాలలో చురుకైన పాత్ర వహిస్తూ ఉండటం కూడా గమనించవచ్చు. అంతేకాకుండా జాతిపరంగా ఏర్పడిన సంఘాలు (ethnic associations) ఆఫ్రికాలోని నగరాలలో చురుకైన లాబీ వర్గాలుగా పనిచేస్తాయి. లబ్ధి దాత - లబ్ధిదారు (Patron - Client) భావన వర్ధమాన దేశాలలో - ఉదాహరణకు శ్రీలంకలో పెంపొందింది.

12.10 రాజకీయ భాగస్వామ్యం : నిర్ణాయకాలు

ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన రాజకీయ, తదితర మార్పుల అవగాహన రాజకీయాలలో ప్రజల భాగస్వామ్యం గురించిన అధ్యయనంలో నిర్ణాయకాల మార్పు అవసరాన్ని సూచిస్తాయి. అవి:

1. సాంఘిక, ఆర్థిక హోదా రాజకీయాలలో పాల్గొనడం పై ప్రభావం చూపుతుందికాని, దాని ప్రభావం ఈ శతాబ్దం 6వ దశకంలలో తరవాత కొంత బలహీనమైంది.

2. యూనియన్‌లు, పార్టీలు, సంఘాలలో సభ్యత్వం ప్రభావం నేటి కాలంలో పెరిగింది. దీని ప్రభావం భాగస్వామ్య రూపాలపై కూడా ఉంటుంది.

3. ప్రత్యేక వర్గంతో సంబంధం ఉన్నట్లుగా పౌరులు గుర్తించడం - అంటే జాతి, మత, బాష, ప్రాంతీయ వర్గాలతో సంబంధమున్నటువంటి గుర్తింపు రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

4. సాధారణంగా స్త్రీలు రాజకీయాలలో పాల్గొనే శాతం, స్థాయి పురుషులకంటె తక్కువ. అయితే ఈ వ్యత్యాసం సన్నగిల్లుతున్నది. వీరు ఒక బలమైన రాజకీయ శక్తిగా పనిచేయడం మొదలు పెట్టారు. అందువల్ల వీరి భాగస్వామ్య లక్షణాలను, స్వరూపాన్ని తెలుసుకోవాల్సి ఉంది.

5. ప్రతి ఘటన, హింసాత్మక చర్యలు నేడు అనుసరణీయ భాగస్వామ్య వ్యతిరేక లక్షణాలుగా పరిగణించబడటంలేదు. వీటిని కూడా అధ్యయనం చేయడం అవసరం.

6. నైతాంగం, మధ్య తరగతి వర్గాలు, పీడిత వర్గాల పాత్ర కూడా ముఖ్యమైన విషయంగా పరిగణించాల్సి ఉంది.

రాజకీయాలలో పౌరులు పాల్గొనేస్థాయి, స్వరూపం ఎప్పుడూ ఒకే విధంగా ఉండకపోవచ్చు. అంటే హెచ్చు తగ్గులకు అవకాశముంది. కొన్ని దేశాలలో ఉద్రిక్తతల ఫలితంగా హింసాత్మక కార్యక్రమాలలో పాల్గొనడం గమనించవచ్చు. పాల్గొనడంలో స్థాయిలు గమనిస్తే ఓటింగ్‌లో తక్కువ స్థాయిలో పాల్గొనడం, ఇతర రాజకీయ కార్యకలాపాలలో ఎక్కువ స్థాయి ఉండవచ్చు. ఈ రకమైన పరిస్థితి ఉన్న దేశాలకు ఉదాహరణ అమెరికా, ఓటింగ్ అధికశాతం ఉండే భారత దేశం, శ్రీలంక వంటి దేశాలలో ఇతర స్థాయిలలో పాల్గొనే వారి సంఖ్య తక్కువ. కీన్యా, ఉగాండా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో స్వాతంత్ర్యానికి కొద్ది సంవత్సరాల క్రితం, కొద్ది సంవత్సరాల తరవాత చెప్పుకోదగిన విధంగా పౌరులు రాజకీయాలలో పాల్గొన్నారు. రాజకీయాలలో పాల్గొనడానికి సంబంధించిన స్థాయికి, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి స్థాయికి పొంతనలేక పోవచ్చు. ఉదాహరణకు, ఆసియాలోని కమ్యూనిస్టు రాజ్యాలలో హెచ్చు డిగ్రీలో సమీకృతమైన రాజకీయాలలో పాల్గొనడం కనిపిస్తుంది. చైనా దీనికి ఉదాహరణ. భారతదేశ, టర్కీ వంటి దేశాలలో అభివృద్ధి చెందిన ప్రాంతాలలో కంటే అభివృద్ధి చెందిన అమెరికాలో పశ్చిమ వర్జీనియా రాష్ట్రంలో తక్కువ స్థాయిలో అభివృద్ధి ఉన్నప్పటికీ ఓటింగ్ మాత్రం ఎక్కువ. ఇక ప్రాంతీయ విషయాలను మరి కొంత వివరంగా పరిశీలిస్తే పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో రాజకీయాలలో పాల్గొనే స్థాయిలలో భేదం కనిపిస్తుంది. పట్టణ ప్రాంతాలలోకంటే గ్రామీణ ప్రాంతాలలో సాధారణంగా ఓటింగ్ శాతం ఎక్కువగా ఉంటుంది. ఇవికాక విద్యార్హతలు, ఆర్థిక స్తోమతల ప్రభావం పౌరుల రాజకీయ కార్యకలాపాలపై కనిపిస్తుంది. భారతదేశంలో వీటితోబాటుగా కులప్రభావం గణనీయంగా ఉంది, సమాజంలో ఉన్నత హోదాగలవారు ధైర్యం పుంజుకోవడమేకాకుండా విజయావకాశాలు ఎక్కువ ఉండే వీలుంది. భారతదేశంలో జాతీయ స్థాయి రాజకీయాలలో చురుకుగా

పాల్గొనడానికి విద్యావంతులు ఎక్కువగా ముందుకు రావడం కనిపిస్తుంది. అయితే స్థానిక స్థాయిలలో పాల్గొనడంలో ఉన్న విద్యావంతులే కాకుండా ఇతరులు కూడా ముందుకు రావడం గమనించవచ్చు. పౌరుల రాజకీయ ప్రవర్తనకు, రాజకీయాలలో పాల్గొనడానికి సంబంధించిన ఎటువంటి పరిశీలన అయినా వీటికి కారణాలైన ప్రేరణలను, గమ్యాలను, అవసరాలనే కాకుండా పాల్గొనడానికి ప్రతిబంధకాలుగా నిలిచే పరిస్థితులను, విషయాలను కూడా అధ్యయనం చేయాలి. అప్పుడే వాస్తవాలు వెలికితీయడానికి వీలవుతుంది.

— డా. పి. మాణిక్యాంబ

12.11 చదువదగిన పుస్తకాలు

1. Milbrath L.W. : Political Participation, Chicago, Rand MC Nally, 1965
2. Parry G. (Ed.) : Participation in Politics, Manchestor, Manchester University Press, New Jersey, 1972
3. Verba S. and Nie N.H : Participation in America, Political Democracy and Social Equality, New York, Harper and Row, 1972.
4. Niwe N.H. and Kim J.O. : Participation and political equality; A seven nation comparison, Cambrige, Cambrige University Press, 1978
5. Michael Ruth & Philip Althrofb : An Introduction to Political Sociology, Thomas Nelson and Sons Ltd. London, 1971.
6. David L. Sills, , (Ed,) : International Encyclopaedia of Social Sciences, The Macmillan Company, Free Press, New York, 1968, Vol. II
7. Huntington P.S. and Nelson John M. : No Easy choice, Political Participation in Developing Countries, Harvard University Press, Massachusetts, 1976
8. Mibrath L.W. & Goel M.L. : Political Participation How and why people get involved in Politics, Chicago, Rand, MC Nally, 1977
9. David F. Ruthand Frank L. Wilson : The Comparative Study of politics, Prentice Hall, Inc. Engle wood chiffs New Jersay, 1980

12.12 నమూనా పరీక్ష ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. రాజకీయ భాగస్వామ్యమును నిర్వచించి వివిధ రీతులను చర్చింపుము.

2. రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రభావిత పరచే కారకాలను విశ్లేషింపుము.

3. వర్ధమాన దేశాలలో రాజకీయ భాగస్వామ్య భవిష్యత్తును చర్చింపుము.

4. రాజకీయ భాగస్వామ్య పు నిర్ణాయకాలు ఏమిటి

******

ఖండం - IV : అధికారం

ఆధునిక రాజనీతి శాస్త్రంలో శక్తి, అధికారం చాలా ప్రధానమైన అంశాలు. అధికారం ఎలా ప్రాప్తిస్తుంది. దాన్ని ఏ విధంగా ఉపయోగిస్తారు పరిణామాలు ఎలా ఉంటాయి ఈ ఖండంలో అధ్యయనం చేస్తాం.

భాగం-13 : రాజ్యస్వభావం, శక్తి, శాసనబద్ధత

విషయక్రమం

13.1 లక్ష్యాలు

13.2 పరిచయం

13.3.0 రాజ్యం : నిర్వచనాలు

13.3.1 సంప్రదాయ నిర్వచనాలు

13.3.2 ఆధునిక రాజ్యం : నిర్వచనం

13.4 రాజ్య లక్షణాలు

13.5 రాజ్య ఆంగిక స్వభావం

13.6 స్పెన్సర్ : అంగాంగిక సిద్ధాంతం

13.7 ఆంగిక సిద్ధాంత మూల్యాంకనం

13.8 అధికారం - చట్టబద్ధత

13.9 రాజనీతి శాస్త్రంలో అధికార భావన

13.10 మార్క్స్ దృక్పథం

13.11 రాజకీయ బద్ధత, ప్రభావం, అర్థం

13.12 వెబర్ విశ్లేషణ

13.13 చట్టబద్ధత - అధికారం

13.14 చట్ట బద్ధత - సంఘర్షణ

13.15 చట్టబద్ధత - భావజాలం

13.16 చదువ దగిన పుస్తకాలు

13.17 నమూనా పరీక్షా ప్రశ్నలు

13.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- రాజ్యం, దాని ఆధునిక నిర్వచనం
- లక్షణాలు, ఆంగిక స్వభావం
- స్పెన్సర్ భావాలు
- రాజకీయ బద్ధత, చట్టబద్ధతల గురించి బాగా వివరించగలుగుతారు.

13.2 పరిచయం

గ్రీకులు రాజనీతి శాస్త్రమును మున్సిపల్ సైన్స్ (Municipal Science) గా భావించినట్లు ప్రొ. సీలే అభిప్రాయపడ్డారు. Romana Civitus అనే పదాలను సమానార్థకాలుగా (Polis) నే భావించారు. ప్రజా సంక్షేమాన్ని రాజ్యం విధిగా వీరు తెలిపారు. నేడు వాడుకలో ఉన్న 'స్టేట్స్' అనే పదం 'Status' నుంచి తీసుకొనడం జరిగింది. 'The Prince' గ్రంథంలో State అనే పదాన్ని మాకియవెల్లీ (Machiavelli) ప్రథమంగా ఉపయోగించారు.

దురదృష్టవశాత్తు రాజ్యం అనేపదం (State) జాతికి (Nation) (Society) సమాజానికి, దేశానికి (Country) ప్రభుత్వం (Government) పర్యాయపదాలుగా ఉపయోగించడం జరుగుతోంది. ఈ విధమైన వాడుక పరస్పర భావ వైరుధ్యానికి దోహదం చేస్తుంది. రాజ్యమనేది రాజకీయంగా వ్యవస్థీకృతం చేసిన వ్యక్తి లేదా సమూహం. అందరి సామాన్య లక్ష్యాలు, పురోభివృద్ధికి, అవసరాల సంతృప్తి కోసంగా చెప్పవచ్చు. ప్రభుత్వమనేది రాజ్యం యొక్క అంత్యంత ముఖ్యమైన విభాగం మాత్రమే.

రాజ్యానికి శాశ్వత గుణముంటుంది. సమాజం (Society) అనే పదానికి రాజ్యం అనే పదాన్ని పర్యాయ పదంగా వాడటం జరుగుతోంది. సమాజం అనేది వ్యక్తుల సమూహంతోను, వారి సామాజిక సంఘటితులతోను కూడి ఉంటుంది. రాజ్యమనేది సమాజంలో నిర్దేశిత ప్రదేశ భాగమై ఉండి రాజకీయంగా వ్యవస్థీ కృతమై వారి ఉమ్మడి ప్రయోజనాలు పరిరక్షణ, పెంపుదల కోసం ప్రయత్నిస్తుంది.

13.3.0 రాజ్యం : నిర్వచనాలు

రాజ్యానికి సంబంధించిన నిర్వచనాలు అసంఖ్యాకంగా ఉన్నాయని చెప్పవచ్చు. ప్రతి రాజనీతి శాస్త్రవేత్త తన సొంత తరహాలో నిర్వచించాడు.

13.3.1 సంప్రదాయ నిర్వచనాలు

రాజనీతి శాస్త్ర పితామహుడైన అరిస్టాటిల్ ఈ విధంగా నిర్వచించాడు.

"సంతోషకరమైన, సంతృప్తికరమైన, స్వయం సమృద్ధి పూరితమైన స్థితికోసం, స్వచ్ఛందంగా కొన్ని కుటుంబాల కలయికతో కొన్ని గ్రామాలు మొత్తంగా ఏర్పడేదే రాజ్యం"

సిసిరో ఉద్దేశంలో:

అసంఖ్యాకులతో కూడిన సమాజం అనేది అందరి సాధారణ హక్కులు, ప్రయోజనాల నిమిత్తం పరస్పరం పాల్గొనటం ద్వారా ఏర్పడేది.

బోడిన్ 1576 లో రచించిన "దిరిపబ్లిక్" గ్రంథంలో కింది విధంగా రాజ్యాన్ని నిర్వచించాడు.

"అత్యున్నతాధికారం, హేతువుచేత పరిపాలించబడి కొన్ని కుటుంబాలు సంఘటితమై ఉండి వారి ఆస్తిపాస్తులు కూడా ఉండేటటువంటి స్థితి"

13.3.2 ఆధునిక రాజ్యం : నిర్వచనం

ప్రఖ్యాత ఆంగ్లేయ రచయిత హాలెండ్ అభిప్రాయంలో రాజ్యమంటే

అత్యధిక సంఖ్యాక ప్రజల సముదాయంతో సాధారణంగా నిర్దేశిత ప్రదేశాన్ని ఆక్రమించి అత్యధికుల అభిమతంతోను చెల్లుబాటుతోను ఉండేదిగా రాజ్యం.

Burgess defines it as a "Particular position of mankind viewed as organised unit"

Blunetsehli "The State is the Politically Organised people of definite territory"

నిర్వచనాల జాబితాను ఇంకా పొడిగించుకొంటూ పోతే నిర్వచనాలు అసంఖ్యాకంగానే ఉంటాయి. వాటిలోని ప్రధానాంశంగా ఉండే అంశాలు. రాజ్యం రాజనీతి శాస్త్రంలో ఒక భావనగా అయితే అధికులు లేదా అల్ప సంఖ్యాకులతోకూడిన ప్రజల సముదాయంగాను, శాశ్వతంగా ఆక్రమించుకొన్న ప్రదేశంతో, స్వతంత్రంగా వ్యవస్థీకృత ప్రభుత్వం కలిగి ఉండి, అత్యధికుల అభిమతంతో గుర్తించేదిగా ఉంటుందని చెప్పవచ్చు.

ఆధునిక రాజ్యానికి గల రాజకీయ, భౌతిక, ఆధ్యాత్మికమైన మూల సూత్రాలు కింది నిర్వచనం ద్వారా తెలియజేయడమైంది.

మొదటిది: అందరి ప్రయోజనార్థం, కొందరి సమూహంతో కూడిన ప్రజలు ఒక్కటిగా, సంఘటితంగా ఉండటం.

రెండోవది: నిర్దేశిత ప్రదేశంలో ఉండే ప్రజాసముదాయం

మూడోది: విదేశీ నియంత్రణ లేని స్వతంత్రత

నాలుగోది: అత్యున్నతాధికారంగల సంస్థ. దీని ద్వారా సమష్టి ఇచ్ఛ లేదా సమైక్యభావం అనేది వ్యక్తపరచటానికి, అమలు పరచటానికి అవకాశముండాలి.

13.4 రాజ్య లక్షణాలు

పై నిర్వచనాలను అనుసరించి రాజ్యానికి నాలుగు ప్రధాన లక్షణాలున్నాయని చెప్పవచ్చు.

(1) ప్రజలు (Population)

(2) ప్రదేశం (Territory)

(3) ప్రభుత్వం (Government)

(4) సార్వభౌమాధికారం (Sovereignty)

(1) ప్రజలు: రాజ్యం మానవ సంస్థ అని, మానవ సామాజిక జీవనం కోసం జనించిందని తెలుస్తుంది. మానవ సంస్థలన్నింటికి మూలం ప్రజలు. రాజ్యం ప్రజలకోసమే అవతరించింది. మానవుల సంఖ్య కొద్దిగానే ఉంటే దాన్ని రాజ్యమనటం జరగదు. కుటుంబంలోని సభ్యులకోసం రాజ్యం అనవసరం. జనసంఖ్య విషయంలో ఎటువంటి పరిమితి లేదు. అయినప్పటికీ రాజనీతి చరిత్రలో శాస్త్రజ్ఞులకు ఈ విషయం గురించి అభిప్రాయ భేదాలున్నాయి. ప్లేటో, అరిస్టాటిల్ చిన్న చిన్న రాజ్యాలను ఆమోదించారు.

గ్రీకు దేశంలో క్రీ.పూ. 4, 5 శతాబ్దాల మధ్య కాలంలో ప్రతి నగరాన్ని ఒక చిన్న రాజ్యంగానే పరిగణించారు. (ఏథెన్స్ (Athens), స్పార్టా (Sparta),) ప్లేటో తన ఆదర్శరాజ్యానికి జన సంఖ్య 5040కు మించకూడదని భావించాడు. అరిస్టాటిల్ కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తూ రాజ్యజనాభా మరీ ఎక్కువగాకానీ, మరీ తక్కువగాకాని ఉండకూడదని అభిప్రాయపడ్డాడు. చిన్న రాజ్యమైతే పాలన చక్కగా జరగటానికి, పెద్ద రాజ్యమైతే స్వయం పోషకంగా ఉండటానికి వీలుగా ఉంటాయని ప్రత్యక్ష ప్రజాస్వామ్యవాది రూసో, ఆదర్శరాజ్య జనాభా 10,000 లకు మించకూడదని అభిప్రాయపడ్డాడు.

(2) ప్రదేశం : రాజ్యానికి ప్రదేశం ఒక భౌతిక లక్షణం. భూమి విస్తీర్ణం రెండో అంశం. కొందరు గ్రంథకర్తలు భూభాగానికి ప్రత్యేక స్థానమివ్వక పోవడమేకాక దానిని పూర్తిగా ఉపేక్షించారు. జాన్ సీలీ రాజ్యానికి ప్రదేశం ముఖ్యాంశం కాదని వాదించాడు. ఒక సమాజమేర్పడి ప్రభుత్వాధికారం కింద వ్యవహరిస్తే అది రాజ్యమవుతుంది. రాజ్యమంటే మానవరాజకీయ సంఘమని విల్లోబీ (Willoughby) సంక్షిప్తంగా చెప్పాడు.

మానవుడు ఒక ప్రదేశంలో స్థిరపడి రాజ్యసభ్యత్వం పొందుతున్నాడు. ఒక ప్రదేశంలో నివాసాన్ని బట్టి ప్రధానంగా అతనికి పౌరసత్వం లభిస్తుంది. సాధారణంగా ఒక ప్రదేశంలో నివసించే ప్రజలకు అన్యోన్యత, సంఘీభావం ఉంటాయి. అవే దేశాభిమానాన్ని పాదుకొలుపుతాయి. అంతర్జాతీయ శాసనాన్ని అనుసరించి రాజ్యానికి ఒక నిర్ణీత ప్రదేశం చాలా ముఖ్యాంశం. పౌరసత్వ నియమం ప్రదేశాన్ని బట్టే జరుగుతుంది. ఒక దేశం సారవంతమై సీటివనరులు, ప్రకృతి సౌందర్యం, నదులు, పర్వతాలు, ఖనిజసంపద మొదలైనవి ఉంటే రాజ్యం దృఢంగా ఉంటుంది.

(3) ప్రభుత్వం : రాజ్య విధులను అమలు జరిపే సంస్థ ప్రభుత్వం. ప్రజలు కలిసి మెలసి ఉంటూ, క్రమజీవనం గడుపుతూ పరస్పర సహాయం పొందటానికి, వ్యక్తిత్వాన్ని పరిపూర్ణం చేసుకోటానికి ప్రభుత్వం తోడ్పడుతుంది. ప్రభుత్వ మనేది రాజ్యబాధ్యతలను నిర్వహిస్తుంది. రాజ్యానికి అంగం, సాధనం ప్రభుత్వం. రాజ్య ఆశయాలన్నీ ప్రభుత్వం ద్వారా నిర్వహించడమవుతుంది. ప్రజలను క్రమబద్ధంచేసి రాజ్య శాసనాలకు కట్టుబడి జీవించడానికి ప్రభుత్వం సహాయపడుతుంది. సామాన్యంగా ప్రభుత్వ మనేది మానవులందరికీ కావలసిన ముఖ్యమైన యంత్రాంగం. అవసరమైన శాసనాలు, చర్యలు దీని ద్వారానే చేయడం జరుగుతుంది. న్యాయం చేకూర్చడం జరుగుతుంది. న్యాయన్యాయాలను విమర్శించడం జరుగుతుంది. రాజ్యస్థిరతను పరిరక్షించడం జరుగుతుంది.

(4) సార్వభౌమాధికారం : రాజ్యాధికారానికి సార్వభౌమాధికారం చాలా ముఖ్యమైన లక్షణం. ప్రజలు, ప్రదేశం, ప్రభుత్వం ఉన్నంతమాత్రాన రాజ్యమవలేదు. సార్వభౌమాధికారం ముఖ్యలక్షణం. ఒక దేశంలో ప్రజలు బాహ్యాధికారానికి లోబడి ఉండక, స్వతంత్ర ప్రతిపత్తితో ఉండే దానిని రాజ్యమంటారు. ప్రపంచదేశాలతో సమాన ప్రతిపత్తి ఉండి, తన బాధ్యతలు స్వతంత్రంగా నిర్వహించుకొంటేనే రాజ్యమంటారు. నైసర్గిక పరిసరాలతో ఆంతరంగిక సార్వభౌమాధికారం, రాజ్యం గుత్తాధిపత్యం, సార్వభౌమత్వమంటే పైదేశాల అధికారానికి లోబడకుండా ఉండటమని అర్థం. ఆ ప్రదేశంలోని ప్రజలు ప్రభుత్వానికి విధేయులై ఉండటంకూడా సార్వభౌమత్వమే.

ఒక రాజ్యంలో ఒకే సార్వభౌమత్వానికి వీలుంటుంది. ద్వంద్వ సార్వభౌమాధికారముంటే అది రాజ్యంకాదు. 1947కు పూర్వం ఇండియారాజ్యంకాదు. అప్పటి వరకు బ్రిటీష్ సామ్రాజ్యంలో భాగమే కాబట్టి మన దేశాన్ని బ్రిటీష్ ఇండియా అనడం జరిగింది. ప్రస్తుతం దేశంలో ఉన్న 25 రాష్ట్రాలు రాజ్యంగా పరిగణనలోకి రావు. ప్రతిరాష్ట్రంలో ప్రజలు, ప్రదేశం, ప్రభుత్వం ఉన్నా సార్వభౌమాధికారం లేదు. ఇదే మాదిరిగా అమెరికాలలో 50 రాష్ట్రాలున్నా ఏ ఒక్క రాష్ట్రాన్ని రాజ్యమనడానికి వీలులేదు.

రాజ్యస్వభావ విషయంలోను, రాజ్యానికీ, వ్యక్తికీ మధ్య సంబంధం విషయంలోను అనేక పరికల్పనలున్నాయి. అందులో నాలుగు ముఖ్యమైన సిద్ధాంతాలు ప్రత్యేకంగా పేర్కొనతగినవి. మొదటిది - ఏకత్వ వాద (Monistic) సిద్ధాంతం. ఈ ఏకత్వ వాద సిద్ధాంత సమర్థకుల ప్రకారం రాజ్యంగా రూపొందే ప్రజలకు స్వతంత్రమైన అస్తిత్వం ఉండదు. ప్రతిది మరోదానిపైన, మొత్తం అన్నింటిపైన దాని అస్తిత్వం అవిచ్ఛిన్నంగా కొనసాగడానికి ఆధారపడి ఉంటాయి. వీరికి స్వతంత్ర ప్రతిపత్తి అంటూ లేదు. వాళ్ళు అయినదంతా, వాళ్ళ దగ్గర ఉన్నదంతా వారు అంగాలుగాఉన్న సంఘానికే చెందుతుంది. దీనికి పూర్తిగా విరుద్ధమైనది శుద్ధ వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతం (Purely Individualistic Theory) ఇది వ్యక్తుల సమూహమాత్రంగా భావిస్తుంది. వారిలో ప్రతి వ్యక్తి స్వతంత్రుడుగాను ఉంటాడు. దానితోబాటు ప్రతివ్యక్తి బలవంతుని ఆక్రమణ నుంచి బలహీనుని రక్షణకు గాను సామూహిక విరోధతతో ఉంటాడు. రాజ్యసహాయం లేకుండా జీవించగలడు. తనను తాను సంపన్నం చేసుకోగలడు. ప్రతివ్యక్తి, ఈ విధంగా స్వయం సంపన్నుడు. ఒక వ్యక్తి మరోవ్యక్తిపై ఆధారపడటమనేది లేదు. అతడు రాజ్య సహకారమనేది లేకుండా జీవించగలడు. ఈ విధంగా రాజ్యం రక్షకభటరాజ్య మవుతుందేకాని పోషణకు, అభివృద్ధికి మాత్రంకాదు.

రెండోది ద్వైతవాత సిద్ధాంతం (Dualistic Theory) ఇది ఏకత్వ వాద సిద్ధాంతానికి, వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతానికి మధ్య అవగాహనను కుదురుస్తుంది. ఈ సిద్ధాంతాన్ని అనుసరించి ప్రతి వ్యక్తి తనంతతాను జీవనం గడుపుకొంటాడు. అయితే ప్రతివ్యక్తి తన శ్రేయస్సుకోసమని ఇతరుపై ఆధారపడతాడు. అతని అస్తిత్వం సంపూర్ణంతో విలీనమైనట్లు కాదు, లేదా సామాజిక పరిసరాలనుంచి ఏకాకి కాదు, స్వతంత్రుడు కాదు. చివరిది ఆంగిక సిద్ధాంతం (Organic Theory) దీని ప్రకారం రాజ్యం అంగి మాదిరి ఏకతా సంపన్నమైనది అవుతుంది.

13.5 రాజ్య అంగిక స్వభావం (Organic nature of the State)

అంగిక సిద్ధాంతం రీత్యా రాజ్యాన్ని నిర్మించే వ్యక్తుల సమూహంతో రాజ్యానికి ఉన్న సంబంధం విభిన్న అంగాలకు అవయవాలకు, అంగికీ (శరీరానికి) ఉన్న సంబంధం వంటిది. ఒక అంగిలోని అన్ని అంగాలు క్రియాత్మకంగా సంబంధితాలు. ఏదీ మిగిలిన వాటి నుంచి ఏకాకిగా ఉండలేదు. ఒకే శరీరంలో మాదిరిగానే సాంఘిక సముదాయంలో కూడా ప్రాకృతిక ఏకత ఉంటుంది. సంపూర్ణ అంగీ తాలుకూ ఒక అంగంగానే చేయ జీవించ గలదు. శరీరం నుంచి ఖండిస్తే అది చైతన్యం కోల్పోతుంది.

ఈ విధంగా రాజ్య అంగాంగిక సిద్ధాంతం జీవశాస్త్ర సంబంధమైన ఒక భావన. ఇది రాజ్యాన్ని ప్రకృతి శాస్త్ర రూపంలో వర్ణిస్తుంది. ఇది రాజ్యాన్ని వ్యక్తుల సమిష్టిని అంగిలోకాని, మొక్కలోగాని ఉన్న కణాలతో సమానంగా చూస్తుంది. అంగితోను, దాని ప్రతి అంగాలతోను ఉన్న పరస్పరాశ్రయ రూపసంబంధాన్ని, సంఘంలోను, వ్యక్తులలోను అర్థిస్తుంది. మరో మాటలో చెప్పాలంటే పశు శరీరం జీవకణాలతో తయారైనట్లుగా రాజ్యం కూడా విభిన్న వ్యక్తులచేత నిర్మితమైంది.

చేతికి, శరీరానికి, ఆకుకు, చెట్టుకు ఉన్న సంబంధమే మనుష్యులకు, సమాజానికి ఉంది. మానవుడు సంఘంలో ఉన్నాడు. సంఘం అతనిలో ఉంది. రాజ్యం ఆవిధంగా ఒక అంగాంగి ఏకత, ఒక సజీవ ఆధ్యాత్మిక ప్రాణి.

రాజనీతి తత్వ విచారం ఎంత ప్రాచీనమైందో అంగిక సిద్ధాంతం కూడా అంతే ప్రాచీనమైంది. ప్లేటో రాజ్యాన్ని గొప్ప ఆకారమున్న మనిషితో పోల్చాడు. రాజ్యం మానవుల కృత్యాలమధ్య సామ్యాన్ని గుర్తించాడు. అతడు ఇట్లా అంటాడు. "సువ్యవస్థితరాజ్యం ఆకార విషయక సంఘటనంలో సిద్ధాంతరీత్యా అతి సన్నిహితంగా మనుష్యున్ని పోలి ఉంటుంది".

సిసిరో కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. మానవ శరీరాన్ని శాసించే ఆత్మతో రాజ్యాధిపతిని పోల్చాడు. మధ్యయుగాల రచయితలలోను, ఆధునిక కాలంనాటి రచయితలలోను ఈ సిద్ధాంతాన్ని విశేషంగా సమర్థించినవారు జాన్ ఆఫ్ శాలిస్‌బరి (John of Salisbury), మార్సిగ్లియో (Marsiglio), ఆల్తూసియస్ (Althusius) తదితరులు. హాబ్స్ (Hobbes), రూసో (Rousseau) లుకూడా ఈ సిద్ధాంతాన్ని కొంతవరకు సమర్థించారు. అయితే వీరిద్దరు చేసిన వివేచనాసవరణలు, పోలికలు బాహ్యమైనవే.

19 వ శతాబ్దం ప్రథమ భాగంలో సామాజిక ఒడంబడిక సిద్ధాంత (Social Contract Theory) క్షీణించడంతో రాజ్యం తాలూకూ అంగాంగి స్వరూప సిద్ధాంతానికి ఒక నూతనమూ, శక్తి మంతమూ అయిన అభివ్యక్తి ఏర్పడింది. ప్రాచీన, మధ్య కాలీన రచయితలు రాజ్యాల అంగాల మధ్య పాదృశ్యాన్ని తెచ్చారు. రాజ్యం ఒక అంగిని పోలుతుందని వారు పోర్కొన్నారు. కానీ 19వ శతాబ్దపు రచయితలు రాజ్యాన్ని అంగిగానే తలచారు. రాజ్యానికి ఈ అంగి అనే భావనని తేవడంతో వ్యర్థమైన వ్యాఖ్యానాలు చేశారు. ఉదాహరణకు, పోషణ వ్యవస్థ (Elementary System), నాడీ సంబంధమైన వ్యవస్థ (Nervous System), ప్రసరణ వ్యవస్థ (Circulatory System) మొదలైనవి సాదృశాలు. సమానతల ద్వారా అంగాంగి సిద్ధాంతం కొంత కాలానికి - రాజనీతి శాస్త్రం ప్రకృతి శాస్త్రం ద్వారా గ్రహించబడుతుందనే ఒక భయం కలిగే విస్తృత ప్రచారం జరిగింది.

రాజ్యం ఒక అంగి అనే ఈ కొత్త సిద్ధాంతం జర్మనీ దేశంలో పుట్టింది. బ్లంట్‌షెలీ రాతలలో ఈ సిద్ధాంత ప్రాచుర్యం తెలుస్తుంది. "రాజ్యంమానవీయ శరీరానికి కేవలం ప్రతికృతం" అని ఇతని అభిప్రాయం. అతడే ఇట్లా అంటాడు. "తైలచిత్రం కేవలం తైలబిందువుల సమూహాలకన్న కొంత అధికమైనది అవుతుందో అదే విధంగా ఒక శిలా విగ్రహం పాలరాతి శిలాశకలాల కంటే కొంత విశిష్టమైనది అవుతుందో మనుష్యుడెట్లా జీవాణువులు, రక్తకణాలు సముదాయంకన్న కొంత మహాత్మ్య మున్నవాడవుతాడో అట్లాగే జాతి కేవలం పౌరుల సముదాయం కన్న కొంత మహత్తరమైనదవుతుంది. రాజ్యం కూడా బాహ్య నియంత్రణలు సంగ్రహణం కంటె కొంత విశిష్టమైనదవుతుంది."

13.6 స్పెన్సర్ అంగాంగిక సిద్ధాంతం

ఆంగ్లేయ దార్శనికుడైన హెర్బర్ట్ స్పెన్సర్ చేతిలో రాజ్య అంగాంగిక సిద్ధాంతానికి సర్వోత్తమ వైజ్ఞానిక విపేచన లభించింది. స్పెన్సర్ సంఘం ఒక అంగి అని, ఏ ఆవశ్యకత తత్వంలోను, ఇతర అంగాలు వీటితోను భేదించదని నొక్కి చెప్పాడు. అంగిలోను, సంఘంలోను ఉండే గుణాల సమూహం వాటి విభిన్న భాగాలలో ఉండే శాశ్వత సంబంధాలు కూడా సమానాలేనని అంటాడు. రెండూ ఒకే వికాస ప్రక్రియను ప్రదర్శిస్తాయి. స్పెన్సర్ మతాన్ని అనుసరించి పశు, సాంఘిక శరీరాలన్ని.....జీవాణు రూపంలో ఉన్నాయి. ఆకారంలో అన్నీ సమానంగా ఉన్నాయి. అవి పెరుగుతున్న కొద్దీ, వికాస వంతమవుతున్న కొద్దీ ఆకారంలో ఒక అసమానత, జటిలతలు రాసాగాయి. వాటి వికాసాలు ఒకటిగానే ఉంటాయి. రెండూ సమానత నుంచి అసమానతకు, సరళత నుంచి జటిలతకు సాగనారంభించాయి. నిమ్నజాతి జంతువులన్నీ పూర్తిగా పొట్ట, శ్వాసావయవ భాగం, పెదవులతోనూ ఉంటే, ఆదిమ సంఘమంతా యోధులు, వేటగాళ్ళుగా ఉండేవారు. సంఘంలో జటిలత పెరుగుతున్నకొద్దీ శ్రమ విభజన దానిని అనుసరించింది. అంటే విభిన్న కృత్యాలతో కొత్త అంగాలు ప్రకటితం కాసాగాయి.

ప్రతి సంఘంలోను, అంగాల పరస్పరాశ్రయత ఉంది. చేయి భుజం మీద, భుజం శరీరం మీద, తలమీద ఆధారపడి ఉన్నట్లు సాంఘిక అంగి నిర్మాణంలోని భాగాలు ఒక దానిమీద ఒకటి ఆధారపడతాయి. ప్రతి అంగిదాని జీవనం కోసం దాని కృత్యాలను సంపూర్ణంగా నిర్వహించడానికి, సముచిత సమన్వయానికి, పరస్పర సంబంధానికి దాని అంగాలపైన ఆధారపడుతుంది. రోగ గ్రస్తమైన

ఒక అంగం ఇతర అంగాలవ్యవస్థితను, సముచిత కార్య నిర్వహణను ప్రభావితంచేసినట్లు సమాజంగా రూపొందిన వ్యక్తులు వారి సర్వోత్తమ లక్ష్య సాధనకుగాను అవిభాజ్య రూపంలో సంబద్ధ మయ్యాయి.

సంఘంలోని ఒక అంగానికి కలిగిన నష్టం శేషించిన సంఘాన్ని స్తంభింప చేసేటంతగా అంగాలన్నీ ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. సామాజిక అంగి నిర్మాణంలోని కమ్మరి పని ఆపినట్లయితే గనిలో పనిచేసే వారుగా నైతు, పంపిణీ దారు తమతమ కృత్యాలను సక్రమంగా నిర్వహించకపోతే దాని ప్రభావాన్ని అందరూ సహించాల్సి ఉంటుంది.

అదే విధంగా పశు అంగి (Animal Organism) కూడా దాని అంగాలు తమ కృత్యాలను నెరవేర్చ కపోతే సహించవలసి వస్తుంది. సంఘం, అంగం రెంటికీ నాశవినాశాలు, వాటి పునర్నిర్మాణం రెండూ ఉన్నాయి. జీవాణువులు రక్తకణాలు నశించి పునర్నిర్మాణమయ్యేటట్లు వృద్ధులు, దుర్బలు, రోగగ్రస్తులు చనిపోయినా కొత్తగా జన్మించే వారికి చోటు ఇస్తారు. దీని తరవాత సంఘం, అంగాలమధ్య ఆకారానికి సంబంధించిన కొన్ని సాదృశ్యాలను స్పెన్సర్ చూపాడు. అంగిలో కనిపించే జీవధారణ, పంపిణీ, నియామకం అనే మూడు విధానాలతో సమంగా సంఘంలో కూడా మూడు విధానాలున్నాయి. జీవధారణ ప్రణాళికలో నోరు, గళము, ఉదరము ప్రేవులు ఉంటాయి. ఈ ప్రణాళిక వల్లనే ఆహారం జీర్ణమవుతుంది. సంపూర్ణ శారీరక యంత్రం జీవించి ఉంటుంది. సంఘానికి సొంత జీవధారణ విధాన ముంటుంది. అది దాని ఉత్పాదక విధానం. దానిలో ఉత్పాదక ప్రాంతాలు వ్యావసాయక భూములు చేరతాయి. అంగిలోని పంపిణీ విధానంలో సిరలు, గుండె, ధమనులు, నాడులు ఉంటాయి. అవి శరీరంలోని అన్ని భాగాలకు రక్తాన్ని పంపిణీ చేస్తాయి. సంఘ నిర్మాణంలో వార్తాప్రసారం, రవాణా సాధనాలు అంగిలోని పంపిణీ విధానంతో సమానమవుతాయి. మానవ శరీరానికి సిరలు, ధమనులు ఏ ప్రయోజనాన్ని చేకూరుస్తాయో రహదారులు, రైల్వేలు, తంతి తపాలాలు సంఘానికి ఆవిధంగా ప్రయోజక కారులుగా ఉంటాయి.

చివరికి నియామక విధానం సంపూర్ణ దేహాన్ని నియంత్రించే మోటారు యంత్రాంగం (Nerve Motor Mechanism) వంటిది. రాజకీయ సంఘరూపమైన శరీరంలో ప్రభుత్వం వ్యక్తులను నియమిస్తుంది. వారి కార్య కలాపాలను నియంత్రణచేస్తుంది. ఈ విధంగా అది నియామక విధానానికి అనుగుణంగానే ఉంటుంది.

పై అంశాల ఆధారంగా స్పెన్సర్ (Spencer) రాజ్యమొక అంగి నిర్మాణమనే నిశ్చయానికి వచ్చాడు. అయితే ఈ రెండింటికీ సామ్యం సంపూర్ణమయిందికాదని ఆయనే స్వయంగా అంగీకరించాడు. రాజకీయ సంఘ శరీర నిర్మాణంలోను, పశు అంగి శరీర నిర్మాణంలోను అత్యంత వైషమ్యముందని తెలిపాడు. 'పశుఅంగి' ఆకారంలో దృఢత్వముంది. అందువల్ల సన్నిహిత సంపర్కంతో అందులోని భాగాలన్నీ అత్యంత సన్నిహితంగా నిబంధింప పడ్డాయి. వాటి ద్వారా ఒక ప్రగాఢమైన ఆకారం తయారైంది. దీనికి భిన్నంగా సాంఘిక శరీరం విచ్ఛిన్నంగా ఉంటుంది. దీని భాగాలన్నీ విడివిడిగాను, స్పష్టంగాను ఉంటాయి. లేదా సాంఘిక శరీరంలోని భాగాలు స్వచ్ఛందంగా ఉంటాయి.

స్పెన్సర్ అంగి నిర్మాణానికి, సాంఘిక దేహానికి మధ్య మరొక భేదాన్ని సూచించాడు. "సాంఘిక వ్యవస్థ ద్వారా లక్ష్యాలు సాధించుకోవాలనే ఆశయాన్ని ఇది ఎక్కువగా ప్రభావితం చేస్తుంది". కాబట్టి ఈ భేదం చాలా ముఖ్యమైందని ఇతడు అభిప్రాయ పడ్డాడు. సాంఘిక శరీరంలో "నాడీచేతన' ' ఉండదని అతడన్నాడు. అంటే శరీరంలో సజీవ శరీరంలో మాదిరిగా చేతనా కేంద్రం ఒక్కటే ఉండని అర్థం. అంగి నిర్మాణం మొత్తంలో ఒక నిశ్చిత ప్రదేశంలోనే చైతన్యం కేంద్రీకృతమై ఉంటుంది. సంఘంలో ఇది అంతటా వ్యాపించి ఉంటుంది. లేదా నిక్షిప్తమై ఉంటుంది. సంఘంలో ప్రతి సభ్య వ్యక్తికి తన సొంత చేతన ఉంటుంది. అనియతంగా అతడు తన కోసం కృత్యాలు నెరవేర్చుకొంటాడు. రాజ్యమనే జీవునికి, పశు అంగిక నిర్మాణం విషయంలో ఇంతగా మౌలికాంశాలలో అభిప్రాయ భేదమున్నప్పటికీ ఈ స్పెన్సర్ రాజ్యమొక అంగి నిర్మాణమనే తన సిద్ధాంతం నుంచి చలించలేదు. వాస్తవానికి ఆవిభేదాల ఆధారంగానే తన వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతాన్ని నిర్మించాడు. రాజ్యం వ్యక్తిని, తన శ్రేయస్సును పెంపొందించేందుకు విడిచిచేయాలి. సంఘ అస్థిత్వం దాని సభ్యుల శ్రేయస్సు కోసం కాని, సభ్యుల అస్థిత్వం సంఘ శ్రేయస్సుకోసం కాదని అన్నాడు.

ఆస్ట్రియన్ రచయిత ఆల్బర్ట్‌షాఫెల్ (Albert Schaffle) తరవాత ఈ సిద్ధాంతం దాని గౌరవం కోల్పోయింది. అతడు సంఘానికి, పశు శరీరానికి మధ్య శరీర వ్యవచ్ఛేద విద్యాశాస్త్ర (anatomy) ప్రాణ్యోషధి జీవన శాస్త్రం (Physiological) జీవశాస్త్రీయ (Biological) మనో వైజ్ఞానికాలైన పోలికలను చాలా దూరం సమర్థించాడు.

అంగిక సిద్ధాంతాన్ని విశేషించి సమర్థించిన వారిలో ఆగస్ట్‌కోమ్టే, ఫౌలీ (Fouillee), రెన్ వర్మ్స్ (Rene Worms) ఉన్నారు. కోమ్టే అంగినిర్మాణాన్ని అంగిక వికాసపు అత్యున్నత దశగా వర్ణించాడు.

13.7 అంగిక సిద్ధాంత మూల్యాంకనం

రాజ్యమొక అంగిక స్వరూపం అనే విషయంలో రెండు అంశాలున్నాయి. రాజ్య ఏకతను సమర్థించే ఈ అంగిక సాదృశ్యం అనుమానం లేకుండా ఒక ప్రయోజనాన్ని సాధిస్తుంది. రాజ్యం ఒక ప్రజా సమూహం మాత్రమేకాదు. ఇతరులపై ఆధారపడటమే దాని మనస్తత్వం. వ్యక్తులు ఒకరిపై ఒకరు ఆధారపడతారు. ప్రతి ఒక్కరి శ్రేయస్సు అందరి శ్రేయస్సుతోను ముడిపడి ఉంటుంది.

ఒక వేలునుకాని, చేతినికాని ఉపయోగిస్తూ ఉండగానే శరీరంనుంచి వేరుచేయనట్లు సమాజం నుంచి మానవుణ్ణి కూడా వేరుచేయలేం. అంగిక నిర్మాణ వలెనే రాజ్యానికి కూడా సామూహికంగా జీవముంటుంది. అందువల్ల సమాన లక్ష్యసాధన ప్రతివ్యక్తి తన కార్యాలను లేదా విధులను సముచితంగా నిర్వహించడంపై ఆధారపడి ఉంటుంది. ప్రతి పౌరుడు తన కుటుంబానికి, తన ఇరుగు పొరుగు వారికి తానొక ప్రమాణమైన సంఘానికి జవాబుదారీగా ఉంటాడు.

అనేక అంశాలలో సంఘం, అంగం మధ్యం పోలిక ఆద్యంతం కృత్రిమంగానే ఉంటుంది. అంగి నిర్మాణంలోని అణువులకు, సంఘాన్ని నిర్మించే వ్యక్తులకు పోలికకు వీలులేదు. ఆంగిక సిద్ధాంతం "రాజ్యం ఏమి చేయాలి" అనే దాన్ని పరిష్కరించటంలో సహాయ పడుతుంది. వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతాన్ని ఆధారంగా మాత్రమే తీసుకొంటుంది. జెర్లినిక్ ఈ సిద్ధాంతాన్ని తిరస్కరించడమే మంచిదని, ఈ సిద్ధాంతంలో ఉన్న అసత్యం నిజాన్ని కూడా వ్యతిరేకిస్తుందని వాస్తవం చెప్పాడు.

13.8 అధికారం - చట్ట బద్ధత

హాబ్స్ రచించిన మహాగ్రంథం "లెవియథాన్" (Leviathan) 1651 సంవత్సరంలో వెలువడిన ప్పటినుంచి అధికారం అనే భావన, జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలలో ఒక అత్యున్నతమైన పరిశీలనాంశంగాను, ప్రాథమిక అధ్యయనానికి మూలంగాను అయింది. రాజకీయాధికారం అనే భావం ఈ పదం యొక్క అర్థం; సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మనస్తత్వ పరిస్థితుల దృష్ట్యా నిర్వచించడం చాలా కష్టమైందని చెప్పవచ్చు. ఇటీవలి కాలంలో పదం రాజకీయ సిద్ధాంతాలలో ఎంతో ప్రాధాన్యం సంతరించుకొన్నది. దీనికి కారణం రాజనీతి శాస్త్రాధ్యయనంలో వచ్చినటువంటి అనేకమైన మార్పులే. ఒకనాడు రాజ్యం ప్రభుత్వ అధ్యయన ధ్యేయంగా ఆవిర్భవించిన ఈ రాజనీతి శాస్త్రం ప్రస్తుతం అధికారాన్ని అధ్యయనం చేసే పరిధికి విస్తరించింది.

మైకేల్ కర్టిస్ (Michael Curtis) మహాశయుని ఉద్దేశంలో "ఈ రాజనీతిశాస్త్రమనేది ఎన్నో విలువలతోను ఆలోచనలతోను, వ్యక్తులతోను సమ్మిళితమైనటువంటి ఒక సంఘటిత విధంగా" పేర్కొన్నాడు. ఈ రాజనీతి శాస్త్ర అధ్యయనం అధికారం ఏ విధంగా సంక్రమిస్తుంది, ఏ విధంగా నిర్వహించబడుతుంది, ఏ విధంగా ఉపయోగింపబడుతుంది అనే విషయాలను విశ్లేషించి వివరిస్తుంది. అంతేకాకుండా నిర్ణయాలు తీసుకోవడం, ఆ నిర్ణయాలను ప్రభావితం చేసే కారకాలను కూడా అధ్యయనం చేస్తుంది.

అధికారం అనే పదాన్ని కచ్చితంగా నిర్వచించడం ఎంతో కష్టం. ఈ భావనను అనేక మంది వివిధ రకాలుగా నిర్వచించారు. కార్ల్ జె. ఫెడరిక్ తన సిద్ధాంత వ్యాసమైన రాజ్యాంగబద్ధ ప్రభుత్వం ప్రజాస్వామ్యం (Constitutional Government and Democracy) లో అధికారాన్ని ఒక రకమైన మానవ సంబంధం (a certain kind of human relationship) గా అభివర్ణించాడు.

టానీ (Tanney), శక్తిని, వ్యక్తుల ప్రవర్తనా సరళిని ప్రభావితం చేయడానికి ఉపయోగించే ఆయుధంగా వివరించాడు. హాబ్స్ (Hobbes) వంటి రాజనీతిజ్ఞుడు కూడా దీనిని భావి మంచి ప్రవర్తన ప్రత్యక్షత లేదా సాక్షాత్కారంగా (Future apparent good) గుర్తించాడు. హెరాల్డ్ లాస్కీ దీనిని "ఒక ప్రభావంగా" (influence) వర్ణించాడు. చైనా కమ్యూనిస్టు నాయకుడు మావో ఉద్దేశంలో అధికారం తుపాకి నుంచి వెలువడే తూటా (Power flows from the barrel of the gun) గా భావించాడు. గాంధీజీ అధికారాన్ని సత్య సహితంగా, అహింసా యుతంగా ఉపయోగించాలని చెప్పాడు. ఆయన బలప్రయోగానికి ప్రత్యామ్నాయంగా అహింసను, శాంతిని ప్రబోధించాడు.

అధికారం అనే పదం వివిధ రీతులలో ఉపయోగింటంవల్ల ఈ పదానికి నిర్దిష్టమైన ఒక నిర్వచనాన్ని ఇవ్వలేం. అధికారం అనేక సందర్భాలలో విభిన్న అర్థాలతో చలమణీ అవుతుంది. ఉదాహరణకు, మనం తరుచు చెప్పుకొనే అశ్వశక్తి (Horse Power), ఆలోచనాశక్తి (Power of idea), ఆర్థిక శక్తి (Economic Power), సాంఘికశక్తి (Power of Social Status), స్వస్థతాశక్తి (Healing Power), మేధాశక్తి (Brain Power), కొనుగోలు శక్తి (Purchasing Power), నిర్వహణ శక్తి (Executive Power), సైనిక శక్తి (Military Power), ఇలా అనేకం వాడుకలో ఉన్నాయి. వీటన్నిటికీ మూలం ఈ "అధికారం"

అనే పదమే. ఈ పదానికి సమానమైన అర్థంగా సమర్థత (ability or capacity) అనే పదాన్ని ఉపయోగించటం జరుగుతుంది. ఆంగ్లంలో 'Power' అనే పదం లాటిన్ -- ఫ్రెంచి నుంచి తీసుకోవడం జరిగింది. కాబట్టి ఈ పదం అర్థం అనేక రకాలుగా ఉపయోగించగలం అనే విషయం విదితమవుతుంది.

సాధారణ మాటలలో చెప్పాలి అంటే ఈ అధికారం అనేది వ్యక్తి ప్రవర్తనను అనుకూలంగా నియంత్రించడానికి బాహ్యంగా ఉపయోగించే ప్రభావంగా చెప్పవచ్చు. అంతేకాకుండా ఈ పదం అర్థాన్ని పరస్పర మార్పులతో అనేక కథాంశాలకి సంబంధించి ఉపయోగిస్తున్నాం. అవి ఏవంటే నియంత్రణ (Control) ప్రభావం (Influence), బలం (Force) మొదలైన అంశాలలో ఈ పదం ఎక్కువగా వాడుకలో ఉంది. చాలా మంది రచయితలు ఈ అధికారం అనే పదాన్ని ప్రభావం (influence), బలం (Force) నియంత్రణ (Control) మొదలైన భావనలతో సరిసమానంగా చెబుతున్నారు.

మాక్స్‌వెబర్ (Max Weber) అభిప్రాయంలో "అధికారం, శక్తి అనే, విభిన్నపదాలు. శక్తి అనే పదంలో కనబడని రీతిలో చట్టబద్ధతకూడా ఉంది". అదే విధంగా బలం, అధికారం అనేవికూడా భిన్న పదాలే.

ఏది ఏమైనప్పటికీ అధికారం ఇతరుల ప్రవర్తనను ఒకని అభీష్టం మేరకు నిర్ణయించే సమర్థతగా చెప్పవచ్చు. ఒక వ్యక్తి ఇతరుల ప్రవర్తనను తన అభీష్టం మేరకు ప్రభావితం చేస్తాడు. వ్యక్తి స్వార్థ ప్రయోజనం, రాజభక్తి పొందడం మొదలైన అవలక్షణాలు ఈ విధమైన అధికారంపై ప్రభావం చూపుతాయి.

ఈ అధికారం (Power) నిర్వచించటంలో ఉన్నటువంటి విభిన్నత (Diversity) మూలంగా అధికార అధ్యయనం అంతాకూడా లోతు తెలియని ఊబి (Bottomless Swamp) గా రాబర్ట్‌ధాల్ వర్ణించాడు.

13.9 రాజనీతి శాస్త్రంలో అధికారం భావన (Power Theory in Political Science

హాబ్స్ రాజనీతి సిద్ధాంతంలో అధికార వాద సిద్ధాంతాన్ని చాలా గంభీకమైన, స్పష్టమైన భావంగా చెప్పడం జరిగింది. ఆయన చెప్పిన సహజ సిద్ధ భావన అదే మానవ స్వభావం (Nature of man) చాలా ప్రశస్తమైంది. మానవుడు సహజంగా అధికారాన్ని ఆశిస్తాడు. అత్యున్నతమైన అధికారాన్ని ఎల్లప్పుడూ అనుభవించాలని వాంఛిస్తాడు. హాబ్స్ మాటల్లో చెప్పాలంటే వ్యక్తిలో ఉండే ఈ అధికార అన్వేషణ (Search for power) వ్యక్తుల ఇష్టాలు, ఆశలు పోటీపడి ఎవరికి వారే సంపదను, అధికారాన్ని, గౌరవాన్ని సంపాదించుకోవాలనే దురాశతో పోటీ దారులు తమతోటి పోటీదారుల అణిచివేత, హత్యలు చేపడతారు. ప్రతి ఒక్కరు అధికారం కోసం పోరాడతారు. ఈ పౌర సమాజంలో ప్రతిఒక్కరికీ పరిమితమైన, అపరిమితమైన కోరికలున్నప్పటికీ అధికారం కోసం పోరాటం సలపాల్సిందే.

హాబ్స్ మహాశయుని తరవాత ఈ అధికారమనే భావన (Power Concept) హెగెల్ రచనలలో ప్రాముఖ్యం సంతరించుకొంది. హెగెల్ రాజ్య సార్వభౌమాధికారాన్ని నిరపేక్షమైనదిగా (absolute) ప్రకటించాడు. ఈ నిరపేక్ష అధికారం అంతర్జాతీయ నీతి సూత్రాలను కూలదోసింది. 19వ శతాబ్దంలో

అధికారం, అధికార వాంఛ అనేక రచనల్లో చోటుచేసుకొన్నాయి. ఈ విధమైన రచనల్లో ప్రముఖంగా పేర్కొనదగ్గవి నిషే (Nietzshe), ట్రైటస్కీ (Tritshke), బర్న్ హార్డీ (Bern Hardi) రచనలు.

పై ముగ్గురు జర్మన్ పండితులు హెగెల్ రాజనీతితత్వాన్ని తేట తెల్లంగా విశదీకరించారు. ఎరిక్ కాఫ్‌మన్ (Eric Kanfman) అనే జర్మన్ అంతర్జాతీయ న్యాయవిద్యార్థి ఈ అధికారా లోచనా ప్రవాహాన్ని "అభివృద్ధి" తో ముడిపెట్టాడు. ఆయన దృష్టిలో రాజ్య సారాంశం జర్మనీ భాషలో (machtantfalting) గా వర్ణించాడు. దీని అర్థం అభివృద్ధి విజయవంతంగా ప్రయోగాలు. (Development increase and display of power successfully).

ప్రస్తుతం శక్తి భావనను ఎక్కువగా ప్రచారం చేస్తున్నది హాన్స్ జె. మార్గెంథో (Hans J. Morgenthous) ఆయన గ్రంథం 'Politics among Nations'. ఆయన దృష్టిలో Politics అనేవి అధికార పోరాటం (Struggle for power) అని నిర్దిష్టంగా ప్రకటించాడు. ఆయన రాసిన సిద్ధాంతవ్యాసం "శాస్త్రీయ మానవుడు - అధికార కాంక్ష" (Scientific man Vs Power Politics) లో ఈ విధంగా అన్నాడు. అధికార కాంక్ష అనేది అందరికీ ఉండే సహజమైన తృష్ణ (lust for power) గా భావించాడు. అందువల్ల ఈ రాజకీయాధికారం సాంఘిక జీవనం నుంచి అవిభాజ్యం (inseparable). ఈ అధికార కాంక్షగల రాజకీయాలు చాలా వినాశకరమైనవి. ఈ విధమైన రాజకీయాధికార కాంక్ష రాజనీతిజ్ఞత అనిపించుకోదు.

ఇటలీలో ఫాసిజం (Facism) 1922 సంవత్సరం ప్రాంతంలో విస్తృతంగా ఉన్న రోజుల్లో ముస్సోలిని రాజ్యాన్ని నిరపేక్ష మైనదిగా ప్రకటించాడు. "Nothing against State, Nothing above" ఫాసిస్టు నిర్వచ నానికి ప్రతిస్పందిస్తూ చార్ల్స్ మిరియం రాజకీయాధికార సిద్ధాంతాన్ని, దాని పుట్టు పూర్వోత్తరాలను కూలంకషంగా అధ్యయనం చేయడం ప్రారంభించాడు. ఆయన తీసుకొన్న అధ్యయనాంశాలలో అధికార మనుగడ (Survival) పతనం (decline), తొలగింపు (Overthrow), అధికార దారిద్ర్యం (Poverty of Power) మొదలైనవి.

అధికార మనేది చాలా విశాలమైన భావన. ఇది నాశనకరంగా కనిపించినప్పటికీ దీనిలో ఉన్న వాస్తవాన్ని మనం మరిచిపోకూడదు. అధికారమంటే బలప్రయోగమనే దురుద్దేశంతో తీసుకొంటాం. కానీ మనం దీనిని మేధాశక్తిగాను (Power of the mind), ఆత్మశక్తిగాను (Power of the Soul) ఆలోచనా శక్తిగాను (Power of idea) చెప్పవచ్చు. మహాపురుషులైన గౌతమ బుద్ధుడి నుంచి గాంధీజీ వరకు అనేకులు తమ ఆలోచనాశక్తితో, ఆత్మశక్తితో మానవుని ఆలోచనను, ప్రవర్తనను ప్రభావితంచేసినట్లు రూఢి అవుతుంది. కాట్లిన్ (Catlin) ఉద్దేశంలో సహకారం (Co-operation) అనేది కూడా ఒక విధమైన అధికారమే. దీనిలో వ్యక్తి బుద్ధికుశలత తప్ప అధిపత్యముండదు. బ్రెచ్ (Bretcht) ఈ అధికారాన్ని ప్రజల న్యాయజ్ఞానంగా (Sense of justice) అభివర్ణించాడు.

13.10 మార్క్స్ దృక్పథం Marx View of Power

మార్క్స్ దృష్టిలో అధికారమనేది అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రాలను అధ్యయనం చేసే ఒక సాధనంగా పేర్కొవచ్చు. రాజనీతి శాస్త్రం సామాజిక కార్యకలాపాలతో ముడిపడి ఉంది. మార్క్స్ దృష్టిలో

ఏ సమాజంలోనైనా రెండు వర్గాలు రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోడానికి పోరాటం సాగిస్తాయి. అంటే ఇది ఒక వ్యవస్థీకృతమైన సామాజిక శక్తి (Organised force of the Society). సమాజంలో పరస్పర విరుద్ధమైన రెండు వర్గాలు ఏర్పడ్డాయి. అవి: కలవాళ్ళు (haves), లేని వాళ్ళు (have nots) లేని వాళ్ళంటే కార్మికులు. వీరు శ్రమించి పెంచే వస్తూత్పత్తుల వల్ల లభ్యమయ్యే సంపదలో చాలా కొద్ది భాగం మాత్రమే వాటి ఉత్పత్తి దారులకిచ్చి మిగులు విలువను (Surplus Value) యజమానులు సొంతం చేసుకొంటుంటారు.

సార్వభౌమత్వంతో విశిష్ట ప్రభుత్వా ధీనంలో ఒక దేశం స్థిర పడినట్లయితే అక్కడ రాజ్యముంటుందని రాజ్య స్థిరత్వం గురించి మాట్లాడుతూ ఓపెన్‌హీమ్ (Oppenhim) చెప్పాడు. బ్లంట్ షిల్లీ (Bluntshili) అభిప్రాయాన్ననుసరించి "ఒక నిశ్చిత ప్రదేశానికి చెంది, రాజకీయంగా వ్యవస్థీకృతమైన ప్రజలే రాజ్యం"

13.11 రాజకీయ బద్ధత, ప్రభావం, అర్థం Political Legitimacy - effectiveness

ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ స్థిరత్వం (Stability) సాధారణంగా అనుకొనే విధంగా ఆర్థికాభివృద్ధిపై మాత్రమే ఆధారపడి లేదు. న్యాయసమ్మతంమీద, దాని ప్రభావంమీద కూడా ఆధారపడి ఉంది. చట్టబద్ధత, న్యాయ సమ్మతి రాజకీయాధికారానికి పునాది రాయి లాంటివి. ప్రభుత్వం ఎంతో చైతన్యంతో న్యాయబద్ధపాలన చేస్తుంది.

రాజకీయ న్యాయబద్ధత అనే భావనను బలవరాక్రమణ (Suppression), విప్లవం (Revolution) అనే సందర్భాలలో అధ్యయనం చేయాలి. అధికార బలాత్కారం చాలా అక్రమమైనదేకాక చట్టవిరుద్ధమైనది. విప్లవం చట్టవిరుద్ధమైన ప్రవర్తన కావచ్చు, కాకపోవచ్చు. సామాన్య పరిభాషలో రాజకీయ చట్టబద్ధత అనే అలోచన విజయాధిక్యమై విప్లవానికి ఆపాదించవచ్చు. కానీ అది జనబాహుళ్య ప్రశంసలను అందుకోవాలి. ఏదైనా ఒక విప్లవం విజయ వంతమైతే అది న్యాయసమ్మతి అనే సూత్రాన్ని ప్రవేశపెట్టి పూర్వపు విధానాన్ని అధిక్రమణచేస్తుంది. అట్లాంటి పరిస్థితుల్లో నూతన ప్రభుత్వం ప్రజల గుర్తింపు, మన్ననలను పొందగలగాలి. ఒక్కోసారి న్యాయసమ్మతంగా జీవింపజేయాలనే విధానం హింసను (Violence), భీతావహాన్ని (Terror) ప్రజ్వలింపచేస్తుంది.

విదేశీ దౌత్య గుర్తింపు అత్యవసరంకాకపోయినప్పటికీ అంతర్గతంగా ఏకీకరణ (internal Consolidation) సాధించడమేకాకుండా నూతన న్యాయసమ్మతి విధానాన్ని శీఘ్రపరచడానికి వీలుంటుంది. రాజకీయ బద్ధత అనే ఆలోచన, దాని ప్రభావం రాజకీయ మార్పులనే సమస్యతో ముడిపడి ఉంది. ప్రభుత్వాలు సంప్రదాయబద్ధమైన, చట్టబద్ధమైన సూత్రాలను అనుసరించినా లేదా పాదుకొని ఉన్న విప్లవాత్మక సూత్రాలు అనుసరించినప్పటికీ ఈ సూత్రాలు వ్యతిరేకిస్తే ఆప్రభుత్వాలు తమచట్టబద్ధతను కోల్పోతాయి. మానవ సమాజంలో చట్టబద్ధత వేళ్ళూనుకొని ఉంది. ఏతరహా ప్రభుత్వం దీనిని విస్మరించలేదు.

చట్ట బద్ధత అనేది సార్వజనీనమైన దృగ్విషయం (Universal Phenomenon). ఇది అనేక రకాలైన సవాళ్ళను ఎదుర్కోవలసి ఉంటుంది. అధికారం కోసం ప్రత్యర్థులు పోటీపడి వారు ఆచరించే విధానమే చట్టబద్ధమైనదిగా ప్రకటించుకొంటారు. దీనినిబట్టి చట్టబద్ధత గురించి మాట్లాడటం ఎంత కష్టమో అర్థమవుతుంది. అందువల్ల వివిధ మౌలికమైన దీని రూపాలను ప్రత్యేకంగా ఉదాహరణలతో చదవటం ఎంతైనా అవసరం.

చట్టబద్ధత సంక్షోభం (Crisis of legitimacy) అంటే రాజకీయ మార్పు సంక్షోభమని పేర్కొనవచ్చు. దీని మూలం ప్రజాసాంఘిక జీవనాన్ని ప్రభావితం చేసే రాజకీయ రూపాంతరీకరణ (Political Transfermation) గానే గుర్తించవచ్చు. ఈ పరిణామకాలంలో సమాజంలో ఉన్న ప్రధాన సాంఘిక సంస్థలు, సమూహాలు వాటి హోదాను పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం లేదు. సరికొత్త సంక్షోభం దానంతటదే నూతన సాంఘిక నిర్మాణానంతరం వస్తుంది. ఒక కీలకమైన ప్రశ్న ఏమిటంటే ప్రజలు ఆ తరహా ప్రభుత్వ విధానాన్ని అంగీకరిస్తారా లేదా అన్నదే.

ఈ ప్రశ్నకు రెండు సిద్ధాంత పరమైన సమాధానాలు చెప్పుకోవచ్చు. మొదటగా ప్రభుత్వానికి తమ మద్దతు విషయంలో ప్రజలే సహేతుకమైన నిర్ణయాలు తీసుకొంటారు. రెండోది ప్రజలే తమజాతి (ethnic) పూర్తి విభజనలు బట్టి తమకు నచ్చిన తరహా ప్రభుత్వాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

ప్రత్యక్షంగా రాజకీయ బద్ధత దాని ప్రభావం మొత్తంగా రాజకీయాధికార భావనతో సంబంధం ఉంది. ఇది రాజకీయ ప్రవర్తన అధ్యయనాన్ని విస్తరింపజేసి నిర్ణయాధీనత ఆలోచనలను, విధానాలను ప్రభావితం చేయడం, అదుపుచేయడం లేదా ఫలప్రదం చేయడం జరుగుతుంది. రాజకీయ శాస్త్రజ్ఞుని ఆలోచన, ఓటుహక్కు (Franchise) వాక్ స్వాతంత్ర్యం (freedom of Speech) చట్టాలు రూపొందించటంలో (Law making) వాటిని అమలుపరచటం (enforcement) ప్రభుత్వోద్యోగులు తటస్థ విధానాన్ని కాపాడటం, న్యాయాధిపతులు స్వతంత్రంగాను, నిష్పాక్షికంగాను వ్యవహరించేటట్లు చూడటం మొదలైన వాటికి పరిమితంకాదు.

13.12 వెబర్ విశ్లేషణ (Weber's Analysis)

రాజకీయ బద్ధత, దాని ప్రభావం అనే భావనలు ఈ శతాబ్దపు జర్మనీ సామాజిక శాస్త్రవేత్త మాక్స్‌వెబర్ (Max Weber) పేరుతో చెలామణిలో ఉంది. ఆయన అభిప్రాయం ప్రకారం ఏరకమైన చట్టబద్ధ అధినివేశ రాజ్యమైన (Legitimate Dominian) ఒక నమ్మకం మీద ఆధారపడి ఉండే అజ్ఞాపాలనను ప్రతిబింబిస్తుంది. కాబట్టి రాజ్యంలో ఏపాలక వర్గం ఉన్నప్పటికీ చట్టబద్ధంగా వ్యవహరించాలి. చట్టబద్ధత అనే వాస్తవాన్ని ఈ కింది మార్గాలకు ఆపాదించవచ్చు.

(1) సంప్రదాయాన్ని బట్టి - అంటే గతంలోని చట్టబద్ధతపై నమ్మకం.

(2) ఉద్యోగవైఖరులను బట్టి - అంటే నూతన విధానానికి ఉద్రేకపూరితమైన ప్రతిస్పందన.

(3) హేతువాద నమ్మకాన్ని - అంటే కచ్చితమైన విలువలను తెలుసుకొని వాటి మాన్యత (Validity) కి కట్టుబడి ఉండటం.

(4) స్వచ్ఛందమైన అంగీకారం ద్వారా ఆసక్తి చూపే పార్టీలు స్పష్టమైన నిబంధనలతో ఈచట్ట బద్ధతను గుర్తించవచ్చు.

వెబర్ నొక్కి వక్కాణించే విషయం ఏమిటంటే ప్రతి అధికార విధానం తనకు సరిపడే విధంగా విధేయతను తెలియజేసే సమ్మతిని కోరుతుంది. సమకాలీన నాగరికతలో వెబర్ రూపొందించిన చట్టబద్ధత, దాని వర్గీకరణ ఒక అత్యున్నతమైన పరిశీలనాంశంగా ప్రశంసనీయం.

వెబర్ మూడు రకాలైన చట్టబద్ధ అధికారాలను పేర్కొన్నాడు.

(1) హేతుబద్ధ న్యాయాధికారం (Rational Legal Authority)

(2) సంప్రదాయబద్ధ అధికారం (Traditional Authority)

(3) ఆకర్షణాధికారం (Charismatic Authority)

ఒక వ్యక్తి మానవాతీత లక్షణంపై ఆధారపడిన ఆకర్షణనే ఆకర్షణాధికారంగా పేర్కొనవచ్చు.

13.13 చట్టబద్ధత - అధికారం (Legitimacy and Power)

చట్టబద్ధత ప్రభావం అనే భావంలో సామాజిక దృక్పథంతో కూడిన రాజకీయ వ్యవస్థ ఉంటుంది. ఇది సాంఘిక వ్యవస్థలో ఒక కీలకభాగం. ఏరాజకీయ వ్యవస్థకైనా మూడు అత్యావశ్యకమైన సుగుణాలుంటాయని ఐన్‌స్టీడ్ (Eisenstadt) అభిప్రాయపడ్డాడు.

మొదటిది, చట్టబద్ధమైన గుత్తాధిపత్య రూపం (Legitimate monopoly). సమాజంలో దాని అధికారాన్ని, బలాన్ని ఉపయోగించి అదుపుచేస్తుంది.

రెండోది, వ్యవస్థ నిర్వహణకు తన బాధ్యతలను, విధులను నిర్వర్తిస్తుంది. మూడోది, అంతరంగిక సమగ్రతను కాపాడటానికి, సమాజ లక్ష్యాలను సాధించడానికి, పరదేశ సంబంధాలను పెంపొందించుకోడానికి తన బాధ్యతలను నిర్వర్తిస్తుంది. అంటే ఒక లౌకికమైన ఆంక్షలతో కూడిన వ్యవస్థను రూపొందిస్తుంది. ఇది ఇంత మంచిగా అన్ని రంగాల ప్రజలను సంతృప్తి పరచడానికి అవసరమైన సమాజ గురుతర బాధ్యతలను విచక్షణ లేకుండా నిర్వర్తిస్తుంది.

ఈ విధమైన రాజకీయ వ్యవస్థ, సామాజిక వ్యవస్థ జీవనంలో విశాలమైన భాగమై ఉంది. అందువల్ల దాని విధులను పరిశీలించి చట్టబద్ధతను, అనుభవిక దృక్పథాన్ని (Empirical View) మనం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. సాధారణ ప్రజలు ఆజ్ఞల ననుసరించి అధికారానికి విధేయత చూపరు. కానీ ప్రజల అవసరాలకు, ప్రయోజనాలకు భద్రత చేకూర్చగలిగితే అట్లాంటి వ్యవస్థను నమ్మి విధేయత చూపిస్తారు. పరిపాలకులు కూడా వారి విశ్వాసాన్ని పొందగలగాలి. ప్రభుత్వం తన అధికార పరిధిలో విధులను నిర్వహించడమేకాక అన్ని సంస్థలు, సంఘాలు వాటికి అప్పగించిన పనులను నిర్వర్తించడానికి ప్రభుత్వమే ఇతోధికంగా కృషిచేయాలి. అప్పుడే అధికార యుతమైన సంబంధాలు నెలకొంటాయి.

వైజ్‌మాన్ (Wiezman) ఉద్దేశంలో ప్రభుత్వ ప్రధానవిధి "రాజకీయ వ్యవస్థలో (ని) అధికారాన్ని చట్టబద్ధం చేయడమే" (Legitimisation of Power and political System) ఈ విధిని ఎంతో చాకచక్యంగా ప్రభుత్వం నిర్వహించాలి. ఈ విధంగా అన్ని వ్యవస్థలు రాజకీయ వ్యవస్థతో సహకరించినప్పుడు ప్రభుత్వం వీటి సంబంధాలు శాశ్వతంగా కొనసాగుతాయి. ఈ శాశ్వతత్వమే లేదా స్థిరీకరణ చట్టబద్ధీకరణ (Legitimization) గా పేర్కొనవచ్చు.

బిండర్ (Binder) అభిప్రాయం ప్రకారం ఏ ప్రభుత్వమైనా తన చర్యల ద్వారా శాశ్వతంగా అధికార సంబంధాన్ని పొందాలని కోరితే అది రాజకీయాధికార సంబంధ మవుతుంది. చట్ట బద్ధత దాని భావం. రాజకీయమైన, రాజకీయేతరమైన (Non-political) అన్ని వ్యవస్థలకు ఇది వర్తిస్తుంది.

13.14 చట్టబద్ధత - సంఘర్షణ (Legitimacy and Conflict)

చట్టబద్ధ సమాజాలలో వ్యాపించిన భావజాలాలను (idealogies), కాల్పనికాలు (Myths) వాటి నమ్మకాలపై ఇది ఆధారపడి ఉండటానికి అవకాశముంది. సమాజంలోని ప్రతి భావజాలం ఆ ఆదర్శ ప్రభుత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ భావముద్ర ఉన్న ప్రభుత్వాలను చట్టబద్ధమైనవిగాను, కాని వాటిని చట్టవ్యతిరేకమైనవిగాను గుర్తించవచ్చు. ఈ సూత్రాన్ని ఏ తరహా రాజకీయ వ్యవస్థకైనా వర్తింజేయవచ్చు.

ప్రజాస్వామిక వ్యవస్థలో అధికారం ప్రజలే సంక్రమింపజేసుకొని స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా తమ ప్రతినిధులను ఎన్నుకొని వారిద్వారా ప్రజలే అధికారాన్ని చెలాయిస్తారు. ఎన్నికలు ప్రధమంగా పాలకుల పాలనను చట్టబద్ధీకరించే సాధనాలుగా చెప్పవచ్చు. పాలకులు హక్కులను చట్టబద్ధంగా ఉపయోగించి పరిపాలించడానికి దోహదం చేసే సాధనాలుగా ఎన్నికలను పరిగణించవచ్చు.

ప్రజాస్వామిక వ్యవస్థలను ఎల్లప్పుడూ సవాలుగా నిలిచేవి సంఘర్షణలు (Conflicts). అవి ఎంత బలమైనవంటే సమాజాన్ని కూకటివేళ్ళతో కూల్చివేయగలవు. ప్రజాస్వామిక ప్రభుత్వాలకు పార్టీలతో, గుంపులతో వచ్చే ఈ సంఘర్షణల తీవ్రతను తగ్గించడానికి లేదా అదుపుచేయడానికి ఎంతో నిగ్రహం కావలసి ఉంటుంది.

ఈ విధంగా సంఘర్షణ పరిస్థితులను నిగ్రహంతో ప్రభుత్వాలు పరిష్కరించగలిగితే ఆవ్యవస్థ మరొక చట్టబద్ధమైన ప్రజాస్వామ్యంగా నిర్వచించవచ్చు. సమాజంలో ఉన్న రాజకీయ సిద్ధాంతాన్ని అంతగా ప్రభావితం చేసే ప్రధానమైన వేర్పాటు శక్తులను, వాటి ఆవిర్భావాన్ని గుర్తించగలిగారు. ఈ వేర్పాటు శక్తులు (Divisive forces) చారిత్రక కారణాలవల్ల కలిగినవిగా లిప్సెట్ (Lipset) గుర్తించాడు. నిరంతరం అన్ని సమస్యలను పరిష్కరించడం, మళ్ళీ కొత్త సమస్యలు తలెత్తడం, అవిరాజకీయ సిద్ధాంతాన్ని అస్థిరంచేసే సమస్యగా ఉండిపోయి రాజకీయవాతావరణాన్ని కలుషితం చేస్తాయి. పరిష్కరించబడిన ఈ సమస్యలు తీవ్రమై ఆపార్టీల గుంపులకు నిరుత్సాహాన్ని, నిరాశను కల్పించి సంఘర్షణకు దారితీస్తాయి. సామాజిక రాజకీయ స్థిరత్వం చారిత్రక కారణాల ద్వారా రూపుదిద్దుకొంటాయి. ప్రజాస్వామిక వ్యవస్థ భద్రత, పరిరక్షణలు పాదుకొనిపోయిన నూతన సంప్రదాయాలవల్ల ప్రభావితమవుతాయి.

ఉదాహరణకు ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థలలో రాజ్యస్థిరత్వం, అస్థిరత్వం అనేవి ఆవ్యవస్థ మతంపై ఆధారపడి ఉంటాయి. అంటే మతమే రాజకీయ స్థితిని, గతిని నిర్ణయించే ప్రధాన కారకమని చెప్పవచ్చు. అంతేకాకుండా ఆమతంలో ఉన్న శాఖలు కూడా చట్టబద్ధత సంపాదించటానికి తీవ్రమైన పోరాటం సాగిస్తాయి. ఈ ప్రకారంగా ఐర్లెండ్ దేశ ప్రజలు తమ రోమన్ కాథలిక్ మతాన్ని పరిరక్షించుకోడానికి పోరాటం సాగించారు. దీనికోసం వారు ఇంగ్లండ్ దేశపు ప్రోటెస్టాంట్ మతస్థులతో విభేదించారు. తత్ఫలితంగా స్వదేశీ ఉద్యమం (Home Rule) తీవ్రమై ఐర్లాండ్ గణ తంత్ర రాజ్య అవతరణకు దారితీసింది.

ఆర్థిక కారణం కూడా ఈ విషయంలో కీలకమైందిగా గుర్తించవచ్చు. ఒకవేళ సమాజంలో ఉన్న పీడిత, అవకాశవాద రహిత వర్గాలు రాజ్యాంగ బద్ధంగా రాజకీయ అధికార పంపిణీలో భాగం పంచుకొన్నప్పుడు వారు తమకు సంక్రమించిన రాజకీయ వ్యవస్థను చట్టబద్ధమైనదిగా ఆదరిస్తారు. అట్లాకాకుంటే ఆవర్గాలు తమ లక్ష్యసాధనకు హింసాయుతమైన పద్ధతుల ద్వారా సాధించుకోవడానికి వెనకాడరని భావించవచ్చు.

మొదటి దానికి ఉదాహరణగా బ్రిటన్‌ను చెప్పవచ్చు. ఫ్రాన్స్‌ను రెండో దానికి ఉదాహరణగా భావించవచ్చు. 19వ శతాబ్దంలో ఇంగ్లండ్‌లోని కామన్స్ సభకు ప్రజాస్వామీకరించారు. తత్ఫలితంగా ప్రభువుల (Lords) అధికారాలు క్షీణించాయి. దీనికి భిన్నంగా ఫ్రాన్స్ దేశంలో 1789 లో ఒక హింసాయుత విప్లవం ద్వారా రాజరికం అంతరించి సంప్రదాయ బద్ధమైన గణతంత్రవాదం (Conservative Republicanism) ఆవిర్భవించింది. మళ్ళీ రాజరికం 1870 సంవత్సరంలో పునఃస్థాపితమైంది.

సాంప్రదాయిక గణతంత్రవాదం కూడా ఒక నిర్దిష్టమైన గణాన్ని చూపించలేక పోయినప్పటికీ రాచరికం లేని వ్యవస్థ (Non-Monarchical System) ఏర్పడిన సంతృప్తి మిగిలింది. గడిచిన రెండు వందల సంవత్సరాల రాజకీయపరిణామాన్ని పరిశీలించినప్పుడు ఫలప్రదమైన పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థ నుంచి బలమైన ఏకపార్టీ నాయకుని పరిపాలన వరకు - అంటే బోనాపార్టీ నిరంకుశత్వం (Bonapartism) రాజ్యాధికారాన్ని చేలాయించారు. ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఏరకమైన రాజకీయ వ్యవస్థలోనైనా చట్టబద్ధతను సంపాదించవచ్చుననే అంశం.

ప్రజాస్వామ్యానికి మాత్రం ఇది అత్యంత ఆవశ్యకం. కారణమేమంటే దీర్ఘకాలికంగా అటువంటి విధానం ఏ ప్రజా సమూహాలమీద వాటి అభీష్టానికి వ్యతిరేకంగా విధించడం జరగదు. ఒకవేళ మొజారిటీ ప్రజలు వ్యతిరేకిస్తే ఆ వ్యవస్థ మనుగడ సాగించలేదు. "ప్రజాస్వామ్య వ్యవస్థలో అధిక మైనారిటీ" (Major miniority) వారు ఎల్లప్పుడు ఆజ్ఞలు జారీచేస్తే ఆవిధమైన విధానం సంఘర్షణాభి ముఖంగానే నడుస్తుంది. (It would encounter rough going if majority always has to impose its rule on a larger minority).

13.15 చట్టబద్ధత - భావజాలం

రాజకీయ బద్ధతను సాధించడానికి ఆదర్శాలు (ideals) ఏ విధంగా కీలకపాత్ర వహిస్తాయో ప్రస్తుతం చర్చిద్దాం. స్పష్టమైన ఆదర్శాలకు కట్టుబడిఉన్న పార్టీలు తప్పకుండా ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేసి, ప్రజలకు ఆదర్శవంతమైన ప్రవర్తనా నియమావళిని అందిస్తాయి.

ఈ పార్టీలు రెండు రూపాలలో ఉంటాయి. 1. వివిధ రకాల ప్రజల నమ్మకాలను, విశ్వాసాలను ప్రతిబింబించి ప్రాతినిధ్యం వహించేవిగాను 2. ప్రజలందరినీ తమ పార్టీకికట్టుబడి ఉన్న దృఢ విశ్వాసాలను (Convictions) గౌరవించేటట్లు చేస్తాయి. ప్రజలపై తీవ్రమైన దండనాధికారాన్ని ఉపయోగించి బలవంతంగా రాజకీయ క్రమశిక్షణను వారిపై రుద్దితే ఆ ప్రజాస్వామ్య విధానం తప్పక దాని చట్టబద్ధతను కోల్పోవలసి ఉంటుంది.

ఏకీకరణ, సమగ్రతలను సాధించాలనే పార్టీలు ఏకాధిపత్యానికి చెంపపెట్టుగా పరిణమిస్తాయి. ప్రజాస్వామ్య పద్ధతులద్వారా ఆధిపత్యం సంపాదించుకోవాలనుకొనే పార్టీలు సమైక్యతా పార్టీలుగా (Parties of integration) చివరికి ఉండజాలవు. ఈ విధమైన రాజకీయ విధానంలో నాయకులు తమ నిర్ణయాలు, విధానాల ద్వారా ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలి. ప్రజలే తమ పాలకులు అహింసాయుతంగా, ఆదర్శవంతంగా పాలిస్తున్నారని సంతృప్తిపడితే తప్పకుండా తమ విశ్వాసాన్ని ఆప్రభుత్వ విధానాలపై ఉంచుతారు. ఆవిధంగా తమ విశ్వాసాన్ని ఆ ప్రభుత్వ విధానాలపై ఉంచుతారు. ఆ విధంగా, అధికారంలో ఉన్న వారి నాయకత్వం చట్టబద్ధమైనదిగా గ్రహించవచ్చు.

పాలకులు ప్రజలపై విధించే ఆజ్ఞల నిర్మాణ స్వరూపం, కార్య పద్ధతి విధానాలు (Proccdures), కార్యాలు (Acts), నిర్ణయాలు (Decisions), విధానాలు (Policies) మొదలైనవి సత్య, యధార్థ, నీతి బద్ధమైన, చిత్తశుద్ధి కలిగి ఉండేలా చూసుకోవాలి. అటువంటి నిర్ణయాలు, విధానాలు తప్పకుండా ప్రజల విధేయతలను పొందుతాయి.

ఆదర్శ సూత్రంపైనే నాయకుల విధాన సిద్ధాంతాలను రూపొందించినప్పుడు ఆనాయకత్వం ఆదర్శవంతంగా వర్ధిల్లుతుంది. కాబట్టి ఆదర్శవాద సిద్ధాంతం చట్ట బద్ధతను ఒక ప్రతీకగా, నాయకత్వానికి ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. "ఒక్క చక్కని ఆదర్శం లేదా రాజకీయ సూత్రం (Political formula) రాజకీయ ప్రభావాన్ని సహృద్భావంతోను, విలువైన ఆధారంగా మారుస్తుంది".

ప్రజలకు ఏ విధమైన సంఘర్షణాధికార విప్లవాత్మక ధోరణి ఉంటే చట్టబద్ధంగా ఆదర్శవంతమైన విధానాలను అంగీకరిస్తారు. ఈ విధంగా ఆదర్శ సూత్రాలు నాయకత్వానికి "చక్కని, సరిపడే వస్త్రాలుగా, అన్ని పరిస్థితుల్లోను ధరించడానికి సరిపడే వస్త్రాలుగా పేర్కొవచ్చు. మార్క్స్ దృష్టిలో ఈ ఆదర్శాలు ఒక కపటమైన వాస్తవం.

మానవుణ్ణి బంధ విముక్తుడిని చేయడానికి కృషి చేయని ఏ ప్రభుత్వం కూడా నిజమైందికాదు. బూర్జువా స్వామ్యంలో ఈ ఆదర్శాలు తప్పుదారి పట్టించేటట్లుగా మారుతూ ఉంటాయి. అనేక రాజకీయ పార్టీలు యథాపూర్వక స్థితి (Statusquo) కాపాడటానికి, అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి తమ అధికారానికి చట్టబద్ధీకరణను కోరడానికి రకరకాల ఆదర్శాల పేరుతో తమ మనుగడ సాగించుకొంటాయి.

ఉదాహరణకు, ఇంగ్లండ్‌లోని కన్సర్వేటివ్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తన పాలనానుగుణమైన ఆదర్శ సిద్ధాంతాన్ని ఏర్పరుచుకొంది. అదే సమయంలో ప్రతిపక్షంగా ఉన్న లేబర్‌పార్టీ పోటీ ఆదర్శసిద్ధాంతాన్ని ప్రచారం చేసింది. ఈ విధంగా అవసరానికి అనుగుణంగా మార్పు చెందే ఆదర్శాల

స్వరూప సంబంధమైన వాటిని, నిర్మితి-విధుల పూర్వకమైన (Structural - functional) సంతృప్తి, పరచవచ్చునేమోగాని మార్క్స్ వాదులను కాదు. తను అధికారాన్ని ఎల్లకాలం కొనసాగించడానికి చట్టబద్ధీకరించడానికి ఆదర్శాలను వెదికే నాయకులు ఆదర్శవంతమైన నాయకులు కాలేరు.

సామాజిక సంబంధాల ద్వారా ఆదర్శాలు అనేవి అవతరించాలి లేదా ఆవిర్భవించాలి. రాజకీయ నాయకులు ఊసరవల్లుల మాదిరి (Chamelons) తమ ఆదర్శాలకు రంగులు మార్చుకొనేవారు మాత్రం కాదు. ఆ విధంగా తమ రాజకీయ పరిస్థితిని ఎల్లకాలం కాపాడుకోలేరు.

పైన ఉదహరించిన విషయాలు ఆధారంగా రాజకీయ బద్ధత, దాని ప్రభావం అనే భావన సామాజిక శాస్త్రంతో ముడిపడి ఉన్నదని అర్థమవుతుంది. ఇది రాజకీయాధికారాన్ని, ప్రజల రాజకీయ సంస్కృతిని ప్రభావితం చేసి ఈ రెండింటి మధ్య సత్సంబంధాలు నెలకొల్పుతుంది. అంతేకాకుండా, ఎన్నికల సమయంలో తమ పార్టీ ప్రణాళికలను ప్రమాణాలను తరవాత మార్చి వేసే పార్టీలను, తరవాత అమలు పరచని పాలకులను, చట్టబద్ధత, విధేయతలేని ఏ సంస్థను కూడా ప్రజలు విశ్వసించకపోవడమే కాకుండా వాటిని తీవ్రంగా ప్రతిఘటిస్తారు. సాంఘిక ఉద్రిక్తతలను, సాంఘిక ఘర్షణలను అదుపుచేయటంలోను, చట్టబద్ధతను కాపాడటంలోను ఈ ఆదర్శాల పాత్ర ప్రశంసనీయమైంది.

– ఆచార్య డి. సూరన్ నాయుడు

13.16 చదువదగిన పుస్తకాలు

Strong G. : Modern Political Constitutions

Dicey A.V. : Law of the Constitution

Wheare k.C : Modern Constitutions

Friedrich Carl J. : Constitutional Government and Democracy

13.17 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. రాజ్య ఆంగిక స్వభావాన్ని చర్చించండి.
2. చట్టబద్ధమైన అధికారాన్ని పరిశీలించండి.
3. ఆధునిక రాజ్యాన్ని నిర్వచించండి.

*****

భాగం-14 : స్వాతంత్ర్యం - అధికారం

విషయక్రమం

14.1 లక్ష్యాలు

14.2 స్వేచ్ఛ

14.3.0 స్వేచ్ఛ రకాలు

14.3.1 నిషేధాత్మక స్వేచ్ఛ

14.3.2 సంపర్దక స్వేచ్ఛ

14.4.0 స్వేచ్ఛ - శాఖలు

14.4.1 సహజ స్వేచ్ఛ

14.4.2 సాంఘిక స్వేచ్ఛ

14.4.3 ఆర్థిక స్వేచ్ఛ

14.4.4 జాతీయ స్వేచ్ఛ

14.4.5 అంతర్జాతీయ స్వేచ్ఛ

14.4.6 నైతిక స్వేచ్ఛ

14.5 అధికారం

14.6 ప్రాచీన శాస్త్రవేత్తల అభిప్రాయం

14.7 అరాచక వాదుల అభిప్రాయం

14.8 మార్క్సిస్టుల అభిప్రాయం

14.9 ప్రజాస్వామ్య వాదుల అభిప్రాయం

14.10 ఫాసిస్టుల అభిప్రాయం

14.11 ముగింపు

14.12 చదువదగిన పుస్తకాలు

14.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

14.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- స్వేచ్ఛ అంటే ఏమిటి
- అధికారం అంటే ఏమిటి
- వాటి వివిధ అర్థాలు బాగా వివరించ గలుగుతారు.

14.2 స్వేచ్ఛ

స్వేచ్ఛను అనుభవించాలనుకోవడం మానవుని సహజ లక్షణాలలో ఒకటి. అయితే మానవుడు తన వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవలెనంటే అతనికి కొన్ని హక్కులు తప్పనిసరిగా ఉండితీరాలి. వ్యక్తికి స్వాతంత్ర్యం ఉన్నప్పుడే హక్కులు లభిస్తాయి. అందువల్ల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అనేవి రెండూ ఒక్కటి లాంటివే. ఈ హక్కులకి, స్వేచ్ఛకి, రాజ్యానికి అవినాభావ సంబంధం ఉంది. పౌరుడు తన అభివృద్ధిని పెంపొందించుకొనేటట్లుగా ఈ హక్కులను ఒక క్రమపద్ధతిలో అమలు పరచటం రాజ్య ధర్మము. కేవలం శాంతి భద్రతలు కాపాడటమే రాజ్యధర్మంకాదు. ఒక వ్యక్తి తనని అభివృద్ధి చేసుకోనడం వంటి చక్కటి వాతావరణాన్ని కలిగించడం కూడా రాజ్యధర్మమే.

అయితే స్వేచ్ఛ అనే పదానికి నిర్వచనం ఏమిటి అని ప్రశ్నించినపుడు ఒకే నిర్వచనం చెప్పటం కష్టమే. ఒక్కొక్క తరహా వ్యక్తులు ఒక్కొక్క తరహాలో విశదీకరించారు. హాబ్స్ దృష్టిలో స్వేచ్ఛ అంటే ఒక వ్యక్తి తన ఇష్టం వచ్చినట్లు చర్య చేయడానికి ఇచ్చిన 'లైసెన్స్'. వ్యక్తి మంచి గుణాలను పెంపొందించుకోడానికి అవసరమయ్యే పరిస్థితులను కల్పించి వాటిని పోషించుకోటాన్ని స్వేచ్ఛ అని లాస్కీ అభిప్రాయం.

'LIBERTY' అనే ఆంగ్లపదం 'లిబర్' LIBER అనే లాటిన్ భాషాంతర రూపం మాత్రమే. ఈ రెండు పదాలకు స్వతంత్రంగా వ్యవహరించడం అని అర్థం. ఏ విధమైన నిర్బంధాలు లేకపోవుటమనేది ఇందులో స్ఫురిస్తుంది. సర్వకాల, సర్వావస్థలలోను ఒక వ్యక్తి తన ఇచ్ఛానుసారంగా ప్రవర్తించగల స్థితిలో ఉండటంలో ఈ పదానికున్న అర్థ విశిష్టత కనిపిస్తుంది. కానీ వాస్తవంలో ఇది అసంభవం. ఎటువంటి ఆంక్షలు లేని స్వేచ్ఛ అంటూ ఎక్కడా కూడా ఉండదు. సమష్టి నియమనిబంధనలు లేకుండా సంఘంలో వ్యక్తులు కలసి ఉండలేరు. మానవులలో ఉండే దురాశకు ఫలితంగానే ఈ సమష్టి ప్రవర్తనా నియమావళి అవసరం కనిపిస్తుంది. తోటివారి ప్రయోజనాలను నిర్లక్ష్యం చేసి ప్రతివ్యక్తి తన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే సమాజంలో నిరంతరం ఘర్షణలు చెలరేగే వీలుంది.

సక్రమ జీవనాన్ని పెంపొందించే నియమావళిని చారిత్రక అనుభవం రూపొందించింది. వాటిని శిరసావహించమని నిర్బంధించడం సమర్థనీయ స్వేచ్ఛ పరిమితే అవుతుంది. కనక స్వేచ్ఛ అంటే ఇతరుల స్వాతంత్ర్యానికి హాని కలిగించని స్వాతంత్ర్యం. దీని అంతరార్థమేమంటే సమాజంలో ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత ఎక్కువగా స్వేచ్ఛను అనుభవించడానికి అవసరమైన నిగ్రహాన్ని పాటించవలసి

ఉంటుంది. కనక స్వేచ్ఛను పెంపొందించడానికి సమాజంలో వ్యక్తుల మధ్య పరస్పర గౌరవం, సృహ్నాద్భావం ఉండాలి. ఒక వ్యక్తి ఏది కోరుకుంటున్నాడో, దానిచే ఇతరులకు కూడా ఇవ్వడానికి సిద్ధం కావలసి ఉంటుందనేది గ్రహించాలి.

సార్వజనీన శ్రేయస్సుకు దోహదంచేసే పరిమితులకు లోబడి వ్యక్తులు తమ చర్యలను మల చుకోవాలి. ఆవిధమైన నిర్బంధాలు స్వేచ్ఛను హరించవు. నిరంకుశ, న్యాయవిరుద్ధమన ఆంక్షలు మాత్రమే స్వేచ్ఛను నాశనం చేస్తాయి. స్వేచ్ఛ అంటే కేవలం నిర్బంధాలు లేకపోవటమేకాదు. దానిలోని నిర్మాణాత్మక భావం కూడా ఇమిడి ఉంది. రాజ్యం కొన్ని పరిస్థితులను సృష్టించునపుడే స్వేచ్ఛ మనగలుగుతుంది. మానవుడు తన సంపూర్ణ వ్యక్తి వికాసానికి చేసే కృషికే తోడ్పడేవే ఆ పరిస్థితులు. స్వేచ్ఛా పూరిత వాతావరణంలోనే మానవులు వ్యక్తి వికాసం, మేధావృద్ధి సాధించుకోని తన అభీష్టానుసారం జీవితాలను తీర్చిదిద్దుకోగలరు. జాతి, కుల, మత, వర్గ, లింగభేదాలు లేకుండా పౌరులందరికీ సమాన అవకాశాలు ఉన్నప్పుడే స్వేచ్ఛ ప్రకాశిస్తుంది.

14.3.0 స్వేచ్ఛ రకాలు

ఈ స్వేచ్ఛకు రెండు రకాల కొలమానాలున్నాయి. అవి:

1. నిషేధాత్మక స్వేచ్ఛ
2. సంవర్ధక స్వేచ్ఛ

14.3.1 నిషేధాత్మక స్వేచ్ఛ

దీని ప్రకారం ఒక వ్యక్తి తనకు ఇష్టమైన పనిని యధేచ్ఛగా చేయడానికి పరిపూర్ణమైన స్వాతంత్ర్యం ఉండటం. దీనినే లైసెన్స్ అని కొందరు రాజనీతి శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు.

14.3.2 సంవర్ధక స్వేచ్ఛ

సంవర్ధక పద్ధతి అంటే - కట్టుబాట్లు పూర్తిగా ఉండవని అర్థంకాదు. లాస్కీ ప్రకారం - ఒక వ్యక్తి ప్రాథమికమైన వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవడానికి ఎటువంటి కట్టుబాట్లు ఉండకూడదు. తగు మాత్రపు కట్టుబాట్లు ఉండితీరాలి.

స్వేచ్ఛకు కట్టుబాట్లు అనేవి మరీ ఎక్కువైనా కూడా ప్రమాదకరమే, ఎందువల్లనంటే - వ్యక్తి స్వాతంత్ర్యానికి భంగం కలిగే ప్రమాదముంది. ప్రజలను అదుపులో పెట్టడం కంటే వారి మానాన వారినే ఉండనీయడం మంచిది అని జాన్ స్టూవర్ట్‌మిల్ (John Stuart Mill) విశ్వసించాడు. ఒక వ్యక్తి చేసిన చర్య కేవలం అతనికి మాత్రమే హాని కలగజేసినట్లైతే, ఆ వ్యక్తి స్వేచ్ఛపట్ల రాజ్యపరమైన జోక్యం ఉండనవసరంలేదు. కానీ ఒక వ్యక్తి స్వేచ్ఛ తోటి మానవునికి హానికలిగించినపుడు రాజ్యం జోక్యం ఉండాలి.

ప్రస్తుత కాలంలో నిషేధాత్మక పద్ధతి అంతగా ఆసక్తికరంగా లేదు. పెరుగుతున్న రాజ్యాధికారాలను బట్టి వ్యక్తిగత స్వేచ్ఛ ఎక్కువ ప్రాధాన్యం పొందుతున్నది. మానవుడు సంఘజీవి కనక, అతడు అనుభవించే స్వేచ్ఛ ఇతరులపై ప్రభావం చూపడం తప్పనిసరిగ ఉంటుంది. సాధ్యమైనంత వరకు కట్టుబాట్లు లేకుండా ఉండాలనే నిషేధాత్మక పద్ధతి వాంఛిస్తుంది. సహజమైన కట్టుబాట్లు ఉండటం మంచిదని సంవర్ధక పద్ధతి భావిస్తుంది. ప్రఖ్యాత శాస్త్రవేత్తలు మిల్ (Mill), హీక్ మొదటి అభిప్రాయాన్ని బలపరుస్తారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి (Oxford University) చెందిన ---- బెర్లిన్, ఆయన స్వంత అర్థాన్ని విపులీకరించాడు.

బెర్లిన్ (BERLIN) ఉద్దేశంలో స్వేచ్ఛకు రెండు వైపులు ఉన్నాయి. ఈ రెండు వైపులను విడదీయడం కష్టతరం. మానవుని చర్యలు ఏరకమైనటువంటివి అయినప్పటికీ, అతడు స్వతహాగా నిర్ణయం తీసుకొని ప్రవర్తించడానికి ఏ విధమైనటువంటి ఆంక్షలు లేకుండా ఉండాలి. మానవుని స్వేచ్ఛకి రాజ్యం కొన్ని నిబంధనలు విధించినప్పటికీ, అవి తను ఎంచుకొన్న దారికి ప్రతిబంధకంగా ఉండరాదు. అధికారం సరైన వారి చేతిలో ఉన్నప్పుడు స్వేచ్ఛ అభివృద్ధి పొందుతుందని భావించాడు.

14.4.0 స్వేచ్ఛ - శాఖలు

సూక్ష్మంగా చెప్పాలి అంటే - బానిసత్వానికి, నిర్బంధానికి, రాజకీయ ఆకాంక్షలకీ సంబంధంలేనటువంటి ఒక విధమైన స్వతంత్ర వాతావరణం. కాని కొంచెం విశాల దృష్టితో పరిశీలిస్తే - స్వేచ్ఛ అనే దానికి బహుశాఖలు కనిపిస్తాయి. అవి (1) సహజ స్వాతంత్ర్యం, (2) సాంఘిక స్వాతంత్ర్యం (3) నైతిక స్వాతంత్ర్యం అనేవి.

14.4.1 సహజ స్వేచ్ఛ

మానవుడు తను తలచిన చర్య ఏదైనా సరే స్వేచ్ఛగా చేయగలగడం సహజ స్వాతంత్ర్యం అవుతుంది. అంటే అతనికి ఏ విధమైన కట్టుబాట్లు కూడా ఉండవన్నమాట. సృష్టిలో జంతువులు ఎంతస్వేచ్ఛగా ఉండగలవో, మానవుడు కూడా అదే విధంగా ప్రవర్తించే తీరును సహజస్వేచ్ఛగా చెప్పవచ్చు. కానీ స్వేచ్ఛ అన్నది కొన్ని కట్టుబాట్లతో ఉండాలి కనక, ఈ సహజ స్వేచ్ఛ అనేది మానవ సమాజానికి పనికిరాదు. అపరిమిత స్వేచ్ఛ వాస్తవంలో అసంభవం. ఇది తోటి వారి సహజ హక్కుల మీద దాడిచేస్తుంది. నిజమైన స్వేచ్ఛను రాజ్యంలో మాత్రమే అనుభవించడానికి వీలుంటుంది. ఒక వ్యక్తి నిజమైన స్వేచ్ఛ మరొకరి స్వేచ్ఛకు ఎన్నటికీ హానికరం కారాదు.

సహజ స్వేచ్ఛ సిద్ధాంతానికి, సహజ న్యాయంతో సాన్నిహిత్య సంబంధం ఉంది. రోమన్ల ఉద్దేశంలో - సహజ న్యాయం, మానవులను సమష్టి జీవితాల సూత్రాలతోను, సాంఘిక సంబంధాలతోను ఒకటిగా చేసేది హేతున్యాయం. మధ్య యుగాలలో సహజన్యాయాన్ని, దైవిక న్యాయంతో సమానంగా పరిగణించారు. 17,18 శతాబ్దాలలో సహజ స్వేచ్ఛకి, రాజకీయ ప్రాధాన్యం లభించింది. సహజ న్యాయానికి స్వాతంత్ర్యానికి మధ్యగల సంబంధాన్ని జాన్‌లాక్ చాలా వివరంగా తెలిపాడు. రూసో రాతలలో దీనికి మరింత బలం చేకూరింది.

సహజ న్యాయంలో, సహజ సమానత్వం కూడా ఒక ముఖ్య సూత్రమే. ప్రకృతి సిద్ధంగా మానవులందరికీ సహజ స్వేచ్ఛ ఉందని చెప్పేదే ఈ సిద్ధాంతం. కానీ వాస్తవిక సాంఘిక జీవితంలో వ్యక్తుల మధ్య సహజ సమానస్వేచ్ఛ కనిపించదు. సహజస్వేచ్ఛ అనే పేరుతో దీనికి హద్దులు లేకుంటే అన్యాయానికి, అక్రమానికి ప్రోత్సాహం లభిస్తుంది. కనక రాజ్యాధికారానికి సామాజిక బాధ్యతలకు వ్యక్తి స్వేచ్ఛ లోబడక తప్పదు. కనక సహజస్వేచ్ఛలోని లోపాలను నేటి ఆధునిక రాజనీతిజ్ఞులు స్పష్టంగా గ్రహించారు.

14.4.2 సాంఘిక స్వేచ్ఛ

వ్యక్తిగత స్వేచ్ఛ, రాజకీయ స్వేచ్ఛ, మతస్వేచ్ఛ, ఆర్థిక స్వేచ్ఛ, జాతీయ స్వేచ్ఛ మొదలైనవి దీనిలోని ఉపశాఖలు. సాంఘిక స్వేచ్ఛ అంటే సంఘంలోని ఒక సభ్యునిగా మానవుడు జీవితంలో పొందే స్వేచ్ఛ. అంటే మానవుడు తనపై విధించిన కట్టుబాట్లకి లోబడి తాను చేయదలచిన చర్యని చేయడమనేది సాంఘిక స్వేచ్ఛ. ఇప్పుడు దీని ఉపశాఖలను కింది విధంగా పేర్కొనవచ్చు.

1. వ్యక్తిగత స్వేచ్ఛ:

బ్లాక్‌స్టోన్ ప్రకారం వ్యక్తి స్వేచ్ఛ మూడురకాలు. (i) మానవుడు తన ఆరోగ్యాన్ని, జీవితాన్ని, మనస్సుని కాపాడుకొనే హక్కు; (ii) స్వేచ్ఛగా తిరగడం (iii) తన ఆస్తిని స్వేచ్ఛగా అనుభవించటానికి విక్రయించడానికి స్వేచ్ఛ ఉండటం

2. రాజకీయ స్వేచ్ఛ:

రాజకీయ స్వేచ్ఛ ఉంటే ప్రభుత్వ వ్యవహారాలలో ప్రజలు కూడా పాలుపంచుకోవడం, ఒక పౌరునిగా మానవుడు చక్కటి ప్రజాభిప్రాయాలను తెలుసుకోవడానికి అనువైన పరిస్థితులు, న్యాయబద్ధమైన ఎన్నికలు, ఓటుహక్కు మొదలైనవి రాజకీయ స్వేచ్ఛకి చెందుతాయి. అంతేకాకుండా రాజకీయ స్వేచ్ఛ ఉన్న ప్రజలు ప్రభుత్వంపై అధికారం ఉండి, అవసరమైనపుడు ఆ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే స్వేచ్ఛ వారికుంటుంది.

లీకాక్ రాజకీయ స్వేచ్ఛను రాజ్యాంగబద్ధ స్వేచ్ఛ అని పేర్కొన్నారు. దాని మూలంగా ప్రజలందరికీ బాధ్యత వహించే ప్రభుత్వాన్ని ఎన్నుకొనే హక్కు లభిస్తుంది. గిల్‌క్రిస్ట్ రాజకీయ స్వేచ్ఛను ఆచరణలో ప్రజాస్వామ్యంగా పరిగణించారు. మొదటి స్వేచ్ఛ నినాదం లేవ దీసినవారు దానికోసం పోరాడినవారు యధార్థానికి వ్యతిరేకంగా తమ పౌరహక్కులను కాపాడుకోవటానికి కేవలం వాటి గుర్తింపు మాత్రమే చాలదని త్వరలోనే గ్రహించారు. ఈ లక్ష్య సాధనకోసం ప్రభుత్వ విధానాల మార్పు కోసమేకాక అవసరమైతే ప్రభుత్వాన్నే మార్చి వేయడానికి ప్రజలు నిర్వహించే అధికారమే రాజకీయ స్వేచ్ఛ. దీనిని బట్టి ప్రజాస్వామ్య వ్యవస్థ పనిచేసే దేశాలలో మాత్రమే రాజకీయ స్వేచ్ఛ అనుభవించడానికి వీలున్నది.

3. ఆర్థిక స్వేచ్ఛ:

వివేకానందుడు చెప్పినట్లు - ఆకలి బాధతో అలమటించే మనిషికి 'స్వేచ్ఛ' అర్థరహితం. అందు వల్లనే రాజకీయ స్వేచ్ఛ కంటే ముందుగా ఆర్థిక స్వేచ్ఛ లభించాలని భావించవలసి ఉంది. ఆర్థిక స్వేచ్ఛ అంటే ప్రతివ్యక్తికీ జీవనోపాధికి అవసరమైన అవకాశం భద్రత ఉండటం ఒక వ్యక్తి ఏమైనా వస్తువులను తయారు చేయటానికి, అమ్మడానికి స్వాతంత్ర్యం ఉండాలి. పారిశ్రామిక గణతంత్ర రాజ్యస్థాపన కూడా ఈ అంశంపైనే ఆధారపడిఉంది.

ఆర్థిక స్వాతంత్ర్యం గురించి వివాదాలు చాలా ఉన్నాయి. మితవాదులు పుష్టికరమైన ఆర్థిక విధానానికి సుముఖంగా ఉంటే సామ్యవాదులు ప్రజాస్వామ్య శ్రేయస్సుకోసం వ్యక్తిగత ఆస్తులను కూడా జాతీయం చేయాలని భావిస్తారు. కమ్యూనిస్టులు వ్యక్తిగత ఆస్తి రద్దుపరచి నిరుద్యోగులకు ఆర్థిక వనరులను కల్పించాలని వాదిస్తారు. కనక దారిద్ర్య భయాల నుండి విముక్తి పొంది, రాజకీయ స్వేచ్ఛ పొందాలంటే ఆర్థిక స్వేచ్ఛ చాలా అవసరం.

హాబ్స్ ప్రకారం - ఒక కుటుంబంలోని తల్లిదండ్రులకు పిల్లలకు వ్యక్తిపరంగా ఉండే స్వేచ్ఛ, పిల్లల వివాహ విషయంలో వారికి స్వేచ్ఛ ఈయాలి. అలాగే తల్లిదండ్రులు పిల్లలు అభివృద్ధికి కృషి చేయాలి. తల్లికి గౌరవమైన స్థానం అనేది అనివార్యంగా భావించవలసి ఉంది.

సాంస్కృతిక స్వేచ్ఛ అంటే ఆచార వ్యవహారాలలోను వస్త్రాధారణలోను, భోజనం అలవాట్లలోను, దైవారాధనలోను, మత విశ్వాసంలోను, జీవితపు విలువలలోను తనతోపాలు పంచుకొంటూ ఉండే వ్యక్తులతో కలిసి జీవించడానికి, తన జీవన విధానానికి భిన్నమైన సంప్రదాయాలను అనుసరించే వారివల్ల తనకు ఎటువంటి ఇబ్బందిగాని, అమర్యాదగాని, ఆపదగాని కలగకుండా వ్యక్తి కోరుకొనే స్వేచ్ఛను సాంస్కృతిక స్వేచ్ఛ అని అనవచ్చు.

సాంస్కృతికాభ్యున్నతి కోసం కృషిచేసే స్వేచ్ఛ రాజ్యంలో అన్ని వర్గాల పౌరులకు ఉండాలి. అధిక సంఖ్యాకుల మద్దతుతో అవమానాలు గాని, అవరోధాలుగాని కలిగించినట్లైతే ప్రజాస్వామ్యం లక్షణాలలో అతి ముఖ్యమైన మానవస్వేచ్ఛకే తీరని ఘాతకం వాటిల్లి రాజ్యపునాదులే కదిలిపోయే ప్రమాదముంది.

14.4.4 జాతీయ స్వేచ్ఛ

పరాయి పాలన నుంచి విముక్తికి పోరాడి స్వాతంత్ర్యం పొందడమన్నమాట. అందువల్లనే భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం జాతీయోద్యమంగా పరిగణించబడింది. ఉదా. మనదేశం 1947 లో స్వాతంత్ర్యం సాధించింది. అమెరికా వాసులు 1776 లో స్వాతంత్ర్యం పొందారు. చారిత్రకంగా చూసినప్పుడు ప్రజల హృదయాలలో దేశభక్తి నాటుకొని పోవడం మూలంగా అనేకమంది దేశభద్రత కోసం త్యాగాలు చేసినట్లు మనకు తెలుస్తుంది.

14.4.5 అంతర్జాతీయ స్వేచ్ఛ

ప్రపంచమంతా శాంతి నెలకొల్పబడి ఉండాలి. హింసకి తావుండరాదు. అంతర్జాతీయ స్వేచ్ఛ అంటే ప్రపంచ దేశాలలోని దేశాలు యుద్ధాలు త్యజించడం, యుద్ధ సామగ్రి ఉత్పత్తి నిలిపివేయడం, దేశాల మధ్య తగవులు లేకుండా ఉండటం మూలంగా మానవజాతి పొందే స్వేచ్ఛ. "సర్వేజనో సుఖినోభవంతు" అన్న సూక్తిపై ఆధారపడినట్లుగా ప్రపంచమే స్వేచ్ఛగా ఉన్నపుడు దౌర్జన్యానికి తావుండదు.

14.4.6 నైతిక స్వేచ్ఛ

ప్లాటో, అరిస్టాటిల్, రూసో, హేగల్, గ్రీన్ మొదలైన శాస్త్రవేత్తలు నైతిక స్వాతంత్రానికి ప్రాముఖ్యం ఇచ్చారు. ఒక వ్యక్తికి అన్ని రకాల స్వేచ్ఛ లభించినప్పటికీ నైతిక స్వాతంత్ర్యం అతనికి లేనట్లైతే, మానవునికి ఉండవలసిన ముఖ్యలక్షణం లేనట్లుగా గుర్తించవచ్చు. ప్రతి వ్యక్తికి వ్యక్తిత్వముంటుంది. ఆ వ్యక్తిత్వాన్ని గౌరవించి నపుడే ఎదుటి వ్యక్తి వ్యక్తిత్వాన్ని గౌరవించగలుగుతారు.

మార్క్స్ దృష్టిలో - సాంఘిక జీవనంలో ఉన్న ఆర్థిక విధానమే, స్వేచ్ఛ. అంటే - కొన్ని హక్కులు కలిగి ఉన్న ఒక మాట అని, మానవుడు తన వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసేటందుకు తోడ్పడుతుందని చెప్పారు. పెట్టుబడిదారి విధానం నిర్మూలించి, సామ్యవాదం ప్రవేశపెట్టడమే కాక అందరికీ సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమై ఉండవలెనన్నాడు.

14.7 అధికారం

రాజనీతి శాస్త్రంలోను, సాంఘిక శాస్త్రాలలోను అధికారం అనేమాట సాధారణంగా నాయకత్వం ప్రభావం, శక్తి అనే పదాలతో సంబంధించి వాడడం జరుగుతున్నది. బెట్రాండ్ డి. జోవిలిన్ ప్రకారం అధికారం అనే ఉత్పాదం రాజ్యం అనే ఉత్పాదానికంటే చాలా పురాతనమైంది. అయితే ఒక వ్యక్తిపైన మరొక వ్యక్తి అధికారం మానవ సాంఘిక వ్యవస్థలలో సర్వసాధారణంగా కనిపిస్తున్నది. సాంఘిక శాస్త్రాలు అభివృద్ధి చెందడం మొదలు పెట్టినప్పటి నుంచి 'అధికారం' అనే ఉత్పాదం పై చాలా పరిశోధనలు జరుగుతున్నాయి.

సోక్రటీసు న్యాయ విచారణ అధికారం అనే ఉత్పాదానికి ఒక సవాలు అయ్యాడు. రాజ్యం విధించిన న్యాయాన్ని సమ్మతించలేక ఆ రాజ్య పౌరసత్వాన్ని విడవడం ఇష్టంలేక రాజ్యం విధించిన తీర్పు న్యాయసమ్మతమైనదని ఒప్పుకొని విషం తాగి చనిపోయారు సోక్రటీసు. రాజ్యనీతిలో అధికార స్థానం, సార్వభౌమాధికార స్థానం, స్వేచ్ఛా అధికారాల సరిసమానత మొదలైన ప్రశ్నలు ప్లాటో, అరిస్టాటిల్ నుంచి ఈ నాటికి రాజనీతి తత్వ శాస్త్రానికి సమాళ్ళగానే ఉన్నాయి.

ఆగస్టీన్, ఆక్వినాస్, మైకెవల్లీ, హాబ్స్, లాక్, రూసో ముఖ్యంగా 20వ శతాబ్దపు సాంఘిక శాస్త్రజ్ఞుల ప్రకారం, అధికారం, శక్తి సంఘంలో ఏ విధంగా పంపిణీ చేయబడింది అనే ప్రశ్నలకు కూడా వారు సమాధానాలు ఇచ్చారు.

1930 సంవత్సరంలో మిచెల్స్, అధికారం అంటే "కొంత మంది వ్యక్తులపైన ప్రాధాన్యం వహించే సహజమైన లేదా ఆర్జించి నటువంటి సామర్థ్యం" అని నిర్వచించాడు. 1954లో బైరిష్టి అధికారమంటే సామర్థ్యం కాదని, ఒక విధమైన సంబంధమని చెబుతూ అది సహజసిద్ధమైనదికాదు, ఆర్జించినదీ కాదు అని అన్నారు.

మైక్రెవర్ ప్రకారం - అధికారమంటే "సాంఘిక వ్యవస్థలోనైనా విధానాలు నిర్ణయించడానికి, ప్రస్తుత అంశాలమీద తీర్పులు ప్రకటించడానికి, వివిధ వివాద గ్రస్త విషయాలను పరిష్కరించడానికి లేదా నాయకునిగా వ్యవహరించడానికిగాని ఇతర వ్యక్తులకు మార్గదర్శకత్వం వహించడానికి గాని అవసరమైన ప్రతిష్టాపిత హక్కు" అని అభిప్రాయపడ్డారు.

అధికారమనేది ప్రతి రంగంలోను ప్రతి వర్గానికి ఉంటుంది. మతంలోను, విద్యలోను, శాస్త్రం లోను, కళలలోను అన్నింటిలోను అధికారముంది. ప్రతి వ్యవస్థలోను అధికారముంది. లేకుంటే అది నిర్వర్తించగలిగే కార్యమే అవుతుంది. అధికారం లేనిదే శాంతి భద్రతలుండవు. అధికులుగా అంగీకరించిన వ్యక్తులలోగల, సంఘటిత వర్గాల ప్రతినిధులైన వ్యక్తులలో గాని ఈ అధికారముంటుంది. ఒక వ్యక్తి మాటకు ఇతరులు విలువ ఇచ్చినపుడు అతనిని ఒక అధికారిగా పరిగణిస్తారు.

ఒక అధికారి అంటే నిర్ణయాలు చేయడానికి ఏ సాంఘిక వ్యవస్థలోనైనా క్రమపద్ధతిని కాపాడటానికి హక్కున్న వ్యక్తి లేదా వ్యక్తుల సముదాయం అని స్పష్ట పరచవలసిఉంది. ఈ భావంలో ఒక అధికారి వ్యక్తిగత హోదాలో వ్యవహరించడు. ఈ ప్రయోజనాన్ని నెరవేర్చడానికి సమాజం తనకిచ్చిన హక్కు ద్వారా మాత్రమే వ్యవహరిస్తాడు. రాజకీయ వ్యవస్థలో సమాజ శాంతి భద్రతల రక్షణ ప్రాథమిక మైంది. ఇక్కడ క్రమపద్ధతి అనేది ఎంత మౌలికమైనదో అధికారం కూడా అంతే మౌలికమైంది.

నిరాడంబర సమాజంలోని క్రమపద్ధతి గమనిస్తే వాటి నాయకుడుగాని, పెద్దల సభగాని, చట్టా లనేవేమీ రూపొందించరని తెలుసుకోవచ్చు. కేవలం సందర్భవశాత్తు జనపదుల మధ్య ఉత్పన్నమైన వివాదాలు మాత్రమే పరిష్కరిస్తారు. ఒక్కొక్కప్పుడు ఒక నాయకుడుగాని, కనీసం ఒక న్యాయమూ ర్తిగాని ఉండరు. అయినప్పటికీ సమాజ క్రమం నెరవేరును. అదే విధంగా పాత ఫక్కీ సమాజాన్ని పరిశీలించినా అందులో కూడా స్థానిక సమాజ పెద్దల సభలు జానపదుల జీవన పద్ధతులు, వారి మౌలిక క్రమాన్ని ఎటువంటి సంపూర్ణ సామ్రాజ్య సార్వభౌమాధికార వినియోగాలతోను నిమిత్తం లేకుండానే సంరక్షించినట్లు గమనిస్తాం.

దీని ప్రకారం ప్రభుత్వాధికారం క్రమపద్ధతిని సృష్టించదు. కేవలం తన ఆదేశాల ద్వారాగాని, సముపార్జించుకొన్న సమర్థత ద్వారాగాని, ఆ క్రమపద్ధతిని నిలబెట్టలేదు. ప్రభుత్వాధికారాన్ని మించిన అధికారం మరొకటి ఉంది. అదే సాధారణ అభిప్రాయం. అది లేకపోతే సమాజ మౌలిక క్రమం విచ్ఛిన్న మవుతుంది. ఈ సాధారణ అభిప్రాయం వివిధ ప్రభుత్వ స్వరూపాల కింద వివిధ పాత్రలను నిర్వహిస్తుంది.

ఒక్కొక్కప్పుడు పరిపాలకుడు తాను రక్షించవలసిన మౌలిక క్రమాన్ని తానే ఉల్లంఘించినా అసాధారణమైన, విప్లవాత్మకమైన హింసాకాండ జరిగితే తప్ప దాని వ్యక్తీకరణకు మార్గముండదు. ఒక్కొక్కప్పుడు అవి ప్రభుత్వ చర్యలపట్ల అప్రమత్తతతోను, సునిశితత్వంతోను వ్యవహరించి ప్రభుత్వ మనుసరించే విధానం పట్ల అంగీకారమో, తిరస్కారమో తెలుపుతుంది.

దీనిని బట్టి అధికారం, శక్తి రెండూ ఒకటి కావని సార్వభౌమత్వమంటే అపరిమితశక్తి అని, చట్టాల మీద చట్టాలు ఆధిపత్యమున్నదని చెప్పే పాత సిద్ధాంతం ఎంతగా పెడత్రోవనను పట్టించిందో మనకు స్పష్టంగా తెలుస్తున్నది. ఇక సామాన్య సజాతీయ సమాజ పరిస్థితులలో తప్ప తదితర పరిస్థితులన్నింటిలోనూ ఒక రాజ్య ప్రభుత్వంగా ఏర్పాటైన అధికారం మౌలిక క్రమ సంరక్షణకు అత్యంతావశ్యకమే.

దీనికి కారణం ప్రభుత్వం క్రమపద్ధతని సృష్టిస్తుందనీ కాదు, దాని సంరరక్షణలో ప్రభుత్వం ముఖ్యాంగమనీకాదు. దీనికి కారణమేమంటే ప్రభుత్వం లేకుండా వర్గ ప్రయోజనాలలో గల ఒత్తిళ్ళు, సంఘర్షణలు, సమాజ సాధారణ అభిప్రాయం వాటిని అదుపులో పెట్టలేదు. దీని వల్ల చివరికి సాధారణ అభిప్రాయమే అపజయం చెంది విచ్ఛిన్నమౌతుంది.

దీనికి మరొక కారణం - కేంద్ర ప్రభుత్వం అనేది లేకపోతే కొత్త పరిస్థితుల చికాకులను సమాజం తట్టుకొనలేదు. సర్దుకోలేదు. తన అవసరాలకు, విలువలకు అనుగుణమైన విధేయతలను, హక్కులను స్పష్టంగా తెలియజేసే నియమావళిని ఏర్పరుచుకోలేదు.

ఆ విధమైన ప్రభుత్వం రెండు ప్రధాన లక్ష్యాల కోసం అధికారాన్ని చెలాయిస్తుంది. ప్రతిష్టాపిత నియమావళిని చట్టబద్ధంగా రూపొందించబడినంత వరకు, సంరక్షించటం, చట్ట నియమావళినే సివిల్ - క్రిమినల్ కోడ్‌లుగా స్థూల విభజన చేయవచ్చు. మొదటిది - ప్రైవేట్ హక్కులను కాపాడుతుంది. రెండోది సమిష్టి శ్రేయస్సుకు భంగం కలిగించే నేరాలను శిక్షిస్తుంది.

ఈ ప్రభుత్వ లక్ష్యంలో న్యాయ నిరూపణ, ప్రతిష్టాపిత వ్యవస్థా ధృవీకరణ రెండూ ఉన్నాయి. న్యాయమనేది చట్టరీత్యా నిర్ధారితమైంది. ప్రభుత్వ లక్ష్యాలలో రెండోది కొత్త పరిస్థితులకు, అవసరాలకు అనుగుణంగా వ్యవస్థను పునర్నిమించటం. ప్రభుత్వానికి ఉన్న శక్తే ఈ విధులను నిర్వర్తించటానికి సరిపోయేటట్లు ఉండాలి. సమాజ సేవా పరిమితులను అది అతిక్రమించనదిగా ఉండాలి. రాజకీయాలలో శక్తి ప్రాధాన్యాన్ని గుర్తించినంత ఎక్కువగా అధికార ప్రాధాన్యాన్ని గుర్తించినట్లు లేదని కార్ల్. జె. ఫ్రెడ్రిక్ వ్యాఖ్యానించారు.

మాకియవెల్లీ, హాబ్స్ వంటి శక్తి సిద్ధాంతవాదులు సహితం అధికార సమస్యను గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది చాలా తక్కువ. ఏమైనా శక్తి, అధికారం రెండూ వేరు వేరు విషయాలని మాత్రం గుర్తించక తప్పదు. సమర్థత ఉన్న వారిని, పదవిలో ఉన్నవారిని అధికారులు అనటం పరిపాటి అయింది. దైనందిన సంభాషణలలో ఆ విధంగా మాట్లాడటం ఒక వేళ తప్పనిసరి అయినప్పటికీ సుస్పష్ట రాజకీయ విశ్లేషణ కోసం అధికారాన్ని, శక్తిని వేరుచేసి వాటి మధ్యగల భేదాలను గ్రహించటం చాలా ముఖ్యం. అధికారమనేది ఒక విధమైన సమర్థత కాదు. కానీ అది సమర్థతతోపాటు వస్తుంది.

ఈ విషయంలలో పలువురు శాస్త్రజ్ఞుల అభిప్రాయాలను గమనించవలసి ఉంది.

14.6 ప్రాచీన శాస్త్రవేత్తల అభిప్రాయం

ప్రాచీన తత్త్వవేత్తలైనటువంటి జాన్‌స్టూవర్ట్‌మిల్, ఆడమ్‌స్మిత్, హెర్బర్ట్ స్పెన్సర్ మొదలైన వారు వ్యక్తి స్వేచ్ఛ రాజ్యాధికారంలో పొసగదు అని భావిస్తారు. అయితే రాజ్యం ఒక అనివార్య క్లేశం కనక రాజ్యానికి వ్యక్తులపై తగు మాత్రం అధికారం ఉన్నట్లైతే వ్యక్తికి స్వేచ్ఛ ఉన్నట్లు అవుతుందనే ఉద్దేశాన్ని స్పష్టంగా వ్యక్తం చేశారు.

14.7 అరాచక వాదుల అభిప్రాయం

అరాచక వాదులు కాస్తా ముందుకెళ్ళి రాజ్యాన్ని ఒక అనవసరమైన క్లేశంగా భావించి దాన్ని వ్రేళ్ళతోటి పెకిలించి వేయాలంటారు. వారి దృష్టిలో ఏ విధమైనటువంటి అధికారమైనా చెడ్డదే. ఎందువల్లనంటే అది వ్యక్తి స్వేచ్ఛను అదుపులో పెడుతుంది కనక ఇట్లు భావించిరి.

ప్రముఖ అరాచక వాదులైనటువంటి ప్రౌధాన్, బాకునిన్, క్రోపోటికిన్ మొదలైన వారి ప్రకారం వ్యక్తిని పెట్టుబడిదారీ వర్గం, రాజ్యం, మతం మొదలయిన వాటి బారి నుంచి ఉద్భవించాలి అంటే, ఆర్థిక, రాజకీయ, మత సంబంధమైన అధికారాలు ఉండకూడదనేది అరాచక వాదుల ప్రధానమైన ఉద్దేశంగా చెప్పవచ్చు.

14.8 మార్క్సిస్టుల అభిప్రాయం

మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం రాజ్యమంటే ఒక వర్గం, ఇంకో వర్గాన్ని కుంగదీయడానికి ఉపయోగపడే ఆయుధం మాత్రమే. అనేక ఆంక్షలతో వేదవారిది స్వేచ్ఛ అనుభవించనీయకుండా కలవారి యశస్సుని అభివృద్ధి చేస్తుంది.

14.9 ప్రజాస్వామ్య వాదుల అభిప్రాయం

వీరి దృష్టిలో ప్రజాశ్రేయస్సు దృష్ట్యా - వ్యక్తుల స్వేచ్ఛని అదుపు చేసేటటువంటి శ్రేయస్కరమైన యంత్రాంగం రాజ్యం. అందువల్ల వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కాపాడటం కోసం రాజ్యం చట్టాన్ని రూపొందిస్తుంది. చట్టాన్ని ఉల్లంఘించిన వారు శిక్షార్హులు. హాబ్స్, లాక్, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా పలు ఆంక్షలు ఉండటాన్ని హర్షించారు.

14.10 ఫాసిస్టుల అభిప్రాయం

వీరి ప్రకారం రాజ్యంకోసం ప్రతీ ఒక్కరు త్యాగం చేయవలసి ఉంటుంది. రూసో, హెగెల్ ప్రతిపాదించి నటువంటి 'రాజ్యం ఎప్పుడూ తప్పు చేయదు' అనే వాదాన్ని బట్టి ఫాసిస్టులు ఉత్సాహపూరితులయ్యారు. మానవుడు సంఘజీవి కనుక అతని అభివృద్ధి సంఘంలోని తోటి మానవుల మధ్యనే పొందగలడు కనక పూర్తి స్వాతంత్ర్యం, రాజ్యాధికారానికి భంజనం కారాదు.

14.11 ముగింపు

స్వేచ్ఛ - అధికారం గురించి చర్చించినపుడు చివరగా ఒక విషయాన్ని విస్మరించరాదు. స్వతహాగా స్వేచ్ఛ అంటే కొన్ని ఆంక్షలతో కూడుకొన్నది. ఒకరి స్వేచ్ఛ మరొకరి స్వేచ్ఛకి భంగం కలిగించేది స్వేచ్ఛకాదు. లాస్కీ చెప్పినట్లు - సత్పరివర్తన దృష్ట్యా రూపొందించిన ఆంక్షలు న్యాయబద్ధమైనవి. అందువల్ల అధికారం లేనిదే స్వేచ్ఛ లేదు. అలాగని స్వేచ్ఛలోని ప్రతీ లేశాన్ని బలపరచటం అధికారం ధ్యేయం కాదు.

– ఆచార్య డి. సూరన్ నాయుడు

11.12 చదువదగిన పుస్తకాలు

Lipset	:	Political man
Mill J.S.	:	On Liberty
Laski H.J.	:	Grammer of Politics

14.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

1. స్వేచ్ఛ అనే భావాన్ని వివరించి, స్వేచ్ఛలోని రకాలను చర్చించండి.
2. సాంఘిక స్వేచ్ఛలోని రకాలను వివరించండి.
3. అధికారం అనే భావానికి పలువురు శాస్త్రవేత్తలు ఇచ్చిన అభిప్రాయాలను వివరించి రాజకీయ విశ్లేషణలో అధికారం ప్రాముఖ్యాన్ని వివరించండి.
4. స్వేచ్ఛ - అధికారం సంబంధాన్ని వివరించండి.

*****

భాగం-15 : రాజ్యాంగ బద్ధతా వాదం

విషయక్రమం

15.1 లక్ష్యాలు

15.2 పరిచయం

15.3 రాజ్యాంగ వాదం అర్థం

15.4.0 రాజ్యాంగ వాదం - పరిణామం

15.4.1 గ్రీకు రాజ్యాంగవాదం

15.4.2 రోమన్ రాజ్యాంగవాదం

15.4.3 మధ్యయుగ రాజ్యాంగవాదం

15.4.4 పునరుజ్జీవన కాలంలో రాజ్యాంగ వాదం

15.4.5 ఇంగ్లండ్‌లో రాజ్యాంగ వాదం

15.4.6 ఫ్రెంచి రాజ్యాంగ వాదం

15.4.7 అమెరికా రాజ్యాంగవాదం

15.4.8 మొదటి ప్రపంచ యుద్ధం తరువాత రాజ్యాంగవాదం

15.4.9 రెండవ ప్రపంచ యుద్ధం తరువాత రాజ్యాంగవాదం

15.5 వివిధ రాజ్యాంగ వాద భావనలు

15.6 రాజ్యాంగ వాదం : పశ్చిమదేశాలు

15.7 మార్క్సిస్టులు - రాజ్యాంగవాదం

15.8 అభివృద్ధి చెంతుతున్న దేశాలలో రాజ్యాంగవాదం

15.9 రాజ్యాంగ వాదం : సమస్యలు, అభ్యున్నతి

15.10 ముగింపు

15.11 చదుదగిన పుస్తకాలు

15.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

15.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- రాజ్యాంగ వాదం అర్థం,
- పరిణామ క్రమం,
- వివిధ వాదాలు
- సమస్యలు అభ్యున్నతి గురించి బాగా వివరించగలుగుతారు.

15.2 పరిచయం

ఆధునిక రాజకీయాల తులనాత్మక అధ్యయనంలో రాజ్యాంగ వాదానికి లేదా సంవిధాన వాదానికి గణనీయమైన ప్రాముఖ్యం ఉంది. ప్రముఖ బ్రిటీష్ రాజ్యాంగ తత్వవేత్త (A.V. Dicey) వేర్కొన్నట్లు. "రాజ్యాంగ వాదం, రాజ్య సార్వభౌమాధికార నిర్వహణను ప్రత్యక్షంగా గాని, పరోక్షంగాగాని చాలవరకు ప్రభావితం చేస్తుంది." సాధారణంగా ఒక రాజనీతిజ్ఞుడు రాజ్య ఆవిర్భావం, స్వభావం, పరిణామం, వివిధ వ్యవస్థలు, ప్రభుత్వ స్వభావాలు, రాజ్య సిద్ధాంతాలను క్రమపద్ధతిలో క్షుణ్ణంగా అధ్యయనం చేస్తారు. రాజ్యాంగం రాజనీతి శాస్త్రంలో అంతర్భాగం, కాబట్టి ప్రతి రాజనీతి విద్యార్థి "ఏ సంస్థలు రాజ్యలక్ష్యాలైన శాంతి భద్రతల అభివృద్ధికి మౌలిక ఆధారరాలవుతున్నాయో, ఏ సంస్థలు రాజ్యానికి, సమాజానికి మూలాధారాలు అవుతున్నాయో ఆ సంస్థల స్వరూప, స్వభావాలను అధ్యయనం చేసి తీరాలి".

15.3 రాజ్యాంగ వాదం - అర్థం

రాజ్యాంగ వాదం అనే ఆధునిక భావన చట్టం, శాసనాలు నియంత్రించే రాజకీయ ఏర్పాటు ఉండాలని కోరుకొంటుంది. వ్యక్తుల కన్న చట్టం గొప్పదని రాజ్యాంగ వాదం భావిస్తుంది. జాతీయతా వాదం, ప్రజాస్వామ్యం, పరిమిత ప్రభుత్వం, అనే సూత్రాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. 'అధికార విభజన' ప్రతిరూపంగా దీనిని అనువర్తించవచ్చు. ఫ్రెడ్రిక్ (Freidrich) చెప్పినట్లు రాజ్యాంగవాదం అధికార విభజన ద్వారా ఒక ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రభుత్వ చర్యలను అదుపులో ఉంచుతుంది. రాజ్యాంగ వాదాన్ని అధ్యయనం చేయడం ద్వారా కొత్త పద్ధతులను, మెలకువలను తెలుసుకొని కొన్ని హద్దులను ఏర్పాటుచేసుకొని, వాటిని అమలుచేయవచ్చు. "రాజ్యాంగ వాదమంటే ప్రభుత్వం బాధ్యత వహించే కొన్ని సూత్రాల సముదాయం' అని చెప్పవచ్చు. రాజ్యాంగ వాదమంటే దేశంలో ఉన్నతంగా రాజ్యాంగం ఉండటం అని చెప్పవచ్చు. ఎందువల్ల నంటే రాజ్యాంగమనేది ప్రభుత్వ ఆయుధం లేదా ఆదేశ ప్రాధమిక చట్టం. రాజ్యాంగం ముఖ్యధ్యేయం ప్రభుత్వ నిరంకుశ లేదా ఏకపక్ష చర్యలను నివారించటం, ప్రజల హక్కులను కాపాడటం, సారభౌమాధికార పనితీరును నిర్వచించటం అని చెప్పవచ్చు.

రాజ్యాంగ వాదాన్ని సక్రమంగా అర్థంచేసుకోవాలంటే "రాజ్యాంగాన్ని, రాజ్యాంగ ప్రభుత్వాన్ని" గురించి మనం ముందుగా అర్థం చేసుకోవాలి.

ప్రభుత్వ అధికారాన్ని, ప్రజల హక్కులను, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఉన్న సంబంధాలు సక్రమంగా ఉండటానికి ఏర్పడిన కొన్ని సూత్రాల సముదాయమే రాజ్యాంగమని నిర్వచించవచ్చు. చట్టం ద్వారా వ్యవస్థీకృతమైన రాజకీయ సమాజ ఏర్పాటునే రాజ్యాంగమని అంటారు. ఈ చట్టమే కొన్ని శాశ్వత సంస్థలను ఏర్పాటుచేసి వాటికి కొన్ని విధులను ప్రత్యేక హక్కులను కల్పించింది. కె.సి. వేర్ (K.C. Wheare) అభిప్రాయం ప్రకారం రాజ్యాంగమనే పదాన్ని రెండు అర్థాలలో ఉపయోగిస్తున్నారు. ఒకదేశ ప్రభుత్వ వ్యవస్థను గురించి తెలుసుకోవాలంటే ప్రభుత్వాన్ని నియంత్రించే కొన్ని సూత్రాల సముదాయం గురించి తెలుసుకోవాలి. రాజ్యాంగం ఆ సూత్రాల సముదాయం గురించి తెలియజేస్తుంది. ఈ సూత్రాలు రెండు రకాలు 1. చట్టపరమైనవి (Legal) 2. చట్టపరం కానివి (Non-legal) చట్ట పరమైన సూత్రాలను కోర్టులు గుర్తిస్తాయి. వాటిని అమలు చేస్తాయి. అవగాహనలు, ఆచారాలు, సంప్రదాయాలను చట్టపరంకాని సూత్రాలు అంటారు. వీటిని కోర్టులు గుర్తించవు. ప్రభుత్వాన్ని క్రమబద్ధం చేయటానికి ఈ సూత్రాలు పనికి రావు అని చెప్పలేం. కాని ప్రపంచంలోని చాలా దేశాలలో ఉన్న ప్రభుత్వాలకు ఈ చట్టబద్ధమైన చట్టబద్ధంకాని సూత్రాలు ఉన్నాయి. ఈ సూత్రాల సముదాయమే రాజ్యాంగం అంటారు. ఒక సభ, ఒక ప్రత్యేక సమయంలో ఒక దేశ రాజ్యాంగాన్ని కొన్ని పత్రాలమీద రాయవచ్చు. అవసరాన్ని బట్టి సమయానుకూలంగా ఒక దేశ రాజ్యాంగాన్ని డాక్యుమెంట్‌పై రాసుకోవచ్చు. అందువల్ల రాజ్యాంగం కొన్ని ప్రత్యేక శాసనాల సముదాయం అవవచ్చు. ఒక దేశంలో ఉన్న చట్టాలు, ఆచారాలు, ఆదేశ రాజ్యాంగానికి ఆధారాలు అని చెప్పవచ్చు. ప్రపంచంలో ఉన్న వివిధ రాజ్యాంగాలను పరిశీలించినట్లయితే ఆదేశంలో ఉన్న రాజ్యాంగాలలో ప్రభుత్వాన్ని అదుపుచేసే కొన్ని చట్టబద్ధమైన సూత్రాలు ఉన్నాయి. ఆ సూత్రాలన్నీ ఒక డాక్యుమెంట్‌లో రూపొందించాయి. వీటికి విరుద్ధంగా బ్రిటన్‌లో ఉన్న రాజ్యాంగ సూత్రాలు డాక్యుమెంట్‌లో లేవు. ఈ సూత్రాలు అభివృద్ధికి చెందినవి. బోలింగ్ బ్రోక్ (Boling Broke) ప్రకారం ఇంగ్లాండ్ రాజ్యాంగంలో ఉన్న చట్టాలు, సంస్థలు ఆచారాలు, కొన్ని ఖచ్చితమైన సూత్రాల నుంచి ఆవిర్భవించినవి. అంతేగాక ఈ సూత్రాలను ఆదేశంలో ఉన్న ప్రజలు ఆమోదించారు.

రాజ్యాంగం అంటే చట్టం ద్వారా వ్యవస్థీకరించిన రాజకీయ సమాజం ఏర్పాటు (Frame of Political Society). అంతేగాక ఆ చట్టం కొన్ని శాశ్వత సంస్థలను ఏర్పాటుచేసి వాటికి కొన్ని హక్కులను, అధికారాలను అప్పగించింది. "రాజ్యాంగ రాజ్యం" అంటే ప్రభుత్వ అధికారాన్ని ప్రజల హక్కులను సర్దుబాటు చేయటం అని చెప్పవచ్చు. కె.సి. వేర్ ప్రకారం రాజ్యాంగ ప్రభుత్వ మంటే ప్రభుత్వం కంటె ఎక్కువ, దీని అర్థం చట్ట ప్రకారం నడిచే ప్రభుత్వం. అంతేకాని ఏక్‌పథ్ ప్రభుత్వం (Arbitrary Government) కాదు. అంటే రాజ్యాంగ పరిమితులకు లోబడి పనిచేసే ప్రభుత్వం. అంతేకాని అధికారంలో ఉన్న వ్యక్తుల ఇష్టం వచ్చినట్లు నడుచుకొనే ప్రభుత్వం కాదు.

పైన చెప్పిన విషయాలను బట్టి రాజ్యాంగ ప్రభుత్వం అంటే విశ్వంలో ఉన్న అనుకూల హద్దులకు లోబడి పనిచేసే ప్రభుత్వం. ఈ పరిమితులు, హద్దులు రాజకీయ వ్యవస్థను బట్టి మారుతుంటాయి. ఉదాహరణకు ఒక రాజ్యాంగ పరమైన దేశంలో ఎక్కువ పరిమితులున్నవి. అదే విధంగా తక్కువ

పరిమితులున్న దేశం కూడ రాజ్యాంగ పరమైనదే. ఒక దేశానికి హద్దులు / పరిమితులు లేనట్లయితే అదేశాన్ని రాజ్యాంగ విరుద్ధమైన దేశంగా ఫ్రెడ్రిఖ్ (Freidrich) తన రేఖా చిత్రంలో (Para Figure) లో చెప్పారు. (Freidrich constitutional Govt of Democracy.)

కొన్ని హద్దులు
అసలైన ప్రభుత్వాలు

హద్దులులేవు — పూర్తిహద్దులు/పరి:

రాజ్యాంక వ్యతిరేక ప్రభుత్వం | రాజ్యాంగబద్ధ ప్రభుత్వం

రాజ్యాంగ ప్రభుత్వం అనే భావన రెండు భిన్న ధృవాల గురించి తెలియజేస్తుంది. అవి చాలా బలమైన పరిమితులు, బలహీనమైన పరిమితులు. ఈ రెండు ధృవాల మధ్య అసలైన ప్రభుత్వాలుంటాయి. కార్ల్‌ఫ్రెడ్రిఖ్ (Carl Freirich) ప్రకారం రాజ్యాంగ వ్యతిరేక ప్రభుత్వాన్ని మనం ఊహించుకోవచ్చు. ఎందువల్లనంటే ప్రపంచంలో ఉన్న ప్రతిదేశానికి రాజ్యాంగమున్నది. అంతేకాక ఆ రాజ్యాంగానికి కొన్ని పరిమితులున్నాయి. ఫ్రెడ్రిఖ్ చెప్పినట్లుగా నిజంకాని పరిమితులు ఏవంటే పూర్తి హద్దులున్నవి, హద్దులు లేనివి. బ్లోన్‌డెల్ (Bloudel) ప్రకారం రాజ్యాంగ వాదం అనేది ఒక స్పష్టమైన దృక్కోణం.

పరిపాలనను రాజ్యాంగబద్ధమైనది, రాజ్యాంగ బద్ధం కానిది అని ఇది వర్గీకరించింది. అదే విధంగా ఇది పరిపాలనను "స్వేచ్ఛాయుత పరిపాలన", "అధికారయుత పరిపాలన" అని రెండు రకాలుగా వర్గీకరించింది. విభిన్న అభిప్రాయాలుండవచ్చు. కానీ రాజ్యాంగవాదం అనేది విభిన్న పరిపాలనలు ఉంటాయని గుర్తించాలి. ఉదాహరణకు, పరిపాలన పూర్తి అధికారయుతంగా ఉండవచ్చు. అదే విధంగా ప్రభుత్వం 'పూర్తి రాజ్యాంగ ప్రభుత్వాలు' అయి ఉండవచ్చు, లేదా 'రాజ్యాంగ ప్రభుత్వాలుకాక పోవచ్చు.

రాజ్యాంగ వాదం ఈ విధంగా పరిమిత అధికారాలున్న రాజ్యాంగ క్రమాన్ని కోరుతుంది. 'నాగరికత ప్రభుత్వానికి రాజ్యాంగ ప్రభుత్వమనేది ఇంకొక పేరు. రాజ్యాంగ ఖచ్చితత్వాన్ని రుజువుచేయాలంటే ఆ ప్రభుత్వం పరిమిత అధికారాలున్న ప్రభుత్వమయి ఉండాలి. అంతేకాక పరిపాలకులు చట్టబద్ధులై ఉండాలి. ఈ పరిమితులే కాక కొన్ని ఆచారాలు, సంప్రదాయాలు రాజ్యాంగంపై ప్రభావం చూపుతాయి. ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకొంటే రాజ్యాంగ ప్రభుత్వాలు కానివి ప్రపంచంలో ఎక్కడా ఉండవు. రాజ్యాంగాన్ని ఏవగించుకొనే శ్రామిక నియంతృత్వ దేశాలలో కూడ రాజ్యాంగ ప్రభుత్వాలు కానివి ఉండవు. అందువల్ల ప్రజాస్వామ్య దేశాలలో మాత్రమే రాజ్యాంగ ప్రభుత్వాలుంటాయని చెప్పవచ్చు.

15.4.0 రాజ్యాంగ వాదం - పరిణామం

రాజ్యాంగ రాజ్య అభివృద్ధి అనేది ఒక చారిత్రాత్మక ప్రక్రియ. దీని ముఖ్యాంశాలన్నీ రాజకీయ సంస్థల చరిత్రలోను, పశ్చిమ దేశాల రాజకీయ భావాలలోను ఉన్నాయి. అంటే రాజ్యాంగ వాదం

అభివృద్ధి రాజకీయ సంస్థల అభివృద్ధితో ముడిపడి ఉంది. ఈ రాజకీయ సంస్థలు పురాతన గ్రీకు, రోమ్ దేశాలలో అభివృద్ధి చెందాయి. ఈ సంస్థల అభివృద్ధి మధ్యయుగం లోను, ఆధునిక యుగంలోను బాగా జరిగింది. రాజకీయ ఆలోచనా పరులు (Political Thinkers) ఈ అభివృద్ధి చెందుతున్న రాజకీయ సంస్థల నుంచి రాజకీయ వ్యవస్థ ఎలా ఉండాలనే అంశం గురించి ఆలోచించడం ప్రారంభించారు. చట్టబద్ధమైన రాజ్యాంగ క్రమంలో రాజకీయ సంస్థలు అభివృద్ధి చెందాలనే భావన నానాటికి బలపడింది. రాజ్యాంగ వాదం అభివృద్ధి ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

15.4.1 గ్రీకు రాజ్యాంగ వాదం (Greek Constitutionalism)

రాజ్యాంగ వాద అభివృద్ధికి మొట్టమొదటగా దోహద పడింది గ్రీకు వారని చెప్పవచ్చు. వారిది రాజకీయ వేర్పాటు వాదం. ఈ దేశంలో నగర రాజ్యవ్యవస్థ ఉండేది. అంతేగాక పౌరసత్వం అందరికీ లభించేది. స్పార్టా సైనిక నియంతృత్వంలో నగర రాజ్యాలన్నింటిలోను ప్రత్యక్ష ప్రజాస్వామ్య వ్యవస్థ ఉండేది. దేశ వ్యవహారాలలో పౌరుల పాత్ర, పౌరుల విషయాలలో దేశం పాత్ర అన్న విషయంలో వారికి వింత అభిప్రాయాలుండేవి. గ్రీకు పౌరుడు ఒక సైనికుడు, ఒక న్యాయమూర్తి, పరిపాలనాసభ సభ్యుడని స్ట్రాంగ్ (Strong) చెప్పినట్లు నగరంలోనే అతని భౌతిక, ఆధ్యాత్మిక అవసరాలన్నీ నెరవేరుతాయి. గ్రీకు వేదాంతులైన ప్లాటో, అరిస్టాటిల్ రాజకీయ సంస్థలను నైతిక కోణం నుంచి అధ్యయనం చేశారు. దాని ఫలితంగా గ్రీకు రాజ్యాంగంలో నైతిక (Normative) భావాలున్నాయి. అందువల్లనే ప్లాటో కలలుగన్న ఆదర్శ రాజ్యమంటే అవినీతి లేని అవినీతికి తావివ్వని తాత్వికుడైన రాజు కింద ఉంటుంది అనే విషయం ఒక భ్రాంతిగా మిగిలింది. అరిస్టాటిల్ మధ్య తరగతి ప్రజల పరిపాలన కింద రాజకీయ వ్యవస్థ ఉంటే బాగుంటుందని భావించాడు. ఈ వ్యవస్థ సాధించలేని మంచి (best) సహించలేని చెడుకు (intolerable worst) మధ్య సమతూకం సాధిస్తుందని భావించాడు. ప్లాటో ఆలోచనా విధానంలో ఆదర్శ రాజ్యముండేది. అరిస్టాటిల్ అలోచనా విధానంలో ఆచరణీయమైన ఆదర్శ రాజ్యం "Super Science of Law" గా ఉండేది. ఈ రెండు ఆలోచనా విధానాలు నగర రాజ్యాన్ని పరిధిని మించి ఆలోచించేవి కాదు. అందువల్ల గ్రీకు రాజ్యాంగ వాదం మారుతున్న పరిస్థితుల కనుగుణంగా లేక విఫల మయింది. బార్కర్ అన్నట్లుగా ప్లాటో కలలుగన్న నియంతకాని, అరిస్టాటిల్ ఊహించిన మధ్యతరగతిగాని నగర రాజ్యాన్ని నిర్మించలేక పోయాయి. అంతేకాక ఇవి తమను తాము కాపాడుకునే ప్రయత్నంలో తమ ఉనికిని కోల్పోయాయి.

15.4.2 రోమన్ రాజ్యాంగవాదం (Roman Constitutionalism)

నగర రాజ్య వ్యవస్థకు గ్రహణం పట్టిన తరవాత రోమన్ సామ్రాజ్యం ఆవిర్భవించిన తరవాత రాజ్యాంగ వ్యవస్థలో పెద్దమార్పు వచ్చింది. విద్యా వంతులు విద్యారంగంలోకి ప్రవేశించారు. నైతిక విలువలు రాజకీయాల నుంచి వేరుపడ్డాయి. సమాజం, రాజ్యం అనే పదాలు సమానత్వాన్ని కోల్పోయాయి. వ్యక్తి ప్రాధాన్యత పెరిగింది. సి.హెచ్ మెల్‌వెయిన్ (C.H. Mellwain) చెప్పినట్లు వ్యక్తి పీరుని కన్న, రాజకీయ సముదాయంకన్న, సమాజం మిన్న; జాతి కన్న మానవత్వం మిన్న, అనే అభిప్రాయాలు ప్రబలాయి. రోమ్ సామ్రాజ్య వాదులు ప్రభుత్వ ఉనికిని నిర్ణయించే రాజ్యాంగాన్ని రూపొందించారు. వీరి రాజ్యాంగం లిఖితంగాను, అలిఖితంగాను ఉంది. ఆచార, సంప్రదాయాలు

ప్రభుత్వ పద్ధతులపై రాజనీతిజ్ఞులు, న్యాయవాదుల అభిప్రాయాలు ఉండేవి. అంతేకాక మరిన్ని శాసనాలు, చట్టాలుండేవి. 500 B.C లో ఏకరాజ్యాధిపత్యం అంతరించిన తరువాత మిశ్రమ రాజ్యాంగమున్న రిపబ్లిక్‌లు అవతరించాయి. "కాన్సులు ఆఫీసులు రద్దయిన రాచరికాన్ని ప్రతి బింబించేవి. సెనేట్లు ధనవంతుల ప్రాబల్యాన్ని త్రివిధ సంప్రదాయాలలో ప్రతిబింబించేది. రాజు యొక్క సామ్రాజ్యాన్ని పునరుద్ధరించినపుడు రోమ్‌లో బాధ్యత లేని నిరంకుశ ప్రభుత్వం అవతరించింది. ఇన్ని అడ్డంకులున్నప్పటికీ రాజ్యాంగవాద అభివృద్ధికి రోమన్ రాజ్యాంగవాదం ఎనలేని సేవ చేసింది. వారు చట్టాన్ని క్రోడీకరించారు. ప్రాతినిధ్య ప్రభుత్వాన్ని రూపొందించారు. ఈ రెండు రాజ్యాంగ వాదానికి అవసరమైన ముఖ్య సూత్రాలు అని చెప్పవచ్చు. రాజుయొక్క న్యాయ సార్వభౌమత్వ ఆధారం ప్రజలు అని, అతనికి అధికారం ప్రజలనుంచి సంక్రమించింది, అనే ఆలోచనలు మధ్యయుగంలో పాలకులను, పాలితులను ఎంతో ప్రభావితం చేశాయి.

15.4.3 మధ్యయుగ రాజ్యాంగవాదం

రోమ్ సామ్రాజ్యం 600 A.D. లో పతనమైన తరవాత ఫ్యూడల్ రాజ్యాలు అవతరించాయి. ఆ తరవాత ట్యూటన్‌లు రాజుయొక్క అధికారం పరిమితం చేసే గ్రామాచారాలు ఆధారంగా కొత్త భావాలను ప్రవేశపెట్టారు. అనాగరికుల దండయాత్రలు, రాజకీయ, ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి దోహదం చేశాయి. అంతేగాక సమాజం ఏర్పాటుకు, రాజకీయ సంస్థల ఏర్పాటుకు వీలు కలిగింది. నిరంతర యుద్ధాలవల్ల యూరప్‌లో చిన్న చిన్న స్థానిక రాజ్యాలు ఏర్పడి స్థానిక స్థాయిలో ఫ్యూడల్ రాజులు ఒకరితో ఒకరు సంధి చేసుకోవడం ప్రారంభించారు. ఫ్యూడలిజమ్ సంధియుగ వాతావరణాన్ని అధికార వికేంద్రీకరణను, విచ్ఛిన్నతను ప్రతిబింబించింది. రాజకీయ దృష్టితో ఆలోచిస్తే ప్రతి ప్రభువు (Lord) యుద్ధం చేసేవారు. వాణిజ్యం క్రమబద్ధీకరించేవాడు. కరెన్సీని తయారుచేసేవాడు. అంతేకాక న్యాయబాధ్యతను నెరవేర్చేవాడు. ఆర్థిక పరంగా ఆలోచిస్తే ప్రజల హక్కులు, బాధ్యతలు భూమి యాజమాన్యంతో ముడిపడి ఉండేవి. ఆర్థిక, మిలిటరీ, న్యాయ విషయాలన్ని ప్రభుత్వ యంత్రాంగమే చూసేది. క్రిస్టియానిటి వ్యాప్తి చెందటం వల్ల మార్పు వికేంద్రీకరణ, విచ్ఛిన్నం జరుగుతున్న ఈ కాలంలో సర్వసామాన్యవాదం పుట్టింది. ఎక్కువ మంది ప్రజలు క్రిస్టియన్లుగా మారటంవల్ల రాను రాను రోమన్ చట్టం పోయి బైబిలు చట్టం వచ్చింది. రోమన్ ట్యూటనిక్ భావాల మధ్య మంచి సంకలనం జరిగింది. ఉదాహరణకు, రోమన్‌ల అభిప్రాయం ప్రకారం రాజు అధికారానికి ప్రజలే ఆధారమని, అనాగరకుల (Barbarians) సంప్రదాయం ప్రకారం ప్రజలు చెప్పినట్లు రాజు వినాలని రెండు అంశాలమధ్య సయోధ్యకుదిరింది. ప్రభువులు (Lords) సేనాధిపతుల సమక్షంలో రాజుల పట్టాభిషేకం జరగడం, ప్రమాణం చేయటం అనే అంశాలు రాజు అధికారం ప్రజల నుంచి సంక్రమించింది అనే విషయాన్ని రుజువు చేస్తున్నాయి. ఈ సంఘటనలు రాజ్యాంగవాద అభివృద్ధికి దోహదం చేశాయి.

రాను రాను రాజ్యాంగవాద అభివృద్ధికి క్రైస్తవ అధికారం ప్రతిబంధకమైంది. ఎస్. టి. ఆగస్టీన్ (St. Augustine), సెయింట్ థామస్ (St. Thomus) మొదలైనవారు లౌకిక అధికారాన్ని, చర్చి అధికారాన్ని ఉపయుక్త అధికారంగా మార్చారు. బిషప్ అధికారం రాజుఅధికారం కంటే ఎక్కువైంది. అంతేగాక పోప్, క్రైస్తవ మతాధికారులందరికి నాయకుడయ్యాడు. ఇటువంటి పరిస్థితిని ఎవరూ వెంటనే

చక్కపర్చలేదు. 800 వ సంవత్సరం తరవాత దేశంలో ఉన్న రాజులు ఈ అపఖ్యాతి పాలైన రోమన్ కాథలిక్కుల మతాధికారులను ఎదిరించి వారిని పడగొట్టడానికి నిర్ణయించారు. ఈ విధంగా జాతీయవాదం ఫ్రాన్స్, ఇంగ్లండ్ (France, England) ఇటలీలలో పెరిగి ఆధునిక రాజ్యాంగ రాజ్య ఏర్పాటుకు దోహదం చేసింది. సిసలైన రాజకీయాలు అమలులోకి వచ్చాయి. పవిత్ర రోమ్ రాజ్య న్యాయసూత్రాలు పక్కకు నెట్టబడ్డాయి.

15.4.4 పునరుజ్జీవన కాలంలో రాజ్యాంగవాదం

మధ్యయుగం 14వ శతాబ్దంతో ముగిసింది. ఈ కాలంలో నల్ల అంటువ్యాధి (Black Death) ప్రబలి లక్షలమంది చనిపోయారు. మానవత్వం శాస్త్రీయ ఆలోచనా విధానం పునరుజ్జీవన కాలంలో తిరిగి పుట్టింది. యూరప్ ప్రజలు కొత్త జీవన విధానం, స్వేచ్ఛ కోరుకొన్నారు. సాహిత్యం, శాస్త్రం, కళారంగాలలో జరిగిన అభివృద్ధి ప్రజలలో కొత్త విలువలను పెంపొందించింది. సాంప్రదాయ ప్రపంచంలో ఉన్న నమూనాల (Models) నుంచి ప్రజలు ఉత్తేజం పొందారు. పునరుజ్జీవన యుగంతోపాటు, సంస్కరణల యుగం కూడ ప్రారంభం కావటంవల్ల మధ్యయుగ భావాలైన విశ్వవ్యాప్త వాదం, పాండిత్యవాదం అంతరించి లౌకిక, సార్వభౌమ, జాతీయ రాజ్యాల భావనలు ఆవిర్భవించాయి. దీని సాధారణ ప్రభావం మధ్యయుగం విచ్ఛిన్నమై స్వతంత్ర రాజ్యాలేర్పడటమే.

రాజ్యాంగ రాజ్యానికి నియంతృత్వం (Absolute monarchy) ఒక ప్రతిబంధకమైంది. పోప్ అధికారాన్ని చాలామంది నియంతృత్వ రాజులు చేజిక్కించుకొన్నారు. రాజ్య సమస్యలను పరిష్కరించటానికి విప్లవమే శరణ్యమని ప్రజలు భావించారు. మాకియవెల్లి (Machiavelli) రాసిన Prince, Bodin రాసిన Republic ప్రజలను ఎంతో ఉత్తేజితుల్ని చేశాయి. రోమన్ కేథలిక్కుల మతాధికారులు అంతరించిన తరవాత ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, పెర్షియాలలో అనేకమంది నియంతృత్వ రాజులేర్పడ్డారు. అందువల్లనే పునరుజ్జీవన పరిస్థితి రాజ్యాంగ పరమైందికాదు. ఇది ప్రజాస్వామ్య రాజ్యంకంటె తక్కువని చెప్పవచ్చు.

15.4.5 ఇంగ్లండ్‌లో రాజ్యాంగ వాదం

రాజ్యాంగవాద అభివృద్ధికి బ్రిటన్ ఎంతో దోహదం చేసింది. ట్యూడర్ (Tudor) నిరంకుశ యుగం, ఎలిజబెత్ స్వర్ణయుగంతో ముగిసింది. స్టూవర్ట్ రాజులు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. ఎవరు న్యాయాధినేత, రాజు అనే విషయం మీద అంతర్యుద్ధం (Civil War) 1640-48 కాలం మధ్య జరిగింది. యుద్ధంలో రాజు ఓటమి ప్రజల సార్వభౌమత్వాన్ని చాటి చెప్పింది. పౌర యుద్ధంలో సాధించగా మిగిలిందాన్ని 1688 లో జరిగిన 'మహోన్నత యుద్ధం' (Glorious Revolution) తో సాధించారు. ఇది పార్లమెంటరీ సార్వభౌమత్వానికి పునాది వేసింది. వ్యవస్థను ప్రజాస్వామ్యం చేయాలని ఈ ఉద్యమం ఎక్కువ కాలం జరగటంవల్ల దీని ప్రభావంగా సంస్కరణల చట్టాలు 1832, 1867, 1884 సంవత్సరాలలో చేయబడ్డాయి. ఇందువల్ల ప్రజలకు ఎన్నో హక్కులు లభించాయి. 1911 లో చేసిన పార్లమెంటరీ చట్టం "ప్రభువులసభ" అధికారాన్ని కుదించివేసింది. దానిని 1949 లో సవరణ చేయటంవల్ల ఆసభ ద్రవ్య సంబంధంగాని, బిల్లులను

జారీచేసే హక్కును కోల్పోయింది. రెండు రాజకీయ పార్టీల వ్యవస్థ ఈ దేశంలో రాజ్యాంగ వాదం అభివృద్ధికి ఎంతో దోహదం చేసింది. అంతేకాక పార్లమెంటరీ ప్రభుత్వం పని తీరుకు ఇది వీలు కల్పించింది. పైన చెప్పిన వివిధ కారణాలవల్ల రాజు వాస్తవ సార్వభౌమత్వం తగ్గి పార్లమెంటుకు బాధ్యత వహించే మంత్రులకు అధికారం పెరిగింది. అంతేగాక దేశంలో ఉన్న ప్రజలందరికి స్వేచ్ఛ, సమానత్వాలు లభించాయి. దీనిని డైసీ (Dicey) సమన్యాయపాలన (Rule of Law) అని అన్నాడు.

చాలా శతాబ్దాల నుంచి అమలులోలేని కొత్త సంస్థలకు ఇంగ్లాండ్ రాజ్యాంగవాదం కొత్త వెలుగు నిచ్చింది. ఈ సంస్థలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో ఉన్నాయి. ఇంగ్లాండ్ నుంచి విముక్తి పొందిన వివిధ దేశాలు, సంస్థలు ఆ తరవాత ఇంగ్లాండ్ రాజ్యాంగాన్ని అనుసరించాయి.

15.4.6 ఫ్రెంచి - రాజ్యాంగ వాదం

ఆధునిక రాజ్యాంగవాదం ప్రభావం ఫ్రాన్స్ మీద కూడ పడింది. రూసో రాసిన " సోషల్ కాంట్రాక్టు" అనే గ్రంథంలో "మానవుడు జన్మతః స్వేచ్ఛాజీవి కాని అతడు సర్వత్రా సంకెళ్ల లోనే ఉన్నాడు" అని రాశాడు. దీని ప్రభావం వల్ల 1789 లో ఫ్రాన్స్ తన జాతీయ అసెంబ్లీ ద్వారా మానవ హక్కులను ప్రకటించింది. మానవులు పుట్టుకతో స్వేచ్ఛా జీవులు వారికి సమాన హక్కులు ఉన్నాయి, అని ప్రకటించింది. అంతేగాక ఎవరు నిర్ణయించలేని మానవ హక్కులను కాపాడటం ప్రతి రాజకీయ సంస్థ విధి అని ప్రకటించింది. "హక్కుల ప్రకటన" ప్రకారం 1791లో ఏర్పడిన ఫ్రెంచ్ రాజ్యాంగం ఎక్కువ కాలం నిలవలేక పోయింది. ఎందువల్లనంటే జాతీయసభ ఆనాటి అరాచక పరిస్థితులను అరికట్టలేకపోయింది. అంతేకాక నెపోలియన్ నియంతృత్వం కూడ ఆనాటి రాజ్యాంగ ప్రభుత్వానికి పెద్ద ఆవరోధంగా నిలిచింది. 1789లో తొలగించిన రాచరికం 1799 లో తిరిగి ఏర్పడి 1814 లో నెపోలియన్ పూర్తిగా పతనమయ్యేవరకు కొనసాగింది. ఆదేశం 1875 లో మూడో రిపబ్లిక్ ఏర్పడేవరకు ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొన్నది. దానికి కారణం ఆకాలంలో ఉన్న రాజుల అస్థిరత్వమే. ఈ మూడో రిపబ్లిక్ లో పార్లమెంటరీ ప్రభుత్వం, రాజ్యాంగ బద్ధమైన రాష్ట్రపతి, బాధ్యతాయుత మంత్రి వర్గం ఏర్పడ్డాయి. ఈ వ్యవస్థ 1940 వరకు కొనసాగింది. ఈ రెండో ప్రపంచ యుద్ధంవల్ల ఈ వ్యవస్థ విచ్ఛిన్న మైంది. 1946 లో 4వ రిపబ్లిక్ ఏర్పడింది. ఇందులో పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థ, రాజ్యాంగ బద్ధమైన రాష్ట్రపతి, బాధ్యతా యుతమైన కార్య నిర్వాహకులు ఉండేవారు. ఫ్రాన్స్ తన వలసరాజ్యమైన అల్జీరియాలో ఉన్న తిరుగుబాటు ధోరణులను అదుపుచేయలేక పోవటంవల్ల 1958 లో చార్లెస్ డీగాల్ నాయకత్వంలో 5వ రిపబ్లిక్ ఏర్పడింది. ఈ కొత్త రాజ్యాంగ పద్ధతి ప్రకారం బలమైన రాష్ట్రపతి, బలహీనమైన ప్రధానమంత్రి, పార్లమెంటు ఏర్పడింది. దాన్ని "పాక్షిక అధ్యక్ష" (Quasi Presidential) లేదా పాక్షిక పార్లమెంటరీ వ్యవస్థ అంటారు. అధ్యక్షుడు చాలా బలవంతుడుకావడం వల్ల దీనిని ఏకరాజ్యాంగమని కూడ అంటారు. ఈ విధంగా స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆదర్శంగా ఫ్రాన్స్‌లో రాజ్యాంగం ఏర్పడి రాజ్యాంగాభివృద్ధికి ఎంతో దోహదం చేసింది.

15.4.7 అమెరికా రాజ్యాంగ వాదం

రూసో రాసిన 'సోషల్ కాంట్రాక్టు' ప్రభావం అమెరికా మీద గూడా కనబడింది. 1776 లో స్వాతంత్ర్యం ప్రకటించుకొన్నప్పుడు "మానవులందరు సమానంగా సృష్టించబడ్డారని" పేర్కొంది. అంతేకాక మానవులకు అన్యాక్రాంతం చేయని కొన్ని హక్కులున్నాయని చెప్పడం జరిగింది. ప్రజల హక్కులను కాపాడటానికి ప్రజలు ప్రభుత్వాన్ని సృష్టించారు. ఆ ప్రభుత్వానికి అధికారం ప్రజలనుంచి సంక్రమించింది. ఏ ప్రభుత్వమైనా సక్రమంగా పనిచేయలేక ప్రజల మన్ననలను చూరగొనని క్షణంలో దానిని మార్చే హక్కు, రద్దుచేసే హక్కు ప్రజలకుంది. ప్రజల సుఖసంతోషాలను కాపాడటానికి ఏ సూత్రం అవసరమో ఆ సూత్రాల ఆధారంగా ప్రభుత్వాన్ని రూపొందించడమైంది. ఈ ఆదర్శాల వల్ల ప్రభావితమైన అమెరికన్ రాజ్యాంగ మూల పురుషులు, ఫ్రాన్స్ రాజనీతి తత్త్వవేత్తలు చెప్పిన అధికార పృథఃకరణ సిద్ధాంతం (Separation of Powers) ఆధారంగా సమాఖ్య ప్రభుత్వం ఏర్పాటు చేశారు. దీని ప్రభావం వల్ల కార్యనిర్వాహక, శాసన, న్యాయ అధికారాలు వరుసగా అధ్యక్షుడు, కాంగ్రెస్, సుప్రీంకోర్టులలో కేంద్రీకృతమయ్యాయి. అమెరికా ప్రభుత్వపు మూడు అంగాలను ఒక దానితోఒకటి పేరుచేయడం జరిగింది. అయినా ఏ ఒక్క అంగమైనా అదుపు తప్పితే మిగతా అంగాలు సరిచేస్తాయి. ఇదే నిరోధక సమతౌల్య సిద్ధాంతం. ప్రెసిడెంట్ చేసిన అన్ని నియామకాలు విదేశీ ఒప్పందాలు సెనెట్ ఆమోదం పొందాలి. ప్రెసిడెంట్ సక్రమంగా పరిపాలించని క్షణంలో మహాభియోగ తీర్మానం ద్వారా అతనిని కాంగ్రెస్ తొలగిస్తుంది. అంతేగాక ప్రెసిడెంట్ రాజ్యాంగానికి విరుద్ధమైన ఏ నిర్ణయమైనా తీసుకొన్నట్లయితే దానిని న్యాయవ్యవస్థ రద్దు చేయవచ్చు. అదేవిధంగా రాజ్యాంగ వ్యతిరేకమైన ఎటువంటి చట్టాలను చేయడంలో కాంగ్రెస్‌ను నిరోధించవచ్చు. కాంగ్రెస్ ఆమోదించిన బిల్లులకు అధ్యక్షుని అంగీకారం కావాలి. ఒకవేళ ఆ బిల్లు రాజ్యాంగ విరుద్ధమైతే దానిని కాంగ్రెస్, అధ్యక్షుడు ఆమోదించినప్పటికి కోర్టులు తమకున్న అధికారం ద్వారా వాటిని రద్దు చేయవచ్చు. అదే విధంగా రాజ్యాంగ వ్యతిరేకమైన ఎటువంటి చట్టాలను చేయడంలో కాంగ్రెస్‌ను నిరోధించవచ్చు. కాంగ్రెస్ ఆమోదించిన బిల్లులకు అధ్యక్షుని అంగీకారం కావాలి. ఒకవేళ ఆ బిల్లు రాజ్యాంగ విరుద్ధమైతే దానిని కాంగ్రెస్, అధ్యక్షుడు ఆమోదించినప్పటికి కోర్టులు తమకున్న అధికారం ద్వారా వాటిని రద్దు చేయవచ్చు. అదే విధంగా కోర్టులను ప్రెసిడెంట్, కాంగ్రెస్ తమకున్న అధికారం ద్వారా అదుపుచేయవచ్చు. ఉదాహరణకు కోర్టుల ఔన్నత్యాన్ని పెంపొందించే చర్యలను ప్రెసిడెంట్ చేపట్టవచ్చు. న్యాయమూర్తుల సంఖ్య, వారి జీతభత్యాలు, తొలగింపు అనే అంశాలను ప్రెసిడెంట్, కాంగ్రెస్ నిర్ణయిస్తాయి. సుప్రీంకోర్టు (Supreme Court) న్యాయమూర్తులు, ఇతర ఫెడరల్ న్యాయ మూర్తులను అమెరికన్ ప్రెసిడెంట్ నియమిస్తాడు. అంతేగాక ప్రధాన న్యాయమూర్తి (Chief Justice) అమెరికన్ ప్రెసిడెంట్ చేత ప్రమాణం చేయిస్తాడు. ఈ విధంగా అమెరికా రాజ్యాంగం "అధికారం అధికారాన్ని తగ్గిస్తుంది" (Power cuts Power) అనే సూత్రం మీద ఆధారపడింది. ఈ వివిధ రాజ్యాంగం ఏర్పాట్ల ప్రభావం ఏమంటే చట్టబద్ధమైన ప్రవర్తన ప్రజలకు, ప్రభుత్వానికి ఉండాలి అనే విషయం నొక్కివక్కాణించాయి. ఆధునిక లిఖిత రాజ్యాంగవాదానికి అమెరికాలో సరైన ప్రారంభం జరిగిందని చెప్పవచ్చు.

15.4.8 మొదటిప్రపంచ యుద్ధం తరవాత రాజ్యాంగ వాదం

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత వివిధ దేశాలమధ్య శతృత్వం నశించి ప్రజాస్వామ్యం వస్తుందని, ఒక మంచి రాజ్యాంగవాదం ఏర్పడుతుందని అందరూ ఆశించారు. దీనికి భిన్నంగా రాజ్యాంగవాదానికి ప్రతికూల ప్రతిస్పందన వచ్చింది. రష్యాలో కమ్యూనిజం, ఇటలీలో ఫాసిజం, జర్మనీలో నాజీజం దీనికి చక్కని ఉదాహరణలు. ఈ దేశాలలో అవలంబించిన రాజ్యాంగాలు ఇతర దేశాలు అనుసరించిన రాజ్యాంగాలకు పూర్తి భిన్నమైనవి. బలమైన ఏకపక్ష అధికారపార్టీ వ్యవస్థ ఏర్పడి ఇతర పార్టీలను నిర్మూలించడం ప్రారంభించింది. అంతేగాక ప్రభుత్వం ప్రత్యక్షంగా రాజకీయ, ఆర్థిక, మత విషయాలను కూడా నియంత్రించడం ప్రారంభించింది. ఈ కాలంలోని ముఖ్య సంఘటనగా అంతర్జాతీయ సమితి ఏర్పడింది. దీనినే 'నానాజాతి సమితి' అని అంటారు. ఇది స్వతంత్ర దేశాలమధ్య వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోడానికి ఏర్పడింది. ఈ విధంగా రాజ్యాంగవాదం అంతర్జాతీయ వాదాన్ని తనలో ఇముడ్చుకొంది.

15.4.9 రెండో ప్రపంచ యుద్ధం తరవాత రాజ్యాంగవాదం

రెండో ప్రపంచ యుద్ధం తరవాత జర్మనీ, జపాన్, ఇటలీ దేశాలలో నియంతృత్వం అంతరించింది. కాని సోవియట్ యూనియన్ మాత్రం దీనికి విరుద్ధంగా, తన ఉనికిని కాపాడుకోగలిగింది. అంతేగాక కమ్యూనిజం ప్రపంచంలోని వివిధ దేశాలకు పాకింది. ఇందువల్ల వివిధ కమ్యూనిస్టు దేశాలలో ఒక కొత్త రాజ్యాంగవాదం ఏర్పడింది. చాలా దేశాలు స్వాతంత్ర్యం ప్రకటించుకొన్నాయి. అంతేకాక అవి ఇంగ్లాండ్ రాజ్యాంగాన్ని కాని, అమెరికన్ రాజ్యాంగాన్ని కాని, లేదా రెండింటిని కాని అనుసరించటం ప్రారంభించాయి. 1950లో ఇండియా 'వెస్ట్‌మినిస్టర్ నమూనాను' (West Minister Model) అనుసరించగా, పాకిస్తాన్ "అమెరికా తరహాను" 1958 లో అనుసరించి, ఆ తరవాత అది 1972 లో తిరిగి ఇంగ్లాండ్ రాజ్యాంగాన్ని అనుసరించింది. తృతీయ ప్రపంచంలోని బీద వెనకబడిన దేశాలు "రాజ్యాంగ రాజ్యాన్ని" ఏర్పరచుకోడానికి చాలా ప్రయోగాలు చేశాయి. నానాజాతి సమితి అంతరించి ఐక్యరాజ్యసమితి ఏర్పాటైన తరవాత, రాజ్యాంగ వాదం అంటే జాతీయ వాదం, ప్రజాస్వామ్యమేకాదు, అందులో అంతర్జాతీయ వాదం కూడ ఉందనే భావం బలపడింది. జపాన్ తన రాజ్యాంగంలో శాంతిని కాపాడటానికి ఎప్పుడూ యుద్ధాన్ని పరిత్యజించాలని నిర్ణయించుకొంది. భారతదేశం తన రాజ్యాంగంలో నాల్గవ భాగంలోని 51 ఆర్టికల్ (Article) లో ఆదేశ సూత్రాలను చేర్చింది. దీని ప్రకారం భారతదేశం అంతర్జాతీయ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకొంటుంది. అంతర్జాతీయ అభివృద్ధికి దోహదం చేస్తుంది.

పైన చర్చించిన వివిధ అంశాల దృష్ట్యా రాజ్యాంగవాద అభివృద్ధి మానవ చరిత్రపై కొన్ని చెరగని ముద్రలు వేసింది. రాజ్యాంగవాదం అంటే రాజ్యాంగానికి దాసులుకావటం (Addiction to Constitution) అంటే ప్రతిదేశం రాజ్యాంగ పాలనకు లోబడాలి. నాగరిక రాజకీయ వ్యవస్థ క్రమం ఏర్పరచే శక్తి సమన్యాయపాలనకే ఉంది కాని వ్యక్తులకు లేదు. కాలక్రమంలో రాజ్యాంగవాదం, జాతీయతా వాదం, ప్రజాస్వామ్యం స్వపరిపాలనా ప్రభుత్వమనే అంశాలను తనలో ఇముడ్చుకొంది. ఇపుడు పురాతన కాలంలో ఉన్న నగర రాజ్యాలు లేవు. మధ్యయుగంలో ఉన్న సామ్రాజ్యాలు లేవు.

గాని సార్వభౌమాధికార, జాతీయరాజ్యాలు ఉన్నాయి. రాజ్యాంగ వాదం ప్రకారం అధికారం ప్రజల చేతుల్లో ఉండాలి. దేశంలోని ఏ మార్పునైనా ప్రజల ఇష్టప్రకారం శాంతియుతంగా చేయాలి. చివరిగా అంతర్జాతీయ వాదం ప్రకారం ప్రతి దేశం అంతర్జాతీయ సమాఖ్య ఏర్పాటుకు పాటుపడాలి. అంతేకాక ప్రతిదేశం ఈ అంతర్జాతీయ సమితి రూపొందించిన చార్టర్‌ను విశ్వసించి దానికి అనుగుణంగా నడచుకోవాలి.

రాజ్యాంగవాదం ఇంకా ప్రయోగదశలో ఉండటమేగాక కమ్యూనిస్ట్ మోడల్ నుంచి తీవ్రవత్తిడిని ఎదుర్కొంటున్నది. ఆధునిక రాజ్యం సంక్షేమ రాజ్యం కావటం వల్ల ఈ రాజ్యాలు ఒక స్థిర పరిపాలనను అందించటంతోపాటు ప్రజల సాంఘిక రాజకీయ అభివృద్ధికి పాటుపడాలి. జాతీయ ప్రజాస్వామ్య రాజ్యాంగవాదం అనే భావన చాలా పురాతనమైనప్పటికీ, అది ఇంకా ప్రయోగదశలో ఉన్నదని చెప్పవచ్చు. ఈ వాదం వివిధ తరహాల ప్రభుత్వాల పోటీని తట్టుకొని నిలబడాలంటే నిరంతరం మారుతున్న ఆధునిక సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఇది మారాలి. రాజకీయ రాజ్యాంగం ముఖ్య ఉద్దేశం సాంఘిక అభివృద్ధిని సాధించటం, ప్రజల హక్కులను పరిరక్షించటం, దేశాభివృద్ధికి పాటుపడటం అని చెప్పవచ్చు.

15.5 వివిధ రాజ్యాంగ వాద భావనలు

రాజ్యాంగవాదం ఇంతకు ముందు చెప్పినట్లు అధికార విభజన ఆధారంగా ఏర్పడిన ఒక వ్యవస్థ. అంతేకాక ప్రభుత్వం ఎదుర్కొనే ఒడుదుడుకులను సరిచేసి బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. రాజ్యాంగవాద వ్యవస్థకు అవసరమైన శిల్ప పద్ధతులను సదుపాయాలను కల్పించినట్లయితే రాజ్యాంగవాదం వ్యవస్థలో సక్రమమైన మార్పులు తీసుకొని వస్తుంది. రాజ్యాంగవాదం ఒక ప్రత్యేక రకమైన ప్రభుత్వాన్ని ఆమోదించదు. ఎందువల్లనంటే ఇది ప్రభుత్వ అధికారాన్ని కుదిస్తుంది. అంతేకాక అధికార దుర్వినియోగాన్ని నివారిస్తుంది. ప్రభుత్వ అధికారానికి, ప్రజల స్వేచ్ఛకు ఎక్కడైతే సహసంబంధం ఉండదో అక్కడ ఇది అధికార కేంద్రీకరణకు తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. రాజ్యాంగ వాదంపై ప్రముఖ పశ్చిమదేశాల రచయితలు విభిన్న భావాలను తెలియజేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజ్యాంగవాద భావం గురించి కూడా ఇక్కడ తెలియజేయడమైంది.

15.6 రాజ్యాంగ వాదం: పశ్చిమ దేశాలు

పశ్చిమ దేశాల రచయితలైన "Thomas Paire" Alexis De/Tocqueville, James Bryce, Harold Laski, Herman Finer, F.F. Strong, మొదలయినవారు రాజ్యాంగ వాదాన్ని ఒక "లక్ష్యం, సాధనం" (Ends & Means) అని అన్నారు. ఇది "విలువకట్టి" "విలువలేదు" అని చెప్పవచ్చు. రాజ్యాంగంలో ఉన్న ఏర్పాట్లవల్ల వివిధ ప్రభుత్వ అంగాలను మేళవించటమేకాక స్వేచ్ఛ, సమానత్వం న్యాయం, హక్కులు మొదలైన వాటికి రాజ్యాంగ వాదం పవిత్రతను చేకూరుస్తుంది. ఉదాహరణకు, భారతరాజ్యాంగ పీఠికలో న్యాయం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే భావనలను గురించి ప్రస్తావించడం జరిగింది. ఈ అభిప్రాయం ప్రకారం రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలి. ఎందుకంటే ప్రజల హక్కులను ఇది పరిరక్షిస్తుంది కాబట్టి.

పశ్చిమ దేశస్థుల భావన ప్రకారం రాజ్యాంగ వాదం అంటే లిఖిత పూర్వకంగా ఉన్న రాజ్యాంగం లేదా కొన్ని చట్టాల, సంస్థల, ఆచారాల సముదాయం అని చెప్పవచ్చు. కాని థామస్ ఫేర్ (Thomas Faire), టాక్యువెల్లీ (Tocqueville) మొదలైన పండితుల వాదనల ననుసరించి "ఇంగ్లాండ్‌లో అసలు రాజ్యాంగమే లేదు". కానీ ఈ వాదనను అందరూ ఒప్పుకోరు. కారణం రాజ్యాంగం అనేది కేవలం లిఖిత పూర్వకంగా ఉండవలసిన పనిలేదు. రాజ్యాంగ సూత్రాలు లిఖితంగా ఉండవచ్చు. లేదా అవి సంప్రదాయాల రూపంలో ఉండవచ్చు. ఎలా ఉన్నప్పటికి, వాటికి ఒకే రకమైన బలం, శక్తి ఉంటుంది. రాజ్యాంగం అంటే ప్రభుత్వానికి సంబంధించిన గుర్తింపబడిన సూత్రాలు అని చెప్పవచ్చు. జేమ్స్ బ్రైస్ చెప్పినట్లు అటువంటి సూత్రాలు ఇంగ్లాండ్‌లో సంప్రదాయాల రూపంలో, న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుల రూపంలో ఉన్నాయి. వీటిని ఆదేశంలో ఉన్న ప్రజలందరు అంగీకరించారు. అందువల్లనే ప్రపంచంలోని విశిష్టతను ఇంగ్లాండ్ రాజ్యాంగంలో మనం చూడవచ్చు. నైమన్ (Newman) గమనించినట్లు ఇంగ్లాండ్ రాజ్యాంగంలో ప్రత్యేకమైన విశిష్టత ఉంది. అంతేకాక, ఆ రాజ్యాంగాన్ని ఎన్నో అసాధారణమైన అతి ఎక్కువ సూత్రాలు సాంప్రదాయాల ఆధారంగా రూపొందించడమైంది. అదీగాక ఏ చట్టంకూడా పార్లమెంటు చట్టం కన్న గొప్పది కాదు.

"ఫిలడెల్ఫియా" ఒడంబడిక (1787) ప్రకారం అమెరికా రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగింది. అమెరికా రాజ్యాంగం వివిధ చట్టాల, సంప్రదాయాల రూపంలో ఉంది. పశ్చిమదేశాల భావన ప్రకారం దేశంలో ఉన్న చట్టాలు ఏ విధంగా ఉండాలంటే ప్రజాప్రభుత్వానికి, దేశ రాజ్యాంగానికి తేడా గమనించలేని విధంగా ఉండాలి. ప్రభుత్వం కంటే రాజ్యాంగం గొప్పది. రాజ్యాంగం ప్రభుత్వ ఉనికిని కాపాడుతుంది. ఈ హద్దులు న్యాయ చట్టంలో ఉండవచ్చు లేదా అనియత ఏర్పాట్ల రూపంలో ఉండవచ్చు. పరిమితులు సార్థకంగా (effective) పనిచేసినపుడు ప్రభుత్వం పరిమితంగా వ్యవహరించి రాజ్యాంగ ఆదర్శాలను కాపాడటానికి ప్రయత్నం చేస్తుంది. ఎవరికి పూర్తి అధికారం, సార్వభౌమత్వం లేకుండా ఉంటుందో అక్కడ పరిమితులు లేదా హద్దులు సక్రమంగా పనిచేస్తున్నట్లు అర్థం.

పశ్చిమ దేశాల భావన ప్రకారం రాజ్యాంగ వాదం రాజ్యాంగ రాజ్యాన్ని కోరుకొంటుంది. ఆ రాజ్యాంగ రాజ్యంలో పరిమిత ప్రభుత్వం పనిచేయటానికి అవసరమైన, అందరూ ఒప్పుకొన్న చట్టాలు సంప్రదాయాలు ఉంటాయి. ఇందులో ఒక శాసనశాఖ, కార్యనిర్వాహక శాఖ, న్యాయశాఖ ఉండి, అవి కొన్ని సూత్రాలను అనుసరిస్తూ రాజ్యాంగ పరిధికి లోబడి పనిచేస్తాయి. ఏదైన మార్పువస్తే, ఆ మార్పు శాంతియుతంగాను, సక్రమంగాను ఉండాలి. అందువల్ల రాజకీయ వ్యవస్థ హింసాయుత ఒత్తిడులకు లోనవదు. నమన్యాయపాలన (Rule of law) అందరికి స్వేచ్ఛను, సమానత్వాన్ని ప్రసాదిస్తుంది. పత్రికా స్వేచ్ఛ ఉన్నది. దాన్ని "నాలుగో ఎస్టేట్" (Fourth Estate) అంటారు. అధికారం అందుకోవడానికి అందరికి సమాన అవకాశముంది. అంతర్జాతీయ శాంతిని, న్యాయాన్ని ప్రోత్సహించడానికి ఒక వ్యవస్థ ఉంది. ఈ విధంగా రాజ్యాంగవాదం అనేది అమలులో ఉన్న ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థకు "విస్తరణ" (Extension) అని చెప్పవచ్చు.

15.7 మార్క్సిస్టులు రాజ్యాంగ వాదం

పశ్చిమ దేశాల రాజ్యాంగ వాదానికి "మార్క్సిస్టుల రాజ్యాంగ వాదం" భిన్నంగా ఉంది. సోషలిస్టు దేశంలో శాస్త్రీయ సోషలిజం అనే భావనను అమలు చేయడానికి రాజ్యాంగం దోహదం చేస్తుంది.

వర్గరహిత సమాజాన్ని ఏర్పాటుచేయటానికి ఏర్పడిన నియంతల చేతులలోని ఒక ఆయుధమే రాజ్యాంగ మని మార్క్సిస్టుల భావన. ఈ దేశాలలో రాజ్యాంగం ప్రభుత్వాధికారాన్ని తగ్గించదు. సరికదా ప్రభుత్వ అధికారాలను విపరీతంగా పెంచటానికి రాజ్యాంగం ఒక ఆయుధంగా ఉపయోగపడుతుంది. అంతేకాక శ్రామిక రాజ్యం అవతరించి కొత్త సమాజ ఏర్పాటు జరుగుతుంది. ఈ దేశాలలో రాజ్యాంగం ముఖ్య ఉద్దేశం సోషలిస్టు వ్యతిరేకులను నిర్మూలించటం, కొత్త సమాజాన్ని ఏర్పాటు చేయటం. అంతేకాని ప్రజలకు హక్కులను, స్వేచ్ఛను న్యాయాన్ని ప్రసాదించటం కాదు. ఈ విధంగా రాజ్యాంగం ఆసక్తి అయిన అంశం ఏదంటే శ్రామికులలో కొత్త సోషలిస్టు క్రమశిక్షణలు పెంపొందించటం అని చెప్పవచ్చు.

రాజ్యాంగవాదం సోషలిస్టు దేశాలలో మార్క్స్‌వాదం, లెనిన్ వాదాలపై ఆధారపడి ఉంది. వీరి ప్రకారం ఒక వర్గం ఇంకో వర్గాన్ని దోచుకుంటే నష్టపోయిన వర్గం తిరిగి అదే పద్ధతిని అవలంబించాలి. ఉదాహరణకు, బూర్జువా (Bourgeous) వర్గం ప్రోలిటెరియట్‌ను దోచుకుంటే ప్రొలిటెరియట్ (Proletariat) వర్గంవారు కూడా అదే పద్ధతిని అవలంబించాలి. ఈ దేశంలో రాజ్యాంగం కన్న పార్టీ గొప్పది. ఒకసారి స్టాలిన్ ఇలా అన్నాడు. ఏ ముఖ్య సమస్య అయినా పార్టీ పరిష్కరించాలే కాని సంస్థలు కాని, వ్యక్తులుకాని పరిష్కరించలేరు. కమ్యూనిస్టుపార్టీ శ్రామిక వర్గానికి రక్షణ కల్పిస్తుంది. విప్లవ లాభాలను ఏకీకృతం చేయాలి. అందువల్లనే సోషలిజం జయించిన తరవాత ప్రభుత్వ హక్కులు, ప్రయివేటు హక్కులు సోవియట్ సమాజంలో వేరువేరుగా లేవు. దేశ, సమాజ, వ్యక్తిత్వ ప్రయోజనాలను (Utility) కలిపి ఒక కొత్త ఐకమత్యం తయారుచేశారు. అందువల్లనే చట్టంలోని భాగాలన్ని సోవియట్ చట్టంలో అంతర్భాగం అని చెప్పవచ్చు.

చైనాలో రాజ్యాంగం ఒక మానిఫెస్టో, ఒక విశ్వాస ప్రవచనం, ఆశయాల వాగ్మూలం. ఈ దస్తావేజులో ప్రభుత్వ ఆర్థిక, రాజకీయ, సాంఘిక ఉద్యమాలను గురించి సవివరంగా తెలియజేయడం జరుగుతుంది. ఈ రాజ్యాంగంలో ప్రస్తావన ప్రస్తుతం గురించేగాక, భవిష్యత్తు గురించి కూడా ఉంటుంది. దోపిడీ వ్యవస్థలను దశలవారీగా రద్దుచేయటం, సోషలిస్టు సమాజాల ఏర్పాటు అనే విషయాలు రాజ్యాంగాలలో చక్కగా వివరించడం మైంది. ఇతర సాధారణ కార్యక్రమాల మాదిరిగా రాజ్యాంగం అనేది ఒక ముఖ్యరాజకీయ ప్రణాళిక (Manifesto), అది దేశ అధికారం, మిలిటరీ వ్యవస్థ, ఆర్థిక సాంస్కృతిక విషయాలు, విద్యావిధానం, విదేశీ విధానాలను గురించి వివరించే మౌలిక శాసనం.

కమ్యూనిస్టు దేశాలలో రాజ్యాంగ వాదం విభిన్నంగా ఉంది. వారు తమ రాజ్యాంగం ఔన్నత్యాన్ని వివరిస్తూనే, పశ్చిమ దేశాల రాజ్యాంగాలు తప్పుదారి పట్టిస్తాయి అని అన్నారు. కమ్యూనిస్టుల అభిప్రాయాన్ని అనుసరించి "పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, దోపిడీదారుల అణిచివేత దారుల ప్రయోజనాల రక్షణకు వీలుగా ఉంటుంది." మౌలికంగా సోవియట్‌లు కార్మిక సంఘాలకు ప్రభుత్వ నిర్వహణలో భాగం కల్పించారు. అధికారం అందరిది, ప్రజలకు అందుబాటులో ఉంటుంది. 'ప్రజల నుంచే ప్రభుత్వ అధికారం లభిస్తుంది' అనే వాదనను వీరు నమ్మేవారు. మార్క్సిస్టుల అభిప్రాయం ప్రకారం రాజ్యాంగవాదం అంటే "దేశ నిర్వహణలో అందరికి భాగం కల్పించటం అని చెప్పవచ్చు".

15.8 అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజ్యాంగవాదం

అభివృద్ధి చెందుతున్న ఆఫ్రికా, ఆసియా దేశాలలో రాజ్యాంగ వాదం లక్షణాలను గుర్తించటం కష్టసాధ్యం. ఈ దేశాలు ఈ మధ్యనే సార్వభౌమత్వం పొంది సంక్షేమ రాజ్య లక్ష్యసాధనకు సతమ తమౌతున్నాయి. ఈ దేశాలు తమను పరిపాలించిన యూరప్ దేశాల రాజ్యాంగాన్ని అనుసరించాలా! లేక సామ్యవాద విలువలున్న స్వంత రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలా! అనే విషయంపై ఒక నిర్ణయానికి రాలేక పోతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థ ఆదర్శాలను, తమ దేశ ప్రజల ఆశయాలను మేళవించి (Synthesis) ఒక రాజ్యాంగా ఏర్పాటు చేసుకొన్నాయి. కానీ ఈ స్థితి ఆయాదేశాల వ్యవస్థకు సరిపడకపోవటం వల్ల ఈ దేశాలు పార్లమెంటరీ వ్యవస్థ నుంచి అధ్యక్ష వ్యవస్థకు, ఆ వ్యవస్థ నుంచి పార్లమెంటరీ వ్యవస్థకు అటుఇటు తరచుగా మారుతున్నాయి. రాజ్యాంగ రాజ్యం విఫలం కావటం వల్ల ప్రజాబాహుళ్య వ్యవస్థ (Popular System) కూలిపోయి దాని స్థానంలో సైనిక పరిపాలన తల ఎత్తింది. దానినే రాజ్యాంగ రాజ్యం విఫలం కావటం అని చెప్పవచ్చు. ఉదాహరణకు, ఈజిప్టు, ఇరాక్, ఇరాన్, టర్కీ, సుడాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బర్మా, బంగ్లాదేశ్, ఇండోనేషియా, వియత్నామ్ (Egypt, Iraq, Iran, Turkey, Sudan, Afghanistan, Pakistan, Burma, Bangladesh, Indonesia, Vietnam) మొదలైన మూడో ప్రపంచ దేశాలలో రాజ్యాంగ రాజ్యం విఫలం కావటం వల్లనే సైనికపరిపాలన ఏర్పడింది.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజ్యాంగ వాదానికి కొన్ని ముఖ్య లక్షణాలు ఉన్నాయి. ఇండియా, శ్రీలంక మొదలైన దేశాలు పశ్చిమ దేశాల రాజ్యాంగాన్ని అనుకరించి తమ సమాజశ్రేయస్సుకు అనుగణంగా వాటిని అమర్చుకొన్నాయి.

ఘనా, టాంజానియా, ఉగాండా, పాకిస్తాన్, బర్మా (Ghana, Tanzania, Uganda, Pakistan, Burma) మొదలైన దేశాలు సరియైన రాజ్యాంగాన్ని ఎంపిక చేసుకోలేక పోయాయి. పశ్చిమ దేశాల రాజ్యాంగాన్ని కొంత వరకు అనుకరించినప్పటికీ ఆదేశ రాజ్యాంగాలు తమకు సరిపడవని భావించాయి.

దేశ సమస్యల పరిష్కారానికి మార్క్సిస్టు భావనలే శరణ్యమని ఈ దేశాలు భావించాయి. అందువల్లనే ఈ దేశాలలో ప్రజాహక్కులు చాలావరకు పరిమితంచేయబడ్డాయి. అమెరికా అధ్యక్షుడు లింకన్ అభివృద్ధి చెందుతున్న దేశాలను దృష్టిలో పెట్టుకొని ఈ విధంగా అన్నాడు. "ప్రభుత్వం బలంగా ఉండటం కోసం ప్రజల హక్కులను హరించివేయాలా లేక ప్రభుత్వం బలహీనంగా ఉండి ప్రజలకు అమిత స్వేచ్ఛ నివ్వాలా".

15.9 రాజ్యాంగ వాదం : సమస్యలు, అభ్యున్నతి

రాజ్యాంగ వాదం విఫలం కావడానికి అనేక కారణాలున్నాయి. యుద్ధాలు, అత్యవసర పరిస్థితి విధింపు, సాంఘిక, ఆర్థిక తిరోగమన పరిస్థితులు ప్రజలలో రాజ్యాంగ వాదం అనే భావన మీద విశ్వాసాన్ని క్షీణింపచేస్తున్నాయి. యుద్ధకాలంలో శత్రువుల దండయాత్రను ఎదుర్కోవాల అనే సాకుతో ప్రజల హక్కులను ప్రభుత్వం హరించి వేస్తుంది. ఉదాహరణకు, ప్రభుత్వం ప్రజలకు నిర్బంధ

సైనిక శిక్షణ, పత్రికలపై ఆంక్షలు, పరిశ్రమలు జాతీయంచేయడం, ప్రజల హక్కులను తగ్గించడం మొదలైన చర్యలకు పాల్పడుతుంది. రాజ్యాంగవాద ప్రభుత్వం యుద్ధకాలంలో నాశనమైనట్లు కనిపిస్తుంది. ఈ ప్రకటన నిజం కావచ్చు, కాక పోవచ్చు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో ఇటలీ, జర్మనీ, జపాన్ దేశాలలో రాజ్యాంగవాదం పూర్తిగా నాశనమైంది. యుద్ధాలు అయిపోయిన తరవాత సాధారణ రాజ్యాంగ ప్రభుత్వాలు తిరిగి అవతరించాయి. కె.సి. వేర్ (K.C. Wheare) పేర్కొన్నట్లు యుద్ధకాలంలో రాజ్యాంగ ప్రభుత్వాన్ని రద్దుచేసిన తీరు ఆ పరిస్థితిని బట్టి ఉంటుంది. యుద్ధం అంటే రాజ్యాంగ ప్రభుత్వం శాశనమయినట్లుకాదు. కాని, రాజ్యాంగం యుద్ధకాలంలో విపరీతమైన ఒత్తిడికి గురిఅవుతుంది. అత్యవసర సమయంలో రాజ్యాంగాన్ని రద్దు చేయటం న్యాయమేనని చెప్పవచ్చు. అమెరికా జాతీయ అత్యవసర స్థితి ఏర్పడినపుడు అధ్యక్షుడు లింకన్ సైన్యాన్ని పంపించి, దక్షిణ రాష్ట్రాలలో చెలరేగిన అల్లరులను అణిచివేశారు. ఎందువల్లనంటే బానిసత్వాన్ని రద్దు చేసినందుకు దక్షిణ రాష్ట్రాలలో అల్లరులు చెలరేగాయి. మొదటి రెండు ప్రపంచ యుద్ధకాలాలలో ఏర్పడిన విపత్కర పరిస్థితులను తట్టుకోవటానికి బ్రిటిష్ ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకొంది. 1930 లో ఏర్పడిన ఆర్థిక మాంద్య పరిస్థితులను తట్టుకోవటానికి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ న్యూడిల్ శాసనం చేశాడు. భారతదేశంలో కూడ ఎమర్జన్సీ విధింపబడింది. రాజకీయ విమర్శకులందరు దానిని ప్రజాస్వామ్య హత్యగా వర్ణించారు. ఎమర్జన్సీ తొలగిన తరవాత యు. ఎస్.ఏ. లో పరిమిత ప్రభుత్వం ఏర్పడగా జర్మనీ, జపాన్ మొదలైన దేశాలలో రాజ్యాంగ ప్రభుత్వాలు సంక్షోభంలో కూరుకుపోయాయి.

రాజ్యాంగ వాదం విఫలం కావటానికి ఆర్థిక, సంక్షోభం ఒక కారణమని చెప్పవచ్చు. కరువు కాటకాలు, నిరక్షరాస్యత, అంటు వ్యాధులు, పేదరికం మొదలైన వాటిని నిర్మూలించడానికి ప్రభుత్వం తన విచక్షణాధికారాలను ఉపయోగిస్తుంది. ఉదాహరణకు, భారత ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికల ద్వారా పైన చెప్పిన అభివృద్ధి అవరోధాలను నిర్మూలించటానికి ప్రయత్నం చేస్తున్నది. పైన చెప్పిన వాటిని నిరోధించటానికి ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు దేశ విచ్ఛిత్తిని నివారించవచ్చు లేదా విపత్కర పరిస్థితులను సృష్టించవచ్చు. దేశంలో అత్యవసర పరిస్థితులు అవసరమైనపుడు సాంఘిక, ఆర్థిక సంక్షోభ పరిస్థితులున్నప్పుడు ఈ పరిస్థితులను ఎదుర్కోడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. అందుకుగాను ప్రభుత్వం తనకున్న పరిమితులను తొలగించుకొంటుంది అని వేర్ అన్నాడు. దేశంలో శాంతి సౌఖ్యాలు రాజ్యాంగ ప్రభుత్వానికి నిజమైన స్నేహితులు. వీటి అభ్యున్నతి రాజ్యాంగవాద అభ్యున్నతి అని చెప్పవచ్చు.

ఆధునిక రాజ్యాంగ రాజ్యం అనేది ఒక జాతీయ సంస్థ అని చెప్పవచ్చు. రాజ్యాంగ వాదం జాతీయ స్వయం నిర్ణయాధికారాన్ని (National Self Determination) గుర్తించాలి. అంతేగాక రాజ్యాంగ రాజ్యం విచ్ఛిన్న కావడానికి అనేక జాతీయ శక్తులు కారణమయ్యాయి. దీనికి సరియైన ఉదాహరణ బంగ్లాదేశ్ ఆవిర్భావమని చెప్పవచ్చు. దీనికి భిన్నంగా సోవియట్ యూనియన్ తన రాజ్యాంగంలో జాతీయవాద సూత్రాన్ని ఒక భాగం చేసింది. సోవియట్ నాయకులు దేశంలోని వివిధ వర్గాలకు పూర్తి గుర్తింపునిచ్చారు. ప్రతి రాజకీయ యూనిట్ (Political Unit) యూనియన్ నుంచి విడిపోయి సొంత సమాఖ్యను (Federation) ఏర్పాటు చేసుకోవచ్చు. కెనడాలోని క్విబెక్‌లో ఫ్రెంచి ప్రజల తిరుగుబాటు, ఈశాన్య రాష్ట్రాల (North East) లో నాగాలు, మిజోరామ్‌లో తిరుగుబాట్లు ఇందుకు సరియైన

ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఇటువంటి ఉద్యమాలు ప్రభుత్వానికి తీవ్రసమస్యలను సృష్టిస్తాయి. ఈ సమస్యలను పరిష్కరించాలంటే ప్రభుత్వం జాతీయ సమైక్యతకుపాటు పడాలి.

రాజ్యాంగవాదం అంటే బాధ్యతాయుతమైన ప్రాతినిధ్యప్రభుత్వం కాకపోయినప్పటికీ ఇది "సర్వాధికార ప్రభుత్వం" (Totalitarian Government)ను వ్యతిరేకిస్తుంది. ఏ రాజ్యాంగ ప్రభుత్వమైనా పరిమిత ప్రభుత్వం అయినట్లయితే దాని ప్రధాన శత్రువు సంపూర్ణ అధికారమున్న ప్రభుత్వం (Absolute Government) బహు అధికారం ఉన్న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని, ఏ ఉద్యమమైనా రాజ్యాంగ ప్రభుత్వానికి వ్యతిరేకమని చెప్పవచ్చు. ప్రజాస్వామ్యీకరణ దేశ దేశానికి తేడా ఉంటుంది. ఎందువల్లనంటే సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు దేశ దేశానికి మారుతూ ఉంటాయి.

రాజ్యాంగవాద భావనకు శిష్ట స్వభావం ఉన్నప్పటికీ (Aristocratic nature) దీనిలో ప్రజాస్వామ్య లక్షణాలు మనకు కనబడతాయి. జాక్‌సన్ (Jackson) అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు సాధించిన విజయాలు ఓటు హక్కును ప్రజాస్వామ్య బద్ధం చేయటం. ఫ్రాన్స్‌లో జరిగిన పౌరయుద్ధం రాజ్యాంగ వాద భావనలో గొప్ప మార్పులు తీసుకువచ్చాయి. దీని ప్రభావం వల్ల జాతీయ వాదం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వాదంలో భాగాలయ్యాయి. శ్రామిక నియంతృత్వ వాదంవల్ల తలెత్తిన భయాలను ఎక్కువ ప్రజాస్వామ్యం ఇవ్వటం ద్వారా నివారించాలి. మైనారిటీలను వారి హక్కులను రాజ్యాంగం పరిరక్షించాలి. ప్రజల సాంఘిక, రాజకీయ, ఆర్థిక హక్కులను కాపాడాలి. 'స్వేచ్ఛ' కావాలను కొంటే దానిని పొందాలి. దాని కోసం పోరాడాలి. ఈ విధంగా రాజ్యాంగవాదానికి కొత్త అర్థం ఇవ్వడమైంది. ఈ అర్థం ప్రకారం ప్రభుత్వం తన అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా కొన్ని పరిమితులకు లోబడి కొన్ని వ్యవస్థీకృత కార్యక్రమాలను ప్రజల తరపున చేపడుతుంది.

సోషలిస్టు తత్వం అమలులో వచ్చిన ఒక చిన్న సమస్యవల్ల రాజ్యాంగవాద అర్థం మార్పు చేయవలసిన అవసరం ఏర్పడింది. పాశ్చాత్య రచయితల అభిప్రాయం ప్రకారం మార్క్స్, లెనిన్, స్టాలిన, మావోలు, (Marx, Lenin, Stalin, Mao) ఇతరులు చెప్పిన శాస్త్రీయసామాజిక వాదం (Scientific Socialism) రాజ్యాంగ వాద సారాంశాన్ని తిరస్కరిస్తుంది. ఎందుకంటే విప్లవకాలంలోను, విప్లవం అయిన తరవాత సంక్షోభ ప్రజాస్వామ్యం అవతరించరింది. శ్రామిక వర్గం తప్ప అన్నివర్గాలవారు నిర్మూలించబడినారు. దీనికి భిన్నంగా ప్రజాస్వామ్య సామాజిక వాదం (Democratic Socialism) సంక్షేమ రాజ్యాన్ని కోరుకొంటుంది. సమాజంలో ఉన్న వివిధ వర్గాల ప్రయోజనాలను కాపాడుతుంది.

జాతీయవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక వాదం ఉన్న యుగం. రాజ్యాంగ వాదంలో ఈ మూడు ఉండాలి. ఇంగ్లాండ్ రాజ్యాంగం "ఫేబియనిజం" (Fabianism) కు స్థానం కల్పిస్తే, జర్మనీ రాజ్యాంగం సాంఘిక ప్రజాస్వామ్యవాదులకు స్థానం కల్పిస్తే, భారత రాజ్యాంగం సామ్యవాద తరహా సమాజానికి వీలు కల్పించింది. రాజ్యాంగవాదాన్ని వివిధ ఆర్థిక వ్యవస్థలకు అన్వయించవచ్చు. సమాజంలోని వివిధ వర్గాల సమతౌల్యం మీద రాజ్యాంగ వాదం ఆధారపడి ఉంది. ప్రభుత్వ పార్టీల ద్వారా ఈ సమతౌల్యాన్ని సాధిస్తుంది.

రాజ్యాంగవాదం, సమైక్యవాదం, ఫెడరలిజం (Federalism) ప్రాముఖ్యాన్ని గుర్తించాలి. సమైక్యవాదం ద్వారా మాత్రమే భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించవచ్చు. ఫెడరలిజం ద్వారానే మనం

స్థానిక, ప్రాంతీయ, దేశ ప్రయోజనాలను సమైక్యపరిచి రాజ్యాంగ రాజ్యానికి మరింత పటిష్టతను చేకూర్చవచ్చు. అమెరికా, స్విట్జర్లాండ్, ఇండియా, సోవియట్ యూనియన్‌లు, బహుళ జాతీయ రాజ్యాంగ సమస్యలను ఫెడరలిజంను అవలంబించటం ద్వారా చాలా తేలికగా పరిష్కరించుకోగలిగాయి. ఏకకేంద్ర రాజ్యాలయిన బ్రిటన్, ఫ్రాన్స్‌లు అధికార విభజన ద్వారా సక్రమమైన రాజ్యాంగ వ్యవస్థలు ఏర్పాటు చేశాయి. అధికార విభజన సూత్రాల మీద ఆధునిక సమాఖ్య రాజ్యం ఆధారపడినప్పటికీ ఇది అధికార పంపిణీకి, అధికారం జాతీయ ప్రభుత్వం చేతిలో కేంద్రీకృతం కావటానికి మధ్య సమతూకం చూసిందని చెప్పవచ్చు. ఫెడరల్ వ్యవస్థ ఏకకేంద్ర ప్రభుత్వానికి, సార్వభౌమాధికార దేశాలకు మధ్య ఎక్కడో ఉందని మే (May) మహాశయుడు గమనించాడు.

ఫెడరలిజం అంటే అధికారం వివిధ ప్రాంతాలమధ్య విభజన చేయటం మాత్రమే కాదు, అధికారాన్ని విధుల ఆధారంగా విభజించినపుడే దానికి పూర్తి అర్థం వస్తుంది. ఫెడరల్ ప్రణాళిక ఎలా ఉండాలంటే సమాజానికి ప్రాంతీయ యూనిట్‌లలోనేకాక అన్ని సంస్థలతోను సంబంధముండాలి. అప్పుడే ప్రజలు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరుస్తారు. దీని అర్థం ఏమంటే పాక్షిక, సార్వభౌమాధికార సంస్థలను ఏర్పాటు చేసి వాటికి కొన్ని హక్కులను ఇవ్వడం అని అర్థం. ఈ సంస్థలు ఆర్థిక, రాజకీయ, మతపరమైన విధులను నిర్వర్తించలేవు. ఈ పాక్షిక సార్వభౌమాధికార సంస్థలు అమెరికా, ఆస్ట్రేలియాలలో ఉన్న ఫెడరల్ సంస్థలను పోలి ఉంటాయి. దేశం ఈ వివిధ సంస్థలను సమన్వయ పరిచి, వాటిని సరైన తీరులో నడిపిస్తుంది. అంటే దేశం ప్రయోజనాలను కాపాడే వివిధ సంస్థల సముదాయం అవుతుంది. సార్వభౌమాధికారానికి కొత్త రూపం వస్తుంది. సార్వభౌమాధికారం న్యాయభావన కావటానికి బదులు ప్రజల సంక్షేమం కోరే ఒక ఆయుధం అవుతుంది.

చివరగా మనం అంతర్జాతీయ వాదం గురించి ఆలోచిద్దాం. ఆధునిక రాజ్యాంగవాదం, రాజ్యాంగ రాజ్యం పని తీరును, 'అంతర్జాతీయ క్రమం' తో (International order) ఎలా సమన్వయ పరచాలి - అనే అంశం గురించి సతమతమవుతున్నది. అంతర్జాతీయచట్టాలను, న్యాయస్థానాలను గౌరవించటం, యుద్ధ విధానాలను మానుకొనటం, అంతర్జాతీయ నిర్ణయాలను ఆచరించటం, సహేతుకం కాని రక్షణ విధానాలను (International Protectionism) మానుకొనటం మొదలైన అంశాలతో ఏకీభవించే విధంగా ప్రతిదేశం తన రాజ్యాంగాన్ని రూపొందించుకోవాలి. ఉదాహరణకు, జపాన్ తన రాజ్యాంగంలో యుద్ధాన్ని పరిత్యజించాలి అని రాసుకొని దానిని తన జాతీయ విధానం చేసుకొంది. భారతదేశం తన రాజ్యాంగంలో ఉన్న ఆదేశసూత్రాలలోని IV) వ భాగంలో ఉన్న Article 51 ప్రకారం భారతదేశం అంతర్జాతీయ శాంతికి కృషి చేస్తానని, అంతర్జాతీయ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకొంటానని ప్రకటించుకొంది.

అంతర్జాతీయ గందరగోళ పరిస్థితులకు ప్రపంచంలో ఒక బలమైన శక్తి ఉండటమే కారణమని చెప్పవచ్చు. ప్రపంచంలో ఈ బలమైన శక్తి ఉండటం వల్ల 'రెండు' భయానక ప్రపంచ యుద్ధాలు జరిగాయి. ఈ యుద్ధాలను సరి అయిన సమయంలో అదుపుచేయక పోయినట్లయితే మానవజాతి మొత్తం సర్వనాశనం అయ్యేది. అందువల్ల ఏదేశ రాజ్యాంగం అయినా అంతర్జాతీయ క్రమానికి విరుద్ధంగా ఉండరాదు. అంతేకాక ఏ రాజ్యాంగం కూడా యుద్ధం గురించి ప్రస్తుతించరాదు. ఈ పరిస్థితిని 'సమాఖ్య విధానం' కొంతవరకు సరిదిద్దుతుంది. ఒక రాజ్యాంగ రాజ్యం యొక్క ముఖ్య లక్ష్యం 'అంతర్జాతీయ అధికారం బదులుగా జాతీయ అధికారాలను స్థాపించటం' అని చెప్పవచ్చు.

15.10 ముగింపు

ఈ అధ్యయనం వల్ల మనకు రెండు ముఖ్యవిషయాలు ద్యోతకమవుతాయి. రాజ్యాంగ వాదాన్ని విశ్లేషణ చేయాలంటే ముందు మనం రాజ్యాంగవాదం, శ్రామిక నియంతృత్వ వాదంపై ఏ విధంగా పోరాడింది అనే విషయాన్ని తెలుసుకోవాలి. ప్రభుత్వం పౌరహక్కులను తగ్గించాలనుకోవటం రాజ్యాంగ వాదాన్ని బలహీనం చేయటం అని చెప్పవచ్చు. రాజ్యాంగ వాదాన్ని అభివృద్ధి చేయాలంటే సాంఘిక, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని పటిష్ట పరచాలంటే అందుకు అనువైన పరిస్థితులను కల్పించాలి. అటువంటి ప్రజాస్వామ్య నమూనా "జీవితంలో జరిగే అద్భుతంలాగ ఒకసారిగా వచ్చి యాంత్రికంగా కొనసాగే అంశం కాదు. ఇది ఎల్లప్పుడు జరిగే ఒక రాజకీయ ప్రక్రియ" అని చెప్పవచ్చు. అంతేకాక మార్పు సహజసిద్ధమైన ప్రకృతి నియమం దానికి మనం స్వాగతం చెప్పాలి. పాత విలువల స్థానంలో ప్రజల ఆశలకు, ఆశయాలకు అనుగుణమైన కొత్త విలువలను ఏర్పరచాలి. ఈ మార్పువల్లనే నియంతృత్వ వ్యవస్థలు ప్రజాస్వామ్య వ్యవస్థలుగా మార్పు చెందాయి. అంతేకాక రాజ్యాంగ వాదంలో జాతీయ వాదం ప్రజాస్వామ్యంతోపాటు సోషలిజమ్ కూడా ఒక కారణమయింది. అంటే రాజ్యాంగ వాదానికి ఒక స్థిర రూపంలేదు. ఎందుకంటే ఇది మారుతున్న పరిస్థితులకు, సమస్యలకు అనుగుణంగా మారుతుండే పరిస్థితిని చూసి మనం భయపడరాదు, తప్పించుకోరాదు. ఆధునిక రాజ్యాంగ వాదానికి "మార్పు" అనేది సున్నితమైన మెలిక తిరిగే తీరు లేదా వస్త్రం వంటిదని రాజనీతి పితామహుడైన అరిస్టాటిల్ పేర్కొన్నాడు.

– ఆచార్య డి. సూర్యన్ నాయుడు

15.11 చదువదగిన పుస్తకాలు

Strong	: Modern Political Constitutions
Dicey A.V	: Law of the Constitutions
Wheare K.C.	: Modern Constitutions

15.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. రాజ్యాంగతావాదం వృద్ధి పరంగా పరిణామ క్రమాన్ని వివరించండి.
2. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం వర్తమానదేశాల్లోని రాజ్యాంగతా వాదాన్ని చర్చించండి.

*****

భాగం-16 : న్యాయవ్యవస్థలు

విషయక్రమం

16.1 లక్ష్యాలు

16.2 పరిచయం

16.3 చట్టం - రాజకీయ సంస్కృతి

16.4 ఆధునిక సమాజాలలో చట్టాలు

16.5 చట్టం - మతం

16.6 సమకాలీన అరబ్ ప్రపంచం

16.7 సంపూర్ణాధికారం - చట్టం

16.8 చట్టం-పశ్చిమ సాంప్రదాయాలు

16.9 రాజ్యాంగ చట్టం

16.10 రోమన్ న్యాయం - సామాన్యన్యాయం

16.11 బ్రిటీష్ సాధారణ న్యాయం

16.12 విభిన్న న్యాయస్థాన పద్ధతులు

16.13.0 న్యాయసంస్థలు

16.13.1 సోవియట్ న్యాయవ్యవస్థ

16.13.2 అమెరికన్ న్యాయశాఖ

16.13.3 ఫ్రెంచ్ న్యాయవ్యవస్థ

16.14 న్యాయ మూర్తుల ఎంపిక - శిక్షణ

16.15 చదువదగిన పుస్తకాలు

16.16 నమూనా పరీక్షా ప్రశ్నలు

16.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- చట్టం, చట్టనిర్మాణం,
- ఆధునిక సమాజాలలో చట్టాలు
- విభిన్న న్యాయస్థానాల పద్ధతులు
- న్యాయమూర్తుల ఎంపిక విధానాలను బాగా వివరించగలుగుతారు

16.2 పరిచయం

తులనాత్మక రాజకీయ వ్యవస్థలు, వాటి రాజకీయ సంస్కృతులను అధ్యయనం చేస్తున్నప్పుడు చట్టవ్యవస్థ, దాని ప్రక్రియలను మనం నిర్లక్ష్యం చెయ్యలేం. ఒక సమాజ రాజకీయ జీవనాన్ని చట్ట వ్యవస్థ చాలావరకు ప్రభావితం చేస్తుంది. అంతేకాకుండా రాజకీయ సంస్థల్లో చట్టవ్యవస్థలు కూడా ఒక భాగమే. ఇతర రాజకీయ నిర్మాణాల మాదిరి అవి కూడా రాజకీయ ప్రక్రియలో స్పందన కలిగిస్తాయి. వాటిని రూపొందిస్తాయి. ప్రభావితం చేస్తాయి. పశ్చిమ దేశాలలో చట్ట వ్యవస్థల ప్రభావం ఎంతగా ఉందంటే వాటిని రాజనీతి శాస్త్రవేత్తలు నిర్లక్ష్యం చేయలేదు. అలా నిర్లక్ష్యం చేసినట్లయితే వాస్తవాలను విస్మరించి నట్లవుతుంది. ఇటీవలి కాలం వరకు కమ్యూనిస్టు దేశాలలో కూడా రాజ్యాంగాలు, చట్టాలు ముఖ్యపాత్ర వహించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో కూడా చట్ట ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండ చాలావరకు అనుసరించడం జరుగుతున్నది. ఈ సమాజాలలో పశ్చిమ దేశాలలో మాదిరి చట్టాలు అక్షర పరంగా, భావపరంగా తు.చ. తప్పకుండ అనుసరించక పోయినప్పటికీ చాల వరకు వాటి నిర్మితులను, ప్రక్రియలను భంగపరచకుండ కొనసాగించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. చట్టాలను వ్యాఖ్యానించటంలో రాజకీయనిబద్ధ సిద్ధాంత (Idealogy) ప్రభావం కూడా కనిపిస్తుంది. ఉదాహరణకు సామ్యవాద చట్టబద్ధత లేదా "జాతీయతా", "చట్టబద్ధత" మొదలైన భావనలను, చట్టాలను ఆయా దృక్పథాలలో రూపకల్పన చేయటం మనకు కనిపిస్తుంది.

16.3 చట్టం - రాజకీయ సంస్కృతి

విలువలు, విశ్వాసాలు, దీర్ఘకాలిక దృక్పథాలు, రాజకీయ పంథాలు మొదలైన వాటినుంటి చట్టం రూపొందుతుంది. చట్టం రాజకీయ సంస్కృతితో ముడిపడి ఉంటుంది. చట్టాలు రాజకీయ సంస్కృతి నుంచి ఉద్భవించి అదే సమయంలో కొంత ఆంతరంగిక స్వేచ్ఛ కలిగి తమ కర్తవ్యం ద్వారా రాజకీయ సంస్కృతిని మలచటంలోగాని, మార్చటంలోగాని ప్రధాన పాత్ర వహిస్తాయి. సామాజిక విలువలకు, ప్రజా విశ్వాసాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. సామాజిక విలువలకు, ప్రజావిశ్వాసాలకు ప్రాతి నిధ్యం వహిస్తూ చట్టాలు సంస్థీకరణ అవుతాయి. ఈ విధంగా చూసినపుడు చట్టం, లేదా రాజ్యాంగం ఒక సమాజం విలువలకు ప్రతీకగా, ప్రతిబింబంగా రూపొందుతాయి. అదేవిధంగా చట్టనిర్మాణం,

చట్టాలలో మార్పు, చట్టాలను అమలు పరచటం, చట్టపరంగా వివాదాలను పరిష్కరించటం మొదలైనవి సంస్థారూపం ధరించటానికి దోహదమవుతాయి. అయితే ఈ సంస్థ అవి పనిచేసే పద్ధతి, రాజకీయ సంస్కృతిపై చాలావరకు ఆధారపడి ఉంటుంది. చివరికి రాజకీయ వ్యవస్థ సంస్కృతి ప్రభావం కూడా వాటిపై ఉన్నప్పటికీ కొంతమేరకు ఆంతరంగిక స్వేచ్ఛను సంతరించుకొంటాయి. ఈ సందర్భంలో ఇంగ్లండ్ అమలులో ఉన్నచట్టం ఆధిక్యతను మనం ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అయితే ఒకనాటి వలస ప్రాంతాలైన దేశాలలో ఉదాహరణకు భారతదేశం, పాకిస్థాన్‌లు ఆయా సమాజాల సామాజిక, సాంస్కృతిక స్థితిగతులు చట్టం ఆధిక్యత భావనలు దాని అమలును ప్రభావితం చేయవచ్చు. ఈ విధంగా చూసినప్పుడు మిగతా అంశాల మాదిరి చట్టం కూడా పశ్చిమ సమాజాలలో కాని, పశ్చిమేతర దేశాలలోగాని చట్టం రాజకీయ సంస్కృతితో ముడిపడి ఉందని చెప్పవచ్చు. ప్రతి సమాజంలోను రాజకీయ సంస్కృతికి, ఉప సంస్కృతికి ఒకవైపు, మరోవైపు ఆ సమాజ చట్టాలకు ప్రభుత్వానికి మధ్య సంబంధాలు చలనాత్మకంగా ఉంటాయి. అంటే అవి ఎప్పుడూ ఒకే విధంగా ఉండవు. మారుతున్న విలువలు, అవసరాలు, ఆశయాలు వాటిని స్థిరంగా ఉంచక తరచు మార్పుకు గురిచేస్తాయి. సాంప్రదాయక సమాజాలలో ఈ సంబంధాలు చాలా అరుదుగా, నింపాదిగా మార్పుచెందుతాయి. ఆధునికీకరణ చెందిన సమాజాలలో ఈ పరిస్థితి చాలవరకు భిన్నంగా ఉంటుంది. ముఖ్యంగా సాంప్రదాయకతనుంచి ఆధునీకరణకు మార్పు చెందుతున్న సమాజాలలో చట్టాల సారాంశాన్ని అనువర్తించడం అనేది తరచు మార్పుకు గురి అవుతూ ఉంటుంది. ఎందుకంటే ఇది సామాజిక, ఆర్థిక మైన మార్పుల వల్ల స్పందిస్తుంది, ప్రభావితమవుతుంది. ఉదాహరణరకు, సంప్రదాయ సమాజంపై నైతిక విలువలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. వాటిని ఉల్లంఘించిన వారిని తీవ్రంగా శిక్షించటం జరుగుతుంది. అందువల్ల ఆ సమాజాలలో విలువలు, విశ్వాసాల పరంగా చట్టాలను రూపొందించటమే కాకుండా అవి అమలులోకి వస్తాయి. ఈ విధంగా చూసినప్పుడు ప్రజారంగంలో యువత పాత్రను కూడా అవి నిర్దేశిస్తాయని చెప్పవచ్చు. వీటికి అనుగుణంగానే రాజకీయ, సామాజిక రంగాలు పనిచేస్తాయి ఇలాచూసినప్పుడు న్యాయమూర్తులు నిర్ణయాలు తీసుకొనేటప్పుడు ఆయాసమాజాల నైతిక విలువలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఈ దృక్కోణం నుంచి చూసినపుడు చట్టం సమాజానికి ప్రతిరూపం అని చెప్పవచ్చు.

16.4 ఆధునిక సమాజాలలో చట్టాలు

ఆధునిక సమాజాలలో చట్టాలు శిష్ట వర్గాల విలువలు, విశ్వాసాలను ప్రతిబింబిస్తాయి. అవి కొద్ది మందితో కూడుకొన్న శిష్టవర్గాలు తమ విలువలను, భావాలను చట్టం రూపంలో మొత్తం సమాజానికి అన్వయింపచేస్తాయి. కొత్త చట్టాలు కొంత ప్రతిఘటనను ఎదుర్కొన్నప్పటికీ సుస్థాపితమైన రాజకీయ నిర్మాణాలు సదరు వ్యతిరేకతను సులభంగానే తొలగించి ప్రజలు వాటిని ఆమోదించి అమలు పరిచేటట్లు చేస్తాయి. అందువల్ల నూతన చట్టాలను రూపొందించటం, పాత వాటిని తొలగించటం ప్రభుత్వానికి అంతకష్టంకాదు. ఎందుకంటే వాటిని రూపొందించి అమలు పరిచే సామర్థ్యం సత్తా, యంత్రాంగం దానికి ఉంటుంది కాబట్టి. ముఖ్యంగా సాంప్రదాయక ప్రత్యేక సమూహ గుర్తింపులను సూచించే భావాలను, చట్టాలను తొలగించి అందరికీ ఏకోన్ముఖంగా అనుర్తింపచేసే విలువలను, చట్టాలను, సార్వజనీన నియమాలను రూపొందించి అమలు పరచటంలో కృతకృత్యమవుతుంది.

మరో మాటలో చెప్పాలంటే బహుతావాద, సాంస్కృతిగా భిన్నత్వమున్న సమాజాలలో ఏకోన్ముఖతను సాధించటానికి కృషిచేస్తుంది.

16.5 చట్టం - మతం

రాజకీయ చట్టబద్ధత లేదా విశ్వాస వ్యవస్థల్లో చట్టభావనకు మతంపట్ల దృక్పథం ఒక ముఖ్యమైన అంశం. ప్రాచీన ఆటవిక, తెగల సమాజాలలో మతం ప్రముఖపాత్ర నిర్వహించింది. గ్రీక్, రోమన్ సమాజాలలో కూడా రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలలో మతం ప్రభావం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ ప్రాచీన మానవ సమాజాలలో ప్రభుత్వాధికారానికి విశ్వాసాలు, సంప్రదాయాలు, మతం, విలువలు చట్టబద్ధతను కల్పించేవి. అలాగే మధ్య యుగంలో కాథలిజమ్‌తో సంబంధం లేకుండా, దాని ప్రభావం లేకుండా చట్టాలు రూపొందలేదు. ప్రారంభ హ్యూజ్‌నాట్ లేదా అంగ్ల అధ్యయనం చేయలేము. ఈ విధంగా దాదాపు 16, 17 శతాబ్దాల వరకు మతం ప్రభావం చటుటవ్యవస్థలపై చాలా ఎక్కువగా ఉండేది. ఎటొచ్చి 17వ శతాబ్దం ప్రారంభం నుంచి రాజ్యాంగ వాదంలో లౌకిక భావాలు స్పష్టంగా ప్రవేశించాయి.

16.6 సమకాలీన ఆరబ్ ప్రపంచం

సమకాలీన ఆరబ్ దేశాలలో రాజ్యాంగం చట్ట సంస్థల నిర్వహణ, భావాలపై ఇస్లాం మత ప్రభావం చాలా ఉంది. ఇస్లాం ప్రభావం ఇతర సాంప్రదాయక మతం మాదిరి విభిన్న ముస్లిం దేశాలలో అంటే సాంప్రదాయిక ముస్లిం దేశాలు, ఆధునిక ఇస్లాం దేశాలు - విభిన్న స్థాయుల్లో ఉంది. షరియత్ నైతిక సూత్రాలను సంస్కరించే సమాజాలలో దాని ప్రభావం తక్కువగాను, సాంప్రదాయిక ఇస్లామిక్ దేశాలలో ఎక్కువగాను మనకు కనిపిస్తుంది. అయితే నూతన - ఇస్లామిక్ లేదా తీవ్రవాద జాతీయతా సమాజాల్లో సంపూర్ణాధికార తత్వం ప్రాబల్యాన్ని కూడా మనం చూడవచ్చు. ఈ దృష్టితో పరిశీలించినప్పుడు ఇస్లాం, కమ్యూనిస్టు దేశాలలో అధికార పరంపరలో కొంత సారూప్యతను మనం గమనించవచ్చు.

16.7 సంపూర్ణాధికారం - చట్టం

సంపూర్ణాధికార వ్యవస్థలలో చట్టాలకు, చట్ట వ్యవస్థలపట్ల వ్యతిరేక భావం ఎక్కువగా ఉంటుందని సర్వసాధారణంగా భావించడం జరుగుతున్నది. అంటే ఈ సమాజాలలో నైతిక విలువలు, విశ్వాసాలు ప్రబలంగా ఉండవనికాదు. అయితే చట్టబద్ధత ఉన్న అధికారవ్యవస్థ తాను సమకూర్చుకొన్న విశ్వాసాలను, సిద్ధాంతాలను ప్రజానీకం అంగీకరించి అనుసరించే విధంగా - ఫాసిస్టు, కమ్యూనిస్టు - తీవ్రంగా నిర్బంధాలతో ప్రయత్నిస్తుంది. ఈ సందర్భంలో కొత్త భావాలను ప్రవేశపెట్టి వాటికి అనుగుణంగా వ్యక్తి స్వేచ్ఛను, సమూహాల కార్యకలాపాలను క్రమబద్ధంచేయటం లేదా పరిమితం చేయటం జరుగుతుంది. చైనా, తదితర కమ్యూనిస్టు సమాజాలలో "విప్లవ న్యాయం" (Revolutionary Justice) పేరిట సమస్త ప్రజానీకం నిర్బంధంగా అనుసరించేలా అధికారాన్ని వినియోగించటానికి చట్టాలను రూపొందించటం జరుగుతోంది. ఇంతవరకు ముందున్న వర్గ చట్టం, నిరంకుశత్వం, వర్గ న్యాయం

మొదలైన వాటికి వ్యతిరేకంగా కొంత మేరకు ప్రజల మద్దతును సమకూర్చుకోటానికి మరికొంత మేరకు మరణ శిక్షను విధించేవి, లేదా అటువంటి వారిని నిర్బంధ శ్రామికులుగాను పనిచేయించేవారు.

సంపూర్ణాధికార దేశాలలో అన్ని చట్టాలు, న్యాయ నిర్వహణలు, తీర్పులు రాజకీయ దృక్పథం ప్రభావానికి లోనవుతాయి. అయితే పశ్చిమ దేశాలలో రాజకీయ ప్రభావంకంటె కూడ కొన్ని నినాదాల విచారణ ప్రక్రియ లేదా వక్రీకరణ అని భావించటమేకాని చట్టవ్యవస్థను చాలావరకు వాటికి దూరంగా ఉంచటం జరుగుతున్నది. ప్రత్యేక ఆసక్తి వర్గం లేదా వర్గ పరమైన అన్యాయాలను మినహాయిస్తే ఒక ముసాయిదా తీర్మానం చట్టరూపం ధరించిన తరవాత దానిని రాజకీయం చేయడం సాధారణంగా జరగదు. న్యాయస్థానాలు, ప్రక్రియ సాధ్యమైనంతవరకు రాజకీయ జోక్యాలకు, ప్రభావాలకు అతీతంగా ఉంటాయి. అయితే సంపూర్ణాధికార రాజ్యాలలో న్యాయం , చట్ట వ్యవస్థ ప్రక్రియ రాజకీయ ప్రభావాలకు పూర్తిగా లోబడి ఉంటాయి. అనేక మంది న్యాయమూర్తులు ఈ వ్యవస్థలో అధికార సమూహరానికి చెందిన సభ్యులే. వారు పార్టీ వ్యవస్థను తమరాజకీయ నిబద్ధత పరంగా మార్చుకొని చట్టాలను ఆమేరకు రూపొందించి అమలుపరచాలని వారు నిరంతరం భావిస్తారు, కృషిచేస్తారు.

ప్రత్యేక న్యాయస్థానాలు న్యాయానికి ఇచ్చే నూతన అన్వయం, విశ్లేషణ నాజీ జర్మనీలో అవి జర్మన్ జాతీయవాదాన్ని ఏవిధంగా స్తుతించాయో, చిత్రించాయో ఈ సందర్భంలో ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. పశ్చిమ దేశాలలో సామాన్య న్యాయం (Common Law) ప్రకారం న్యాయవాదులు నేరారోపణకు గురైన వ్యక్తుల తరపున వాదిస్తారు. ఆరోపణలు ఎంత తీవ్రమైనప్పటికీ, రాజకీయ వివాదాలతో కూడుకొన్నప్పటికీ తమ క్షక్షిదారులను సంరక్షించుకోటానికి ఏ మాత్రం వెనకాడదు. అయితే కమ్యూనిస్టుచైనా లో న్యాయవాదులు ప్రజా చట్టాలకు సేవకులుగా పనిచేస్తారేకానీ తమ క్షక్షిదారుల కోసం శ్రమ పడరు. వారి ఆసక్తి చట్టాలకు విధేయత చూపించటమేకాని, అమాయకులను రక్షించటంకాదు. మరో మాటలో చెప్పాలంటే చట్టాలకు విధేయత, రాజకీయ నిబద్ధత సంపూర్ణాధికార రాజ్యాలలో తప్పనిసరి. న్యాయస్థానాలు, చట్ట ప్రక్రియ, తీర్పులు అధికార పక్షం రాజకీయ సిద్ధాంతం అవసరాలకు పనిచేస్తాయి. అధికార పక్షం ఆసక్తులను పరిరక్షించడం వాటి బాధ్యత. అందువల్ల చట్టవ్యవస్థ రాజకీయ సిద్ధాంతంతో ముడిపడి ఉంటుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

16.8 చట్టం - పశ్చిమ సంప్రదాయాలు

రాజ్యాంగతావాద పశ్చిమ దేశ సమాజాలలో న్యాయభావన, స్వభావం, శిక్షావిధానం, నేర నిర్ణయం మొదలైన వాటికి కొన్ని వందల సంవత్సరాల సంప్రదాయ చరిత్ర ఉంది. సుశిక్షితులైన న్యాయవాదులు, చిరకాల ఆధారిత సంప్రదాయాలు, పద్ధతులు, ప్రక్రియలు మొదలైన వన్నీ రాజకీయ వివాదాలకు, ఒత్తిడులకు అతీతంగా రూపొందాయి.

అలాగే ప్రయివేట్ చట్టానికీ, ప్రజాచట్టానికీ మధ్య వ్యత్యాసం దాదాపు సాంప్రదాయక రోమన్ చట్టాలనుంచి ఉందనే చెప్పవచ్చు. నిజానికి ఆధునిక న్యాయ చట్టాలకు ఈ విశిష్టత ఒక ప్రాథమిక ప్రాతిపదిక. ఆస్తి, ఒప్పందం, కుటుంబవ్యవహారం, వివాహం, విడాకులు, సంతతి, వారసత్వం మొదలైనవి చిరకాల నుంచి అమలులో ఉన్న ఆచార వ్యవహారాల పరిధిలో పరిష్కరించడం జరుగుతున్నది.

ప్రజాచట్టం (Public Law) పౌరుల హక్కులను నిర్వచించి వాటిని పరిష్కరించాల్సిన బాధ్యతకు రాజ్యాన్ని బద్దం చేస్తుంది. వాటిని అమలు పరచటం ప్రభుత్వ కర్తవ్యం. అలాగే రాజ్యానికి కూడా ఈ చట్టాలుకొన్ని హక్కులను కల్పిస్తాయి. ఉదాహరణకు, పన్నులు విధించి వసూలు చేయడం, ప్రజల భూస్థలాలను ప్రజా ప్రయోజనం కొనం కైవశం చేసుకోవడం, సాంఘిక సంక్షేమం కింద వ్యక్తులకు భద్రత కల్పించటం, నిరుద్యోగభృతి, అనాథలకు ఆశ్రయం, వికలాంగులకు, నిరాధార వృద్ధులకు సంరక్షణ కల్పించడం మొదలైన వాటిని ప్రజా చట్టాలు రాజ్య బాధ్యతలుగా గుర్తిస్తాయి. వాటిని అమలు పరచడం రాజ్యం కర్తవ్యం.

రోమన్ చట్టాలలో ప్రయివేట్ న్యాయం ప్రజా న్యాయం మధ్య విశిష్టతను పాటించటం ఒక ముఖ్యాంశంగా పరిగణించడం జరుగుతున్నది. ఈ సంప్రదాయాన్ని దాదాపు అన్ని పశ్చిమ దేశాలు - ఇంగ్లండ్, ఫ్రాన్స్ - అనుసరిస్తున్నాయి. ప్రయివేట్ వివాదాలకు, పబ్లిక్ వివాదాలకు ప్రత్యేకంగా వేరు వేరు న్యాయస్థానాలు ఫ్రాన్స్‌లో ఉన్నాయి.

పశ్చిమ సమాజాలలో మరొక చెప్పుకోదగ్గ అంశం ఏమిటంటే పౌర చట్టాలు, నేరచట్టాలు వేరు వేరుగా ఉంటాయి. వాటి మధ్య వ్యత్యాసం ఉంటుంది. కొన్ని వ్యవస్థలలో వీటికి వేరు వేరు సంహితలు (Codes) ఉంటాయి. వీటిని నిర్వహించటానికి వేరువేరు న్యాయస్థానాలు పనిచేస్తాయి. ఇద్దరు లేదా ముగ్గురు కక్షిదారులు తమ వాద పరిష్కారానికి న్యాయస్థానానికి చెప్పుకోవచ్చు. ఒప్పంద షరతుల ఉల్లంఘన, పరువు నష్టం, వైవాహిక సంబంధాలు - విడాకులు మొదలైన వివాదాలు పౌర న్యాయం పరిధిలో న్యాయస్థానాలు పరిష్కరిస్తాయి. పౌర వివాదాలు ప్రభుత్వ సంస్థలు ప్రయివేట్ వ్యక్తులకు వ్యతిరేకంగా న్యాయస్థానాలు పరిశీలించవచ్చు. ఒక కాంట్రాక్టర్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వం అతనిపై వ్యాజ్యం నడిపించవచ్చు. ఫ్రాన్స్‌లో మైనర్ల సంరక్షణ, హక్కులు, కుటుంబం, ఆస్తి, ఒప్పందాలు, సముదాయ ఆస్తి మొదలైనవన్నీ పౌర న్యాయ పరిధిలోకి వస్తాయి.

నేరాలకు సంబంధించిన వివాదాలు కక్షిదారులు న్యాయస్థానాలకు తీసుకొని వచ్చినప్పుడు వాటిని వారి తరపున నిరూపించటానికి (Prosecution) రాజ్యం ప్రయత్నిస్తుంది. నేరస్థులకు శిక్షపడేటట్లు చేస్తుంది. ముద్దాయిలపై వచ్చిన ఆరోపణలను న్యాయస్థానాలలో నిరూపించటానికి ప్రయత్నిస్తుంది. ప్రభుత్వం తరపున న్యాయవాది ముద్దాయిని ప్రజాసీకం తరపున విచారిస్తాడు. ప్రజారక్షణ, భద్రతకు సమోదయ్యే నేరాలు దొంగతనం, దోపిడీ, హత్య, మానభంగం, మత్తు మందుల రవాణా మొదలైనది- నేరచట్టం కిందికి వస్తాయి. నేర నిరూపణ జరిగితే, నేర తీవ్రతనుబట్టి సరైన శిక్ష నేరస్థునికి విధించడం జరుగుతుంది. నేరచట్టం కింద ఇచ్చే తీర్పు ముద్దాయి నేరంచేశాడా? లేదా నిర్దోషా? అని స్పష్టం చేయడం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో కొంతమంది వ్యక్తులలో ముద్దాయి నేరం చేశాడా లేదా అనే అంశంపై వారి అభిప్రాయం న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది. దానిని జ్యూరీ వ్యవస్థ (Jury System) అంటారు. అలాగే వ్యాపార సంబంధమైన చట్టాలుకూడా ఉన్నాయి.

వ్యాపారం, వాణిజ్యం మొదలైన వాటికి సంబంధించిన వివాదాల పరిష్కారానికి ఈ చట్టాలను వినియోగించటం జరుగుతుంది. వీటి పరిధి కొన్ని సందర్భాలలో రాజ్య పరిధులను కూడా దాటుతుంది.

అలాగే అంతర్జాతీయ న్యాయం, దానికి సంబంధించిన చట్టాలు, సంప్రదాయాలు అన్ని జాతి రాజ్యాలకు వర్తిస్తాయి. అయితే ఇక్కడున్న వ్యత్యాసం ఏమిటంటే మిగతా చట్టాలు ఆయా దేశాలలో నిర్బంధంగా అమలు అవుతాయి. కానీ అంతర్జాతీయ చట్టం అమలుకు పటిష్ఠమైన యంత్రాంగం ఏమీ లేదు. దానిని అమలు పరచటం ఆయా రాజ్యాలు - వివాదగ్రస్త దేశాలు - ఇష్టా నిష్టాలపై ఆధారపడి ఉంటుంది. అంతర్జాతీయ న్యాయస్థానం ఉన్నప్పటికీ వివాదాల విచారణ, చట్టాల వ్యాఖ్యానం వల్ల అంతర్జాతీయ న్యాయస్థానం అలంకార ప్రాయంగా పనిచేస్తుందని చెప్పవచ్చు. జాతి రాజ్యాలన్నీ అంతర్జాతీయ న్యాయాన్ని అమలు పరుస్తామని హామిఇచ్చి సదరు హామీలకు కట్టుబడి ఉన్నప్పుడే అంతర్జాతీయ వివాదాలు పరిష్కారమవుతాయి. కొన్ని సందర్భాలలో రాజ్యాలమధ్య సరిహద్దు వివాదాల పరిష్కారానికి ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటవుతాయి. అయితే ఇక్కడ కూడా వివాద గ్రస్త రాజ్యాలు సదరు తీర్పుకు బద్దులై ఉంటేనే ఆ తీర్పు అమలులోకి వస్తుంది.

16.9 రాజ్యాంగ చట్టం

రాజ్యాంగ చట్టం. అత్యున్నత చట్టం దానిని మౌలిక చట్టం (Basic Law) అని కూడా వ్యవ హరిస్తారు. అన్ని వివాదాలు సాధారణ చట్టాలు, ప్రభుత్వ ఉత్తరువులు, శాసనసభల తీర్మానాలు రాజ్యాంగ చట్టం పరిధిలోకి వస్తాయి. న్యాయస్థానాల ఒక చట్టం సార్థకతను నిర్ణయించటంలో ఒక ఉత్తరువు ఔచిత్యాన్ని నిర్ధారించటంలో రాజ్యాంగ న్యాయాన్ని అనుసరిస్తాయి. అలాగే న్యాయస్థానం రాజ్యాంగ చట్టాలను వ్యాఖ్యానించటం ద్వారా కొన్ని నూతన చట్టాలకు - న్యాయమూర్తులు రూపొందించినచట్టాలు - రూపకల్పన చేస్తాయి. అవికూడా రాజ్యాంగ చట్టాలలో భాగంగా అమలులోకి వస్తాయి.

న్యాయసమీక్షాధికారం ప్రక్రియను అనుసరించే దేశాలలో ముఖ్యంగా అమెరికాలో న్యాయస్థానాలు రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించి విశ్లేషించి సాధారణ చట్టాలను వివాదాలను పరిశీలించి వాటిని నిర్ణ యించటానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ఇంగ్లండ్‌లో న్యాయస్థానాలకు పార్లమెంటరీ చట్టాల సార్థకతను పరిశీలించే అధికారం లేదు. అయితే అక్కడ కూడా న్యాయస్థానాలు, అలిఖిత రాజ్యాంగ సాంప్రదాయాలు, హక్కులను పరిగణనలోకి తీసుకొని తీర్పులు ఇవ్వటానికి అవకాశముంటుంది. రాజ్యాంగ న్యాయం సాధారణ న్యాయంలో ఒక భాగమే. అన్ని సందర్భాలలోనూ ఈ రెండింటినీ వేరువేరుగా గుర్తించడం సాధ్యంకాదు. అలాగే అది పరిపాలక న్యాయం నుంచి కూడా పూర్తిగా భిన్నంగా ఉండదు.

పరిపాలక న్యాయం పాలనావ్యవస్థకు సంబంధించిన నియమనిబంధనలతో కూడి ఉంటుంది. దీనిని సాధారణంగా అత్యున్నత పాలనా సంస్థలు ప్రకటించి అమలు పరుస్తాయి. పరిపాలనా న్యాయం శాసన సభ ఆమోదంతో రూపొందుతుంది. లేదా చట్ట సభల సమీక్షాధికారానికి లోబడి అమల్లోకి వస్తుంది. ప్రభుత్వోద్యోగులు తమ కర్తవ్య నిర్వహణలో అధికార దుర్వినియోగం చేసినట్లయితే లేదా ప్రజావ్యాజ్యాలను ఎదుర్కొనే పరిస్థితి ఉత్పన్నమైనప్పుడు వారికి తగిన న్యాయం కల్పించటానికి పరిపాలనా న్యాయం ఉద్దేశించబడింది. ఇది ఫ్రాన్స్‌లో అమలులో ఉంది. ప్రభుత్వోద్యోగులు వివిధ ప్రభుత్వ కర్తవ్య నిర్వహణ మొదలైన వాటిలో పరిపాలక న్యాయం ముడిపడి ఉంది. శ్రామిక చట్టం

మరొక రకం. ఉద్యోగులకు ఉపాధిసౌకర్యాలు, సంక్షేమం, పరిహారం, వేతనాలు, మొదలైన వాటికి సంబంధించిన వివాదాలను శ్రామిక న్యాయం పరిష్కరిస్తుంది.

పైన పేర్కొన్నవే కాకుండా విత్త సంబంధమైన చట్టాలు (Fiscal Laws), సామాజిక భీమా చట్టాల (Social Insurance Laws) మొదలైనవి ఆధునిక సమాజాలలో రూపొంది అమలు అవుతున్నాయి. విత్తపాలన, ప్రభుత్వ ఆదాయం, వ్యయం మొదలైన వాటికి సంబంధించిన వివాదాలను పరిష్కరించటానికి ఇవి ఉపకరిస్తాయి. ప్రభుత్వం వసూలు చేసే పన్నులు, వ్యయం, వాటికి సంబంధించిన వ్యవహారాలు, వాటి చట్టపరిధి మొదలైన అంశాలు వాటి పరిగణనలోకి వస్తాయి.

16.10 రోమన్ న్యాయం - సామాన్య న్యాయం

ప్రపంచ వ్యాప్తంగా న్యాయవ్యవస్థలు విస్తృతంగా రోమన్ న్యాయం, సామాన్య న్యాయం (Common Law) సంప్రదాయాలనుంచి రూపొందినవే. ప్రాచీన రోమన్‌ల కాలంలో - ఆరువందల సంవత్సరాలు - న్యాయవ్యవస్థ రోమన్ న్యాయ నిర్ణయాలు సుస్థాపిత, అలిఖిత న్యాయ సంబంధిత వాడుకల పరంగా రోమన్ న్యాయం అభివృద్ధి చెందింది. ఆరోజులలో వివాదాల పరిష్కారం వాస్తవాల (facts) ఆధారంగా జరగాలన్న భావం ఏర్పడింది. రోమన్ రిపబ్లిక్ భావి యుగాలకు అందించిన అపూర్వ కానుక సివిల్ చట్టం (Civil Code). అయితే రోమన్ సామ్రాజ్యం నిరపేక్ష పాలన కిందకు వచ్చాకే - అంటే క్రీ. శ 533 సంవత్సరం నాటికి రోమన్ న్యాయం సంహిత రూపం పొందింది.

రోమన్ సామ్రాజ్య పతనానంతరం, మధ్య యుగాల కాలం వరకు యూరప్‌లో అస్తవ్యస్తంగా రాజకీయ పరిస్థితులన్నప్పటికీ రోమన్ న్యాయభావన అలాగే కొనసాగుతూ వచ్చింది. ఫ్రెంచ్, ఇటాలియన్ విశ్వవిద్యాలయాలు రోమన్ న్యాయ, పాలనా అధ్యయనానికి పెద్ద పీట వేశాయి. న్యాయశాస్త్ర అధ్యయనానికి రోమన్ న్యాయపాలన ఒక అతిముఖ్యమైన ప్రభావ ఆధారంగా పరిగణించడం జరుగుతున్నది. ఒకనాటి రోమన్ సామ్రాజ్యంలో భూభాగాలైన ఫ్రాన్స్, ఇటలీలలో సహజంగా రోమన్ న్యాయశాస్త్ర అధ్యయనం ఒక ముఖ్యాంశమైంది. అనేక స్లోవక్ - జర్మన్ రాజ్యాలు తమ సాంప్రదాయక చట్టాలతోపాటు రోమన్ భావనలను కూడా జోడించాయి. రోమన్‌ల ప్రభావం సుదూర ప్రాంతాలైన స్కాట్‌లాండ్, స్కాండినేవియన్ దేశాలకు విస్తరించాయి. ఇంగ్లండ్ కూడా రోమన్ న్యాయపాలన పట్ల ఆసక్తి చూపించింది. సమత, సామాన్య చట్టం భావాలు రోమన్ న్యాయం ప్రభావానికి లోనయ్యాయని మనం నిస్సందేహంగా చెప్పవచ్చు.

నెపోలియన్ న్యాయపాలన:

ఆధునిక కాలంలో ఫ్రాన్స్‌లో న్యాయచట్టాలను సంహితం చేయడానికి 1804 లో మొదటి నెపోలియన్ అధికారికంగా ఉత్తరువులు జారీ చేశాడు. న్యాయపాలన కట్టు దిట్టంగా, ఇతర దేశాలకు ఒక నమూనాగా ఉండాలన్న లక్ష్యంతో ఫ్రెంచ్ న్యాయవ్యవస్థ క్రమబద్ధీకరణలో భాగంగా పౌరన్యాయాన్ని క్రోడీకరించటం నెపోలియన్ కాలంలో జరిగింది. స్పెయిన్, పోర్చుగల్, కొన్ని లాటిన్ అమెరికన్ రిపబ్లిక్‌లు, క్విబెక్, స్విట్జర్లాండ్, జర్మనీ, ఆస్ట్రియా, బెల్జియం, నెదర్లాండ్, ఇటలీ మొదలైన

సమీప, సుదూర దేశాలు ఫ్రెంచ్ నమూనాను స్వీకరించాయి. టర్కీ, జపాన్, కొన్ని ఆసియా, ఆఫ్రికా వలస ప్రాంతాలు, తూర్పు యూరప్‌లోని ఒకనాటి హాప్స్‌బర్గ్ ప్రాంతాలు కూడా ఫ్రెంచ్ న్యాయభావనను ఆధునికీకరణ ప్రక్రియలో భాగంగా స్వీకరించి స్థానిక మార్పులతో అనుసరించాయి

16.11 బ్రిటీష్ సాధారణ న్యాయం

బ్రిటన్‌లో సాధారణ న్యాయం దాదాపు రోమన్ న్యాయపాలన కాలంలోనే ఏర్పడింది. రెండో హెన్రీ ప్రభువు మొదలైన ఇంగ్లండ్ పాలకులు చేసిన ప్రయత్నాల ఫలితంగా సాధారణ న్యాయం రూపురేఖలు సంతరించుకొంది. ఆకాలంలో సంచారక న్యాయమూర్తులు ఉండేవారు. ఒక స్థానిక న్యాయస్థానం నుంచి మరో న్యాయస్థానానికి పర్యటిస్తూ న్యాయమూర్తులు వివాదాలను పరిష్కరించటానికి ప్రయత్నించేవారు. స్థానిక సంప్రదాయాలు, ఆచారాలు, వ్యవహారాలు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకొని న్యాయమూర్తులు వివాదాల పరిష్కరణలో తీర్పులను ఇవ్వడంలో చేసిన వ్యాఖ్యానాలు, విశ్లేషణల ఫలితంగా బ్రిటీష్ సాధారణ న్యాయం అవతరించింది. న్యాయస్థానాల నమోదు పత్రాల సహాయంతో న్యాయవాదుల వృత్తి ప్రారంభమైంది. హెన్రీ బ్రుల్‌టన్ మొదలైన ప్రఖ్యాత న్యాయశాస్త్ర కోవిదుల నియమ ఆనుపూర్వీకం (Rule Precedent) ప్రాతిపదికగా ఒక స్థిరమైన న్యాయవ్యవస్థను నిర్మించారు. గత వివాదాలలో ఎటువంటి తీర్పులు ఇచ్చారు. ఏఏ విచారణ పద్ధతులు అనుసరించారు మొదలైన వాటి ఆధారంగా అనేక నియమ నిబంధనల సముదాయం కాలక్రమంలో రూపొందింది. సమత, సమన్యాయం భావాలు బ్రిటీష్ న్యాయపాలనకు మూలస్తంభాలయ్యాయి.

కాలక్రమంలో మారుతున్న సామాజిక, ఆర్థిక అవసరాలు దృష్ట్యా న్యాయవ్యవస్థ కార్యభారం కూడా పెరుగుతూవచ్చింది. అందువల్ల వాటిని క్రమబద్ధీకరించడానికి పార్లమెంట్ అత్యున్నత న్యాయస్థానంగా వ్యవహరిస్తూ అవసరమైన చట్టాలను రూపొందించింది. (High Court of Parliament) ఈ చట్టాలు బ్రిటీష్ నేరన్యాయాన్ని (Criminal Law) కూడా రూపొందించాయి.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కూడా సమత, సమన్యాయం అమెరికన్ న్యాయవ్యవస్థను చాలా వరకు ప్రభావితం చేశాయి. ఈ విధంగా సాధారణ న్యాయం భావన వేల్స్, ఐర్లాండ్, అమెరికా వలస ప్రాంతాలు, కెనడ, న్యూజీలాండ్, ఆస్ట్రేలియా మొదలైన సుదూర ప్రాంతాలకు వ్యాప్తి చెందింది. భారతదేశం, స్కాండినేవియన్ దేశాలు ఆఫ్రికాలో బ్రిటీష్ వలస ప్రాంతాలు, ఇజ్రాయిల్ మొదలైనవి కూడా బ్రిటీష్ న్యాయవ్యవస్థ ప్రభావాన్ని చవి చూశాయి.

చట్టాలు ఏ అంశాలను గురించి ప్రస్తావించదో లేదా వాటిని గురించి సమగ్ర వివరణ ఇవ్వదో ఆయా అంశాల పరిశీలనలో ఉన్న వివాదాలకు సంబంధించినవిగా న్యాయమూర్తులు భావించి నప్పుడు వారు స్వయంగా చొరవతో నిర్ణయాలు తీసుకొని, వ్యాఖ్యానాలుచేసి వాటిని తమ తీర్పులలో ఉటంకించేవారు. సంకుచిత సాంకేతిక నియమాలు కొన్ని సందర్భాల్లో హేతుబద్ధంగా లేవని భావించినప్పుడు న్యాయమూర్తులు నూతన నియమ నిబంధనలకు రూపొందించేవారు. వాటి ప్రభావంగా, సంచిత ఫలితంగా బ్రిటీష్ న్యాయపాలనా వ్యవస్థ, సాధారణ న్యాయం రూపొందాయి.

పై దానికి భిన్నంగా రోమన్ న్యాయమూర్తులు ఉన్న చట్టాలను విశ్లేషించటం, అమర్తింపచేయటం మినహాయించి చొరవతో నూతన భావాలను తమ తీర్పుల్లో ప్రవేశపెట్టేవారుకాదు. చట్టం సూచించిన విస్తృత పరిధిని అధిగమించి వారు వ్యవహరించే వారుకాదు. క్షక్షిదారుకు న్యాయం జరగదు అన్న అభిప్రాయం న్యాయమూర్తుల్లో స్థిరంగా ఏర్పడినప్పటికీ రోమన్ న్యాయం అతనికి వివాదాన్ని పరిష్కరించటంలో తగిన స్వేచ్ఛను, సొంత ఆలోచనను జొప్పించడానికి అవకాశం కల్పించలేదు. సాధ్యమైనంతవరకు న్యాయమూర్తులు అమలులో ఉన్న చట్టాలను వ్యాఖ్యాలకు అనువర్తింపచేయటానికి మాత్రమే ప్రయత్నించేవారు. చట్ట సంహితలో ఇతర భాగాలను కూడా పరిగణనలోకి తీసుకొని సామ్యాలను చూపిస్తూ స్థూల పరిధికిలోబడి ఉన్న చట్టాలనే వ్యాఖ్యానించి వాటిని తీర్పుల్లో ఉటంకిస్తూ క్షక్షిదారులకు న్యాయం చేకూర్చడానికి ప్రయత్నించేవారు. అందువల్ల భావనా పరంగా శిక్షణాపరంగా, న్యాయప్రక్రియ పరంగా రోమన్ న్యాయవేత్తలు బ్రిటీష్ న్యాయవ్యవస్థ కంటే పూర్తిగా భిన్నంగా ఉండేవారు. రోమన్ న్యాయవేత్తలు తమ న్యాయం "లిఖిత రూపంలో ఉన్న హేతువు" (Written Reason) అని భావించేవారు. అందువల్ల అది సంపూర్ణంగా హేతుబద్ధమైనదీ, తార్కికమైనదీ, అనుభవం మీద ఆధారపడింది అని దృఢంగా విశ్వసించేవారు.

అయితే సాధారణ న్యాయం అనుభవం, సమత, వాస్తవిక దృక్పథం ప్రాతిపదికలుగా రూపొందింది. న్యాయస్థానం పరిధి వెలుపల ఉండే సామాజిక సంబంధాలను కూడా సాధారణ న్యాయం పరిగణనలోకి తీసుకొంటుంది. అందువల్ల సాధారణ న్యాయం న్యాయమూర్తి రూపొందించిన న్యాయం (Judge made law) గా పరిగణించవచ్చు. దానికి భిన్నంగా రోమన్ న్యాయం ఆచార్యుడు రూపొందించిన న్యాయం (Professor's Law) గా రూపొందింది. సామాజిక జీవనం, వేరం, శిక్ష, వ్యాపార లావాదేవీలు మొదలైన వాటినన్నింటిని శాస్త్రబద్ధంగా సమీకరించి క్రోడీకరించిన ప్రయత్న ఫలితంగా రోమన్ న్యాయం న్యాయవాదుల చట్ట (lawyer's law) అనుభవ పూర్వకంగా రూపొందింది.

16.12 విభిన్న న్యాయస్థాన పద్ధతులు

న్యాయం పట్ల విభిన్న దృక్పథాలున్నట్లే న్యాయస్థాన ప్రక్రియల్లో కూడా వివిధ విధ దేశాలలో వైవిధ్యం కనిపిస్తుంది. ముఖ్యంగా ఈ వ్యత్యాసం రోమన్, బ్రిటీష్ సాధారణ న్యాయం సందర్భంలో మనం స్పష్టంగా గమనించవచ్చు. పౌర న్యాయానికి సంబంధించిన వివాదాల్లో అంటే ఇద్దరు, ముగ్గురు క్షక్షిదారులకు సంబంధించిన వివాదాల్లో అనుసరించే పద్ధతుల విషయంలో ఈ రెండు న్యాయ సంప్రదాయాల మధ్య చెప్పుకోదగ్గ వ్యత్యాసంలేదు. అయితే న్యాయ నిర్ధారణ న్యాయం విషయంలో మాత్రం రోమన్ న్యాయాన్ని సాధారణ న్యాయ సంప్రదాయకులు తీవ్రంగా విమర్శించారు. రోమన్ న్యాయం నేర నిరోధక లేదా నేరానికి సంబంధించి నంతవరకు చాలా అసమానంగా ఉందని వారు భావిస్తారు.

ప్రాచీన రోమ్‌లోను, ఇంకా చెప్పాలంటే విప్లవానికి ముందు ఫ్రాన్స్‌లోను న్యాయమూర్తి విచారణాధికారిగా కూడా వ్యవహరించేవాడు. అంటే న్యాయమూర్తి ఆరోపణలు చేసి వాటిని విచారించేవారన్న మాట. పబ్లిక్ ప్రాసిక్యూటర్ల వ్యవస్థ ప్రారంభమైన కొద్దికాలం వరకు దాదాపు కొనసాగుతూ వచ్చింది. న్యాయప్రక్రియ క్రమబద్ధం అయిన తరవాత న్యాయమూర్తుల నుంచి ప్రజావిచారణాధికారులు (Public

Prasecutors) ఏర్పాటుచేటంత వరకూ న్యాయమూర్తులు క్రియాత్మక పాత్ర నేర విచారణలో కొనసాగుతూ వచ్చింది. ఈ నాటికి కూడా ఫ్రాన్స్‌లో న్యాయమూర్తులు కొన్ని సందర్భాల్లో ప్రజావిచారణాధికారుల కర్తవ్యాలను నిర్వహిస్తూనే ఉన్నారు.

ఫ్రాన్స్‌లో నేర విచారణ ప్రారంభంకావటానికి ముందు న్యాయమూర్తి దర్యాప్తు జరుపుతారు, ముద్దాయిని ప్రశ్నిస్తారు. సాక్ష్యులను పరీక్షిస్తారు. నేర నిరూపణకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా అధ్యయనం చేస్తారు. సాక్షులను పరిశీలిస్తారు. ఈ ప్రాథమిక విచారణలో నేరారోపణకు సంబంధించుకొంటారు. ముద్దాయినీ, సాక్షులను న్యాయమూర్తులు నింద విచారణ సమయాలలో క్రియాత్మకంగా, సునిశితంగా ప్రశ్నిస్తారు. అందువల్ల ఫ్రెంచ్ పద్ధతిలో ప్రచావిచారణాధికారే కాకుండా న్యాయమూర్తి కూడా క్రియాత్మకంగా పాల్గొంటారు. ముద్దాయి నేరాన్ని పూర్తిగా రుజువుచేయటంలో ఈ విధంగా న్యాయమూర్తి కూడా తనవంతు కర్తవ్యాన్ని క్రియాత్మకంగా నిర్వహిస్తారు.

పైన వివరించిన ఫ్రెంచ్ పద్ధతికి ప్రధాన లక్ష్యం ఏమిటంటే న్యాయ విచారణలో నేరస్థుడుగా అనుమానించబడుతున్న వ్యక్తి నేరం చేసినట్లు భావించడం జరిగితే సదరు నేరాన్ని పూర్తి ఆధారాలతో విచారణ జరిపి నేరస్థుడిని శిక్షించడం నేర నిరోధక చట్టం అని భావించడమే. విచారణ జరిపే న్యాయమూర్తి తరుచు సాక్షులను ప్రశ్నించి అసలు నిజాన్ని రాబట్టడానికి, వారి సాక్ష్యాలలో పరస్పర విరుద్ధతలను బయటపెట్టడానికి ప్రయత్నిస్తారు. అసలు ఏమిజరిగింది? అనేది తెలుసుకోవటం న్యాయస్థానం ప్రాథమిక లక్ష్యంగా భావించటం వల్లనే ఫ్రెంచ్ న్యాయమూర్తులు న్యాయ విచారణలో క్రియాత్మక పాత్ర నిర్వహించటం జరుగుతున్నది. అయితే ఈ సత్యాన్వేషణ న్యాయపద్ధతులకు అవసరమైన ప్రాముఖ్యమివ్వదు. పద్ధతికి, ప్రక్రియలకంటే వాస్తవాలను వెలికి తీయటానికి ఎక్కువ ప్రాధాన్యమివ్వటం జరుగుతున్నది. అందువల్ల కొన్ని సందర్భాలలో ముద్దాయిలు తమను కాపాడుకొనే స్వేచ్ఛ పరిమిత మవుతుంది. న్యాయమూర్తే ప్రశ్నించడంవల్ల ముద్దాయిలు సాక్ష్యాలను సవాలు చేయడానికి అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. అయితే సాధారణ న్యాయం కింది విచారణా పద్ధతి, ప్రక్రియపై దానికి పూర్తిగా భిన్నంగా ఉంటాయి. నేర విచారణ ప్రాథమిక దశలో "గ్రాండ్ జ్యూరీ" పనిచేస్తుంది. కొంతమంది పౌరులను ఎంపికచేసి వారిని జ్యూరీ సభ్యులుగా విచారణ సమయంలో వ్యవహరించమంటారు. ప్రాథమిక విచారణ దర్యాప్తు సాక్ష్యాధారాలు వాద వివాదాలు పరిశీలించిన అనంతరం పౌరగణ న్యాయమూర్తి జ్యూరీ సభ్యులు ముద్దాయి నేరం చేసినట్లు భావిస్తున్నారా? అని ప్రశ్నిస్తారు. ముద్దాయి నేరం చేసారని జూరీ అంటే అతనిపై సమగ్రవిచారణ జరుపుతారు. నేరం చేయలేదని జ్యూరీ నిర్ణయిస్తే ఆ విచారణ దశలోనే ముద్దాయిని విడుదలచేయటం జరుగుతుంది.

సాధారణ న్యాయం ముద్దాయలకు తమ నిర్దోషిత్వాన్ని సమర్థించుకోటానికి ఎక్కువ అవకాశం కల్పించవలసి వస్తుందనటంలో సందేహం లేదు. అయితే అంత మాత్రాన ఈ పద్ధతిలో న్యాయం ఎక్కువగా జరగటానికి అవకాశం ఉందని చెప్పలేము. కానీ సాధారణ న్యాయపద్ధతి వ్యక్తి స్వేచ్ఛకు హామీ ఇస్తుంది. ముద్దాయి తనకు తాను వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వకుండా ఉండవచ్చు, సాక్ష్యులను అతడు ప్రశ్నించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నిర్బంధం నుంచి "బెయిల్" పై విడుదల కావచ్చు. తనను తాను కాపాడుకోవటానికి న్యాయవాది ద్వారా వాదించవచ్చు.

అయితే న్యాయవ్యవస్థలు మిగతా అంశాల్లోకూడా సమర్థతతో పనిచెయ్యాలి. సత్వర న్యాయం సమకూర్చటం, అధిక వ్యయ ప్రయాసలు లేకుండా చూడటం, ప్రజా ఒత్తిడికి దూరంగా విచారణ జరిపించడం మొదలైనవి న్యాయవ్యవస్థ సమర్థతకు, పటిష్ఠతకు దర్పణాలు.

సాధారణ న్యాయం, జ్యూరీ వ్యవస్థ ప్రాతిపదిక ఏమిటంటే "తొంభై మంది దోషులు శిక్ష తప్పించుకొన్నా ఫరవాలేదుకాని, ఒక్క నిర్దోషికి కూడా శిక్షపడకూడదు". ఈ ప్రక్రియ ఫ్రెంచ్ విధానానికి చాలా భిన్నంగా ఉంటుంది. ఫ్రెంచ్ న్యాయవ్యవస్థ మూలసూత్రం నిర్దోషిత్వం పూర్తిగా రుజువు అయ్యేంతవరకు ప్రతి ముద్దాయీ నేరస్థుడే. "నేరం రుజువయ్యేవరకూ ప్రతిముద్దాయి నిర్దోషే" అని సాధారణ న్యాయం అంటుంది.

16.13.0 న్యాయ సంస్థలు

జాతీయ, చారిత్రక, స్థానిక పరిస్థితుల ప్రకారం న్యాయసంస్థల నిర్మాణం వివిధ దశల్లో వేరువేరుగా ఉంటుంది. అయితే అన్ని న్యాయస్థానాలు పరంగా విచారణ న్యాయస్థానం ప్రాథమిక స్థాయిలో ఏర్పాటవుతుంది. ప్రాథమిక విచారణ కింద న్యాయస్థానంలో జరుగుతుంది. కింది న్యాయస్థానాలు అనేక రకాల వివాదాలను విచారణకు స్వీకరిస్తాయి. ఈ స్థాయిలో వాదానికి సంబంధించిన అన్ని అంశాలను - యథార్థాలను - పరిశీలిస్తుంది. అయితే ఓటమి చెంది పక్షం ఉన్నత న్యాయస్థానానికి అప్పీలు చేసినపుడు సదరు న్యాయస్థానం చట్టంలోని లొసుగులను గమనించి తీర్పు ఇస్తుంది.

అప్పీలు న్యాయస్థానం కింద న్యాయస్థానం తీర్పులపై అప్పీళ్ళను స్వీకరిస్తుంది. కింది న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను కొట్టివేసే అధికారం అప్పిలేట్ న్యాయస్థానానికి ఉంటుంది. సాధారణ న్యాయం అమలులో ఉన్న వ్యవస్థల్లో కింది న్యాయస్థానం చేసిన యథార్థాల నిర్ధారణను సామాన్యంగా ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించదు. అందువల్ల ఉన్నత న్యాయస్థానం అనుమతిస్తేనే అపీళ్ళపై విచారణ ప్రారంభమవుతుంది. సాధారణంగా ఉన్నత న్యాయస్థానాలు చట్టాన్ని అన్వయించే విషయానికి సంబంధించిన అంశాలనే పరిగణనలోకి తీసుకొంటాయి. అప్పీళ్ళను స్వీకరించే ఉన్నత న్యాయస్థానాలకు కూడా ప్రారంభ విచారణాధికారం (Original Jurisdiction) ఉంటుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో కూడా సుప్రీంకోర్టు కింది న్యాయస్థానాల తీర్పులపై అప్పీళ్ళను విచారించటమే కాకుండా విదేశీ వ్యవహారాలు, దౌత్య రాయబారులు మొదలైన అంశాలకు సంబంధించిన వివాదాలను నేరాసరి విచారణ చేయటానికి దానికి ప్రారంభ అధికార పరిధి ఉంది.

16.13.1 సోవియట్ న్యాయవ్యవస్థ

అమెరికా న్యాయవ్యవస్థలో రెండు న్యాయస్థానాల పద్ధతి అమలులో ఉంది. రాష్ట్రాల్లో రాష్ట్ర న్యాయశాఖలు, సమాఖ్య వ్యవస్థలో సుప్రీంకోర్టు అత్యున్నత సమాఖ్య న్యాయసంస్థగా పనిచేస్తాయి. అయితే కెనడా, స్విట్జర్‌లాండ్, జర్మనీ సమాఖ్యల్లో రాష్ట్రాల న్యాయస్థానాలకు వివాదాలేకాకుండా కొన్ని సందర్భాలలో సమాఖ్య చట్టాలను కూడా పరిశీలన చేసే పరిధి ఉంటుంది. అత్యున్నత న్యాయస్థానాలు సాధారణంగా అప్పీళ్ళను విచారిస్తాయి, చట్టాలను వ్యాఖ్యానిస్తాయి. చట్టాల విషయంలో ఏకోన్ముఖతను

వ్యాఖ్యల పరంగా తీసుకొని రావడానికి ప్రయత్నిస్తాయి. రాష్ట్రాలమధ్య, కేంద్రం - రాష్ట్రాలమధ్య ఉత్పన్నమైన వివాదాలను పరిష్కరించటానికి వాటికి ప్రారంభ అధికారాలున్నాయి.

పై సమూహ్యలో పనిచేసే న్యాయశాఖ వ్యవస్థకు భిన్నంగా పూర్వపు సోవియట్ యూనియన్‌లో న్యాయవ్యవస్థ రూపొందింది. అక్కడ న్యాయశాఖ కేంద్రీకృత నియంత్రణలో పనిచేసేది. ప్రతి న్యాయస్థానంలో ఒక ప్రజా ఆరోపణాధికారి ఉంటాడు. వాళ్ళు ప్రాసిక్యూటర్ జనరల్‌కు బాధ్యత వహిస్తారు. న్యాయమూర్తులను సోవియట్ చట్ట సభలు ఎన్నుకొనేవి. వీళ్ళందరూ కమ్యూనిస్టుపార్టీ నేతృత్వంలో పనిచేసే వారు.

16.13.2 అమెరికన్ న్యాయశాఖ

అమెరికాలో న్యాయశాఖ జిల్లా న్యాయస్థానాలుగా రూపొందింది. వీటిపైన అప్పీళ్ళ న్యాయస్థానాలుంటాయి. ఈ అప్పీళ్ళ న్యాయస్థానాలపైన అంతిమ న్యాయస్థానంగా సుప్రీంకోర్టు పనిచేస్తుంది. అంతవరకు విడిగా ఉన్న చట్ట న్యాయస్థానాలు, సమతా న్యాయస్థానాలను 1789 లో చట్టం సమైక్యం చేసింది. ఇండిపెండెంట్ రెగ్యులేటరీ కమీషన్లు, సైనిక న్యాయస్థానాలతోపాటు కస్టమ్స్ న్యాయస్థానాలు మాత్రం వేరు వేరుగా ఏర్పడి పనిచేస్తున్నాయి. పేటెంట్ హక్కుల "వివాదాలు" వాటిపై అప్పీళ్ళు మొదలైన వాటిని విచారించడానికి మళ్ళీ ప్రత్యేక న్యాయస్థానాలున్నాయి.

16.13.3 ఫ్రెంచ్ వ్యవస్థ

ఫ్రాన్స్‌లో పరిపాలక న్యాయస్థానాలు ఫ్రెంచ్ వ్యవస్థ ప్రత్యేకతను చాటుతాయి. ఇవి ఒక విధంగా సాధారణ న్యాయస్థానాలకు సమాంతరంగా పనిచేస్తాయని చెప్పవచ్చు. వీటికి ఉద్యోగి స్వామ్యంపై నియంత్రణ ఉంటుంది. అమెరికాలో మాదిరి న్యాయాసమీక్షాధికారం ఫ్రెంచ్ న్యాయస్థానాలకు లేక పోవడం వల్ల వారి పాలక న్యాయస్థానాలకు మంచి ప్రభావం, నియంత్రణ ఉన్నాయి. ఆంగ్లో - సాక్సన్ సంప్రదాయం బ్రిటన్‌లో ఉద్యోగుల విధినిర్వహణ విషయంలో ప్రభుత్వాన్ని న్యాయస్థానంలో కక్షిదారునిగా ప్రవేశ పెట్టడం సాధ్యంకాదు. అయితే ఫ్రాన్స్, జర్మనీ తదితర రోమన్ న్యాయాన్ని అనుసరించే దేశాల్లో పరిపాలక న్యాయస్థానాలు పరిపాలనా చర్యలను, ఉద్యోగులను సవాలు చేసే అవకాశాలను పౌరులకు కల్పించాయి. ఇక్కడ ప్రభుత్వమేనని ప్రభుత్వోద్యోగి తన చర్యలకు న్యాయ స్థానాల్లో బాధ్యత వహించడు. చట్ట వ్యతిరేక, లేదా చట్ట వెలుపల ఉద్యోగుల చర్యలకు ప్రత్యేకంగా విచారించటానికి, వారిపై క్రమశిక్షణా చర్య తీసుకోడానికి వీలుగా ప్రత్యేకంగా న్యాయస్థానాలు ఉంటాయి. ఫ్రాన్స్‌లో 24 ప్రాంతాలలో 24 సదరు న్యాయస్థానాలు ఈ ప్రయోజనం కోసమే పనిచేస్తున్నాయి.

16.14 న్యాయమూర్తుల ఎంపిక - శిక్షణ

సర్వసాధారణ నియామక పద్ధతి న్యాయమూర్తుల విషయంలో అనుసరించేదేమిటంటే కార్య నిర్వాహక వర్గం వారిని ఎంపికచేసి నియమించటం నిర్దుష్టమైన పద్ధతులను రూపొందించి వాటి ప్రకారం

అధ్యక్షుడు న్యాయమూర్తులను నియమిస్తాడు. "మంచి ప్రవర్తన కలిగి ఉన్నంతకాలం" వారు పదవిలో కొనసాగుతారు.

పశ్చిమ దేశాల్లో న్యాయమూర్తులను న్యాయవాదుల నుంచి ఎంపికచేసి నియమించడం జరుగుతున్నది. ఇంగ్లండ్‌లో న్యాయవాదులకు (Barristers), న్యాయ సహాయకులకు (Solicitors) మధ్య విశిష్టతను పాటిస్తున్నారు. చిరకాలానుభవం ఉన్న బారిస్టర్లనే అక్కడ న్యాయమూర్తులుగా నియమిస్తున్నారు.

అమెరికాలో న్యాయమూర్తులను ప్రధానంగా న్యాయవాదులనుంచే ఎంపిక చేయడం జరుగుతున్నది. అక్కడ న్యాయవాదుల సంఘం (Bar Association) న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వంపై గట్టి ఒత్తిడి తెస్తుంది.

సాధారణ న్యాయం అమలులో ఉన్న దేశాల్లో న్యాయమూర్తులు కార్య నిర్వాహక వర్గం నుంచి ఎక్కువ స్వేచ్ఛ తక్కువ జోక్యం వారికి ఉంటుంది. అయితే ఫ్రాన్స్‌లో న్యాయమూర్తులు దీర్ఘకాలిక పాలనానుభవం ఉన్న సేవలనుంచి ఎంపిక కావటం జరుగుతుంది. వారు తక్కువ స్థాయి న్యాయ స్థానాల్లో, చిన్న స్థాయిన్యాయాధిపతులుగా ఎంపిక అయి క్రమ క్రమంగా పదోన్నతి పొందుతారు. అందువల్ల న్యాయమూర్తి ఉద్యోగం ప్రతిష్ఠాకరమైనదే కాకుండా తగిన జీతభత్యాలు, రక్షణ, సమాజంలో గుర్తింపు పొందుతారు. వ్యక్తిపరమైన సమర్థత, చిత్తశుద్ధి, నిబద్ధత వారికి ఉంటాయి. పర్యవసానంగా తమ విధ్యుక్త ధర్మాన్ని నిర్వహించటంలో ఎటువంటి ఆటుపోటులకు గురికాకుండా సర్వజనుల మన్ననలను పొంది దీర్ఘకాలం పదవిలో కొనసాగుతారు.

— డా. వి. రవీంద్రశాస్త్రి

16.15 చదువదగిన పుస్తకాలు

Bryce, Lord	: Modern Democracies
Marshall	: Constitutional Theory
Montesquieu	: Spirit of the Laws
Laski H.J.	: An Introduction to Politics

16.16 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. ప్రపంచంలో గల వివిధ న్యాయ వ్యవస్థలను చర్చింపుము.
2. న్యాయమూర్తుల ఎంపిక పద్ధతులను పరిశీలింపుము
3. రాజ్యాంగ న్యాయమును విశ్లేషింపుము.
4. రోమన్ న్యాయాన్ని గురించి చర్చింపుము.

*****

భాగం-17 : విప్లవాలు

విషయక్రమం

17.1 లక్ష్యాలు

17.2 పరిచయం

17.3 విప్లవాలు : వివిధ భావనలు, స్వభావం

17.4 విప్లవాలు : అధ్యయనం పద్ధతులు

17.5.0 విప్లవాలలో రకాలు, లక్షణాలు

17.5.1 ఉదార విప్లవం

17.5.2 కమ్యూనిస్టు విప్లవం

17.5.3 అర్ధ విప్లవం

17.5.4 పరిమిత, అపరిమిత విప్లవాలు

17.5.5 రూఢియైన విప్లవం

17.5.6 విప్లవాల లక్షణాలు

17.6.0 విప్లవం వివిధ దృక్పథాలు

17.6.1 ఉదారవాద దృక్పథం

17.6.2 మార్క్సిస్టు దృక్పథం

17.6.3 నిర్మితులు-విధుల దృక్పథం

17.6.4 మనో వైజ్ఞానిక శాస్త్ర దృక్పథం

17.6.5 భావ - ఉదారవాదం

17.7 విప్లవాలలో తాత్త్విక భావాల ప్రభావం

17.8 విప్లవాలు - ఒక పరిశీలన

17.9 చదువదగిన పుస్తకాలు

17.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

17.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- విప్లవాల స్వభావం
- అధ్యయన పద్ధతులు
- వివిధ రకాలు, వివిధ దృక్పథాలను బాగా వివరించగలుగుతారు.

17.2 పరిచయం

రాజ్యాలు, ప్రభుత్వాలు విప్లవాలకు లోను కావటం సహజమేనని అరిస్టాటిల్ సిద్ధాంతీకరించటం మనకందరికీ తెలిసిన విషయమే. వివిధరకాల రాజ్యాలలో విప్లవాలు వివిధ రకాలుగా తలెత్తుతాయని కూడా అరిస్టాటిల్ పేర్కొన్నాడు. ప్రజల్లో ఉండే సమానత్వ వాంఛ సాధారణంగా విప్లవాలు ఏర్పడటానికి దోహదం చేస్తుందని ఆయన భావించాడు. ఆధునిక రాజ్యాలలో విప్లవాలు సంభవించటానికి కారణం ఆయా రాజ్యాలలో నిర్వహించే అధికార స్వభావ స్వరూపాలేనని భావించడం జరుగుతోంది. రాజ్యానికి అధికారం సంక్రమించిన తీరు, దాన్ని చెలాయిస్తున్న తీరు న్యాయబద్ధమైనదా (Legitimate), కాదా అనేది ఆధునిక రాజ్యాలలో విప్లవాల ఉనికికి కారణమవుతుందని కూడా భావించడం జరుగుతోంది. రాజ్యానికి అధికారం న్యాయబద్ధంగా సంక్రమించిదాన్ని న్యాయబద్ధంగా చెలాయిస్తే ప్రజలు సహజంగానే అలాంటి రాజ్యానికి అలాంటి అధికారానికి బద్ధులై ఉంటారు. అలాకానప్పుడు ప్రజలు రాజ్యానికి, రాజ్యాధికారానికి ఎదురుతిరిగి నిలుస్తారు. ఇంగ్లండ్‌లో 1688 లో సంభవించిన రక్తపాతరహిత విప్లవం, 1789 నాటి ఫ్రెంచి విప్లవం, బోల్షివిక్ విప్లవం, అమెరికా స్వాతంత్ర్య విప్లవం, చైనా విప్లవం మొదలైన వన్నీ ఇలాంటి విప్లవాలుగానే భావించవచ్చు. జాక్విన్ ఎల్లల్ **'ఆటోప్సీ ఆఫ్ రివల్యూషన్'** అనే తన గ్రంథంలో ఇలా అంటాడు.

"ప్రజాభీష్టమూ విప్లవమూ ఒకటే. ప్రజాభీష్టపు అభివ్యక్తిగానే రాజ్యం చెల్లుబాటు కావాలని మనం అనుకొంటాం. న్యాయబద్ధమైన రాజ్యం ఉనికి నిజానికి ప్రజాసార్వభౌమాధికారంలోనే ఇమిడి ఉంది. ఈ రెండూ ఏ విధంగా కలిసిపోతాయంటే ప్రజా విప్లవం ద్వారా ఏర్పడిన రాజ్యం న్యాయబద్ధమైనదిగా తోచదు"

రాజకీయం అంటే ఒక విధంగా అధికారం కోసం జరిగే పోరాటమేనని మనం భావిస్తున్నాం. ఈ పోటీలో మంచి తనంతో ప్రజల్ని ఒప్పించటం నుండి బలప్రయోగం, హింస, భయపెట్టటం లాంటి ఎన్నో విషయాలు సాధారణంగా చోటుచేసుకుంటాయి. రాజకీయాధికారం కోసం ఉపయోగించే ఈ పద్ధతులన్నిటికీ న్యాయబద్ధత అనేది గీటురాయి. రాజ్యాధికారం ఒకరి నుంచి మరొకరికి, ఒక వర్గం నుంచి మరొక వర్గానికి సంక్రమించటం ఇంచుమించుగా ఏదో విధంగా విప్లవాత్మకంగానే జరుగుతుంది. విప్లవం అనే మాటకు మనం ఆపాదించే ఎన్నో అర్థాలను పరిశీలిస్తే ఇది విశదమవుతుంది. అందుకే సమకాలీన రాజకీయ సిద్ధాంత అధ్యయనంలో విప్లవం అనే భావన ప్రముఖమైన స్థానం ఆక్రమించింది.

17.3 విప్లవాలు : వివిధ భావనలు, స్వభావం

విప్లవం అనే భావన కేవలం రాజకీయ దృక్కోణం నుంచే కాకుండా మానవ జీవితపు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలతో సహా అన్ని దృక్కోణాలు కలగలిసిపోయి సాక్షాత్కరిస్తుంది. విప్లవాలన్నీ మార్పుకే దోహదం చేసినప్పటికీ కొన్ని శాంతియుతంగా, మరికొన్ని హింసాత్మకంగా, కొన్ని సంపూర్ణంగా, మరికొన్ని ఏవో కొన్ని మార్పుల్ని ఆశించేవిగా, చిన్నవిగానూ, లేదా పెద్ద ఎత్తునగానీ, నెమ్మదిగా గానీ లేదా ఆకస్మాత్తుగాగానీ సంభవించవచ్చు. అందుకే విప్లవాల్ని నిర్నిబద్ధంగా నిర్వచించటం కష్టతరమవుతుంది. అయినప్పటికీ సామాజిక శాస్త్రజ్ఞులు విప్లవాన్ని సామాజిక వ్యవస్థలో ఆకస్మాత్తుగా, మౌలికంగా సంభవించే మహా పరిణామాన్నే విప్లవమని భావిస్తున్నారు. ముఖ్యంగా రాజనీతిశాస్త్ర పరిభాషలో విప్లవం అంటే ప్రభుత్వ వ్యవస్థ, దానికి సంబంధించి వివిధ నిర్మితుల్లో (Structures) మౌలికంగా సంభవించే మార్పుగా పేర్కొన్నారు. కార్ల్ ఫ్రెడరిక్ విప్లవాన్ని ఇలా నిర్వచించారు. "విప్లవం అంటే స్థాపితమై ఉన్న రాజకీయ వ్యవస్థకు ఎదురయ్యే సవాలు. తద్వారా పాత వ్యవస్థకు తీవ్రంగానూ, మౌలికంగానూ ఒక కొత్త రాజకీయ వ్యవస్థ ఏర్పాటు".

ఫ్రెడరిక్ నిర్వచనం విప్లవాన్ని అర్థం చేసుకోవటానికి సహాయ కారే అయినప్పటికీ దాన్ని రూఢ్య ర్థంలో గ్రహించటంలో కొన్ని ఇబ్బందులున్నాయి. దీనికి కారణం స్థాపితమైఉన్న వ్యవస్థలో సంభవించే ఆకస్మిక సంఘటనలు (out bursts), సంక్షోభం (Upheaval), అశాంతి (Unrest), అందోళన, తిరుగుబాట్లు , కుట్రలు మొదలైన వాటిని కూడా విప్లవాలుగా భావించటానికి అస్కారముండటమే. ఇవన్నీ విప్లవాల్లో భాగాలే అయినా వీటిని దేనికి దాన్ని విప్లవంగా భావించరాదు. ఉదాహరణకు, తిరుగుబాటు విప్లవంకాదు. జాక్వెస్ ఎల్లల్ తిరుగుబాటుకు, విప్లవానికి తేడాలను పేర్కొంటూ ఈ రెండూ అకస్మాత్తుగా సంభవించి, స్థాపితమై ఉన్న వ్యవస్థను ఒక్క కుదుపు కుదిపి గమనించదగ్గ మార్పుకు దోహదం చేసినప్పటికీ తిరుగుబాటనేది విప్లవంలాగా వ్యవస్థలో గుణాత్మకమైన పరిణామానికి దోహదం చేయదని పేర్కొన్నారు.

విప్లవానికి, తిరుగుబాటుకు కేవలం పరిధిలోనూ తీవ్రతలోనేకాక అవి తెచ్చే పరిణామాలలోనూ తేడాలుంటాయని చెప్పవచ్చు. తిరుగుబాటు కొద్దోగొప్పో సంస్కరణ తెచ్చేందుకు దోహదం చేస్తుందేతప్ప విప్లవంలాగా బృహత్తరమైన పరిణామం దాని పరిధిలో లేదు.

మిలీబాండ్ అన్నట్టు సంస్కరణోద్యమాల్లో హింస, తీవ్రవాద కార్యకలాపాలు సాధారణంగా ఉండనే ఉండవు. కానీ విప్లవంలో ఇవి తప్పనిసరిగా ఉండటం గమనించవచ్చు. విప్లవం ఉద్దేశాన్ని దెబ్బ తీసేందుకు పెట్టుబడిదారీ వర్గం ప్రయోగించే ఎత్తుగడే సంస్కరణోద్యమాలని మార్క్సిజం భావిస్తుంది.

విప్లవాలలోని ముఖ్యాంశం బృహత్తరమైన సామాజిక మార్పే అయినప్పటికీ ఈ మార్పు స్వభావ మేమిటో వివరించటం చాలా కష్టమైన విషయం. మధ్య యుగాంతంలో పోప్ అధికారాన్ని ధిక్కరించి ప్రొటెస్టెంట్ మతాన్ని స్థాపించిన మార్టిన్ లూథర్ ఉద్యమాన్ని మత విప్లవంగా భావించవచ్చు. అలాగే ఉత్పత్తి విధానంలో మహత్తరమైన మార్పులు తెచ్చి భూస్వామ్య వ్యవస్థనే పతనంగావించి పెట్టుబడి దారీ వ్యవస్థకు పునాదులు వేసిన పెనుమార్పును పారిశ్రామిక విప్లవం అనీ అంటున్నాం.

మధ్య యుగాంతంలో ఆధునిక యుగారంభంలో విప్లవాలుగా భావించబడుతున్న ఈ రెండు చారిత్రక సంఘటనలు సమాజ, ఆర్థిక సాంస్కృతిక జీవనంలోనూ, ప్రజల సాధారణ జీవన సరళిలోనూ విపరీతమైన మార్పులకు కారణమయ్యాయి. సామాజిక జీవన రంగాలన్నిటినీ ఈ సంఘటనలు తీవ్రమైన మార్పులకు గురిచేశాయి. కాబట్టి ఏ చారిత్రక సంఘటననైనా విప్లవంగా పేర్కొనేటప్పుడు అది ఏ మేరకు సామాజిక జీవనాన్ని ఎక్కువగా ప్రభావితం చేసిందో పరిశీలించటం అవసరం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొనే ఫ్రెంచి రచయిత మౌనియర్ విప్లవాన్ని ఈ విధంగా నిర్వచించాడు.

నా ఉద్దేశంలో విప్లవం అంటే
సమాజాన్ని పట్టి పీడిస్తూ, స్తబ్దతకు గురిచేసే
సకల రుగ్మతలను హరించే పెనుమార్పుల సమ్మేళనం.
సమాజం అంతరాంతరాల్లో దాగి అవకాశం వస్తే
ఎప్పుడైనా తిరిగి విజృంభించి సమాజాన్ని
మృత్యు ముఖంలోకి తోసే అన్ని రుగ్మతలను
గుప్తరోగాలను హరించే సంఘటనల సమూహారం
విప్లవం. అలాంటి పెను మార్పును వ్యతిరేకించే
శక్తులు ఎప్పుడూ ఉంటాయి. అందుకే విప్లవం
ఎల్లప్పుడూ విప్లవ ప్రతిఘాత శక్తులచేత
హింసాత్మకంగా ఎదుర్కొనబడి ప్రతిహింసకు
అనివార్యంగా దారి తీస్తుంది.

మౌనియర్ భావనలో ముఖ్యాంశాలేమిటంటే (a) సమాజానికి పట్టిన నిజమైన రుగ్మతలు వదిలించటం (b) ఇలాంటి చర్య అనివార్యంగా హింసాత్మకం కావటం. అనేక కారణాలవల్ల మౌలియర్ భావనను అంగీకరించేవారూ, వ్యతిరేకించేవారూ ఉండవచ్చు.

సామాజిక, ఆర్థికాంశాలను పక్కకునెట్టి బెర్ట్రాండ్ డి. జొవనల్ విప్లవాన్ని "అవశ్యంగా రాజకీయ చర్య" అని నిర్వచించారు. విప్లవంలో రాజకీయాంశం ముఖ్యమైనదనీ, చాలా నిర్వచనాలు దీన్ని అంతగా పట్టించుకోకుండా ఆర్థిక, సామాజికాంశాలకు ఎక్కువ ప్రాముఖ్యాన్నిచ్చాయనీ జొవనల్ పేర్కొన్నారు. మార్క్స్‌గాని, లెనిన్‌గాని ఇలాంటి పొరపాటు చేయలేదనీ వారు విప్లవాన్ని రాజకీయచర్యగానే భావించారని జొవనల్ అంటారు.

వీరేకాక విప్లవాన్ని చాలామందే నిర్వచించారు. పేటీ **ది ప్రోసెస్ ఆఫ్ రివల్యూషన్** అనే గ్రంథంలో "విప్లవం అంటే ఒక కాల్పనిక భావాన్ని (Myth) తొలగించి మరొక కాల్పనిక భావంతో జరిగే రాజ్యవ్యవస్థ పునర్నిర్మాణమే" అని నిర్వచించారు. హంటింగ్‌టన్ ఉద్దేశంలో "ఒక సమాజంలో ఆధిక్యతగల విలువలను, భావాలను వేగంగానూ, మౌలికంగానూ, హింసాత్మకంగానూ మార్చే ఆంతరంగిక చర్యే విప్లవం". సిగ్మండ్ న్యూమన్ "సమాజంలో ప్రబలంగా ఉన్నభావాలను (Myths) ఊడ్చి పారేసే మౌలికమైన మార్పే విప్లవం" అన్నారు. హన్నా ఆరెంట్ తన గ్రంథం **ఆన్ రివల్యూషన్** లో చరిత్ర ఆకస్మికంగా ఆరంభమవుతుందని, ఇంతవరకు ఎవరికీ తెలియని, ఎవరూ చెప్పని ఓ నూతన శకం

ఆరంభమవుతుందనే విశ్వాసంతో విప్లవం అవశ్యకంగా ముడిపడి ఉన్నదని భావించింది. ఫ్రాంజ్ ఫూమాన్ విప్లవాన్ని ఒక శకం నుంచి మరో నూతన శకానికి నాందిగా పేర్కొన్నారు. విల్‌బర్ట్ మూర్ విప్లవాలు సంభవించటంలోని పద్ధతులకు ప్రాధాన్యమిస్తూ అవి హింసాత్మకంగా ఉంటాయని చెప్పకోదగ్గ సంఖ్యలో ప్రజానీకం అందులో పాల్గొంటుందనీ, తత్ఫలితంగా ప్రభుత్వ వ్యవస్థా నిర్మితుల్లో మార్పులు సంభవిస్తాయనీ పేర్కొన్నారు. హెరాల్డ్ లాస్‌వెల్ విప్లవాన్ని "శిష్టవర్గ నిర్మితిలో వచ్చే మార్పేనని" పేర్కొన్నారు. జాన్‌డస్ కూడా విప్లవాన్ని దాదాపు ఇదే దృష్టితో పరిశీలించారు. ఆయన ఉద్దేశంలో విప్లవం "శిష్టపాలక వర్గం రాజకీయాధికారాన్ని చెలాయించటంలో విఫలం కావటంగా" భావించడమైంది.

పై నిర్వచనాల ఆధారంగా మనం విప్లవాల స్వభావాన్ని పరిశీలించవచ్చు. విప్లవాలు సాధారణంగా,

1. సామాజిక విలువలను, విశ్వాసాలను మార్చేందుకు సంభవిస్తాయి.
2. సామాజిక నిర్మితిని మార్చేందుకు జరుగుతాయి.
3. సంస్థలను మార్చేందుకు ఉద్దేశించినవి కావచ్చు.
4. శిష్టవర్గ నిర్మితిలోగానీ, పాలకవర్గ నిర్మితిలోగానీ, నాయకత్వంలో మార్పుకోసంగానీ రావచ్చు.
5. న్యాయబద్ధంగాగానీ, న్యాయేతర పద్ధతుల ద్వారా గానీ అధికార మార్పిడికోసం జరగవచ్చు.
6. రాజ్యాలుగానీ, ప్రభుత్వాలుగానీ విప్లవాల ద్వారా పతనమయ్యే క్రమం హింసాత్మకమవుతుంది.

విప్లవానికి సంబంధించిన మార్క్సిస్టు సిద్ధాంతం ఈ భావనలన్నిటికీ భిన్నంగా కనిపిస్తుంది. గతి తార్కిక భౌతిక చారిత్రక (Dilectical, Historical, Materialist) యదార్థాన్ని నియంత్రించే కొన్ని సహజ సూత్రాల ననుసరించి సమాజంలో అనివార్యంగా సంభవించే పెనుమార్పును విప్లవంగా మార్క్సిజం భావిస్తుంది. దీనిలో అనివార్యంగా సంభవించేది వర్గాధిపత్యంలో మార్పు. ఈ భావనా సంప్రదాయాన్ననుసరించి కొహెన్ విప్లవాన్ని ఇలా వర్ణించారు.

> నిర్ణీత కాలంలో ఒక వ్యవస్థ తీవ్రమైన
> మార్పులకు లోనుకావటమే విప్లవం.
> ఈ ప్రక్రియలో (a) పాలక వర్గ నిర్మితి
> మారుతుంది. (b) పాత రాజకీయ వ్యవస్థల
> స్థానంలో కొత్త వ్యవస్థలు ఏర్పడతాయి.
> (C) లేదా ఈ వ్యవస్థల పనితీరులో మార్పు
> సంభవిస్తుంది. (d) సామాజిక వర్గ నిర్మితి
> మార్పుకు లోనవుతుంది లేదా వనరులు,
> ఆస్తుల పునర్విభజన జరుగుతుంది.
> విప్లవ తీవ్రతను ఈ అంశాల తీవ్రతను
> బట్టి తెలుసుకోవడానికి వీలుంటుంది."

ఈ చర్యవల్ల విప్లవాల గురించి కొన్ని విషయాలు తెలుస్తాయి.

1. విప్లవం అనే చర్యవల్ల కేవలం రాజకీయాలేకాదు ఆర్థికంగా సామాజికంగా కూడా మార్పులు సంభవిస్తాయి. కేవలం రాజకీయ దృక్కోణం నుంచే విప్లవాన్ని పరిశీలిస్తే రాజ్యాధికారంలో మార్పుకు దారితీసినట్లు మాత్రమే కనిపిస్తుంది. ఒక అన్యాయమైన రాజకీయ వ్యవస్థ స్థానంలో విప్లవకారులకు దాన్ని వాంఛించిన వారికి అంగీకార యోగ్యమైన వ్యవస్థను ఏర్పరచటమే విప్లవం ధ్యేయం.

2. విప్లవాలు పెనుమార్పులకు దారి తీస్తాయి. ఇది సంస్కరణకు భిన్నం. మార్పు నెమ్మదిగా, అంచెలంచెలుగాకాదు, అకస్మాత్తుగా వస్తుంది. విప్లవం కేవలం తిరుగుబాటుకాదు.

3. పెను మార్పుల నాశించే విప్లవాలు రాజ్యాంగబద్ధమైన, అహింసాయుతమైన మార్గాల ననుసరించ వచ్చు లేదా హింసాత్మకమూ కావచ్చు. తద్వారా ఏర్పడే వ్యవస్థలు ఫాసిస్ట్ ఇటలీ, నాజీ జర్మనీ లాంటివి కావచ్చు లేదా రష్యాలో మాదిరి సోషలిస్టు వ్యవస్థలైనా కావచ్చు. ఫ్రాన్స్ అమెరికాలలో మాదిరి ప్రజాస్వామ్య వ్యవస్థలైనా కావచ్చు.

4. విప్లవం ద్వారా ఏర్పడ్డ వ్యవస్థలన్నీ నాశనం చేసేందుకు కూడా విప్లవాలు రావచ్చు. దీన్నే ప్రతీఘాత విప్లవమని (Counter Revolution) అధికారంలో ఉన్న వర్గం ఆక్షేపిస్తుంది. కమ్యూనిస్టు పార్టీలు, వారి రాజకీయ కార్యక్రమాన్ని విప్లవమనీ దాన్ని వ్యతిరేకించేవారిని విప్లవ ప్రతీఘాత శక్తులుగానూ పరిగణిస్తారు. 1927లో చైనాలో కమ్యూనిస్టు విప్లవాన్ని అణిచివేసిన చాంగ్ కై షేక్ పార్టీ కొమింగ్‌టాంగ్‌ను చైనా కమ్యూనిస్టుపార్టీ విప్లవ ప్రతీఘాతుకశక్తిగా వేర్కొంది.

విప్లవాన్ని రూఢిగా నిర్వచించటం కష్టమని ఈ చర్చ వల్ల మనం గమనించవచ్చు. ప్రపంచ చరిత్రలో ఇప్పటి వరకు సంభవించిన ఏ ఒక్క విప్లవంలోనూ ఈ విషయాలు ప్రస్ఫుటంగా గోచరించవు. అందుకే అన్ని కాలాలకు, అన్ని వ్యవస్థలకు సరిపడే నిష్పాక్షికమైన, అందరికీ అంగీకార యోగ్యమైన విప్లవ నిర్వచనాన్ని వేర్కొనటం కష్ట సాధ్యమని ఎల్లల్ వేర్కొన్నారు.

17.4 విప్లవాలు అధ్యయనం పద్ధతులు

విప్లవాలను అధ్యయనం చేసేందుకు వివిధ పద్ధతులు ప్రాచుర్యంలో ఉన్నాయి. ఏ పద్ధతి ననుసరించినా విప్లవాల అధ్యయనాన్ని అంతరశాస్త్ర అధ్యయన విషయంగా (inter- disciplinary) పరిగణించటం అవసరం. రాజనీతి శాస్త్రవేత్తలేకాక చరిత్రకారులు, సామాజిక శాస్త్రజ్ఞులు, ఆర్థిక శాస్త్రవేత్తలు, మానవీయ శాస్త్రవేత్తలు కూడా విప్లవాన్ని అధ్యయనం చేశారు కాబట్టి దాన్ని ఏదో ఒక దృక్కోణం నుంచి మాత్రమే పరిశీలించటం సరియైందికాదు.

విప్లవాలను తులనాత్మకంగా అధ్యయనం చేసే పద్ధతి అరిస్టాటిల్ కాలం నుంచి ప్రాచుర్యంలో ఉంది. ఐరోపా పునరుజ్జీవన కాలంలో మాకియవెల్లీ కూడా విప్లవాలను తులనాత్మక పద్ధతిలో అధ్యయనం చేశాడు. వీరే చారిత్రక పద్ధతిని కూడా అవలంబించారు. గత కాలంలో జరిగిన విప్లవాలను అధ్యయనం చేయటం వల్ల సమకాలీన పరిస్థితులను అర్థం చేసుకోవటం సులభమవుతుంది.

విభిన్నమైన విప్లవ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన మార్క్స్ చరిత్రను గతి తార్కికంగా అధ్యయనం చేసి విప్లవాలు చెలరేగటానికి అంతఃసూత్రంగా పనిచేసే శక్తుల విశ్వజనీనతను ప్రతిపాదించాడు. చారిత్రక పద్ధతి, తులనాత్మక పద్ధతి విప్లవాల గురించి చర్చించి తెలుసుకొనే మేధోప్రవృత్తిగానూ అనువైనవే. అధ్యయనంలో ఈ పద్ధతులను అనుసరించటం వల్ల విప్లవాలను గురించి సంకుచిత దృష్టిని, పాక్షిక దృష్టిని తొలగించుకొని నిష్పాక్షిక అధ్యయనానికి అవకాశమేర్పడుతుంది. అంతేకాక వివిధ దేశాల్లో వివిధ చారిత్రక దశల్లో సంభవించిన విప్లవాలను క్రమబద్ధంగా అధ్యయనం చేయటంవల్ల ఆయా విప్లవాలలోని సామ్యాసామ్యాలు తులనాత్మకంగా పరిశీలించి ఆమోదయోగ్యమైన సిద్ధాంతాలు ప్రతిపాదించే వీలుంటుంది. ఉదాహరణకు, జార్జ్‌రూడ్, ఆల్బర్ట్ సోబాల్ ఫ్రెంచి విప్లవంలో గుంపు (Crowd) ప్రవర్తన గురించి చేసిన అధ్యయనం చాలా మంది సామాజిక శాస్త్రజ్ఞులు అమెరికన్, యూరోపియన్, బోల్షివిక్కు విప్లవాల్లో గుంపు ప్రవర్తన గురించి పరిశీలించేందుకు మార్గదర్శకమయింది. అలాగే ఫ్రెంచి విప్లవంలో తత్వవేత్తలు, మేధావుల పాత్ర గురించి డేనియల్ మోర్నెట్ చేసిన అధ్యయనం ఎంతో మందిని అలాంటి అధ్యయనాలు చేపట్టేందుకు పురికొల్పింది. ఇంగ్లండ్, ఫ్రాన్స్, రష్యా, చైనా, మెక్సికో, క్యూబా, అల్జీరియా, వియత్నాం మొదలైన దేశాల్లో విప్లవాల్లో రైతాంగం పాత్రను చరిత్రకారులు ఈ మధ్య తులనాత్మకంగా అధ్యయనం చేస్తున్నారు.

ఏదో ఒక నమూనాను ఆధారంగా తీసుకొని విప్లవాల మంచి చెడులను పరిశీలించటం అనే లోపం తులనాత్మక పద్ధతిలో ఉన్నప్పటికీ విప్లవాల అధ్యయనానికి ఈ పద్ధతి చాలా ఉపయోగకరమైనదే. కేన్ బ్రిన్‌టన్ గ్రంథం **ది ఎనాటమీ ఆఫ్ రివల్యూషన్** లో ఈ లోపం ప్రముఖంగా కనిపిస్తుంది. కాప్లాన్ ఈ లోపాన్ని ఎత్తి చూపుతూ బ్రిన్‌టన్ భావాలను విమర్శించాడు కూడా. అయినప్పటికీ బ్రిన్‌టన్ పద్ధతి విప్లవాల అధ్యయనాన్ని సుగమం చేసింది.

చారిత్రక పద్ధతి ననుసరించి విప్లవాలను అధ్యయనం చేసిన హన్నా ఆరెంట్ యూరప్‌లో 1789 వరకు సంభవించిన విప్లవాలకు అటు తరవాత జరిగిన విప్లవాలకు ఉన్న స్వభావ స్వరూపాలను తులనాత్మకంగా పరిశీలించారు. తన అధ్యయనం ముగింపులో ఆమె విప్లవకారులెన్నడూ తాము విప్లవ వైతాళికుల మని భావించలేదనీ, వారి ఉద్దేశంలో విప్లవం గతంలో మంచిగా పనిచేసిన వ్యవస్థను నాశనంచేసి అధికారంలోకి వచ్చిన పాలకవర్గాలపై గతాన్ని పునర్వ్యవస్థీకరించేందుకు ఉద్దేశించిన చర్యేనని పేర్కొంది. మార్క్స్ కూడా తన 18వ బ్రుమైరీలో ఈ భావాన్నే వ్యక్తం చేశారు. విప్లవ కారుల చర్యల్లో గతంలోని సత్ సాంప్రదాయాలను పునర్వ్యవస్థీకరించాలనే తపనే 1789 పూర్వం సంభవించిన విప్లవాల్లో సామాజిక వ్యవస్థను సంపూర్ణంగా మార్చి భవిష్యత్తులో ఒక నూతన సమాజాన్ని ఆవిష్కరించాలన్న తపన విప్లవకారులను కార్యోన్ముఖులను చేసింది. విప్లవాలను చారిత్రక పద్ధతి ద్వారా అధ్యయనం చేయటంవల్ల వాటి స్వభావాన్ని, ధ్యేయాలను తులనాత్మకంగా అర్థం చేసుకొనే వీలుంటుంది.

ఈ రెండు దృక్పథాలేకాక మార్క్సిస్టు దృక్పథం, కార్యశీల సిద్ధాంత దృక్పథం (Functionalist View), మనస్తత్వ శాస్త్రదృక్పథం, భావ-ఉదారవాద దృక్పథాలు కూడా విప్లవాల క్రమబద్ధ అధ్యయనానికి దోహదపడతాయి. వీటిని గురించి తరవాత తెలుసుకొందాం.

17.5.0 విప్లవాలలో రకాలు, లక్షణాలు

విప్లవం అనేది శాంతియుతంగానో, హింసాత్మకంగానో సమాజంలో పెనుమార్పులు తెచ్చే సంఘటనగా భావించేట్టయితే అది రకరకాలుగా సంభవించే అవకాశం ఉందని గ్రహించవచ్చు. విప్లవాలలో రకాలేమిటో, వాటి లక్షణాలేమిటో పరిశీలిద్దాం.

విప్లవాలను ఐదురకాలుగా పేర్కొనవచ్చు. అవి (1) ఉదార విప్లవం (Liberal Revolution) (2) కమ్యూనిస్టు విప్లవం (3) అర్ధ విప్లవం (Quasi - Revolution) (4) పరిమిత, అపరిమిత విప్లవాలు (Limited and Unlimited Revoluton) (5) రూఢియైన విప్లవం (Revolution Proper.)

17.5.1 ఉదార విప్లవం

నియంతృత్వంపై ప్రజాస్వామ్య విజయం ఉదార విప్లవంలోని విశేషం. 1776 నాటి అమెరికా స్వాతంత్ర్య యుద్ధాన్ని, 1945 డచ్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ఇండోనేషియాలో సంభవించిన విప్లవాన్ని ఈ రకమైన విప్లవాలుగా పరిగణించవచ్చు.

17.5.2 కమ్యూనిస్టు విప్లవం

కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో అధికారాన్ని స్వాధీనం చేసుకొని కార్మికవర్గ నియంతృత్వాన్ని ఏర్పరచేందుకు సంభవించే విప్లవం కమ్యూనిస్టు విప్లవం. బూర్జువా వర్గాన్ని, నాశనంచేసి దాని స్థానంలో వర్గరహిత సమాజాన్ని స్థాపించటం దీని ధ్యేయం. రష్యా, చైనా, వియత్నాంలలో జరిగిన విప్లవాలు కమ్యూనిస్టు విప్లవాలే.

17.5.3 అర్ధవిప్లవం

ఈ తరహా విప్లవంలో ఎవరో ఒక ప్రముఖ నాయకుడు తన అధికారం ద్వారా ప్రజలపై ఎన్నో కొత్త విధానాలు ప్రవేశపెట్టి తద్వారా ప్రజలకంటే తనే ఎక్కువ లాభం పొందుతాడు. 1958 లో ఫ్రాన్స్‌లో జరిగిన రాజకీయ పరిణామం ఈ కోవకు చెందుతుంది. ఫ్రాన్స్ ప్రజలు ఛార్లెస్ డీ గాల్‌ను తప్పనిసరి పరిస్థితుల్లో అధికారాన్ని చేపట్టమని కోరారు. కాని డీగాల్ సంక్షోభంలో ఉన్న ఫ్రాన్స్‌ను రక్షించేందుకు ప్రజాసీకంపై ఎన్నో షరతులు విధించి అందుకు ప్రజలంగీకరిస్తేనే గాని అధికారం చేపట్టలేదు. అనకు సంక్రమించిన అధికారంతో పార్లమెంటరీ వ్యవస్థను రద్దుపరచి దాని స్థానంలో తనకు ఎన్నో అధికారాలు కల్పించుకొంటూ 'బోనపార్టీ ఇజం' పునాదిగా కొత్త రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చాడు. ఈ రాజ్యాంగం ప్రెంచి ప్రజల సంక్షేమం కంటే తన అధికారాన్ని విస్తృతపచ్చుకొనే క్రమంలో డీగాల్‌కే ఎక్కువగా తోడ్పడింది. అర్ధ విప్లవానికి ఇదొక ఉదాహరణ.

17.5.4 పరిమిత, అపరిమిత విప్లవాలు

పరిమిత విప్లవమంటే రాజకీయ వ్యవస్థలో ఏదో ఒక అంశాన్ని మాత్రమే సృజించే విప్లవం. పార్లమెంటరీ వ్యవస్థ నుంచి అధ్యక్ష పాలనకు (1972 లో పాకిస్థాన్) జరిగే మార్పును పరిమిత

విప్లవంగా భావించవచ్చు. అపరిమిత విప్లవం పరిధి విస్తృతమైనటువంటిది. అది కేవలం రాజకీయ పరమైన మార్పుకే కాకుండా ఆర్థిక, సామాజిక సాంస్కృతిక, నైతిక విద్యా విషయకమైన అంశాలలో కూడా విస్తృతమైన మార్పును కాంక్షిస్తుంది. జయప్రకాశ్ నారాయణ్ 'సంపూర్ణ విప్లవం' ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. యూగెన్ రోజన్ స్టాక్ ప్రోస్సే వర్ణించినట్లు అపరిమిత విప్లవం నిజానికి చారిత్రక మహాప్రస్థానం (a part of March of history) లో భాగమే.

17.5.5 రూఢియైన విప్లవం

విప్లవాలు పరిపూర్ణమైనవి కావచ్చు లేదా కేవలం ఉప విప్లవాలుగా కూడా సంభవించవచ్చు. సంభవించిన సంఘటన పరిపూర్తియైనా కావచ్చు లేదా అసంపూర్తిగా మిగిలిపోవచ్చు. విప్లవం శక్తిమంతమైన ఊపుతో సంభవించవచ్చు. కాని పూర్తి విజయాన్ని పొందక విఫలమౌతుంది. అయినప్పటికీ సంఘటన జాడలను మనం పసిగట్టవచ్చు. అలాంటి విప్లవాలనే అసంపూర్ణ విప్లవాలు అనీ లేదా ఉపవిప్లవాలనీ అనవచ్చు. 1905 లో రష్యాలో సంభవించిన విప్లవం ఇందుకు మంచి ఉదాహరణ. లెనిన్ స్విట్జర్లాండ్‌కు పారిపోయాడు. అయినప్పటికీ విప్లవ ప్రభావంవల్ల జార్ చక్రవర్తి కొన్ని రాజ్యాంగ సంస్కరణలు ప్రవేశపెట్టక తప్పలేదు. దీనికి భిన్నమైనదే పరిపూర్ణ విప్లవం లేదా రూఢియైన విప్లవం. 1917 అక్టోబరర్ విప్లవం ఇందుకు ఉదాహరణ. ఈ విప్లవంలో లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్కులు అధికారాన్ని హస్తగతం చేసుకొన్నారు. ఉప విప్లవాన్ని పరిపూర్ణ విప్లవానికి నాందిగా పేర్కొనవచ్చు.

విప్లవాలు ఎన్నిరకాలుగా సంభవించినప్పటికీ మనం గమనించవలసిన విషయం ఒకటుంది అదేమిటంటే విప్లవాలలో గల ధన రుణాంశం గల విప్లవం ఎల్లప్పుడూ రాజకీయ విలువల పతనానికి దోహదం చేస్తుంది. పతనాన్ని అభివృద్ధిగా భ్రమింపచేస్తుంది. ఫాసిజం, నాజీజం ఆవిర్భావం ఇందుకు ఉదాహరణలు. 1933 లో హిట్లర్‌ను జర్మన్‌లు తమ జాతి రక్షకుడుగా నిలబెట్టి ఉదార ప్రజాస్వామ్య విలువల నాశనానికి కారణమయ్యారు. ధనాంశంగల విప్లవాలు అప్పటికి అమల్లో ఉన్న వ్యవస్థ కన్నా మంచి వ్యవస్థ ఆవిర్భావాన్ని కాంక్షిస్తాయి. మంచి విప్లవాలేవో, చెడ్డ విప్లవాలేవో గుర్తించటం సాధ్యమేనని ఈ చర్చ మనకు తెలుస్తుంది.

17.5.6 విప్లవాల లక్షణాలు

1. విప్లవం ఒక 'సామాజిక ప్రక్రియ' (Social Process). ఈ ప్రక్రియలో అమల్లో ఉన్న రాజ్యవ్యవస్థ ప్రజల దృష్టిలో న్యాయబద్ధతను కోల్పోయి విప్లవాలకు దారి తీస్తుంది. ఇది శాంతియుతంగా జరగవచ్చు.

2. విప్లవం అంటే మార్పు. సాయుధంగా ప్రభుత్వ వ్యవస్థను మార్చే ప్రయత్నం లేదా సాయుధ శక్తిని చూపి భయపెట్టి కూడా ప్రభుత్వాన్ని మార్చే ప్రయత్నం చేయవచ్చు.

3. విప్లవం అంటే మార్పు నాశించే ఒక నిర్దిష్టమైన కార్యాచరణ. తదనుగుణంగా రాజకీయ, సామాజిక వ్యవస్థల్లో సంభవించే అధికార మార్పిడి.

4. విప్లవ కారులు సృష్టించుకొనే ఊహాలోక భావం ద్వారా సంభవించే ప్రగతిశీల సామాజిక పరిణామం. తద్వారా చాలా మందికి ఆమోదయోగ్యమై అతికొద్దికాలం మాత్రమే మనగలిగిన రాజకీయ వ్యవస్థ ఏర్పాటు.

విప్లవ మంటే కేవలం ఒక సంఘటనకాదు. అది ఎన్నో సంఘటనల సమాహారం. అమలులో ఉన్న ప్రభుత్వాలను పడగొట్టటమే దాని ధ్యేయం కాదు. అటు తరవాత నూతన వ్యవస్థా నిర్మాణం కూడా విప్లవంలో విడదీయరాని భాగమే. అప్పటికి అమలులో ఉన్న వ్యవస్థపై సవాలుగా పరిణమించటమే విప్లవం సంభవించటానికి నాంది. నూతన వ్యవస్థ నిర్మాణం పూర్తయ్యే వరకూ అది కొనసాగుతుంది. నిజానికి విప్లవమంటే ఈ రెండు దశలమధ్య జరిగే సామాజిక ప్రక్రియే. ఈ ప్రక్రియలో వివధ దశలుంటాయి. ఈ దశలను కార్ల్ జె. ఫ్రెడరిక్ ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు.

1. ప్రజల్లో పాత ఆశయాలు, విశ్వాసాలస్థానంలో ఎన్నో కొత్త కొత్త ఆశలూ, ఆశయాలు మొల కెత్తుతాయి. విప్లవ నాయకత్వం వాటిని ఆదర్శవంతమైన, పరిపూర్ణమైన సామాజిక వ్యవస్థకు పునాదిగా మలిచే ప్రయత్నం చేస్తుంది. ఇది విప్లవానికి మొదటి దశ.

2. విప్లవ చర్య ద్వారా అధికారం హస్తగత మవుతుంది. విప్లవ ప్రభుత్వం ఎన్నో సామాజిక సమ స్యలను పరిష్కరించవలసి ఉంటుంది. నాయకత్వంలో బేధాభిప్రాయాలు ఏర్పడి అతివాదులు, మితవాదులుగా విడిపోతారు. సాధారణంగా అతివాదాలదే పైచేయి అవుతుంది. అతివాదులు అధికారాన్ని హస్తగతం చేసుకొని ప్రతిపక్ష ప్రజానీకాన్ని ఉగ్రవాద పద్ధతులద్వారా హింసాత్మకంగా అణిచివేసేందుకు ప్రయత్నిస్తారు.

3. విప్లవ ఆశయాలను ఏ విధంగానైనానరే పరిపూర్తి చేసేందుకు విఫల ప్రయత్నం జరుగుతుంది. ఈ దశలో విప్లవ వ్యవస్థ ఎన్నో ప్రతిఘటనలను ఎదుర్కొవలసి వస్తుంది. అందువల్ల సమాజం ఎన్నో ఒత్తిడులకు లోనవుతుంది.

4. ఈ దశలో స్తబ్దత ఏర్పడి ఎవరో ఒకరు నియంతగా ఆవిర్భవించి విప్లవ భావాలను అమలు పరచడానికి ప్రయత్నిస్తాడు. ఇప్పటి వరకూ విప్లవంలో భాగస్వాములైన ఎందరో వైదొలగి పోవటం కాని లేదా రాజకీయ ప్రాముఖ్యాన్ని కోల్పోటంగానీ, లేదా చంపబడటం గానీ జరగవచ్చు. మిరాబూ, డాంటన్, మరా, ఇంకా నెపోలియన్ కాలంలో ఫ్రాన్స్‌లో డైరక్టరీ ఏర్పాటు ఇందుకు ఉదాహరణలు.

5. చివరి దశలో విప్లవం పూర్తిగా తన విప్లవ గుణాలు కోల్పోయి నియంతృత్వంగా తన అసలు గుణాలతో బయట కొస్తుంది. ఈ దశలోనే గతించిన వ్యవస్థ నూతన వ్యవస్థల మధ్య కొంతమేరకు రాజీ కుదురుతుంది. అందుకే విప్లవం అంటే గతాన్ని పూర్తిగా విస్మరించటం కాదని అన్నాడు సుకర్నో.

విప్లవాల పట్ల వివిధ భావనా సంప్రదాయాల వైఖరిని ఇప్పుడు పరిశీలిద్దాం.

17.6.0 విప్లవం : వివిధ దృక్పథాలు

ఇప్పటి వరకూ మనం జరిపిన చర్చ వల్ల బోధపడే విషయమేమిటంటే విప్లవాలు అరిస్టాటిల్ భావించినట్లు ప్రభుత్వాల మార్పిడి మొదలుకొని ట్రాట్స్కీ అన్నట్లు 'చరిత్ర సృష్టించే ఒక పిచ్చి ప్రేరణ' దాకా ఎన్నో రకాలుగా సంభవిస్తాయి. దీని కారణంగానే విప్లవాల అర్థాన్ని, స్వభావాన్ని అవి సంభవించటానికి గల కారణాలను వెదకటానికి ఎన్నో సిద్ధాంతాలు ప్రయత్నించాయి. విప్లవాల పట్ల ఆయాదృక్పథాల వైఖరులను ఇప్పుడు పరిశీలిద్దాం.

17.6.1 ఉదారవాద దృక్పథం

గ్రీకుల కాలం నుంచీ 16వ శతాబ్దం వరకూ జరిగిన విప్లవాల అధ్యయనం వల్ల సామాజిక వ్యవస్థలో మార్పుల నాశించటంతో పాటు విప్లవం సంభవించే నాటికి అమలులో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల పరిరక్షణ కూడా విప్లవాల ధ్యేయంగా కనిపిస్తున్నదని ఉదారవాదం భావిస్తుంది. ఒక్కోసారి గతించిన వ్యవస్థలను పునరుజ్జీవింపచేయటం కోసం కూడా విప్లవాలు సంభవించాయని కొందరు ఉదారవాదులు భావిస్తారు. అందుకే ఉదారవాద దృక్పథాన్ని మార్పుకు వ్యతిరేకియన్న విమర్శలున్నాయి. అరిస్టాటిల్ ప్రతిపాదించిన విప్లవాల సిద్ధాంతం ఇలాంటిదే. విప్లవాన్ని ఆయన రాజద్రోహంగా కూడా పరిగణించారు. అందుకే ఆయన విప్లవాలను నివారించే ఉపాయాలను కూడా పేర్కొన్నారు. తూసిడిడిస్ తన గ్రంథం **హిస్టరీ ఆఫ్ ది పెలిపానీసియన్ వార్** లో విప్లవాల మూలంగా నగరాలన్నీ ఎన్నో భయంకరమైన ఇబ్బందులకు గురయ్యారు అని పేర్కొన్నారు. ఉదారవాదులకు విప్లవాల సుగుణాలను గురించి ఎన్నో అనుమానాలు ఉన్నాయి. ప్రజలలో ఐకమత్య లోపమే విప్లవాలకు కారణమని ఉదారవాదులు భావిస్తారు. మాకియవెల్లీ, జాన్ లాక్, జాన్ మిల్టన్ ప్రజాస్వామ్య వ్యవస్థాపనకు విప్లవాలను సమర్థించారు. మానవునికి సహజ హక్కులున్నాయని, వాటిని రక్షించుకునేందుకు విప్లవమొక సాధనమని వీరు భావించినా నిజానికి ఈ హక్కులు ఆస్తిపరవర్గాలకు ఉపయోగపడేవే. భూస్వామ్యవర్గాల పెత్తందారీతనాన్ని రూపుమాపటం వీరూ, వీరు సమర్థించిన 1688 నాటి రక్తరహిత విప్లవం, 1789 నాటి ఫ్రెంచి విప్లవం యొక్క ధ్యేయమే అయినా పాత వ్యవస్థస్థానే ఆస్తిపరవర్గాలకే ఉపయోగపడే సహజ హక్కులనే ఈ విప్లవాలు సమర్థించినట్లయింది. క్రేన్ బ్రింటన్ అనే హార్వర్డ్ యూనివర్సిటీ చరిత్రకారుడు తన గ్రంథం **'ది ఎనాటమీ ఆఫ్ రివల్యూషన్'** లో 1688 నాటి రక్త రహిత విప్లవాన్ని, 1776 అమెరికా స్వాతంత్ర్య యుద్ధాన్ని, 1789 ఫ్రెంచి విప్లవాన్ని, 1917 రష్యన్ విప్లవాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేసి కొన్ని సూత్రాలను ప్రతిపాదించాడు. ఆయన ఉద్దేశంలో విప్లవం జరిగినప్పుడు ప్రజలు దాన్ని రకరకాల దృష్టితో చూస్తారు. కొందరు భయపడతారు, అసహ్యించుకుంటారు. మరికొందరు దాన్ని తమకు ఉజ్జ్వల భవిష్యత్తును ప్రసాదించగల సంఘటనగా పరిగణిస్తారు. రాబోయే మంచి రోజులకు నాందిగా మరికొందరు భావిస్తారు. సామాజిక ప్రగతిలో అనివార్యంగా సంభవించే విషయంగా కొందరు భావిస్తారు. కొందరు దాన్ని స్వేచ్ఛా, స్వాతంత్ర్య సౌభ్రాతృత్వాలకు మారుపేరుగా భావిస్తే ఇంకా కొందరు దాన్ని అధికారానికి, క్రమశిక్షణకు, శక్తి రాజకీయాలకు ప్రతీకగా పరిగణిస్తారు.

కానీ నిజానికి విప్లవంలో అనివార్యంగా సంభవించేదేమిటంటే ప్రత్యేకరాయితీలు, హక్కులు అనుభవిస్తున్న మైనారిటీ వర్గంపై మెజారిటీ వర్గం చేసే తిరుగుబాటు. తద్వారా అనివార్యంగా సంభవించే మెజారిటీ విజయం. అది ఏ వర్గానికి చెందిన ప్రజానీకమైనా సరే ఉదాసీనత వహించటానికి వీలు లేని పరిస్థితి.

ఏ విప్లవానికైనా కారణం సామాజిక, ఆర్థిక అసమానతలే. ప్రతి సమాజంలోనూ ఈ అసమానతలుంటాయి. కాబట్టి విప్లవాలు ఎక్కడైనా ఎప్పుడైనా సంభవించవచ్చు. ఉదారవాదం దృష్టిలో విప్లవాలు రావటానికి కారణాలు సాధారణంగా ప్రభుత్వాల్లో ఆర్థికలోట్లు, అధిక పన్నుల భారం, కొన్ని వర్గాలకే ఎక్కువ లాభం చేకూరటం, పాలనా సంబంధమైన సమస్యలు, మేధావులను దూరం చేసుకోవటం, పాలకవర్గం సభ్యుల్లో చాలా మందిలో కనిపించే విశ్వాసరాహిత్యం, అర్హతకు తగ్గ ఉద్యోగాలు కల్పించకపోవటం, సామాజిక తారతమ్యాలు మొదలైనవి. ఆధునిక సమాజాలన్నిటిలో కొద్ది గొప్ప తేడాలతో ఇవన్నీ ఉన్నాయని బ్రిన్‌టన్ పేర్కొన్నారు.

ఉదారవాద దృక్పథం ప్రకారం విప్లవాలు స్వచ్ఛందంగా (Spontanious) గానీ లేదా ఒక ప్లాను ప్రకారంగాగానీ సంభవించవచ్చు విప్లవాలకు ఆలవాలం క్రూరత్వం, లంచగొండితనమూను. బలప్రయోగానికి విప్లవంలో నిర్ణయాత్మకమైన స్థానముంది. విప్లవకారులు ప్రయోగించే బలం తక్కువదైతే విప్లవం అణచివేయబడుతుంది. అలా కానట్లైతే విప్లవం జయిస్తుంది. అప్పటి వరకూ విప్లవాన్ని చూసి భయపడ్డవాళ్ళూ, అసహ్యించుకొన్నవాళ్ళు కూడా దాన్ని ఆహ్వానిస్తారు. వీళ్ళు సాధారణంగా మేధావులు, వ్యాపారస్తులు, కవులు, కళాకారులూ వృత్తి ఉద్యోగులు, గౌరవనీయ వర్గాలకు చెందినవారై ఉంటారు.

విప్లవంలో ఎంతో మంది పాల్గొన్నా దాన్ని నడపించే వాళ్ళు కొందరే ఉంటారు. ఫ్రాన్స్‌లో జాకొబైన్లు, రష్యాలో బోల్షివిక్కులు, చైనాలో ఎర్రసైన్యం, ఇంగ్లండ్‌లో ఆలివర్ క్రాంవెల్, అమెరికాలో వాషింగ్‌టన్ లాంటివాళ్ళే. చివరకు విప్లవంలో ఎందరుంటారో ఎందరు జారిపోతారోననే అనుమానాలే. కొత్తవాళ్ళు కొత్త కొత్త ఆశలతో చేరనూవచ్చు. అన్ని విప్లవాల్లో అనివార్యంగా సంభవించేది ఏదో ఒక రూపంలో నియంతృత్వ ప్రభుత్వ స్థాపన, అధికార కేంద్రీకరణ. విప్లవం విజయవంతం కావటంతో కొట్టొచ్చి నట్టుగా జరిగే మార్పు పాత విలువలు, పాత వ్యవస్థలూ కొట్టుకోపోయి వాటి స్థానంలో నూతన విలువలు, నూతన వ్యవస్థలు స్థాపించబడటం, ఒక నూతన శకం ఆవిర్భవించటం. ఈ విషయాలన్నింటినీ కూలంకషంగా చర్చించిన బ్రిన్‌టన్ విప్లవాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయవచ్చని నిరూపించారు. విప్లవాలను శాస్త్రీయంగా, నిష్పక్షపాతంగా అధ్యయనం చేయటం ఉదారవాదం లక్ష్యమూ, లక్షణమూనూ. కాని ఉదార వాదులు న్యాయబద్ధంగా ఏర్పడ్డ ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఫాసిస్టు పద్ధతుల ద్వారా పడగొట్టటాన్నే విప్లవమని భావిస్తారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే అలా భావించి మాత్రమే విప్లవాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయవచ్చని వీరు విశ్లేషించడమే.

17.6.2 మార్క్సిస్టు దృక్పథం

తన థీసెస్ ఆఫ్యూయర్‌బా అనే గ్రంధంలో "ఇంతవరకూ తత్వవేత్తలు ప్రపంచం గురించి వ్యాఖ్యానించారు, సమస్య ఏమిటంటే దాన్ని మార్చటం ఎలాగనేది" అని పేర్కొన్న మార్క్స్ విప్లవాన్ని

ఒక కొత్త పద్ధతిలో వ్యాఖ్యానించారు. 1883 మార్చి 17 న ఆయన సమాధి ప్రక్కన నిలబడి పొగుడుతూ ఎంగెల్స్ అన్నిటికన్నా ముఖ్యంగా మార్క్స్ విప్లవ కారుడనీ, పెట్టుబడిదారీ వ్యవస్థను, రాజ్యవ్యవస్థనూ ఏ విధంగా నైనా సరే పడగొట్టి కార్మిక వర్గాన్ని విముక్తి చేయడమే ఆయన ధ్యేయంగా బ్రతికారని పేర్కొన్నారు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి సామాజిక సంబంధాలు సంకెళ్ళుగా తయారవటమే సామాజిక విప్లవానికి నాంది అని మార్క్స్ పేర్కొన్నారు. ఆయనే అన్నట్లు ప్రతి రాజకీయ విప్లవమూ సామాజిక వర్గాల మధ్య సంఘర్షణకు మూలమైన సామాజిక విప్లవమే. విప్లవం అంటే సామాజిక సంబంధాలలో మార్పును తీసుకురాగలిగిన ఉత్పత్తి శక్తుల అభివృద్ధే. బానిస సామాజిక ఉత్పత్తి విధానాన్ని తొలగించి ఏర్పడిన భూస్వామ్య సామాజిక ఉత్పత్తి విధానం ఆయన ఉద్దేశంలో విప్లవమే. అలాగే భూస్వామ్య వ్యవస్థను భూస్థాపితంచేసి పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావానికి కారణమైన బూర్జువా విప్లవాన్ని ఆయన కీర్తించారు. కానీ అలా ఆవిర్భవించిన పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయటం అనివార్యం. దీన్నే మార్క్స్ సోషలిస్టు విప్లవం అన్నారు. మార్క్స్ ఉద్దేశంలో సమసమాజ ఆవిర్భావం కేవలం ఆదర్శమే కాదు. అది పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందే క్రమంలో అని వార్యంగా సంభవించే సామాజిక మార్పు. శ్రమకు, పెట్టుబడికి ఏర్పడిన వైరుధ్యం మానవ చరిత్రలో శ్రమజీవులు అనుభవించిన నికృష్టమైన దాని స్వరూపాలలో చివరిదనీ ఈ వైరుధ్యాన్ని తొలగించటమే సామ్యవాద విప్లవమనీ, ఇది ఏలాంటి పోరాటరూపాన్నైనా తీసుకోవనీ ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో ఏదో ఒక చోట ఏదో ఒక రూపంలో, ఏదో ఒక మోతాదులో హింస అనివార్యమౌతుంది.

రాజ్యాధికారాన్ని కార్మికవర్గం హస్తగతం చేసుకొని ఉత్పత్తి సాధనాలపై శ్రమజీవుల ఆధిపత్యాన్ని నెలకొల్పటమే సామ్యవాద విప్లవం. అంతేకాదు. విప్లవ ప్రతిఘాతుక శక్తులను అణిచివేయవలసిన పనికూడా ఉంది. దానితో పాటుగా ప్రజల ఆశలూ, ఆశయాలూ, విశ్వాసాలూ, భావాలు, సంప్రదాయాలు అన్నీ కూడా సమసమాజ నిర్మాణపు అవసరాన్ని తీర్చే విధంగా మార్చాలి. మావో ప్రతిపాదించిన సాంస్కృతిక విప్లవం దీనికోసం ఉద్దేశించిందే.

దోపిడీ, పీడనాలేని వర్గరహిత సమాజం ఒక కొత్త సామాజిక వ్యవస్థగా రూపుతీసుకొంటుంది. దోపిడీకి, పీడనకు ప్రతిరూపమైన రాజ్యవ్యవస్థ అంతరించి పోతుంది. మార్క్సిస్టుల దృష్టిలో విప్లవం ఇంతటితో ఆగేదికాదు. అదొక శాశ్వత ప్రక్రియ. పూర్తిగా వర్గరహిత సమాజం ఏర్పడే వరకూ అది కొనసాగుతుంది. ఈ శాశ్వత ప్రక్రియలో భాగమే 'సామ్యవాద అంతర్జాతీయవాదం' **కమ్యూనిస్ట్ మానిఫెస్టో** లో "ప్రపంచ కార్మికులంతా ఏకం కండి మీకు పోయేందుకు ఏమీ లేదు సంకెళ్ళు తప్ప, గెలిచేందుకు ప్రపంచమే మీముందుంది". సంకెళ్ళు తప్ప, గెలిచేందుకు ప్రపంచమే మీముందుంది. అనే వాక్యాల్లో ఈ అంతర్జాతీయ భావం ఇమిడి ఉంది. శాశ్వత విప్లవం అనే మార్క్సిస్టు భావనకు ట్రాట్స్కీ విస్తృతమైన సైద్ధాంతిక వివరణ చేశారు. దీనికి మూలం ప్రపంచ ప్రజలంతా దోపిడీ పీడనా లేని వర్గరహిత సమాజం ఏర్పడేవరకు సామ్యవాద విప్లవం కొనసాగుతూనే ఉంటుందనే మార్క్స్, ఎంగెల్స్‌ల భావనే. ఇందుకు విప్లవాన్ని దేశ దేశాలకు 'ఎగుమతి' చేయవలసి రావచ్చు కూడా.

లెనిన్ తన 'స్టేట్ అండ్ రివల్యూషన్' అనే గ్రంథంలో విప్లవాన్ని సిద్ధాంతీకరిస్తూ దాని ముఖ్య లక్షణాలను కింది విధంగా పేర్కొన్నారు.

1. విప్లవాన్ని కొనసాగించగల స్థిరమైన నాయకత్వం లేకుండా ఏ విప్లవమూ ఎక్కువ కాలం మనజాలదు.

2. ఉద్యమానికి ఆధారమైన అశేష ప్రజానీకం తమంతట తామే పోరాటంలో పాల్గొనే క్రమంలో అలాంటి నాయకత్వం అవసరం ఎంతో ఉంది.

3. అలాంటి వ్యవస్థ వృత్తి విప్లవకారులలో నిర్మించబడాలి. విప్లవ కార్యక్రమంలో వారు సుశిక్షితులై ఉండాలి.

4. నిరంకుశ రాజవ్యవస్థ గల సమాజాల్లో అలాంటి వ్యవస్థ సాధ్యమైనంత తక్కువ మంది వృత్తి విప్లవకారులతో కూడి ఉండాలి. అలాంటి వ్యవస్థను పట్టుకోవటం రాజ్యానికి కష్టమవుతుంది.

5. కేవలం కార్మిక వర్గం నుంచే కాకుండా ఇతర వర్గాల ప్రజానీకం కూడా విప్లవోద్యమంలో పాల్గొనేట్లు చేయాలి.

సరియైన విప్లవపార్టీ, దాన్ని నడిపించే సరైన నాయకత్వం ఉంటే విప్లవం ఏ దేశంలోనైనా సాధ్యమేనని లెనిన్ అభిప్రాయపడ్డారు. అలాంటి విప్లవంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రగామిత్వం తప్పనిసరి. అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాలలో మాత్రమే సోషలిస్టు ఉద్యమం సాధ్యమవుతుందనే మార్క్స్ భావనను మార్చి, విప్లవపార్టీ ఉంటే విప్లవం ఏ దేశంలో నైనా సాధ్యమేనని ప్రతిపాదించటమే కాకుండా లెనిన్ దాన్ని రష్యాలో సాధించారు కూడా. ఈ సిద్ధాంతాన్ని అభివృద్ధి పరుస్తూ చైనాలో మావో విభిన్న పరిస్థితుల్లో విప్లవాన్ని సాధించారు. ఆయన ప్రతిపాదించిన విప్లవ సిద్ధాంతంలోని ముఖ్యాంశాలివి.

1. మార్క్సిజం : లెనినిజాన్ని స్థానిక పరిస్థితు కన్వయించుకొని చైనాలాంటి వెనుకబడిన దేశాల్లో కూడా విప్లవాన్ని సాధించవచ్చు. వలస పాలనను వ్యతిరేకంగా పోరాడుతున్న విప్లవకారులతో అశేష రైతాంగం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఐక్య సంఘటనగా ఏర్పడితే భూస్వామ్య వ్యవస్థలో కూడా సామ్యవాద విప్లవం సాధ్యమే. కార్మిక వర్గం ఇంకా సరిగా అవతరించని సమాజాల్లో అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ ఇంకా వేళ్ళూనని సమాజాల్లో కూడా సామ్యవాద విప్లవం సాధ్యమేనని దీనర్థం.

2. అభివృద్ధికి నోచుకోని మూడో ప్రపంచ వ్యవసాయిక సమాజాల్లో రైతాంగమే విప్లవకరమైన పాత్రను నిర్వహిస్తుంది. పెట్టీ బూర్జువా వర్గాలు కూడా దీనిలో చేరతాయి. విప్లవానికి కీలక ప్రాంతం గ్రామీణ ప్రాంతమవుతుంది. ఆ విధంగా విప్లవం ప్రథమంగా భూస్వామ్య వ్యతిరేక పోరాటమూ, అటు తరవాత బూర్జువా వ్యతిరేక పోరాటమూ అవుతుంది. విప్లవం గ్రామీణ ప్రాంతాల్లో ఆరంభమై పట్టణాలను చుట్టుముడుతుంది.

3. విప్లవం అనివార్యంగా హింసాత్మకమవుతుంది. అన్ని హింసాత్మక పద్ధతులతోపాటు గెరిల్లా యుద్ధ పంథాను కూడా విప్లవకారులు అవలంబిస్తారు.

4. విప్లవం ప్రజాయుద్ధ పంథాననుసరిస్తుంది. దీనర్థం నిరంతర విప్లవమే. సోషలిస్టు విప్లవానంతరం కూడా విప్లవాన్ని నిరంతరమూ కొనసాగించవలసి ఉంటుంది.

మార్క్సిస్టు విప్లవ సిద్ధాంతసారం దోపిడీ వర్గాన్ని మట్టుపెట్టి మొట్టమొదట కార్మిక వర్గం నియంతృత్వాన్ని తరవాత వర్గ రహిత లేదా రాజ్యరహిత సమాజాన్ని ఆవిష్కరించటమే. అన్ని రకాల దోపిడీల నుంచి పీడననుంచీ మనిషిని విముక్తుణ్ణి చేయటమే. పెట్టుబడి దారీ సామాజిక వ్యవస్థ స్థానంలో ఒక నూతన సమసమాజాన్ని ఆవిష్కరించటమే.

సోషలిస్టు విప్లవాలు సంభవించిన దేశాల్లో ఏర్పడ్డ కార్మిక వర్గ నియంతృత్వాలు నిరంకుశ పద్ధతులను అనుసరించిన దృష్ట్యా సోషలిస్టు ప్రపంచంలో సంభవించిన కొన్ని విపరీత పరిణామాలు మార్క్సిస్టు విప్లవ సిద్ధాంతాన్ని విమర్శించటానికి దోహదం చేస్తున్నాయి.

17.5.3 నిర్మితి - విధుల సిద్ధాంత దృక్పథం

నిర్మితి - విధుల సిద్ధాంత భావనలు (Structural - Functonalism) టాల్‌కాట్ పార్సన్స్ రచనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. మార్క్సిస్టు భావాలపై విమర్శగానే కాకుండా నిర్మితి విధుల సిద్ధాంతాన్ని ఒక విభిన్నమైన సామాజిక సిద్ధాంతంగా మలచిన ఘనత టాల్‌కాట్ పార్సన్స్ కుంది. మార్క్సిస్టు భావనలో సమాజం వర్గ సమాజం. ఒక వర్గం మరొక వర్గంపై ఆధిపత్యం చెలాయిస్తూ దోపిడీకి పీడనకు గురిచేస్తుంది. విప్లవాలకు కారణం ఇదే.

కాని వర్గవైరుధ్యాలకు కారణం దోపిడీ, పీడనా కాదనీ, జనజీవనానికి అవసరమైన వస్తువుల కొరత (Scarcity) వల్ల వాటి పంపిణీలో పోటీ ఏర్పడుతుందని, అలాంటి పోటీయే విప్లవాలకు దారి తీస్తుందని పార్సన్స్ సిద్ధాంతీకరించారు. ఈ సంఘర్షణలను పరిష్కరించేందుకు సమాజమే కొన్ని విలువలతో కూడిన పరిష్కారాన్ని ప్రతిపాదిస్తుందనీ ఆయన పేర్కొన్నారు. సమాజంలో మనకు కనిపించే ఏ విలువలు (values), ప్రమాణాలు (Norms), సమూహాలు (Collectivities) నిర్వహించే పాత్రలు (roles) సంఘర్షణల పరిష్కారాలకు సంబంధించినవేనని అంటారాయన. ఒక వ్యక్తి జీవనానికి అభివృద్ధికి వివిధ జీవన క్రమానుగత శ్రేణుల్లో అంగీకరయోగ్యమైన వాంఛల పరిపూర్తికి, సామాజిక, సాంస్కృతిక సహజీవన భద్రతకు ఇతర వ్యక్తుల, సమూహాల అవసరాలను గౌరవించటం, తద్వారా మొత్తం సమాజం భద్రతను పరిరక్షించటం కోసం ఏర్పడినవే విలువలు అని పార్సన్స్ అంటారు. ఒక మానవ సముదాయం (Community) ప్రత్యేకంగా ఏర్పరచుకొన్న నిబంధనలే ప్రమాణాలు. ఇవి సాధారణంగా ఆయా వ్యవస్థలు ఆచరించే న్యాయసూత్రాలలో పొందుపరచబడి ఉంటాయి. మానవ సముదాయంలో సంఘీభావం (Solidarity) కనిపిస్తుంది. దీనికి కారణం ఆ సముదాయంలో అందరూ అనుసరించే విలువలు వ్యవస్థీకృతమై అందరిలోనూ ప్రతిఫలిస్తూ ఉంటాయి. ఇదే ఆ సమాజపు రాజకీయ రూపం. ఒక సమాజంలో అందరూ అనుసరించే ప్రమాణాల్లో సంఘీభావం కనిపించటమే ఆ సమాజపు రాజకీయ వ్యవస్థకు పునాది. పాత్ర అంటే ఒక సమాజంలోని వ్యక్తుల ఐచ్ఛిక కార్యాల ఎంపిక; ప్రమాణాలననుసరించి స్పష్టపర్చబడిన వారి హక్కులు, విధులు, విధేయతలు, లబ్ధులు (Sanctions) అవకాశాలు.

పార్సన్స్ ఉద్దేశంలో పైన పేర్కొన్న వాటిలో దేనినైనా మార్చేందుకు విప్లవం రావచ్చు. వర్గ ఆధిపత్యంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక పార్శ్వాలను మార్చేందుకు లేదా వ్యవస్థలను, సంస్థలను మార్చేందుకుగాని విప్లవాలు సంభవించవచ్చు. నిర్మితి - కార్యశీలవాదుల వాదనల్లోని ముఖ్యాంశం ఏమిటంటే విప్లవం నూతన విలువల ప్రతిష్టాపనకు అవసరమైన ఒక కొత్త వాతావరణాన్ని సృష్టిస్తుంది. కొత్త విలువలు సామాజిక వాతావరణంతో మమేకమై మళ్ళీ ఒకరకమైన సామాజిక సమతౌల్యం (equilibrium) ఆవిష్కరించబడుతుంది. అందులో విలువలు, సామాజిక అస్తిత్వమూ మమేకమవుతాయి. అలాంటప్పుడు విప్లవాలకు ఆలవాలమైన విలువలు, ప్రమాణాలు, సమూహాలు, పాత్రలతో కూడిన సామాజిక వ్యవస్థలో ఇవి వివిధ రకాలుగా ఉంటాయి. విలువలు, ప్రమాణాలు, సమూహాలు సామాజిక పాత్రలలో నిర్మితమైన ఒక సమాజం ఎన్నో సమాజాలతో పోల్చిచూస్తే, ఈ విషయాల్లోనే ఎన్నో తేడాలతో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అందుకే ఏ సమాజంలో సంభవించే మార్పులైనా ఆ సమాజం నిర్మితి - విధుల ఆధారంగానే అర్థం చేసుకోవచ్చు. అందువల్ల నిర్మితి విధులలో విభేదాలు కలిగిన విభిన్న సమాజాల్లో సంభవించే మార్పులు, సంఘర్షణలు నిర్మితి - విధులనే సామాజికాంశాల ద్వారానే అధ్యయనం చేయవచ్చు.

పార్సన్స్ సిద్ధాంతంలోని ముఖ్యాంశమేమిటంటే అన్ని సమాజాలకు వర్తించే విప్లవసిద్ధాంతమేదీ లేదనేదే. దీనికి కారణం వివిధ సమాజాల్లో నిర్మితి కార్యశీలతల్లో కనిపించే బహుత్వ గుణమే (Plurality).

చామర్స్ జాన్సన్ తన గ్రంథం **రివల్యూషన్ అండ్ సోషల్ సిస్టమ్** లో విప్లవాలు ఆరురకాలుగా ఉండవచ్చని పేర్కొన్నారు. అవి (1) జాక్వేరీ (2) మిల్లెనరీ తిరుగుబాట్లు (3) అరాచక తిరుగుబాట్లు (4) జాకోబైన్ కమ్యూనిస్ట్ తిరుగుబాట్లు (5) కుట్రలు, (6) మిలిటెంట్ ప్రజాఉద్యమాలు. వీటిని విప్లవ లక్ష్యం, విప్లవ కారులెవరు? ప్రజలాలేక శిష్టులా? విప్లవాశయాలేమిటి? విప్లవం సహజ ప్రేరణాజనితమా లేదా ఉద్దేశపూర్వకంగా రేపిందా? అనే అంశాలు ఆధారంగా విప్లవం ఏ రకానికి చెందిందో తెలుసుకోవచ్చు.

నిర్మితి - విధుల సిద్ధాంతం ప్రతిపాదించే దేమిటంటే జనం పాటిస్తూ వస్తున్న విలువలకు కొత్తగా ఏర్పడిన వాతావరణానికి మధ్య సమతూకం దెబ్బతిని సమతౌల్యం లోపించటమే విప్లవాలకు మూలమని భావించటమే. ఈ రెంటికి మధ్య సమతూకం ఏర్పడి సమతౌల్యాలు నొలకొంటుందని విశ్వసించటమే. పైగా విప్లవాన్ని ఈ సిద్ధాంతం రాజకీయ తిరస్కృతి (Political defiance) గా భావిస్తుంది. అంతేకాక అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలనే మంచి రాజకీయ వ్యవస్థకు నమూనాలుగా భావించి పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తుంది. విప్లవావశ్యకతకు దోహదం చేసే అంశాలను కూడా ఈ సిద్ధాంతం విస్మరించింది. విప్లవాలను సాధ్యమైనంత వరకు రాకుండా చూడటమే మంచిదని కూడా విశ్వసిస్తుంది.

17.6.4 మనో వైజ్ఞానిక శాస్త్ర దృక్పథం

ఉదార వాద ఆలోచనా పరులపై మార్క్సిస్టు భావాల ప్రభావం ఎంత ప్రగాఢంగా ఉందంటే బలప్రయోగం ద్వారా అధికారాన్ని స్వాధీనం చేసుకోవటంలో (అంటే విప్లవాల్లో) సామాజిక మాన

సిక అంశాల పాత్రను మార్క్సిస్టు భావనకు ప్రతిగా ప్రతిపాదించటానికి చేసిన ప్రయత్నాల్లో గమనించవచ్చు. బలప్రయోగం ద్వారానే రాజ్యాధికారాన్ని రూపుమాపవచ్చనే మార్క్స్ భావనతో అంగీకరిస్తూనే విప్లవాలకు కేవలం సామాజిక, మానసిక పరమైన అంశాలే కారణమని, ఆర్థిక పునాదిగా జరిగే 'వర్గ పోరాటం' కాదనీ నవ్యఉదారవాదులు వాదిస్తారు. హెచ్. జె. లాస్కీ విప్లవాన్ని నిర్వచిస్తూ తమ ఉద్దేశంలో రాజ్యం ఏం చేస్తుందనుకుంటారో అలాంటి రాజ్యాన్ని, అది న్యాయబద్ధత కలిగిందైనప్పటికీ బలప్రయోగం ద్వారా దాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తారు ప్రజలు. ఆ ప్రయత్నమే విప్లవమన్నారు. సి.బి. మాక్ పర్సన్ ఇలా అన్నారు. "విప్లవం నా ఉద్దేశంలో కేవలం కుట్రకాదు. రాజసౌధాల్లో సంభవించే హఠాత్పరిణామమూకాదు. అనధికారశక్తి వ్యవస్థీకృతమై, రాజ్యాధికారంలో మార్పు తెచ్చి, అటు తరువాత సామాజిక, ఆర్థిక వ్యవస్థలలో మౌలికమైన మార్పు తెచ్చేందుకు, సమీకృతమవుతుంది. ఇదే విప్లవం" ప్రజల సహనశక్తికి ఒక హద్దుంది. వర్గ చైతన్యం మార్క్స్ భావించినట్లు అనేది ఏదీ లేకుండానే ప్రజానీకం తమ భవిష్యత్తును నిర్ణయించుకునేందుకు ఉద్యమించిన సంఘటనలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి. అలెక్సీస్ డి టాక్‌విల్లీ ఇలా అన్నారు. "తప్పనిసరి పరిస్థితుల్లో సహించిన దురాగతాలన్నిటి నుంచీ బయట పడొచ్చనే భావన కలిగినప్పుడు దురాగతాలన్నీ నిజంగానే భరించరానివిగా తయారవుతాయి. ఎంతో కాలంగా అత్యంత పీడక వ్యవస్థను చైతన్య హీనంగా భరిస్తూ వచ్చిన ప్రజానీకం కూడా వ్యవస్థలో పట్టు సడలిందని గ్రహించినప్పుడు ఒక్కసారిగా తెళ్ళున ఉద్యమ రూపంలో విరుచుకు పడతారు". అలాంటప్పుడు విప్లవాలకు కారణాలను ఆర్థిక, సామాజిక మానసిక అంశాల్లాంటి ఎన్నో కోణాలలో పరిశీలించవలసి ఉంటుంది. పైగా అలాంటి సంఘటనలకు వివిధ దశలూ, స్థాయిలూ ఉంటాయి. వీటన్నిటి దృష్ట్యా పరిశీలించినప్పుడు విప్లవాలు ఒకేసారి హఠాత్తుగా సంభవించవనీ, వాటి పునాదులు సామాజిక సమస్యలలో ఉండి నెమ్మది నెమ్మదిగా పైకి తేలుతూ బహిర్గతమయ్యే సామాజిక, రాజకీయ వ్యవస్థలలోని అవిటితనాన్ని ఒక్క ఉదుటున మార్చడానికి సంకల్పించిన సంఘటనేనని తెలుస్తుంది. ఇది తన అంతిమ స్థాయిలో అకస్మాత్తుగానూ, హింసాత్మకంగానూ ఉండవచ్చు. ఎన్నికల ద్వారా మనం దేన్నైతే కోరతామో దానికి హింసాత్మకమైన ప్రత్యామ్నాయమే విప్లవం.

ఆర్థిక, సామాజిక సిద్ధాంతాల పరిధిలోనే కాకుండా మనోవైజ్ఞానిక శాస్త్ర పరిధిలో కూడా విప్లవాలకు కారణాలు, వాటి స్వరూప స్వభావాలు కనుక్కునే ప్రయత్నం జరుగుతున్నది. మనోవైజ్ఞానిక శాస్త్రజ్ఞుల ఉద్దేశంలో రాజకీయ సుస్థిరత, అస్థిరత అనేవి ప్రధానంగా మానసిక స్థితికి సంబంధించిన విషయాలు మాత్రమే. పేదవారు, దరిద్రులు, కనీసజీవితావసరాలు తీరనివారూ రాజకీయంగా నెమ్మదస్తులై ఉండవచ్చు. అలాగే అన్నీ హాయిగా అనుభవిస్తున్నవారు విప్లవాలు లేవదీసిన సంఘటనలు కూడా ఉన్నాయి. అలాంటప్పుడు అసంతృప్తి కేవలం మానసికమైన అసంతృప్తే కాని మరొకటికాదు. కాబట్టి భౌతిక జీవనావసరాలు తీరటం తీరకపోవటం, స్వేచ్ఛా సమానత్వాలు ఉండటం, లేకపోవటం అనేవి విప్లవాలకు కారణాలుకావు. మానసిక విశ్లేషణా దృక్పథంతో విప్లవాలను అధ్యయనం చేసిన డేవిడ్ స్క్వార్జ్ విప్లవాలకు పరాయీకరణం (Alienation) కారణమని పేర్కొన్నాడు. మనిషిలోని వ్యక్తిగతమైన విలువలకు సంఘంలో ప్రబలంగా ఉన్న విలువలకు ఘర్షణ ఫలితంగా విప్లవం జనిస్తుంది. వ్యక్తి రాజకీయంలో భాగస్వామి కాకుండా తప్పుకుంటూ పరాయీకరణ చెందుతాడు. ఇది విప్లవానికి నాంది. పిట్రిన్ సోరోకిన్, జేమ్స్ డేవిస్, టెడ్‌గర్ లాంటి శాస్త్రజ్ఞులు మానసిక శాస్త్ర దృక్పథంలో

విప్లవానికి కారణాలు ఆవిష్కరించడానికి ప్రయత్నించారు. ఏకీకరణకు లొంగని భిన్నమైన విలువలు సంఘర్షించటం వల్లనే విప్లవాలు సంభవిస్తాయని సోరోకిన్ పేర్కొన్నాడు. ఆయన ఉద్దేశంలో అక స్మాత్తుగానూ, హింసాత్మకంగానూ అధికారిక విలువలను తొలగించే సంఘటనే విప్లవం. సమాజంలో విలువలు ఏకీకరణ చెంది సమైక్యం కాకపోవటం విప్లవం సంభవించటానికి అవశ్యకారణమని కూడా సోరోకిన్ పేర్కొన్నాడు.

అరిస్టాటిల్ లాగానే సోరోకిన్ కూడా విప్లవాలను అరికట్టవలసిన అవసరం ఉందని, విప్లవాలు అవసరమనీ, అవి అంతకు ముందున్న పీడక వ్యవస్థకన్నా దుర్భరమైన సామాజిక వ్యవస్థనే ఆవిపరి ష్కరిస్తాయని భావించాడు. మనిషిలోని పాశవిక గుణాలు సాంఘిక, నైతిక కట్టుబాట్లను తెంచుకొని బయటపడటానికి ప్రయత్నిస్తే విప్లవం వస్తుంది. విప్లవం జరిగే కాలంలో మనిషిలోని ఈ పాశవిక గుణాలు విపరీతంగా బయటపడతాయి. ఇవి ఇతరుల ఆస్తులను దోచుకోవటానికి ప్రేరణగా పనిచేయ వచ్చు. స్త్రీలను చెరచటానికీ ప్రేరకాలు కావచ్చు. మనుషులను, మనసులను వినశంచేసే ఈ పాశవిక శక్తులు దేశాల పేర్లను కూడా మార్చవచ్చు. మనుష్యుల్లో సహజాతంగా వచ్చిన బుద్ధులకు అమలులో ఉన్న నియమనిబంధనలకు పొత్తు కుదరని ఫలితమే విప్లవాలు. సహజతాలైన బుద్ధులు ఆరు రకాలైన అణిచివేతలకు - ఆకలి, ఆస్తి, స్వయం రక్షణ, లైంగికమైన కోర్కెలు, మనస్సు ప్రేరతమైన స్వేచ్ఛ- గురయినప్పుడు విప్లవాలు తలెత్తుతాయని సోరోకిన్ పేర్కొన్నాడు.

ఫ్రెంచి విప్లవాన్ని అధ్యయనం చేసిన అలెక్సీడి టాక్‌విల్లీ పెరిగే ఆశలు, ఆపేక్షలు, విప్లవాలకు కారణాలని పేర్కొన్నారు. కేవలం విపరీతమైన భరింపశక్యంగాని కష్టాలు, పీడన, అన్యాయాలే విప్లవాలకు కారణాలు కాకపోవచ్చుననీ, బాగా కలిగి ఉన్నప్పటికీ సుఖసంతోషాలకు కొదువ లేకుండా బతుకుతున్నప్పటికీ ప్రజలు ఇంకా ఏవో కావలని విప్లవాలు లేవదీయవచ్చుననీ, ఫ్రాన్స్‌లో విప్లవం ఉధృతంగా సంభవించిన ప్రాంతాల్లో కనిపించిందిదేనని టాక్ విల్లీ అన్నారు. ప్రజాజీవితం ప్రగతి పథంవైపే పయనిస్తూన్నా, అమలులోఉన్న సామాజిక, రాజకీయ ఆంక్షలను తొలగిస్తే ఇంకా ఎంతో ప్రగతిని సాధించగలిగే అవకాశం ఉన్నప్పుడు ప్రజలు విప్లవిస్తారు. అలాంటి ఆంక్షలు ప్రభుత్వమే విధిస్తూ ఉంటే అలాంటి ప్రభుత్వాన్ని తొలగించడానికి యత్నిస్తారు. అంతేకాని దుర్భర దారిద్ర్యంలో మగ్గే ప్రజలు విప్లవాన్ని సాధించలేరు. దుర్భర దారిద్ర్యంలో మగ్గే వ్యక్తి తననుగురించి, తన కుటుంబాన్ని గురించి మాత్రమే ఆలోచిస్తూ నిరంతరం నిరాశా నిస్పృహలకు లోనై విప్లవాన్ని కోరే స్థితిలో ఉండడు. జీవితావసరాలు కొద్దోగొప్పో లభిస్తూ ఉంటే కూడా ప్రజలు విప్లవాలను కోరరు. అయితే ప్రజలు కోరేదానికి, వాస్తవంగా లభించే దానికి మధ్య అగాధం ఏర్పడినా దాన్ని తొలగించేందుకు కూడా ప్రజలు విప్లవోన్ముఖులవుతారు.

ఈ మధ్య గర్, హైరాబెండ్, నెస్‌వోల్ట్ లాంటి వారు 'సాపేక్ష హరింపు' (Relative Deprivation) అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. 'ఆశావాదం-దురాక్రమణ పరికల్పన' (Frustration - agression hypothesis) ఆధారంగా దురాక్రమిత ప్రవర్తనకు మూలం నిరాశా నిస్పృహలేనసీ, ఏ మేరకు నిరాశా నిస్పృహలకు లోనైతే ఆ మేరకు దురాక్రమిత ప్రవర్తనకు మనుషులు లోనవుతారనీ, నిరాశానిస్పృహలకు కారణం 'సాపేక్ష హరింపు' కారణమని, ఏ మేరకు ఈ హరింపుకు లోనైతే ఆ మేరకు మనుషులు హింసాత్మక ప్రవర్తనకు దిగుతారని వీరు వాదిస్తారు. ఈ ప్రవర్తన కుట్రల రూపంలోనూ, చివరకు

అంతర్యుద్ధంగానూ కూడా పరిణమించవచ్చుననీ, స్ట్రైకులు, కోట్లాటలు, ప్రదర్శనల రూపంలో కూడా బయల్పడుతుందని వీరంటారు. హత్యలు, కుతంత్రాలు, గెరిల్లా పోరాటాలు కూడా దీని ఫలితమే. రాజకీయ విచక్షణ, ఆర్థిక విచక్షణ, జాతిమత విచక్షణ, విద్యావకాశాలు లేకపోవటం, దేశం విదేశీ పెట్టుబడులపై ఆధారపడటం సాపేక్ష హరింపుకు దోహదం చేస్తాయి. రాజకీయ భాగస్వామ్యం సంకుచితం కావటం, ద్రవ్యోల్బణం, వృద్ధిరేటు తరగటం కూడా సాపేక్ష హరింపుకు కారణాలేనని వీరు భావిస్తారు.

మొత్తం మీద మానసికశాస్త్ర దృక్కోణం నుంచే విప్లవాలను పరిశీలించటం నిర్మితి-విధుల భావాలకు కొనసాగింపుగానే కనిపిస్తుంది. అక్కడక్కడ మార్క్సిస్టు విప్లవ సిద్ధాంతంతో ఈ భావాలు ఏకీభవించినట్లు కనిపించినా వీటిలో మార్క్సిస్టు సిద్ధాంత వ్యతిరేకతే ఎక్కువ పాలుంటుంది. విప్లవ మంటే కేవలం ఒక వర్గం మరొక వర్గాన్ని అధికారం నుంచి తొలగించి అధికారాన్ని చేపట్టడమేకాదు, అది చరిత్రాత్మకంగా సంభవించే ఒక సంఘటన. బృహత్తరమైన సామాజిక పరిణామం.

17.6.5 భావ - ఉదారవాదం

విప్లవాల గురించి మార్క్సిస్టు దృక్పథానికి, భావవాదానికి భిన్నమైన అభిప్రాయాలు వెలిబుచ్చుతుంది భావ - ఉదార వాదం. నైతికంగానూ, ఆధ్యాత్మికంగానూ, సాంస్కృతికంగానూ ఒక నూతన సమాజావిష్కరణను కాంక్షించేదే విప్లవమని ఆ దృక్పథం భావిస్తుంది. అందుకే విప్లవం ఒక రాజకీయ సంఘటనకాదు. అమెరికన్, ఫ్రెంచి విప్లవాలను గురించి వ్యాఖ్యానిస్తూ ఇమ్మాన్యుయేల్ కాంట్ విప్లవం ఒక సహజమైన వాస్తవ సంఘటన అనీ, కేవలం నైతిక విలువల ఆధారంగా ప్రజలు దాన్ని నడిపిస్తున్నారని కాకుండా అది సహజంగానే ఎవరి ప్రమేయం లేకుండానే ఒక ఉన్నతమైన నైతిక జీవన స్థాపనకే దారి తీస్తుందని కాంట్ అన్నాడు. ఇది హెగెల్ భావాలకు బాగా దగ్గరగా ఉందని వేరే చెప్పనవసరం లేదు. ఫ్రెంచ్ విప్లవం ఇలాంటిదేనని హెగెల్ ఉద్దేశం. హేతుబద్ధమైన సత్యంగా ఫలితంగా కావటానికి గతి తార్కిక మార్గాన్ననుసరించిన ఫలితంగా ఏర్పడే సంఘటనే విప్లవం. ఆ విధంగా విప్లవం సత్యావిష్కరణను సాధించ తలపెట్టిన అవశ్య చారిత్రక సంఘటన. చారిత్రక సంధి కాలంలో వికసించే గలాబీలాంటిదని హెగెల్ విప్లవాన్ని కొనియాడాడు. చరిత్ర గమనం సత్యావిష్కరణ కథనమే. ఇది విప్లవాలను గురించిన స్వచ్ఛమైన భావ వాదం.

ఉదారవాదంతో కలిసిన భావవాద దృక్పథాన్ని మనం యం. యన్. రాయ్ భావాలలో గమనించవచ్చు. హేతువుకు తన కాల్పనిక ఆలోచనలను జోడించి మార్క్సిజానాన్ని తోసి రాజనేందుకు ఆయన రాడికల్ హ్యూమనిజాన్ని ప్రతిపాదించాడు. స్వేచ్ఛ అనేది ఒక అమూర్తమైన విలువ. విప్లవమంటే మనిషిలో స్వేచ్ఛను కోరే భావాలను రేకెత్తించటమే. స్వేచ్ఛలను అరికట్టే ఏ విప్లవ సిద్ధాంతమైనా నిరర్థకమే. స్వభావరీత్యా మనిషి హేతుజీవి, నైతిక జీవి. ఏ విప్లవమైనా మానవ స్వభావానికి కనుగుణంగా సంభవించాలి. కాబట్టి విప్లవమంటే హింస, తిరుగుబాట్లు, రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవటం కాదు. అందువల్ల మనిషి స్వేచ్ఛను హరించే కమ్యూనిజం, ఫాసిజం నిజమైన విప్లవాలు కావు.

విప్లవానికి హేతుచింతన ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పాడు. అసలైన విప్లవానికి ముందు మనిషి తాత్విక - విప్లవ కారిగా మారాలి. అసలు సిసలైన విప్లవానికి కావలసింది ఇలాంటి వ్యక్తులే. మనిషిలోని సహజగుణాలైన స్వేచ్ఛ, హేతుచింతన సంపూర్ణంగా బహిర్గతంకావటానికి, తద్వారా ఒక నూతన సామాజిక వ్యవస్థ రూపు దిద్దుకోవటానికి దోహదం చేసేదే సరియైన విప్లవం. భావవాదులైన కాంట్, హెగెల్ సిద్ధాంతాలు గాని, రాయ్‌లాంటి త్వాతిక - ఉదారవాదుల బావాలుగానీ సామాన్యమానవులకు సాధారణంగా అర్థంకావు. విప్లవం అనే వాస్తవాన్ని పూర్తిగా తాత్విక చింతనకే పరిమితం చేయటం వల్ల వీరి సిద్ధాంతాలు వాస్తవానికి చాలా దూరంగా ఉంటాయి. విప్లవం అనేది సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవనాన్ని కుదిపివేసే ఒక వాస్తవ సంఘటన. దాన్ని అనుభవవాద దృక్కోణం నుంచే (empiricism) పరిశీలించడానికి వీలవుతుంది. కానీ తాత్వి దృక్పథం అందుకు అనువైందికాదు.

17.7 విప్లవాలలో తాత్విక భావాల ప్రభావం

విప్లవంలో ఒక ముఖ్యవిషయమేమంటే అది కేవలం ఒక సంఘటన కాదు; ఎన్నో సంఘటనల మేళవింపు, ఎన్నో విలువల సంఘటింపు. ఇందులో, భావాల పాత్ర ఎంతో ముఖ్యమైంది. నూతన భావాల సృష్టికి తద్వారా సమాజాన్ని మార్చటానికి కొద్ది మందే కారకులవుతారు. విప్లవానంతరం ఏర్పడే నూతన సమాజంలో కూడా వీరు తమ భావాలతో తాము ఏది ఆదర్శవంతమైన సమాజమని భావిస్తారో దాన్ని నిర్మించటానికి ప్రయత్నిస్తారు. దీన్ని రెండవ విప్లవమనవచ్చు. ఆ విధంగా విప్లవాల్లో భావాల పాత్ర అమోఘం. అందుకే విప్లవం నిరంతరం సంభవించే సంఘటనల పరంపర. మార్క్సిస్టుల ఉద్దేశంలో కొందరు విప్లవకారులు దుర్భర జీవితాలననుభవించే కార్మికవర్గ ప్రజానీకానికి వాళ్ళ దౌర్బల్యాన్ని గురించి తెలిపి వారిని విప్లవానికి సన్నద్ధుల్ని చేయటంవల్లనే విప్లవం వస్తుంది. లెనిన్, మావోలాంటి అతి కొద్దిమంది విప్లవకారులు విప్లవ భావ జాలాన్ని ప్రజల్లో ప్రచారం చేయటం వల్లనే రష్యాలోనూ, చైనాలోనూ కమ్యూనిస్టు విప్లవాలు సాధ్యమయ్యాయి. అలాగే ఉదారవాదులు, వ్యక్తివాదోవాదులు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం అనే భావాలకు ప్రజల్లో ప్రచారం లభించేట్లు చేయటంవల్లనే రక్తరహిత విప్లవం, ఫ్రెంచ్ విప్లవాలు సంభవించాయి. విప్లవాలు సంభవించటంతోనే ఈ బావాల ప్రభావం తీరిపోదు. విప్లవానంతరం కూడా తామూహించిన సమాజ నిర్మాణం పూర్తయ్యేంతవరకు కూడా ఈ తాత్విక భావాలు తమ ప్రభావాన్ని ప్రసరిస్తూనే ఉంటాయి. అందుకే విప్లవాల్లో భావబలం ప్రభావం విస్మరించరానిది. జాన్‌లాక్, రూసో, వోల్టేర్, మార్క్స్, లెనిన్, మావోల తాత్విక భావాలు ఆయా దేశాల్లో సంభవించిన విప్లవాలపైన, అటు తరవాత కూడా ఎంతటి ప్రాచుర్యాన్ని పొందాయో చెప్పవలసిన పనిలేదు.

17.8 విప్లవాలు : ఒక పరిశీలన

పై చర్చవల్ల మనకు కొన్ని విషయాలు అవగతమౌతాయి. విప్లవం అంటే కేవలం ఏదో ఒక సామాజిక సంఘటన కాదు. విప్లవం అంటే పాత సమాజం, పాత విలువలస్థానే ఒక కొత్త సమాజం, కొత్త విలువలు ఆవిష్కరించబడాలి. నినాదాలు, బారికేడ్లు, హింస, రక్తపాతం, పోలీసుల్తో బజారు పోట్లాటలు, కొండల్లో గుట్టల్లో సాయుధ పోరాటాలు ఇవే విప్లవమని ప్రజలు సాధారణంగా

భావిస్తుంటారు. విప్లవాల్లో ఇవన్నీ ఉంటాయనటంలో సందేహం లేదు. కాని నిజంగా ఒక సంఘటన విప్లవమా కాదా అనేదాన్ని నిగ్గు తేల్చగలిగింది 'మార్పు'. సామాజిక రాజకీయ విప్లవమంటే ఒక సామాజిక వ్యవస్థనే సమూలంగా తొలగించి మరో నూతన వ్యవస్థను ఆవిష్కరించటం యూరపులో భూస్వామ్య వ్యవస్థను తొలగించి పెట్టుబడి దారీ వ్యవస్థ ఏర్పడటం విప్లవం. పెట్టుబడిదారీ వ్యవస్థస్థానే సమసమాజ వ్యవస్థను ఆవిష్కరిస్తే అది విప్లవమౌతుంది. పతనమౌతున్న పాలక వర్గం నుండి సామాజిక రాజకీయాధికారం మరో వర్గానికి నిర్ణయాత్మకంగా మార్పు చెందటం విప్లవం. తద్వారా సమాజం మరో అభివృద్ధికరమైన దశ చేరడానికి ప్రయత్నిస్తుంది.

విప్లవం ఒక విధంగా వరమూ మరో విధంగా శాపం కూడా. విప్లవానికి రెండు ముఖాలుంటాయి. అందులో ఒకటి మానవీయమూ, అమూర్తమూ, విశాలమూ, అమాయకత్వంతో కూడిన సుందర స్వాప్నిక జగత్తుగా గోచరిస్తుంది. దాని రెండవ ముఖం మొరటుగానూ, అసహ్యంగానూ, వికృతంగానూ, హింసాత్మకమూ, రక్తపు మరకలతో కూడిన భయానకమైన దస్పృహ్యం. విప్లవాలను గురించి తుది నిర్ణయాలు చేయవలసివస్తే ఈ రెండు అంశాలను దృష్టిలో పెట్టుకోవలసిన అవసరం ఉంది.

సమాజంలో అన్యాయాలు, అక్రమాలు, లంచగొండితనం, బంధుప్రీతి, అవినీతి బాగా పెచ్చుపెరిగి ప్రజలు దర్భర పరిస్థితులనుభవిస్తూ ఇక సాధారణ సంస్కరణల ద్వారా వ్యవస్థను సరిచేయడానికి వీలులేని స్థితి చేరితే విప్లవాలు తలెత్తక తప్పని పరిస్థితులేర్పడతాయి. విప్లవాలు న్యాయబద్ధమౌతాయి. వ్యవస్థీకృతమై ఉన్న సమాజాన్ని అలకల్లోలం చేస్తుంది. ఆ విధంగా విప్లవాలు మానవ సమాజాలకు శాపంగా పరిణమిస్తాయి. ప్రజలు వాంఛించేది సమూలమైన మార్పుకాదు. మార్పు పరిణామాత్మకంగా రావాలని వాంఛిస్తారు. విప్లవకారులు కోరుకొనేదేమిటో వాళ్ళకే స్పష్టంగా తెలియదు. ఫ్రెంచ్ సిండికాలిస్టుల నాయకుడు సోరెల్ తాము వాంఛించే దేమిటో ముందే చెబితే లేదా ముందే ఊహించుకొని ఉంటే విప్లవం విజయవంతం కాదని భావించాడు. సాధారణంగా విప్లవం రావటానికి కారకులైన విప్లవకారుల్నే విప్లవం మింగేస్తుంది కూడా. ఆ విధంగా విప్లవం తన పిల్లల్ని తానే మింగే క్రూర మృగం లాంటిది. విప్లవం అనే నాటకంలో అంతిమ దృశ్యం రక్తసిక్తమై సామాజిక వ్యవస్థ చిన్నాభిన్నమై పోవటంగా ప్రదర్శితమౌతుంది. విప్లవం జరుగుతున్న సమయంలో మనుషులు దోమ్మీలకు దిగుతారు. హింస చేయగలవాడు చేస్తాడు. కాని సాధారణ మానవులు ఏం చేయాలో తోచక, ఎవర్ని సమర్థించాలో తెలియక తికమకపడి భయాందోళనలకు గురవుతారు. రక్తపాతంతో సర్వనాశన హేతువవుతుంది విప్లవం. విప్లవంలో ఇది అనుకోని సంఘటనేమికాదు. వాంఛించబడిన సంఘటనే. ఇదీ విప్లవానికిగల రెండో ముఖం.

ఈ వాదనల్లో నిజం లేకపోలేదు. కాని విప్లవాల్ని అధ్యయనం చేసేవారు గుర్తుంచుకోవలసింది ఒకటుంది. అదేమిటంటే విప్లవం శాపమూ కాదు వరమూకాదు. మార్పు ప్రకృతి సహజం. కాబట్టి మార్పును ఆహ్వానించటం సమంజసం. విప్లవం అనే మాటనే అసహ్యించుకొనే ఏ సిద్ధాంతమైనా పరిణామ ప్రతీఘాత సిద్ధాంతమే అవుతుంది. అలాగే మార్పు సమూలంగా మూలచ్ఛేదం నుంచి రావాలనే సిద్ధాంతమూ అవకతవక సిద్ధాంతమే. విప్లవం అనే మాటనే అది మాలిన్య పరుస్తుంది. విప్లవాల అధ్యయనం సంతులిత జ్ఞానాన్ని సాధించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

— ఆచార్య బి. వెంకటేశ్వర్లు

17.9 చదువదగిన పుస్తకాలు

జాక్విన్ ఎల్లల్ : ఆటోప్సీ ఆఫ్ రివల్యూషన్, న్యూయార్క్, 1971

కార్ల్ జెంఫ్రెడరిక్ : "రివల్యూషన్" ఇన్ ఎన్‌సైక్లోపరీడియ బ్రిటానికా

రాల్ఫ్ మిలిబాండ్ : మార్క్సిజం అండ్ పాలిటిక్స్, లండన్ 1977

బార్జరా సాల్‌వర్ట్ : రివల్యూషన్ అండ్ రివల్యూషనరీస్, న్యూయార్క్, 1976

జి.యస్. పీటీ : ది ప్రాసెస్ ఆఫ్ రివల్యూషన్, న్యూయార్క్, 1938

శామ్యూల్ హంటింగ్‌టన్ : పొలిటికల్ ఆర్డర్ ఇన్ చేన్జింగ్ సొసైటీస్, న్యూహెవెన్, 1966

టి. యస్. కున్ : దిస్ట్రక్చర్ ఆఫ్ సైంటిఫిక్ రివల్యూషన్, షికాగో, 1962

హన్నా ఆరెంటీ : ఆన్ రివల్యూషన్, న్యూయార్క్, 1965

గిల్ బర్ట్ ఇ. మూర్ : సోషల్ చేంజ్, న్యూజెర్సీ, 1963

జాన్‌డన్ : మోడకర్న్ రివల్యూషన్స్, లండన్, 1972

ఎ. యస్. కొహన్ : థియరీస్ ఆఫ్ రివల్యూషన్ యాన్ ఇంట్రడక్షన్, లండన్ 1975

సి.డి. బర్క్స్ : దిప్రిన్సిపుల్స్ ఆఫ్ రివల్యూషన్, లండన్, 1920

క్రేన్ బ్రిన్‌టన్ : ది ఎనాటమీ ఆఫ్ రివల్యూషన్, లండన్, 1939

టాల్‌కాట్ పార్సన్స్, ఎడ్వర్డ్ షిల్స్ : టువర్డ్స్ ఎ జనరల్ థియరీ ఆఫ్ యాక్షన్, న్యూయార్క్, 1965

చామర్స్ జాన్సన్ : రివల్యూషనరీ చేంజ్, బోస్టన్, 1966, రివల్యూషన్ అండ్ సోషల్ సిస్టమ్, స్టాన్‌ఫర్డ్, 1964

అలెక్సీ డి టాక్‌విల్లి : ఏన్షియంట్ రిజీమ్ అండ్ ది ఫ్రెంచ్ రివల్యూషన్, న్యూయార్క్, 1955

ఎల్. పి. ఎడ్వర్డ్స్ : ది హిస్టరీ ఆఫ్ రివల్యూషన్, షికాగో, 1962

సోరోకిన్ : ది సోషియాలజీ ఆఫ్ రివల్యూషన్, న్యూయార్క్, 1925

డి.సి. గ్రోవర్ : యం. యన్. రాయ్ రివల్యూషన్ అండ్ రిజియన్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్, కలకత్తా, 1974

17.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. **ఈ కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. విప్లవాల గురించిన అధ్యయన పద్ధతులను పేర్కొనుము.

2. వివిధ విప్లవ దృక్పథాలను చర్చింపుము.

3. విప్లవాలలో తాత్త్విక భావనల ప్రభావం ఏ విధంగా ఉంటుంది.

- - - - -

భాగం-18 : అధీనత భావ సిద్ధాంతాలు

విషయక్రమం

18.1 లక్ష్యాలు

18.2 పరిచయం

18.3.0 అధీనత సిద్ధాంతం - మూలం - అభివృద్ధి

18.3.1 మొదటిదశ

18.3.2 రెండోదశ

18.4 మూడో ప్రపంచంలో పారిశ్రామికీకరణ

18.5 ఆర్థికాభివృద్ధిలో రాజ్యం పాత్ర

18.6 ఆశ్రిత పునరుత్పత్తి

18.7 రాజ్యస్వభావం

18.8 రాజ్య పెట్టుబడిదారీ వ్యవస్థ

18.9 ఉద్యోగి ప్రాబల్య రాజ్యం

18.10 అధికార వాదం - ఆర్థికాభివృద్ధి

18.11 ఆఫ్రికా అనుభవం

18.12 ముగింపు

18.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

18.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- అధీనతా సిద్ధాంతం వృద్ధి
- ఆశ్రిత పునరుత్పత్తి
- అధికార వాదం ఆర్థికాభివృద్ధి బాగా వివరించగలరు

18.2 పరిచయం

ఆధునీకీకరణ, అభివృద్ధి సిద్ధాంతాలకు సమానంగా అధీనత సిద్ధాంతం (Dependency Theory) 1960 దశకంలో రూపొందింది. అభివృద్ధి చెందుతున్న మూడో ప్రపంచ దేశాల ప్రగతికి అవసరమైన సమానాను పశ్చిమ పెట్టుబడి దారీ దేశాలు కల్పిస్తాయన్న వాదాన్ని ఈ సిద్ధాంతం తిరస్కరిస్తుంది. మూడో ప్రపంచం వాస్తవాన్ని అర్థం చేసుకోటానికి అవసరమైన ప్రత్యామ్నాయాన్ని అధీనత సిద్ధాంతం సూచిస్తుంది. "రాజకీయాభివృద్ధి" భావనకు వ్యతిరేకంగా "అల్పాభివృద్ధి" (Under development) భావనను ఈ సిద్ధాంతం స్పష్టంగా ఉపయోగిస్తున్నది. దీనివల్ల అధీనత సిద్ధాంతానికి మరింత స్పష్టత కలుగుతున్నది. రాజకీయాభివృద్ధి సిద్ధాంతాలు ఎంతసేపూ రాజకీయ, సామాజిక - ప్రజల స్వామ్యం, సమీకరణ, సంస్కృతి - మొదలైన అంశాలనే పరిగణనలోకి తీసుకొంటే అధీనత సిద్ధాంతం ఈ సమాజాల అభివృద్ధి వెనకబాటు తనాన్ని నొక్కి చెబుతుంది.

అధీనత సిద్ధాంత కర్తలు మార్క్స్ - లెనిన్ సిద్ధాంతాన్ని కూడా విమర్శిస్తారు. ఈ సిద్ధాంతం కేవలం సామ్రాజ్య వాదాన్ని మహా నగరాలకే (Metropolis) పరిమితం చేస్తుందనీ, కైవాస ప్రాంతాలను (Peripheries) నిర్లక్ష్యం చేస్తుందనీ ఆశ్రిత సిద్ధాంతవాదులు విమర్శిస్తారు. అందువల్ల ఆధునికీకరణ ఒంటిసి మార్క్సిస్ట్ అవగాహనకు దూరంగా ఉండి మూడో ప్రపంచం గురించి ప్రత్యేక అవగాహన చూపించటానికి ప్రయత్నిస్తారు.

ప్రత్యామ్నాయ భావనను రూపొందించటంలో ఆశ్రిత సిద్ధాంత కర్తలు, అభివృద్ధికి సంబంధించిన మూడు మార్గాలను గురించి ప్రస్తావిస్తారు. ఇవి ముఖ్యంగా పారిశ్రామిక విప్లవానంతరం వీర్పడిన మార్పులు. మొదటి మార్పు యూరోపీలో పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థ అవతరణ. రెండోది, పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థ సరిహద్దులు యూరప్ ఖండాన్ని దాటి విస్తరించాయి. ఫలితంగా ఆస్ట్రేలియా, కెనడా, అమెరికా సంయుక్తరాష్ట్రాలు మొదలైన సుదూర ప్రాంతాలకు పారిశ్రామిక ఆర్థిక పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రాబల్యం విస్తరించింది. అయితే మూడోది మరింత తీవ్రమైన పరిణామం, ఇది భిన్నమైందికూడా. ఎందుకంటే పైన పేర్కొన్న ప్రదేశాలు చాలావరకు జనాభా పరంగా, వనరుల పరంగా పూర్తి వినియోగం కిందికి రాలేదు. అయితే మూడో ప్రపంచ దేశాల పరిస్థితి పైదానికి పూర్తి భిన్నంగా ఉంటుంది. కారణం, ఈ ప్రాంతాల్లో అప్పటికే జనాభా వుంది. వాటి ఆర్థిక వ్యవస్థలు కూడా భిన్నంగా ఉన్నాయి. అందువల్ల ఈ మూడో ప్రపంచ దేశాల్లోకి పశ్చిమ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రవేశం మరొక తరహా అభివృద్ధి చెందిన దశను సృష్టించింది. ఈ మూడో దృక్పథమే ఆశ్రిత సిద్ధాంతానికి మూల స్తంభమైంది.

18.3.0 అధీనత సిద్ధాంతం - మూలం, అభివృద్ధి

అధీనత సిద్ధాంత అధ్యయనాన్ని మూడు దశలలో చేయాల్సి ఉంటుంది.

1. 1950 దశకం నుంచి 1960 దశకం వరకు

2. 1960 నుంచి 1970 దశకం వరకు

18.3.1 మొదటిదశ

మొదటిదశలో - అంటే 1950 దశకం ఆఖరిలో ఆధునికీకరణ సిద్ధాంతంలోని లోపాలను గుర్తించడానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. ఫలితంగా "ఆధునికీకరణ" అల్పాభివృద్ధి (Under development) సిద్ధాంతాల మధ్య చర్చ ప్రారంభమైంది. ఈ చర్చ అనేక వేదికల పరంగా కొనసాగింది. అయితే ఈ దశలో ఆశ్రిత సిద్ధాంతం నిర్మిత సంబంధమైన (Structuralist) భావన నుంచి వేరుపడి రూపురేఖలు దిద్దుకోవడం ప్రారంభించింది. అయితే ఈ రెండు సిద్ధాంతాల మధ్య కొంత సామ్యం లేకపోలేదు. ఆశ్రిత సిద్ధాంతకర్తలు అనేక దృక్కోణాలనుంచి ఆధునికీకరణ సిద్ధాంతాన్ని విమర్శించినప్పటికీ "రాజకీయ ఆర్థిక వ్యవస్థ" (Political Economy) అన్న పేరు పడ్డ విశ్లేషణకే తిరిగి వస్తారు. ఉత్పత్తి వ్యవస్థ (Organisation of Production), అధికార నిర్మితులు (Structure of Power), సామాజిక నిర్మాణం, స్వభావం, రాజకీయ సిద్ధాంతం, పరాయీకరణతాభావం (Alienation) మొదలైన వాటి మధ్య చర్య ప్రతిచర్యలను రాజకీయార్థిక వ్యవస్థ దృక్పథం విశ్లేషిస్తుంది. ఈ పరిధిలో మూడో ప్రపంచ దేశాల అవతరణకు సంభందించిన అధ్యయనాలు ప్రారంభమయ్యాయి. ఈ అధ్యయనాలను ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగంగా "కైవారం అభివృద్ధి" (Pripheral Development) సిద్ధాంతంగా ఆవిర్భవించిన ఒక నవ్యమార్క్సిస్టు (Neo - Maxist) సిద్ధాంతంగా వర్ణించవచ్చు.

ఆశ్రిత సిద్ధాంతం మరో ప్రత్యేకత ఏమిటంటే ఇది ఆధునికీకరణ సిద్ధాంతం మాదిరి యూరప్ కేంద్రంగా (Eurocentric) ఏర్పడలేదు. యూరప్‌ను ప్రాతిపదికగా తీసుకొని రూపొందించిన సిద్ధాంత నమూనాలు వాస్తవాల ఆధునిక అధ్యయనాలు మొదలైన అభివృద్ధికి సంబంధించిన సిద్ధాంతాలు మూడో ప్రపంచ దేశాల అధ్యయనానికి ఉపయోగపడవని ఆశ్రిత సిద్ధాంత కర్తలందరూ అంగీకరిస్తారు.

అంతకంటే ముఖ్యంగా వారు వ్యవసాయకేంద్రక (Agrocentric) ఆసియా కేంద్రక, లాటిన్ అమెరికా కేంద్రక దృక్పథానికి కట్టుబడి ఉంటారు. వారి అధ్యయనాల్లో దీనికి అత్యధిక ప్రాముఖ్యమిస్తారు. ఫలితంగా వారి సిద్ధాంతాల్లో కొన్ని ప్రత్యేక చారిత్రక అంశాలు - ఉదాహరణకు - వలసవాదం, ప్రముఖంగా చోటు చేసుకొంటాయి.

18.3.2 రెండోదశ

ఆశ్రిత వాద సిద్ధాంతంలో రెండోదశ 1970 మధ్య దశకం చాలా ముఖ్యమైంది. ఎందుకంటే ఈ దశలోనే అభివృద్ధి చెందని దశ స్వభావం, దానిని తొలగించడానికి ఆయా మూడో ప్రపంచ దేశాలు అనుసరించాల్సిన పద్ధతులు - వీటికి సంబంధించిన అనేక ముఖ్యమైన ఆశ్రిత సిద్ధాంతాలు వెలువడ్డాయి. ఈ సందర్భంలో మనం గమనించాల్సిన దేమిటంటే నవ్య కమ్యూనిస్టుల మధ్య ఏర్పడిన విభేదాలు మార్క్సిస్టు సిద్ధాంతానికి, ఆధునికీకరణకు మధ్య ఉన్న వివాదాలకంటే ఎక్కువ చర్చనీయాంశాలయ్యాయి. పర్యవసానంగా అనేక "అభివృద్ధి లేనిదశ" కు సంబంధించిన భావనలు, ఆశ్రిత కు ఈ కాలం లోనే రూపుదిద్దుకొన్నాయి. అందువల్ల ఈ దశను మనం క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

మొదటిసారిగా ఆశ్రిత సిద్ధాంతం లాటిన్ అమెరికాకు చెందిన అధ్యయనాలలో వెలువడింది. లాటిన్ అమెరికా ఖండంలో అభివృద్ధి తక్కువ స్థాయిలో ఉండటం అక్కడ జాతీయతావాదం, విప్లవ భావాలు

మొదలైన వాటి వికాసంలో లెనిన్, బుకానిన్ మొదలైన వారి సామ్రాజ్యవాద సిద్ధాంతాలనుంచి రెండు సంప్రదాయాలు ఏర్పడ్డాయి. వీటిలో జాతీయతా వాద సంప్రదాయం మొదట ఏర్పడింది. 1950 దశకంలో అగ్రస్థానంలో ఉండింది. దీని ప్రభావంవల్ల దిగుమతి రహిత పారిశ్రామికీకరణ గ్రామీణాభివృద్ధికి సంబంధించిన సిద్ధాంతాలు ప్రాచుర్యం పొందాయి. కైవార ప్రాంతంలో పెట్టుబడి దారీ వ్యవస్థను సంస్కరించాలన్న ఉద్యమం అభివృద్ధి సంప్రదాయానికి దోహదం చేసింది. పారిశ్రామికాభివృద్ధి వల్ల విదేశీ జోక్యం లేకుండా లాటిన్ అమెరికా అభివృద్ధి చెందగలదన్న ప్రాతిపదికకకు సదరు సిద్ధాంతం మూలం. అయితే ఈ సంప్రదాయం ఘోరంగా విఫలం కావడంవల్ల జాతీయతావాదం లాటిన్ అమెరికాలో 1960 దశకంలో విప్లవ సిద్ధాంత సంప్రదాయానికి దోహదం చేసింది. స్వభావ రీత్యా వెనక బాటు తనాన్ని పూర్తిమార్పు ద్వారా సామ్యవాద వ్యవస్థ స్థాపన ద్వారానే అధిగ మించగల మన్న భావన విప్లవ సంప్రదాయం బలపరిచింది.

దీని ప్రకారం కైవార ప్రాంతంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఆ ప్రాంతం వెనకబాటు తనానికి ఎక్కువ దోహదం చేస్తుంది. ఈ సిద్ధాంతాన్ని చర్చించినవారిలో ఎ.జి. ఫ్రాంక్ అగ్రగణ్యుడు. ఫ్రాంక్ తొలి రచనలు, వాలెన్‌స్టీన్, సమీర్ అమీన్ తదితరులు ఆశ్రిత సిద్ధాంతానికి బలమైన తాత్విక పునాదులు వేసారు. ఈ సిద్ధాంతం ఆధునికీకరణ ప్రాబల్యాన్ని పూర్తిగా తలకిందులు చేసింది.

ఫ్రాంక్ అధ్యయనం ప్రకారం వెనకబాటు తనం చారిత్రకంగా వలస వాదం, పెట్టుబడి దారీ వ్యవస్థలవల్ల ఏర్పడుతుంది. మూడో ప్రపంచం అభివృద్ధి విషయంలో వెనకబడటం పై కారణాలవల్లనే జరిగింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ ప్రాంతంలోనైనా వ్యాప్తి చెందినపుడు అక్కడ అబివృద్ధి సాధిస్తుంది, వెనుకబాటు తనానికి దోహదంచేస్తుంది. అనేక ప్రమేయాల ప్రాతిపదికగా పెట్టుబడి దారీ వ్యవస్థ మహానగర ప్రాంతాలను అభివృద్ధి చేసిందని ఫ్రాంక్ వాదిస్తాడు. అందువల్ల అభివృద్ధి చెందిన మహానగరాలు ఒక వైపు, వెనకబాటు తనంతో నానాటికీ కుంగిపోతున్న కైవార ప్రాంతాలు మరోవైపు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగాలుగా ఉంటాయి. మహానగర ప్రాంతం తనచుట్టూ ఉన్న సుదూర ప్రాంతాల వనరులను అక్కడి ప్రజల శ్రమను పీల్చి పిప్పిచేసి అభివృద్ధి చెందుతుంది. ఇది ఒక ప్రబల కేంద్రకం చుట్టూ కైవార ప్రాంతాలును ఆర్థికంగా వెనకబడిన పలసలతో లేదా ప్రస్తుత మూడో ప్రపంచదేశాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను రూపొందిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని లాటిన్ అమెరికాకకు వర్తింపజేస్తూ బ్రెజిల్, అర్జెంటీనా, చీలీ దేశాలలో వ్యాప్తి చెందింది. ఈ దేశాలను పూర్తిగా తన ఆశ్రిత ప్రాంతాలుగా తయారుచేసిందని ఫ్రాంక్ వాదిస్తాడు. అంతేకాకుండా మూడో ప్రపంచ దేశాలలో స్థానిక బూర్జువావర్గం బలహీనంగా ఉండటం, అక్కడి రాజ్యవ్యవస్థ వారికి సంబంధించినంత వరకు ప్రబలంగా ఉండటం జరుగుతున్నదని ఆయన అంటాడు. దీనివల్ల ఆయా దేశాలు విదేశీ పెట్టుబడిపై - ఆర్థికంగా, సైనికంగా, రాజకీయంగా, ఇంకా సిద్ధాంతపరంగా ఆధారపడి ఉండటంవల్ల విదేశీ జోక్యానికి సంబంధించి నంతవరకూ రాజ్య వ్యవస్థ బలహీనంగానే ఉంటుందని ఫ్రాంక్ సిద్ధాంతీకరించాడు.

ఆశ్రిత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వాలెన్‌స్టీన్ అనే మరో రయయిత కూడా పెట్టుబడి దారీ వ్యవస్థ అభివృద్ధి ఒక విశ్వవ్యాప్త ప్రక్రియగా, ఒక రాజ్యంలోపల, రాజ్యాల మధ్య అసమానతలను సృష్టిస్తుందని భావించాడు. అయితే ఫ్రాంక్ మాదిరి ఇతడు కూడా మార్క్సిస్టు సిద్ధాంతాలైన

సామ్రాజ్యవాదం, అదనపు విలువ, వర్గం మొదలైన వాటిని తిరస్కరించినప్పటికీ ఇమ్మ్యూన్యుయల్ రూపొందించిన అసమాన మారకం (unequal exchange) భావనను సమర్థించాడు. వాల్‌స్టీన్ సిద్ధాంతం ప్రకారం పెట్టుబడి దారీ వ్యవస్థ పూర్వపు సామ్రాజ్యాలను ప్రపంచ పెట్టుబడిదారీ ప్రాబల్య ఆర్థిక విధానం తొలగించి విశ్వవ్యాప్త వాణిజ్య ప్రాతిపదికపై అందులో అనేక చిన్న చిన్న వ్యవస్థలను కూడా సమన్వయం చేసుకొంది. "బలమైన రాజ్యాలు" అదనపు విలువను భుక్తం చేసుకొని అసమాన మారకపు వ్యవస్థను ప్రవేశపెట్టాయి. కేంద్ర, కైవార రాజ్యాలకు మధ్య శ్రమశక్తి కూడా విభజిత మవుతుంది. ఫలితంగా అంతర్జాతీయంగా శ్రామిక వర్గం రెండు భాగాలుగా చీలిపోతుంది. శ్రమ శక్తి విభజన ప్రక్రియను వాలెన్‌స్టీన్ పెట్టుబడి దారీ వ్యవస్థగా వర్ణించాడు. అన్ని రాజ్యాలను పెట్టుబడిదారీ రాజ్యాలుగ భావించడం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఒక పెట్టుబడి దారీ వ్యవస్థ ఏర్పడుతుంది. అందులో హెచ్చుతగ్గు స్థాయుల్లో అన్ని రాజ్యాలు ఉంటాయి. "అధారిత పెట్టుబడిదారీ వ్యవస్థ" (Dependent Capitalism) వెనకబాటు తనం అభివృద్ధి వాదాన్ని ఆయన అంగీకరిస్తాడు. అయితే అర్ధ - కైవార (Semi- Periphery) అనే భావన ప్రవేశ పెట్టి కేంద్ర, కైవార ప్రాంతాలమధ్య ఉండే ప్రదేశాలను వర్ణించడం వాలెన్‌స్టీన్ ప్రత్యేకత. దిని ప్రకారం క్షీణిస్తున్న లెదా బాగా పైకి వస్తున్న కేంద్ర ప్రాంతం (Core) ఒకటి ఉంటుంది. ఇది ఒక కైవార ప్రాంతం కూడా కావచ్చు. బలాబలాలను బలపరిచి ఇది ధృవీకృత ప్రపంచాన్ని (Polarised world) అడ్డుకొంటాయి. ఈ విధంగా చూసినప్పుడు వాలెన్‌స్టీన్ వాదం ప్రకారం ఉత్పత్తి సంబంధాలు కాకుండా మరో రకం సంబంధంపై మార్కెట్ వ్యవస్థ రూపొందుతుంది. చివరికి ఈ విధంగా మార్క్స్ వాదాన్ని వాలెన్‌స్టీన్ పరోక్షంగా తన ఆశ్రిత వాద సిద్ధాంతంలో ప్రవేశపెట్టాడు. ఆఫ్రికా ఖండంలోని దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పై విధంగా భాగస్వాములయ్యాయి.

18.4 మూడో ప్రపంచంలో పారిశ్రామికీకరణ

మూడో ప్రపంచంలో పారిశ్రామికీకరణ స్వభావం, వేగం, పద్ధతి, గమ్యాలు, రాజ్యం పాత్ర విషయంలో ఆశ్రిత సిద్ధాంతాలు అనేక మార్పులు చెందాయి. రెండో ప్రపంచ యుద్ధకాలం వరకు మార్క్స్ సిద్ధాంతకర్తలు పారిశ్రామికీకరణను కేవలం పాశ్చాత్యదేశాలకు సంబంధించిన ఒక ప్రత్యేక సమస్యగా పరిగణిస్తున్నారు. అలాగే ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ విస్తరణ పరిణామాలలో భాగంగా వెనకబడిన దేశాల పారిశ్రామిక ప్రగతిని విశ్లేషించడం జరిగింది. లాటిన్ అమెరికాలో జాతీయవాద సిద్ధాంతాలు స్వతంత్ర పారిశ్రామికీకరణను సాధించటంలో విఫలం కావటం ఈ వాదానికి కొంత బలం సమకూరుస్తున్నది. అందువల్ల 1960 దశకంలో ఫ్రాంక్, వాలెన్‌స్టీన్‌లు వెనకబడిన దేశాలు నిరంతరం వెనకబడినస్థాయిలోనే కొనసాగుతూ అభివృద్ధి చెందిన పెట్టుబడి దారీ దేశాలకు మూలపదార్థాలు, భౌతిక శ్రమను అందించేవిగా మిగిలిపోతున్నాయన్న నిర్ధారణకు వచ్చారు.

ఫ్రాంక్ అభిప్రాయంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ద్వారా మూడో ప్రపంచంలో పారిశ్రామికీకరణ సాధ్యం కాదు. అందువల్ల ప్రస్తుతం లాటిన్ అమెరికాలో అమలులో ఉన్న నిర్మాణాన్ని పూర్తిగా నాశనం చేసి సోషలిస్టు అభివృద్ధి పథాన్ని అనుసరిస్తే తప్ప వెనకబాటు తనాన్ని తొలగించి అభివృద్ధి సాధించటం సాధ్యంకాదు. ఆఫ్రికా ఖండం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం పొందడాన్ని

అధ్యయనం చేసిన వాలెర్‌స్టీన్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. బానిస వ్యాపారం, వాణిజ్య, వ్యవసాయోత్పత్తులు, ఖనిజాల ఎగుమతులు మొదలైనవి ఆఫ్రికాను యూరోప్‌కు "పెరడు" (Backyard) గా 1990 దశకానికి మార్చివేశాయి. వెనబాటు స్థితిని తొలగించుకోటానికి - ఆయన ఉద్దేశంలో సామ్యవాద విప్లవమే సరి అయిన ప్రత్యామ్నాయం. సమీర్ అమీన్ జాతీయ విమోచనోద్యమాలకు ప్రాముఖ్యమిస్తాడు. మూడో ప్రపంచంలో సామ్రాజ్యాలు తొలగించే ప్రక్రియలో సామ్రాజ్య వాదం ఏవిధంగా వలస వాదంగా రూపాంతరం చెందిందో, ఏ విధంగా శ్రమ దోపిడీ, అంతర్జాతీయ శ్రమవిభజన జరుగుతున్నాయో ఆయన తన అధ్యయనంలో సమగ్రంగా చర్చించాడు. ఈ మార్పు ఈ దేశాలలో జాతీయ బూర్జువావర్గాన్ని ప్రపంచపెట్టుబడిదారీ వ్యవస్థలో చిన్న తరహా భాగస్వాములుగా చేశాయని అమీన్ వాదిస్తాడు. ఫలితంగా వలస వాదం తిరిగి వెనకబడిన దేశాల్లో దొడ్డిదోవన ప్రవేశించి అక్కడ పాత భూస్వామ్య వ్యవస్థను సహకార బూర్జువా వర్గంగా (Comprador Bourgeosis) మార్చివేసింది. ఈ వర్గం సామ్రాజ్యవాద దేశానికి సేవకుడిగా మారిపోయింది. అమీన్ దృష్టిలో సామ్రాజ్య వ్యతిరేక పోరాటాలు కైవార ప్రాంతాల్లో చాలా ప్రాముఖ్యం వహిస్తాయి. రాజ్యాధికారాన్ని కైవశం చేసుకొంటూ మార్పులు తీసుకొని రావటం సాధ్యమని సమీర్ అమీన్ అభిప్రాయం. ఆఫ్రికాలోని ఈ వలసవాదాన్ని అధ్యయనం చేసి ఘనా, ఐవరీకోస్టు దేశాలు ఏ విధంగా భిన్న అభివృద్ధి మార్గాలను అనుసరించాయో వివరించాడు. ఫలితంగా విభిన్న నయావలస వాద ప్రాంతాల్లో విభిన్న తరహా అభివృద్ధి మార్గాలు అవలంబించటం జరుగుతున్నది.

ఫ్రాంక్ వాలెన్‌స్టీన్ తొలి రచనలో ఆధారిత స్వభావం మినహాయించి రాజ్యం పాత్ర ఏ విధంగా ఉంటుందో అన్న అంశం ప్రస్తావన మనకు ఎక్కువగా కనబడదు. ఆశ్రిత సిద్ధాంతం రాజ్యాన్ని - సైనిక, రాజకీయ ప్రజాస్వామ్య, ఉద్యోగి తరహా - విదేశీ ప్రాబల్యానికి సహకరించే ఏజెంట్‌గా మాత్రమే పరిగణిస్తుంది. ఆర్థిక నిశ్చయతా వాదాన్ని ప్రాతిపదికగా తీసుకొని మూడో ప్రపంచ దేశాలు ఏ విధంగా స్వయం సమృద్ధి సాధించటంలో అసమర్థమై, విదేశీ ఆసక్తులకు ఉపయోగపడుతున్నాయో ఆశ్రితవాద సిద్ధాంతాలు వివరిస్తున్నాయి. ఈ అభిప్రాయాన్ని స్థూలంగా వాలెన్‌స్టీన్, సమీర్ అమీన్, ఫ్రాంక్ రచనల్లో మనం గమనించవచ్చు.

1970 దశకంలో రాజ్యం వర్గాలమధ్య సంబంధాలను విస్తృతంగా చర్చించటం జరిగింది. దీనికి అనేకకారణాలున్నాయి వాటిలో ముఖ్యమైనవి :

1. వెనకబాటు తనానికి సంబంధించిన సిద్ధాంతాలు, ఆధునికీకరణ, రాజకీయాభివృద్ధి సిద్ధాంతాలను విమర్శిస్తూ ఏ విధంగా వెనకబాటు తనం మూడో ప్రపంచ అధ్యయనంలో ఒక ముఖ్యాంశమైందో సూచించటం జరిగింది.

2. పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యాప్తి వెనకబాటు తనానికి మూలమని చెబుతూ బాగా అభివృద్ధి చెందిన సమాజం ఆర్థిక వ్యవస్థను కూడా పరిశీలించడం జరిగింది.

3. అందువల్ల అభివృద్ధికి సంబంధించిన చర్చ అంతా ఆర్థిక వ్యవస్థ పరంగా కొనసాగింది.

4. వివిధ దేశాల రాజకీయనిర్మితులను అధ్యయనం చేయడం వల్ల పై అంశాన్ని అవగాహన చేసుకోవడం సాధ్యంకాదు. ఎందుకంటే విభిన్న రాజకీయ ప్రాంతాలలో విభిన్న సమస్యలుంటాయి కాబట్టి.

అందువల్ల వివిధ పెట్టుబడిదారీ రాజకీయ వ్యవస్థల అధ్యయనం చాలావరకు అవసరం ఉండదు. సదరు అధ్యయనం వాటి మధ్య సంబంధాలను గురించి మనకు ఏమీ తెలియజేయదు. అందువల్ల ఆశ్రిత వాద సిద్ధాంత రచయితలు "రాజకీయ వ్యవస్థ" గురించి అధ్యయనం చేస్తున్నామన్నప్పటికీ వారి ఆసక్తి ఎక్కువగా ఆర్థిక వ్యవస్థ స్వభావం, దానికి సంబంధించిన విశ్లేషణకే పరిమితం అయిందేకాని రాజకీయ అంశానికి ఎక్కువ ప్రాధాన్యమివ్వలేదు. ప్రతి అంశం ఆర్థిక పరంగానే వారి అధ్యయనాల్లో ప్రాముఖ్యం పొందింది. అందువల్ల ఈ దశలో రాజ్యానికి సంబంధించి ఎక్కువ సిద్ధాంతీకరణ జరగలేదు. నిజానికి ఆశ్రిత వాద సిద్ధాంతం అభివృద్ధి సిద్ధాంతంతో పోలిస్తే ఒక సమగ్రమైన రాజకీయ సిద్ధాంతాన్ని రూపొందించలేదు.

1970 దశకంలో ఆశ్రిత వాద సిద్ధాంతం విమర్శలకు గురి అయినప్పుడే వర్గ నిర్మాణం స్వభావం రాజ్యం పాత్ర రచయితల దృష్టిని ఆకర్షించాయి. పారిశ్రామిక సమాజాల్లో రాజ్యం పాత్ర గురించిన మార్క్సిస్టువాదం అధ్యయనాలు - ముఖ్యంగా 1960, 1970 దశకాల్లో - రాజ్య వ్యవస్థకు సంబంధించిన ఆసక్తి పెరిగింది.

మిలీబాండ్, లాక్‌లావ్ మొదలైన రచయితలు రాజ్య స్వభావాన్ని గురించి విశ్లేషించటంలో సాంప్రదాయక మార్క్సిస్టు సిద్ధాంత కర్తల కంటే ఎక్కువ సునిశిత దృష్టిని ప్రదర్శించారు.

18.5 ఆర్థికాభివృద్ధిలో రాజ్యం పాత్ర

ఈ సందర్భంలో ఆర్థికాభివృద్ధి సాధించటంలో రాజ్యం ఏమి చేస్తుంది? అనే అంశాన్ని హమ్‌జా, అలావీ అనే రచయితలు చాలా విపులంగా అధ్యయనం చేశారు. 1970 దశకంలో ఆశ్రిత వాద సిద్ధాంత రచయితల భావాలనుంచి ఆయన స్ఫూర్తి పొందాడు. హమ్‌జా అలాహే ఉద్దేశంలో వలసవాదానంతర దశలో రాజ్యవ్యవస్థ అతిగా అభివృద్ధి చెంది కొంత స్వేచ్ఛ సంపాదించుకొని స్థానిక, అంతర్జాతీయ పెట్టుబడిదారీ వర్గాల మధ్య సంధాన కర్తగా వ్యవహరిస్తున్నది.

1970 దశకంలో ఆశ్రిత వాద సిద్ధాంతంలో ఒక స్పష్టమైన మార్పు వచ్చింది. దీనికి రెండు కారణాలు తోడ్పడ్డాయి. (1) రాజ్యవ్యవస్థ పాత్ర పట్ల ఆసక్తి పెరిగి దాని ప్రభావం ఆశ్రితవాద సిద్ధాంతంపై కనబడింది. అందువల్ల మూడో ప్రపంచంలో రాజ్య స్వభావ అధ్యయనం పట్ల పునరాలోచన ప్రారంభమైంది. (2) కొన్ని మూడో ప్రపంచ దేశాల్లో పెరుగుతున్న పారిశ్రామికీకరణ క్రైవార దేశాలలో పారిశ్రామికీకరణకు ఏ పద్ధతి అనుసరించాలి, ఏఏ అవకాశాలున్నాయి? ఇందులో రాజ్యం పాత్ర ఏ మేరకు ఉంటుంది? ఎలా ఉండాలి? అనే అంశాలు ప్రాధాన్యం సంతరించుకొన్నాయి. ఎందుకంటే పై రెండు కోణాలు పరస్పరం ముడిపడి ఉండటంవల్ల తరవాతి దశకం రచయితలు అనేకమంది పెట్టుబడిదారీ వర్గం లేని దేశాలలో రాజ్యాన్ని పారిశ్రామికీకరణకు పెట్టుబడుల సమీకరణకు ఒక కేంద్రీకృత సంస్థగా పరిగణించారు.

అయితే ప్రారంభంలో పైవాదన పెట్టుబడి దారీ పారిశ్రామికీకరణ ద్వారా అభివృద్ధి అనే సిద్ధాంతాన్ని తొలగించి దాని స్థానంలో కేంద్రీకృత రాజ్య వ్యవస్థ ఆర్థికాభివృద్ధికి వెనకబడిన సమాజాలలో ఏకైక

మార్గం అనే సిద్ధాంతాన్ని సూచిస్తున్నట్లు అనిపిస్తుంది. అయితే ఇది వాస్తవంకాదు. ఉదాహరణకు - ఒక నూతన అంతర్జాతీయ శ్రామిక శక్తి మూడో ప్రపంచ దేశాలలో అవతరించి పెట్టుబడి దారీ వస్తువులను ఎగుమతి చేయడానికి పనిచేస్తున్నదని ఫ్రాంక్ అంగీకరిస్తాడు. అయితే దీనివల్ల యూరప్‌లో ఒక శతాబ్దానికి ముందు ఏర్పడిన స్వేచ్ఛా పెట్టుబడిదారీ వర్గం వెనుకబడిన దేశాలలో పై కారణంవల్ల ఆవిర్భవించలేదని భావిస్తారు. కైవారదేశాలలో లభ్యమయ్యే అదనపు వనరులను స్థానిక అభివృద్ధికి ఉపయోగించకుండా మహానగరానికి ఎగుమతి చేయడం జరుగుతుంది. స్థానిక రాజకీయ వర్గాలు సదరు ఎగుమతులకు పూర్తిగా సహకరించి గుత్తాధికార పెట్టుబడులకు కైవార దేశాలలో సేవకులుగా పనిచేస్తాయి.

ఈ మార్పుతో 1970 దశకంలో అనేక లాటిన్ అమెరికన్ దేశాలలో నియంతృత్వ సైనిక పాలనలు ఏర్పడ్డాయి. ఇలా ఏర్పడటానికి కారణం పెట్టుబడి సంచయనంలో ఏర్పడిన సంక్షోభమే అని ఫ్రాంక్ భావిస్తాడు. విదేశీ, స్వదేశీ పెట్టుబడుల అవసరాలను ప్రజాస్వామ్య ఉదారవాద రాజ్యాలు తీర్చటంలో విఫలమైనప్పుడు ఈ రెండూ సంఘటితమై పై ప్రభుత్వాలను తొలగించి తమ ప్రయోజనాల విస్తరణ కోసం నియంతృత్వ పాలనలను సమర్థిస్తాయి. ఫలితంగా ఈ సైనికీకరణ చెందిన రాజ్యం సమాజంలో అన్ని వర్గాలను శాసించటమేకాకుండా మూడో ప్రపంచంలో ఒక దేశం తరవాత మరొక దేశం ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ప్రయోజనం కోసం సైనిక పాలన కిందకి వస్తాయి.

18.6 ఆశ్రిత పునరుత్పత్తి

ఆశ్రిత పునరుత్పత్తి (Dependent Reproduction) అనే భావనను లాటిన్ అమెరికా దేశాలకు ముఖ్యంగా బ్రెజిల్‌కు సెల్సోఫోటాడ్ మొదలైన రచయితలు వర్తింపచేశారు. ఈ దేశాలలో ప్రారంభంలో పారిశ్రామికీకరణ స్వభావం, ప్రక్రియ ఇంగ్లండ్‌లో జరిగిన పారిశ్రామికీకరణ కంటే భిన్నంగా ఉన్నాయని వెలార్‌స్టీన్ వారిస్తాడు. బ్రెజిల్ కాఫీ ఉత్పత్తుల ఎగుమతులు ప్రారంభంలో పారిశ్రామికీకరణకు కొంత ప్రోత్సాహం ఇచ్చాయి. తరవాత దిగుమతులకు బదులు స్థానిక వనరులతో పారిశ్రామికీకరణను విస్తరింపచేయటానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. అయితే అవిఫలించలేదు. ఫలితంగా లాటిన్ అమెరికన్ దేశాలలో ఆశ్రిత పెట్టుబడిదారీ పారిశ్రామికీకరణ ప్రక్రియే కొనసాగింది.

ఆఫ్రికా అనుభవంకూడా లాటిన్ అమెరికా అనుభవానికి భిన్నంగా లేదు. 1960 దశకంలో ప్రాథమిక వస్తువుల ధరలు పడిపోవడంతో ఆర్థిక సంక్షోభం ఏర్పడి పారిశ్రామిక ప్రగతి కుంటుపడి రాజకీయ సంక్షోభం అనేక ఆఫ్రికా దేశాలలో ఏర్పడింది. ఫలితంగా అనేక దేశాలు సైనిక పాలన కిందికి వచ్చాయి. దీనికి ఉదాహరణగా కీన్యా, నైజీరియాలను పేర్కొనవచ్చు.

1980 దశకంలో రాజ్యం ఏవిధంగా పారిశ్రామికీకరణ అభివృద్ధికి దోహదం అవుతుందో ప్రధాన అధ్యయనాంశం అయింది. లాటిన్ అమెరికాపై జరిగిన అధ్యయనాలలో ఆశ్రితవాద సిద్ధాంతంలో వచ్చిన మార్పును కార్డోసో, ఫెలిటో రచనలు ప్రతిబింబిస్తాయి. ఫ్రాంక్ అధ్యయనాలలో కనిపించే యాంత్రికమైన, నిశ్చితమైన రాజ్య భావనను పై రచయితలు అనుసరించలేదు. కాగా స్థానిక

వర్గాలకు వర్గ సంఘర్షణలకు ప్రజా ఉద్యమాలకు స్థానిక ఆర్థికాభివృద్ధి అవసరమైతే విదేశీ పెట్టుబడులతో దీర్ఘకాలంలో ప్రజాస్వామ్యరాజ్య వ్యవస్థకు ఉపకరిస్తాయని భావించడం జరిగింది. ఆధారిత పెట్టుబడి దారీ రాజ్యం లేదా విప్లవ సోషలిస్టు వ్యవస్థే అవసరం లేదు. వర్గ సంఘర్షణలు వివిధ వ్యూహాలను అనుసరించే ప్రజాప్రభుత్వాలను ఏర్పాటుచేస్తాయి. అందువల్ల ఆశ్రిత రాజ్యం వర్గ సంఘర్షణలకు నిలయమవుతుంది. ఈ విధంగా వివిధ దేశాలలోకి పెట్టుబడి దారీ వ్యవస్థ వ్యాప్తిచెందడంవల్ల వివిధ పరిణామాలు ఏర్పడతాయి. ఈ పరిణామాలు కేవలం విభిన్న దశలలో ఈ దేశాల ఆర్థిక వ్యవస్థలు అంతర్జాతీయ వ్యవస్థలో విలీనం కావటంవల్లనే సంభవించవు. ఇంతకంటే స్థానిక వర్గాలమధ్య జరిగే సంఘర్షణలు లేదా విదేశీ పెట్టుబడులపట్ల ఏర్పడే సమైక్య ప్రతిఘటన విభిన్న రాజ్యవ్యవస్థలను అభివృద్ధి వ్యూహపరంగా ఆవిర్భవింపచేస్తాయి. అయితే ఒక విషయంలో మాత్రం పై రచయితలు ఫ్రాంక్‌తో ఏకీభవిస్తారు. అదేమిటంటే ద్వైవార దేశాలు కేంద్రక దేశంపై ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థపై ఆధారపడి వుంటాయి.

18.7 రాజ్య స్వభావం

లాటిన్ అమెరికాలో రాజ్య స్వభావం పై నేపథ్యంలో ఏవిధంగా ఉంటుందో జేమ్స్ పెట్రాస్ అధ్యయనం చేశాడు. ఆయన విశ్లేషణ ప్రకారం వ్యూహపరంగా వర్గం సంఘటితం కావడం దృష్ట్యా మూడు రకాల రాజ్యాలు లాటిన్ అమెరికాలో అవతరించాయి. అవి:

(1) నూతన పలసవాదనమూనా

(2) జాతీయ బూర్జువా అభివృద్ధివాద రాజ్యం

(3) జాతీయ ప్రజా వ్యూహాత్మక రాజ్యం.

ఈ విధంగా విదేశీ ఆధారితంగా ఉన్నప్పటికీ రాజ్యాన్ని సామాజిక వర్గాల పరంగా పెట్రాస్ వర్గీకరించాడు. కార్టోస్, పెలెట్టాలు జోక్య వాద రాజ్యం (Interventionist State) 1930 దశకం నుంచి లాటిన్ అమెరికాలో ఏర్పడిందని భావిస్తారు. ఆర్థిక మాంద్యం, వర్గాల ప్రభావంవల్ల ఆర్థిక వ్యవస్థ వ్యవహారాల్లో రాజ్యం జోక్యం చేసుకోవటం తప్పనిసరి అయిందని వారు వాదిస్తారు. ఈ కారణంవల్ల లాటిన్ అమెరికాలో 1970 దశకంలో రెండు రకాల ఆశ్రిత రాజ్యాలు అవతరించాయి. ఈ రెండూ కూడా ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకొనేవిగా, ప్రజాస్వామికేతరంగా పనిచేసేవిగా రూపొందాయి. ఇవి రాజ్య పెట్టుబడిదారీ తరహా (State Capitalistic) ఉద్యోగిస్వామ్య అధికారవాద తరహాలుగా పనిచేస్తున్నాయి.

మూడో ప్రపంచ దేశాల్లో పారిశ్రామికీకరణ ప్రక్రియలో భాగంగా ఒక నూతన పెట్టుబడుల సంచయనం నమూనా రూపొందింది.

(1) గుణాత్మకంగా పరిశీలిస్తే పెట్టుబడి సంచయనానికి అవసరమైన నమూనాకు ఎటువంటి ఆధారం లేకుండా రూపొందటం.

(2) అటువంటి సమూనా జాతీయ విప్లవాన్ని చూపినా అది కొన్ని రాజ్యాలకే పరిమితం కావటం

(3) అటువంటి సమూనా రూపొందటం సాధ్యమేకాని అది పూర్తిగా పరిణతి చెందలేదు.

18.8 రాజ్య పెట్టుబడిదారీ వ్యవస్థ

1930 దశకం నుంచి రాజ్యపెట్టుబడిదారీ విధానం బ్రెజిల్‌లో ఏర్పడింది. విస్తృతమైన ప్రభుత్వ రంగం కిందకు ఆర్థిక వ్యవస్థ వచ్చింది. అయితే ఇక్కడ ప్రభుత్వ యాజమాన్యం, ప్రయివేట్ రంగం మధ్య ఏర్పడిన ఉద్రిక్తతల గురించి ఎక్కువగా విశ్లేషణ జరగలేదు. అలాగే స్వదేశీ, విదేశీ పెట్టుబడుల మధ్య ఉత్పన్నమైన ఘర్షణ, పోటీల గురించిన ప్రస్తావనలేదు. కొంతవరకు ఆశ్రిత సిద్ధాంత కర్తల సమస్యను - ముఖ్యంగా బ్రెజిల్, మెక్సికో, పెరూ మొదలైన లాటిన్ అమెరికా దేశాల్లో ఫిజ్‌వాల్డ్ భావాలు వ్యక్తీకరించాయి. రాజ్యం జోక్య విధానం వల్ల స్వదేశీ పెట్టుబడులు తగ్గిపోయ్యాయి. ఆర్థిక వ్యవస్థ మొత్తం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో విలీనమై పోయింది. అయితే పైవాదానికి భిన్నంగా - అంటే రాజ్య పెట్టుబడి దారీ వ్యవస్థ కొంతమేరకు బ్రెజిల్‌లో అభివృద్ధి సాధించిందని కార్డోసో భావిస్తాడు. ఈ దృక్పథం అంతరంగిక, విదేశీ కారకాలకు కొంత ప్రాముఖ్యమిస్తుంది. ఆశ్రితము, అభివృద్ధి గత కాలం నాటి సామ్రాజ్య విధానంతో పోలిస్తే కలిసి ఉంటాయని ఈ దృక్పథం రచయితలు వాదిస్తారు. బహుళజాతి వ్యాపార సంస్థల ప్రవేశంతో బ్రెజిల్ వంటి దేశాల్లో జాతీయ, రాజ్యపెట్టుబడులు గణనీయంగా తగ్గిపొయ్యాయి. వర్గ సంబంధాలుకూడా అంతర్జాతీయ వ్యవస్థ ఆసక్తుల పరిరక్షణ పరంగానే కొనసాగాయని కార్డోసో భావిస్తాడు.

పీటర్ ఇవాన్ అధ్యయనం ప్రకారం రాజ్యం, స్వదేశీ, విదేశీ పెట్టుబడులు ఒక త్రిముఖ కూటమిగా ఏర్పడ్డాయి. ఇవి అభివృద్ధి ప్రయోజనాలు సమానంగా పంచుకోకపోయినప్పటికీ కలిసి పనిచేశాయి. 1960 దశకం అనంతరం బ్రెజిల్ తదితర లాటిన్ అమెరికా దేశాల్లో రాజ్యాధికారం పెరగటం సదరు కూటమి సాధ్యమైందని ఇవాన్స్ అభిప్రాయం.

18.9 ఉద్యోగి ప్రాబల్య రాజ్యం

ఉద్యోగి ప్రాబల్య వ్యవస్థలో రాజకీయ వర్గాలు కొంత మేరకు స్వేచ్ఛగా వ్యవహరిస్తాయి. ఆర్థిక వ్యవహారాల విషయంలో ఎప్పుడూ స్వాతంత్ర్యం ఉంటుందన్న భావనను ఉద్యోగి ప్రాబల్య ప్రభుత్వం కలగజేస్తుంది. ఉద్యోగి స్వామ్య ప్రాబల్య రాజ్యవ్యవస్థ అంతరంగిక ఆర్థిక సంక్షోభం రావటం వల్ల బహుళజాతి వ్యాపార సంస్థలు ప్రవేశించటం వల్ల ఏర్పడింది. స్థానిక పెట్టుబడి దారీ వ్యవస్థలు పూర్తిగా బలహీనం కావడంవల్ల సదరు పరిణామం సంభవించింది. అయితే ఈ పరిణామం ఏ దేశంలోనైతే జాతీయ ఆర్థిక వాదం బలపడిందో, ఎక్కడైతే రాజకీయ సమీకరణ (Political mobilization) బలపడిందో అక్కడే సంభవించింది. అయితే ఇటువంటి అనుభవం ఉన్న దేశాల్లో రాజ్యం చాలా వరకు స్వేచ్ఛగా వ్యవహరించినట్లు కనిపించదు. ఆర్థిక వ్యవహారాలను చక్కదిద్దే ప్రయత్నం చేసింది. అందువల్ల రాజ్యం కొంతమేరకు నిరంకుశంగా వ్యవహరించక తప్పలేదు. ఫలితంగా ప్రజల భాగస్వామ్యాన్ని, ఉద్యమాలను నిర్దాక్షిణ్యంగా అణచివేయడం జరిగింది.

18.10 అధికారవాదం - ఆర్థికాభివృద్ధి

కొంతమంది రచయితలు అధికార వాదానికీ, ఆర్థికాభివృద్ధికీ సంబంధాన్ని సూచించారు. వేతన పరిమితి, పనిగంటల పెంచింపు, సౌకర్యాల తగ్గింపు, అణిచివేత విధానాల ద్వారానే సాధ్యమవుతాయి. అందువల్ల లాటిన్ అమెరికాలో ఆర్థికాభివృద్ధి ప్రబలమైన రాజ్య నిర్మాణం ద్వారా సాధ్యం అన్న అభిప్రాయం బలపడింది.

18.11 ఆఫ్రికా అనుభవం

1970 దశకాల్లో ఆఫ్రికాల్లోని పరిణామాలను పరిశీలిస్తే అగ్రగామి సామాజిక వర్గాల ప్రాబల్యం లేకుండా లేదా వాటికి అతీతంగా ఒక నూతన వర్గం అధికారాన్ని సంపాదించుకొంటే బాగుంటుంది. ఇది దేశ ప్రగతికి దోహదం చేయక పోయినా అధికారాన్ని అంటిపెట్టుకొని ఉంటుంది. ఈ నూతన వర్గం దేశంలోని సంపదను, అదనపు విలువను దోచుకొంది. ఉద్యోగి స్వామ్యం రాజ్యకర్తవ్యాలను నిర్వహిస్తూ తన ప్రత్యేక వర్గ ప్రయోజనాలను ఏర్పాటు చేసుకొంది. ఫలితంగా ఉద్యోగి స్వామ్య బూర్జువా వర్గం ఒకటి ఏర్పడింది. ఆఫ్రికా ఖండంలో కూడా ఈ వర్గం ప్రముఖ పాత్ర వహిస్తున్నది. ఎందుకంటే భూస్వామ్య స్థానిక బూర్జువా వర్గం బలహీనంగా ఉండటంవల్ల ఉద్యోగి స్వామ్యవర్గం ప్రాబల్యస్థితిలో ఉంది.

వలస విమోచనానంతరం స్థానిక ఆర్థికాభివృద్ధి, రాజకీయ సుస్థిరత కోసం ప్రయత్నించటానికి బదులు ఉద్యోగి స్వామ్యం సామ్రాజ్యవాదానికి మిత్రుడిగా పనిచేయడంతో తృప్తి పడుతోంది. స్థానికంగా వర్గాలు బలహీనంగా ఉన్నప్పుడు, ప్రతిఘటన తక్కువగా ఉన్నప్పుడు జాతీయ ఆర్థిక రంగంలో సోషలిజం పేరున చొచ్చుకొనిపోయి ఉద్యోగి స్వామ్యం తన ప్రాబల్యాన్ని పెంచుకొంటుంది. రాజ్యం పేరిట సర్వాధికారాలు కైవసం చేసుకొంది.

ఎన్‌క్రోమా ఘనాలో రూపొందిన నమూనాను రోగర్ ముర్రె వివరించాడు. ఇతని అధ్యయనం ప్రకారం వలస విమోచనానంతరం రాజ్యం ద్వంద్వపాత్రలు నిర్వహిస్తున్నది. ఏకకాలంలో విదేశీ పెట్టుబడి దారులతో దోస్తీచేస్తూ అదే సమయంలో సామ్రాజ్య వ్యతిరేక సోషలిస్టు విప్లవాన్ని కొనసాగిస్తున్నది. అందువల్ల పెట్టే బూర్జువా సాపేక్ష స్వేచ్ఛ ఘనాలో ఒక ముఖ్యాంశమైంది. ఘనాలో అసంఘటిత వర్గాలు అధికారం చెలాయించాయి. ప్రత్యేక వర్గ దృక్పథం లేకపోవటంవల్ల అంతర్జాతీయ పెట్టుబడిదారీ వర్గంతో ఒక సమయంలో రాజీపడుతూ మరో సమయంలో ఘర్షణ పడుతూ వ్యవహరించారు.

మూడో ప్రపంచంపై విదేశీ ప్రభావాన్ని వివరిస్తూన్నప్పుడు ఆర్థిక రంగంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక విప్లవం, ఆర్థిక మాంద్యాలు, యుద్ధాలు, కొరతలు, వాణిజ్యం మొదలైన వాటిని విస్తృతంగా ప్రస్తావించడం జరిగింది. ఆంతరంగిక పరిస్థితులకు సంబంధించి కేంద్ర దేశం ఒక ప్రదేశాన్ని ఆశ్రిత ప్రాంతంగా పరిగణించటాన్ని ఎక్కువగా విశ్లేషించటం జరిగింది. ఫలితంగా నయా వలసవాద ప్రభావితమార్క్సిస్టు మేధావులు వర్గాలను, వర్గపోరాటాలను నిర్లక్ష్యం చేశారు. బూర

వర్గ స్వభావం అభివృద్ధిని కాంక్షించే స్వభావ మున్న వర్గమా! లేదా అనే మీ మాంసకే వారు ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. స్వదేశీ ప్రయోజన, విదేశీ ప్రయోజనమున్న వర్గాల మధ్య వ్యత్యాసం రాజకీయమైనదేకాని వర్గదృక్పథంవల్ల ఏర్పడిందికాదు.

నయావలసవాద సిద్ధాంతం పై కారణాలవల్ల వేరే దృక్పథంతో వర్గ సంబంధాలను పరిశీలిస్తుంది. అదే సమయంలో విదేశీ కారకాలను కూడా నిర్లక్ష్యం చేయదు. ఆంతరంగిక వర్గాల మధ్య ఉత్పన్న మయ్యే సంఘర్షణలు ఆసమాజంలో ఉన్న చీలికలను పెద్దవిచేస్తాయి. ఫలితంగా ఒకవర్గం అధికారంలోకి వస్తుంది. ఆవర్గ లక్ష్యం స్వభావాలు రాజ్య స్వభావాన్ని నిర్ణయిస్తాయి.

18.12 ముగింపు

పైన ప్రస్తావించిన అంశాలన్నీ "ఆశ్రిత తత్వాన్ని" వివరించటంలో, దాని లక్షణాలను గుర్తించటంలో స్పష్టతను చూపలేక పోయాయి. అంతేగాకుండా ఆశ్రిత రాజ్యాలకు స్వయం అభివృద్ధి సామర్థ్యం లేదని, అందువల్ల అవి అభివృద్ధి చెందిన దేశాలపై ఆధారపడుతున్నాయని చెప్పడం జరిగింది. అయితే ఆశ్రితసిద్ధాంతం సాంప్రదాయిక మార్క్సిస్టు సామ్రాజ్య వాద సిద్ధాంతాన్ని మెరుగుపరిచిందని చెప్పవచ్చు. ఆధారిత దేశాలను నిర్ణయాత్మకం చేసే సూత్రాలను వివరించటంలో ఆశ్రిత వాద సిద్ధాంతం కొంతవరకు సాఫల్యం చెందింది. పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యాప్తి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఎటువంటి పరిణామాలను సృష్టిస్తుంది, దాని ప్రభావం ఆయా దేశాల వెనక బడిన తనాన్ని ఏరకంగా అభివృద్ధి చేస్తుంది అనే అంశాలను విశ్లేషించటంలో ఆశ్రిత వాద సిద్ధాంతకర్తలు చాలావరకు విజయం సాధించారనే చెప్పవచ్చు.

డా. వి. రవీంద్రశాస్త్రి

18.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. అధీనతా సిద్ధాంతాలను చర్చింపుము.
2. ఆర్థికాభివృద్ధిలో రాజ్యం పాత్రను చర్చింపుము.
3. రాజ్యంలో ఉద్యోగి ప్రాబల్యం గురించి రాయుము.

* * * *

భాగం-19 : సైన్యం పాత్ర

విషయక్రమం

19.1 లక్ష్యాలు

19.2 పరిచయం

19.3 సైన్యం లక్షణాలు

19.4 సైనిక జోక్యానికి కారణాలు

19.5 సైనిక జోక్యం సమర్థన

19.6 చట్టబద్ధతకు ప్రయత్నాలు

19.7 చదువదగిన పుస్తకాలు

19.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

19.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- వర్ధమాన దేశాలలో సైన్యం జోక్యానికి కారణాలు
- సైనికజోక్యానికి సమర్థన
- సైనికపాలన పనితీరు బాగా వివరించగలుగుతారు

19.2 పరిచయం

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత నూతనంగా ఆవిర్భవించిన అనేక లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని దేశాలు ఆరంభంలో పాశ్చాత్య ఉదారవాద ప్రజాస్వామ్యరాజకీయ వ్యవస్థలను ఏర్పరచుకొన్నప్పటికీ, అనతి కాలంలోనే ఆయాదేశాల్లో సైనిక పాలనలు ఏర్పడ్డాయి. వివిధ స్థాయిలలో అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజాస్వామ్య రాజ్యాంగాలు అభివృద్ధిని సాధించటంలో విఫలం చెందాయి. అందువల్ల స్థానిక ప్రజలలో వాటిపట్ల తీవ్ర అసంతృప్తి పెరిగి పార్లమెంటరీ ప్రభుత్వాల వైఫల్యాలను సాకుగా తీసుకొని సైనిక తిరుగుబాట్లు జరిపాయి. అభివృద్ధి చెందుతున్న చాలా దేశాలు సైనికపాలన క్రిందకు వచ్చాయి. అంతేగాకుండా జాతి నిర్మాణం సక్రమంగా జరగటానికి అవసరమైన సంస్థలలోపం వల్లనూ, ఆర్థికంగా బాగా వెనుకబడి ఉండటంవల్లనూ, ప్రజలలో తెగలపరంగా, ఉపజాతులపరంగా వారి ప్రాథమిక విధేయతలు జాతీయ ఆసక్తులను విస్మరించటంవల్లనూ; ఆందోళనలు, దౌర్జన్యకాండలు

అధికం కావటంవల్లనూ, వాటిని నిరోధించటంలో పౌర ప్రభుత్వం విఫలం చెందటంవల్లనూ, రాజకీయ రంగంలో సైనిక జోక్యం అని వార్యమైంది. విభజిత శక్తులను, వ్యవస్థను సమూలుచేసే వర్గాలను అదుపులోపెట్టలేక రాజకీయ నాయకత్వం తన మనుగడకోసం సైన్యం పై ఆధార పడటం అధికం కావటంతో సైన వివరించిన దేశాల్లో నియంతృత్వాలు అవతరించాయి.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం రాజకీయ స్వాతంత్ర్యం పొందిన మూడవ ప్రపంచ దేశాల్లో మూడింట రెండువంతుల దేశాలు సైనిక తిరుగుబాట్లకు గురయ్యాయి. అనేక ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో సైన్యం తిరుగుబాటుచేసి అధికారాన్ని కైవసం చేసుకోవటం సర్వసామాన్యమైంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం (1958-1994) వివిధ దేశాల్లో మొత్తం 160 మార్లు సైనిక తిరుగుబాట్లు జరిగాయి. వీటిలో దాదాపు తొంభై శాతం సందర్భాలలో సైన్యం అధికారాన్ని హస్తగతం చేసుకొంది. రాజకీయ ప్రక్రియలో సైనిక జోక్యం దాదాపు సర్వసామాన్యమై పోయింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రజలు అనేక విభజనలకు గురి అవటం, అజ్ఞానం, అవిద్య, ఆర్థిక వెనుకబాటుతనం, ప్రాధమి ఆటవిక విశ్వాసాలు, విధేయతలు వీరిని జాతీయ దృక్పథం నుంచి దూరం చేయటం కారణంగా కనపడుతుంది. ప్రజాస్వామ్యేతర పద్ధతులలో అధికారం స్వాధీనం చేసుకోవటానికి రాజకీయ వేత్తలకు సైనిక సహాయం అవసరం కావటంతో రాజకీయ రంగంలో సైనిక జోక్యం సర్వసాధారణతను సంతరించుకొంది. అన్ని రంగాల్లోను పౌర ప్రభుత్వ వైఫల్యాలు, అసమర్థత, అవినీతివృద్ధి, సైనిక వర్గాలు అధికారాన్ని హస్తగతం చేసుకోవటానికి తోడ్పడుతున్నాయి.

19.3 సైన్యం లక్షణాలు

ఎన్. ఇ. ఫైనర్ తన "సైనిక యోధుడు" గ్రంధంలో సైన్యం మూడు విశిష్టమైన లక్షణాలను కలిగి ఉంటుందని చెప్పారు. అవి (1) ఉన్నత ప్రమాణిక సంస్థ: (2) ఉద్యోగ పరమైన ప్రత్యేకహోదా, (3) హింసా విధానాలపై గుత్తాధిపత్యం. యుద్ధం చేయటానికి యుద్ధాల్లో గెలవటానికి ఒక ప్రత్యేక సాధనంగా, యంత్రాంగంగా సైనిక వ్యవస్థ రూపం ఉంటుంది. అందువల్ల అకుంఠిత దీక్ష, చిత్తశుద్ధి, ఉక్కు పిడికిలి క్రమశిక్షణ, నిరుపమాన ధైర్యసాహసాలు, కఠోర నియమావళి, కేంద్రీకృత అధికార వ్యవస్థ, వైవారి ఆజ్ఞలను ఎదురు ప్రశ్నించకుండా అమలు పరచటం సైన్యం నిర్మితి ప్రధాన లక్షణాలు. అంతేకాకుండా పౌర అధికారం నుంచి స్వతంత్ర ప్రతిపత్తిగల నిర్మాణ స్వభావం ఉంటుంది. సైన్యం ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండి సర్వసన్నద్ధంగా ఉంటుంది. నిరంతరం సుశిక్షితంగా రూపం సంతరించుకొంటుంది. తీవ్ర జాతీయవాదం, అకుంఠిత దేశభక్తి, క్రమశిక్షణ సైన్యంలో కనిపించే సాధారణ లక్షణాలు. అంతేగాకుండా సైనికులు ఐక్యత, సమగ్రత, పటిష్ఠతల విషయంలో బాగా శిక్షణ పొందినవారు. సమాచార ప్రసార రంగాల్లో సైన్యం అత్యాధునిక వ్యవస్థను పరికరాలను కలిగి ఉంటుంది. అందువల్ల సమాచార పంపిణీ, ప్రసార, ప్రచార సాధనాలు రవాణా సౌకర్యాలు మొదలైన హంగులతో సైన్యం కదలిక సుకరంగా ఉంటుంది. పౌర జీవనానికి దూరంగా సైనిక జీవనం సాగుతుంది. సైనికులకు ప్రత్యేక దుస్తులు, నివాస సదుపాయాలు జీవన సౌకర్యాలు ఉంటాయి. హింసకు సంబంధిచిన విషయాలలో అపారమైన సాధన సంపత్తి కలిగి ఉండటం సైన్యానికి అన్నిటి కంటే మించిన ప్రధానమైన అంశం. సైన్యానికి హింసకు సంబంధించిన సాధనాలపై గుత్తాధిపత్యం

ఉండటంవల్ల సమాజంలోని ఇతర వర్గాలపై ఆధిపత్యం లభిస్తున్నది. పౌరులు అనేక సందర్భాలలో సైన్యాన్ని చూసి భయపడటం సర్వసాధారణమైన అంశం. చిట్టచివరి ఆయుధంగా, అన్ని ప్రయత్నాలు విఫలమైనప్పుడు శాంతిభద్రతలను కాపాడటానికి, హింసాకాండను అరాజకాన్ని, దౌర్జన్యాలను అరికట్టడానికి సైన్యాన్ని రంగంలోకి దింపుతారు. భారతదేశంలో జమ్మూ-కాశ్మీర్, పంజాబ్, ఈశాన్య భారత రాష్ట్రాలలో దీర్ఘకాలంగా సైన్యం తిష్టవేసుకొని ఉండటాన్ని గమనించ దగిన విషయం. ఆప్రాంతాల్లో శాంతి భద్రతల సమస్య, ఉగ్రవాద కార్యకలాపాల వల్ల ఎంతతీవ్రంగా ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. ఈ వివిధ కారణాలవల్ల సమాజంలో ఇతర వర్గాల కంటే సైన్యానికి ఒక ప్రత్యేక ఉనికి గుర్తింపు, శక్తి ఉన్నాయి.

19.4 సైనిక జోక్యానికి కారణాలు

రాజకీయ రంగంలో సైనిక జోక్యానికి చాలా కారణాలు దోహదపడుతున్నాయి. వాటి స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి. (1) ప్రస్తుత ప్రభుత్వపు చట్టబద్ధత; (2) ప్రస్తుత స్థితిని గురించి సైన్యానికి ఉండే అభిప్రాయం.

మొదటి తరగతికి చెందిన కారణాలు సైన్యాన్ని పౌర పాలనపై తిరుగుబాటు జరిపి, అధికారాన్ని హస్తగతం చేసుకోవటానికి పురిగొల్పుతాయి. రెండవ రకానికి చెందిన కారణాలు సైన్యం ఏ విధంగా పరిస్థితులను చక్కదిద్దటానికి చర్యలను తీసుకొంటుందో సూచిస్తాయి. ఎటువంటి పాలనను ప్రజలకు అందించాలని సైన్యం అనుకొంటుందో గూడా వివరిస్తాయి. అయితే సైనిక జోక్యం విజయవంతం కావాలంటే, జోక్యానికి అవసరమైన పరిస్థితులు దేశంలో నెలకొని ఉండాలి. సైనికజోక్యం విజయవంతం కావటానికి తగిన త్రణాళిక సత్వర చర్యలు సైన్యం తీసుకోగల్గాలి.

సాధారణంగా ఓగ దేశంలో సైన్యం జోక్యానికి ఈ కింది కారణాలు ప్రధానంగా దోహదపడుతాయి.

1. ప్రభుత్వం విశ్వసనీయత తీవ్రంగా సందేహంలో పడ్డప్పుడు
2. ఆంతరంగిక సంక్షోభం తీవ్రమై జాతి, ఉపజాతి, తెగల ఘర్షణలు శాంతి భద్రతలకు తీవ్రమైన అఘాతాన్ని సృష్టించినప్పుడు
3. శాంతి భద్రతలను, ఐక్యతను కాపాడటంలో పౌర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైనప్పుడు
4. రాజకీయ రంగంలో ఏకాభిప్రాయ సాధనలో రాజకీయ వేత్తలు విఫలమై ప్రభుత్వం ఉనికి ప్రశ్నార్థకమైనప్పుడు
5. అవినీతి తీవ్రంగా పెరిగి ప్రభుత్వంపట్ల ప్రజావ్యతిరేక వెల్లువ తారాస్థాయికి చేరుకొన్నప్పుడు
6. ఆర్థిక రంగం సంక్షోభంలో పడ్డప్పుడు.

ఆఫ్రికా ఖండానికి చెందిన చాలా దేశాల్లో రాజకీయాధికారాన్ని నిర్వహించేవారు, ప్రభుత్వాన్ని నడిపేవారు వివిధ తెగలకు చెందిన వారై ఉంటారు. వారి మధ్య అధికారం కోసం, ఆధిక్యతకోసం, జరిగే పోటీల వెనుగులాటలు తీవ్రమైనప్పుడు ఒక తెగ మరో తెగపై పట్టు సంపాదించటానికి సైన్యాన్ని

తమ తరపున జోక్యం చేసుకోమని కోరుతుంటారు. దానిని ఆసరాగా తీసుకొని, సైన్యం రంగ ప్రవేశంచేసి, అధికారాన్ని చేజిక్కించుకొంటుంది. రాజకీయ నాయకులమధ్య స్పర్థలు తీవ్రమైనప్పరుడు కూడా సైనిక జోక్యం అనివార్యమౌతుంది. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లలో గతంలో సైన్యం అధికారంలోకి రావటానికి రాజకీయ నాయకుల స్వార్థం, సంకుచిత స్వభావం, అధికారం కోసం పోటీలు వాస్తవ కారణాలు. ఈ నాటికి పైన వివరించిన దేశాల్లో పౌర ప్రభుత్వం పనిచేస్తున్నప్పటికీ, వాటి మనుగడ సైన్యం మద్దతుపైననే ఆధారపడింది. అలాగే రువాండా, సోమాలియాలలో జాతుల, ఉపజాతుల స్పర్థల కారణంగా వివిధ వర్గాల తరపున సైన్యం రాజకీయ రంగ ప్రవేశం చేసింది.

అదే విధంగా అనేక సందర్భాలలో తిరుగుబాటుకు ముందు కాలంలో దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో మునిగి ఉండటం కూడా చాలాదేశాల అనుభవం మనకు తెలుపుతున్నది. పర్యవసానంలో ప్రజల్లో అసంతృప్తి ప్రబలుతుంది. పరిగెడుతున్న ద్రవ్యోల్బణం సామాన్య ప్రజానీకాన్ని, ప్రభుత్వం పట్ల దాని సామర్థ్యతపట్ల అవిశ్వాసతను పెంచుకొనేటట్లు చేస్తుంది. ఫలితంగా ప్రభుత్వంపట్ల ప్రజల తీవ్రవ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఈ ప్రభుత్వం, ఈ ప్రజాస్వామ్యం మనకు లాభంలేదు, క్రమశిక్షణను నెలకొల్పి శాంతి భద్రతలను సుస్థిర పరచి పౌర జీవనం ప్రశాంతంగా ఉండాలంటే సైనిక పాలనయే మెరుగు అన్న అభిప్రాయం ప్రజల్లో పెరుగుతుంది. పర్యవసానంలో సైన్యం రంగంలో ప్రవేశించి సుల భంగా అధికారాన్ని చేజిక్కించుకొంటుంది. ఉగాండా, ఘనా, పాకిస్తాన్, హైతీ, మైన్మార్ (బర్మా) రువాండా, నికారగువా, సోమాలియాలు సైనిక జోక్యానికి నిరంతరం అంతర్యుద్ధానికి ప్రతీకలుగా ఉన్నాయి. అవినీతి, అసమర్థ పాలనలు సైనిక జోక్యానికి మంచి ఎరువులు, అవి అత్యంత సులభమైన అవకాశాలను కల్పిస్తాయి. రాజకీయ నాయకుల్లో బాహాటంగా కనిపించే విశృంఖలమైన అవినీతి, పగ్గాలు లేని బంధుప్రీతి, అదుపులేని అధికార దుర్వినియోగం సామాన్యుడిని రాజకీయ నాయకత్వంపట్ల జుగుప్స అసహ్యాన్ని కలుగజేస్తున్నాయి. అలాంటి వారిని సకుటుంబంగా నాశనం చేసినా సామాన్య పౌరులు స్పందించటంలేదు. "బంగ్లాబంధు" షేక్ ముజీబుర్ రహ్మాన్‌ను సైన్యంలోని ఒక వర్గం తిరుగుబాటుచేసి సకుటుంబంగా కాల్చివేసినప్పుడు బంగ్లాదేశీయులు పెద్దగా స్పందించలేక పోవటాన్ని గమనించవచ్చు. ఇందుకుకారణం "బంగ్లాబంధు" అధికార దాహం, నిరంకుశత్వం, బంధుప్రీతి, విప రీతమైన లంచగొండితనం ఆదేశప్రజలను ముజీబుర్ రహ్మాన్ నాయకత్వాన్ని ఏవగించుకొనేటట్లు చేసాయి. పౌర ప్రభుత్వం విపరీతంగా అవినీతి అసమర్థతలకు నిలయం కావటంవల్ల ఆదేశాల్లో సైనిక జోక్యం సాధ్యమైంది. పైగా రాజకీయ ప్రతిపక్ష పార్టీలు విభాజితం అయినప్పుడు, అధికార పక్షంలో కుమ్ములాటలు తీవ్రస్థాయికి చేరుకొన్నప్పుడు కూడా సైనిక జోక్యం సునాయాసం అవుతున్నది. ప్రజాస్వామ్య ప్రక్రియ వైఫల్యం సైనికజోక్యానికి చక్కని రాజమార్గమైంది. అనేక వర్ధమాన దేశాల్లో స్వాతంత్ర్యం సంపాదించుకొన్న తరువాత అవి పశ్చిమ దేశాల ఉదారవాద ప్రజాస్వామ్య సంస్థలను రూపొందించుకొన్నాయి. రాజ్యాంగం, చట్టం ఆధిక్యత, పార్లమెంట్, ఎన్నికైన అధ్యక్షుడు, మంత్రి మండలి న్యాయస్థానాలు మొదలైన వన్నీ హఠాత్తుగా ప్రజలకు, నాయకులకు అందుబాటులోకి వచ్చాయి. అయితే అలాంటి ఉదారవాద ప్రజాస్వామ్య సంస్థలకు, అవసరమైన అవగాహన, నిగ్రహం, శిక్షణ, మానసిక ప్రవృత్తి కొరవడినందున ఇటు పాలక వర్గానికి అటు ప్రజలకు వాటితో తగిన అనుభవం లేనందువల్ల అధికారంకోసం, ప్రాబల్యం కోసం, సంపద, పదవులకోసం కీచులాటలు తీవ్రమవటం, తెగ, ఉప తెగల ఘర్షణలు తారాస్థాయికి చేరుకోవటంతో అంతవరకూ పౌరపాలనకు జనసామాన్యానికి

దూరంగా ఉంటున్న సైన్యం రంగప్రవేశంచేసి అధికారాన్ని చేజిక్కించుకొంటున్నది. లాటిన్, అమెరికా, ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని దేశాల అనుభవాలుపై అంశాలను స్పష్టం చేస్తున్నాయి.

19.5 సైనిక జోక్యం సమర్థన

ఒకసారి సైన్యం రాజకీయ రంగ ప్రవేశం చేసి అధికారాన్ని హస్తగతం చేసుకొన్న తరువాత, తమ చర్యను సమర్థించుకోవటానికి సైనికాధికారులు సైపేరాలో వేర్కొన్న కారణాలను తరుచు ప్రస్తావిస్తుంటారు. జాతి ప్రయోజనం కాపాడటానికి, సమైక్యతను పరిరక్షించటానికి, పొరుగు దేశాల దాడులనుండి ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించటానికి తమ జోక్యం తప్పని సరి అయిందని సైనిక వర్గాలు తరచు వాదిస్తుంటాయి. స్వీయ ప్రయోజనాలు దెబ్బ తింటాయని భావించినప్పుడు కొన్ని సందర్భాలలో సైన్యం జోక్యం చేసుకొంటుంది. ప్రభుత్వం దేశరక్షణ వ్యయాన్ని తగ్గించినప్పుడు, లేదా సైన్యాన్ని చిన్నచూపు చూసినప్పుడు, సైన్యం తిరుగుబాటు చేసి అధికారాన్ని చేజిక్కించుకొని, దానిని సమర్థించుకోవటానికి, పొరుగు దేశాల నుంచి ప్రమాదం ఏర్పడిందని, దేశం ప్రమాదంలో చిక్కుకుందని, పౌర ప్రభుత్వం అసమర్థంగా వ్యవహరిస్తుండండటం వల్ల దేశాన్ని రక్షించటానికి అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకోవటం అని వార్యమైందని సైన్యం సమర్థించుకొన్న సందర్భాలు చాలా ఉన్నాయి. పాకిస్తాన్ ఇందుక చాలా చక్కటి ఉదాహరణ. సైన్యం తన సామాజిక వర్గం విలువలను ప్రతిబింబిస్తుంది. ఒక సామాజిక స్థాయినుంచి సైన్యంలో అధిక భాగం భర్తీఅయినప్పుడు దానికి చెందినవారు తమ హోదా పరంగా ఇతరుల కంటే అధికులు మని భావించినప్పుడు, అదే విలువలను ఇతరులపై ఆపాదించటానికి ప్రయత్నిస్తారు. 1971లో పాకిస్తాన్‌లో అంతర్యుద్ధం రావటం, తూర్పుపాకిస్తాన్ బంగ్లాదేశ్‌గా అవతరించటానికి ప్రధాన కారణం పాకిస్తాన్ సైన్యంలో అధికభాగం పఠాన్లు, పంజాబీలు ఉండటమే. వీరి ప్రాబల్యం, దోపిడీ లకు గురైన తూర్పు పాకిస్తాన్ వాసులు, నాయకులు స్వాతంత్ర్యం కోసం ఉద్యమించారు. దానిని సహించలేక పాకిస్తాన్ సైన్యం తూర్పు పాకిస్తాన్ ప్రజలపట్ల దమనకాండను సాగించింది. లక్షలాది స్త్రీలు సామూహిక అత్యాచారాలకు గురయ్యారు. తీవ్ర అంతర్యుద్ధం చివరకు పాకిస్తాన్ విభజనకు దారితీసింది.

19.6 చట్టబద్ధతకు ప్రయత్నాలు

ప్రధానంగా యుద్ధం చేయటానికి, యుద్ధాలలో విజయం పొందటానికి రూపొందిన ఒక పటిష్ట మైన యంత్రాంగమే సైనిక వ్యవస్థ. యుద్ధాలు చేయటమేదాని ప్రధాన లక్షణంకాని దేశ పాలనను నిర్వహించటంకాదు. అందువల్ల సైన్యం అధికారాన్ని చేజిక్కించుకోగానే తన ఆధిపత్యానికి - ప్రభుత్వానికి - చట్టబద్ధతను సంతరించుకోవటానికి ప్రయత్నిస్తుంది. అందుకుగాను అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంది. విధాన ప్రకటనలు చేస్తుంది. అవసరమైన రాజకీయ సిద్ధాంతాన్ని రూపొందించుకొంటుంది. పదవీచ్యుతులైన రాజకీయ నాయకులపై అవినీతి, ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి, అధికార దుర్వినియోగం మొదలైన ఆరోపణలతో బహిరంగ విచారణలు జరిపిస్తుంది. వారికి తీవ్ర శిక్షలను కొన్ని సందర్భాలలో మరణశిక్షకు గురిచేస్తుంది. అయినా చాలా తక్కువ సందర్భాలలో సైన్యం తనకుచట్ట బద్ధతను పొందే విషయంలో విజయం సాధించుకోగల్గుతుంది. సైనిక పాలనలో చాలా వరకు అంతకు

పూర్వం అధికారంలో ఉన్న రాజకీయ నాయకులపై అవినీతి ఆరోపణలు, అధికార దుర్వినియోగం, ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి, అక్రమ ధనార్జన మొదలైన నేరారోపణలు చేసి ప్రజల దృష్టిలో వారిని అతినీచంగా చిత్రించటానికి సైన్యం ప్రయత్నిస్తుంది. 1975లో "బంగ్లాబంధు" ముజీబుర్ రహ్మాన్‌ను సకుటుంబంగా హత్యచేసిన సైనిక వర్గం ఆయనపై పైన పేర్కొన్న నేరారోపణలను చేసింది. వాటిని కారణాలుగా చూపి తమ తిరుగుబాటును, అధికారం కైవసం చేసుకోవటాన్ని సైనికాధికార వర్గం సమర్థించుకొంది.

సైన్యం అధికారం స్వీకరిస్తూనే తమ జోక్యం తాత్కాలికమని, సాధారణ పరిస్థితులు నెలకొన్న వెంటనే ప్రజాస్వామ్య ప్రక్రియను పునరుద్ధరిస్తామని, దేశంలో ఎన్నికలు నిర్వహిస్తామని, రాజకీయ నాయకులకు అధికారాన్ని తిరిగి అప్పచెబుతామని తిరిగి తమ ఏకాంత జీవితానికి వెళ్ళిపోతామని సైన్యం చెబుతుంది. అయితే వందలో తొంభై తొమ్మిది సందర్భాలలో ఇది జరగదు. కాగా సైన్యం అధికారంలో నిరంతరం కొనసాగటానికి, సైనిక నియంతృత్వాన్ని సమర్థించుకోవటానికి రాజకీయ నాయకులను నిర్బంధంలో ఉంచటం, దేశం నుంచి వారిని బహిష్కరించటం, అవసరం అనుకుంటే తమ అధికారాన్ని సమర్థించే రాజకీయ పార్టీని స్థాపించటం, మరికొన్ని సందర్భాలలో మత మౌఢ్యాన్ని సమర్థించి ప్రోత్సహించటం, సర్వసామాన్యమైన విషయాలే. బంగ్లాదేశ్‌లో జనరల్ ఎర్షాద్, పాకిస్తాన్‌లో జియాఉల్‌హక్ పై విధంగా వ్యవహరించి నటువంటి వారే. సైనిక పాలకులు ఎన్నికలను కూడా జరిపిస్తారు. అయితే అనేక సందర్భాలలో అలాంటి ఎన్నికలు చాలా నిర్బంధాలతో కూడుకొని ఉంటాయి. అధికార పక్షం, 90 శాతం, ఓట్లను, సీట్లను గెలుస్తుంది. ప్రతిపక్ష పార్టీలను నిషేధించటం, ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటం తరచుగా జరిగే విషయాలే. ఈ ఎన్నికలను కూడా కేవలం చట్టబద్దతను సంతరంచుకోవటానికే సైన్యం ఉపయోగించుకొంటుంది.

19.7 సైనిక పాలన పనితీరు

సైనిక ప్రభుత్వాలు ఏ విధంగా పనిచేస్తాయి? సమర్థవంతంగా తమ లక్ష్యాలను సాధిస్తాయా? మొదలైన ప్రశ్నలను చర్చించటానికి రెండురకాల దృక్పథాలు మనకు గోచరిస్తాయి. సైన్యం నుషిక్షితమైన వ్యవస్థ. సుదీర్ఘకాలం శిక్షణ పొంది ఉండటంవల్ల దాని అధికారులు వివిధ రంగాల్లో ప్రత్యేక నైపుణ్యం సంతరించుకోవటం వల్ల సైనిక పాలన సమర్థవంతంగా ఉంటుందని భావించే వారుకూడా ఉన్నారు. సామ్యూల్ హంటింగ్‌టన్ మాటల్లో ప్రారంభదశలో సైనిక పాలన అత్యంత సమర్థవంతంగా కనిపిస్తుంది. సైనిక నాయకులు ఆధునిక అభివృద్ధి కాముక దృక్పథం ఉన్నట్లుగా కనిపిస్తారు. వారు అసమర్థతను, అవినీతిని, సంపద దృక్పథాన్ని ఖండిస్తారు. అయితే దీర్ఘకాలంలో సైనిక ప్రభుత్వాలు కూడా ఇతర పౌర ప్రభుత్వాల వలె దిగ జారి పోతాయి. సైన్యం ప్రధానంగా యుద్ధం లక్ష్యంగా కలది. పరిపాలన దాని ప్రత్యేక లక్షణంకాదు. ప్రజా సంబంధాలు అతి తక్కువగా ఉండటంవల్ల సాధారణ సమస్యలను పరిష్కరించటంలో అవసరమైన నేర్పు, ఓర్పు సైన్యానికి ఉండవు. అంతేకాకుండా ఒకసారి అధికారాన్ని రుచిచూచిన తరువాత సైన్యం కూడా సాధారణ రాజకీయ నాయకులవలె కాలక్రమంలో అవలక్షణాలకు గురౌతాయి. అధికారంలోకి రావటంతో కొత్త అయినప్పటికీ సైనిక పాలకులు గుడా రాజకీయానక్తులను పెంచుకొంటారు. అయితే వారికి రాజకీయ అవగాహన తక్కువగా ఉండటంవల్ల ప్రజాసమస్యలపట్ల

వారికి దృక్పథం ఉండదు. సైన్యానికి అధికారంలోకి రావటం సులభమేగాని పరిపాలన చేయటం కష్టం. అంతేగాకుండా అధికారాన్ని అంటి పెట్టుకొని ఉండటానికి సైన్యానికి నైతిక హక్కు లేదు.

— డా. రవీంద్ర శాస్త్రి

19.8 చదువదగిన పుస్తకాలు

Johnson J. : The Role of Military in under - developed Countries

Almond GA. : The Polities of the Developing Areas

Huntington S.P. : Changing Patterns of Military Politics.

Alfred Stepon : The Military in politics

Finer S. : The man on Horseback: The Role of Military

19.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. వర్తమాన దేశాలలో సైనిక జోక్యానికి కారణాలను వివరింపుము.
2. సైనిక జోక్యానికి చట్టబద్దత పొందేటందుకు చేసే ప్రయత్నాలను చర్చింపుము.
3. సైనిక జోక్యాన్ని ఎలా సమర్థిస్తావు?

* * * * *

భాగం-20 : శాసన వర్గాలు

విషయక్రమం

20.1 లక్ష్యాలు

20.2 పరిచయం

20.3 శాసన నిర్మాణ శాఖ మూలం

20.4 శాసన నిర్మాణ శాఖ విధులు, నిర్మితి

20.5 శాసన సభ్యుల కర్తవ్య నిర్వహణ ప్రేరణాంశాలు

20.6 శాసన నిర్మాణ శాఖలు క్షీణత

20.7 ద్విసభా పద్ధతి

20.8 ద్విసభా పద్ధతి : పెరుగుతున్న గుర్తింపు

20.9 శాసన నిర్మాణ శాఖ, కార్యనిర్వాహక వర్గం సంబంధాలు

20.10 శాసనసభల గురించి అధ్యయనం

201.11 చదువదగిన పుస్తకాలు

20.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

20.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- శాసన నిర్మాణశాఖ మూలం
- నిర్మితి, విధులు, ప్రేరణాంశాలు
- క్షీణత, ద్విసభా పద్ధతి, కార్య
- నిర్వాహక వర్గంతో సంబంధాలు బాగా వివరించగలుగుతారు

20.2 పరిచయం

రాజకీయ వ్యవస్థ నిర్వహించే ఉత్పాదిత విధులలో నియమావళి రూపొందించడం (Rule Making) ఒకటి. ఈ విధి నిర్వహణ నిర్మితే శాసన నిర్మాణశాఖ. ఈ శాఖకు ఆధునిక కాలంలో లభించిన

ప్రాధాన్యాన్ని బట్టి జాన్ స్టూవర్ట్ మిల్ (John Stuart Mill) దీనిని grand inquest of the Nation అంటాడు. జాతికి దర్పణం (Mirror of the nation) అని, సమాజంలోని వ్యక్తుల అభిమతానికి మూర్తి అని (embodiment of the will of the Community) ప్రజల బాధలు నివారించడానికి ప్రయత్నించే సంఘం అని (Committee of Grievances) వివిధ రకాలుగా ఈ ప్రభుత్వ శాఖను రాజనీతి శాస్త్రజ్ఞులు వర్ణించారు. శాసన నిర్మాణం, నియమావళి రూపకల్పన శాసన నిర్మాణ శాఖ ప్రధాన కర్తవ్యాలు. అయితే ఆధునిక కాలంలో శాసన నిర్మాణ భారం అధికం కావడం వలన, శాసన నిర్మాణంతోబాటు మరికొన్ని కర్తవ్యాలు ఈ శాఖ నిర్వహించవలసి రావడం వలన, శాసన నిర్మాణ, శాసన నియమావళి రూపకల్పనలో సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేకీకతలర అవసరం పెరగడం వలన స్థూలంగా శాసన నిర్మాణం ఈ శాఖ చేయడం నియమనిబంధనలు రూపొందించే బాధ్యతను కార్యనిర్వాహక వర్గం తీసుకోవడం జరుగుతోంది.

20.3 శాసన నిర్మాణశాఖ - మూలం

శాసన నిర్మాణశాఖ ముఖ్యవిధి శాసన నిర్మాణం అని తెలుసుకున్నాం. Legis అనే ఆంగ్ల పదానికి మూలం శాసనం అని అర్థమిచ్చే Lex. ఇక Lator అంటే ప్రతిపాదకుడు లేదా వాహకుడు. అంటే శాసన సభ్యుడు, శాసన ప్రతిపాదకుడు లేదా వాహకుడు.

శాసన నిర్మాణశాఖ అవతరణ విషయానికి వస్తే 13వ శతాబ్దంలో ఇంగ్లండులో ఇది ఆవిర్భవించింది. పార్లమెంటు, కాంగ్రెస్, డయెట్ (Diet) మొదలైన వివిధ పేర్లతో ఈ శాఖ పిలువబడుతూ వచ్చింది. సంభాషించడం Talk అని అర్థమిచ్చే Parler అనే ఫ్రెంచి పదం నుంచి పార్లమెంటు (Parliament) అనే ఆంగ్ల పదం వచ్చింది. లాటిన్‌లో ఇదే అర్థం ఇచ్చే పదాన్ని Parliamentum అంటారు. ఆధునిక కాలంలో ఒక ప్రత్యేకమైన ప్రభుత్వ శాఖగా శాసన నిర్మాణశాఖ అవతరించింది.

20.4 శాసన నిర్మాణశాఖ - విధులు, నిర్మితి

శాసన నిర్మాణశాఖ నిర్వహించే విధులు హోదా, ప్రాముఖ్య వ్యవస్థ స్వరూపాన్ని బట్టి నిర్ధారితమై ఉంటాయి. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఈ శాఖకు సార్వభౌమాధికారం (Soverignity) ఉంటే స్పెయిన్‌లో శాసననిర్మాణ శాఖగా వ్యవహరించే కోర్టెస్ (Cortes) కు సార్వభౌమాధికారం లేదు. అంతేకాకుండా దీన్ని ఒక అధికార విహీనమైన సంస్థగా పరిగణించడం జరుగుతోంది. ఇక అమెరికాలో జాతీయ స్థాయిలో శాసన నిర్మాణ శాఖగా వ్యవహరించే కాంగ్రెస్‌కు సార్వభౌమాధికారం లేక పోయినా ఒక ప్రాబల్య సంస్థగా ఇది పనిచేస్తుంది.

మొదట్లో శాసన నిర్మాణ శాఖలు అప్పుడప్పుడు ఏర్పడేవి. అంటే ముఖ్యమైన నిర్ణయాలు చేయాల్సి వచ్చినప్పుడు ఉదాహరణకు, యుద్ధ ప్రకటన, పన్నులు విధించడం వంటి నిర్ణయాలు చేయాల్సినప్పుడు తమకు మద్దతుకోసం దేశాధిపతులు కులీనులతో కూడిన సభలను ఏర్పాటుచేసి వారి అభిప్రాయాలను స్వీకరించేవారు. క్రమంగా ఇవి అప్పుడప్పుడు కాకుండా క్రమాను గతంగా (reguler) ఏర్పడుతూవచ్చాయి. మొదట్లో ఐరోపాఖండంలో ఏర్పడిన ఈ శాఖలు ఉత్తర అమెరికాలో, తరవాత

ఇతర ప్రాంతాలలో స్థాపితమయ్యాయి. క్రమంగా ఇవి ప్రజా ప్రతినిధుల సంస్థలుగా రూపొందాయి. అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో కాలనీలలోని శాసన నిర్మాణ శాఖలు చెప్పుకోదగ్గ పాత్ర వహించాయి. స్వాతంత్ర్య సముపార్జన అనంతరం జాతీయస్థాయిలోను, రాష్ట్రాలలోను ఏర్పడిన శాసనసభలకు స్వాతంత్ర్య పోరాట కాలంలో పనిచేసిన శాసనసభలు నమూనాలు, మార్గదర్శకాలు అయ్యాయి. వలసపాలన కాలంలో వలసలలోని ప్రజల అనుభవాలు, అధికారాలవేర్పాటు సూత్రం (Principle of Seperation Powers) ప్రాతిపదికగా ప్రభుత్వనిర్మాణం చేసుకోవలసిన అవసరాన్ని తెలియజేశాయి. దీనివల్లనే అమెరికా రాజ్యాంగంలో కార్యనిర్వాహక వర్గం నుంచి శాసననిర్మాణ శాఖను వేరుచేసే విధంగా తగిన అంశాలు చేర్చడం జరిగింది. తరవాతి కాలంలో ఇదే సూత్రాన్ని లాటిన్ అమెరికా దేశాలు అనుసరించాయి. రెండో ప్రపంచ యుద్ధానంతరం స్వతంత్ర దేశాలుగా అవతరించిన రాజ్యాలు కూడా ఈ విధమైన ఏర్పాటు పట్ల ఉత్సాహం కనబరిచాయి.

19వ శతాబ్దంలో ఐరోపాఖండంలోని దేశాలలో బెల్జియం, స్విట్జర్‌లాండ్, ఇటలీ, జర్మనీ వంటి దేశాలలో జాతీయ స్వాతంత్ర్యానికి ప్రధాన సంకేతంగా శాసన నిర్మాణశాఖ గుర్తింపు పొందింది. ఉదార ప్రజాస్వామ్య సాధనంగా రూపొందింది. శాసన నిర్మాణ శాఖకు కార్య నిర్వాహక వర్గం బాధ్యత వహించాల్సిన అవసరాన్ని ఉదార రాజకీయ నాయకులు గుర్తించి అంగీకరించారు. ప్రజావసరాలకు, ప్రజాభిప్రాయానికి రాజరికం ప్రతిస్పందించాల్సిన విధిని, అంతేకాకుండా కార్య నిర్వాహక వర్గం శాసన నిర్మాణ శాఖకు బాధ్యత వహించాల్సిన కర్తవ్యాన్ని విశదీకరించారు. అమలు పరచడం ప్రారంభించారు. ఇటువంటి ప్రయత్నాల ఫలితంగా ఎంతకాలమైతే పార్లమెంటు విశ్వాసం పొందగలదో అంతకాలం మాత్రమే కార్యనిర్వాహక వర్గం పదవిలో కొనసాగ గలదనే సూత్రం గుర్తింపు పొందడమేకాకుండా దాన్ని అమలు చేయడం కూడా జరిగింది. దీనితో రాజకీయ వ్యవస్థలో శాసన నిర్మాణశాఖ ఒక ప్రధాన కేంద్రమైంది.

రాజకీయపార్టీల ఆవిర్భావం, అవి ఎన్నికలలో పోటీచేసి ప్రజాప్రతినిధులను శాసన సభకు పంపడం మొదలైన సంఘటనల ఫలితంగా శాసన సభల నిర్మాణం, స్వరూపం, కర్తవ్యాలలో కొన్ని మార్పులు సంభవించాయి. శాసన సభల విశ్వాసం పొందడంలో మంత్రులశక్తి, వారికి పార్టీలో ఉండే స్థానంపై ఆధారపడటం మొదలైంది. ద్వి పార్టీ వ్యవస్థ (Two party System) ఉన్న దేశాలలో మంత్రులు పార్లమెంట్ ఆధిపత్యం చెలాయించే అవకాశమేర్పడింది. బలహీనమైన అనేక రాజకీయ పార్టీలున్న వ్యవస్థలల్లో ప్రపంచ యుద్ధాలకు పూర్వం ఫ్రాన్స్, జర్మనీలలో కార్య నిర్వాహక వర్గం శాసన సభపై అధికంగా ఆధారపడవలసి వచ్చింది. దీనిని బట్టి పార్టీ వ్యవస్థలో వచ్చే మార్పుల ప్రభావం కార్య నిర్వాహక వర్గం, శాసన నిర్మాణశాఖల మధ్య సంబంధాలపై ఉంటుందని చెప్పాలి. ఫ్రాన్స్‌లో 3,4 వ రిపబ్లిక్‌ల కాలంలో శాసన నిర్మాణ శాఖ ప్రాబల్యం అధికంగా ఉండేది. అయితే పార్టీ వ్యవస్థలో వచ్చిన మార్పు ఫలితంగా 5వ రిపబ్లిక్ కాలంలో శాసన నిర్మాణశాఖ ఆధిపత్యం తగ్గింది. ప్రపంచ యుద్ధాల ముందు కాలంతో పోల్చినట్లయితే తరవాతి కాలంలో జర్మనీలో శాసన నిర్మాణశాఖ స్థానంలో గణనీయమైన మార్పు వచ్చింది.

పార్టీ వ్యవస్థతోబాటు శాసన నిర్మాణశాఖ నిర్మాణం, అది నిర్వహించే విధులపై దానికి ప్రభావం ఉంటుంది. రెండు సభలున్న శాసన నిర్మాణ శాఖకు జాగ్రత్తగా శాసన నిర్మాణం చేసే అవకాశం ఉంటుంది. అయితే రెండో సభ ఉండటం జాప్యానికి కూడా దారితీయవచ్చు. ఉత్తర అమెరికా, ఐరోపా ఖండాలలో శాసన నిర్మాణశాఖ నిర్మాణం (Composition) పై సాంఘిక మార్పు ప్రభావం కనిపిస్తుంది. మొదట్లో వీటిలో భూస్వాములు, కులీనులు, ప్రముఖ పౌరులు సభ్యులుగా ఉండేవారు. అయితే క్రమంగా ఎన్నికల ద్వారా శాసన సభ్యులను నిర్ణయించడం అభివృద్ధి చెందింది. 19వ శతాబ్దంలో ఓటు హక్కు విస్తరించడంతో విస్తృత ప్రాతిపదికపై శాసన నిర్మాణ శాఖలను రూపొందించడం ప్రారంభమైంది.

శాసన నిర్మాణశాఖ కర్తవ్య నిర్వహణ అందులోని సభ్యుల వృత్తిపై కొంతవరకు ఆధారపడి ఉంటుంది. అమెరికాలో శాసన సభలలో అధిక శాతం న్యాయవాదులు, వ్యవసాయదారులకు, మైనారిటీలకు, స్త్రీలకు, నల్లజాతివారికి, గ్రామీణ ప్రాంతాలకు తగినంత ప్రాతినిధ్యం వీటిలో లేకపోవడంవల్ల ఈ దేశంలో శాసనసభలు నిజమైన ప్రజాప్రతినిధుల సభలుకాదని (Misrepresentation Houses) అనే విమర్శ ఒకటి ఉంది. భారతదేశంలో శాసన సభ్యులలో అధిక శాతం వ్యవసాయదారులు, వ్యాపారులు కొన్ని వర్గాలకు ప్రాతినిధ్యం విషయంలో హామీ సమకూర్చడం కోసం రిజర్వేషన్ పద్ధతి అమలులో ఉంది. అమెరికాతో పోల్చిచూస్తే ఐరోపాదేశాలలోని శాసన సభలలో వివిధ వృత్తులకు చెందిన ప్రతినిధుల విషయంలో తేడా కనిపిస్తుంది. ఈ దేశాలలో శాసన నిర్మాణ శాఖలలో కార్మిక వర్గాల ప్రతినిధులు కూడా తగిన సంఖ్యలో ఉంటారు. కమ్యూనిస్టు దేశాలలో శాసన నిర్మాణశాఖ స్వరూపం ఎలాగుండాలన్నది పార్టీ నిర్ణయిస్తుంది. అంటే వివిధ వృత్తులకు, ప్రాంతాలకు, జాతులకు ప్రాతినిధ్యం లభించే విధంగా అభ్యర్థులను నిర్ణయిస్తుంది. పాలకవర్గం అస్థిత్వానికి న్యాయబద్ధత సమకూర్చడానికి తోడ్పడే విధంగా శాసననిర్మాణ శాఖ స్వరూపాన్ని తీర్చి దిద్దుతుంది.

సాధారణంగా శాసన నిర్మాణశాఖ 4 లేదా 5 సంవత్సరాల కాలానికి ఎన్నుకోవడమవుతుంది. రెండు పార్టీలున్న, తక్కువ పార్టీలున్న వ్యవస్థలలో కంటే పోటీ తీవ్రత బహుపార్టీ వ్యవస్థలలో ఎక్కువగా ఉంటుందని చెప్పవచ్చు. అయితే బహుపార్టీ వ్యవస్థలలో కూడా ప్రధానంగా రెండు పార్టీలుంటూ మిగిలిన పార్టీలు వీటితో ఏదో ఒక పార్టీకి మద్దతు సమకూరుస్తూ, లేదా పరిభ్రమిస్తూ ఉన్నప్పుడు పోటీ తీవ్రత రెండు పార్టీల మధ్యనే ఉంటుంది.

సిద్ధాంత పరంగా చెప్పాలంటే శాసన నిర్మాణశాఖలో సభ్యులందరికీ సమాన హోదా ఉంటుంది. అయితే వారివారి శక్తియుక్తులు, ఇతర సభ్యులమద్దతు, స్థానిక మొదలైన విషయాలు ప్రభావం కూడా వారి హోదాపై ఉంటుంది.

పైన వివరించిన విషయాలు శాసన నిర్మాణ శాఖల నిర్మాణానికి సంబంధించినవి. ఇక వీటి కర్తవ్యాలను గురించి తెలుసుకొందాం. శాసనాలు రూపొందించడం, పరిపాలనా నిర్వహణకు అవసరమైన నిధులు సమకూరే విధానాలు నిర్ణయించడం, శాసనాలకు తగిన సవరణలు చేయడం, పునరీక్షణ జరపడం (revision) అవసరంలేని శాసనాలను రద్దుపరచడం శాసనసభలు నిర్వహించే ముఖ్య విధులు. అయితే ఆధునిక కాలంలో శాసన నిర్మాణశాఖ విధులు పెరిగాయి. వీటిని కింది విధంగా వివరించవచ్చు.

1. శాసన నిర్మాణశాఖ దేశాధిపతిని ఎన్నుకొంటుంది. వీటితోబాటుగా దేశాధిపతి ఎన్నికకు సంబంధించిన లేదా నియామకానికి సంబంధించిన చట్టాలను మార్చే అధికారం ఉంటుంది. ఉదాహరణకు బ్రిటీష్ పార్లమెంట్ దేశాధిపతిని పదవీచ్యుతుణ్ణి చేయడానికి సంబంధించి చట్టం రూపొందించవచ్చు. వారసత్వ చట్టాన్ని రూపొందించవచ్చు. భారత పార్లమెంటులోని ఉభయసభ సభ్యులు, రాష్ట్ర శాసనసభలోని దిగువ సభల సభ్యులు దేశాధిపతిని ఎన్నుకొంటారు. అమెరికా అధ్యక్ష పదవికి పోటీచేసిన అభ్యర్థులలో ఏ ఒక్కరికీ తగిన మెజారిటీ లభించక పోతే ప్రతినిధుల సభకు అధ్యక్షుణ్ణి నిర్ణయించే అధికారం ఉంటుంది. అభిశంసన (impeachment) ద్వారా దేశాధ్యక్షుణ్ణి అమెరికా, భారతదేశాలలో శాసనసభలు తొలగించవచ్చు. కెనడా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ దేశాలలో శాసనసభలు అధ్యక్షపదవులకు కొన్ని పేర్లు సూచిస్తే వారిలో ఒకరిని దేశాధిపతిగా - అంటే గవర్నర్ జనరల్‌గా ఇంగ్లండ్‌లో సార్వభౌముడు నిర్ణయిస్తారు.

2. శాసన నిర్మాణశాఖ చర్చా సంబంధమైన కర్తవ్యాలు నిర్వహిస్తుంది. ఆధునిక రాజ్యాలు సంక్షేమ రాజ్యాలు. సాధ్యమైనంత ఎక్కువమేరకు, ప్రజలందరి శ్రేయస్సు పెంపొందించడం వీటి లక్ష్యం. లక్ష్యసాధనకు ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానంగాని, ఇతర విధానాలను గాని నిర్ణయించి ప్రజా శ్రేయస్సును సవివరంగా చర్చించి సముచిత నిర్ణయాలు తీసుకొంటాయి. నిజమైన ప్రాతినిధ్య సంస్థలుగా పనిచేసే శాసన నిర్మాణ శాఖలున్న దేశాలలో ప్రజాసమస్యలపై చర్చ జరపడానికి శాసననిర్మాణ శాఖను మించిన వేదిక (platform) మరొకటిలేదని చెప్పవచ్చు. ఇందులో వివిధ వర్గాలకు, ప్రయోజనాలకు ప్రతినిధులుంటారు. సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను తెలపడానికి వీరు ప్రయత్నిస్తారు. ప్రజా వసరాలనన్నిటిని గ్రహించి, చర్చించి, ప్రాధాన్యక్రమాలను (Priorities) నిర్ణయించి పరిమిత నిధులను సాధ్యమైనంత ప్రయోజనకరంగా వినియోగించేవిధంగా తగిన నిర్ణయాలు ఒకే వేదికపై తీసుకోడానికి శాసననిర్మాణశాఖలు దోహదం చేస్తాయి. ఇంకో విధంగా చెప్పాలంటే బహుజన సమ్మతి పొందిన నిర్ణయాలు తీసుకోవడానికి తోడ్పడతాయి.

3. దేశాధిపతి నిర్ణయంలోనే కాకుండా తమ సభాపతులు ఎవరుండాలో నిర్ణయించుకొనే అధికారం కూడా శాసన నిర్మాణ శాఖకు ఉంటుంది. వారిని పదవినుంచి తొలగించే అధికారం కూడా దీని కుంటుంది. ఉదాహరణకు, ఇంగ్లండ్‌లో హౌస్ ఆఫ్ కామన్స్ సభాపతిని (Speaker) ఎన్నుకొంటుంది. ఒకసారి సభాపతిగా ఎన్నుకోబడ్డ వ్యక్తిని తరవాత ఎన్నికల అనంతరం కూడా ఎన్నుకోవడమనే సంప్రదాయం ఈ దేశంలో ఉంది. భారతదేశంలో పార్లమెంట్‌లోని దిగువసభ అయిన లోక్‌సభలోని సభ్యులు తమ సభాపతిని ఎన్నుకొంటారు. ఈ రెండు దేశాలలో ఉన్న ఒక తేడా ఏమంటే బ్రిటన్ సభాపతి ఎన్నిక అనంతరం, ఎన్నుకోబడిన వ్యక్తి తన పార్టీ సభ్యత్వానికి రాజీనామాచేస్తారు. సభాపతి నిష్పాక్షికంగా వ్యవహరించడానికి ఇలా చేయడం అవసరం అన్న భావన దీనికి కారణం. కాని భారతదేశంలో సభాపతిగా ఎన్నికైన వ్యక్తి పార్టీ సభ్యత్వం నుంచి వైదొలగనవసరంలేదు. తరవాతి ఎన్నికలలో కూడా పార్టీ అభ్యర్థిగా పోటీచేయవచ్చు. సభాపతుల ఎన్నికలోనే కాకుండా ఉపసభాపతుల ఎన్నికలలో కూడా శాసనసభల సభ్యులు పాల్గొంటారు. సభాపతులను, సాధారణ సభ్యులను చెడు ప్రవర్తన (misbehaviour) ప్రాతిపదికపై పదవినుంచి తప్పించే అధికారం కూడా శాసనసభల కుంటాయి.

4. శాసన నిర్మాణశాఖలు ఆర్థిక సంబంధమైన కర్తవ్యాలు నిర్వహిస్తాయి. దేశ ఆదాయ వ్యయాలను నిర్ణయిస్తాయి. ఆదాయ వ్యయాలను తెలిపే పట్టికనే బడ్జెట్ (Budget) అంటారు. 19వ శతాబ్దం మొదట్లో యూరప్‌లో బడ్జెట్ తయారీ ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వ విధాన నిర్ణయంలోను, విధి నిర్వహణలోను బడ్జెట్‌కు కీలకమైన స్థానముంది. ప్రజాస్వామ్య దేశాలలో, ఇతర దేశాలలో కూడా శాసన నిర్మాణశాఖ ఆమోదం లేనిదే చేసిన ఖర్చు చట్టబద్ధమైందికాదు. శాసన సభలు బడ్జెట్ పై జరిగే చర్చాకాలంలో సుదీర్ఘమైన చర్చలు జరుపుతాయి. పరిపాలన శాఖలకు కేటా యించాల్సిన మొత్తాలను నిర్ణయిస్తాయి. శాసననిర్మాణ శాఖకు అనుబంధంగా పనిచేసే కార్యాలయాలు బడ్జెట్ తయారుచేయడంలో చెప్పుకోదగ్గ ప్రాతినిధ్యం వహిస్తాయి. వివిధ పరిపాలన శాఖలు తయారు చేసిన అంచనాలు ఆర్థిక శాఖకు పంపుతారు. ఇక్కడ బడ్జెట్ ప్రతిపాదనలు తుదిరూపం దిద్దుకొంటాయి. తరవాత శాసన నిర్మాణ శాఖలలో జరిగే చర్చలలో సభ్యులు కోత తీర్మానాలు (Cut motions) ప్రతిపాదించవచ్చు. తగిన సవరణలు సూచించవచ్చు. ఈ శాఖ ఆమోదం పొందిన మీదట మాత్రమే ప్రభుత్వశాఖలు పరిపాలన నిర్వహణకయ్యే కర్చు ప్రారంభించవలసి ఉంటుంది.

5. శాసన నిర్మాణశాఖకు రాజ్యాంగ సంబంధమైన కర్తవ్యాలుంటాయి. (Constitutional Functions). ఆధునిక కాలంలో ప్రతిరాజ్యానికి లిఖిత రాజ్యాంగం ఉంటున్నది. రాజ్యాంగ సవరణాధికారం శాసన నిర్మాణ శాఖకు ఉంటుంది. అయితే ఎంతవరకూ ఏవిధంగా రాజ్యాంగ సవరణ చేయాలనే విషయం రాజ్యాంగంలో పొందుపరచి ఉంటుంది. రాజ్యాంగ చట్టాన్ని లేదా చట్టంలోని భాగాన్ని తొలగించడానికి, మార్పు చేయడానికి, పునరీక్షణ చేయడానికి సంబంధించిన శాసన నిర్మాణశాఖ చర్యనే రాజ్యాంగ సవరణ అంటారు. సవరణ విధానంలో రాజ్యాంగంలో తగిన మార్పులు ఏర్పడతాయి. అమెరికా రాజ్యాంగంలో 5వ ప్రకరణం రాజ్యాంగ సవరణవిధానాన్ని సూచిస్తుంది. దీని ప్రకారం అమెరికా కాంగ్రెస్‌కాని, రాష్ట్ర శాసనసభలలో 2/3 వంతుకానీ సవరణ ప్రతిపాదనలు చేయవచ్చు. కాలానుగుణంగా రాజ్యాంగానికి తగిన మార్పులు అవసరమవుతా యని, ఎంత జాగ్రత్తగా తయారుచేసిన రాజ్యాంగమైనప్పటికీ కాలమాన పరిస్థితులనుబట్టి సవరణకు అవకాశం ఉండాలని భావించడమే రాజ్యాంగ సవరణ అవకాశం కల్పించడానికి కారణం. ఈ భావన సమంజసమైనదీ ప్రయోజనకరమైందికూడా. బలప్రయోగానికి అవకాశమివ్వకుండా సహజ విధానంలో రాజ్యాంగంలో తగిన మార్పులు చేయడానికి రాజ్యాంగ సవరణ విధానం ముందుగా నిర్ణయించడంవల్ల అవకాశం కలుగుతుంది. అమెరికా రాజ్యాంగ సవరణ విధానం దృఢమైంది (rigid). భారత దేశంలో రాజ్యాంగంలోని కొన్ని విషయాలు (ఉదాహరణకు కొత్త రాష్ట్రాలు ఏర్పరచడం) సాధారణ మెజారిటీతో సవరణ చేయవచ్చు. కొన్ని విషయాలలో పార్లమెంట్‌లో 2/3 మెజారిటీ అవసరం. అధ్యక్షుని ఎన్నిక విధానం, కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాలపంపిణీ మొదలైన విషయాలకు సంబంధించిన రాజ్యాంగాంశాలను సవరించడానికి పార్లమెంటులో 2/3 మెజారిటీతోబాటు సగానికి పైగా రాష్ట్ర శాసన సభల ఆమోదం కావాలి. రాజ్యాంగం మూల నిర్మాణాన్ని మార్చే అధికారం పార్లమెంటుకుగాని, రాష్ట్ర శాసనసభలకుగాని లేదని భావర సుప్రీంకోర్టు తెలిపినా రాజ్యాంగ సవరణ విషయంలో కేంద్ర శాసన నిర్మాణశాఖ ఆచరణలో విస్తృతమైన అధికారం వినియోగిస్తున్నదని చెప్పవచ్చు. బ్రిటన్‌లో సాధారణ శాసనం సవరించే

పద్ధతికి రాజ్యాంగ శాసనం సవరించే పద్ధతికి తేడాలేదు. అంటే రాజ్యాంగ సవరణ విధానం సులభమని చెప్పాలి. ఏదేశ శాసన నిర్మాణశాఖకైనా సరే రాజ్యాంగ సవరణ అధికారం ఉంటుంది.

6. కార్యనిర్వాహక వర్గంపై నియంత్రణాధికారం శాసన నిర్మాణశాఖకుంటుంది. ఈ అధికారాన్ని వివిధ దేశాలలోని రాజ్యాంగాలు నిర్ణయిస్తాయి. జాన్ స్టూవర్ట్ మిల్ (John Stuart Mill) అభిప్రాయంలో ప్రభుత్వాన్ని నియంత్రణ చేయడం, ప్రభుత్వంపై నిఘాపేసి ఉండటం ప్రాతినిధ్య సభల సరిఅయిన విధి. ప్రభుత్వ చర్యలను బహిరంగ పరచడం, గర్హించగదిన చర్యలను అభిశంశించడం (Censure) విద్యుక్త ధర్మాన్ని నిర్వహించని వారిని, జాతి శ్రేయస్సుకు వ్యతిరేకంగా ప్రభావంచూపే చర్యలకు పాల్పడేవారిని పదవీచ్యుతులను చేయడం, ఆపదవులకు తగినవారిని నియమించడం కూడా శాసన నిర్మాణశాఖ విధులు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యాలలో శాసన నిర్మాణ శాఖకు, కార్యనిర్వాహక వర్గం బాధ్యత వహించి ఉండటం అతిముఖ్య లక్షణం. ఈ రకమైన వ్యవస్థలలో ప్రశ్నలు, కోత తీర్మానాలు మొదలైన సాధనాల ద్వారా శాసన నిర్మాణశాఖ కార్యనిర్వాహక వర్గాన్ని నియంత్రిస్తుంది. బలమైన, సమర్థమైన శాసన నిర్మాణశాఖనుంచి తరుచుగా సవాళ్ళను ఎదుర్కోవలసి వస్తుంది. పైన వివరించిన సాధనాల ద్వారానే కాకుండా శాసన సభ్యులు సభలోని వెనక బెంచీల సభ్యుల ద్వారా కూడా కార్యనిర్వాహక వర్గాన్ని అదుపులో ఉంచుతారు. ఇంగ్లండులో శాసన సభలో స్థానాలు సీనియారిటీ ఆధారంగా వరస క్రమంలో నిర్ణయిస్తారు. ఈ దేశంలో వెనకబెంచీలలో సభ్యులంటే శాసన సభ్యులుగా అనుభవం తక్కువగల వారైనా ఉత్సాహపూరితమైన నూతన సభ్యులన్నమాట. భారతదేశంలో శాసన సభలలో అక్షర క్రమం (alphabitical order) ఆధారంగా స్థానాలను కేటాయిస్తారు. అంటే శాసన సభ్యునిపేరు అక్షర క్రమంలో ఆఖరిది అయితే ఎంతటి అనుభవమున్నా వెనకబెంచీలో అతనికి/ఆమెకు స్థానం కేటాయిస్తారు. శాసన సభసభ్యులలో అనుభవజ్ఞులు నూతన సభ్యులుగా ఉంటారు. వెనక బెంచీలలోని సభ్యులు తరవాతి ఎన్నికలలో తమ విజయానికి తోడ్పడే ప్రభుత్వ విధానాలు రూపొందడానికి తగిన ఒత్తిడి తెస్తారు. వీరినుంచి నిపుణత్వాన్ని, మద్దతును, సమాచారాన్ని ప్రభుత్వం ఆశిస్తుంది. ఇంకో విధంగా చెప్పాలంటే మంత్రులు తాము పదవిలో కొనసాగడానికి, ప్రయోజనకరమైన నిర్ణయాలు తీసుకొని అమలు పరచడానికి వెనకబెంచి సభ్యులపై ఆధారపడటం తప్పనిసరి అవుతుంది. వీరినుంచి నైతిక మద్దతు ఆశిస్తుంది. తమకు వ్యతిరేకంగా ఈ సభ్యులు శాసనసభలోను, ఇతర సమావేశాలలోను ప్రసంగించకుండా మంత్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. పార్టీ సభ్యులందరినుంచి అన్ని సమయాలలో తగిన మద్దతు లభిస్తుందని మంత్రులు ధైర్యంగా ఉండటానికి వీలుండదు. వెనక సభ్యుల ఓట్లు, మద్దతు ఉపసంహరించుకోదలిస్తే మంత్రుల పదవులకు ప్రమాదం ఏర్పడుతుంది. మంత్రులకు ఈ సభ్యులతో సంబంధాలు లేకపోతే పార్టీలో అంతఃకలహాలువచ్చే అవకాశాలు ఎక్కువ.

కార్యనిర్వాహక వర్గంపై అధ్యక్ష విధానంలో శాసన నిర్మాణశాఖ నియంత్రణావకాశాలు మరింత సమర్థవంతంగా ఉంటాయని, దీనికి కారణం. అధికార పృథక్కరణ అని కొందరి విశ్లేషకుల అభిప్రాయం. పార్లమెంటరీ విధానంలో మంత్రిమండలికి శాసన సభ్యులకంటే ఎక్కువ హోదా ఉండటంవల్ల కార్యనిర్వాహక వర్గాన్ని నియంత్రణ చేయడంలో శాసన నిర్మాణశాఖ తగినంత సమర్థతతో వ్యవహరించడానికి వీలుండదని వీరివాదన. అధికార పృథక్కరణ లేదా అధికారాల వేర్పాటువల్ల మరింత నిశ్చితంగా

(assertive), స్వతంత్రంగా శాసనసభ్యులు పరిపాలక వర్గాన్ని నియంత్రించగలుగుతారని వీరంటారు. అమెరికాలోని కాంగ్రెస్ ఈ కోవకు చెందినదిగా పరగణిస్తారు. దీనికి నియంత్రణ విషయాలలో అధిక మార్గాలను అన్వేషిస్తాయి. దేశ ఖజనా తంత్రులను (Purse Strings) అదుపులో ఉంచుతాయి. కాంగ్రెస్‌లోని కమిటీల ద్వారా, స్వేచ్ఛా పూరితమై చర్చలద్వారా, అభిశంసన ద్వారా, మరి ఇతర మార్గాల ద్వారా కార్యనిర్వాహకవర్గంపై నియంత్రణాధికారం దాని కుంటుంది. సెనెట్ ఆమోదిస్తే తప్ప కార్యనిర్వాహక వర్గం చేసిన ఉన్నత పదవుల నియమకాలు చెల్లవు. ఇటీవల 1991 లో సుప్రీంకోర్టు జడ్జిగా నియమితుడైన లారెన్స్ థామస్ (Lawence Thomas) నియామకం చెల్లుతుందా లేదా అన్న విషయంపై సెనేట్‌లో తీవ్రవాదోపవాదాలు జరిగాయి. చివరికి అతి స్వల్పమెజారిటీతో సెనెట్ ఈనియామకాన్ని ధృవీకరించింది. దేశాధ్యక్షుని, సుప్రీంకోర్టు న్యాయమూర్తులను అభిశంసనతో పదవీచ్యుతులను చేసే అధికారం అమెరికాలో కాంగ్రెస్‌కు ఉంది.

7. శాసన నిర్మాణశాఖ నిర్వహించే మరో ప్రధాన కర్తవ్యం ప్రజాభిప్రాయాన్ని రూపొందించడం. ఈ సభ్యులు సభలో ప్రసంగించినప్పుడు దేశ, ప్రాంతీయ సమస్యలను అనేకం ప్రస్తావిస్తారు. వివిధ వర్గాల ప్రయోజనాలను, అవసరాలను వివరిస్తారు. వీరి భావాలు, ఆశయాలు సామాన్య ప్రజానీకాన్ని చేరతాయి. వీరి ప్రసంగాలు శాసన సభాకార్యక్రమాలలో అంతర్భాగాలుగా ముద్రి తమవుతాయి. వీరి భావాలు ప్రస్తుతం తరంవారికే కాకుండా ముందు తరాలవారికి కూడా మార్గదర్శకమవుతాయి. శాసన సభ్యుల ప్రసంగాలు పత్రికలు, శ్రవణ సాధనాలు దృశ్యసాధనాలు ప్రసారం చేస్తాయి. ఒకవైపు ప్రజల భావాలను ప్రకటిస్తూ మరోవైపు ప్రజాశ్రేయస్సుకు తీసుకో వాల్సిన నిర్ణయాలను తెలుపుతూ ప్రజాభిప్రాయం రూపుదిద్దుకోడానికి అనువైన వాతావరణాన్ని శాసనసభ్యులు ఏర్పరచవచ్చు. ఇలాచేసేటప్పుడు శాసన సభాకార్యక్రమాల నిర్వహణకు సభ్యులు వినియోగించాల్సి ఉంది. అలాకాని పక్షంలో సభ్యుల కాలం, ప్రభుత్వ ధనం వృథా అవుతుంది. ప్రజాభిప్రాయం రూపొందడానికి దోహదం చేసే సాధనం కనకనే అమెరికాలోని కాంగ్రెస్ "Congress of Opinions" గా రూపొందింది. క్లుప్తంగా చెప్పాలంటే ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఈ శాఖ పనిచేస్తుంది. తులనాత్మక రాజకీయాల పరిభాషలో ఇది ప్రయోజనాల వ్యక్తీకరణ ప్రతినిధిగా కూడా వ్యవహరిస్తుంది.

8. ఇతర కర్తవ్యాలకు వస్తే ప్రజాసమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించే వ్యవస్థగా శాసన నిర్మాణశాఖ పనిచేస్తుంది. సభావ్యక్తుల ప్రవర్తనకు సంబంధించిన నియమావళి నిర్ణయిస్తుంది. పరిపాలనలోని లోటుపాట్లను పరిశీలించడానికి దర్యాప్తు జరుపుతుంది. ఈ సందర్భంలో దర్యాప్తు సంఘాలు నియమిస్తుంది. దర్యాప్తు సంఘాల కార్యక్రమాలలో పాల్గొనే సభ్యులకు ఒక విధమైన సంతృప్తి (ప్రజా సమస్యలను వివరంగా పరిశీలిస్తున్నామనే తృప్తి) స్వశక్తిపై నమ్మకం ఏర్పడి తమశక్తి యుక్తులను పెంపొందించుకోగలుగుతారు. శాసన సభ్యులు స్వతంత్రంగా ఎటువంటి ప్రతిబంధకాలు లేకుండా నిష్పాక్షికంగా వ్యవహరించడానికి వీరికి కొన్ని ప్రత్యేక హక్కులు (Privileges) ఉంటాయి. ఆహక్కులకు భంగం వాటిల్లినప్పుడు అందుకు కారణమైన వారిపై తగిన చర్య ప్రతిపాదించే హక్కు శాసన నిర్మాణ శాఖకు ఉంది. ఇక నియోజకుల ప్రతినిధులుగా శాసనసభ్యులు నియోజకులకు, ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య సంధాన కర్తలుగా వ్యవహరిస్తారు.

ఈ కారణం చేతనే ఒక్కొక్కసారి సభ్యులు సభాకార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉండదు. అంతమాత్రాన ప్రజా ప్రతినిధులుగా వారు విధి నిర్వహణ జరపడం లేదని చెప్పడం సమంజసం కాదు. శాసన సభ్యులు తమ నియోజకులను కలుసుకొన్నప్పుడు ముఖ్యంగా వర్థమాన దేశాలలో - నియోజకుల ప్రయోజనాల రక్షణకు సభ్యులు తీసుకొంటున్న జాగ్రత్తలు, చేస్తున్న ప్రయత్నాలు తెలుసుకోవడం సహజమూ, ఆమోదకరమూకూడా. ఈ దేశాలలోని ప్రజాప్రతినిధులు శాసన సభాకార్యక్రమాలకంటే నియోజక వర్గానికి సేవ చేయడానికే ఎక్కువ ప్రాధాన్య మిస్తున్నట్లు అనేక పరిశోధనా వ్యాసాల వల్ల వెల్లడి అయింది.

20.5 శాసన సభ్యుల కార్తవ్యనిర్వహణ : ప్రేరణాంశాలు

శాసన సభలోని సభ్యుల కర్తవ్య నిర్వహణపై అనేక అంశాల ప్రభావం ఉంటుంది. వీటిలో సభ్యుల సాంఘిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులు, వ్యక్తిగత భావాలు, సంస్థాపరమైన విషయాలు, రాజకీయ సంస్కృతి, రాజకీయ పదవులకు జరిగే భర్తీ విధానం, మద్దతు సమకూర్చే నిర్మితులు (Support Structures), సమీప వాతావరణం, విశాల వాతావరణం, రాజకీయ వ్యవస్థ స్వరూపం, తమ ప్రాంతాల గురించిన అవగాహన వీటిలో ముఖ్యమైనవి. కొన్ని ఉదాహరణలు తీసుకొంటే ప్రజాస్వామ్య విధానంలో ఇతర విధానాలతో పోలిస్తే కర్తవ్య నిర్వహణలో పాల్గొనే అవకాశాలెక్కువ. శాంతియుత వాతావరణం ఎక్కువ అవకాశాలను, హింసాత్మక పరిస్థితులు తక్కువ అవకాశాలను కల్పిస్తాయి. అధిక విద్య, శ్రద్ధాసక్తులు శాసనసభ్యులు సమర్థులుగా వ్యవహరించడానికి దోహదం చేస్తాయి. సభాకార్యక్రమాలకు కేటాయించేకాలం నియమానుసారంగా సభాకార్యక్రమాలకు కేటాయించే కాలం నియమానుసారంగా సభాకార్యక్రమాలు నిర్వహించాలనే భావం కార్యక్రమ నిర్వహణపైన, కర్తవ్య నిర్వహణపైన ప్రభావం చూపుతాయి. రాజకీయ పదవులకు సమర్థులను ఎంపిక చేసినప్పుడు వారి విధి నిర్వహణ కూడా సమర్థవంతంగా ఉంటుంది.

ఇరవయ్యో శతాబ్దంలో ప్రవర్తన వాదానికి (Behaviorism) అనుభవ పూర్వక విషయ పరిశీలనకు (empericism) ప్రాధాన్యం పెరగడంతో శాసన నిర్మాణ శాఖ సంబంధమైన పరిశోధనలలో కొత్త పోకడలు వచ్చాయి. శాసన సభ్యుల కర్తవ్యాలు శాసన నిర్మాణానికి మాత్రమే పరిమితంకావని, శాసన సభల కార్యక్రమాలు చర్చలకు మాత్రమే సంబంధించినవికావని, ఇలా భావించడం సంప్రదాయబద్ధమైనది మాత్రమేనని, ఈనాటి శాసనసభ్యులు కొత్త తరహాలో పాత్రలు నిర్వహించాల్సి ఉంటుందన్న భావాలు ప్రచారంలోకి వచ్చాయి. శాసన సభల పాత్రను వివరిస్తూ 1970లో పెకన్‌హామ్ (Peckanham) నిగూఢమైన శాసనబద్ధత, ఉద్రిక్తల సడలింపు, భర్తీ, సామాజీకరణ, తర్ఫీదు (Training), శాసన నిర్మాణం, ప్రయోజనాల వ్యక్తీకరణ (Interest articulation) పరిపాలక వర్గంపై నియంత్రణ, పోషకత్వం, స్వీకరించిన బాధ్యతల నిర్వహణ శాసనసభ్యుల కర్తవ్యాలంటాడు. వివిధ రాజనీతి శాస్త్రవేత్తలు శాసన నిర్మాణ శాఖను తులనాత్మక, ప్రగతి పూర్వక దృష్టితో పరిశీలించడం మొదలుపెట్టారు.

అనుభవ పూర్వక విషయ పరిశీలన ప్రాతిపదికగా శాసన నిర్మాణశాఖ కర్తవ్య నిర్వహణ విషయమై 1920లో లోవెల్ (Lowell) చేసిన పరిశీలన మొట్టమొదటిది. బ్రిటీష్ పార్లమెంట్, అమెరికా కాంగ్రెస్, అమెరికాలోని రాష్ట్రాలలో పార్టీకి, ఓటింగ్ పద్ధతికి మధ్య సంబంధాలు కనుక్కొనే ప్రయత్నమిది. పిటకిన్ (Pitkin), వాల్‌కే (Walke) యూలాన్ (Eulan), ప్రీవిట్ (Prewit) వంటి వారు ఎంతవరకూ శాసన నిర్మాణ శాఖ ప్రజల కోర్కెలకు స్పందిస్తున్న విషయంపై పరిశోధన జరిపారు. ప్రజల కోర్కెలతోబాటుగా శాసన సభలకు ప్రజల నుంచి లభించే మద్దతునుకూడా తెలుసుకోవాల్సిన ఆవశ్యకతను 1978లో వాల్‌కే (Wahlke) వివరించాడు. మ్యాత్యూస్ (Matthews) 1985లో ప్రచురించిన Handbook of Legislative Research అనే గ్రంథంలో Legistative Recruitment, Legistative Careers గురించిరాస్తూ సాధారణంగా శాసనసభలోని సభ్యుల ఆర్థిక, రాజకీయ, సాంఘిక తదితర స్థితిగతులు సామాన్య ప్రజానీకం స్థితిగతులకంటే పై స్థాయిలో ఉన్నాయని విశదం చేశాడు. దీనికి కారణాన్ని సులభంగా గ్రహించవచ్చు. ఏ రాజకీయ వ్యవస్థలోనైనా రాజకీయాలలో ప్రవేశించడానికి, ఎన్నికలలో పోటీ చేయడానికి ధనంతోబాటు ఉన్నతమైన హోదా అవసరమవుతుంది. ఈ పరిస్థితులు కొద్దిమందికి మాత్రమే ఉంటాయి. అందువల్ల రాజకీయ పదవులు కొద్ది మందికే లభ్యమవుతాయి. అంటే ప్రతినిధులకు, ప్రజలకు మధ్య సాంఘిక, ఆర్థిక, రాజకీయ హోదా విషయంలో అంతరాలుంటాయన్నమాట. ఈ అంతరాలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో మరీ ఎక్కువ. అంతేకాకుండా రాజకీయాలపట్ల ఆకర్షితులైన వారి సంఖ్య కూడా సాధారణంగా తక్కువ. గోయల్, మిల్ బ్రాత్‌ల అభిప్రాయంలో ఈ కొద్దిమంది మాత్రమే పార్టీలలో క్రియాశీలురుగాను, ఉన్నత పదవులలోను పనిచేస్తారు.

శాసన సభలలోని సభ్యులకు తాము నిర్వహించాల్సిన పాత్రగురించి అవగాహన విషయమై ఇటీవలి కాలంలో పరిశోధనలు జరిగాయి. ఈ విషయమై పరిశోధనచేసిన వారిలో ఫ్రాంక్ (Frank), డేవిడ్‌సన్ (Davidson), హాప్‌కిన్స్ (Hopkins) క్లార్క్ (clarke), ప్రైస్ (Price), ప్రోక్టర్ (Procter)లు ముఖ్యులు. శాసనసభ్యులు కొందరు సభాకార్యక్రమాలకు మరికొందరు నియోజకత్వానికి సేవ చేయడానికి ప్రాధాన్యమిస్తారని పరిశోధనలు విశదంచేశాయి.

శాసన సభల, అందులోని సభ్యుల ప్రవర్తన ఆయా సభల కార్య నిర్వహణ నిబంధనలు, నియమావళులపై ఆధారపడి ఉంటాయి. అవి చట్టబద్ధ నిబంధనలు, ఆచరణాత్మక నిబంధనలు. ఇవి శాసనసభల కార్యక్రమ నిర్వహణను ప్రభావితం చేస్తాయి. ఇవికాక సభ్యులకున్న ఉద్యోగుల సహాయం, పార్టీ వ్యవస్థ స్వరూపం, నాయకులవైఖరి, పార్టీ క్రమశిక్షణ వంటివి కూడా శాసన సభల తీరు తెన్నులను నిర్ణయిస్తాయి

ఇక భారతదేశంలో శాసనసభల ప్రవర్తనకు సంబంధించిన విషయాలకొస్తే సభ్యుల సాంఘిక, ఆర్థిక, రాజకీయ తదితర విషయాలలో హోదా, సభలోపల, బయట ఉన్న పరిస్థితులు సభ్యుల ప్రవర్తనను నిర్ణయిస్తామని పరిశోధకులు భావిస్తున్నారు. 1979లో బెర్రీ (Berry) రచించిన (Parliamentary Participation in the Indian Loksabha) అనే పరిశోదన వ్యాసం ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది. సభ్యుల మనోవైఖరులు వారు నమ్మిన విలువలు, అభిప్రాయాలు వంటివి ఇప్పటివరకు పరిశోధనాంశాలయ్యాయి. ఇంకా కొన్ని అంశాలను గురించి పరిశోధన జరగాల్సి ఉంది. ఈ అంశాలను గురించి తులనాత్మక పరిశీలన కూడా జరగాల్సి ఉంది.

20.6 శాసన నిర్మాణ శాఖలు : క్షీణత

పై విషయాలను బట్టి ఆధునిక శాసనసభల అధికారాలు, కర్తవ్యాలు బాగా పెరిగాయని, రాజకీయ వ్యవస్థలో శాసన నిర్మాణ శాఖకు కీలక స్థానం ఉంటుందని అర్థమవుతుంది. ఈ శాఖలకు రూపొందించాల్సిన శాసనాల సంఖ్య అపరిమితంగా పెరిగింది. అంతేకాకుండా కర్తవ్యనిర్వహణకు, క్లిష్టమైన శాసన నిర్మాణ శాఖలకు మినహాయించి ఇవి వెచ్చిస్తున్న కాలంకూడా పెరిగింది. ఈ శాఖలు పరిష్కరించాల్సిన సమస్యలు కూడా ఎంతగానో పెరిగాయి. అయితే నేటి శాసన నిర్మాణ శాఖలు సర్వసత్తాక సంస్థలుగాను, సర్వశక్తి మంతమైన శాఖలుగాను పనిచేయగలుగుతున్నాయని చెప్పడానికి వీలులేదు. దీనికి కారణం శాసననిర్మాణ శాఖలు అవనతి చెందడమే. సర్వసత్తాకతకు పేరు పొందిన బ్రిటీష్ పార్లమెంట్ కూడా నేడు కార్య నిర్వాహక వర్గం ఆధిపత్యంలోనే పనిచేస్తుంది. నియమిత, అనియమిత నిబంధనలు శాసన సభ్యుల కర్తవ్య నిర్వహణకు అంతరాయం కల్పిస్తున్నాయి.

ఆధునిక కాలంలో శాసన నిర్మాణశాక క్షీణించిందని భావించే వారిలో ప్రముఖులు. కె.సి. వేర్ (K.C. Wheare) లార్డ్ బ్రైస్ (Lord Bryce). క్షీణతకు దోహదం చేసే కారణాలను కింది విధంగా వివరించవచ్చు.

(1) శాసన సభ్యులు ఎంతటి అవసరాన్ని గుర్తించినా వారు రూపొందించే శాసనాలు రాజ్యాంగ సమ్మతమైనవిగా ఉండాలి. శాసనాలు రూపొందించడం, సవరించడం, రద్దుచేయడం ఈ మూడూ కూడా రాజ్యాంగ నియమ నిబంధనలకు లోబడి మాత్రమే జరగాలి. ఇక రాజ్యాంగ సమ్మతమైన విషయాలలో కూడా సభ్యులు వ్యక్తిగతంగా పాల్గొనడానికి - అంటే వ్యక్తిగత హోదాలో పాల్గొనడానికి కొన్ని పరిమితులున్నాయి. ఆధునిక శాసన నిర్మాణం సంక్లిష్టమైనది (Complex), ప్రత్యేకీకరణ వినియోగించాల్సిన అవసరమున్నది కూడా. శాసన సభకు ఎన్నికైన ప్రతినిధులు సాధారణ వ్యక్తులు (Lay persons). వీరి పరిజ్ఞానం కూడా సాధారణమైనదిగా ఉటుంది. సాంకేతిక విషయాలలో వీరు నిష్ణాతులుకారు. శాసన నిర్మాణ కార్యక్రమంలో సభ్యుల సృజనాత్మకత ఆర్థిక వేత్తల పరిణతి చెందిన అభిప్రాయాలు అవసరం. అందువల్ల శాసన సభ్యుల పాత్రకు పరిమితులున్నాయని తెలుస్తోంది. సమకాలీన పరిస్థితుల్లో శాసన నిర్మాణ శాఖలోని సభ్యులు తమంత తాముగా శాసన నిర్మాణం చేయలేరు. ఉద్యోగి బృందంపై, నిపుణులపై, ఆర్థికవేత్తలపై ఆధారపడటం తప్పనిసరి అవుతుంది. ఒక్కొక్కసారి శాసన ప్రతిపాదనలు సభ ఆమోదం పొందడానికి అతిస్వల్పకాలం కేటాయిస్తారు. అటువంటప్పుడు సభ్యులు వ్యక్తిగత హోదాలో పాల్గొనే అవకాశం తగ్గుతుంది. అంతేకాకుండా శాసన ప్రతిపాదనలు వివరంగా చర్చించడానికి వాటిని కమిటీలకు నివేదిస్తారు. అటువంటి సందర్భాలలో, చర్చలలో పాల్గొనే అవకాశం కొద్దిమంది కమిటీ సభ్యులకు మాత్రం లభిస్తుంది. కమిటీ పరిశీలన తరవాత నివేదిక సమర్పణ అనంతరం శాసన నిర్మాణ శాఖ శాసన ప్రతిపాదనలపై చర్చకు కొద్దికాలం మాత్రమే కేటాయించడం జరుగుతుంది. పార్లమెంటరీ విధానంలో సాధారణంగా శాసన ప్రతిపాదనలను కార్యనిర్వాహక వర్గంలోని నిపుణులు రూపొందిస్తారు. అందువల్ల ప్రతిపాదనల రూపకల్పన స్థాయిలో కూడా శాసననిర్మాణశాఖ సభ్యులపాత్ర చెప్పుకోదగినదిగా ఉండదు.

ఇక కొత్తగా ఎన్నికైన, తక్కువ అనుభవమున్న సభ్యులకు అనుభవమున్న వారికున్న అవకాశాలు శాసనసభాకార్యక్రమాలలో పాల్గొనడంలో ఉండదు. కార్యక్రమ నియమావళిని తెలుసుకోవడం, ఆకళింపు చేసుకోడానికి నూతన సభ్యులకు కొంతకాలం పడుతుంది. విధాన నిర్ణయాలతోబాటు సభ్య సంప్రదాయాలను కూడా గ్రహించాలి. వీటికి తోడు శాసన నిర్మాణం, ఇతర కార్యక్రమాలకు కేటాయించిన సమయం తక్కువైతే పాల్గొనే అవకాశాలు కూడా తగ్గుతాయి. భారతదేశంలో అనేక పర్యాయాలు శాసన ప్రతిపాదనలపై మూడు పఠనాలు ఒకేరోజు అందులోను అతిస్వల్పవ్యవధిలో జరిగిన సందర్భాలున్నాయి.

2. ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులు కొంత వరకు శాసన నిర్మాణంలో సభ్యుల అధికారాలను నియంత్రించే సాధనాలుగా పనిచేస్తాయి. స్విట్జర్‌లాండ్, ఫ్రాన్స్, నేపాల్, శ్రీలంక వంటి దేశాలలో ప్రజాభిప్రాయ నిర్ణయం (Referendum) ఆచరణలో ఉంది. ఈ విధానం శాసన నిర్మాణశాఖ సభ్యులలో శ్రద్ధాసక్తులు తగ్గిస్తుంది.

3. శాసన నిర్మాణశాఖ ఆర్థికాధికారాలపై అనేక పరిమితులున్నాయి. ప్రభుత్వ ఖర్చుపై పరిమితులు విధించే అధికారం శాసన నిర్మాణ శాఖదే అయినా ఆచరణలో ఈ విషయంలో కార్య నిర్వాహక వర్గం ఆధిక్యత కనిపిస్తుంది. బడ్జెట్‌ను రూపొందించడం సామాన్యులకు అసాధ్యం. మంత్రి వర్గం కూడా బడ్జెట్ తయారీలో ఉద్యగి బృందంపై అధికంగా ఆధారపడాల్సి వస్తుంది. బడ్జెట్‌లో చూపిన ఆదాయ వ్యయాలకు సంబంధించిన వివరాలు అత్యంత జాగరూకతతో పరిశీలించిన మీదట నిర్ణయించడం జరుగుతుంది. కనక సాధారణ సభ్యులు ఈ వివరాలలో ప్రమేయం కల్పించుకోవడం బడ్జెట్ మూల సూత్రాలకు అవరోధంగా పరిణమిస్తుందని, అందువల్ల బడ్జెట్‌పై సాధారణ చర్చ మాత్రం అభిలషణీయమని భావించడం జరుగుతుంది. (Michael Ameller) చెప్పినట్లు "The role of legislature is not to challenge every detail from a technical angle but to make a broad judgment of the Values as an instrument of Policy". అంతేకాకుండా శాసన సభలకుండే పరిమిత కాలవ్యవధి బడ్జెట్‌పై వివరంగా చర్చజరపడానికి అవకాశమివ్వదు. దీనితోపాటు సంఘటిత నిధినుంచి పెట్టే ఖర్చు ప్రశ్నించే అధికారం శాసన నిర్మాణ శాఖకు ఉండదు. ఈ సందర్భంలో శాసనసభ అధికార విహీనమైంది. స్థూలంగా పరిశీలిస్తే అధిక విషయాలలో నిజమైన అధికారం శాసన సభలకు కాక కార్య నిర్వాహక వర్గం చేలాయిస్తుందని తెలుస్తుంది. ఆర్థిక విషయాలలో అధికారం కార్యనిర్వాహక వర్గం ప్రత్యేక హక్కుగా మారింది. ఇక ఆర్థిక విషయాలలో కార్యనిర్వాహక వర్గంపై శాసన నిర్మాణశాఖ నియమించే కమిటీల కార్యకలాపాలపై కూడా వివిధ కారణాలవల్ల ఆచరణలో పరిమితులు కనిపిస్తాయి. దీన్ని గురించి తరవాతి పేజీలలో వివరించడం జరుగుతుంది.

(4) శాసన నిర్మాణ శాఖ ఆధిక్యతకు మరోక సవాలు శాసనదత్తత (delegated Legislation). శాసన సభ కార్యక్రమాలలో వచ్చే పనిఒత్తిడి, శాసన నిర్మాణంలో సంక్లిష్టత, సాంకేతిక పరిజ్ఞానం ఆవశ్యకత, శాసనాలను అధికసంఖ్యలో రూపొందించాల్సి రావడం మొదలైన కారణాలవల్ల శాసనసభలు తమ శాసన నిర్మాణాధికారాన్ని కొంతవరకు కార్యనిర్వాహక వర్గానికి దత్తం చేస్తాయి. శాసన నిర్మాణంలో ఈ విధంగా స్థానం పొందిన కార్యనిర్వాహక వర్గం స్థానం రెండోది మాత్రమే. అయితే

ఆచరణలో కార్యనిర్వాహక వర్గం శాసన నిర్మాణ కార్యకలాపాలలో ముఖ్య భూమిక వ్యవహరించడం మొదలు పెట్టింది. దత్తంచేసిన శాసన నిర్మాణాధికారాలను సొంతం చేసుకొంది. నేటి కాలంలో శాసన సభలు శాసనాల లేఖాకృతులను నిర్ణయించి వివరాలను నిర్ణయించాల్సిందిగా కార్యనిర్వాహకవర్గాన్ని ఆదేశిస్తాయి. అధికారాల వేర్పాటుకు ప్రాముఖ్యమున్న అమెరికాలోకూడా కాంగ్రెస్ శాసన నిర్మాణ పరిధి తగ్గుతూ వచ్చింది. అయితే పరిపాలన వర్గంపై నియంత్రణావధి కూడా పెరిగింది. శాసన దత్తత అవధులకు మించి పెరిగితే శాసన సభ్యుల హోదా రబ్బర్ స్టాంప్ (Rubber Stamp) హోదాకు - అంటే కార్యనిర్వాహక వర్గాల చర్యలకు ఆమోదముద్రవేసే హోదాకు దిగజారే ప్రమాదముంది. శాసన నిర్మాణాధికారం పొందిన పాలక వర్గం శాసనాతి క్రమణాచర్యలకు పూనుకోవచ్చు.

5. విదేశీ వ్యవహారాలలో నేడు కార్యనిర్వాహక వర్గానిదే పైచెయ్యి. విదేశీ వ్యవహారాలకు సంబంధించిన వ్యయాన్ని ఆమోదించడానికి లేదా తిరస్కరించడానికి శాసన నిర్మాణ శాఖ కుండే అధికారం చాలా అరుదుగా వినియోగించడం జరుగుతోంది. దీనిలో విదేశీ వ్యవహారాలలో శాసన నిర్మాణ శాఖలు కార్య నిర్వాహక వర్గానికి మార్గదర్శకులు, నియంత్రణశాఖలుగా కాకుండా కార్యనిర్వాహక వర్గం నిర్ణయాలను ధృవీకరించే నామమాత్రపు శాఖలుగా మారాయి.

6. పార్టీ వ్యవస్థ కొంతవరకు శాసన నిర్మాణ శాఖ పతనానికి కారణమైంది. అంటే అత్యంత క్రమశిక్షణను అమలు పరిచే పార్టీల సభ్యులు స్వతంత్రంగా అభిప్రాయాలను ప్రజాప్రతినిధులవేదికపై వ్యక్తం చేయడానికి వీలుండదు. వీరు వ్యక్తిగత అభిప్రాయాలకు కాకుండా పార్టీ నిర్ణయాలను అనుసంధానంగా ఉండే అభిప్రాయాలు వ్యక్తం చేయాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధులకు, ప్రజలకు మధ్య సంబంధాలుకూడా రాజకీయ పార్టీల ద్వారా నిర్ణయమవుతాయి. పార్టీలు నియోజకులను, శాసన నిర్మాణశాఖ సభ్యులను, కార్యనిర్వాహక వర్గాన్ని సంధానం చేస్తాయి. అంటే వీరి మధ్య సంబంధాల నిర్ణయంలో ప్రముఖపాత్ర వహిస్తాయి. పార్టీ ప్రాతిపదికగానే పార్లమెంటరీ విధానంలో మంత్రిమండలి ఏర్పాటు జరుగుతుంది. పార్టీ ద్వారానే వివిధ దేశాలలో కార్యనిర్వాహక వర్గాలు, శాసనసభల సభ్యులు ప్రజా మద్దతుకు విజ్ఞప్తులు చేస్తారు. నియోజకులకు ఎన్నో హామీలుఇచ్చి వాగ్దానాలు చేసి శాసనసభకు పోటీచేసి గెలుపొందిన అభ్యర్థులు వాటిని అమలు పరచడానికి పూర్తి సహాయ సహకారాలు ప్రభుత్వం నుంచి, పార్టీనుంటి పొందలేక పోవచ్చు. కొన్ని పార్టీల నాయకులు సభ్యులనుంచి తేది వేయకుండా రాజీనామా పత్రాలు తీసుకున్న సందర్భాలున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. పార్టీ అధిష్టాన వర్గాలు స్థానిక వ్యవస్థలు మొదలైన పార్టీ వ్యవస్థలు సభ్యులపై నియంత్రణ చెలాయిస్తాయి. బ్రిటన్, భారతదేశం వంటి దేశాలలో సభ్యులపై పార్టీ నియంత్రణావధి అధికంగా ఉంటుంది. అమెరికాలో ఈ నియంత్రణ కొంత తక్కువ. ఈ కారణంవల్లనే అక్కడ శాసన సభలు చర్చిస్తున్న సమస్యనుబట్టి ఒక్కొక్కసారి ఒక పార్టీకి చెందిన సభ్యులు మరొక పార్టీ ప్రతిపాదనకు అనుకూలంగా ఓటు చేయడం జరుగుతుంది. దీనినే క్రాస్ ఓటింగ్ అంటారు. భారతదేశంలో ఇటువంటి అవకాశంలేదు. పార్టీ సభ్యత్వాన్ని వదులుకోవడానికి సిద్ధపడిన సభ్యులు మాత్రమే క్రాస్ ఓటింగ్ చేయగలుగుతారు. సభ్యులు శాసన నిర్మాణ శాఖలో చేసే ప్రసంగాల విషయంలోను, ప్రవర్తనలోను నియంత్రణ ప్రవేశపెట్టడాన్ని 'విప్' (Whip) అంటారు. విప్ అంటే ఆజ్ఞ. ప్రస్తుత సందర్భంలో విప్ అంటే సభ్యుల ప్రవర్తనను నిర్ణయిస్తూ

ఇచ్చే ఆదేశంగా భావించవచ్చు. విప్స్ నియంత్రణ ఉన్న వ్యవస్థలలో సభ్యులు ఏ విషయమై మాట్లాడ దలిచినది ఏమి మాట్లాడ దలచింది ముందుగా తెలియజెయ్యాలి. దీనినిబట్టి సభ్యులు వ్యక్తిగత హోదాతో శాసన సభాకార్యక్రమాలలో పాల్గొనడంపై పార్టీల ప్రభావం, నియంత్రణ ఉంటుందని స్పష్టమవుతుంది.

7. ఒక శాసన నిర్మాణ శాఖ సభ్యుల ప్రవర్తనపై ప్రభావ వర్గాల ప్రభావం కూడా ఉంటుంది. ప్రభావ వర్గాలు తమంతతామముగా ఎన్నికలలో పోటీచేయక పోయినా, పోటీచేసే అభ్యర్థులకు నిధులు సమకూర్చడం, మద్దతు ప్రకటించడం మొదలైన చర్యల ద్వారా శాసన సభ్యులపై తగినంత నియంత్రణాధికారం వాటికి ఉంటుంది. నేటి రాజకీయ వ్యవస్థలలో - ముఖ్యంగా అమెరికా వంటి దేశాలలో - ప్రభావ వర్గాలు కీలక అధికార స్థానాలుగా లేదా కేంద్రాలుగా వ్యవహరిస్తున్నాయి. ప్రభావ వర్గాలతో సన్నిహిత సంబంధమున్న శాసన సభ సభ్యులకు, సంబంధిత సభా కమిటీలలో సభ్యత్వం లభించడం, తరవాతి కాలంలో సభ్యులకు, సంబంధిత ప్రభావవర్గాలకు మధ్య సన్నిహిత సంబంధాలేర్పడటం జరుగుతూ ఉంటుంది. కొన్ని దేశాలలో - ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలు ప్రధానంగా కార్మికుల వేతనాలు, ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన నిర్ణయాలు ప్రభావ వర్గాలమధ్య సంప్రదింపులు జరపడం ద్వారా చేస్తారు. ఈ నిర్ణయాలు ప్రభుత్వ పెట్టుబడులపైన ప్రభుత్వ చెల్లింపుల శేషం, (Balance of payments) పైన, ద్రవ్యోల్బణంపైన చెప్పుకోదగిన ప్రభావం చూపుతాయి. ట్రేడ్ యూనియన్‌లు, ఉద్యోగుల సంఘాలు తమ లక్ష్య సాధనకు శాసన నిర్మాణ శాఖ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉంటాయి. ఇక భారతదేశంలో కూలంకషంగా శాసన నిర్మాణశాఖ సభ్యులను ప్రభావితం చేస్తుందని చెప్పవచ్చు. ఒకపక్క కులం ప్రాతిపదికగా ఎటువంటి విచక్షణలు లేని సమాజస్థాపన ప్రయత్నాలు మరోపక్క కులసంఘాల ఒత్తిడి ఫలితంగా రాజకీయ పదవుల సర్దుబాట్లు, కులాల ప్రయోజనాల పరిరక్షణకు కృషిచేయడం వీటిమధ్య సంఘర్షణలు బయలు దేరడం సర్వసామాన్యమయ్యాయి. ఈ సందర్భంలో విచక్షణా రహిత సమాజ స్థాపన గమనం ఈ విధంగా ఉంటుందో చెప్పడం కష్టం.

8. అత్యవసర పరిస్థితి ప్రకటించడానికి కార్యనిర్వాహక వర్గానికున్న అధికారం కూడా శాసన నిర్మాణశాఖ హోదాను కొంత బలహీన పరుస్తుంది. అత్యవసర పరిస్థితి ప్రకటన తరవాత శాసన నిర్మాణశాఖ తాత్కాలికంగా పనిచేయదు. ఈ పరిస్థితుని రద్దుచేశాక ప్రజాప్రతినిధులు తమ కర్తవ్య నిర్వహణను (శాసనసభ్యులుగా) జరుపుతారు. అత్యవసర పరిస్థితి ప్రభావం శాసన సభాకార్యక్రమాలపైనే కాకుండా, సామాన్య జనం జీవన విధానంపైన కూడా ఉంటుంది. 1972-77 సంవత్సరాల మధ్య కాలంలో శ్రీలంకలో అత్యవసరపరిస్థితిని చాలా కాలం అమలు పరచడం వల్ల 1972 లో రూపొందిన రాజ్యాంగం ఏ విధంగా పనిచేసింది చెప్పడం కష్టమని రాజనీతి శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. భారతదేశంలో 1975 లో ప్రకటించిన అత్యవసర పరిస్థితి ఫలితంగా పౌర హక్కులను, దైనందిన జీవితానికి కూడా అంతరాయాలు ఏర్పడ్డాయి. రాజ్యాంగాన్ని అధికార పార్టీ స్వప్రయోజనాలకు అనుగుణంగా సవరించుకొన్నదనే విమర్శకూడా ఉంది. రాజ్యాంగానికి జరిగిన 42 వ సవరణ ఈ విషయాన్ని స్పష్టం చేస్తుందని చెప్పవచ్చు. అత్యవసర ప్రకటనాధికార దుర్వినియోగం తీవ్ర పరిణామానికి దారితీస్తుంది.

శాసన సభల క్షీణతను గురించి ప్రముఖ రాజనీతి శాస్త్రజ్ఞులలో ఒకరైన లార్డ్ బ్రైస్ (Lord Bryce) " Modern Democracies" అనే గ్రంథంలో మొట్ట మొదటిసారిగా వివరించాడు. కె.సి.వేర్ Legislatures అనే గ్రంథంలో గతంలో కంటె శాసన నిర్మాణ శాఖ నిర్వహించే కార్యక్రమాలు అధికం అయ్యాయని, ఇదివరకటి కంటె ఎక్కువ కాలాన్ని ఈ శాఖ కర్తవ్య నిర్వహణకు వినియోగిస్తోందని, ఇది పరిశీలించే అంశాల సంఖ్య కూడా బాగా పెరిగిందని, అధికారాలు కూడా పెరిగాయని కానీ కార్య నిర్వాహక వర్గం అధికారాలు చెలాయించడంతో పోలిస్తే శాసన నిర్మాణశాఖ విషయంలో క్షీణత కనిపిస్తుందని అంటాడు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఈ క్షీణత అధికారాలకు సంబంధించినదా? సామర్థ్యానికి సంబంధించినదా అన్న ప్రశ్నకు సమాధానం వెలికితే వాస్తవ పరిస్థితిని అవగాహన చేసుకోవచ్చు. రెండు ప్రపంచ యుద్ధాలు తరవాతి కాలంలో వచ్చిన మార్పులు, ప్రజావసరాలు పెరగడమేకాకుండా వాటి స్వరూపంలో మార్పులు రావడం, ఆర్థిక సంక్షోభం సమష్టి వాద లేదా సామ్యవాద శ్రేయోరాజ్యాల స్థాపన. అంతర్జాతీయ ఉద్రిక్తతలు మొదలైనవి కార్య నిర్వాహక వర్గం ఆధిక్యతను పెంచాయి. కార్య నిర్వాహక వర్గంతో ఉన్న సంబంధాలలో ప్రపంచ వ్యాప్తంగా శాసన నిర్మాణశాఖల క్షీణత స్పష్టంగా కనిపిస్తుంది. శాసన నిర్మాణశాఖల సామర్థ్యాన్ని పెంచవలసిన అవసరాన్ని వివిధ దేశాల ప్రభుత్వాలు గుర్తించాయి. ఈ మార్గంలో సంస్కరణలు కూడా చేశాయి. ఈ సంస్కరణలు ముఖ్యంగా ఇంగ్లండ్, అమెరికా దేశాలలో ప్రారంభమయ్యాయి. అమెరికాలో 19వ శతాబ్దం చివరి నాటికే రాజకీయ వేత్తలు, జర్నలిస్టులు, మేధావులు సంస్కరణల ఆవశ్యకతను గుర్తించి ఆలోచించడం మొదలు పెట్టారు. శాసన నిర్మాణ శాఖలకు అనుబంధంగా పనిచేసే గ్రంథాలయాలలో రెఫనెన్స్ సర్వీసెస్ (reference/services), పరిశోధన సౌకర్యాలు ఏర్పాటు ప్రారంభమైంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాలు ప్రవేశపెట్టడం జరిగింది. అమెరికాలో రోల్ కాల్ ఓటింగ్ (roll Call Voting) బడ్జెట్ పునఃపరిశీలన, ఆడిట్‌ను ఏర్పాట్లు మొదలయ్యాయి. 1913లో అమెరికాలో శాసన నిర్మాణశాఖ పునఃవ్యవస్థీకరణ చట్టం రూపొందింది. దీని ఫలితంగా ఉపకమిటీలను నియమించడం, కమిటీల సంఖ్య తగ్గించి సామర్థ్యం పెంచే కృషి చేయడం జరిగింది. కమిటీ వ్యవస్థను బలపరిచే విధంగా తగిన కృషి అమెరికా దేశపు కాంగ్రెస్ జరిపినట్లు తెలుస్తోంది. ఈ కారణం చేతనే ఉడ్రోవిల్సన్ (Woodrow Wilson) "Congress in Committee rooms is Congress at Work." అని అన్నాడు. కమిటీలు శాసనసభకు చెవులు, కళ్లు, మొదడుగా పనిచేస్తాయని అమెరికా పౌరులు భావిస్తారు. అందువల్ల సాధారణచర్చ సభావేదికపైన సభాకార్యక్రమాలకు సంబంధించిన వివరమైన చర్చ సభాకమిటీలలోనూ జరుగుతుంది. సీనియారిటీ, అభీష్టం, పార్టీ పాత్రిపదికపై కమిటీ సభ్యుల నియమకాలు జరుగుతాయి. ప్రత్యేకీకరణకు కూడా ప్రాధాన్యముంటుంది. కాంగ్రెస్‌ను పటిష్టంచేసే లక్ష్యంతో 1970 లో రూపొందించిన ఒక చట్టం (The Legislative Reorganisation Act) ఒక సంయుక్త కమిటీ ఏర్పాటును సూచించింది. ఈ కమిటీ చేసిన సూచనల మేరకు కాంగ్రెస్‌ను సంస్కరించారు. అందువల్లనే ఉడ్రోవిల్సన్ అన్నట్లు కాంగ్రెస్ కమిటీలు చిన్న చిన్న శాసనసభలుగా పనిచేయడం మొదలు పెట్టాయి.

ఏదైనా వ్యవస్థ పటిష్ఠంగా కొనసాగాలంటే అవసరమైన సంస్కరణలు జరుపుతూ ఉండాలి. "One must reform in order to preserve" అని బర్క్ (Burke) అంటాడు. 20 శతాబ్దంలో మూడో దశాబ్దం నుంచి పార్లమెంట్ కర్తవ్య నిర్వహణ సక్రమంగా జరగడానికి అవసరమైన సంస్కరణలు

మొదలయ్యాయి. ఈ వ్యవస్థను ఏ విధంగా సంస్కరించాలన్న విషయమై పార్లమెంట్ సభ్యులు (Sir Ivor Jennings, Bernard Crick) కంటే మేధావులు సుదీర్ఘంగా ఆలోచించారు. తగిన సూచనలు కూడా చేశారు. చట్టాలకు, న్యాయపరిపాలనకు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ సంఘాలను నియమించాలని, ప్రతిపక్ష సభ్యులకు, నూతన సభ్యులకు సభలో పాల్గొనే అవకాశాలను, సౌకర్యాలను పెంచాలని, ప్రభుత్వ అంచనాలకు సంబంధించిన సాధారణ చర్చ విస్తృతం చేయాలని (Ombudsman) అనే ఉద్యోగి నియామకం జరపాలని. లార్డ్స్ సభాసభ్యుల సంఖ్య తగ్గించడమే కాకుండా వీరి సభ్యత్వం పరిమిత కాలం ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని, పార్లమెంట్ సమావేశాల కాలం పెంచాలని, పార్లమెంట్ సభ్యులకు నిపుణుల సహాయం సమకూర్చాలని, ప్రభుత్వ శాఖల అంచనాలపై వివరణాత్మక చర్చ కమిటీలు జరపాలని అంతేకాకుండా మంత్రులను కమిటీలలో సభ్యులుగా చేయాలని సూచనలు వచ్చాయి. ఇవికాక లైబ్రరీ సదుపాయాలు పెంచడం, కమిటీలు సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయడం, విషయం ప్రాతిపదికగా కమిటీలు ఏర్పాటుకావడం (Subject Committees) రహస్యంగా కాకుండా బహిరంగంగా కమిటీలు చర్చలు జరపడం ప్రశ్నోత్తరాల సమయం పెంచడం, అనధికార సభ్యులకు పార్లమెంట్ పాల్గొనే కాలవ్యవధి పెంచడం అవసరమని భావించడం జరిగింది.

నేడు బ్రిటీష్ పార్లమెంట్‌లో విషయం ప్రాతిపదికగా కొన్ని కమిటీలు పనిచేస్తున్నాయి. Committee on Science and Technology, Committee on Agriculture, Committee on Education మొదలైనవి. స్థాయీ సంఘాలు మునుపటికంటే ప్రత్యేకీకరణతో పనిచేస్తున్నాయి. పార్లమెంటులో ప్రతిపాదించే బిల్లుల రెండో పఠనానికి కమిటీలు ఏర్పడ్డాయి. స్థాయీ సంఘాలకు ఒకరి కంటె ఎక్కువ అధ్యక్షులను నియమించడానికి అవకాశం ఏర్పడింది. ఆర్థిక బిల్లులు స్థాయీసంఘాలకు నివేదించడానికి, బిల్లులపై మూడో పఠనం కాలంలో చర్చ తొలగించడానికి, జాతీయ పరిశ్రమలకు చెందిన కమిటీ అధికార పరిధి పెంచడానికి, కమిటీలు నిపుణులను నియమించుకోడానికి, ఉపసంఘాలసంఖ్య పెంచడానికి కమిటీలు బహిరంగ చర్చలు జరపడానికి ఏర్పాట్లు జరిగాయి.

భారత పార్లమెంటు సమర్థవంతంగా పనిచేయడానికి తగిన చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలను పార్లమెంటు సభ్యులు, మేధావులు, రాజనీతిజ్ఞులు వెల్లడిచేస్తూవచ్చారు. పార్లమెంటును పటిష్ఠం చేసే కృషిలో భాగంగా 1956లో Automatic Vote Recorder సహాయంతో ఓటింగు ఫలితాలు తెలుసుకోవడం మొదలయింది. సభాకార్యక్రమాల కాలం సద్వినియోగం చేయడానికి Business Advisory Committee సలహా మేరకు కార్యక్రమ నిర్వహణ మొదలైంది.

ఇక కమిటీల విషయాలకు వస్తే వీటిని మరింత ప్రయోజన కరంగా తీర్చిదిద్దడానికి, మెరుగుపరచడానికి కృషి జరిగింది. ఈ కృషిలో భాగమే ప్రభుత్వ హామీల సంఘం (Government Assurances Committee), షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ సంఘం (Committee on the Welfare of Schedule Castes and Scheduled Tribes), విషయప్రాతిపదికపై పనిచేసే సంఘాలు (Subject Committees), Committee on the Papers Laid on the Table అనే సంఘాల ఏర్పాటు. కమిటీ సిఫార్సులపై ప్రభుత్వం తీసుకొన్న చర్యలకు సంబంధించిన నివేదికలు తయారుచేసి పార్లమెంటుకు సమర్పించడమనే పద్ధతిని కూడా భారత పార్లమెంటు కమిటీలు మొదలు పెట్టాయి. కాల్ అటెన్షన్ నోటీసులు, అత్యంత ప్రజాప్రాముఖ్యంగల విషయాలపై చర్చలు జరపడం కూడా ప్రారంభమైంది.

భారత పార్లమెంటు కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి తోడ్పడే సూచనలకు (Institute of Constitutional and Parliamentary Studies) వంటి సంస్థలు చేశాయి. పార్లమెంట్ సభ్యులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని, కమిటీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా రూపొందించాలని, పార్లమెంట్ సభ్యుల ప్రత్యేక హక్కులు Previleges) క్రోడీకరించాలని, బిల్లులను మరింత వివరంగా పరిశీలించాలనే అభిప్రాయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రాలలో ప్రతి మంత్రిత్వ శాఖలోనూ ఒక పార్లమెంట్ సెల్ (Cell) ఏర్పరచాలని, కమిటీ సమావేశాలు జరుపుతున్నప్పుడు ప్రజలు నేరుగా విన్నపాలు, ప్రాతినిధ్యాలు పంపడానికి అవకాశం ఉండాలని కూడా ప్రతిపాదనలు వచ్చాయి. కమిటీలకు నిపుణుల సహాయం, గవర్నరు ప్రసంగం నుంచి కూడా హామీలను సమీకరించి పరిశీలన జరపడం, ప్రభుత్వ రంగ పరిశ్రమలకు, ప్రజల విజ్ఞాపనలకు సంబంధించి పార్లమెంటరీ కమిటీల పరిశీలన పరిధిని విస్తరించాలనడం మరికొన్ని సూచనలకు ఉదాహరణలు.

పార్లమెంట్ స్థాయిని మెరుగు పరచాలన్న భావన సర్వత్రా గురించమైందని పై విషయాలను బట్టి తెలుస్తోంది.

20.7 ద్విసభా పద్ధతి (Bicameralism)

ప్రజలకు, ప్రభుత్వానికి సంధాన కర్తగా వ్యవహరించడంలో శాసన నిర్మాణశాఖ అత్యంత కీలకమైన పాత్ర వహించాల్సి ఉంది. ఆర్. బి. జైన్ (R.B. Jain) అభిప్రాయంలో వర్తమాన దేశాలలో శాసన సభలు ఉద్రిక్తతల సడలింపు tension release, రక్షక కవాటం (Safety Volue), న్యాయబద్ధత (Legislation) కర్తవ్యాలను నిర్వహిస్తున్నాయి. అంటే పాలకుల అస్థిరత్వానికి న్యాయ బద్ధత కూర్చడం, ఉద్రిక్తతల సడలింపుకు అవసరమైన నిర్ణయాలు తీసుకోవడం, ప్రభుత్వానికి మద్దతు సమకూరుస్తూ రక్షణ కవచాలుగా వ్యవహరించడం వంటి పనులు చేస్తాయి. అంతేకాకుండా రాజకీయ నాయకులకు శిక్షణ సమకూరుస్తున్నాయి. పౌరులు రాజకీయ పదవులలో (శాసన సభ్యులుగా, మంత్రులుగా, సభాపతులుగా, దేశాధిపతులుగా) ప్రవేశించడానికి దోహదం చేస్తున్నాయి. శాసన నిర్మాణశాఖ సమర్థవంతంగా పనిచేయడానికి ఇందులోని సభలసంఖ్య కూడా కొంతవరకు దోహదంచేస్తుంది.

శాసన నిర్మాణ శాఖలో ఒకేసభ ఉన్నట్లయితే దాన్ని ఏక శాసన సభ అని, రెండున్నట్లయితే ద్విశాసన సభ అని అంటారు. రెండు సభలున్న పద్ధతిని ద్విసభాపద్ధతి (Bicameralism) అంటారు.

ద్విసభాపద్ధతి ప్రాచీన కాలంనుంచి ఉన్నట్లుగా తెలుస్తుంది. చారిత్రకంగా అతిప్రాచీన ఎగువసభ రోమన్ సెనేట్ (Roman Senate). ప్రజావ్యవహారాలను నిర్వహించడంలో అత్యంత నిలకడ చూపిన ప్రాజ్ఞత, వివేకంగల సభగా ఇది పేరుపొందింది. ప్రాచీన గ్రీకు దేశంలో బౌలీ (Boule) అనే సంఘం అనుభవానికి, వివేకానికి పేరు పొందిన ప్రాజ్ఞులు (Elders) నగర రాజ్యపాలనకు చెందిన ఎక్లీషియా (Ecclesia) అనే సంఘం నిర్ణయాలను తిరిగి పరిశీలించేవారు. భారతదేశంలో కూడా ప్రాచీన కాలంలో ప్రౌఢ సభలుండేవి.

బ్రిటన్‌లోని హౌస్‌ఆఫ్ లార్డ్స్ (House of Lords) ఒక ప్రత్యే సభగా మూడో ఎడ్వర్డ్ (Edward III) కాలంలో 1377లో అవతరించింది. కులీనులకు (Nobles) ప్రాతినిధ్యం కల్పించడానికి House

of Lords, సామాన్యులకు ప్రాతినిధ్యం వహించడానికి House of Commons అని రెండు సభలుగా బ్రిటన్‌లోని శాసన నిర్మాణ శాఖ విడిపోయింది.

ఆధునిక కాలంలో ద్విసభాపద్ధతికి చెందిన సిద్ధాంతాన్ని అమెరికా రాజ్యాంగవేత్తలు ప్రారంభించారు. రాజ్యాంగసదస్సు సభ్యులలో ఒకరయిన మాడిసన్ (Madison) పరిపాలకులనుంచి పౌరులను రక్షించడానికి సెనెట్ ఏర్పాటు అవసరమని సూచించాడు. అయితే ఈ దేశంలోని ఫెడరల్ వ్యవస్థలో అంతర్భాగాలైన రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షించడానికి, చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా రాష్ట్రాలకు ఫెడరల్ ప్రభుత్వ వ్యవస్థలో ప్రాతినిధ్యం సమకూర్చడానికి సెనేట్‌ను ఏర్పాటుచేయడం జరిగింది. శాసన నిర్మాణ శాఖలో ఒకే సభ ఉన్నట్లయితే అది నిరంకుశంగా వ్యవహరించే అవకాశం ఉందని రాజ్యాంగ నిర్మాతలు గాఢంగా నమ్మారు. ఈ నమ్మకం కూడా సెనేట్ ఆవిర్భావానికి తోడ్పడింది. అమెరికా అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ కాంగ్రెషనల్ గవర్నమెంట్ (Congressional Government) అనే గ్రంథంలో సెనేట్ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ప్రజల భావాల కనుగుణంగా నిర్ణయాలు తీసుకొనే ప్రతినిధుల సభ ఉన్నప్పటికీ ఆ సభ నిర్ణయాలు అనుచితమైనపుడు వాటిని తిరస్కరించడానికి సెనేట్ తప్పనిసరిగా ఉండాలని అంటాడు.

ఫ్రాన్స్‌లో 1875 లో ఎగువసభ అవతరించింది. రూసో (Rousseau) సైథిన్ అబ్బాన్ (Sieyes Abbas) భావాలవల్ల ప్రభావితులైన ఫ్రెంచి ప్రజలు శాసన నిర్మాణ శాఖలో ఎగువసభను వ్యతిరేకించారు. అయితే ఒకే సభతో కూడిన శాసన నిర్మాణశాఖ సక్రమంగా పనిచేయకపోవడంవల్ల మూడోఫ్రెంచ్ రిపబ్లిక్ రాజ్యాంగం ఎగువసభ ఏర్పాటుకు అవకాశం కల్పించింది. సెనేట్ (Senate), ప్రతినిధులసభ (Chamber of Deputies) ఎగువ, దిగువ సభలుగా నిర్ణయించడమైంది.

జర్మనీలో 1848 నుంచి ఎగువసభ ఏర్పాటుకు అవకాశం కలిగింది. భారతదేశంలో జాతీయ స్థాయిలోని శాసన నిర్మాణ శాఖలో 1921 లో ఎగువసభ మొదటి సారిగా ఏర్పడింది. ఎగువ సభను కౌన్సిల్ ఆఫ్ స్టేట్ (Council of State) అని, దిగువసభను నేషనల్ అసెంబ్లీ (National Assembly) అని వ్యవహరించేవారు. సమాజంలోని వివిధ వర్గాలకు సభ్యత్వం కల్పించడానికి ఈ ఎగువసభ బ్రిటీష్ ప్రభుత్వానికి సహాయ పడింది.

రాష్ట్రాలలో ఎగువసభల ఏర్పాటుకు 1935 భారత ప్రభుత్వ చట్టం అవకాశం కల్పించింది. బెంగాల్, బీహార్, సంయుక్త రాష్ట్రాలు, మద్రాసు, బొంబాయి, అస్సాం రాష్ట్రాలలో ఎగువ సభలు ఏర్పరచాలని ఈ చట్టం నిర్ణయించింది. ఇక వీటిలోని స్థానాల వివరాలకు వస్తే సాధారణ స్థానాలు (generalseats) ఐరోపావారికి స్థానాలు (European Seats), భారత క్రైస్తవులకు స్థానాలు (Indian Christian Seats) అని వివిధ రకాలుగా నిర్ణయమయ్యాయి. ఇవికాక కొన్ని స్థానాలను గవర్నర్ల నియామక పద్ధతి ద్వారా నిర్ణయించేవారు. అభ్యుదయ శాసనాలకు ప్రతిబంధకంగా ఉంటాయని సంప్రదాయ బద్ధంగా వ్యవహరిస్తాయని అంతేకాకుండా ప్రతిక్రియాత్మకంగా (Reactaray) వ్యవహరిస్తాయని భావిస్తూ ఆనాటి రాజకీయ నాయకులు రెండు సభల ఏర్పాటుపట్ల సుముఖత చూపలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత రూపొందిన రాజ్యాంగం అమలులోకి వచ్చేనాటికి బెంగాల్, బీహార్, బొంబాయి, మద్రాసు, పంజాబు, సంయుక్తరాష్ట్రాలలో ఎగువ సభలున్నాయి. తరవాత మధ్యప్రదేశ్, కర్ణాటక,

జమ్మూకాశ్మీర్‌లు రెండు సభలుండాలని నిర్ణయించాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎగువసభ 1958 ఏర్పడింది. అయితే 1985లో ఇది రద్దయింది.

20.8 ద్విసభాపద్ధతి : పెరుగుతున్న గుర్తింపు
(Bicameralism : Growing Recognition)

ఆధునిక కాలంలో శ్రేయోరాజ్యాలు పెరగడంతో శాసన సభల కర్తవ్యాలు పెరిగాయని ఇంతకు ముందు తెలుసుకొన్నాం. పార్లమెంటరీ విధానంలోనైనా, అధ్యక్ష విధానంలోనయినా శాసన నిర్మాణశాఖ తన కర్తవ్య నిర్వహణను సమర్థవంతంగాను, సక్రమంగాను జరపడానికి కర్తవ్యాలలో భాగస్వామ్యమున్న ఎగువసభలుండాలని అనేక దేశాలలో గుర్తించడం జరిగింది. సక్రమంగా వినియోగించిననాడు ఎగువసభ విజ్ఞాన, సమాచార, సముపార్జన సాధనం కాగలదని కెనడాలోని ఎగువసభ అయిన సెనేట్ రుజువుచేసింది. సాధారణ ఎన్నికల ద్వారా సాధ్యంకాని వివిధ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం కల్పించడానికి ద్విసభా పద్ధతి తోడ్పడుతుంది. ప్రపంచంలో చాలా దేశాలు ఈ నాడు ద్విసభాపద్ధతికి విలువ, గుర్తింపు ఇచ్చాయి. ఇంచుమించుగా అన్ని కామన్‌వెల్త్ (Commonwealth) దేశాలలోనూ ఎగువసభలున్నాయి. మూడో ప్రపంచ దేశాలలో కూడా ఎగువ సభల ప్రాధాన్యతను అంగీకరించడం జరిగింది. విస్తీర్ణంలో చాలా చిన్నవయిన బహామాస్ (Bahamas), ఫిజీ (Fizi) గ్రెనేడా (Greneda), జమైకా (Jamica) వంటి దేశాలు ద్విసభాపద్ధతిని అనుసరిస్తున్నాయి. జాన్ బాక్స్‌టన్ (John Baxton) రాసిన World Legilatures లో ప్రపంచంలో 55 దేశాలు ద్విసభాపద్ధతిని అనుసరిస్తూ ఉన్నాయని వివరించడమైంది. జె. ఎ. ఆర్. మారియట్ (J.A.R. Marriot) చెప్పినట్లు ప్రభుత్వ విధానం ఎటువంటిదైనా ఏ ఆధునిక రాజ్యం కూడా ఎగువ సభల ఏర్పాటుకు అనంగీకారయోగ్యం కాలేదు.

ఒక పక్క ద్విసభాపద్ధతిని అనేక దేశాలు గుర్తిస్తున్నా మరో పక్క ఈ విధానంవల్ల ఫలితాలేమిటి? శాసన నిర్మాణ శాఖలో ఎగువసభలుండాలా? అనే విషయాలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతూనేఉంది. వివిధ దేశాల దిగువసభలలో ఈ విషయాలపై చర్చ జరిపి ఎగువసభలు రద్దపరచాలన్న ప్రతిపాదనలు చేయడమూ ఉంది. ఎగువసభల ఏర్పాటుకు అనుకూలురూ, ప్రతికూలురూ సమాన స్థాయిలో వాదనలు జరిపారు. ఇలా జరిపిన వారిలో రాజనీతి శాస్త్రజ్ఞులు, రాజనీతిజ్ఞులు రాజకీయ వేత్తలు కూడా ఉన్నారు. ఇప్పుడు ఈ రెండు విధాల వాదనల వివరాలను తెలుసుకొందాం.

దిగువసభ సక్రమంగా ఆలోచించకుండా తొందరపాటుతోచేసిన శాసనాలు అమలుపరచడాన్ని నిరోధించడానికి ఎగువసభ ఏర్పాటు తోడ్పడుతుందని ద్విసభా పద్ధతి అనుకూలురు వాదిస్తారు. సాధారణంగా దిగువసభ కొత్త దనాన్ని తన నిర్ణయాలలో చొప్పించడం పట్ల ఉత్సాహం చూపుతుందని అలా చేయడంలో ఉచితానుచితాలు ఆలోచించకపోవచ్చునని వీరిభావం. ఒకసారి తీసుకొన్న నిర్ణయాలను తిరిగి పరిశీలించడం వల్ల దిగువసభ ఉద్రిక్తతను చల్లబరచడానికి వీలవుతుంది. సెనెటోరియల్ ఛేంబర్ (Senetorial Chamber) అనే సాసర్ (Saucer) లో ఉంచడం ద్వారా శాసన ప్రక్రియను చల్లబరచడం మాకోరిక అని అమెరికా మొదటి అధ్యక్షుడు జార్జివాషింగ్‌టన్ అంటాడు.

జె. ఎస్. మిల్ (J.S. Mill), డబ్ల్యూ. ఇ. హెచ్. లీకీ (W.E.H. Leeky) వంటి రాజనీతి శాస్త్రజ్ఞులు ద్విసభా పద్ధతిని సమర్థించారు. ఏక శాసన సభలో ఎటువంటి అడ్డూలేని మెజారిటీ సులభంగా నిరంకుశం కాగలదు అని జె. ఎస్. మిల్ అంటాడు. సర్వశక్తిమంతమైన ఒకే సభున్న ప్రభుత్వం కంటే హీనమైన ప్రభుత్వం తనకు తెలియదని, ఒకే సభున్న శాసన నిర్మాణశాఖలో వాస్తవమైన చర్చలు జరిగే అవకాశం ఉండదని, అపరిమితాధికారం నిరంకుశత్వానికి దారితీస్తుందని లీకీ అంటాడు.

అనుభవజ్ఞులు, విజ్ఞానులు, మేధావులు మొదలైన వారికి ప్రాతినిధ్యం కల్పించడానికి, వారి అమూల్యమైన సలహాలు స్వీకరించడానికి, తద్వారా రాజకీయ ప్రయోజనాలు పరిరక్షించడానికి ద్విసభా పద్ధతి ఉపయోగిస్తుందని ఈ పద్ధతిని సమర్థించే వారు అంటారు.

శాసన నిర్మాణ భారం అధికంగా ఉన్నప్పుడు శాసన నిర్మాణ శాఖకు రెండు సభల ఏర్పాటు పని విభజన చేయడానికి అవకాశం ఇస్తుంది. దీనితో దిగువసభల పనిభారం తగ్గుతుంది. వివాదాస్పదం కాని విషయాలలో శాసన ప్రతిపాదనలు ఎగువసభ చేయడం ద్వారా దిగువసభలనుంచి వచ్చిన బిల్లులను పునఃపరిశీలన చేయడం ద్వారా ప్రజాభిప్రాయ సమీకరణకు, ప్రకటనకు అవసరమైనంత జాప్యం చేయడం ద్వారా సమర్థవంతమైన ప్రజాప్రయోజన కరమైన శాసన నిర్మాణానికి ఎగువసభలు దోహదం చేస్తాయి.

ఇక ద్విసభా పద్ధతి వ్యతిరేక వాదానికి వస్తే, ఎగువసభ ఏర్పాటు అనవసరమని, ప్రజాస్వామ్య వ్యతిరేకమైందని, అంతేకాకుండా అవసరపు ఖర్చుకు అవకాశమిస్తుందనే భావాలున్నాయి. నిజానికి ఎగువసభలు, దిగువసభలు నిర్వహించని ప్రత్యేక కర్తవ్యాలేవి నిర్వహించవని అందువల్ల దీని ఏర్పాటు అనవసరమని ద్విసభా పద్ధతి వ్యతిరేకులు వాదిస్తారు. (Abbe Sieyes) చెప్పిన "దిగువ సభచేసిన దానిని ఎగువసభ ఆమోదిస్తే అది అనవసరమని, భిన్నాభిప్రాయం ప్రకటిస్తే కొంచె తనమవుతుంది" మాటలను వీరు ఉదహరిస్తారు. సమర్థవంతమైన ఒకే సభ ఆధునిక రాజ్య అవసరాలను తీర్చగలదని హెచ్. జె. లాస్కీ అంటాడు.

ప్రత్యేక ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేదిగా ఎగువసభలు వ్యవహరిస్తాయని, ఇవి ప్రజాస్వామ్య విధానానికి, అంతేకాకుండా రాజకీయ నిరుద్యోగులు శాసన నిర్మాణ శాఖల ప్రవేశించడానికి పెరిటిగుమ్మాలుగా ఇవి పనికొస్తాయని ద్విసభా పద్ధతి వ్యతిరేకులు అంటారు.

ఎగువ సభల ఏర్పాటు అనవసరపు ఖర్చుకు అవకాశమిచ్చే ఆడంబరం (luxury) అని, ఈ కారణంగా ప్రభుత్వ ఖజానాకు ఇవి భారంగా పరిణమిస్తాయని కూడా ఎగువసభలను వ్యతిరేకించే వారంటారు.

ఇటీవలి కాలంలో భారత దేశంలో కొన్ని రాష్ట్రాలలో ఎగువసభలు రద్దు అయ్యాయి. 20 వ శతాబ్దంలో 6,7,8 వ దశాబ్దాలలో ఎగువ సభల రద్దు ప్రతిపాదనలు వచ్చాయి. 1969లో పశ్చిమ బెంగాల్‌లోను, అదే సంవత్సరంలో పంజాబ్‌లోను విధాన మండలులు రద్దయ్యాయి. 1970 లో శాసన మండలి రద్దుచేయాలని రాష్ట్ర దిగువసభ తీర్మానం చేసింది. కానీ ఈ తీర్మానాన్ని రద్దుచేస్తూ

మరొక తీర్మానం అదే సంవత్సరంలో ఆమోదించింది. 1970 లో ఉత్తర ప్రదేశ్ విధానసభ విధానమండలి రద్దు తీర్మానాన్ని ఆమోదించింది. కానీ 1978 వరకూ తీర్మానం చెల్లుతుందా లేదా అని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా మరొక తీర్మానం అవసరమవుతుందని కేంద్రం తెలియజేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి తీర్మానాన్ని 1978 తరవాత పంపలేదు. 1985 లో ఆంధ్రప్రదేశ్ విధానమండలి రద్దయింది. ఎగువసభలు రద్దుచేయడం సమంజసమాకాదా అన్న ప్రశ్న ఇప్పుడు ఉదయిస్తుంది.

ప్రజా ప్రయోజనాలకు ప్రతిబంధకంగా ఉండే వ్యవస్థ అయినా రద్దుచేయడం అసమంజసం కాదు. ఆవ్యవస్థ ఎగువసభకావచ్చు. దిగువసభ కావచ్చు. మరేదైనాకావచ్చు. అయితే రద్దు చేయాల్సిన అన్యాయమైందని చెప్పకతప్పదు. రాజకీయ ప్రయోజనాలకోసం ఆర్థిక, తదితర కారణాలను మిషగా చూపుతూ చేసే రద్దు మాత్రం అంగీకార యోగ్యంకాదనే చెప్పాలి.

20.9 శాసన నిర్మాణశాఖ, కార్యనిర్వాహక వర్గం సంబంధాలు

శాసన నిర్మాణశాఖ, కార్యనిర్వాహక వర్గాలమధ్య సంబంధాలు వ్యవస్థ స్వరూప స్వభావాలపై ఆధారపడి ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా కార్యనిర్వాహక వర్గంతో ఉన్న సంబంధాల విషయంలో శాసన నిర్మాణశాఖ క్షీణించిందని, దీనికి వివిధ కారణాలున్నాయని తెలుసుకొన్నాం. బ్రిటన్‌లో సిద్ధాంతరీత్యా పార్లమెంటుకు సార్వభౌమత్వముంది (Supremacy of Parliament) ఈ దేశంలోని రాజకీయాలను తెలిపే గ్రంథాలు సాధారణంగా "The Power of parliament", "The Impact of Parliament on the Executive", "The Influence of Parliament over the executive" అనే వ్యావహారిక పదజాలాన్ని తరచు వింటున్నాం. అయితే ఇక్కడ పార్లమెంటు, కార్యనిర్వాహక వర్గం అనే ప్రభుత్వ శాఖలున్నాయని, ఈ రెండింటికి నిర్దిష్టమైన సంబంధాలున్నాయని తెలుస్తుంది. శాసన సభ కార్యనిర్వాహక వర్గాన్ని సవాలు చేయవచ్చని, కామన్స్ సభ్యులు వ్యక్తిగతంగానూ, సమిష్టిగానూ కార్యనిర్వాహకవర్గాన్ని నియంత్రణ చేయవచ్చని తెలుస్తుంది. అయితే కార్యనిర్వాహక వర్గానికి, శాసనసభకు ఉన్న సంబంధాలను నిర్ణయించే టప్పుడు మరికొన్ని విషయాలను తెలుసుకోవాల్సి ఉంటుంది. సంబంధాల నిర్ణయంలో రాజకీయ పార్టీలకు ప్రమేయముటుంది. అంతేకాకుండా పార్టీలలోని అంతర్గత విషయాలు, రాజకీయ పక్షాల నాయకుల శక్తి యుక్తులు, నూతన సభ్యులు (back benchers) ప్రజాభిప్రాయం కూడా ఈ రెండు శాఖల సంబంధాలపై వీటికి ప్రభావం ఉంటుంది.

పైన వివరించిన విషయాల ప్రభావం వివిధ దేశాలలో వేరువేరు రూపాలలో ఉంటుంది. ఫ్రాన్స్‌లోని 5 వ రిపబ్లిక్ రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వంలో పార్లమెంటరీ, అధ్యక్షతరహా లక్షణాలు కనిపిస్తాయి. అధ్యక్షపదవికి ప్రత్యక్ష ఎన్నికల ఏర్పాటు కార్యనిర్వాహక వర్గం ఆధిక్యతను చూపుతుంది. అంతేకాకుండా అధ్యక్షపదవికి హెచ్చు హోదాను 5వ రిపబ్లిక్ మొదటి అధ్యక్షుడు జనరల్ డీగాల్ కల్పించాడు. అయినప్పటికీ ప్రభుత్వం కొనసాగడం, ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన పార్టీకి శాసనసభలోఉన్న మద్దతుపై ఆధారపడి ఉంటుంది. బ్రిటన్‌లో మాదిరిగానే ప్రభుత్వానికి, నూతన సభ్యులకు ఉన్న సంబంధం శాసన నిర్మాణ, పాలక శాఖల సంబంధాలను నిర్ణయిస్తుంది. ఫ్రాన్స్‌లో అధికారపార్టీ అంతర్గత నిర్మాణానికి కాకుండా పార్టీల మధ్య సంబంధాలు శాసన నిర్మాణ,

కార్యనిర్వాహక వర్గాల సంబంధాలు నిర్ణయించడంలో ప్రభావ కారకాలుగా పనిచేస్తాయి. ఉదాహరణకు, 1958 లో అధికారాని కొచ్చిన గాలిస్టుపార్టీ (Gaulist Party) పార్లమెంటులో ఒకటి రెండు మైనర్ పార్టీల మద్దతుపై కూడా ఆధారపడాల్సి వచ్చింది. పార్టీ వైఖరితో వ్యవహరించే ప్రతిపాలక బృందం పాత్ర కూడా ఈ దేశంలో రెండు శాఖల మధ్య సంబంధాలు నిర్ణయించడంలో ముఖ్యమైన పాత్ర వహించాయి. ప్రెంచి పార్లమెంట్ సభ్యులకు ప్రభుత్వాన్ని విమర్శించడానికున్న పరిమిత అవకాశాలు బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల వ్యవస్థల మధ్య ఉన్న తేడాలను సూచిస్తాయి. బ్రిటన్‌లో ప్రశ్నోత్తరాలకు ప్రతిరోజు కేటాయిస్తే (పార్లమెంట్‌రీ కార్యక్రమాలలో), ఫ్రాన్స్‌లో వారానికొకసారి కేటాయించడం జరుగుతుంది. అదీ శుక్రవారం మధ్యహ్న సమయంలో ఫ్రాన్స్‌లో ప్రతిపక్షంలో ఒకే పార్టీ ఉండదు. దినితో ప్రత్యక్షంగా వ్యవహరించే పార్టీలలోని విభేదాలు సమర్థవంతమైన శాసన నిర్మాణ ప్రక్రియకు అంతరాయం కల్పించవచ్చు.

పైచర్చలను బట్టి కార్యనిర్వాహక, శాసన నిర్మాణ శాఖల సంబంధాలను వివిధ కోణాలనుంచి పరిశీలించాలని స్పష్టమవుతుంది.

20.10 శాసన సభల గురించి అధ్యయనం

ఇటీవలికాలం వరకు శాసనసభలను గురించిన అధ్యయనం వాటి విధులు, అధ్యక్షుల అధికారాలు వంటి విషయాలకు పరిమితమై ఉండేది. ఇక రెండో స్థాయిలో శాసనసభ్యుల మనోభావనలను గురించిన అధ్యయనాలకు ప్రాధాన్యం ఏర్పడింది. వీరి ప్రవర్తనకు, భర్తీ విధానాలకు సంబంధించిన విషయాల పఠనం గత రెండు దశాబ్దాలుగా మొదలైంది. శాసన సభ్యుల నిర్ణయాలను అంచనావేయడానికి సంబంధించిన విషయాల పరిశీలన తగినంతగా జరగలేదనే చెప్పాలి. ఇటువంటి పరిశీలన జరగనినాడు శాసన సభలో చర్చకు వచ్చే ప్రధాన సమస్యలు లేదా కీలక సమస్యలను ప్రయోజనాత్మకంగా అంచనా వేయడానికి వీలుండదు. శాసనసభల స్వరూప స్వభావాలను ఖచ్చితంగా నిర్ణయించలేము.

దేశ రాజకీయాలలో శాసన సభలు ప్రధానమైన నిర్మితులలోకి వస్తాయి. ఇవి ఉత్పాదక నిర్మితులుగా వ్యవహరిస్తాయి. ఎందువల్లనంటే ఈ సభల కార్యక్రమాలలో వివిధ భావాలు, అభిప్రాయాలు ప్రకటితమవుతాయి. వీటి ఆధారంగా విధాన నిర్ణేతలు ప్రజావసరాలను, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను ప్రాతిపదికగా చేసుకొని శాసన ప్రతిపాదనలు చేయవచ్చు. అంటే ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలకు విధాన నిర్ణేతలు స్పందిస్తూ శాసన ప్రతిపాదనలు చేయవచ్చు. ప్రభుత్వ విధానాలను కూడా రూపొందించవచ్చు. అందువల్ల శాసన సభ్యుల అభిప్రాయాలను గురించి అధ్యయనాల అవసరం ఎంతో ఉంది.

ప్రభుత్వశాఖలు నిర్వహించే నియమావళి అమలు పరచడం అనే కర్తవ్య నిర్వహణ ఏ విధంగా జరుగుతున్నదనే విషయాన్ని శాసనసభలు పర్యవేక్షిస్తాయి. పర్యవేక్షణ సంబంధమైన విధిని శాసనసభ్యులు ఎంతవరకూ నిర్వహిస్తున్నారనే విషయ పరిశీలన కూడా ఎంతో అవసరం. ప్రభుత్వం శాసనసభకు ఎంతవరకు బాధ్యత వహిస్తున్నది? ఈ కర్తవ్యాన్ని ప్రభుత్వం ఎంతవరకూ నిర్వహిస్తున్న విషయాన్ని శాసన సభలు ఎంతవరకూ పరిశీలిస్తున్నాయి అనే విషయాల పరిశోధన ద్వారా ప్రభుత్వ

సామర్థ్యాన్ని, శాసనసభల స్థాయిని నిర్ణయించడానికి వీలవుతుంది. నియమావళి నిర్వహణ ఏ విధంగా జరుగుతున్న దన్న విషయాన్ని శాసనసభలు వివిధ కమిటీల సహాయంతో పరిశీలిస్తాయి. భారతదేశంలో ముఖ్యంగా అంచనాల సంఘం, ప్రభుత్వ ఖాతాల పరిశీలన సంఘం, ప్రభుత్వ హామీల సంఘం ఈ పరిశీలనలో ప్రముఖ పాత్రవహిస్తాయి. కమిటీల ద్వారా చేసే ప్రాముఖ్యమున్న విషయాలపై చర్చ సమయంలోను, ఇతర కార్యక్రమాలలోను కూడా నియమావళి నిర్వహణపై పర్యవేక్షణ కర్తవ్యాన్ని శాసనసభలు నిర్వహిస్తాయి. కర్తవ్య నిర్వహణ సంబంధమైన పరిశోధనలు భారతదేశంలో తగినంతగా జరగలేదనే చెప్పాలి.

శాసనసభల అతిముఖ్యమైన కర్తవ్యం నియమావళి రూపకల్పన లేదా శాసన నిర్మాణం. ఈ కర్తవ్య నిర్వహణలో ఎందరు, ఏ విధంగా ఎంతవరకూ పాల్గొంటున్నారో తెలుసుకోవడం అవసరం. ఇది వ్యవస్థ స్వరూపం, సభ్యులశక్తి యుక్తులు, వారి సాంఘిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యం (Background) పార్టీ వ్యవస్థ, కాలవ్యవధి, నాయకత్వ ధోరణి వంటి విషయాలపై ఆధారపడి ఉంటుంది. నియమావళి రూపకల్పనతోబాటు నియోజకులకు సేవలందించడం కూడా శాసన సభ్యుల కర్తవ్యం. వర్ధమాన దేశాలలో ఈ కర్తవ్యానికి సభ్యులు ఎక్కువ ప్రాధాన్యమివ్వాల్సి ఉంటుంది. ఇస్తారు కూడా.

శాసనసభల కర్తవ్య నిర్వహణలో ప్రభావ వర్గాల పాత్ర ఉంటుంది. వీరు సభ్యులను కలుసుకొని తమ ప్రయోజనాల పరిరక్షణకు అనువైన శాసనాలు, నియమాలు రూపొందేటట్లుగా ప్రయత్నిస్తారు.

శాసన సభ్యుల ప్రవర్తన సంబంధమైన అధ్యయనాలు ఒక్క శాసన నిర్మాణంలో వారి పాత్రకు మాత్రం పరిమితం కాకూడదు. వివిధ వ్యవస్థలలో వీరిపాత్ర ఎటువంటిదన్న తులనాత్మక పరిశీలన కూడా అవసరం.

— డా. పి. మాణిక్యాంబ

20.11 చదువదగిన పుస్తకాలు

1. Jain R.B. : Legislative Process in Development, Gilaryah publishing House, New Delhi, 1985
2. Kornberg A. : Legislatures in Comparative Perspective, David, Mckay Company Inc, New York, 1973
3. Leowenberg Gerhard, Samuel C. Patterson and and Malcolm E. : Handlook of Legislative Research, Harward University Press, Massachusetts, 1985
4. Norton Philip (Ed) : Legislatures, Oxford University Press, Oxford, 1990
5. Oslon David M. : The Legislative process A comparative Approach, Harper and Row Publishers, New York, 1980

6. Subhash C Kasyap : Parliament of India: Myths and Realities, National Publishing House New Delhi, 1988

7. Sills David L : International Encyclopaedia of Social Sciences, The Macmillan Company, and the Free Press, New York, 1972, Vol. 9

8. Philip Norton, : Legislatures, Oxford University Press, Oxford, 1990

20.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయుండి.

1. శాసననిర్మాణ శాఖ విధులు నిర్మితులను చర్చించండి.

2. ద్విసభా పద్ధతి లాభనష్టములను పేర్కొనుము.

3. శాసన వర్గ, కార్యనిర్వాహణ వర్గ సంబంధాలను చర్చించండి.

* * * * *

ఖండం - V : నిర్మితులు

వివిధ రాజ్యాలు తమదైన నిర్మితులను ఏర్పరుచుకొంటాయి. ఆధునిక ప్రపంచ రాజ్యాలు ఏర్పర చుకొన్న నిర్మితులలో సమూహ్య, ఏకకేంద్ర నిర్మితులు ప్రధానమైనవి. వీటిని ఖండంలో చర్చించాం.

భాగం-21 : సమాఖ్య - ఏకకేంద్ర రాజ్యనిర్మితులు

విషయక్రమం

21.1 లక్ష్యాలు

21.2 పరిచయం

21.3.0 ఏకకేంద్ర రాజ్య వ్యవస్థ

21.3.1 ఏకకేంద్ర రాజ్య లక్షణాలు

21.3.2 ఏకకేంద్ర రాజ్యం - ఉపయోగాలు

21.3.3 ఏకకేంద్రరాజ్యం- నష్టాలు

21.3.4 ఆచరణలో ఏకకేంద్ర రాజ్యం

21.4.0 సమాఖ్యరాజ్యం

21.4.1 సమాఖ్యభావన - సిద్ధాంతపరమైన ఇబ్బందులు

21.4.2 సమాఖ్యరాజ్య ముఖ్యలక్షణాలు

21.4.3 సమాఖ్యవాదం - సమాఖ్య వ్యవస్థలు

21.4.4 సమాఖ్యల్లో కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

21.4.5 సమాఖ్యల అధ్యయనం

21.4.6 సమాఖ్య సిద్ధాంతం - ఆచరణ

21.5 చదువదగిన పుస్తకాలు

21.6 నమూనా పరీక్షా ప్రశ్నలు

21.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- ఏకకేంద్ర, సమాఖ్యరాజ్యాల నిర్మితులు
- వాటి ప్రధాన లక్షణాలు, అవి పనిచేసే తీరు
- వాటి అధ్యయన ప్రయోజనాన్ని బాగా వివరించగలుగుతారు.

21.2 పరిచయం

రాజ్యాలను లేదా ప్రభుత్వాలను వాటి నిర్మితుల (Structures) ననుసరించి వివిధ రకాలుగా వర్గీకరించవచ్చు. ఈ వర్గీకరణలను స్థూలంగా సాంప్రదాయక, ఆధునిక వర్గీకరణలుగా పేర్కొంటారు. అరిస్టాటిల్, ఇంకా ఇతర సాంప్రదాయక రాజనీతి తత్వవేత్తల వర్గీకరణలను సాంప్రదాయక వర్గీకరణలుగా పేర్కొంటారు. ఇవి ఆధునిక కాలంలో అంతగా ప్రాచుర్యంలో లేవు. ఆధునిక వర్గీకరణలో రాజ్యాలను లేదా ప్రభుత్వాలను ఏకకేంద్ర రాజ్యాలనీ, సమాఖ్యరాజ్యాలనీ, మళ్ళీ వీటిని పార్లమెంటరీ ప్రభుత్వాలనీ, అధ్యక్ష తరహా ప్రభుత్వాలనీ వర్గీకరిస్తారు. తులనాత్మక రాజనీతి శాస్త్రంలో రాజ్యవ్యవస్థల నిర్మితి, అవి పనిచేసే తీరు తెలుసుకుంటే రాజ్యాలను తులనాత్మకంగా అర్థం చేసుకునే అవకాశం కలుగుతుంది. ముఖ్యంగా ఆధునిక ప్రపంచంలోని రాజ్యాలు ఏకకేంద్ర, సమాఖ్య రాజ్యాలలో ఏదో ఒక రకానికి చెంది ఉన్నాయి. కాబట్టి వీటి అధ్యయనం రాజకీయ విశ్లేషణకు ఎంతో తోడ్పడుతుంది. ఈ పాఠ్యాంశంలో ఏకకేంద్ర, సమాఖ్య రాజ్యవ్యవస్థలు, వాటి లక్షణాలు, అవిపనిచేసే తీరు, వాటి సాధక బాధకాలు చర్చించబడ్డాయి.

21.3.0 ఏకకేంద్ర రాజ్యవ్యవస్థ

దేశమంతటికీ ఉన్న కేంద్ర ప్రభుత్వానికి ప్రాంతీయ లేదా స్థానిక ప్రభుత్వ వ్యవస్థలకు మధ్య ప్రభుత్వాధికారాల విభజన ఏ ప్రాతిపదికపై జరిగిందనే దాననిబట్టి ప్రభుత్వాలను ఏకకేంద్ర రాజ్యాలు (లేదా ప్రభుత్వాలు) గానూ, సమాఖ్య రాజ్యాలుగానూ వర్గీకరించవచ్చని కె.సి. వేర్ వేర్కొన్నాడు. రాజ్యాంగ బద్ధమైన ఆధునిక రాజకీయ వ్యవస్థల్లోని ప్రభుత్వాలు ఈ రెండింటిలో ఏదో ఒక వర్గానికి చెందే ఉన్నాయి. ఉదాహరణకు, బ్రిటన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్ లాంటి దేశాలు ఏకకేంద్ర ప్రభుత్వ వ్యవస్థలున్నటువంటివి, అలాగే అమెరికా సంయుక్తరాష్ట్రాలు, స్విట్జర్‌లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, ఇండియా, పాకిస్థాన్‌లు సమాఖ్య ప్రభుత్వ వ్యవస్థలున్నటువంటివి.

21.3.1 ఏకకేంద్ర రాజ్య లక్షణాలు

'ఏకకేంద్రవాదం' (Unitarism) లోని గూఢార్థాన్ని వివరిస్తూ, దాని లక్షణాన్ని డైసీ ఈ విధంగా పేర్కొన్నాడు. "ఒకే ఒక కేంద్ర ప్రభుత్వం సమున్నత శాసననిర్మాణాధికారాన్ని అలవాటుగా నిర్వహించే ఏకకేంద్ర ప్రభుత్వ వ్యవస్థ". కేంద్ర శాసన నిర్మాణ శాఖకు సమున్నత శాసన నిర్మాణాధికారం ఉండటమే ఏకకేంద్ర ప్రభుత్వ వ్యవస్థ సారాంశం. దేశం మొత్తానికి ఇదే శాసనాలను తయారు చేస్తుంది; మిగిలిన అన్ని శాసన నిర్మాణ సంస్థలు దీనికి లోబడి ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం దేశంలో ఏ ప్రభుత్వ సంస్థకైనా శాసనాలు నిర్మించే అధికారాన్ని ఇవ్వవచ్చు. కానీ చట్టరీత్యా వాటిని తోసివేసే అధికారం కేంద్రప్రభుత్వానికి ఉంటుంది. కాబట్టి ఏక కేంద్ర వ్యవస్థ స్థానిక సంస్థలు, కార్పొరేషన్లవంటి శాసననిర్మాణాధికారం కలిగిన వ్యవస్థలను నిరాకరించదు. ఐతే కేంద్ర ప్రభుత్వానికి వీటిని (ఈ సంస్థలు తయారుచేసే శాసనాలను) తోసిపుచ్చే అధికారం ఉంటుంది. కాబట్టి ఈ సంస్థలు కేంద్ర ప్రభుత్వ ఇష్టానిష్టాలపై ఆధారపడి మాత్రమే తమ శాసన నిర్మాణాధికారాలు నిర్వహించవలసి ఉంటుంది.

సమాఖ్య వ్యవస్థతో పోల్చిచూస్తే ఏకకేంద్రరాజ్యం స్వభావం స్పష్టమౌతుంది. సమాఖ్యలో కేంద్ర ప్రభుత్వము, రాష్ట్ర ప్రభుత్వాలు అనే రెండు స్థాయిలు ఉండి ఈ రెండు ప్రభుత్వాల మధ్య రాజ్యాంగ బద్ధమైన అధికార విభజన జరిగి తమ తమ పరిధుల్లో అవి న్యాయబద్ధమైన స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తాయి. కేంద్ర ప్రభుత్వ శాసన నిర్మాణ శాఖ (Central Legislature) దేశం మొత్తానికి స్పష్టమైన రంగాలలో శాసన నిర్మాణం చేయగలదు; అలాగే రాష్ట్ర ప్రాంతీయ ప్రభుత్వాలకు కూడా తమ రాష్ట్ర లేదా ప్రాంతీయ అవసరాలకోసం శాసనాలు చేసే కొన్ని నిర్దిష్టమైన అధికారాలు ఉంటాయి. ఈ రెండూ (కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు) ఒక దానికొకటి లొంగి ఉండవనీ, కాని రెండిటి మధ్యా సంఘీభావం (Coordination) ఉంటుందని కె.సి. వేర్ అన్నాడు.

దీనికి భిన్నంగా ఏకకేంద్ర రాజ్యంలో అధికారాలన్నీ ఒకే ఒక కేంద్ర ప్రభుత్వంలో కేంద్రీకృతమై ఉంటాయి. పాలనా సౌలభ్యం కోసం స్థానిక సంస్థలకు కొన్ని అధికారాలు ఇవ్వవచ్చు. బ్రిటన్‌లోని స్థానిక పరిపాలనా సంస్థలు చూలా బలమైన వ్యవస్థలే. చూడటానికి స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థలుగానే కనిపిస్తాయి. కాని ఇవి అనుభవించే అధికారాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చినవే, వీటిలో మార్పులు చేర్పులు చేయటం లేదా పూర్తిగా రద్దుచేసే అధికారం కూడా కేంద్ర ప్రభుత్వానికి ఉంది.

దీనిని బట్టి ఏకకేంద్ర ప్రభుత్వ వ్యవస్థగల రాజ్యం రెండు ముఖ్యమైన లక్షణాలను ప్రదర్శిస్తుందని తెలుస్తుంది. అవి (1) కేంద్రశాసన సభకున్న సమున్నత శాసన నిర్మాణాధికారం, (2) అలాంటి సమున్నతాధికారమున్న వ్యవస్థలు రాజ్యంలో మరేవీ లేకపోవటం. వీటిని గురించి వివరంగా తెలుసుకుందాం.

మొదటి లక్షణం ప్రకారం ప్రతి ఏకకేంద్ర రాజ్యంలోనూ సమున్నతాధికార మున్న ఒక శాసన నిర్మాణ శాఖ ఉంటుంది. బ్రిటీష్ రాజ్యాంగాన్ని ఉదహరిస్తూ డైసీ ఈ లక్షణాన్ని కింది విధంగా వివరించాడు.

(a) బ్రిటీష్ పార్లమెంటుకు ఏ చట్టాన్నైనా చేసే హక్కు, రద్దుచేసే హక్కు ఉంది.

(b) ఏ వ్యక్తిగానీ, సంస్థగానీ ఈ శాసనాలను ధిక్కరించలేరు, రద్దచేయలేదు.

(c) పార్లమెంటుకుగల పై అధికారాలు బ్రిటీష్ రాజ్యానికి మొత్తానికి వర్తిస్తాయి.

ఐతే ఒక విషయాన్ని ఇక్కడ స్పష్టంగా పేర్కొనాలి. పార్లమెంటుకున్న రాజ్యాంగబద్ధ సమున్నతాధికారం రాజ్యాంగ సమున్నతాధిపత్యాన్నే (ఒకవేళ రాజ్యాంగం ఉన్నట్లైతే) తోసి రాజనలేదు. కొన్ని ఏకకేంద్ర రాజ్యాలలో పార్లమెంటుకున్న సమున్నతాధికారం ఆయా దేశాల రాజ్యాంగాలకు లోబడి ఉంది. ఉదాహరణకు, ఐర్లండ్ రాజ్యాంగం విడాకులకు సంబంధించిన శాసనాలను నిర్మించే అధికారాన్ని పార్లమెంటును అనుభవించనివ్వదు. అలాంటి శాసనాలకు ఐర్లండ్‌లో ప్రత్యేకమైన ప్రజాభిప్రాయ సేకరణ అవసరమౌతుంది. కాబట్టి ఏక కేంద్ర రాజ్యాలలోని ప్రత్యేకత రాజ్యాంగ సమున్నతికి సంబంధించింది కాదు, అది శాసన నిర్మాణశాఖ సమున్నతత్వానికి సంబంధించింది మాత్రమే. రాజ్యాంగ

సార్వభౌమత్వంలోని ప్రత్యేకతేమిటంటే అది శాసన నిర్మాణశాఖ అధికారాలు రాజ్యాంగానికి లోబడి ఉండాలనేదే. కేంద్ర శాసన నిర్మాణశాఖ సమున్నతత్వంలోని అంతరార్థం దేశంలోని ఇతర శాసన నిర్మాణ సంస్థలు తనకులోబడి ఉండాలని చెబుతుంది. ఈ విషయాన్నే స్పష్టం చేస్తూ కె.సి. వేర్ ఇలా అన్నాడు.

> "To say that a Constitution is Unitary is to make am assertion not about the relationship of the legislature to the Constitution but the legislature to other law-making bodies in the country, are assertion that the legislature of the whole Country is superior to any such law- making body".

కేంద్ర ప్రభుత్వం తప్ప సమున్నతాధికారమున్న మరే ఇతర ప్రభుత్వ వ్యవస్థలు లేకపోవటమే ఏక కేంద్రరాజ్యం రెండో లక్షణమని ఈ చర్చవల్ల మనకు విశదమౌతుంది. కేంద్ర ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం తన చట్టాల ద్వారా స్థానిక సంస్థలకు కొన్ని శాసనాధికారాలు ఇవ్వవచ్చు. కానీ ఇవి సమున్నత శాసనాధికారాలు కావు. ఏకకేంద్ర ప్రభుతవ వ్యవస్థ ఉన్న ఇంగ్లండ్‌లో లండన్ కౌంటీ కౌన్సిల్ శాసన నిర్మాణాధికారాలున్న వ్యవస్థే. అయినప్పటికీ ఇది రాజ్యాంగం ద్వారా ఏర్పడిన వ్యవస్థకాదు. దీన్ని పార్లమెంటే తన శాసనం ద్వారా సృష్టించింది. కౌంటీ కౌన్సిల్ అధికారాలలో పార్లమెంట్ మార్పులు చేర్పులు చేయవచ్చు, లేదా దాని అధికారాలను పూర్తిగా రద్దుచేయనూవచ్చు. సమాఖ్యలో ఇలా జరిగేందుకు అవకాశం ఉండదు. రాష్ట్రాలకు సంక్రమించే అధికారాలు పార్లమెంటు ఇచ్చినవి కావు. అవి రాష్ట్రాలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అధికారాలు కాబట్టి కేంద్ర శాసనసభకు రాష్ట్రాల అధికారాలను మార్చే లేదా రద్దుచేసే అధికారం ఉండదు.

21.3.2 ఏకకేంద్ర రాజ్యం వల్ల ఉపయోగాలు

ఏకకేంద్ర ప్రభుత్వ వ్యవస్థవల్ల దేశం మొత్తానికి ఒకే రకమైన శాసనాలు, ఒకే రకమైన పాలన లభిస్తుంది. ఇది ఈ వ్యవస్థలోని ఒక సుగుణం. సమాఖ్యలో ఇలాకాక దేశంలోని వివిధ ప్రాంతాలకు భిన్నమైన శాసనాలు, భిన్నమైన పాలనా వ్యవస్థలు ఏర్పడతాయి. నరవర్గ భిన్నత్వమున్న ప్రజానీకానికి ఇది మేలు చేసేదే అయినప్పటికీ దేశ సమగ్రత దీనివల్ల బలహీనపడే ప్రమాదముంటుంది. ఏకకేంద్ర రాజ్యం సమగ్రతకు మారుపేరు. ఏక కేంద్ర రాజ్యంలో అధికారాలన్నీ ఒకేచోట కేంద్రీకృతమై ఉండటంవల్ల దృఢమైన ప్రభుత్వమేర్పడుతుంది, పాలనా వ్యవస్థ కూడా దృఢంగా ఉంటుంది. దృఢత్వము, స్థిరత్వము మంచి రాజ్య లక్షణాలు.

సమాఖ్యలో మాదిరిగా కాక ఏకకేంద్ర రాజ్యంలో పౌరులు ఒకే రాజ్యానికి, ప్రభుత్వానికి చెందినవారు. దీనివల్ల వారు తమ విధేయతను (allegiance) ఒకే ప్రభుత్వానికి చూపుతారు. సమాఖ్యలో దీనిని కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకోవాలి, ఇవి సంకుచితమైన ప్రత్యేకతల వైపు పౌరులను లాగి సమగ్రతకు భంగం వాటిల్లజేస్తాయి.

ఏక కేంద్ర రాజ్యం సరళమైంది. శాసనాలు చేయటం, పాలన చాలా సులువుగానూ, సరళంగానూ ఉంటుంది. సమాఖ్యలో సరళత (Flexibility) ఉండదు; శాసనాలు తయారుచేయటం, నిర్ణయాలు చేయటం (రాష్ట్రాల అనుమతి కావలసిన దృష్ట్యా) అంత సులువుకాదు. సమాఖ్యలో కాలయాపన కూడా ఉంటుంది. ఏకకేంద్ర రాజ్యం ఇందుకు పూర్తిగా భిన్నమైంది. పటిష్ఠమైన జాతీయ రక్షణ నేర్పరచటం, సమగ్రమైన విదేశీ విధాన నిర్వహణ దృష్ట్యాకూడా ఏకకేంద్ర రాజ్యం చాలా అనువైంది. ఏక కేంద్ర రాజ్యంలో శాసన నిర్మాణంలో, పాలనలో ద్వంద్వత్వం (duplicity) ఉండదు. కాబట్టి ఆర్థిక వనరులు దుబారా కావు.

23.3.3 ఏకకేంద్ర రాజ్యం వల్ల నష్టాలు

ఏక కేంద్ర రాజ్యంలో అధికారమంతా కేంద్రీకృతమై ఉంటుంది. అధికార కేంద్రీకరణలో ఉన్న ప్రమాదాలు అందరికీ తెలిసినవే. ఇది నియంతృత్వ ధోరణులకు దారి తీయవచ్చు. ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు కేంద్రీకరణ తీరని హాని కలుగ చేస్తుందని లాస్కీ వంటి బహుతావాద రాజనీతి శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

ఏకకేంద్ర రాజ్యం దూర ప్రాంతాలను సమర్థవంతంగా నిర్వహించలేదు. ఉదాహరణకు భారతదేశమే ఒక ఏక కేంద్ర రాజ్యంగా ఉందనుకోండి. ఢిల్లీలో ఉండే ప్రభుత్వం కన్యాకుమారి, మిజోరం లాంటి దూరప్రాంతాలలో పాలనను ఖచ్చితంగా అమలుపర్చగలదా? అలాంటి పరిస్థితుల్లో ఆయా ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురి అవుతాయి. దూరప్రాంతాలనుంచి ప్రభుత్వానికి సమాచారం కూడా సమయానికి అందదు. ప్రభుత్వానికి - అన్ని నిర్ణయాలూ ఒకే ప్రభుత్వం చేయవలసిన దృష్ట్యా - పాలన భారమవుతుంది. ఇవన్నీ ప్రభుత్వాన్ని అసమర్థతకు గురిచేస్తాయి. అందుకే ఏకకేంద్ర ప్రభుత్వ వ్యవస్థ పెద్ద రాజ్యాలకు పనికిరాదు.

అధికార కేంద్రీకరణ ప్రజాస్వామ్య సిద్ధాంతానికి విరుద్ధం. ప్రభుత్వంలో ప్రజాభాగస్వామ్యం పరిమితం కావటం వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు దూరం ఎక్కువై ఒకరి అవసరాల మరొకరు తెలుసుకునే అవకాశం లేక ప్రజలకు ప్రభుత్వమంటే ముభావం, నిర్లక్ష్యం ఏర్పడే అవకాశం ఉంది. ప్రభుత్వ కార్యకలాపాల్లో ప్రజలు ఆసక్తి చూపకపోవచ్చు.

ఏకకేంద్ర ప్రభుత్వ వ్యవస్థ బాహ్య పరిస్థితులవల్లనో (యుద్ధం మొదలైనవి) లేదా ఆంతరంగిక సమస్యల వల్లనో (అంతర్యుద్ధం మొ. వి) పడిపోతే ప్రభుత్వమే లేని పరిస్థితి ఏర్పడుతుంది. సమాఖ్యలో ఎన్నో స్థాయుల్లో ప్రభుత్వాలుండటంవల్ల ఇలాంటి ప్రమాదం ఉండదు. ఎన్నో దుర్గాల్ని జయించడం కంటే ఒక దుర్గాన్ని పడగొట్టటం సులభంకదా!

21.3.4 ఆచరణలో ఏకకేంద్ర రాజ్యం

ఏక కేంద్ర రాజ్యంలో అధికారాలన్నీ కేంద్రీకృతమై ఉన్నప్పటికీ పాలనా సౌలభ్యం కోసం వివిధ స్థాయుల్లో శాసననిర్మాణాధికారాలు, పాలనాధికారాలున్న వివిధ సంస్థలు పనిచేస్తూ ఉండవచ్చు. కానీ ఇవి సమున్నతాధికారమున్న వ్యవస్థలు కావు; కేంద్ర ప్రభుత్వ శాసనాలకు లోబడి మాత్రమే ఈ

వ్యవస్థలు, సంస్థలు తమ అధికారాలు నిర్వహించవలసి ఉంటుంది. వీటిని స్థానిక ప్రభుత్వాలని (local government) పేర్కొంటారు. కొన్ని ఏకకేంద్ర రాజ్యాలలో ఈ స్థానిక ప్రభుత్వాలకు చాలా అధికారాలు ఉండి కేంద్ర ప్రభుత్వంతో పనిలేకుండా స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉన్నాయా అనేంత స్వతంత్రంగా పనిచేస్తుంటాయి. కాని నిజానికి వీటికి స్వతంత్ర ప్రతిపత్తి ఉండదు. ఇవి కేవలం కేంద్ర ప్రభుత్వ శాసనాలకు లోబడే పనిచేస్తాయి. ఇందుకు మంచి ఉదాహరణ బ్రిటన్.

పేజ్, గోల్డ్‌స్మిత్ అనే రాజనీతి శాస్త్రజ్ఞులు ఐరోపాలోని ఏడు ఏకకేంద్ర రాజ్యాలను అధ్యయనం చేసి కేంద్ర- స్థానిక ప్రభుత్వాల సంబంధాలకు సంబంధించి ఉత్తర ఐరోపాలోని ఏకకేంద్ర రాజ్యాలైన నార్వే, డెన్మార్క్, స్వీడన్, బ్రిటన్‌లలో స్థానిక సంస్థలు ఎన్నో అధికారాలుండి బలంగా ఉన్నాయని, కేంద్ర స్థానిక సంస్థల మధ్య అధికారాల విభజన స్పష్టంగా ఉందని పేర్కొన్నారు. కానీ దక్షిణ ఐరోపాలోని ఏకకేంద్ర రాజ్యాలలో ముఖ్యంగా ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్‌లలో స్థానిక సంస్థలకు ప్రజాధనాన్ని ఎక్కువగా ఖర్చుచేసే అధికారాలు లేవని కనుక్కొన్నారు. ఈ దేశాల్లో కేంద్ర - స్థానిక వ్యవస్థల మధ్య అధికారాల విభజన కూడా స్పష్టంగా లేదు. కేంద్ర నియంత్రణా పద్ధతులు, వాటి రూపాల్లో కూడా ఈ దేశాలు భిన్నత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఉత్తర ఐరోపా దేశాల్లో స్థానిక సంస్థలకు శాసనపరంగా నిర్దిష్టమైన అధికారాలున్నాయి. కానీ దక్షిణ ఐరోపా దేశాల్లో అలాలేకపోగా కేంద్రప్రభుత్వాల పాలనా పరమైన నియంత్రణలకు లోబడి మాత్రమే స్థానిక సంస్థలు పనిచేస్తున్నాయి. ఉత్తర ఐరోపాదేశాల్లోని స్థానిక సంస్థలు కేంద్ర ప్రభుత్వంచేసే విధాన నిర్ణయాలపై ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. దక్షిణ ఐరోపాలో ఈ పరిస్థితి లేదు.

పేజ్, గోల్డ్‌స్మిత్‌లు ఉత్తర, దక్షిణ ఐరోపాల్లోని ఈ తేడాలకు కారణాలు కూడా పేర్కొన్నారు. ఉత్తర ఐరోపాలో సోషల్ డెమోక్రాటిక్ రాజ్యభావన సంక్షేమ రాజ్యాల స్థాపనకు ప్రాధాన్యత నివ్వటం వల్ల స్థానిక సంస్థల ప్రాబల్యం, అధికారాలు ఎక్కువ అని, దక్షిణ ఐరోపాలో గతంలో నెపోలియన్ ప్రవేశపెట్టిన పాలనా వ్యవస్థ ప్రాంతీయ స్థానిక పాలనను కూడా కేంద్ర ప్రభుత్వ బాధ్యతగా చేసిన సంప్రదాయం ఇంకా ఈ దేశాల్లో కొనసాగటమేనని పేర్కొన్నారు. స్థానిక సంస్థల తులనాత్మక రాజకీయ విశ్లేషణలో పేజ్, గోల్డ్‌స్మిత్‌లు చేసిన అధ్యయనాలు చాలా ముఖ్యమైనవిగా పేర్కొనడం జరుగుతోంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రస్తుతం సామాజిక నిర్మితి, ఆర్థిక విషయాల్లో వస్తున్న పరిణామాలు, ప్రవేశ పెడుతున్న సంస్కరణలు కేంద్రీకరణకే దారి తీస్తున్నాయి.

21.4.0 సమాఖ్య రాజ్యం

'సమాఖ్యవాదం' (Federalism) అనేక రాజకీయ సామాజిక భావనలపై సమాఖ్య రాజ్యవ్యవస్థలు ఆధారపడి ఉన్నాయి. సమాఖ్య వాదం ఒక భావనగా అవతరించింది బైబిల్ కాలం నాటి పురాతన ప్రపంచంలోనేనని పేర్కొంటారు. సైనికావసరాలో, లేదా ఆర్థికావసరాలు తీర్చుకునేందుకు రాజ్యాలు సంధి షరతుల ద్వారా వివిధ రకాల సమస్యలు ఏర్పడటం, మనగలగటం పురాతన గ్రీకు నాగరకత కాలంలోనే చూస్తాం. ఆధునిక కాలంలో సమాఖ్య రాజ్యవ్యవస్థ 1787లో ఏర్పడిన అమెరికా రాజ్యాంగంతోనూ, దాని ననుసరించి ఏర్పడిన స్విస్, కెనడా, ఆస్ట్రేలియా రాజ్యాంగాలతోనూ ఎక్కువ ప్రాచుర్యం పొందింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం వివిధ జాతి నిర్మాణ కార్యకలాపాలలో

భాగంగా ఐరోపాలోనూ, వలసలుగా విముక్తి చెందిన ఆసియా, ఆఫ్రికా, మధ్యప్రాచ్యం, వెస్ట్‌ఇండీస్ దేశాల్లోనూ సమాఖ్య రాజ్య సిద్ధాంత ప్రయోగం జరిగింది.

వివిధ రకాల వైవిధ్యాలున్న ప్రజానీకాన్ని ఏకంచేసి అందరికీ వర్తించే ఒక వ్యవస్థీకృత యంత్రాంగం ఉండటమే సమాఖ్యలోని కేంద్రాంశం. అలాంటి ఏర్పాటుతో విడివిడిగా ఉండే కొన్ని రాజ్యవ్యవస్థలు - వీటినే రాష్ట్రాలు లేదా ప్రాంతాలుగా తరచూ పేర్కొంటుంటాం - ప్రత్యేకావసరాలు లేదా కొన్ని పరిమితావసరాలు నెరవేర్చుకునేందుకు తమ సమగ్రతకు, స్వయంప్రతిపత్తికి నష్టం వాటిల్లని రీతిలో ఒకే పాలనా వ్యవస్థ కిందకు చేరతాయి. రెండు స్థాయుల్లో అధికారాలు, భాద్యతలు పంపకం చేయటం ద్వారా ఇది సాధ్యమౌతుంది. రెండు స్థాయుల్లోని ప్రభుత్వాలు శాసనాలు చేయవచ్చు. పన్నులు విధించవచ్చు. కేంద్ర ప్రాంతీయ ప్రభుత్వాల మధ్య అధికారాల, విధుల పంపిణీ, వివాదాల పరిష్కారాలు సాధారణంగా రాజ్యాంగ నియమావళి ననుసరించి జరుగుతాయి.

సమాఖ్య ప్రభుత్వాలున్న దేశాలన్నింటిలోనూ కేంద్ర-ప్రాంతీయ ప్రభుత్వాల మధ్య సహకారం అవసరమనే భావం ప్రస్ఫుటంగా ఉంటుంది. ఇది లేకుండా సమాఖ్య రాజ్యవ్యవస్థ మనుగడ కష్టమౌతుంది. అందుకే రాజనీతి శాస్త్రజ్ఞులు సమాఖ్య సిద్ధాంతంపై కాక అది పనిచేసే తీరుపై ఎక్కువగా తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నారు.

కేంద్ర - ప్రాంతీయ స్థాయుల మధ్యగల సంబంధాలెలాంటివి, అధికారాలు విధుల పంపిణీ ఎలా ఉంది, వివాదాల పరిష్కారం ఎలా జరుగుతున్నది, జాతీయావసరాలు నెరవేరటంలో ఈ రెండు స్థాయులు ఎలా పనిచేయవలసి ఉంటుంది అనే ప్రశ్నలు రాజనీతి శాస్త్రజ్ఞుల దృష్టిలో ప్రస్తుతం ముఖ్యమైన అంశాలుగా ఉన్నాయి.

21.4.1 సమాఖ్య భావనలోని సిద్ధాంతపరమైన ఇబ్బందులు

సమాఖ్య వ్యవస్థలను గురించిన చర్చల్లో నిర్వచనాలకు సంబంధించిన సమస్య తలెత్తుతుంది. 'ఫెడరలిజం', 'ఫెడరల్', 'ఫెడరేషన్' అనే పదాలను నిర్వచించటంలో ఇబ్బందులున్నాయి.

విస్తృతమైన అర్థంలో 'సమాఖ్యవాదం (Federalism) అంటే తమ అస్థిత్వాన్ని త్యాగం చేయనవసరం లేకుండా, పరస్పర అంగీకారం ద్వారా ప్రజలను, వ్యవస్థలను సంధానం చేయటంగా చెప్పుకోచ్చు." పదిహేడవ శతాబ్దపు బ్రిటన్‌లో క్రైస్తవ సమాఖ్య మతాచార్యులు 'సమాఖ్య' (Federal) అనే పదాన్ని రూపొందించారనీ, ఇది దైవాన్ని, మానవ మాత్రులను సంధానంచేసే పవిత్రమైన బంధీకృత ఒప్పందాలను సూచించే మాట అని బెబుతారు.

'ఫెడరల్' అనే మాటలాంటి లాటిన్‌భాషలోని 'ఫోడస్' (Foedus) అనే ధాతువునుంచి పుట్టింది. దీని అర్థం 'ఒప్పందం' (Covenant). పందొమ్మిదో శతాబ్దపు సామాజిక శాస్త్రవేత్తలు ఈ మాటను గ్రహించి సామాజిక ఒడంబడికకు సంబంధించిన ఎన్నో భావాలను అభివృద్ధి చేశారు. ఐతే రాజకీయాంశంగా ఈ మాటకు పరిమితార్థం మాత్రమే ఉంది.

సమాఖ్య వివిధ రాజకీయ, సామాజిక అవసరాలు నెరవేర్చుకునేందుకు సాధనంగా కూడా భావించబడింది. ఇందులో రెండు అవసరాలు ముఖ్యమైనవి. మొదటిది. అప్పటికే జాతీయతవల్ల ఒకటై ఉన్న ప్రజలను రాజకీయంగా ఏకం చేయవలసిన అవసరం. సమాఖ్య ఇందుకు సాధనంగా ఉపయోగపడుతుంది. విడివిడిగా ఉండే రాజకీయ విభాగాలను (Political Units) ఇది సంధానం చేసి పరిపూర్ణ జాతిని రూపొందిస్తుంది.

అమెరికన్ దృక్పథం ఇదే. దీనికి ప్రతిగా రెండో అభిప్రాయంలో సమాఖ్య అంటే భిన్నత్వం ప్రదర్శించే ప్రజానీకాన్ని తమ తమ ప్రభుత్వాలతో తమకున్న ప్రాథమిక సంబంధాలను విచ్ఛిన్న పరచకుండా, కొన్ని ముఖ్యమైన అవసరాలు తీర్చుకోవటం కోసం సంధానం చేసే సాధనం. ఈ అర్థంలో సమాఖ్య చాలా పరిమితమైన పరిధి, అధికారాలు గల సమ్మేళనాన్ని (Confederation) మాత్రమే సూచిస్తుంది. 'సమాఖ్య', 'సమ్మేళనం' అనే మాటలను తరచుగా పర్యాయ పదాలుగా వాడుతుంటాం. కాబట్టి కొంత అయోమయ పరిస్థితి ఏర్పడింది. సమ్మేళనమనే మాటను ఇప్పటికీ వాడుతూనే ఉన్నాం. ఐరోపా ఆర్థిక వ్యవస్థ (EEC), ఉత్తర అట్లాంటిక్ సంధి వ్యవస్థ (NATO) ఇంకా ASEAN, SAARC లాంటివి దీనికి ఉదాహరణలుగా పేర్కొవచ్చు.

సమాఖ్య వ్యవస్థలు ఇతర రాజకీయ వ్యవస్థలకు భిన్నంగా ఉంటాయి. ఐనప్పటికీ రాజనీతి శాస్త్ర చర్చల్లో సమాఖ్య అనే మాటను చాలా సాధారణమైన అర్థంలో ప్రయోగిస్తుంటారు. నిజానికి "ఫెడరల్" అనే విశేషణాన్ని సమాఖ్య రాజ్యంగాన్ని సూచించటానికో లేదా సమాఖ్య ప్రభుత్వాన్ని సూచించటానికో ఉపయోగించాలి. కానీ లాస్కీ, లివింగ్‌స్టన్ వంటి రాజనీతి శాస్త్రజ్ఞులు 'సమాఖ్య సమాజాలను' (Federal Socities), సమాఖ్య భావజాలాలను (Federal ideologies) గురించి కూడా పేర్కొన్నారు. లివింగ్‌స్టన్ సమాఖ్యను సమాజంగా భావిస్తూ ఇలా అన్నాడు.

"... a device by which the federal qualities of the society are articulated and presented ... If (the diversities) are grouped territorially, i.e geographically, then the result may be a society that is federal. If they are not grouped territorially then the society cannot be said to be federal."

(Livingston, W.S. Federalism and Constitutional change)

సమాఖ్య వాదం (Federalism) సమాఖ్య వ్యవస్థ ఒకటికాదు. సమాఖ్య వ్యవస్థలో అంతర ప్రభుత్వ సంబంధాలు (Inter-governamental Relations) ప్రాధాన్యం వహిస్తే, సమాఖ్య వాదానికి ఇంతకన్నా విస్తృతమైన పరిధి ఉంది. ఇది సమాఖ్య సిద్ధాంత సూత్రాలకు అవి అమలుజరిగే తీరుకు, విస్తారమైన రాజకీయ జీవనానికి కూడా వర్తిస్తుంది.

21.4.2 సమాఖ్య వ్యవస్థ ముఖ్య లక్షణాలు

లాంఛన బద్ధ రాజ్యాంగాల ననుసరించి అధికార విభజన జరిగిన తీరు, పనిచేసే తీరు, సమాఖ్య సూత్రాల్లో వేటిని అనుసరిస్తున్నాయి అనే అంశాలపై ఆధారపడి సమాఖ్య రాజ్యాలు విభిన్నమైన వ్యవస్థలుగా గోచరిస్తున్నాయి. ఐనప్పటికీ సమాఖ్యలను అధ్యయనం చేసే రాజనీతి శాస్త్రజ్ఞులు, పరిశో

ధకులు సమాఖ్యకున్న ముఖ్య లక్షణాలను గుర్తించవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. సమాఖ్యకు ఉండవలసిన ముఖ్య లక్షణాలేవో వివరించారు.

ద్వంద్వ సార్వభౌమాధికారానికి (Dual Sovereignity) ప్రాధాన్యమిస్తూ వాట్స్ "కేంద్ర ప్రభుత్వమూ ప్రాంతీయ ప్రభుత్వాలూ తమ పరిధిలో తాము వేరువేరుగా స్వతంత్రంగా ఉంటూ పక్కపక్కనే ఉంటూ పనిచేయటమే సమాఖ్య" అన్నాడు. ఈ రెండు స్థాయుల మధ్య స్పష్టమైన రాజ్యాంగపరమైన అవసరాలు అధికారాల, విధుల విభజన ఉండి తమ తమ పరిధిలో స్వాతంత్ర్యం ఉండాలి. సాధారణంగా అధికారాలు - విధుల విభజన లిఖిత రాజ్యాంగ రూపంలో ఉంటుంది. ఈ విభజనవల్ల వచ్చే వివాదాలు పరిష్కారానికి, వాటి స్వతంత్రను కాపాడటానికి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయశాఖ ఉండాలి.

1950 దశకంలోనే కె.సి. వేర్ సమాఖ్య వ్యవస్థ అంటే ఏమిటో సుదీర్ఘంగానే చర్చించాడు. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఆసియా, ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం ఇంకా ఇతర కామన్‌వెల్త్ దేశాలలో ఏర్పడ్డ సమాఖ్య వ్యవస్థలపై ఈయన భావాల ప్రభావం అపారం. ఈయన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార విభజన సమాఖ్యకు కేంద్రాంశంగా పరిగణించాడు. ఈ రెండు సమాఖ్యకు కేంద్రాంశంగా పరిగణించాడు. ఈ రెండు ప్రభుత్వాలు రాజ్యాంగం నిర్దేశించిన తమ తమ పరిధుల్లో స్వతంత్రతను, స్వయంప్రతిపత్తిని కలిగి ఉంటాయి. ఆయనే పేర్కొన్నట్లు

"By the federal principle I mean the method of dividing powers so that the general and regional governments are each, within a sphere, coordinate and independent"
(K.C. Whare, Federal Government, OUP, London, 1946. P. 11)

కానీ అమెరికా, ఆస్ట్రేలియాలలో వేర్ చెప్పినట్లుకాక కేంద్రశాసనాలు రాష్ట్ర ప్రభుత్వాలను తోసిరాజంటున్నాయి. ఈ దేశాలలో రాష్ట్ర ప్రభుత్వాలకు స్వతంత్ర ప్రతిపత్తి లేదు. ఏ దేశంలోను వేర్ చెప్పినట్లు రాష్ట్ర, ప్రాంతీయ ప్రభుత్వాలకు స్వయంప్రతిపత్తి లేదు.

కె.సి. వేర్ చెప్పిన పది సంవత్సరాల తరవాత మెక్‌మహన్ "ఫెడరలిజం : మెచ్యూర్ అండ్ ఎమర్జెంట్" అనే తన గ్రంధంలో సమాఖ్య ముఖ్య లక్షణాలను కింది విధంగా పేర్కొన్నాడు.

(a) కేంద్ర-ప్రాంతీయ ప్రభుత్వాల మధ్య ఉన్న అధికారాల విభజనను సాధారణ ప్రక్రియ ద్వారా కేంద్ర ప్రభుత్వం మార్చటానికి వీలులేని ఏర్పాటున్న ప్రభుత్వ రాజకీయ వ్యవస్థ సమాఖ్య.

(b) రెండు స్థాయులకూ చెందిన అధికారాలు వాస్తవమైన అధికారాలే కావాలిగాని పనలేనివి కాకూడదు.

(c) కేంద్రప్రభుత్వం కొంతమేరకు - ముఖ్యంగా ఎన్నికల ద్వారా అధికారం పొందేందుకు, పన్నులు విధించి రాబట్టుకునేందుకు, తన ఆధిపత్యానికి లోబడి ఉంచేందుకు దేశంలోని మొత్తం ప్రజానీకంతో సంబంధం కలిగి ఉండవచ్చు.

(d) తమ ప్రభుత్వ రూపాలను, పాలనా ప్రక్రియలను రూపొందించుకునేందుకు, మార్చుకునేందుకు ప్రాంతీయ ప్రభుత్వాలకు చెప్పుకోదగ్గ అవకాశం ఉంటుంది.

(e) సమాఖ్యలోని ప్రాంతాలు లేదా రాష్ట్రాలు జనాభా, భూభాగం, సంపద మొదలైన విషయాలలో భిన్నత్వం ఉన్నప్పటికీ వాటికి సమానస్థాయి ఉంటుంది.

డేనియల్ జె. ఎలిజారే లిఖిత రాజ్యాంగం అధికార వికేంద్రీకరణ, అధికార విభజన, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం, వికేంద్రీకరణను అమలు చేసేందుకు అవసరమైన యంత్రాంగం, సమాఖ్య సిద్ధాంత సూత్రాలు, సమాఖ్య రాజ్య, ప్రభుత్వ ముఖ్య లక్షణాలుగా పేర్కొన్నాడు. అయన ఉద్దేశంలో సమాఖ్య రాజ్యశక్తి, సామర్థ్యం కేంద్ర ప్రభుత్వ వ్యవస్థ నుంచి జనించదు. అది జాతి మొత్తంలో నిక్షిప్తమై ఉండేశక్తి, కేంద్ర, ప్రాంతీయ ప్రభుత్వాలకు అధికారాలను ఈ శక్తే నియోజిత (Delegate) పరుస్తుంది. కాబట్టి ఈ ప్రభుత్వాల కున్న అధికారాలు నియోజిత అధికారాలు మాత్రమే. రెండు స్థాయుల్లోని ప్రభుత్వాలు జాతీయ రాజ్యాంగం నుంచి ఆవిర్భవించి, దానికి లోబడి పనిచేస్తాయి.

21.4.3 సమాఖ్యవాదం - సమాఖ్య వ్యవస్థలు

'ఫెడరల్' అనే మాట పుట్టటానికి ఎన్నోతరాల ముందు నుంచే సమాఖ్య లక్షణాలను పుణికి పుచ్చుకున్న ఎన్నో రాజకీయ వ్యవస్థలు అభివృద్ధి చెందాయి. ప్రాచీన గ్రీకు నాగరకతా కాలంలో నగర రాజ్యాలు, ఆటవిక తెగలు, మత వ్యవస్థలు సమాఖ్య లక్షణాలను ప్రదర్శించాయి. క్రీ. పూ. 251 - 146 మధ్య కాలంలో పురాతన గ్రీసులో ఏర్పడ్డ "ఎటియన్ లీగ్" అలాంటిదే. సమాఖ్యలను అధ్యయనం చేసే ఆధునిక రాజనీతిజ్ఞుల ఉద్దేశంలో ఇది మానవ నాగరికత మొదలైన రోజుల్లో సమాఖ్య రాజ్య లక్షణాలను ప్రస్ఫుటించిన మొదటి వ్యవస్థ. దీని తరవాత గ్రీన్, రోమన్ రాజ్యాలలో ఎన్నో సమాఖ్యలు ఏర్పడ్డ దాఖలాలు కనిపిస్తాయి. మధ్యయుగపు యూరపులోను ఇలాంటి వ్యవస్థల ఉనికి - ముఖ్యంగా ఇటలీ, స్పెయిన్‌లలో - కనిపిస్తుంది. 16వ శతాబ్దంలో నెదర్‌లాండ్స్ యునైటెడ్ ప్రావిన్స్, అటు తరవాత స్విట్జర్లాండ్‌లో అదే కాలంలో కాంటన్‌లతో కూడి ఏర్పడిన స్విస్ కాన్ఫెడరేషన్ అలాంటివే. 17వ శతాబ్దంలో జాతి రాజ్యాల ఆవిర్భావంతో సమాఖ్య వాదం ప్రాచుర్యంలోకి వచ్చింది. భిన్న సంస్కృతులు కలిగిన ప్రజానీకాన్ని జాతి రాజ్యంగా ఏర్పాటు చేయటానికి 'సమాఖ్య వాదం' ఎంతో దోహదపడింది.

ఈ చారిత్రకానుభవాన్నంతా వినియోగించుకునే ఆధునిక కాలంలో విప్లవానంతర అమెరికాలో క్రీ.శ. 1787 లో ఏర్పడిందే మొట్టమొదటి ఆధునిక సమాఖ్య. స్వతంత్ర రాజ్యాంగాన్ని రూపొందించే క్రమంలో, ఇంకా 'ది ఫెడరలిస్ట్' (The Federalist) ప్రతిపాదనల ఆధారంగా అమెరికాలో సమాఖ్య వ్యవస్థకు సంబంధించిన ఒక సైద్ధాంతిక ప్రాతిపదిక రూపొందింది. దీని ఫలితంగా సమాఖ్య (కేంద్ర) ప్రభుత్వం శక్తిమంతంగా ఉండాలని వాదించేవారికి, రాష్ట్ర ప్రభుత్వాలే శక్తిమంతంగా ఉండాలని వాదించేవారికి మధ్యేమార్గంగా రాజకీయ వ్యవస్థను రూపొందించేందుకు రాజీ కుదిరింది. దీని ఫలితంగా అమెరికాలో అమల్లోకి వచ్చిన సమాఖ్య వ్యవస్థ ఆధునిక కాలంలోని మొట్టమొదటి సమాఖ్య రాజ్యవ్యవస్థ. డేవిస్ తన లక్షణాలను గురించి ప్రిన్సిపుల్ లో అమెరికా సమాఖ్య

"... the business of the state is divided betwee two popularly elected governments, a national government embracing the whole territory of the nation and a regional government for each of the lesser territories, that each government will possess the basis facilities to make, manage and enforce, its laws like any ordinary government, that subject to the provisions of the Constitution, each government is free to act independently of, or in Concert with, the other, as it chooses, that juridictional disputes between the national government and the governments of the lesser territories will be settled by judicial arbitration, that the principle of national supremacy will prevail where two varied actions, national and regional, are in conflict, that the instruments of national government, but not necessarily the lesser territories, are set forth in a written constitution that the national legislature is a bicameral system in which one house, the 'first branch', is composed according to the size of the population in each territory, while each territory has equal representation in the second branch lastly, that the constitution is fundamental law, changeable only by a special plebiscitary process."

అమెరికా సమాఖ్య రెండు శతాబ్దాల కాలంపాటు ప్రపంచంలో సమాఖ్య తత్వాన్ని విపరీతంగా ప్రభావితం చేసింది. అటు తరవాత ఏర్పడిన సమాఖ్యలకు మూల సూత్రాలను ప్రతిపాదించింది. అమెరికా సమాఖ్యే అది ప్రపంచంలోని ఇతర సమాఖ్యలకు సమూనాగా తయారైంది. కెనడా, ఆస్ట్రేలియాల్లో ఏర్పడ్డ సమాఖ్య రాజ్యవ్యవస్థలకు నమూనా ఇదే. కె.సి. వేర్ దీన్ని గురించి మాట్లాడుతూ "అమెరికా ఒక విశ్వజనీనమైన సమాఖ్యకు నమూనాగా పరిగణించ బడుతోంది. సమాఖ్య సూత్రాలకు, సిద్ధాంతాలకు మూలమై సమాఖ్య నిర్వచనానికే మూలమైంది." అన్నాడు. మనం ఇప్పుడు సమాఖ్య ప్రభుత్వం అని దేన్నైతే పిలుస్తున్నామో అది 1787 లో అమెరికా రాజ్యాంగ నిర్మాతలు సృష్టించిందేనని వేవర్ అన్నాడు. కెనడా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియాలేకాక లాటిన్ అమెరికా, అర్జెంటీనా, బ్రెజిల్, మెక్సికో, కొలంబియా, వెనిజులా లాంటి దేశాలు ఎన్నో సమాఖ్యలుగా రూపొందాయి. బ్రిటన్ తన వలసల్లో సమాఖ్యను ప్రయోగాలుచేసింది. వాటిలో ఇప్పటికీ చాలా దేశాలు సమాఖ్య రాజ్యాలుగానే ఉన్నాయి. మలేసియా, నైజీరియా, ఇండియా, పాకిస్థాన్ ఇందుకు మంచి ఉదాహరణలు.

ఆధునిక కాలంలో సమాఖ్య రాజ్యాలు విజయవంతంగా మనుగడ సాగించటం చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. లాస్కీ వంటి రాజనీతిజ్ఞులు దాని మనుగడను గురించి అనుమానాలు వెలిబుచ్చారు. కానీ కెనడా, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, ఇండియా లాంటి దేశాల్లో సమాఖ్య వ్యవస్థ విజయవంతంగానే నడుస్తున్నది.

సమాఖ్య ప్రభుత్వ వ్యవస్థలు ఎన్నో వ్యవస్థాపరమైన సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కానీ ఈ వ్యవస్థలు అధికార వికేంద్రీకరణ సూత్రంవల్ల ఎక్కువ ప్రజాస్వామ్య గుణాలను ప్రదర్శించటమేగాక నిర్వహణ కూడా తేలికౌతుందని జాక్సన్, చాండ్లర్ వంటి రాజనీతి శాస్త్రజ్ఞులు వేర్కొన్నారు.

21.4.4 సమాఖ్యల్లో కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

ఆదిలో ఏర్పడ్డ సమాఖ్యల్లో - ముఖ్యంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ వాటి వాటి పరిధిలో స్వతంత్రంగా పని చేస్తాయి. ఈ పరిస్థితి చాలాకాలం వరకు ఉన్నప్పటికీ అటు తరవాత సమస్యలేర్పడ్డాయి. అమెరికాలో సమాఖ్య ఏర్పడిన మొదటి దశలో వివిధ స్థాయుల్లో ఏర్పడ్డ ప్రభుత్వ వ్యవస్థల మధ్య ప్రణాళికలు, ఆర్థిక వనరులు ఇంకా అనేక ఇతర పాలనా వ్యవహారాలకు సంబంధించి ఎంతో సహకారం ఉండేదని ఎలిజార్ పేర్కొన్నారు. మొదట్లో అలా ఉంటే ఉండేమోకాని ప్రస్తుతం అమెరికా, ఆస్ట్రేలియా, కెనడాలాంటి సమాఖ్యలు సంక్లిష్టమైన పాలనా యంత్రాంగాలు కలిగి బయటనుంచి వచ్చిపడే యుద్ధాలు, ఆర్థికమాంద్యం, సామాజిక న్యాయం చేకూర్చవలసిన అవసరాలు, నేరప్రవృత్తి విపరీతంగా పెరిగిపోవటం, రవాణా - ప్రసార సాధనాలు అభివృద్ధి చెందటం, జాతి విషక్షవంటి ఎన్నో సమస్యల మూలంగా కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాలు పంపకం, నిర్వహణల్లో పోటీ ఏర్పడింది. ఈ సమస్యలు ప్రస్తుతం అన్ని సమాఖ్యల్లోనూ ఉన్నాయి. ప్రస్తుతం సమాఖ్యలు కేంద్రీకృత లక్షణాలను ప్రదర్శిస్తున్నాయి.

సమాఖ్యల్లో రెండు స్థాయుల మధ్య తలెత్తే మరో అంశం ఆర్థిక వనరులకు సంబంధించినది. రెండు స్థాయుల మధ్య ఆర్థిక సంబంధాలు ఎలా ఉండాలనేది సమాఖ్యల్లో ప్రస్తుతం ముఖ్యమైన సమస్యగా ముందుకు వస్తున్నది. ఏ స్థాయి ఎలా తమ ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలని, ఎవరు పన్నులు విధించాలి, వాటిని ఎలా పంచుకోవాలి, ఎవరికెంత చెందాలి, అలా సమకూర్చుకునే వనరులు ఎవరు ఎలా వినియోగించాలి అనేవే ఈ సమస్యలు. వీటిని పరిష్కరించుకునేందుకు సమాఖ్యలు వ్యవస్థాపరంగా ప్రయత్నాలు చేశాయి. ఆస్ట్రేలియాలో 1933 ఏర్పడ్డ కామన్‌వెల్త్ గ్రాంట్స్ కమిషన్, ఇండియాలో ఫైనాన్స్ కమిషన్ ఈ సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పడిన సంస్థలే.

21.4.5 సమాఖ్యల అధ్యయనం

పందొమ్మిదో శతాబ్దం చివరి భాగంలో రాజనీతి శాస్త్రం ఒక ప్రత్యేక అధ్యయన శాస్త్ర విషయంగా రూపొందిన తరవాత సమాఖ్యకు సంబంధించిన ప్రమాణాత్మక సిద్ధాంతాల అధ్యయనానికి (Study of normative theory) చరమ గీతంపాడి, సమాఖ్యలు, అవి పనిచేసే తీరుకు సంబంధించిన అనుభవాత్మక పరిశోధన (empirical research) మొదలైంది. బ్రైస్, డైసీ లాంటి రాజనీతి శాస్త్రవేత్తలు అలాంటి పరిశోధనలు చేశారు. అయినా 1930-40 దశకం వరకు అలాంటి అధ్యయనాలు అభివృద్ధి చెందలేదు. ఈ కాలంలోనే సమాఖ్య ప్రత్యేక లక్షణాలేమిటి? వాటిలో రాజకీయ పక్షాల పాత్ర ఎలాంటిది? కేంద్ర, రాష్ట్ర సంబంధాలెలా ఉన్నాయి? అనే ప్రశ్నలను రాజనీతి శాస్త్రవేత్తలు లేవనెత్తారు. సమాఖ్యకు సంబంధించిన తులనాత్మక రాజనీతి అధ్యయనం మొదలైంది. 1960 ల్లోనే అభివృద్ధి చెందుతున్న దేశాల అభివృద్ధిని తులనాత్మకంగా అధ్యయనం చేయాలనే ఆకాంక్ష రాజనీతి శాస్త్రజ్ఞులను సమాఖ్యల పనితీరు వైపు, అభివృద్ధి సాధనకు సమాఖ్య వ్యవస్థల సామర్థ్యాన్ని గురించి పరిశోధనలు మొదలయ్యాయి. గతరెండు శతాబ్దాలుగా సమాఖ్యను అధ్యయనం చేసేవారు సమాఖ్య పనితీరులో ఉన్న ఎన్నో ప్రత్యేకమైన సమస్యలపై తమ అధ్యయనాలు కొనసాగించారు. వీటిలో మూడింటిని ముఖ్యంగా పేర్కొనాలి. అవి (1) అసలు సమాఖ్య లెందుకు ఏర్పడతాయి? ప్రజలు ఎందుకు

సమాఖ్య లేర్పడాలనుకొంటారు? ఈ ప్రస్నలకు వైమధ్యంగల సమాధానాలెన్నో వస్తాయి. ఒకే రకమైన అంశాలు సమాఖ్య లేర్పడటానికి కారణం కాకపోవచ్చు. ఈ అంశాలను డబ్ల్యూ. హెచ్ రికర్ రాసిన "ఫెడరలిజమ్ : ఆరిజిన్స్, అపరేషన్ అండ్ సిగ్నిఫికెన్స్" అనే గ్రంథంలోనూ, ఆర్. ఎల్. వాట్స్ రాసిన "న్యూఫెడరేషన్స్ : ఎక్సపెరిమెంట్స్ ఇన్ ది కామన్‌వెల్త్" అనే గ్రంథంలోను విపులంగా చర్చించారు.

వీరిద్దరూ తులనాత్మక రాజకీయాధ్యయనంలో నిష్ణాతులు. వీరిలో వాట్స్ ఇండియా, పాకిస్తాన్, మలేషియా, నైజీరియా, రొడీషియా న్యాసాలాండ్, వెస్టిండీసుల్లోని సమాఖ్యాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి సమాఖ్యలు ఏర్పరడటానికి, వాటిలో రకరకాల సమస్యలు తలెత్తడానికి ఎన్నో సామాజిక కారణాలు, ఉద్దేశాలు ఉన్నాయని, ఇవి అన్ని సమాఖ్యలకు సమానంకావనే నిర్ణయానికొచ్చాడు. అయినా కొన్ని కారణాలు అన్నిటికీ సమానంగా వర్తించేవి ఉన్నాగుని వాట్స్ పేర్కొన్నాడు. తన అధ్యయనానికి ముగింపు లో ఇలా పేర్కొన్నాడు.

".... two features stand out in common to all of them. First, There was a geographical distribution, atleast to some degree, of the diversities within each of these societies, with the result tha demands for political automomy were made on a regional basis. Secondly, in each of the recent federations, as in the other ones, there existed at one and the same time powerful, desires to be united for certain purposes, because of community of out look or expectation of common benefits of union, and deprooted derives to be organised under automomous regional governments for others, because of contrasting ways of life or the desire to profect divergent interests. The result in each was a tension between the conflicting demands for territorial integration and for balkanisation."

2. సమాఖ్య వ్యవస్థలు కాలక్రమంలో ఎలాంటి మార్పులకు లోనవుతాయి అనేది రాజనీతి శాస్త్రజ్ఞులు పరిశోధిస్తున్న రెండో సమస్య. అంతర్జాతీయ రాజనీతి శాస్త్ర సంఘపు (International Political Science Association) కంపారిటివ్ ఫెడరలిజం రిసర్చ్ కమిటీ చేపట్టిన అంతర్జాతీయ తులనాత్మక అధ్యయనం ఇలా పేర్కొంది. కొన్ని సమాఖ్యల్లో శాసన నిర్మాణాధికారాల్లో వికేంద్రీకరణ ఉన్నా చాలా సమాఖ్యల్లో కేంద్రీకరణ ధోరణే కనిపిస్తుంది. ఈ మధ్య జరిగిన చాలా అధ్యయనాలు ఈ విషయాన్నే నొక్కి చెబుతున్నాయి. ఏఏ అంశాలు సమగ్రతకు లేదా వికేంద్రీకరణకు దోహదపడుతున్నాయి. సమాఖ్యలు ఏకకేంద్ర రాజ్యాలుగా మారడానికి కేంద్రీకరణ దారి తీస్తుందా అనే అంశాలపై తుది నిర్ణయం చేయటం కష్టమవుతున్నది. కానీ సమాఖ్యలు విపరీతమైన కేంద్రీకరణకు లోనవుతున్నమాట నిజమే. చాలా సమాఖ్యల్లో కేంద్ర ప్రభుత్వం - ముఖ్యంగా ఆర్థిక వ్యవహారాల్లో - చాలా దృఢమైన వ్యవస్థగా రూపొందుతున్నది.

సమాఖ్యలు ఏఏ మార్పులకు ఎలా లోనవుతున్నాయనేది తెలుసుకోవాలంటే అది ఏర్పడిన పద్ధతిని తెలుసుకోవాల్సి ఉంటుందని లివింగ్‌స్టన్ ప్రతిసమాజం లేదా జాతి సమీకృత జీవనం గడిపేందుకు ప్రత్యేకమైన చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయాంశాలన్నింటి ఎన్నో కారణమవుతాయని,

ప్రతి సమాఖ్య భౌగోళికంగా ఎన్నో భిన్నమైన ప్రజా సమూహాలతో కూడి ఉండి వీరంతా తమతమ ప్రత్యేకతలు నిలుపుకొని కాపాడుకోవాలనే ఆకాంక్షను ప్రదర్శిస్తూనే కలిసి జీవించాలనే కోర్కెతో ముందుకు వస్తే వాళ్ళంతా భౌగోళికంగా ఒకే భూభాగానికి చెందినవారైతే ఏర్పడేదే సమాఖ్య అనీ అలా ఏర్పడకపోతే అది సమాఖ్య కాదని వేర్కొన్నాడు. ఆయన ఉద్దేశంలో సమాఖ్య లక్షణాలు ఇవే. ఒక దేశం సమాఖ్యగా మనగలుగుతున్నదా లేదా అనేది ఈ అంశాలుపైనే ఆధారపడి ఉంటుంది.

సమాఖ్యను ఒక వ్యవస్థగా కాక ఒక ప్రక్రియగా భావించిన రాజనీతి శాస్త్రవేత్తలూ ఉన్నారు. కానీ ఈ అధ్యయన పద్ధతిలో చాలా గందరగోళముంది. వీరు నిర్మితికి, ప్రక్రియకు ఉన్న సంబంధాన్ని సరిగా అర్థంచేసుకోలేక పోయారు.

ప్రస్తుతం సమాఖ్య వ్యవస్థల్లో గుణాత్మకమైన మార్పులు ఆశించటం రాజ్యాంగ సవరణ ద్వారా కాక రెండు స్థాయిల ప్రభుత్వాల మధ్య సహకార దృక్పథం గల ఒడంబడికల ద్వారా సాధ్యమని భావిస్తున్నారు. అమెరికాలోనూ కెనడాలోనూ సమాఖ్య ప్రభుత్వాలు ఈ వైఖరినే అవలంబిస్తున్నాయి. సహకారం, భాగస్వామ్యం, బాధ్యతలను పంచుకొనే ధోరణి సమాఖ్య మనుగడకు, సమాఖ్యలో ఆరోగ్యకరమైన, అవసరమైన మార్పులకు దోహదపడే అంశాలుగా రాజనీతి శాస్త్రవేత్తలు గుర్తించారు.

21.4.6 సమాఖ్య - సిద్ధాంతమూ, ఆచరణ

'సమాఖ్యవాదం' (federalism) అనేది పశ్చిమ దేశాల చరిత్రలో ద్యోతకమయ్యే కొన్ని రాజనీతిసూత్రాల, విలువల సమూహారం. కానీ 19వ శతాబ్దం వరకూ ఇది ఆచరణలో కమిపించలేదు. గత రెండు శతాబ్దాలుగా వీటిని రాజకీయ జీవనంలో అమలు పరిచే ప్రయత్నం జరిగింది. కొన్ని ప్రయోగాలు విఫలమైనప్పటికీ చాలా దేశాల్లో సమాఖ్య రాజ్యాలు అభివృద్ధి చెంది విజయవంతంగానే సాగిస్తున్నాయి. ప్రజాభిప్రాయంకూడా దీనికి సానుకూలంగానే ఉంది.

సమాఖ్యల్లో కేంద్రీకరణ లక్షణాలు ప్రస్ఫుటిస్తున్నప్పటికీ ఏ సమాఖ్యకూడా ఇంతవరకు ఏకకేంద్ర రాజ్యంగా రూపొందిన దాఖలాలులేవు. కాకపోగా, కాలం గడిచిన కొద్దీ సమాఖ్య రాజ్యాలు భిన్న సంస్కృతులు, నరవర్గ భిన్నత్వమున్న ప్రజా సమూహాలతోకూడి దృఢమైన రాజ్యాలుగానే స్థిరత్వంతో మనగలుగుతున్నాయి.

సమాఖ్య అన్ని రాజకీయ వ్యవస్థలకు సరిపడేదికాదనీ, రాజ్యాంగ వాదమూ, వికేంద్రీకరణ, ప్రజాస్వామ్య సంస్కృతులకు సముఖత ప్రదర్శించే ఆంగ్లో - అమెరికన్ రాజకీయ జీవనంలోనే ఇది విజయవంతంకాగలదని కొందరు అభిప్రాయ పడ్డారు. కానీ ఇది చర్చనీయాంశమే.

సమాఖ్యల్లో ఎన్నో వివాదాలకు, నిరసన భావనలకు, ఆందోళన కర పరిస్థితులకు అవకాశాలున్నమాట నిజమే. వీటి పరిష్కారానికి మార్గాలు వెతికే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

సంకుచిత భావాలు పెంపొందేందుకు సరి అయిన సామాజిక రాజకీయాభివృద్ధిని క్లిష్టపరిచేందుకు సమాఖ్య వ్యవస్థలు తోడ్పడతాయనే విమర్శలున్నాయి. అలాగే సమాఖ్యలు ఖర్చుతోకూడిన వ్యవస్థలనే

విమర్శ కూడా ఉంది. కానీ ఇవి నిర్ధారించి చెప్పలేని చర్చనీయాంశాలే. కానీ ప్రస్తుతం పనిచేస్తున్న సమాఖ్యలు ఇంకా ఎంతోకాలం కొనసాగే అవకాశాలున్నాయని చెప్పటంలో అతిశయోక్తిలేదు.

-- ఆచార్య బి. వెంకటేశ్వర్లు.

21.5 చదవదగిన పుస్తకాలు

యన్. ఆర్. డేవిస్	: ది ఫెడరల్ ప్రిన్సిపుల్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రెస్, బర్కిలీ, 1978
డి.జి. ఎలిజార్	: "ఫెడరలిజం" ఇన్ డి. యన్. సిల్స్(తో) ఇంటర్నేషనల్ ఎన్సైక్లోపేడియాఆఫ్ సోషల్ సైన్సెస్, మాక్మిలన్, ఫ్రీప్రెస్, న్యూయార్క్, 1968
డబ్ల్యు. యన్. లివింగ్స్టన్	: ఫెడరలిజం అండ్ కాన్స్టిట్యూషనల్ ఛేంజ్, ఆక్స్ఫర్డ్, 1967
డబ్ల్యూ. హెచ్. రికర్	: ఫెడరలిజం ఆరిజన్స్, ఆపరేషన్ అండ్ సిగ్నిఫికెన్స్, లిటిల్ బ్రౌన్ అండ్ కం. బాస్టన్, 1964
ఆర్. ఎల్. వాట్స్	: న్యూఫెడరేషన్స్ ఇన్ దికామన్ వెల్త్, ఆక్స్ఫర్డ్, 1966
కె.సి. వేర్	: ఫెడరల్ గవర్నమెంట్, ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీప్రెస్, లండన్, 1946
ఇ.పేజ్ అండ్ యం. జె. గోల్డ్స్మిత్	: సెంట్రల్ అండ్ లోకల్ గ్వవర్నమెంట్ రిలేషన్స్, సేజ్ పబ్లికేషన్స్, లండన్, 1987

21.5 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. ఏకకేంద్ర రాజ్య లక్షణాలను పేర్కొని దిరోపాలో అది ఎలా ఆచరించబడుతున్నదో వివరించండి.
2. సమాఖ్య భావనలోని సైద్ధాంతిక ఇబ్బందులను పేర్కొని సమాఖ్య లక్షణాలను సోదాహరణంగా వివరించండి.
3. అమెరికా సమాఖ్యను, దాని ప్రాముఖ్యాన్ని గురించి సంక్షిప్తంగా ఒక వ్యాసం రాయండి.
4. సమాఖ్య అధ్యయనంలోని వివిధ ధోరణులేవో వివరించండి.

* * * * *

పాఠ్య ప్రణాళిక
నమూనా పరీక్షా పత్రం

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం

రెండవ సంవత్సరం

పాఠ్యాంశం - 1 తులనాత్మక రాజకీయాలు

ఖండం - I : ప్రవేశిక

భాగం - 1 : తులనాత్మక రాజకీయాల అధ్యయన వికాసం

భాగం - 2 : తులనాత్మక రాజకీయాల అధ్యయన దృక్పథాలు

ఖండం - II : రాజకీయ విశ్లేషణ

భాగం - 3 : రాజకీయ అభివృద్ధి

భాగం - 4 : రాజకీయ సంస్కృతి

భాగం - 5 : వ్యవస్థల విశ్లేషణ

భాగం - 6 : నిర్మితులు, విధుల విశ్లేషణ

భాగం - 7 : రాజకీయ వ్యవస్థ ఆధారాలు

భాగం - 8 : మార్క్సిస్టు విశ్లేషణ

భాగం - 9 : భావ సిద్ధాంతం పాత్ర

ఖండం - III : రాజకీయ వ్యవస్థలు

భాగం - 10 : రాజకీయ పార్టీలు - పార్టీ వ్యవస్థలు

భాగం - 11 : ప్రభావవర్గాలు

భాగం - 12 : రాజకీయ భాగస్వామ్యం

ఖండం - IV : ఉద్యమాలు

భాగం - 13 : రాజ్య స్వభావం, శక్తి, శాసనబద్ధత

భాగం - 14 : స్వాతంత్ర్యం - అధికారం

భాగం - 15 : రాజ్యాంగ బద్ధతావాదం

భాగం - 16 : న్యాయ వ్యవస్థలు

భాగం - 17 : విప్లవాలు

భాగం - 18 : అధీనత భావ సిద్ధాంతాలు

భాగం - 19 : సైన్యం పాత్ర

భాగం - 20 : శాసన వర్గాలు

ఖండం - V : నిర్మితులు

భాగం - 21 : సమాఖ్య ఏక కేంద్ర ప్రభుత్వాలు

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం

రెండవ సంవత్సరం

పాఠ్యాంశం - 1 తులనాత్మక రాజకీయాలు

నమూనా ప్రశ్నా పత్రం

కాలం : 3 గంటలు మార్కులు 100

భాగం - "A"

4 x 15= 60

కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో జవాబులు రాయుము.

1. తులనాత్మక రాజకీయాల అధ్యయన వృద్ధి క్రమాన్ని వివరింపుము?

   లేదా

   తులనాత్మక రాజకీయాలంటే ఏమిటి వివరింపుము?

2. ప్రవర్తనావాదం తులనాత్మక రాజకీయాల అధ్యయనాన్ని ఏ విధంగా ప్రభావపరిచింది?

   లేదా

   తులనాత్మక రాజకీయాల అధ్యయన దృక్పథాలను చర్చించండి.

3. రాజకీయ అభివృద్ధి సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి.

   లేదా

   రాజకీయ సంస్కృతి భావనను వివరిస్తూ దాని లక్షణాలను రాయండి.

4. రాజనీతి శాస్త్ర అధ్యయనాల్లో సాధారణ వ్యవస్థల భావన పాత్రను పరిశీలించండి.

   లేదా

   నిర్మితులు - విధులు విశ్లేషణను సవివరంగా పరిశీలింపుము.

భాగం - "B"

5 x 8= 40

కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా జవాబులు రాయుము.

5. భారతదేశంలో రాజకీయ పార్టీల వ్యవస్థ

   లేదా

   భావ సిద్ధాంతపు అర్థాన్ని వివరించండి.

6. మార్క్సిస్టు రాజ్య భావన తులనాత్మక రాజకీయాలను ఏలా ప్రభావ పరిచింది.

లేదా

రాజకీయ వ్యవస్థ మూలాధారాలను విశ్లేషించండి.

7. వ్యవస్థల విశ్లేషణ

లేదా

డేవిడ్ ఈస్టన్

8. మూడవ ప్రపంచ దేశాలలో రాజకీయ సంస్కృతి

లేదా

సాంప్రదాయ అధ్యయన పద్ధతి

9. శాస్త్రీయ దృక్పథం అనగా ఏమిటి

లేదా

రాజకీయ సమాజ శాస్త్రం